సత్యజిత్ రే
అపూర్వ చిత్ర త్రయానికి
నవలా మాతృక



# అపరాజితుడు

బిభూతిభూషన్ బందోపాధ్యాయ

# అపరాజితుడు

బిభూతిభూషన్ బందోపాధ్యాయ

*తెలుగు అనువాదం :*

**కాత్యాయని**

హైదరాబాద్ బుక్ ట్రస్టు

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 100/- |
| మొదటి ముద్రణ | : | జూన్ 2012 |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006.<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,<br>హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

## ఈ నవలలోని కొన్ని బెంగాలీ పదాలు

| | | |
|---|---|---|
| బాబు | – | వ్యక్తుల పేర్లకు ముందు ఉపయోగించే 'శ్రీ', 'మిస్టర్' వంటి ఒక గౌరవ వాచకం. |
| వకుళ్ | – | తెల్లని రంగులో పూచే చిన్న పువ్వులు |
| బహు, బహురాణి | – | వధువు అనేది ఈ మాటకు అసలైన అర్థం. ఒక కుటుంబంలోని కోడలిని కూడా 'బహూ' అనే అంటారు. ఆమెను మరింత గౌరవంగా 'బహురాణీ' అని సంబోధిస్తారు. |
| బహూదీ | – | అన్నగారి భార్య. మిత్రుడి భార్యను కూడా ఇలాగే పిలవటం పరిపాటి. |
| దాదా/దా | – | అన్నగారిని 'దాదా' అంటారు. దానినే సంక్షిప్తంగా 'దా' అని కూడా పిలుస్తారు. వయసులో పెద్దవారైన మిత్రులను కూడా ఇలా సంబోధిస్తారు. |
| దాదా ఠాకూర్ | – | ఇది కూడా ఒక గౌరవ వాచకమే. సాధారణంగా బ్రాహ్మణుడైన వ్యక్తిని 'ఠాకూర్' అంటారు. |
| దాదూ | – | తాతగారు |
| దీదీ/దీ | – | అక్కయ్య |
| దీదీమా | – | అమ్మమ్మ |
| దుర్గాపూజ | – | బెంగాలీ హిందువులకు అతి ముఖ్యమైన పండుగ. సాధారణంగా అక్టోబర్ నెలలో ఐదురోజులపాటు ఈ వేడుకను జరుపుకుంటారు. |
| ఎక్కా | – | గుర్రబ్బండి |
| జన్మాష్టమి | – | కృష్ణుడి పుట్టినరోజు జరిపే పర్వదినం. |
| జమాయ్ బాబు | – | బావమరిది |
| జెఠీమా | – | పెద్దమ్మ |
| కాల్ – వైశాఖి | – | ఏప్రిల్ – మే మాసాల మధ్యన బెంగాల్ రాష్ట్రంలో వీచే సుడిగాలి. |
| కవిరాజ్ | – | ఆయుర్వేద వైద్యుడు |
| ఖిచురీ | – | బియ్యమూ, పప్పూ కలిపి వండే ఒక వంటకం. |
| ఖోకా/ఖోకీ | – | చిన్న పిల్లవాడిని 'ఖోకా' అనీ, ఆడపిల్లనయితే 'ఖోకీ' అని ముద్దుగా పిలుస్తారు. |

| | | |
|---|---|---|
| మామ/మామిమా | – | తల్లి సోదరుడిని 'మామా' అనీ, అతడి భార్యను 'మామిమా' అనీ అంటారు. |
| మాషీమా | – | తల్లి సోదరిని ఇలా పిలుస్తారు. |
| మిజో | – | కుటుంబంలో రెండవ సంతానాన్ని ముద్దుగా 'మిజో' అంటారు. రెండవ కొడుకును 'మిజో బాబు', అతడి భార్యను 'మిజో బహురాణి' అంటారు. |
| మొషాయ్ | – | వ్యక్తులను బహువచనంతో ('గారూ' వలె) గౌరవంగా పిలవటానికి ఉపయోగపడే పదం. |
| ముఠీ | – | మరమరాలు |
| పిషీ/పిషీమా | – | మేనత్త |
| తేలీ | – | నూనె వర్తకుడు |

# కథలోకి వెళుతున్నారా, ఒక్కనిమిషం!

బిభూతి భూషన్ బందోపాధ్యాయ ప్రసిద్ధ నవల 'పథేర్ పాంచాలి'కి రెండవ భాగమే ఈ 'అపరాజితో' (అపరాజితుడు). ఈ రెండు నవలలనూ కలపి పథేర్ పాంచాలి, అపూర్ సంసార్, అపరాజితో అనే మూడు కళాఖండాలుగా మలిచాడు సత్యజిత్‌రే.

ప్రపంచంపై ముసురుకుంటున్న యుద్ధమేఘాలు, బెంగాల్ కరువు, ఛిన్నాభిన్నమవుతున్న గ్రామీణ వ్యవస్థ, బీటలువారుతున్న భూస్వామ్య సమాజం, పర్యావరణ విధ్వంసం, పల్లెల నుండి పట్నాలకు వలసలు, తెగిపోతున్న మానవ సంబంధాలు – ఈ నేపథ్యంలో బతుకు పోరాటం సాగిస్తూ జీవన మార్మికతనూ, తాత్వికతనూ శోధించే వ్యక్తుల జీవిత చిత్రణ ఈ నవల.

బిభూతి భూషణుడి జీవన దృక్పథానికి అచ్చమైన ప్రతిబింబమే – అపూ. కష్టాలు, కన్నీళ్ళు ముసురుకుంటున్న చీకట్ల నడుమ నుండి ఒక చిరుదీపాన్ని చేతబట్టుకుని జీవిత సాఫల్యానికై నిరంతరాన్వేషణ సాగించటమే బిభూతి భూషణుడి తాత్వికత. అతడి రచనలన్నిటికీ అంతిమ సారాంశం ఇదే.

తాను కోల్పోయిన జీవితానందాన్ని కేవలం జ్ఞాపకాల వలపోతలకు కుదించకుండా కలకత్తా నగర కాలుష్యం నుండి నిశ్చిందిపురానికి, ఇచ్ఛామతీ నదీతీరానికి తన కొడుకు కాజల్‌తో కలిసి పయనమవుతాడు అపూ. ప్రకృతిలోని నిరంతరత్వాన్నీ, జీవన కాంక్షనూ మానవ జీవితంలోనికి అనువదించుకునే అద్భుతమైన కళను కొత్తతరానికి అందించే ప్రక్రియను అపూ ఇలా ప్రారంభించాడు. అక్కడితో నవల పూర్తవుతుంది...పాఠకుల ఆలోచనల వికాసం ప్రారంభమవుతుంది.

అన్ని మానవీయ విలువలనూ చిదిమివేసే కటిక పేదరికంలో, నిరాశలో సైతం అపూ తాను నిటారుగా నిలబడుతూ తన సాన్నిహిత్యంలోకి వచ్చిన వ్యక్తులకు భౌతికంగానో, ఆత్మికంగానో ఆసరాగా నిలిచేందుకు తపిస్తాడు. కాస్తంత వెసులుబాటు దొరికితే అడవితోనూ, ఆకాశంతోనూ మౌనంగా, ధ్యానంగా సంభాషిస్తాడు. దాదాపు ఎనబయ్యేళ్ళ కిందటే... పర్యావరణ విధ్వంసాన్ని చూసి బిభూతి భూషణుడు పడిన ఆందోళననూ, విడిపోతున్న మానవ హృదయాలను కలపటానికి ఆయన పడిన తపననూ ఈ రచన అపురూపంగా నమోదు చేసింది.

అన్ని మానవీయ స్పందనలూ ఎండిపోతున్న ఈవేళ ఈ అపరాజితుడితో, సంభాషించటం ఒక అద్భుతమైన అవకాశం.

–హైదరాబాద్ బుక్ ట్రస్ట్

# 1

మధ్యాహ్నం, భోజనాలవేళ దాటి చాలాసేపయింది. రాయ్ చౌధురిగారి ఇంటి గేటుముందు బిచ్చగాళ్ళ గుంపు మాత్రం ఇంకా అలాగే ఉంది. వాళ్ళందరికీ అన్నం పెట్టించే బాధ్యతను తన ఉద్యోగ ధర్మంగా నిర్వహిస్తాడు వీరూ ముఖారీ. ఐతే, ఈ వీరూకూ, జమేదారు శంభునాధ సింగ్‌కూ ఏదో లాలూచీ ఉందని బిచ్చగాళ్ళకు గట్టి అనుమానం. వీళ్ళిద్దరూ కుట్రపన్ని పేదవాళ్ళ నోటిదగ్గరి కూడు కాజేస్తున్నారని వాళ్ళందరి అభిప్రాయం. ప్రతి ఆదివారమూ ఆ బిచ్చగాళ్ళు వీరూతో పోట్లాటకు దిగటమూ, చివరికి చౌకీదార్లకు ఒళ్ళుమండి మరీ పొగరుబోతు బిచ్చగాళ్ళను బయటికి నెట్టెయ్యటమూ మామూలయి పోయింది. అప్పుడు జమాఖర్చులు రాసే వృద్ధ గుమాస్తానో, పెద్ద గుమాస్తా గారో ఇంట్లోంచి పరిగెత్తుకొచ్చి తగాదాను పరిష్కరిస్తారు. ఈ తతంగమంతా జరగనిదే ఏ ఆదివారమూ అన్నదాన కార్యక్రమం పూర్తికాదని వాళ్ళందరికీ తెలుసు.

ఇక ఇంట్లో పరిస్థితి చూద్దామంటే, వంట మనుషుల్లో ఇద్దరి మధ్యన జగడం సాగుతోంది. ఆఖరికి వాళ్ళలో ఒకావిడ మోక్షదా, తన కంచంనిండా అన్నం పెట్టుకుని అక్కణ్ణించి అదృశ్యమయిపోవటంతో, ఆ కీచులాట అర్థాంతరంగా ముగిసిపోయింది. దీన్నంతటినీ కళ్ళప్పగించి చూస్తూ నిలబడింది సర్వజయ. అక్కడ పనిచేసే వంట మనుషుల్లో చాలామందికన్నా ఆమె వయసులో చిన్నది. వంటగదిలో జరిగే పోట్లాటలకు ఆమె దూరంగా ఉండటానికి ఇదొక కారణం. పల్లెటూరి నుండి వచ్చిన మనిషి కావటంతో ఈ నగర జీవితంలోని అట్టహాసాలకూ, సౌకర్యాలకూ ఆమె అలవాటుపడలేదన్నది మరొక వాస్తవం. ఆమె పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ మోక్షదా మాత్రం మరొక వంటావిడ శోదూ మీద ఏవో చాడీలు చెప్తూనే ఉంటుంది. సర్వజయ ఎప్పుడూ ఎవరి పక్షానా నిలబడకపోగా, తన దగ్గరికొచ్చి ఫిర్యాదులు చేసేవాళ్ళకు సర్దిచెప్పి, చల్లబరచాలనే ప్రయత్నిస్తూ ఉంటుంది. అందుకే ఆమెను అందరూ అభిమానంగానే చూస్తారు. మోక్షదా వెళ్ళిపోయాక సర్వజయ తన కంచంలో అన్నం పెట్టుకుని, తను వాడుకునే చిన్నగదిలోకి నడిచింది. మొదట్లో రెండేళ్ళపాటు ఆమె మరొక గదిలో ఉండేది. ఇప్పుడుంటున్న గదికూడా పాతగదిలాగే ఇరుగ్గానూ, నేలంతా చెమ్మగిల్లినట్టుగానూ ఉండటం నిజమే; కానీ పాతగదిలాగా ఇది పశువుల కొట్టాన్ని ఆనుకుని మాత్రం లేదు, కాస్త నయమే.

సర్వజయ చేతిలో కంచాన్ని కిందపెట్టేలోగానే శోదూ వచ్చింది గదిలోకి.

“నా మీద ఏం చెప్పిందేమిటి ఆ ముఖి?” ఆగ్రహంగా అడిగింది శోదూ. “ఉత్తి పనికిమాలిన ఆడది, పెద్దకోడలు గారికి చెప్పినా ఇంకెవరితో చెప్పుకున్నా నాకేం భయం

లేదని చెప్పు – దాని దిక్కున్నచోట చెప్పుకోమను, నేనుమాత్రం పెద్దకోడలితో మాట్లాడి ఈ ఇంట్లోంచి ఆ ముఖిని వెళ్ళగొట్టిస్తా చూడు. నా మాటంటే మాటే, గుర్తుపెట్టుకో. తొందర్లోనే దాన్ని బయటకు గెంటించకపోతే అడుగు!"

సర్వజయ చిరునవ్వుతో, "ఊరుకో శోదూ పిన్నీ, నువ్వట్లా బాధపడకూడదు. ఆవిడ మాటలు నేనసలు పట్టించుకోనని నువ్వెరగవూ, చెప్పు? ఆవిడ తరహానే అంత. మంచీ చెడూ ఆలోచన లేకుండా మాట్లాడుతూనే ఉంటుంది, ఐనా ఎవరికీ అపకారం చేసే మనిషి కాదులే, ఆ సంగతి నీకూ తెలుసుగా. నేనిక్కడ పనిలో కుదిరిన మూడేళ్ళనుంచీ నిన్ను చూస్తూనే ఉన్నాను కదమ్మా. నువ్వెట్లాంటి మనిషివో నాకు తెలుసు. నీమీద ఎవరొచ్చి చాడీలు చెప్పినా విననుగాక, వినను. అసలాముఖి చెప్పింది కూడా ఏమీ లేదమ్మా, నా మాట నమ్మవూ, నిజం చెప్తున్నా!" అంది.

శోదూ శాంతించింది, "అపూ కనబడడేం? ఇవాళ ఆదివారం కదా, బడి కూడా లేదాయె!" అంటూ చుట్టూ పరికించి చూసింది.

సర్వజయ ఇంకా స్నానం చెయ్యనేలేదు. పొద్దున్నే స్నానం చేద్దామంటే ఎప్పుడూ కుదరదు. వంటింట్లో పనులన్నీ అయేసరికే భోజనాలవేళ దాటిపోతూ ఉంటుంది. కొబ్బరి నూనె సీసా తెచ్చి చిన్న గిన్నెలోకి వంపుతూ శోదూకు జవాబిచ్చింది, "అపూ, వాడి స్నేహితుడింటికి వెళ్ళాడు. సెలవురోజుల్లో పోతుంటాడు వాళ్ళింటికి. ఐనా మా పిల్లాడు బొత్తిగా పిచ్చోడమ్మా – మిట్ట మధ్యాహ్నమనీ, ఎండకు నెత్తిమాడుతోందనీ కూడా తోచదు. అయ్యో, నిలబడే ఉన్నావేం పిన్నీ? కూర్చో."

"లేదులేమ్మా, కూర్చోడానికి రాలేదు" అంది శోదూ. "నిన్ను అన్నం తిననివ్వకుండా చెయ్యడానికి రాలేదుగానీ, నామీద ముఖి ఏం చాడీలు చెప్పిందో ఒకమాట అడుగుదామనొచ్చా. ఎట్లాగూ నీకు వంటింట్లో కనబడుతుందిగా, నాతో పెట్టుకోవద్దన్నానని చెప్పు. దాని బతుకేందో నాకు బాగా తెలుసు. నేనిట్లా నెమ్మదిగా, అర్భకంగా కనబడుతున్నాననుకుంటున్నదేమో, నేను గనక నోరు తెరిచానా... కాస్త దాని వాగుడు తగ్గించుకోమని చెప్పు."

శోదూ వెళ్ళిపోయింది. సర్వజయ జుట్టువిప్పి, నూనె రాసుకుంటోంది. అడుగుల చప్పుడయితే గుమ్మంవైపు చూసిన ఆమె ఒక్కసారిగా కెవ్వుమంది, "అయ్యయ్యో, ఆ మొహం చూడు! ఎండలో బలాదూరు తిరిగి మొహమంతా కందగడ్డయిపోయింది గదరా. ఇట్రారా అపూ... కూర్చో ఇక్కడ, ఎట్లా వేగనురా నీతో?"

అపూ నేరుగా మంచం దగ్గరికి వెళ్ళి, ఓ దిండు లాక్కుని పడుకున్నాడు. కాసేపటి దాకా విసనకర్రతో వేగంగా విసురుకున్నాడు. ఆ తర్వాత వాళ్ళమ్మకేసి చూస్తూ, "నువ్వింకా స్నానం చెయ్యలేదా? రెండు గంటలు దాటింది!" అన్నాడు.

"ఇదుగో వెళ్ళబోతున్నా. ఏమన్నా తింటావట్రా?"

"ఒద్దు" అన్నాడు అపూ, తల అడ్డంగా ఊపుతూ.

"ఏం, ఎందుకొద్దు? ఆకలెయ్యటం లేదూ? జున్నుతో చేసిన కమ్మటి కూర పట్టుకొచ్చా తెలుసా. పొద్దునెప్పుడో కాసింత పప్పూ, పిసరంత వంకాయ కూరా వేసుకుని తిన్నావ్. కడుపులో మాడుతూనే ఉంటుందిలే, రా మరి."

"చూపించు ఏమిటో అది!" అంటూ ఒక్క ఉదుటన లేచాడు అపూ. ఆమె జవాబు కోసం ఆగకుండానే మంచం మీదినుండి ఒక్క దూకుతో సర్వజయ కంచం దగ్గరికి పరిగెత్తి దానిమీది మూత తియ్యబోయాడు.

"ముట్టుకోకురా, ముట్టుకోకు దాన్ని!" అరిచింది సర్వజయ. "రెండు నిమిషాలాగు. నేను స్నానం చేసిరాగానే తిందాం".

పకపకా నవ్వాడు అపూ. "ఎందుకు ముట్టుకోకూడదు? నేనేదో అంటరాని వాణ్ణయినట్టు అరుస్తావేం, నేను బ్రాహ్మడినమ్మా. నువ్వలా కేకలేస్తే ఊరుకోను."

"బ్రాహ్మడివా?" మండిపడింది సర్వజయ. "ఏ పూటయినా కుదురుగా పూజ చేశావట్రా, బ్రాహ్మడు చెయ్యాల్సినవి ఒక్కటన్నా చేస్తున్నావా? బ్రాహ్మడట! సిగ్గులేకపోతే సరి."

కాసేపట్లో స్నానంచేసి తిరిగొచ్చిన సర్వజయ, "నా కంచంలోనే తినేద్దాం రా, మరీ ఆలస్యమయిపోతోంది" అంటూ పిలిచింది అపూను.

"నీ కంచంలోనా? వీల్లేదమ్మా. ఏ బ్రాహ్మడూ ఎంగిలి కంచంలో తినడు" అన్నాడు నవ్వుతూ.

వాడి మాటల్ని పట్టించుకోకుండా అన్నం తింటోంది సర్వజయ. కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత నెమ్మదిగా మొదలెట్టాడు అపూ, "ఒక ఉద్యోగం ఉందని తెలిసిందమ్మా, అంటే స్టేషన్లో పనిచెయ్యాలన్నమాట. ప్లాట్‌ఫాం మీద నిలబడి, రైలు దిగిన వాళ్ళకు వస్తువుల్ని అమ్మాలి. ఐదురూపాయలిచ్చి, తిండి ఖర్చులక్కూడా కాసిని డబ్బులిస్తారు. ఎవరో చెప్పారు దీన్ని గురించి. బడికి వెళ్తూనే ఈ పని కూడా చేసుకోవచ్చు,"

ఏదయినా పని చూసిపెట్టమని అపూ, వాళ్ళనీ వీళ్ళనీ వాకబు చేస్తున్నాడనే సంగతి సర్వజయకు తెలుసు. వాడికంటూ కాస్త సంపాదన ఏర్పడటం మంచిదే. కానీ బతుకుదెరువు కోసం కూలిపని చేస్తానని అపూ చెప్తుంటే వినడం బాధగా ఉందామెకు. వాడింకా పసి పిల్లాడే. ఏ మూలన ఏ ప్రమాదం పొంచి ఉంటుందో తెలీని ఈ మహానగరంలో ఎండనకా వాననకా ప్రతిరోజూ తిరిగి చెయ్యాల్సిన పనిలోకి వాణ్ణి పంపడం ఎట్లా? ఆ ఆలోచనే దుర్భరంగా ఉంది ఆమె మనసుకు.

వెంటనే జవాబివ్వలేక, "ఇట్రారా, ఈ కాస్తా తినేసెయ్. నాకింక చాలు" అంది.

అపూ లేచొచ్చి అన్నం ముందు కూర్చున్నాడు. “ఏమ్మా, ఎలా ఉంటుందంటావ్?” మరోసారి అడిగాడు. “ఐదు రూపాయలంటే మంచి జీతమే కదా? కొన్నాళ్ళయ్యాక జీతం పెంచుతామని కూడా చెప్పారు. మా దోస్తు సతీశ్ లేడూ, వాళ్ళింటి దగ్గర గదులు అద్దెకిస్తారని చెప్పాడమ్మా. ఒక్కో గదికీ నెలకు రెండు రూపాయలట. పైన రేకుల కప్పులతో, చిన్న గదులుంటాయని చెప్పాడు. ఎలాగో సర్దుకోగలం కదమ్మా? ఇక్కడ దినమంతా చాకిరీ చేయిస్తూనే ఉన్నారు నీచేత, ఏం బాగాలేదు. బడివదలగానే నేరుగా స్టేషన్‌కు వెళ్ళిపోయానంటే అక్కడే ఏదో ఒకటి తినెయ్యొచ్చు. అలా బాగానే ఉంటుంది కదమ్మా, ఏమంటావ్?”

“చపాతీలు చేసిస్తూ ఉంటాన్లే. అవి పట్టుకెళ్ళి తిందువుగాని”, అంది సర్వజయ.

ఈ సంభాషణ జరిగి పదిరోజులు గడిచింది. అపూ గానీ, వాళ్ళమ్మగానీ మళ్ళీ ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. ఇంతలో అకస్మాత్తుగా వృద్ధ రాయ్ చౌధురిగారు జబ్బున పడ్డారు. వ్యాధి అంతకంతకూ తీవ్రమై, రెండు వారాలు గడిచేసరికల్లా ఆయన ప్రాణం ప్రమాదంలో పడింది. ఆయన జబ్బు గురించీ, అది నయమవుతుందా, లేదా అన్న విషయాన్ని గురించీ తప్ప, ఆ ఇంట్లో వాళ్ళకు మరొకటి తోచకుండా పోతోంది. మరో రెండు వారాల తర్వాత ఆయన ప్రాణానికి ప్రమాదం లేదని తెలిసిన రోజున చిరునవ్వు వెలిగిపోయే ముఖంతో తల్లిదగ్గరకొచ్చాడు అపూ. “గాలిపటాలమ్మే దుకాణం వాళ్ళతో మాట్లాడొచ్చానమ్మా. వాటిని అంటించటానికీ, దారాలు కట్టడానికీ సాయం చేశానంటే నెలకు ఏడు రూపాయల జీతమిచ్చి, రోజూ రెండు కొత్త పతంగులు ఇస్తామన్నారు. చాలా పెద్ద దుకాణమమ్మా, కలకత్తాక్కూడా పంపిస్తారట వాళ్ళ గాలిపటాలను! సోమవారం నుండి రమ్మన్నారు.”

ఈ చిరునవ్వు, వాడి కళ్ళలో తళుక్కున మెరిసే ఈ ఆశ సర్వజయ ఎరిగినవే. ఆ చూపు ఆమెకు చిరపరిచితమే. ఆ పల్లెటూళ్ళో భర్తతో కలిసి బతికిన రోజుల్లో, అతని కళ్ళలో అచ్చంగా ఇదే చూపును చూసిందామె, అతని కంఠం సరిగ్గా ఇలాగే ధ్వనించేది – పదిహేనేళ్ళ తమ సహజీవనంలో ఎన్నో, ఎన్నెన్నోసార్లు ఆమె చూసినదే ఇది. పరిస్థితులు మారుతున్నాయి, కష్టకాలం గడిచిపోయింది, మంచిరోజులు ఇప్పుడిప్పుడే సమీపిస్తున్నాయి! తమ సర్వస్వాన్నీ అమ్ముకుని, అదృష్టాన్ని వెదుక్కుంటూ నిశ్చిందిపురం నుండి బయల్దేరినప్పుడు, అప్పుడు కూడా హరిహరుడి ముఖంలో ఏవో స్వప్నలోకాలను వెదుకుతున్న ఈ చూపులే.

అతను మరణించి నాలుగేళ్ళయినా పూర్తికాకముందే, ముమ్మూర్తులా తండ్రిలాగే మాట్లాడుతున్నాడు అపూ. ఆ మాటల్లో ధ్వనించే ప్రమాద సూచికలను పట్టించుకోకుండా ఉండాలని సర్వజయ ప్రయత్నం. ఆడవాళ్ళందరూ కోరుకున్నట్టుగానే ఆమె కూడా,

తనకంటూ ఒక ఇల్లుండాలనీ దాన్ని తనకు నచ్చినట్టుగా తీర్చిదిద్దుకోవాలనీ ఆశపడింది ఈ కోరిక ఆమెను ఎప్పుడూ తొలుస్తూనే ఉండేది. ఇప్పుడు, అపూ మాటల్లో తొణికిసలాడే ఈ ఉత్సాహాన్ని చూస్తుంటే, వాడి నిర్ణయం సరైనదేనేమోనన్పిస్తోంది.

ఆ ఆశారేఖ ఎంత సూక్ష్మమైనదీ, క్షణికమైనదీ అయినాసరే, దాన్ని అందుకోవాలని ఆమె హృదయం ఆరాటపడుతోంది. అంతేకాదు, అపూ వదనంలో వెలిగే ఆనందాన్ని తుడిచివెయ్యటం మాత్రం ఆమెకు సాధ్యమవుతుందా? తన వయసు, అనుభవాల తాలూకు భారాన్ని మోపి వాడి యవ్వనోత్సాహాన్ని అణిచివెయ్యగలదా?

"మంచిదే," అంది సర్వజయ. "మంచి వార్త చెప్పావ్. సోమవారం వెళ్ళిరా, చూద్దాం ఎలా ఉంటుందో. అన్నట్టు నీకీ సంగతి తెలుసా, చిన్న కోడలుగారు వస్తున్నారట. వంటింట్లో అనుకుంటుంటే విన్నా." అపూ కళ్ళు మెరిశాయి. "ఎప్పుడమ్మా, ఎప్పుడట?" ఆత్రుతగా అడిగాడు. "నెలాఖర్లో. పెద్దబాబుగారి ఒంట్లో బాగాలేదుగా, ఆయన కాస్త కుదుటపడేదాకా ఇక్కడి పనులన్నీ చిన్నబాబుగారే చూసుకుంటారట."

ఏదో అడుగుదామని నోరుతెరిచిన అపూ, చటుక్కున ఆగిపోయాడు. లీల కూడా వాళ్ళ అమ్మా నాన్నలతోబాటు వస్తుందా, అని అడిగేందుకు అతనికి ధైర్యం చాలలేదు. వాళ్ళిద్దరూ వస్తున్నప్పుడు లీల మాత్రం రాకుండా ఎందుకుంటుంది, తప్పకుండా వచ్చేస్తుంది, అని తనకుతానే చెప్పుకున్నాడు.

మర్నాడు అపూ బడి నుంచి ఇంట్లోకి రాగానే, "ముందు ఏదన్నా కాస్త తిండి తిను. తర్వాత ఇవాళ నాకొచ్చిన ఉత్తరం ఒకటి చూపిస్తా" అంది తల్లి.

"ఉత్తరమా? నీకెవరు రాశారమ్మా?" అపూ గొంతులో ఆశ్చర్యం. వాళ్ళ నాన్న చనిపోయినప్పటి నుండి వాళ్ళను గుర్తుంచుకుని ఉత్తరం రాసినవాళ్ళంటూ ఎవరూలేరు. ఈ ఇంటికి వచ్చిన రెండున్నరేళ్ళ కాలంలోనూ వాళ్ళకేనాడూ ఒక కార్డుముక్కయినా రాలేదు. ఉత్తరాలూ, పోస్టాఫీసులూ అనేవాటిని దాదాపుగా మరిచేపోయాడు అపూ! "ఏదీ, నాకు చూపించమ్మా" అడిగాడు తల్లిని.

నిజమే, ఆ కవరు మీద వాళ్ళమ్మ పేరే రాసి ఉంది. అపూ దాన్ని తీసుకుని గబగబా చదవసాగాడు. "ఎవరీ భవతారణ్ చక్రవర్తి? కాశీ నుంచి రాశారే!" జాబు రాసిన వాళ్ళ చిరునామా చూస్తుంటే అయోమయంగా ఉంది అపూకి.

"నువ్వు ఏడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు చూశావాయన్ని. నిశ్చిందిపురంలో మనింట్లో మూడు రోజులున్నాడు. గుర్తురాలేదూ? దుర్గకోసమని ఓ బొమ్మరిల్లు కూడా పట్టుకొచ్చాడు."

"ఓహ్, అవునవును. గుర్తొచ్చిందిప్పుడు. ఆయన మీ బాబాయని అక్క చెప్పింది. ఇన్నాళ్ళూ ఏమయ్యాడాయన...?"

"ఆయన మా నాన్నగారికి తమ్ముడి వరస. ఎప్పుడూ దేశాలు తిరుగుతూ ఉంటాడు, ముఖ్యంగా గయ, కాశీలాంటి పుణ్యక్షేత్రాలకు. నాలుగురోజులపాటు ఊళ్ళో

ఇంటిపట్టునుండే మనిషి కాదు. ఒకే ఒక్కసారి వెళ్ళాన్నేను వాళ్ళింటికి. వాళ్ళ ఊరిపేరు మన్‌సాపోతా. ఆ ఇంట్లో ఆయన కూతురూ, అల్లుడూ ఉండేవాళ్ళు, ఇప్పుడు చనిపోయారనుకుంటా."

"ఔను, అదే రాశారుగా" మరోసారి ఉత్తరం చదువుతూ అన్నాడు అపూ, "మన కోసం నిశ్చిందిపురానికి వెళ్తే, కాశీలో ఉంటున్నామని తెలిసిందట. మన అడ్రసెలా దొరికిందో కదమ్మా? రామకృష్ణ మిషన్‌లో అడిగి ఉండాలి."

సర్వజయ చిరునవ్వు నవ్వింది, "మధ్యాహ్నం అన్నంతిని కాస్త నడుంవాల్చా, ఖేమీ వచ్చి నాకు ఉత్తరం వచ్చిందని చెప్తే నమ్మలేకపోయాననుకో...మనల్ని తీసుకువెళ్తానని రాశాడు గదా, ఎప్పుడయిందీ రాశాడా?"

"లేదు, తొందర్లోనే అని రాశాడంతే. భలే బాగుంటుంది గదమ్మా? నువ్విక్కడ పొద్దస్తమానమూ చాకిరి చెయ్యటం నాకసలేమీ నచ్చదు. మళ్ళీ మనింట్లో మనం ఉండొచ్చన్న మాట!"

ఇంకా అయోమయంగానే ఉంది. బాబాయి ఉత్తరం అందించిన హామీని విశ్వసించ టానికే సిద్ధమయింది సర్వజయ. ఎవరింట్లోనో పనిమనిషిగా గడిపిన జీవితం తర్వాత, విముక్తి పొందగలగటం, మళ్ళీ స్వతంత్ర జీవనంలోకి అడుగుపెట్టగలగటం... ఏమో, గతంలో ఎన్నో ఆశాభంగాలు ఎదురయ్యాయి ఆమెకు. ఆశలు పెంచుకునేందుకూ, కొత్త జీవితాన్ని ఊహించుకునేందుకూ సాహసించలేకపోతోంది. ఐనా, తల్లీకొడుకూ కలిసి దాని సాధ్యాసాధ్యాలను గురించి చాలాసేపు చర్చించుకున్నారు. ఆ తర్వాత అపూ అడిగాడు, "అమ్మా, మా స్నేహితుడింటి దగ్గర తోలుబొమ్మలాట వేస్తున్నారట, వెళ్ళనా?"

"అలాగే. పెద్దగేటు మూసేలోగా వచ్చెయ్యాలన్న సంగతి మాత్రం మర్చిపోకు."

ఇక అపూకి కాళ్ళు భూమ్మీద నిలవలేదు. అలాంటి సరదాలకు అతడు దూరమై చాలాకాలమయింది. ఇక తొందర్లోనే తనకు స్వేచ్ఛ దొరకబోతోంది. మరి, లీల సంగతేమిటి? ఆ అమ్మాయి ఏ క్షణాన్నయినా రావచ్చు. ఆమె తనతో మాట్లాడుతుందా? లేక వయసొచ్చిన అమ్మాయిలందరిలాగానే తనకేసి చూడకుండానే వెళ్తుందా?

తోలుబొమ్మలాట బాగా ఆలస్యంగా మొదలయింది. మధ్యలో లేచి రాలేకపోయాడు అపూ. తీరా ఆట పూర్తయాక గుర్తొచ్చింది, రాయ్ చౌధురిగారి ఇంటిగేట్లు ఈపాటికి మూసేసి ఉంటారని. ఒక వంటమనిషి కొడుకు కోసం ఏ చౌకీదారయినా గేటు తెరుస్తాడను కోవటం అత్యాశే! ఇప్పుడు తనెక్కడికి వెళ్ళాలి? ఒక్కసారిగా భయంవేసింది. తనెప్పుడూ ఇలా రాత్రిపూట ఒంటరిగా గడపలేదు. అమ్మ ఏమంటుందో?

వెళ్ళిపోతున్న జనంవైపు నిస్సహాయంగా చూస్తుండిపోయాడు. ఓ చిన్న కిళ్ళీదుకాణం తెరిచి ఉండటం కనబడింది. అక్కడ పాన్‌లూ, నిమ్మసోడాలూ అమ్ముతున్నారు. మెల్లిగా అక్కడికి నడిచి, బోర్లించిన చెక్కపెట్టె ఒకటి కనబడగానే దానిమీద కూర్చున్నాడు. ఎప్పుడు

నిద్రలోకి జారుకున్నదీ అతనికే తెలీదు. కళ్ళు తెరిచేసరికి ఎండెక్కింది, వీధుల్లో మనుషులు తిరుగుతున్నారు.

అపూ ఇల్లు చేరేసరికి, గేటుముందు రెండు బండ్లు సిద్ధంగా ఉండటం చూసి ఆశ్చర్యపడ్డాడు. ఇంట్లోకి అడుగుపెట్టగానే చక్కగా తయారై ఎక్కడికో ప్రయాణమవుతున్న పిల్లలు ఎదురయ్యారు.

తమ గదివేపు వెళ్తుండగా ఎదురుపడ్డ ఓ పనిమనిషిని అడిగాడు, "ఎక్కడికి వెళ్తున్నారు వీళ్ళందరూ? స్టేషన్‌కా? చిన్నబాబుగారు వస్తున్నారా ఇవాళ?"

"ఔనట. నిన్న ఉత్తరం వచ్చింది. చిన్నబాబుగారూ, కోడలుగారూ వస్తున్నారట. లీలకు పరీక్షలట, క్రిస్మస్‌దాకా రాదు."

అపూ హతాశుడయ్యాడు. లీల రావటంలేదట! క్రిస్మస్ సెలవులకొచ్చినా బాధపడే వాడు కాదుగానీ, అప్పటిదాకా తను ఇక్కడ ఉండడు మరి. తను వెళ్ళిపోయేలోగా లీలను చూడాలని అన్పిస్తోందతనికి. లీల ఇక్కడికొచ్చి చాలా కాలమయింది కూడా.

"రాత్రంతా ఎక్కడున్నావురా?" అంటూ వచ్చింది సర్వజయ, "నా కంటి మీద కునుకు లేదు, తెలుసా!"

"బాగా ఆలస్యమయిపోయింది మరి, గేటుకు తాళంవేసేసి ఉంటారు గదాని, మా స్నేహితుడింటికి వెళ్ళా..." ఒక్కసారిగా నవ్వు ముంచుకొచ్చింది అపూకి. "లేదు లేమ్మా, నిజం చెప్పేస్తా. ఓ కిళ్ళీ దుకాణం ముందు చెక్కపెట్టె కనబడితే దానిమీద పడుకున్నా" సంజాయిషీ ఇచ్చాడు.

"అయ్యో, దేవుడా! నీతో వేగటం నావల్ల కాదురా, ఆరుబయట పడుకున్నావా? రాత్రంతానా? భయమన్నా లేదట్రా? ఆ చలికి రోగానపడితే? ఇంకేదన్నా జరగరానిది జరిగితే? ఇంకోసారి రాత్రిపూట కాలు బయటపెట్టావంటే చూడు! తోలుబొమ్మలూ లేదు, ఆటాలేదు, ఏం, వింటున్నావా?".

"నేనేం చెయ్యనమ్మా, గేటు పగలగొట్టుకొని రాలేనుగా?" కాసేపటికి శాంతించింది సర్వజయ. "రాత్రి నువ్వుంటే బాగుండేదనుకున్నా. నువ్వు వెళ్ళీ వెళ్ళగానే మా బాబాయొచ్చాడు. మళ్ళీ సాయంత్రం వస్తానన్నాడు. ఈ ఊళ్ళో ఎవరో స్నేహితుల దగ్గర ఉంటాట్ట, ఎల్లుండి మనల్ని తీసుకువెళ్తానంటున్నాడు!"

"నిజంగానా? ఇంత తొందరగా! ఇంకేం చెప్పాడమ్మా ఆయన? జరిగిందంతా చెప్పు ముందు."

వాళ్ళ బాబాయి చెప్పిన సంగతులన్నిటినీ అపూకి వివరించింది సర్వజయ. భవతారణ్ చక్రవర్తిగారి కుటుంబ సభ్యులెవరూ ఇప్పుడు లేరు. ఆయన తన స్థిరచరాస్తులన్నిటినీ సర్వజయకు అప్పగించి, శాశ్వతంగా కాశీలో ఉండిపోదామను కుంటున్నాడట. ఈ మాటలు చెప్తున్న సర్వజయ ముఖంలో ఆనందం దాచుకుందామన్నా

దాగటంలేదు. ఇన్నాళ్ళూ తను కష్టపడి సేకరించిన కొన్ని వస్తువుల్ని కూడా అప్పుడే సర్దిపెట్టేసిందామె. “ఈ లాంతరు చూశావా! అంటూ ఓ పొడవాటి కిరసనాయిలు దీపాన్ని చూపించింది. “మన కొత్త ఇంట్లో వంట గదిలో పెడతా దీన్ని. దీనికెంత నూనె పొయ్యాలో తెలుసా? రెండు పైసలది పోస్తే చాలు!”

❖ ❖ ❖ ❖

ఆ మధ్యాహ్నం, అపూ కంచంముందు కూర్చుని అన్నం తినబోతూ ఉండగా, గుమ్మంలో ఎవరిదో నీడ కదలాడింది. తలెత్తి చూసిన అపూ, నిశ్చేష్టుడయినట్టు ఉండిపోయాడు.

లీల!

చిరునవ్వుతో లోపలికి అడుగుపెట్టింది లీల. కానీ అపూకేసి తేరిపార చూడగానే ఆమెలో చిన్న తడబాటు. కిందటేడాదికి కాస్త ముందు తనతో ఆటలాడిన పిల్లవాడు ఇతడేనా? అప్పుడూ చక్కగా అందంగానే ఉండేవాడు, కానీ ఇప్పుడు...అతని ముఖం, అతని జుట్టు, అతని కళ్ళు... ఇంత అందమైన కళ్ళు, కబుర్లు చెప్తున్న కళ్ళు, అప్పుడు కూడా ఉండేవా ఇతనికి? లీలకు కొంచెం సిగ్గేసింది. దాన్ని దాచుకుంటూ, “ఎంత పొడుగయ్యావ్ అపూర్వా!” అంది.

లీలను చూసిన అపూలో కూడా ఇలాంటి భావాలే కదలాడాయి. దాదాపు ఏడాదిన్నర కిందట తాను చూసిన పిల్లకాదు ఈ అమ్మాయి. ఎంత అందంగా ఉంది! లీలకన్నా అందమైన ఆడపిల్లను అతడెప్పుడూ చూసి ఎరగడు. ఆమె మీది నుండి కళ్ళు తిప్పుకోలేక పోతున్నాడు అపూ.

ఇద్దరికీ ఆ పరిస్థితి కొంచెం ఇబ్బందికరంగానే ఉంది. “ఎప్పుడొచ్చావ్?” అడిగాడు అపూ. “ఇవాళ పొద్దున్నే నీ గురించి అడిగాను, పరీక్షలున్నాయనీ నువ్విప్పుడు రావటం లేదనీ చెప్పారే”.

“ఐతే నన్ను తలచుకున్నావన్నమాట, ఔనా అపూర్వా?”

“తలచుకోవటమా? నిజమే కానీ...అహఁ, అసలేమిటంటే...నువ్వు బొత్తిగా మాయమైపోయావేం లీలా?”

“మాయమయ్యానా? నేనా? మరి నీ సంగతేమిటిటా? బుజ్జిగాడి అన్నప్రాశనప్పుడు బామ్మకు ఉత్తరం రాశానుగా, నిన్ను మా ఇంటికి పంపించమని? అందరూ వచ్చారుగా, నువ్వు రాలేదేం?”

అపూ ఈ సంగతులేమీ ఎరగడు. అతనికెవరూ చెప్పలేదు. “బుజ్జిగాడెవరు?” అడిగాడు.

“మా చిన్న తమ్ముడు. వాడు పుట్టినట్టు తెలీదా ఏం? ఇప్పుడు ఏడాది నిండబోతోంది వాడికి.”

లీలను చూసి కాస్త జాలిపడ్డాడు అపూ. తను ఎంతో అభిమానంతో ఆహ్వానించిన మిత్రుడికి ఈ ఇంట్లో బొత్తిగా గౌరవంలేదన్న సంగతి ఆమెకు తెలీదు. పనిమనిషి కొడుకును కుటుంబంలో మనిషిగా ఎవరుమాత్రం చూస్తారు?

"నిన్ను చూసి ఏడాదిన్నర కావస్తోంది" అంటూ మాట మార్చాడు అపూ, "ఇప్పుడేం చదువుతున్నావ్?

లీల అతని మంచం మీద కూర్చుంది. "ముందు నీ సంగతులన్నీ చెప్పిందాకా నా గురించి చెప్పను పో. మీ అమ్మ బావుందా? నువ్వు బడికిపోతున్నావుగా?"

"వెళ్తున్నా, కొద్ది రోజులుపోతే పై తరగతిలోకి వెళ్తా" కాస్తంత గర్వంగా తలెగరేస్తూ జవాబిచ్చాడు అపూ. "కిందటి సంవత్సరం మా తరగతిలో నేనే ఫస్టొచ్చా. బహుమతి కూడా ఇచ్చారు!"

లీల అతనికేసి చూసింది. టైము మూడుగంటలు దాటింది. ఇంత ఆలస్యంగా భోజనం చేస్తున్నాడేమిటి? ఆ మాట అడగకుండా ఉండలేకపోయింది. అపూ ఇబ్బంది పడ్డాడు. రోజు పొద్దున్నే బడికి వెళ్ళేటప్పుడు అన్నంతినే వెళ్తాడు. కానీ వంటమనిషి సణుక్కుంటూ విదిలించే కాస్తంత పప్పు, అన్నం తప్ప మరేమీ దొరకదు. ఏ పూటా కడుపునిండా భోజనం చెయ్యకపోవటంతో బడి వదిలేలోగానే ఆకలి మొదలవుతుంది. సాయంత్రం ఇంటికి వచ్చీరాగానే, సర్వజయ కంచంలో మిగిల్చిన అన్నంమీద ఆవురావురు మంటూ పడతాడు. ఇవాళ బడికి సెలవు కాబట్టి, రోజూకన్నా కాస్త ముందుగా భోజనం చేస్తున్నాడు.

ఏమని జవాబివ్వాలో అతనికి తోచలేదు కానీ, లీలకు అంతా అర్థమయింది. ఆ గదిలోని అరకొర సామాన్లూ అలమరలో కనబడుతున్న అపూ చవకరకం బట్టలూ, అతడు ఆకలితో తింటున్న ఆ తిండీ, ఇవన్నీ ఆమె హృదయాన్ని కలచివేశాయి. ఏం మాట్లాడాలో తోచక మౌనంగా ఉండిపోయింది.

"నీ పుస్తకాలన్నీ పట్టుకొచ్చావా" అడిగాడు అపూ. "నాకవన్నీ చూపించాలి".

"అలాగే, నీకోసమని కొన్ని పుస్తకాలు తెచ్చా. నీకు కథలంటే ఇష్టంకదా, అందుకే 'సాగర గాథలు' పుస్తకం కొనుక్కొచ్చా. నువ్వు అన్నం తింటూ ఉండు, పట్టుకొస్తా."

కంచంలో మిగిలిన అన్నాన్ని గబగబా నోట కుక్కుకున్నాడు అపూ. అతని కంచంలో ఒక్క మెతుకయినా మిగలకపోవటం లీల దృష్టిని దాటిపోలేదు. గుండెల్లో తెలియని వేదన రేకెత్తి, నిలువెల్లా కదిలిపోయిందామె. ఆ గదిలోంచి వెళ్ళిన లీల, కాసేపట్లోనే పుస్తకాలతో తిరిగివచ్చింది. తనకు ఇష్టమయిన పుస్తకాలే ఆమె తెచ్చివ్వటంతో ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరయ్యాడు అపూ. 'సాగర గాథలు' పుస్తకం నిండా నమ్మలేని నిజాలే – సముద్రాల అడుగున కొండలూ, అగ్నిపర్వతాలూ ఉంటాయట. అచ్చంగా మొక్కల్లాగా కనబడే సముద్ర

జీవులుంటాయట. ఒక ఉపఖండం మొత్తం సముద్రం అడుగున ఉండిపోయిందట...అపూకి ఇదంతా నమ్మశక్యంగా లేదు.

తన పాత డ్రాయింగ్ పుస్తకంలో బొమ్మల్ని చూపించి లీల. ఆమెకు మొదటినుండీ బొమ్మలు వెయ్యడమంటే మహా ఇష్టం. "ఈ పుస్తకంలో ఓ పూలమొక్క బొమ్మగీశాను గుర్తుందా? అప్పటినించీ బొమ్మలు వేస్తూనే ఉన్నా", పేజీలు తిప్పుతూ చెప్తోంది లీల. బొమ్మలు గీయడంలో ఆమె నైపుణ్యం పెరిగిందని గుర్తించాడు అపూ. తనకయితే వంకరపోకుండా ఓ గీత గియ్యటం కూడా రాదు మరి. "బావున్నాయ్, నిజంగా చాలా బావున్నాయ్," అని మెచ్చుకున్నాడు. " మీ బళ్ళో నేర్పిస్తారా, నువ్వే సొంతంగా నేర్చుకుంటున్నావా?" అని ప్రశ్నలు వేశాడు. కాసేపు ఇద్దరూ కబుర్లతో మునిగిపోయారు.

"మా అమ్మ దగ్గరకు వెళ్ళిరావూ?" అడిగింది లీల.

"సాయంత్రం వెళ్తే బావుంటుందేమో", కాసేపు మౌనం తర్వాత అన్నాడు అపూ, "అన్నట్టు, నీకు చెప్పలేదుకదూ లీలా... మేమిక్కడి నుండి వెళ్ళిపోతున్నాం".

ఉలిక్కిపడిన లీల, అతనికేసి కళ్ళప్పగించి చూస్తూ, "ఎక్కడికి వెళ్తున్నావు?" అని అడిగింది. ఆమె కళ్ళలో ఆశ్చర్యం.

"మా అమ్మకు ఓ బాబాయి ఉన్నాళ్ళే. మొన్నీమధ్యన ఆయన మమ్మల్ని వెదుక్కుంటూ వచ్చి, వాళ్ళింటికి వచ్చెయ్యమన్నాడు" క్లుప్తంగా వివరించాడు అపూ.

"నువ్వలా వెళ్ళటానికి వీల్లేదు !" గట్టిగా అరిచి చెప్పిన లీల, ఒక్కసారిగా మూగ బోయింది. అపూతో ఏం చెప్పాలో తోచటంలేదు. అది అతడు నిర్ణయించుకోవలసిన విషయం.

కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు. మౌనాన్ని భగ్నంచేస్తూ ముందుగా మాట్లాడింది లీల. "నీ చదువు సంగతేమిటి అపూర్వా? అలాంటి పల్లెటూళ్ళో స్కూలుండదు కదా. నువ్వు ఇక్కడే ఉండి చదువుకోవచ్చుగా."

"నిజమే. నేనొక్కణ్ణీ ఇక్కడ ఉండిపోవచ్చు, కానీ అమ్మ...ప్చ్, నేను లేకుండా అమ్మ ఉండలేదు."

"ఇంకోలాగా చెయ్యొచ్చు. నువ్వు కలకత్తాకు వచ్చి మా ఇంట్లో ఉండిపో. అమ్మతో నేను చెప్తాలే. మా ఇంటి నుంచి ఎక్కడికయినా సులభంగా వెళ్ళొచ్చు. కలకత్తాలో ఎలక్ట్రిక్ ట్రాములున్నాయి తెలుసా! ఆరేళ్ళకిందటిదాకా వాటిని గుర్రాలతో లాగించేవాళ్ళు. ఇప్పుడేమో ఎలక్ట్రిక్ వైర్ల సాయంతో పరిగెడుతున్నాయి...నువ్వే చూస్తావుగా."

ఈ ఆలోచన బాగానే ఉందనిపించింది. కాసేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత, లీల తన గదిలోకి వెళ్ళిపోయింది.

సర్వజయావాళ్ళ బాబాయి వచ్చాడు ఆ సాయంత్రం. ఇంక ఆలస్యం చెయ్యాల్సిందేమీ కనబడటం లేదు. వాళ్ళ దగ్గరున్న కాసిని సామాన్లూ సర్దుకోటానికి రెండు రోజులు చాలు. "బుధవారం వచ్చి మిమ్మల్ని తీసుకువెళ్తా"నని చెప్పి వెళ్ళాడాయన. లీల చెప్పిన విషయాన్ని గురించి అమ్మతో మాట్లాడుదామా, వద్దా అని చాలాసేపు ఊగిసలాడాడు అపూ. చివరికి, ఆ మాట చెప్పటానికి అతనికి ధైర్యం చాలలేదు.

❖ ❖ ❖ ❖

తూర్పు తెల్లవారుతుండగా ఊలా స్టేషనుకు చేరింది రైలు. మన్సాపోతా గ్రామానికి పోవాలంటే ఇక్కడే దిగాలి. స్టేషన్ నుండి ఇల్లు చేరటానికి ఎడ్లబండి మాట్లాడాడు భవతారణ్ చక్రవర్తి. అపూకి ఆ రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు. భవతారణ్ గారు తనను పిలవటం వినబడి కళ్ళు విప్పాడు. తాము ఎక్కిన రైలు ఏదో స్టేషన్‌లో ఆగి ఉంది. అప్పటికే కొందరు కూలీలు తమ సామాన్లు చేతుల్లోకి తీసుకుంటున్నారు.

కాసేపట్లో అందరూ ఎడ్లబండిలో సర్దుకుని కూర్చోగానే, బండి కదిలింది. భవతారణ్ హుక్కా వెలిగించాడు. ఆయనకు దాదాపు డెబ్బయ్యేళ్ళుండొచ్చు. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. నున్నగా క్షవరం చేసిన గడ్డం, ముగ్గుబుట్టలాంటి తల.

"జయా, నిద్రొస్తోందా?" అడిగాడాయన.

సర్వజయ చిరునవ్వుతో, "అబ్బే లేదు. నేను రైల్లో నిద్రపోయా, అపూ కూడా పడుకున్నాడు. మీరొక్కరే రాత్రంతా మేలుకుని కూచున్నారు" అని జవాబిచ్చింది.

భవతారణ్‌కు దగ్గు ప్రారంభమయింది. "మిమ్మల్ని వెదికి పట్టుకోగలననుకోలేదు" అన్నాడు కాస్త దగ్గు తెరిపిచ్చాక. "పోయినేడాది నా కూతురు పోయింది – దాని మొగుడు అంతకుముందే చచ్చిపోయాడు – ఇక నా మొహం చూసేవాళ్ళే లేకుండా పోయారనుకో. నేనే వండుకు తినాల్సిన గతిపట్టింది. అప్పుడు హరిహరుడు గుర్తుకొచ్చాడు. ఏదో నాక్కాస్త మడిచెక్క ఉంది, పైగా మా ఊళ్ళో బ్రాహ్మణ కొంపలూ తక్కువే. హరిహరుడు లక్షణంగా గ్రామ పౌరోహిత్యం చేసుకుంటాడు గదా, నేనిక కాశీకిపోయి, శేష జీవితం గడపవచ్చు ననుకున్నా. అట్లా అనుకునే, మీకోసం నిశ్చిందిపురానికి వెళ్ళా. మీరక్కడి నుంచి వెళ్ళిపోయి, కాశీలో ఉంటున్న సంగతి నాకంతదాకా తెలీదు మరి! మీ పక్కింటివాళ్ళు ఆ సంగతి చెప్పగానే కాశీకి చేరుకున్నా. అక్కడ పదేళ్ళున్నా, ఎంతోమంది పరిచయమయ్యారు, కానీ మిమ్మల్ని కనుక్కోవటం నావల్ల కాలేదు. హరిహరుడు పోయేనాటికి నేను కూడా కాశీలోనే ఉన్నా. కాస్త ముందుగా తెలిసి ఉంటేనా...!"

"మీరు నిశ్చిందిపురంలో మా ఇల్లు చూశారా తాతగారూ? అదింకా అలాగే ఉందా?" ఆత్రుతగా ముందుకు వంగి, అడిగాడు అపూ.

"అబ్బే, చూడలేదురా. గ్రామస్తులెవరో చెప్పారు, ఈ సంగతులన్నీ. మీ చిరునామా ఎవరి దగ్గరా దొరక్కపోవడంతో వెళ్ళిపోయా. మీ పక్కింటి భువన ముఖర్జీగారు భోజనానికి

పిలిచారు. మీ నాయనెంత తెలివిమాలిన పనులు చేశాడో, ఎన్నెన్ని కష్టాలుపడ్డాడో ఆయనే చెప్పాడు. సరేలే...ఎట్లానో ఆఖరికి మిమ్మల్ని కనుక్కున్నా, అంతేచాలు. నువ్విప్పుడు అన్నీ చక్కబెట్టుకోగలవనే అనుకుంటున్నా, మీ మంచీచెడ్డా చూసుకోటానికి నా శిష్యులు కొందరున్నార్లే. మన పక్కింట్లోనే నూనె వ్యాపారం చేసే తేలీవాళ్ళ కుటుంబముంది, బాగా ఉన్నవాళ్ళే. వాళ్ళింట్లో పూజా పునస్కారాలు చేయించటానికి నిన్నే పిలుస్తారు...అవన్నీ నేను చూసుకుంటాగా. నీ కాళ్ళమీద నువ్వు నిలబడతావ్, ఆ పూచీ నాది".

గ్రామం పొలిమేరలు దాటింది బండి. బాట పక్కనంతా వృక్షాలూ, దట్టమైన పొదలూ కనబడుతున్నాయి. సూర్యుడి పసిడి కాంతుల్లో లోకమంతా జలకాలాడుతోంది. మంచుతో తడిసిన పచ్చిక నేలంతా పరుచుకుని, లేత ఎండకు మిలమిల్లాడుతోంది. ఏదో మత్తయిన పరిమళం–అది ఫలానా పువ్వునుంచో, మొక్కనుంచో వెలువడుతోందని చెప్పలేం– పచ్చికమీది మంచు బిందువుల్లోంచీ, పొలాల్లోని పైరులోంచీ, పేరు తెలీని అడవి మొక్కల్లోంచీ మెత్తని ఉదయ పవనంలోంచీ వ్యాపిస్తున్న కమ్మని పరిమళం.

అపూ కళ్ళకు ఇంత పచ్చని పరిసరాలు ఎదురై ఎంతో కాలమయింది. అతని హృదయంలో ఒక ఆనందతరంగం ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఎంత చిన్న సంతోషానికైనా అతడు చలించిపోతాడు. అప్పుడప్పుడూ ఓ విషాదవీచిక ఆ పసిహృదయాన్ని సోకినా, అది కాసేపే.

మన్‌సాపోతా చేరేసరికి మధ్యాహ్నమయింది. బండికి కట్టిన పరదాను కాస్తంత పక్కకు జరిపి, తను కొత్త జీవితం మొదలెట్టబోతున్న ఆ గ్రామాన్ని తొంగి చూసింది సర్వజయ. దగ్గరగా ఉన్న ఇళ్ళతో ఇరుగ్గా కనబడుతోంది ఊరు. ఓ ఇంటిముందు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న మనుషులు బండికేసి ఆసక్తిగా చూశారు. ఆ వాకిటి ముందున్న ఖాళీస్థలంలో పాతిన వెదురుగడలకు చేపలుపట్టే వల వేలాడుతోంది. ఇది మత్స్యకారుల వీధి కాబోలు.

బండి ఇంకాస్త ముందుకు వెళ్ళి ఓ ఇంటిముందు ఆగింది. వాకిట్లో ఖాళీస్థలం, కాస్త విశాలంగా ఉన్న పూరిల్లు, విడివిడిగా రెండు చిన్న పాకలు, వాకిట్లో ఓ పక్కగా బావి, ఓ జామచెట్టు, కనబడ్డాయి సర్వజయ కళ్ళకు. ఇంటి వెనకున్న పెద్ద చింతచెట్టు కొమ్మలు, ఇంటి కప్పుమీదికి వాలి ఉన్నాయి. ఆవరణ చుట్టూ వెదురు తడకలు కట్టారు. భవతారణ్ బండిలోంచి దిగాడు. అపూ కూడా దిగి, తల్లికి చెయ్యందించాడు.

పక్కింట్లో ఉండే తేలీల ఆడవాళ్ళు ఆ సాయంత్రం సర్వజయను పరిచయం చేసుకోవటానికి వచ్చారు. ఆ ఇంటి ఇల్లాలు లావుగా, కారునలుపులో ఉంది. తన ఇద్దరు కోడళ్ళనూ, కూతురినీ, చిన్నపిల్లలనూ వెంటబెట్టుకొచ్చింది ఆవిడ. ఆడవాళ్ళందరి చేతులకూ బరువైన బంగారు కడియాలను చూసి ముచ్చటపడింది సర్వజయ. రెండు తుంగ చాపలు తెచ్చి వసారాలో పరుస్తూ, "కూర్చోండి" అంది కాస్త సంకోచంగానే.

ఆ గృహిణి వంగి, సర్వజయ పాదాలకు నమస్కరించింది. మిగతా వాళ్ళు కూడా ఆమెను అనుసరించారు.

"మీరు రావడం చూశానమ్మగారూ" అంది లావుపాటావిడ చిరునవ్వుతో. "వెంటనే వచ్చేద్దామనుకున్నానమ్మా, ఇంట్లో తీరితేగదా. పట్నంనించి మా అబ్బాయొచ్చాడు, అక్కడ మాకోదుకాణం ఉంది లెండి. నా మనవరాలు ఎంతకీ నన్నొదలదు, దాన్ని నిద్రబుచ్చే సరికి పావుతక్కువ రెండయింది. శానా రోజుల్నించి దగ్గు వదలడమేలేదమ్మా దానికి. కవిరాజ్ గారిని అడిగితే మందు చెప్పారు. నెమలీకల్ని తెచ్చి రాగి కడాయిలో సన్న మంటమీద కాల్చి, ఆ బూడిదలో తేనె కలిపి పెట్టమన్నారు. ఔనే హ్రజీ... మీ అన్నయ్య తేనె తెస్తాడంటావా, మర్చిపోకుండా?"

ఆడవాళ్ళందరిలో చిన్నమ్మాయి హ్రజీ తలవూపి, ఏదో చెప్పబోతుండగానే తల్లి అందుకుంది, "ఇది నా కూతురు అమ్మగారూ. బెహ్రాంపూర్‌లో ఇచ్చాం. అల్లుడు కూడా మా దుకాణం పనే చూసుకుంటాడు. హాయిగానే ఉండేవాళ్ళు గానీ, వాళ్ళమ్మ చచ్చిపోవడంతో ముసలాయన మళ్ళా పెళ్ళిచేసుకొని, కొడుకును ఇంట్లోంచి పొమ్మన్నాడు. ఎంత అన్యాయమో చూశారూ? అందుకే మా ఆయనన్నాడూ..."

ఆవిడ మాట సగంలో ఉండగానే కోడళ్ళలో ఒక యువతి కల్పించుకుని, "వాళ్ళొచ్చిందిప్పుడే గదమ్మా, అలిసిపోయుంటారు. వంటగూడా చేసుకోవాల్నేమో, బాగా ఆలస్యమయిపోయింది" అన్నది. ఆ అమ్మాయికి ఇరవయ్యేళ్ళుంటాయి. అందంగా, నాజూగ్గా ఉంది. పట్నవాసం పిల్లలా కనబడుతోంది.

ఇంతలో అపూ వచ్చాడు బయటి నుండి. ఇంటికి వచ్చీరాగానే ఊరు చూడ్డానికి పరిగెత్తాడు అపూ. అంతమంది ఆడవాళ్ళు తనకేసి చూడటంతో వాకిట్లోనే ఆగిపోయాడు.

"ఎవరీ పిల్లాడు? మీ కొడుకా? ఒక్కడేనా? చక్కగా యువరాజులా ఉన్నాడమ్మా!" అంది పక్కింటావిడ.

అందరి దృష్టీ తనమీదికి తిరగటంతో ఇబ్బందిపడిన అపూ, మళ్ళీ వీధిలోకి వెళ్ళబోతుంటే తల్లి ఆపింది.

"ఆగరా, అపూ! మహా సిగ్గు వీడికి – ఔనమ్మా, వీడొక్కడే నాకు మిగిలింది. ఓ కూతురుకూడా ఉండేది, వీడికన్నా పెద్దది. కానీ, అది..." సర్వజయ కంఠం వణికింది.

"...ఇప్పుడు లేదా?" పక్కింటావిడా, ఆమె కోడలూ ఒక్కసారే అన్నారు.

"లేదు. ముచ్చటగా, ఒద్దిగ్గా ఉండేది, బంగారమంటి పిల్ల. పదమూడేళ్ళకే..." ఇక మాట్లాడలేక పోయింది సర్వజయ.

పక్కింటావిడ నిట్టూర్చింది. "నీ చేతుల్లో ఏముందమ్మా? అంతా పైవాడి దయ, అంతేగదా? మీరొచ్చినందుకు సంతోషమమ్మా. ఊళ్ళో బ్రామ్మలంటూ లేకుండాపోయారు,

ఏదన్నా పూజ చేసుకున్నప్పుడల్లా పట్నంనించి పిల్చుకురావాల్సిందే. అప్పుడోసారి చటర్జీ గారని...ఆయన పేరేందో సరిగ్గా గుర్తులేదు...ఆయనొచ్చాడు ఊళ్ళో కాపురముంటానని. ఒక్కడే వచ్చాడు, తొందర్లోనే పెళ్ళాన్నీ, పిల్లలనూ తీసుకొస్తానన్నాడు. నెలలుగడుస్తున్నా ఎవరూ రాలా. ఆఖరికి పోయినేడాది ...” ఆమె ఒక్కక్షణం మాటలాపగానే, వాళ్ళలో ఒకావిడ కిసుక్కున నవ్వింది. పెద్దావిడ కూడా నవ్వుతూ, ‘ఓ పిల్ల... కనీసం పెద్ద కులం పిల్లన్నా కాదు, ఆ గొల్లాయన కూతురు – పనికి కుదిరింది. పోయినేడాది వాళ్ళిద్దరూ...” ఆవిడ మాటలు పూర్తి కాకుండానే ఆడవాళ్ళందరూ పగలబడి నవ్వసాగారు.

“వాళ్ళిద్దరూ పారిపోయారా ఏం?” అడిగింది సర్వజయ.

“ఔనమ్మా! పాపం బ్రాహ్మడు గదాని నేనిచ్చిన గిన్నెలూ, చెంబులూ కూడా పట్టుకు పోయారు!”

మళ్ళీ నవ్వులు మొదలయ్యాయి. కాసేపట్లో వాళ్ళందరూ వెళ్ళిపోయారు, వంటకు కావలసిన సరుకులు సర్వజయకిచ్చి.

## 2

ఆ ఊరొచ్చి వారం దాటింది. కొత్త ఇంటిని తనకు నచ్చినట్టుగా సర్దుకుంది సర్వజయ. నాలుగేళ్ళకుపైగా తన గుండెల్లోనే అణిచిపెట్టుకున్న చిన్న చిన్న కోరికలూ, కలలూ నెరవేరుతున్నందుకు ఆమెకు ఆనందంగా ఉంది.

భవతారణ్ చక్రవర్తిలోని మంచితనమూ, ప్రేమా మాత్రమేగాక, ఆయన పిసినారి తనం కూడా క్రమంగా బయటపడుతోంది. తేలీవాళ్ళ ఇంట్లో పూజాదికాలన్నీ నిర్వహించ టానిగ్గానూ వాళ్ళాయనకు ఏటా కొంత డబ్బు ముట్టజెపుతుంటారు. ఆయన కాశీలో ఉండటానికి ఈ సొమ్ము సరిపోతుంది. అపూ గనుక ఆయన బాధ్యతల్ని స్వీకరిస్తే తేలీలు ఇచ్చే సంభావనలతో తల్లీ కొడుకుల పోషణ జరిగిపోతుంది, డబ్బు రూపంలో వచ్చే రాబడిని భవతారణ్ వాడుకోవచ్చు. కేవలం జాలితో సర్వజయనూ, ఆమె కొడుకునూ ఇక్కడికి తీసుకురాలేదాయన.

సర్వజయకు ఇందులో అభ్యంతరపెట్టాల్సిందేమో కనబడలేదు. ఈ ఏర్పాటు ఆమెకు సంతోషంగానే ఉంది. తల్లీ, తాతగారూ బలవంతపెట్టడంతో గ్రామ పురోహితుడి అవతారం ఎత్తాడు అపూ. ఈ కొత్త బ్రాహ్మణుడి సంగతి నలుగురి నోళ్ళలోనూ పడటంతో లక్ష్మీపూజకో, మరేదో వ్రతానికో రమ్మని చుట్టుపక్కల గ్రామాలవాళ్ళు కూడా పిలుస్తున్నారతన్ని.

అలా వెళ్ళాల్సొచ్చినప్పుడు పొద్దున్నే లేచి స్నానంచేసి ఓ పట్టు శాలువా కప్పుకుని బయల్దేరతాడు అపూ. పూజారులు అందరిలాగానే చేతిలో ఓ వ్రతకల్పం పుచ్చుకుని వెళ్తాడు. ఇదంతా అలవాటులేని పనే అయినా, సరదాగానే ఉంటోంది. కానీ చీటికి

మాటికి మంత్రాల పుస్తకాన్ని చూసుకుంటూ పనిచేయాల్సి రావటమే ఇబ్బందిగా ఉంది. శివపూజ చెయ్యాలంటే ఏమంత్రం చదివితే బావుంటుందో? ఒక చేతిలో గంట వాయిస్తూ, మరో చేత్తో పూజాద్రవ్యాలను సమర్పించడం సరైందేనో, కాదో? ఎంతకీ తేలవు ఇలాంటి చిక్కు ప్రశ్నలు; వాటి గురించి బుర్ర బద్దలు కొట్టుకోకుండా తనకు తోచినట్టు చేసుకుపోతున్నాడు.

ఐతే, ఒకరోజున పక్క గ్రామంలోని సర్కార్‌ల ఇంట్లో పూజకు వెళ్ళాల్సొచ్చినప్పుడు మాత్రం పెద్ద ఇబ్బందిలో పడ్డాడు అపూ. వాళ్ళకూ, ఇంటి పురోహితుడికీ ఏదో గొడవ జరిగి, అతడు చెప్పాపెట్టకుండా మానేశాట్ట. ఆ ప్రాంతాలకంతటికీ ఒక్కగానొక్క బ్రాహ్మణుడు అపూనే. సర్కార్‌గారి పెద్దమ్మాయి నిరుపమ, పూజకు అన్నీ సిద్ధం చేసి ఉంచింది. పట్టు శాలువాతో, చేతితో వ్రతకల్పం పుచ్చుకుని, గంభీరముద్రలో ప్రత్యక్షమయిన పద్నాలుగేళ్ళ కుర్రాణ్ణి చూసి ఆమె అవాక్కయింది. "పూజ చెయ్యగలవా నువ్వు?" అని ఏ మొహమాటాలూ లేకుండా అడిగేసింది. "చక్రవర్తిగారికి బంధువటగా; ఆయన మీ పెదనాన్నగారా? నీపేరేమిటి?"

అపూకి సిగ్గుగా, ఇబ్బందిగా తోచింది. ఆమెకు పొడిపొడిగా జవాబులిచ్చి, తన పనిలో పడ్డాడు. కాస్సేపట్లోనే పకపకా నవ్వుతూ అతనికి అడ్డుతగిలింది నిరుపమ. "ఒద్దొద్దు, అలాక్కాదు. దేవుణ్ణి కడిగి శుద్ధిచెయ్యకుండా తులసి దళాలు పెట్టకూడదు. దాన్నలా కిందపెట్టు. ఇప్పుడు ఆ రాగి చెంబులో నీళ్ళు తీసుకో..."

ఆ తతంగమంతా పూర్తయేసరికి, అపూ ముఖమంతా కందిపోయి, చెమటలు పట్టాయతనికి. వెంటనే ఇంటికి వెళ్దామనుకున్న అపూని, బలవంతంగా భోజనానికి కూర్చోబెట్టారు నిరుపమ, మిగతా ఆడవాళ్ళు కలిసి. ఇంటికి పట్టుకెళ్ళమని రకరకాల వంటకాలూ, మిఠాయిలూ మూటలు కట్టిచ్చారు.

❖ ❖ ❖ ❖

నెలరోజుల తర్వాత భవతారణ్ కాశీకి వెళ్ళిపోయాడు.

మన్‌సాపోతా జీవితంలో స్థిరపడేందుకు అపూ ప్రయత్నిస్తున్నాడు. కానీ ఈ గ్రామాన్ని నిశ్చిందిపురంతో పోల్చుకునేది అతని మనసు. అక్కడ బోలెడన్ని ఇళ్ళూ, చాలామంది మనుషులూ ఉండటం గుర్తొస్తుంది. పెద్ద వృక్షాలతో, పూలతో, పిట్టలతో, సూర్యకిరణాలు పడగానే బంగారు వర్ణంలో మెరిసే ఎర్రని ఆకుల ఛాతిమ్ పొదలతో కళకళలాడే ఆ నిశ్చిందిపురం ఎక్కడ, ఈ ఊరెక్కడ?

అతని పౌరోహిత్యం దినదినాభివృద్ధి చెందుతోంది. సర్కార్‌ల ఇంటి నుంచి తరచుగా పిలుపు వస్తూనే ఉంటోంది. చక్కటి రూపురేఖలతో బిడియంగా, పొందిగ్గా ఉండే అపూని చూస్తే వాళ్ళింట్లో అందరికీ అభిమానమే. అపూ పట్టుకొచ్చే సరుకుల్ని చూసి ఎంతగానో

సంతోషించేది సర్వజయ. "ఎన్ని బియ్యం వచ్చాయిరా ఇవాళ!" అని ఆశ్చరపడుతూ "ఇన్ని మిఠాయిలే! సందేష్ ఎక్కడిది, ఎవరిచ్చారు?" అడిగింది సర్వజయ ఓ రోజున.

"సర్కార్ గారింట్లో. ఇది చూడమ్మా, కుందూగారిచ్చారు", అంటూ తను తెచ్చిన అరటిపళ్ళను సగర్వంగా తల్లికి అందించాడు అపూ.

జీవితంలో ఏనాడూ ఇంత కమ్మటి పదార్థాలను తిని ఎరగదామె. తన స్వప్నం సాకారమవుతున్నట్టుగా ఉంది. నిశ్చిందిపురంలో, చేతిలో చిల్లిగవ్వలేని ఆ రోజుల్లో ఆమె కన్నకల ఇదే; కుండపోతగా కురిసే వర్షానికి ఇంటి కప్పునుండి కారే వర్షధారల నడుమ గడిపిన రోజుల్లో, పక్కింటివాళ్ళ అహంకారాన్నీ, గ్రామస్తుల హేళననూ భరించిన ఆ రోజుల్లో, అతి తరచుగా ఆమె కన్నకల ఇదే. నిశ్శబ్దపు మధ్యాహ్నాలలో ఒంటరిగా కూర్చుని అందమైన భవిష్యత్‌ను కలలుకనేదామె. వాకిట్లోని వృక్షాల వరుసలు సుదీర్ఘమైన నీడల్ని పరిచేదాకా ఊహల వర్ణమాలికలను అల్లుకుంటూ అలాగే కూర్చునేది. ఇన్నాళ్ళకు ఆ సుదూర స్వప్నాలు చేతికందే సమయం ఆసన్నమయింది – భగవాన్, కృతజ్ఞురాలిని. ఆ గడ్డురోజులు ఇక అంతరించినట్టేనన్న ఆశ ఆమెకు మెల్లిగా చేకూరుతోంది.

❖ ❖ ❖ ❖

తన కొత్త ఉద్యోగం ఉత్సాహకరంగానే ఉంది అపూకి. పూజకు వెళ్ళాల్సిన రోజున వేకువనే లేచి పూలూ, పత్రీ కోసుకుని సిద్ధమవుతాడు. ఒక నోటు పుస్తకంలో రకరకాల పూజలకు సంబంధించిన విధివిధానాలన్నీ రాసిపెట్టుకున్నాడు.

కొన్ని నెలలు గడిచాక, వర్షాకాలం మొదలవుతూ ఉండగా ఒకరోజు అపూ తల్లి దగ్గరికొచ్చి, "మళ్ళీ బడికి పోతానమ్మా" అన్నాడు.

ఉలిక్కిపడినట్లుగా చూసింది సర్వజయ, "బడికా? ఇక్కడ బడెక్కడుందిరా?"

"పక్క ఊళ్ళో ఉందమ్మా."

"ఆ ఊరికిపోవాలంటే మైళ్ళకొద్దీ నడవాలి, రోజూ అంతదూరం నువ్వేం నడుస్తావ్?"

ఆ విషయాన్ని సర్వజయ వెంటనే మర్చిపోయింది. కానీ అపూ పట్టువదలకుండా పదే పదే అడగటం మొదలెట్టాడు. చివరికి ఆమె విసిగిపోయి "నన్నెందుకు అడగటం, నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. నువ్వూ మీ నాన్నలాగే తయారవుతున్నావ్. ఆయన ఏనాడు విన్నాడని నామాట. బడికి పోవాలనుకుంటే పో! రోజంతా బళ్ళో కూచుంటే నువ్వు చెయ్యాల్సిన పని ఎవరు చేస్తారు? ఎన్నో ఏళ్ళ తరవాత కాస్త సుఖంగా బతుకుతున్నాం గదా అపూ? హాయిగా సాగుతున్న బతుకును నాశనం చేసుకోవటం మంచి పనేనట్రా?"

అపూ మాట్లాడలేకపోయాడు. అమ్మ చెప్పింది నిజమే. భవతారణ్ వెళ్ళిపోయాక పౌరోహిత్యమేగాక, ఇంకెన్నో బాధ్యతలు అపూ భుజాలమీదే పడ్డాయి. భవతారణ్‌కు కాస్త

పొలం ఉంది. ఆయన దాన్ని కౌలుకిచ్చి వెళ్ళాడు. ఆ వ్యవసాయం పనులూ, కౌలు వసూళ్ళూ ఇప్పుడు అపూ చూసుకోవాల్సిందే. ఈ కొత్త పనులన్నీ అతనికీ సరదాగానే ఉన్నాయి.

ఒకరోజు సర్కార్‌గారింట్లో లక్ష్మీపూజ చేయించి వాళ్ళిచ్చిన సరుకులన్నీ మూట గట్టుకుని సాయంత్రంవేళ ఇంటికి బయల్దేరాడు అపూ. రాత్రవుతోంది, అప్పుడే వెన్నెల వెలుగులు పరుచుకుంటున్నాయి. చలిగాలి రివ్వున వీస్తోంది. ఎక్కణ్ణించో వడ్రంగిపిట్ట ముక్కుతో చెట్టు బెరడును పొడుస్తున్న చప్పుడు వినబడుతోంది. ఎగుడుదిగుడుగా ఉన్న గుట్ట వెన్నెల్లో మెరుస్తోంది. ఆ పక్కనే లోతట్టు ప్రదేశం కటిక చీకట్లో మునిగిపోయింది. అపూ ఊహలు పరుగులు తీశాయి. ఆ గుట్ట ఎలుగుబంటిగానూ, లోయ ఓ జలాశయంగానూ, ఆ పక్కనున్న దిబ్బ ఉప్పుదిబ్బగానూ ఓ దృశ్యం అతని మనసులో బొమ్మకడుతోంది. ఉత్సాహంగా నడుస్తున్నాడు. 'ఇంటికెళ్ళగానే వాళ్ళిచ్చిన నారింజ పండు తినాలి' అని గుర్తుచేసుకున్నాడు.

ఉన్నట్టుండి నిశ్చిందిపురం గుర్తొచ్చింది. ఇలాంటి వెన్నెల రాత్రుల్లో, మబ్బులు ముసిరిన మధ్యాహ్న వేళల్లో ఇచ్ఛామతీనది ఒడ్డున కూర్చుని ఇలాంటి కలనే కనేవాడు తను. ఇప్పుడెలా తయారయింది జీవితం? ఈ కుగ్రామంలో, ఈ పౌరోహిత్యం చేసుకుంటూ ఎలా బతకగలుగుతున్నాడు తను?

❖ ❖ ❖ ❖

బడికి వెళ్ళటం గురించి రెండు రోజుల తర్వాత మళ్ళీ ప్రస్తావించాడు అపూ. ఆ ఊరు దూరమయితే మాత్రమేం? నడిచి వెళ్ళటానికి తను సిద్ధంగానే ఉన్నాడు. ఈ ఊరు దాటి వెళ్ళకపోతే తనకిక బయటి ప్రపంచమే ఉండదనిపిస్తోంది.

మళ్ళీ పాతపాటే పాడింది సర్వజయ. బడికి వెళ్ళటమంటే ఏమిటో ఆమె ఊహకు అందదు. ఆమె కోరుకున్న జీవితం దొరికింది. అపూ సంపాదన ఇలాగే స్థిరంగా ఉంటే కొన్ని సంవత్సరాల్లో వాడికి పెళ్ళిచేస్తుంది. ఇక తన బతుకు సుఖంగా గడిచిపోతుంది. కానీ, అపూ ఈసారి మొండిపట్టు పట్టడంతో వాడు బళ్ళో చేరకుండా అపటం సర్వజయకు సాధ్యంకాలేదు.

నాలుగు మైళ్ళ దూరం నడిచి బడికి వెళ్ళటం, మళ్ళీ సాయంత్రం ఇంటికి నడిచి రావటం – ఈ ప్రయాణంలో ప్రతి క్షణాన్నీ మనస్ఫూర్తిగా ఆనందిస్తున్నాడు అపూ. నిశ్చిందిపురం వదిలి వచ్చిన ఇన్నాళ్ళకు దొరికిన ఈ ఆనందాన్ని అపూ ఎన్నటికీ మరిచిపోలేదు.

ఆ రోడ్డు పొడవునా మర్రిచెట్లూ, మల్బరీ చెట్లూ వరసగా ఉంటాయి. దట్టంగా అల్లుకున్న పొదలు అక్కడక్కడా కాస్త పల్చబడిన తావుల్లోంచి నీలాకాశం వెలుగుతూ

ఉంటుంది. బళ్ళో కూర్చున్నంతసేపూ ఏదో పరాయిదేశంలో ఉన్నానన్పిస్తుంది అపూకి. ఆఖరిగంట మోగి, ఇంటికి బయల్దేరే క్షణంకోసం ఆత్రంగా, అసహనంగా ఎదురుచూస్తాడు. ఈపాటికి చెట్లనీడలు పొడుగ్గా వ్యాపిస్తుంటాయి, అస్తమయ భానుడికి వీడ్కోలు చెప్తూ పొడవాటి ఆకులను ఊపుతాయి తాటిచెట్లు, గూళ్ళకు చేరే తొందరలో పక్షులు కిలకిల్లాడు తుంటాయి; పంటపొలాల్లోంచి వీచేగాలి మార్మికమైన ధ్వనులు చేస్తుంది...ఒక స్వేచ్ఛా భావన ఆ గాలిలో నిండి ఉంటుంది, అతని కంటికి ఎదురయ్యే ప్రతి చిన్న వస్తువూ ఏదో ఆశను కలిగిస్తూ ఉంటుంది.

అన్నిటికన్నా ఎక్కువగా అపూ ఇష్టపడేది, తోటి బాటసారులతో సంభాషణ. ఇలా ఒంటరిగా ప్రయాణం చెయ్యటం గతంలో అనుభవం లేదతనికి. అతని కళ్ళకు ఈ లోకం ఇంకా కొత్తగానే కనబడుతోంది. చూడాల్సినవీ, తెలుసుకోవలసినవీ ఎన్నో ఉన్నాయి. సాధారణంగా సిగ్గరి స్వభావం అపూది. కానీ దారిలో ముందు వెళ్తున్న మనుషులు కనబడగానే పరిగెత్తుకుంటూ వెళ్ళి, పలకరించటానికి అతనిప్పుడు సంకోచించటం లేదు. చుట్టకాల్చుకుంటూ ఇంటికి వెళ్తున్న ఏ రైతునో చూడగానే మాటలు కలుపుతాడు అపూ. "ఎక్కడికెళ్తున్నావ్, కాకా? నేను కూడా మన్‌సాపోతా దాకా వస్తాన్లే. మీరే ఊరు? షిక్రీనా? ఊరిపేరు విన్నానుగానీ, ఎప్పుడూ చూళ్ళేదులే. చాలా పెద్ద ఊరా అది?" అపూ ప్రశ్నలకు అంతూ దరీ ఉండదు. అతనికి ఎదురయ్యే వాళ్ళందరూ సామాన్యమైన గ్రామీణులే కాబట్టి, జవాబులివ్వటానికి విసుక్కోరు. రకరకాల మనుషుల పరిచయాలతో ఎన్నెన్ని కథలు విన్నాడో, అతి సరళమైన వాళ్ళ జీవితాల్లో ఎన్ని వెలుగుల్ని చూశాడో, అపూ ఎన్నటికీ మరువలేడు. కథలంటే చెవి కోసుకునే అపూ, వాళ్ళు చెప్పే కథల్లో లీనమైపోయి, వాటిని దృశ్యాలుగా మనసులో చిత్రించుకునేవాడు.

ఒక బాటసారి చెప్పిన కథకు చలించిపోయాడు అపూ. వాళ్ళ గ్రామంలోని ఒక బ్రాహ్మణ ఇల్లాలు, చాలా ఏళ్ళ క్రిందట ఎవరో కింది కులం మగవాడితో పారిపోయిందట. ఆమె ఒక చెరువు దగ్గర నత్తల్ని ఏరుకుంటూ ఉండడం తను చూశానని చెప్పాడు ఆ బాటసారి. చిరుగుల బట్టలతో, బోసిమెడతో, పక్కన చిన్న కుర్రాడితో ఉందట ఆమె.

"ఆమె నిన్ను గుర్తుపట్టిందా?" ఆశ్చర్యంగా అడిగాడు అపూ.

"ఆఁ. నన్ను చూడంగానే ఏడ్చింది. వాళ్ళ తల్లిదండ్రులు ఎట్లా ఉన్నారని అడిగి, తను కనబడిన సంగతి వాళ్ళకు చెప్పవద్దన్నది. భగవంతుడు తన నొసట ఏం రాసిపెడితే అది జరుగుతుందన్నదే తప్ప, ఎవర్నీ ఒక్క మాట అనలా... చింపిరి గుడ్డల్లో ఉన్నా, దేవత మాదిరుంది తెల్సా? ఎంత చెడినా బ్రామ్మలింట్లో పుట్టి పెరిగిన మనిషాయె" అన్నాడు బాటసారి.

అపూ ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆమెను గురించిన ఆలోచనలు మాత్రం సాగుతూనే ఉన్నాయి. గొప్పింట్లో పుట్టిన అందమైన స్త్రీ, చిరుగుల చీరతో మోకాటిలోతు బురదలో దిగి, నత్తగుల్లల్ని ఏరుకుంటున్న దృశ్యం అతని మనోఫలకం మీద ఏళ్ళ తరబడి ముద్రించుకపోయింది.

❖ ❖ ❖ ❖

ఒక రోజున, అపూ బడికి వెళ్ళేసరికి టీచర్లందరూ ఏదో కంగారుగా, హడావిడిగా తిరుగుతున్నారు. కొందరు అటూ, ఇటూ పరుగులు పెడుతూ పెద్ద గొంతులతో ఏవో ఆదేశిస్తున్నారు. బంతిపూల దండలతో హాలుని అలంకరించారు. లెక్కల టీచరు బోర్డునిండా పెద్ద పెద్ద గణిత సూత్రాలను రాస్తున్నాడు. బడి ఆవరణంతా శుభ్రంగా మెరుస్తోంది. హెడ్‌మాస్టర్ ఆఫీసు గదిలో కూర్చుని ఏవో కాగితాలూ, హాజరుపట్టీలూ పరిశీలిస్తున్నాడు.

ఆ ఆర్భాటానికి కారణం కాసేపయ్యాక అర్థమయింది అపూకి. మధ్యాహ్నం ఒంటిగంటకు ఇన్‌స్పెక్టర్‌గారు వస్తున్నారట. ఆయన తరగతి గదిలోకి రాగానే పిల్లలందరూ ఎలా స్వాగతం పలకాలో చెప్పటం మొదలెట్టాడు లెక్కల టీచరు.

మధ్యాహ్నమవుతుండగా ఓ గుర్రబ్బండి బడిముందు ఆగింది. ఇన్‌స్పెక్టర్‌గారిని చూడగానే హెడ్‌మాస్టరు పరిగెత్తుకొచ్చాడు. అంతసేపూ నిశ్శబ్దంగా కూర్చున్న అపూ వాళ్ళ లెక్కల టీచర్ హటాత్తుగా మెలకువొచ్చిన వాడిలా లేచి ఘనపదార్థాలకూ, ద్రవపదార్థాలకూ భేదం గురించి పెద్ద గొంతుకతో పాఠం మొదలెట్టాడు. పక్కగదిలో భూగోళశాస్త్ర ఉపాధ్యాయుడు హుక్కా పీలుస్తున్నవాడల్లా పాఠం అందుకున్నాడు : “నారింజ పండు ఎలా ఉంటుందో మీ కందరికీ తెలుసుగా? మన భూమి కూడా అచ్చంగా నారింజ పండు లాగానే ఉంటుంది.” అంటూ.

హెడ్ మాస్టర్‌గారూ, ఆయన వెంట ఇన్‌స్పెక్టరూ బడి లోపలికి వచ్చారు. ఆయన నలభయ్యో పడిలో ఉన్నాడు. పొట్టిగా, తెల్లగా ఉండి లాంగ్ కోటూ, ట్రౌజరూ తొడుక్కున్నాడు. మెడకు సిల్కు రుమాలు చుట్టుకుని, తెల్లని కాన్వాస్ బూట్లు వేసుకున్నాడు. ఆయన గొంతు గంభీరంగా ఉంది. ఆఫీసులో ఫైళ్ళు చూశాక ఓ తరగతి గదిలోకి నడిచాడు. అపూవాళ్ల తరగతి ఆ పక్కనే ఉంది. అపూ గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఇన్‌స్పెక్టర్ గదిలోకి రాగానే, ఒక్కొక్క విద్యార్థినీ లేపి పాఠం చదివించాడు. తన వంతు రాగానే లేచి నిలబడిన అపూ మొదట్లో కాస్త తడబడినా, వెంటనే సర్దుకుని గడ గడా చదివేశాడు. తన గొంతు తనకే మధురంగా, స్థిరంగా వినబడింది అపూకి.

“గుడ్, చక్కగా చదివావ్! నీ పేరేమిటి?” అన్నాడు ఇన్‌స్పెక్టర్. మిగతా విద్యార్థులను కూడా ప్రశ్నలడిగాక విశ్రాంతిగదిలోకి వెళ్ళి కూర్చున్నాడాయన. కొబ్బరినీళ్ళూ, మిఠాయిలూ పుచ్చుకుని, ఆయన వెళ్ళబోతుండగా అపూ వాళ్ళ టీచర్, వాడి చేతికి చిన్న కాగితం

ఇచ్చాడు. "వెళ్ళి గేటు దగ్గర నిలబడు. రెండు రోజులు బడికి సెలవు కోసం దరఖాస్తు ఇది. ఇన్‌స్పెక్టర్‌గారు బయటికి రాగానే దీన్ని ఆయనకివ్వాలి. నువ్వు బాగా నచ్చావ్ ఆయనకు. నువ్వడిగితే తప్పకుండా ఒప్పుకుంటారు" అంటూ తొందరపెట్టాడు.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాక హెడ్‌మాస్టర్ అపూని పిలిచి, "ఇన్‌స్పెక్టర్ గారికి నువ్వు బాగా నచ్చావోయ్. నిన్ను బోర్డు పరీక్షకు పంపిద్దామనుకుంటున్నా, బాగా చదువు" అని చెప్పాడు.

అపూ సంతోషంగా ఇంటికి బయల్దేరాడు. తనను బోర్డు పరీక్షకు పంపుతున్నందు కంటే రెండు రోజులు బడికి సెలవులిచ్చేందుకు ఇన్‌స్పెక్టర్‌గారు ఒప్పుకున్నందుకే ఎక్కువ సంతోషంగా ఉంది. ఇవాళ బాగా ఆలస్యమయిందని వేగంగా నడుస్తున్నాడు అపూ. దారిలో వంతెన దగ్గర ఆగి, అమ్మ కట్టియిచ్చిన రొట్టెలూ, కొబ్బరీ, బెల్లం ముక్కా తిన్నాడు. ఆ వంతెన దగ్గర రోడ్డు మలుపు తిరుగుతుంది. అక్కడున్న ఓ మల్బరీ చెట్టు కింద కూర్చుని రొట్టెలు తినటం రోజూ అపూకి అలవాటే. వంతెన కింది భాగంతో చెరువుంది. దాన్నిండా చేపలున్నాయని అపూకి ఎందుకో గట్టి నమ్మకం ఏర్పడింది. రొట్టె ముక్కల్ని నీళ్ళలోకి విసిరి, చేపలు కనబడతాయేమోనని పరీక్షగా చూస్తుంటాడు.

రొట్టె తినటం ముగించిన అపూ, చేతులు కడుక్కుందామని చెరువులోకి దిగాడు. ఈ పక్కనే నిలబడున్న ఓ వ్యక్తి అపూ కంటబడ్డాడు. నల్లగా, పొట్టిగా, దృఢంగా ఉన్నాడా మనిషి. అతని జుట్టు వత్తుగా, పొడుగ్గా, చిందర వందరగా ఉంది. వీపున విల్లూ, అంబుల పొదితోబాటుగా ఓ మూట వేలాడుతోంది. ఎరుపు, ఆకుపచ్చ పూసల దండను మెళ్ళో వేసుకున్నాడు. "ఏం కావాలి నీకిక్కడ?" అని ఆసక్తిగా పలకరిస్తూ అతని దగ్గరగా వెళ్ళాడు అపూ.

ఆ వ్యక్తి సంతాల్ జాతివాడట. దమ్కా అనే దూర ప్రాంతం నుండి వచ్చి, బర్ద్వాన్‌లో ఉంటున్నాడు. ఫలానాచోట ఉండాలన్న పట్టింపేమీ లేదు అతనికి. కాలినడకన ప్రయాణాలు చేస్తూ, ఇష్టం వచ్చినచోట మకాంవేస్తాడు. దొరికిన ఏ జంతువునైనా వేటాడి తింటాడట. ఇప్పుడే ఓ పక్షిని కొట్టి, దాన్ని కాల్చటానికి పుల్లలకోసం వెదుకుతున్నాడు. "ఏ పిట్టను కొట్టావ్?" అడిగాడు అపూ. అతడు తన మూటలోంచి ఓ అడవి బాతును తీసి చూపాడు. అపూ ఆసక్తిగా చూశాడు. "ఓసారి నీ బాణాలు చూపించవూ?" అని అడిగిన అపూ చేతికి ఓ బాణాన్ని ఇచ్చాడతడు.

"వీటితో పక్షులనేనా, ఇంకా వేటినయినా వేటాడుతావా?"

"ఏవయినా సరే. కుందేళ్ళూ, నక్కలూ, ముంగిసలూ... ఆఖరికి పులుల్ని కూడా వేటాడతా. ఐతే పులిని చంపాల్నంటే ఒకరకమైన అడవితీగ పసరు కావాల. బాణం మొనను ఆ పసరులో ముంచాల."

ఎండు పుల్లల్ని ఏరుకొచ్చి, మల్బరీ చెట్టుకింద మంట రాజేశాడు. పక్షి ఈకల్ని పీకి, మంటలో దాన్ని కాలుస్తున్న ఆ మనిషిని కళ్ళప్పగించి చూశాడు అపూ.

బాగా చీకటి పడింది. తినటం పూర్తయ్యాక బాణాలన్నీ సర్దుకుని వెళ్ళిపోయాడు సంతాల్. ఇలాంటి మనిషిని చూడటం అపూకి ఇదే మొదటిసారి. ఎంత అద్భుతమైన జీవితం అతనిది – ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, ఎక్కడికంటే అక్కడికి వెళ్ళిపోవటం, నీ తిండి నువ్వే సంపాదించుకోవటం, రాత్రికి నిప్పు రాజేసుకుని వండుకు తినటం. కాల్చిన పక్షిమాంసం మీద కాస్తంత ఉప్పు చల్లుకుని తినేసిన ఆ మనిషి నిజంగా ఓ అద్భుతమే.

❖ ❖ ❖ ❖

కొన్ని నెలలు గడిచాయి. ఒకరోజు ఉదయం బడికి వెళ్ళటానికి సిద్ధమైన అపూ, తల్లి ఇంకా ఫలహారం తయారు చెయ్యకపోవటం చూసి ఆశ్చర్యపడ్డాడు.

"ఇవాళ బడికి వెళ్ళొద్దు అపూ" అంది సర్వజయ. "సర్కార్ గారింట్లో ముఖ్యమైన పూజ ఏదో జరుగుతోందట. నిన్ననే చెప్పిపంపారు."

"ఏమిటీ! నువ్వు ఒప్పేసుకున్నావా? వీల్లేదమ్మా, నేనింక ఈ పూజలూ అవీ చెయ్యను. రోజూ ఏదో ఒక పూజ జరుగుతూనే ఉంటుంది, మాటిమాటికీ బడి మానెయ్యాలంటే నాకెలా కుదురుతుంది? తొందరగా తినడానికేదైనా పెట్టమ్మా."

"నా మాట విను అపూ" అంది అనునయంగా తల్లి. "సర్కార్ గారింట్లోనే కాదు, వాళ్ళ పొరుగు వాళ్ళందరూ కూడా ఆ పూజ చెయ్యాలనుకుంటున్నారట. అందరూ నిన్నే రమ్మంటున్నారు. వెళ్ళావంటే గంపెడు బియ్యమూ, సరుకులూ వస్తాయ్. నా కోసం వెళ్ళరా అపూ, మంచివాడివి కదూ."

ఆమె మాటలు లెక్కలేనట్లుగా లేచి వెళ్ళిపోయాడు అపూ, ఖాళీ కడుపుతోనే. నీళ్ళు నిండిన కళ్ళతో కొడుకు వెళ్ళినవైపు చూస్తుండిపోయింది సర్వజయ. అపూ మరీ ఇంత పెడసరంగా తయారవుతాడని ఆమె ఊహించనైనా లేదు. వాడు ఇంత మొండిగా ప్రవర్తించడం ఇదే మొదటిసారి.

అపూ బడికి వెళ్ళేసరికి, హెడ్‌మాస్టర్ ఫణిబాబు అతని కోసం ఎదురుచూస్తున్నాడు. గ్రామ పోస్టుమాస్టర్‌గానూ, హెడ్‌మాస్టర్‌గానూ రెండు ఉద్యోగాలు చేస్తాడాయన. అపూ ఆయన గదిలో అడుగుపెట్టేసరికి ఆ రోజు వచ్చిన ఉత్తరాలు చూస్తున్నాడు ఫణిబాబు.

"రావోయ్, అపూర్వా" అంటూ ఆహ్వానించాడాయన. "పొద్దున ఇన్‌స్పెక్టర్‌గారి ఆఫీసు నుంచి నీ మార్కులొచ్చాయి, జిల్లా అంతటికీ ఫస్టొచ్చావ్. బోర్డు పరీక్షకు ఎన్నికైనందుకు అభినందలు. నువ్వింకా పైకి చదవాలనుకుంటే నెలకు ఐదు రూపాయల స్కాలర్‌షిప్ ఇస్తామంటున్నారు. ఏం, చదువుకుంటావుగా?"

అపూ జవాబిచ్చేలోగానే లెక్కల టీచర్ వచ్చాడు. "నేనిప్పుడే చెప్పానండీ, హైస్కూలుకు వెళ్తావా, అని అడుగుతున్నా" అన్నాడు ఫణిబాబు.

"వెళ్తాడుగా!" అన్నాడు లెక్కల టీచర్. "ఇంత తెలివైన కుర్రాడు హైస్కూలుకు వెళ్ళకపోతే ఇంకెవరు వెళ్తారండీ? ఇంకేం ఆలోచించకండి సార్, దరఖాస్తు పంపించెయ్యండి."

జరుగుతున్నదేమిటో అపూ బుర్రకు సరిగ్గా అంతుపట్టటంలేదు. హెడ్‌మాస్టర్ వైపు కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డాడు. ఫణిబాబు ఓ దరఖాస్తు ఫారాన్ని తీసి, దానిమీద ఏదో నాలుగు వాక్యాలు రాసి, అపూ చేతికిచ్చాడు. "ఇక్కడ సంతకం చెయ్యవోయ్. హైస్కూల్లో చదువుకుంటావని రాసేశా, ఇప్పుడే పంపించేస్తా దీన్ని."

ఆ మధ్యాహ్నం త్వరగా ఇంటికెళ్ళటానికి అనుమతి దొరికింది అపూకి. అతని మనసంతా తల్లిని గురించి ఆలోచనలతో సతమతమవుతోంది. పొద్దున బాధలో ఉన్న అమ్మను వదిలి వచ్చేశాడు తను. తనవల్ల ఆమెకు ఎంత వేదన కలిగిందో అతనికి తెలుసు. మర్రిచెట్టు నీడల్లో, పొదల మాటున దాగిన పావురం కూతలో – ఎటు చూసినా అమ్మ దుఃఖమే కనబడుతోంది.

ఆ రోజంతా ఖాళీ కడుపుతోనే ఉండిపోయింది సర్వజయ. పిల్లవాడు ఆకలితో వెళ్ళగా, ఆమె నోటికి అన్నమెలా సహిస్తుంది? సర్కార్ గారి కుటుంబం ఎంతో ఔదార్యంతో బోలెడన్ని ప్రసాదాలు పంపారు. అపూ, బడినించి రాగానే వాటిని వడ్డించిదామె. అతని మనసంతా గందరగోళంగా ఉంది. తల్లిపెట్టినవి తినేసి, మళ్ళీ బయటికి వెళ్ళాడు.

గ్రామంచుట్టూ ఉన్న పొలాల్లో కోతలు పూర్తవటంతో ఖాళీగా ఉన్నాయవి. వాటి శూన్యాన్ని చూస్తూ ఊహల్లోకి జారిపోయాడు అపూ. తను స్కాలర్‌షిప్ సాధించుకున్నాడంటే ఇంకా నమ్మశక్యంగా లేదు. అమ్మకు ఇంకా చెప్పలేదు. కనుచూపు మేర విస్తరించిన పొలాలపై వెలుగుతున్న అరుణకాంతి ఉజ్వల భవిష్యత్‌ను వాగ్దానం చేస్తున్నట్టుగా తోచిందతనికి. చిత్రమైన అనుభూతితో ఒళ్ళు పులకరించింది. కానీ అమ్మ ఏమంటుందో? ఆమెఇంకా దిగులుగానే ఉందా? ఈ విషయాన్ని ఆమెకెలా చెప్పాలి? బీడుబారినట్టున్న పొలాలనూ, దిగంతాల్లో బంగారు వన్నె మేఘాలనూ చూస్తుంటే ఏదో విషాదం కమ్ముతున్నట్టుగా ఉంది. సందె చీకట్లు ముసురుతుంటే అమ్మ మనసులోని దిగులు గుర్తొస్తోంది. ఇంటికి బయల్దేరాడు అపూ.

అపూ ఇల్లు చేరేసరికి వసారాలో నూనె దీపం రెపరెపలాడుతోంది. సర్వజయ ఎదురు చూస్తోంది. ''పళ్ళున్నాయి తీసుకో'' అంటూ ఓ అరటిపండు వలిచి, అందించింది. "వాళ్ళందరూ నువ్వు రాలేదని బాధపడ్డారు అపూ. సర్కార్‌గారు నీ కోసం మనిషిని పంపారు. నువ్వు బడికి వెళ్ళావని చెప్పా, ఇంకెవరినో చూసుకుని

తీసుకెళ్ళేసరికి బాగా ఆలస్యమయిందట... నువ్వు ఇంట్లో లేనందుకు బాధపడ్డారు... నువ్వు ఉండుంటే..."

"అమ్మా" పిలిచాడు అపూ. "ఆ పూజకు వెళ్ళకపోవటం మంచిదే అయిందమ్మా. ఇవాళ మా బళ్ళో ఓ గమ్మత్తు జరిగింది. నేను వెళ్ళగానే హెడ్‌మాస్టర్‌గారు పిలిచి, నాకు స్కాలర్‌షిప్ వచ్చిందని చెప్పారు. జిల్లా అంతటికీ నేను ఫస్టొచ్చాను. నేను...నేను హైస్కూల్లో చేరానంటే నెలకు ఐదురూపాయలిస్తారు. ఐతే బోర్డింగ్ స్కూల్లో చేరాల్సుంటుందనుకో."

సర్వజయ ముఖం పాలిపోయింది. మౌనంగా అపూ ముఖంలోకి చూస్తుండి పోయింది. చివరికి గొంతు పెగుల్చుకుని "వాళ్ళకేం చెప్పావ్?" అని అడిగింది.

"ఏమీ చెప్పలేదు. పై చదువుకు వెళ్ళకపోతే ఆ డబ్బులు రావు. వెళ్తే మాత్రం, బోర్డింగ్ స్కూలు ఖర్చులకు ఆ ఐదురూపాయలు వాడుకోవచ్చు. ఇక ట్యూషన్ ఫీజులేమీ కట్టనక్కర్లేదు. ఉత్తినే చదువు చెప్తారు."

వాడికేం చెప్పాలో తోచలేదు సర్వజయకు. అపూ చెప్పినదాంట్లో తప్పేమీ కనబడలేదు. కొడుకు స్కాలర్‌షిప్ తెచ్చుకుని, దాన్ని ఓ మంచి పనికి వాడుకుంటానంటే ఏ తల్లి మాత్రం వద్దనగలదు? ముందుకు నడుస్తున్న కుర్రాణ్ణి లాక్కొచ్చి, ఇంట్లో పడెయ్యటం ధర్మమేనా?

ఇవాళ తెల్లారినప్పటి నుంచీ చికాగ్గానే ఉంది, ఇప్పుడు ఇలా ముంచుకొస్తుందని ఎవరికి తెలుసు? ఏనాడో చేసిన పాపానికి ఇప్పుడిలా శిక్ష అనుభవిస్తోంది తను. దేన్నీ అడ్డుకునే శక్తి తనకు లేదు. తను కేవలం బలహీనురాలు, నిస్సహాయురాలు. భవిష్యత్ స్వప్నాలన్నీ మంచు తెరల్లా కరిగిపోతూ ఉంటే కళ్ళప్పగించి చూడాల్సిందే.

❖ ❖ ❖ ❖

నెలరోజుల తర్వాత, అపూకి స్కాలర్‌షిప్ లభించిన వార్త న్యూస్ పేపర్లో వచ్చింది. సర్వజయ తన దిగుల్లోంచి తేరుకుని, కొడుకు ప్రయాణానికి ఏర్పాట్లలో పడింది.

ఒంటరిగా ఉండటం అపూకి బొత్తిగా అనుభవంలేదు. వాడికేం కావాలో అడిగి, చేసిపెట్టేవాళ్ళు అక్కడెవరున్నారని? అవసరమైన వస్తువులన్నీ సర్దింది సర్వజయ : మంచం మీద పరుచుకోటానికీ, కప్పుకోటానికీ రెండు దుప్పట్లు; ఒక గాజు గ్లాసూ, నెయ్యి సీసా, కొబ్బరుండల సంచీ, పాలు తాగేందుకు అపూకి ఇష్టమైన పూలు చెక్కిన ఇత్తడి చెంబూ, మరో డజను చిన్న చిన్న వస్తువులూ. వాడి దిండుకు శుభ్రమైన గలీబు తొడిగింది. ఒక పక్కన ఇవన్నీ సర్దుతూనే, "చూడరా, మీ బోర్డింగులోనో, తరగతిలోనో పోకిరీ పిల్లలుంటారేమో, నిన్నేమయినా అల్లరిపెడితే వెంటనే టీచరుగారితో చెప్పు. రాత్రికి అన్నం తినకుండా మాత్రం పడుకోకేం, నీకు పుణ్యముంటుంది. ఉత్తి కడుపుతో పడుకుంటే, నిన్ను లేపి అన్నంపెట్టడానికి అక్కడెవరూ ఉండరన్నసంగతి గుర్తుపెట్టుకో. ఒకవేళ నిద్రొస్తుంటే, వంటగదిలోకి పోయి ఏదుంటే అది పెట్టించుకు తిను. సరేనా? ఏరా

అపూ, వింటున్నావా?" అంటూ పదే పదే హెచ్చరికలు చేస్తూనే ఉంది. ఎన్ని జాగ్రత్తలు చెప్పినా ఇంకేదో గుర్తొస్తూనే ఉందామెకు.

బయల్దేరబోయే ముందు రాత్రి, కొన్ని వస్తువుల్ని తీసి సర్దిపెట్టుకున్నాడు అపూ. ఒకటి, వాళ్ళనాన్న పాటలు రాసిన నోట్ పుస్తకం. పాత ట్రంకు పెట్టెలో ఉన్న ఆ పుస్తకాన్ని తీసి, తన సామాన్లతోబాటు సర్దుకున్నాడు. హరిహరుడిది చక్కటి దస్తూరీ. ఆ అక్షరాలూ, పదాలూ, పాత జ్ఞాపకాలను మోసుకొచ్చాయి. ఆ పాటలు పాడిన హరిహరుడి గొంతు అపూకి ఈనాటికీ వినబడుతూనే ఉంటుంది. ఆటలాడి, అలిసిపోయి, ఇంటికి మరలిపోయే ప్రశాంత సంధ్యా సమయాలూ, శిశిర మాసపు మధ్యాహ్నాల్లో ముసిరే నీలవర్ణ మేఘాలూ, గుబులు గొలిపే రాత్రివేళలూ, ఒక్కోసారి వెన్నెల కురిసే రాత్రులూ, నిశ్చిందిపురాన్ని గుర్తుచేస్తూ ఆ పాటల జ్ఞాపకాలతో పెనవేసుకుపోతాయి. కాశీలో తాము గడిపిన తొలి రోజులనూ, దశాశ్వమేధ ఘాట్‌నూ, అక్కడ కలుసుకున్న పాటగాళ్ళనూ కూడా అపూ గుర్తుచేసుకుంటూనే ఉంటాడు.

అపూ మనసు మార్చుకుని, ఆగిపోతాడేమోనన్న ఆశ ఒకటి సర్వజయ హృదయంలో రహస్యంగా దాక్కుని, వాడు బయల్దేరే రోజు వరకూ అలాగే ఉంది. కానీ వాడి ధోరణి చూస్తే అలా కనబడ్డంలేదు. కొడుక్కి భద్రమైన భవిష్యత్‌ను ఇవ్వడం కోసం ఆమె ఎంతో ఓర్పుతో, పట్టుదలతో నెమ్మదిగా నిర్మించిన జీవితాన్ని కాళ్ళకింద తొక్కుకుంటూ వెళ్ళిపోవటానికి వాడేమాత్రమూ సంకోచించడం లేదని అన్పించింది సర్వజయకు. అపరిచితమైన ఆ జీవితం మీద వాడికెందుకంత ఆకర్షణ? వాడు ఎక్కడికి చేరబోతున్నాడు? కొడుకు మీది ప్రేమతో, అతి స్పష్టంగా కనబడే సత్యాన్ని కూడా చూడలేని అంధురాలయింది సర్వజయ: బయటి ప్రపంచం అపూని ఎలుగెత్తి పిలుస్తోంది. ఆ పిలుపుకు బదులు పలికే వ్యక్తి, అందుకు ఎంత మూల్యాన్నయినా చెల్లించేందుకు సిద్ధపడతాడు. ఇంట్లో లభించే భద్రజీవనం ఆ మనిషికి తృప్తినివ్వదు. తన కొంగు మాటున కొడుకును దాచుకోవాలన్న సర్వజయ ప్రయత్నం వ్యర్థం!

మర్నాడు ఉదయాన్నే వెళ్ళిపోయాడు అపూ. గడపదాటి బయటికి అడుగుపెట్టే ముందు వాడి నుదుట పెరుగుతో బొట్టుపెట్టి, వాడిని చల్లగా చూడమని దేవుణ్ణి ప్రార్థించింది సర్వజయ.

"వీలు దొరకగానే వచ్చెయ్యి. ఐతు పూజ వస్తోందిగా, మీ బడికి సెలవిస్తార్లే" అంది సర్వజయ.

అపూ నవ్వాడు, "ఐతు పూజకా? ఇవ్వరమ్మా, ఇది జిల్లాలోనే పెద్ద స్కూలు గదా. ఐతు పూజలాంటి పిచ్చిపిచ్చి పండగలకు సెలవులివ్వరు. వేసవి సెలవులదాకా రావటం కుదరదు."

ఉబికి వస్తున్న కన్నీళ్ళను విశ్వప్రయత్నంతో ఆపుకుంది సర్వజయ. పిల్లవాడు బయల్దేరేటప్పుడు కన్నీళ్ళు పెట్టుకోవటం అమంగళం.

ఆమె పాదాలకు నమస్కరించి, బరువైన సంచిని భుజాన మోసుకుంటూ వెళ్ళిపోయాడు అపూ.

అది డిసెంబర్ మాసపు ఆహ్లాదకరమైన ఉదయం. ఆ ముందు రోజంతా పొగ మంచుతో మసకబారి ఉండింది. ఇవాళ మాత్రం, సూర్యుడి బంగారు కిరణాలు మబ్బుల్ని చీల్చుకుని వచ్చి మామిడి కొమ్మపైపడి, దాని ఆకుల్ని వెలిగిస్తున్నాయి. వెదురు పొదల కింది పచ్చని మొక్కల్లోంచి తొంగి చూస్తున్న అడవి పువ్వులు, వర్ణశోభితమైన భవిష్యత్ స్వప్నాల్లా మెరిశాయి.

## 3

అప్పుడే తెల్లవారుతోంది. దివాన్‌పూర్‌లోని గవర్నమెంట్ మోడల్ స్కూల్లో హాస్టలు పిల్లలెవ్వరూ ఇంకా నిద్రలేవనేలేదు. ఇద్దరు టీచర్లు మాత్రం ఆవరణలో పచార్లు చేస్తున్నారు.

ఒక చివరగా ఉన్న గదిలోంచి వెలుపలికొచ్చిన ఓ కుర్రాడు, కాస్త దూరంలోని టవర్‌క్లాక్‌కేసి మెడరిక్కించి చూస్తూ నిలబడ్డాడు. 'ఏమోయ్, సమీర్! ఆ కొత్త కుర్రాడొచ్చాడా రాత్రి? అదే, స్కాలర్‌షిప్ తెచ్చుకున్న కుర్రాడు." అంటూ ఒక టీచర్ అతన్ని పలకరించాడు.

"వచ్చాడు సార్, ఇంకా నిద్రపోతున్నాడు లేపమంటారా?" అంటూ ఓ కిటికీ దగ్గరగా వెళ్ళి 'అపూర్వా! లేచి రావోయ్, అపూర్వా' అంటూ పిలిచాడు సమీర్.

నాజూగ్గా, అందంగా ఉన్న దాదాపు పదిహేనేళ్ళ కుర్రాడు కళ్ళు నలుపుకుంటూ బయటికొచ్చాడు.

'అపూర్వ కుమార్ రాయ్ అంటే నువ్వేనా?' అడిగాడు సత్యేన్‌బాబు అనే ఆ టీచర్. "స్కాలర్‌షిప్ వచ్చింది కదూ?...మంచిది, తర్వాత స్కూల్లో కలుద్దాం."

"సార్" పిలిచాడు సమీర్. "వార్డెన్‌గారు అపూర్వకింకా గది ఇవ్వలేదండీ, కాస్త మాట్లాడతారా?"

"అదేమిటి? నీ గదిలో చోటుందిగా, అతనూ నీతోనే ఉంటాళ్ళే."

సమీర్‌కు కావలసింది కూడా అదే. "థాంక్యూ సార్, వార్డెన్ గారితో మీరే చెప్పండి."

టీచర్లిద్దరూ వెళ్ళిపోయారు.

"ఎవరు వాళ్ళు?" సమీర్ నడిగాడు అపూ.

'మన టీచర్లు, ఈ ఏడాది వాళ్ళిద్దరూ మనకు పాఠాలు చెప్తారు.'

తను ఇంకాస్త పొద్దున్నే లేవనందుకు బిడియపడ్డాడు అపూ.

కాస్త ఎండెక్కిన తర్వాత, స్కూలంతా తిరిగి చూడ్డానికి బయల్దేరాడు. రాత్రి అతనొచ్చేసరికే చీకటిపడడంతో నల్లటి చీకట్లో తెల్లటి ఆ భవనం ఆకారం తప్ప, ఇంకేమీ కనబడలేదు. ఐనా, రేపటి నుండి ఈ స్కూల్లో తాను కూడా ఓ భాగమవుతున్నాననే ఆలోచనే అతనికి ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగించింది. జూనియర్ స్కూల్లో చదువుకునే రోజుల్లో, హైస్కూలు పిల్లలను చూస్తే ఆశ్చర్యంగా ఉండేది తనకు. విశాలమైన గ్రౌండులో ఫుట్‌బాల్ ఆడే ఆ పిల్లలతోబాటుగా అక్కడ చదువుకోవాలన్పించేది. డబ్బున్నవాళ్ళకు తప్ప అది సాధ్యమయ్యే పనికాదు. కానీ ఇప్పుడు…తన కలలు నిజమవబోతున్నాయ్.

పది గంటలు కావొస్తుండగా హాస్టల్ వార్డెన్ బిధుబాబు అతన్ని పిలిచి, సమీర్ గదిలోనే ఉండమని చెప్పాడు.

పదిన్నరకు క్లాసులు మొదలయ్యాయి. దడదడలాడే గుండెలతో లోపలికి అడుగు పెట్టాడు అపూ. విశాలమైన గదిలో కుర్చీలు, బల్లలూ వరసల్లో పేర్చి ఉన్నాయి. టీచరుగారు గదిలోకి రాగానే పిల్లలందరూ లేచి నిలబడ్డారు. ఇది అపూకి కొత్త విషయం. పాత బడిలో  అయితే, ఇన్‌స్పెక్టర్‌గారొచ్చినప్పుడే లేచి నిలబడేవారు.

కిటికీలోంచి పక్కనున్న క్లాస్‌రూమ్ కనబడుతోంది. ట్రౌజర్ మీద జాకెట్ తొడుక్కుని, ముక్కుమీదికి జారుతున్న కళ్ళజోడులోంచి చూస్తూ పాఠం చెప్తున్నాడు ఆ తరగతిలో టీచర్. తెలుపు, నలుపులు కలబోసిన ఆయన గడ్డం ఛాతీని తాకుతోంది. “ఎవరాయన?” పక్కనున్న పిల్లవాడి చెవిలో గుసగుసలాడాడు అపూ.

“మన హెడ్మాస్టర్ గారు, మిస్టర్ దత్తా. ఆయన క్రిస్టియన్, ఇంగ్లీష్ చక్కగా చెప్తారు.”

దత్తాగారు తన క్లాసుకు రారని తెలిసి నిరుత్సాహపడ్డాడు అపూ. క్లాసురూమ్ పక్కనే లైబ్రరీ ఉంది. పాత పుస్తకాలూ, నాఫ్తలీన్ ఉండలూ కలిసిన వాసన ఇక్కడిదాకా వస్తోంది.

క్లాసు అయిపోగానే గంట మోగింది. ఎంత చక్కగా మోగుతోందీ గంట! అసలైన గంట ఇలాగే ఉండాలి. పాత బళ్ళో పల్చటి ఇనపరేకునే గంటగా వాడేవాళ్ళని గుర్తుచేసుకున్నాడు  అపూ.

క్లాసులు పూర్తవగానే పిల్లలందరూ బిలబిల్లాడుతూ ఆటస్థలంలోకి పరుగుదీశారు. సమీర్, నోనీ అనే మరో పిల్లవాడూ కలిసి అపూకి మరికొందరు పిల్లల్ని పరిచయం చేశారు. నోనీ తన క్రికెట్ బ్యాట్‌ను అపూ చేతికిచ్చి, ఎలా ఆడాలో నేర్పించాడు.

హాస్టలుకెళ్ళాల్సిన టైమయింది. పిల్లలందరూ వెళ్ళిపోయారు. గ్రౌండ్‌లో ఒక పక్కగా ఉన్న బాదంచెట్టు కిందికి వెళ్ళి కూర్చున్నాడు అపూ. అమ్మనొదిలిపెట్టి, ఇంటికి దూరంగా గడిపిన మొట్టమొదటిరోజు ఇది. తన జీవితంలో ఇదొక మరపురాని రోజు. అతని ఆలోచనల్లో ఏవేవో స్మృతులు కదలాడాయి.

గదిలోకి వెళ్ళగానే టేబుల్ లాంప్ వెలిగించి, చదువుకోటానికి కూర్చున్నాడు సమీర్. దిగులు కమ్మిన మనసుతో పడుకున్నాడు అపూ. "అపూ, హోంవర్క్ చెయ్యవూ?" అడిగాడు సమీర్, కాసేపు చూసి.

"చేస్తా, వస్తున్నాను"

"సరే, నీ లైట్ వెలిగించిపెట్టు. వార్డెన్‌గారొస్తే చీవాట్లు పడతాయ్."

అపూ లేచి, తన టేబుల్ లాంప్ వెలిగించగానే వచ్చాడు బిధుబాబు. "ఎలా ఉన్నావోయ్, అపూర్వా? పుస్తకాలన్నీ కొనుక్కున్నావా? జామెట్రీ బుక్ కొనాలా, స్టోరులో దొరుకుతుందిలే." అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

ఆయన వెళ్ళగానే మళ్ళీ పక్కమీదికి చేరాడు అపూ. అతనికేసి చూసిన సమీర్, పుస్తకాలు మూసేసి వచ్చి కూర్చున్నాడు. "ఇల్లు గుర్తొస్తోందా? ఎవరుంటారు మీ ఇంట్లో? అమ్మ ఒక్కతేనా? ఆమెక్కూడా దిగులుగానే ఉంటుంది."

రాత్రి భోజనానికి గంటమోగగానే ఇద్దరూ భోజనానికి వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు వాళ్ళతోబాటుగా మరికొందరు పిల్లలు కూడా గదిలోకొచ్చారు. బిధుబాబు తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. ఈ డిసెంబర్ చలిలో ఆయనిక లేచిరాడని పిల్లలందరికీ తెలుసు.

నృపేన్, శిశిర్, సమీర్ కలిసి పేకాట మొదలెట్టారు. అపూని కూడా ఆహ్వానించాడు సమీర్.

అపూ ఒప్పుకున్నాడు. కానీ తన పేకాట పరిజ్ఞానం ఇక్కడ చాలదని కాసేపట్లోనే అర్థమయింది. ఎప్పుడో నిశ్చిందిపురంలో ఉన్న రోజుల్లో అమ్మతో, అక్కతో ఆడేవాడు.

"మీరు ఆడండి, నేను చూస్తాను" అంటూ ముక్కలు పక్కనపెట్టాడు. దాదాపు పదకొండయ్యాక ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. వాళ్ళలో ఓ కుర్రాడు పేకాడకుండా ఇంతసేపూ మౌనంగా కూర్చుని ఉన్నాడు. అతనికి పద్నాలుగేళ్ళకన్నా ఎక్కువుండవు. అపూకి ఆ కుర్రవాడి మీద ఏదో ఇష్టం ఏర్పడింది.

మర్నాడు శనివారం. చాలామంది పిల్లలు ఇళ్ళకు వెళ్ళిపోయారు. అమ్మను చూడాలన్పించినా, ప్రయాణానికి డబ్బులు చాలవని గుర్తొచ్చి ఊరుకున్నాడు అపూ. సమీర్ కూడా ఇంటికి వెళ్ళాడు. ఒంటరిగా గదిలో కూర్చుని, లెక్కల పుస్తకం తీశాడు అపూ. ఈ అల్జీబ్రాను చూస్తే అతనికి మహా భయం. ఇంతలో గది తలుపు తోసుకుని ఓ అబ్బాయి లోపలికొచ్చాడు. రాత్రి మౌనంగా కూర్చున్న ఆ పిల్లాడే!

"రా, కూర్చో" అంటూ ఆహ్వానించాడు అపూ.

"నా పేరు దేవవ్రత బసు. దేవూ అని పిలుస్తారు అందరూ." అని పరిచయం చేసుకున్నాడతను. 'నాక్కూడా ఇంటికెళ్ళాలనుంది అపూర్వదా! కిందటివారం వెళ్ళాను కాబట్టి ఈసారి పంపమన్నారు వార్డెన్‌గారు. అన్యాయం కదా!"

ఔనని ఒప్పుకున్నాడు అపూ. కబుర్లు మొదలెట్టాడు దేవూ. వాళ్ళ ఊరు దివాన్‌పూర్‌కు పన్నెండు మైళ్ళ దూరం. రైల్లో వెళ్ళాలట. ఇంట్లో వాళ్ళందరినీ చూడాల నుంది. కానీ, వార్డెన్ పంపకపోవటంతో బెంగపడిపోతున్నాడు దేవూ. "వచ్చేవారం పంపక పోతే చూడు, హెడ్మాస్టర్ గారినే అడిగేస్తా" అని చెప్తున్న దేవూ, ఉన్నట్టుండి లేచి నిలబడ్డాడు. "దాన్ని చూశావా? సమీర్ చెప్పాడా దాని సంగతి?" అన్నాడు ఎదురుగా కనబడుతున్న పెద్ద కిటికీని చూపుతూ. దానికింది భాగానున్న రెండు ఊచలను ఊడదీసి మళ్ళీ పెట్టి చూపాడు దేవూ. వాటినీ తీసేసినప్పుడు ఓ పిల్లవాడు సులభంగా దూరి వెళ్ళేంత ఖాళీ ఏర్పడుతోంది. "సమీర్‌కూ, గణేష్‌కూ తప్ప ఎవరికీ తెలీదు, ఎవరికీ చెప్పకేం!" బతిమాలాడు దేవూ.

భోజనాల గంట మోగింది. అన్నం తినబోయేముందు ఓ చిన్న కాగితం ముక్కను దేవూకి చూపిస్తూ, 'దీని అర్థమేమిటో తెలుసా?"అని అడిగాడు అపూ. దానిమీద 'లిటరేటర్' అనే అక్షరాలు పెద్ద అచ్చులో ఉన్నాయి. "నాకూ తెలీదు, సీనియర్లను అడుగుదాం' అంటూ మణిమోహన్ అనే అబ్బాయికి దాన్ని చూపాడు దేవూ.

పుస్తకాలూ, రచనలు చెయ్యటమూ అని అర్థం...సాహిత్యం అనేమాట విన్నావా?" అని వివరించాడు మణిమోహన్.

"అది మాక్ మిలన్ కంపెనీ వాళ్ళ ప్రకటనలాగుంది. నీకెక్కడ దొరికింది?"

"లైబ్రరీ వెలుపల. గాలికి ఎగిరి వచ్చిందేమో, నాఫ్తలీన్ వాసనేస్తోంది. ఆ వాసనంటే నాకిష్టం." నవ్వుతూ ఆ కాగితం ముక్కను జాగ్రత్తగా తీసుకున్నాడు.

క్రమంగా కొత్త పరిసరాలకు అలవాటుపడుతున్నాడు అపూ. ఆ రోజు ఇంగ్లీష్ క్లాసులో ఓ తమాషా జరిగింది. ఇంగ్లీష్ టీచర్ సత్యేన్ బాబు, కొన్ని బెంగాలీ వాక్యాలనిచ్చి, ఇంగ్లీష్‌లోకి అనువాదం చెయ్యమన్నాడు. సరిగ్గా అదే సమయంలో హెడ్మాస్టర్‌గారు ఆ తరగతిలోకొచ్చారు. అపూకి ఆయనంటే గొప్ప ఆరాధన.

సత్యేన్‌బాబు బల్లమీదున్న ఓ పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నారు హెడ్మాస్టర్‌గారు. 'ఈ పుస్తకం మీద విక్టర్ హ్యూగో అనే పేరుంది చూశారా? ఎవరా హ్యూగో? ఎవరన్నా చెప్పగలరా?"

తరగతంతా నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆ పిల్లలందరూ బెంగాల్లోని చిన్న ఊళ్ళలోని సాధారణ కుటుంబాల నుండి వచ్చినవాళ్ళే. విక్టర్ హ్యూగో గురించి వాళ్ళకేం తెలుస్తుంది?

ఆ పేరెక్కడో విన్నట్టుగా అస్పష్టంగా గుర్తొస్తోంది అపూకి. ఆ స్మృతి శకలాలను ఏరుకుని జవాబు చెప్పటం సాధ్యంకావటం లేదతనికి. హెడ్మాస్టర్ వెళ్ళబోతుండగా... ఓ పాత పత్రికలో చదివిన వాక్యాలు అపూ కళ్ళముందు కదిలాయి. నిశ్చిందిపూర్‌లో

ఉన్నప్పుడు 'వంగభాషి' అనే పత్రిక చూస్తూండేవాడు. దానిలో 'లెటర్స్ ఫ్రమ్ ఇంగ్లాండ్' అనే శీర్షిక ఉండేది. "హ్యూగో ఓ రచయిత. చాలా పేరున్న ఫ్రెంచి రచయిత. పారిస్‌లోని ఒక వీధిలో ఆయన విగ్రహం కూడా ఉంది" అన్నాడు అపూ గబగబా.

ఈ తరగతి పిల్లల్లోంచి సరైన జవాబు వస్తుందని హెడ్మాస్టర్ అనుకోలేదసలు. ఆయన తనకేసి అలా చూస్తుంటే అపూ సిగ్గుపడ్డాడు.

"రైట్!" అన్నారు మిస్టర్ దత్తా. 'ఐతే ఆ విగ్రహం ఉన్నది వీధిలో కాదు, పార్కులో" ఆయన క్లాసులోంచి వెళ్ళిపోయారు.

అపూని చూసి ఎంతో సంతోషపడ్డాడు సత్యేన్‌బాబు. ఆ సాయంత్రం తన గదికి తీసుకెళ్ళాడు. "ఇంగ్లీష్ గ్రామర్ శ్రద్ధగా నేర్చుకోవాలయ్యా. కంగారేం లేదులే, ఏమేం చదవాలో నేను చెప్తాగా" అని ధైర్యం చెప్పాడు.

అపూ బిడియం కాస్త తగ్గింది. "ఆ పుస్తకాలన్నీ మీవేనాండీ?" అడిగాడు గాజు బీరువాలో ఉన్న పుస్తకాలకేసి చూస్తూ.

బీరువా తెరిచి, వాటినన్నిటినీ చూపాడాయన. ఒక పుస్తకాన్ని తీసి ఇస్తూ, "ఇదొక చారిత్రక గాథ. చదివి చూడు" అన్నాడు.

మిగతా పుస్తకాలను కూడా చూడాలన్పించినా, మొహమాటపడ్డాడు అపూ.

❖ ❖ ❖ ❖

మూడు నెలలు గడిచేసరికి హాస్టలు పిల్లలందరితోనూ స్నేహం చేసుకున్నాడు అపూ. నిజానికి, పిల్లలందరూ అపూతో స్నేహం చెయ్యటానికి పోటీపడసాగారు. అతనికి ఇది కాస్త ఇబ్బంది అన్పించింది. ఓ రోజు భోజనాల సమయంలో రమాపతి అనే సీనియర్ కుర్రాడు అతని దగ్గరున్న నిమ్మకాయ ఊరగాయను తన కంచంలో వేసినప్పుడు మాత్రం అపూ నిజంగానే కాస్త గర్వపడ్డాడు. ఎందుకంటే రమాపతి చాలా తెలివయిన విద్యార్థిగా పేరుంది. 'నేను అందరిలాంటివాణ్ని కాదని ఈ అబ్బాయికి అర్థమయింది' అనుకున్నాడు మనసులో.

స్కూలు లైబ్రరీలోంచి పుస్తకాలు తెచ్చుకుని చదవటం మొదలెట్టాడు. ఆదివారం మధ్యాహ్నాలలో స్కూలు ఆవరణలోని మందార గుబురు కింద కూర్చుని చదువుకోవటం అతనికి ఇష్టంగా మారింది. ఇంగ్లీష్‌లో ఉన్న పుస్తకాలను అర్థంచేసుకోవటం ఇబ్బందిగా ఉంటోంది. ఐనా వాటిమీద ఆకర్షణ పెరుగుతోందతనికి.

ఒకరోజు హెడ్మాస్టర్ నుండి పిలుపు వచ్చింది అపూకి. ఆఫీసు గదిలో ఎవరో ఓ పెద్దమనిషి కూర్చుని ఉన్నాడు.

"నీ పేరేమిటి?" అని అడిగాడాయన. అపూ భయపడుతూనే జవాబిచ్చాడు. ఆయన ఓ ఇంగ్లీష్ పుస్తకాన్ని అపూ చేతికిస్తూ, "దీన్ని లైబ్రరీ నుంచి తీసుకున్నావా?" అని అడిగాడు.

"ఔను" అన్నాడు అపూ.

"ఔను సర్, అనాలి" కసిరాడు హెడ్మాస్టర్.

"సా...సారీ సర్. ఎస్ సర్!"

"స్లెడ్జ్ అంటే ఏమిటి?"

"కుక్కల చేత లాగించే ఓ రకమైన బండి సర్!" మంచు నేలమీద స్లెడ్జి బండిని ఎలా ఉపయోగిస్తారో వివరించాలనుకున్నాడు గానీ, సరైన ఇంగ్లీష్ పదాలు గుర్తురావటం లేదు.

"స్లెడ్జి బండికీ, మిగతా వాహనాలకూ తేడా ఏమిటి?"

"ఎ స్లెడ్జ్"...అంటూ వాక్యాన్ని మొదలెట్టగానే, ఎస్లెడ్జ్ అనాలా, దిస్లెడ్జ్ అనాలా అనే సందేహం మొదలైంది. బహువచనాన్ని ఉపయోగిస్తే సరిపోతుందన్న ఆలోచన రాగానే, "స్లెడ్జి బండ్లకు చక్రాలుండవు సర్" అని జవాబు చెప్పాడు.

ఇంకా కొన్ని ప్రశ్నలు అడిగి అపూని పంపేశాడాయన. ఆ గది దాటి వెళ్తుండగా, "ఈ వయసులో ఇంత చురుకుదనం అరుదండీ. కుర్రాడు కూడా ముచ్చటగా ఉన్నాడు" అని హెడ్మాస్టరుతో ఆ పెద్దాయన అంటున్న మాటలు అపూ చెవినబడ్డాయి. వచ్చిన వ్యక్తి సీనియర్ ఇన్స్పెక్టరని తర్వాత తెలిసింది.

గదికి తిరిగివచ్చేసరికి, సమీర్ టేబుల్ మీదికి తలవాల్చి కూర్చుని ఉన్నాడు దేవూ.

"అరె, ఏం చేస్తున్నావ్ దేవూ! ఈ వారం కూడా ఇంటికెళ్ళలేదూ?"

"ఆ వార్డెన్‌గాడు పంపితేగా, ప్రతివారం వెళ్ళటానికి వీల్లేదట."

దేవూ మీద జాలేసింది అపూకి. దేవూ ఇంకా చిన్నపిల్లాడే. అతని విషయంలో వార్డెన్ ఎందుకింత కఠినంగా ఉంటున్నాడో!

సాయంత్రం కావస్తుండగా అన్నాడు దేవూ, "నేనివాళ ఇంటికి వెళ్ళిపోతాను. ఎవరికీ చెప్పవుగా అపూర్వదా!"

"ఇప్పుడా? మీ ఊరికిప్పుడు రైలు లేదుగా?"

"ఫరవాలేదు. ఎంత దూరమని, పదకొండు మైళ్ళేగా! కాసేపయితే వెన్నెల కూడా వచ్చేస్తుందిలే!"

"పదకొండు మైళ్ళ దూరం ఇదివరకెప్పుడైనా నడిచావా దేవూ? ఎవరయినా చూస్తే ఎలా? అంతగా వెళ్ళాల్సిందేననుకుంటే ఒక్కడివీ వద్దు. నేనొచ్చి దిగబెడతా" అన్నాడు అపూ.

"ఒద్దొద్దు. నువ్వు కూడా కనబడకపోతే అనుమానపడతారు" అని వారించాడు దేవూ. చివరికి అతనొక్కడే బయల్దేరాడు.

మర్నాడు ఆదివారం. మధ్యాహ్నం భోజనాల సమయంలో దేవూ లేకపోవటాన్ని ఎవరన్నా గమనించారేమో తెలీదు. ఆ సాయంత్రం సమీర్ రాగానే విషయం చెప్పాడు అపూ. దేవూ ఎలా తిరిగొస్తాడా అని ఇద్దరికీ కంగారు మొదలైంది.

మర్నాడు పొద్దున్నే అపూ నిద్రలేచేసరికి సమీర్ మంచం మీద నిద్రపోతున్నాడు దేవూ. అర్ధరాత్రి దాటాక దేవూ వచ్చాడనీ, కిటికీ ఊచలు తొలగించి తానే అతన్ని లోపలికి దించాననీ చెప్పాడు సమీర్.

అమ్మను చూసి కొన్ని నెలలయిపోయిందని చటుక్కున గుర్తొచ్చింది అపూకి. మన్‌సాపోతా వెళ్ళాలంటే రైళ్ళులేవు. కొంతదూరం నడిచి, ఆ తర్వాత పడవలో వెళ్ళాలి. వెళ్ళిరావటానికి రూపాయిన్నర కావాలి. మరి, తన దగ్గరున్నదంతా కలిపి అర్ధరూపాయి దాటదు.

దేవూ చేసిన పని హెడ్మాస్టర్‌కు తెలిసిపోయింది. రమాపతి, మరికొందరు సీనియర్ విద్యార్థులూ వెళ్ళి బతిమాలినా లాభంలేకపోయింది. ఆ మధ్యాహ్నం పిల్లలందరినీ స్కూలు హాల్లోకి పిలిపించాడు హెడ్మాస్టర్. బలికి సిద్ధంచేసిన గొర్రెపిల్లలా వచ్చాడు దేవూ. ఇది మొదటి తప్పు కాబట్టి దెబ్బలతో సరిపెడుతున్నాననీ, ఇంకోసారి ఇలా చేస్తే స్కూల్లోంచి పంపేస్తానని హెచ్చరిస్తూ, బెత్తంతో దేవూని ఛెళ్ళున కొట్టాడు హెడ్మాస్టర్.

రెండో దెబ్బ పడబోతుండగా కెవ్వుమన్నాడు దేవూ. వెక్కి వెక్కి ఏడుస్తూ వరండాలోకి వెళ్ళిపోయాడు. లీలా వాళ్ళింట్లో ఉన్నరోజుల్లో తాను చెయ్యని తప్పుకు రాయ్ చౌధురి చేతుల్లో దెబ్బలు తినటం గుర్తొచ్చింది అపూకి.

❖ ❖ ❖ ❖

సరస్వతీ పూజకని చందాలు వసూలు చేస్తున్నారు విద్యార్థులు. అపూ వంతుకు ఎనిమిదణాలు ఇవ్వాలన్నారు. అతను గతుక్కుమన్నాడు. తన దగ్గర ఉన్నదే ఎనిమిదణాలు. ఐనా తప్పదనుకుంటూ ఆ డబ్బులు వాళ్ళ చేతుల్లో పెట్టాడు.

'నీ దగ్గర లేనప్పుడు ఊరుకోవచ్చుగా అపూర్వా? కాస్త జాగ్రత్తగా ఉండడం నేర్చుకోవాలి' అన్నాడు సమీర్. అతని సలహాను తేలిగ్గా తీసుకుని నవ్వేశాడు అపూ.

'నేనేమీ హాస్యాలాడటంలేదు. నువ్విలా డబ్బులు వృధాచెయ్యటం చూస్తూనే ఉన్నా. నోనీ, రాస్ బిహారీ వాళ్ళందరికీ చిరుతిళ్ళు కొనిపెడుతున్నావ్, వాళ్ళేమో నువ్వొత్తి తెలివి తక్కువ దద్దమ్మవని నీ వెనక నవ్వుకుంటున్నారు?

ఆ మాటల్ని అపూ నమ్మలేదు. కానీ సమీర్ చెప్పింది నిజమే. తనకు తానుగా డబ్బులు ఖర్చుచెయ్యగలగటం అపూ జీవితంలో అదే మొదటిసారి. ప్రతి నెలా స్కాలర్‌షిప్ డబ్బు చేతికిరాగానే తానొక రాజాగా మారిపోయినట్టనిపించేది. హాస్టలు ఖర్చులుపోను చేతిలో డబ్బులు మిగులుతున్నాయి. ఖరీదయిన పెన్నులూ, నోట్‌బుక్కూ కొనటంతోబాటు

స్నేహితులకు చిరుతిళ్ళు కొనిపెట్టసాగాడు. అతని తెలితేటల్ని పొగిడితే చాలు, పొంగిపోయి వాళ్ళు ఏమడిగినా కొనిచ్చేవాడు.

ఒంటరిగా కూర్చున్న సమయాల్లో నిశ్చిందిపురం జ్ఞాపకాలు అపూని వెన్నాడేవి. తన చిన్నతనంలో ఓ రోజున, తమ ఇంటిముందు కిచకిచలాడుతున్న చిన్నపిట్టను రాయితో గురిచూసి కొట్టాడు. సరిగ్గా దాని మెడకు తగిలిందారాయి. విలవిల్లాడుతూ పక్షి నేల కూలింది. దుర్గ పరిగెత్తుకొచ్చి దాన్ని చేతుల్లోకి తీసుకుంది. పిట్ట నోట్లోంచి కారిన రక్తం ఆమె వేళ్ళకంటింది. 'పాపం, చిన్నపిట్ట! ఎందుకు చంపావురా దీన్ని?' అంటూ కేకలేసింది.

"నది ఒడ్డున దహనం చేస్తేనే, దాని ఆత్మకు శాంతి కలుగుతుంది" అంటూ అపూని వెంటబెట్టుకుని నది దగ్గరికి వెళ్ళింది దుర్గ. ఇద్దరూ కలిసి ఎండుటాకులూ, చితుకులూ పోగుచేసి పక్షిని దహనం చేశారు.

ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు చెయ్యనని తమ్ముడి చేత ప్రమాణం చేయించింది దుర్గ. చేతులు జోడించి భగవంతుణ్ణి ప్రార్థించింది. ఆ పక్షి ఆత్మ విముక్తి చెందిందా? అది తమను క్షమించి, దీవించి ఉంటుందా? ఏమో!

"అపూర్వదా! ఏమిటలా కూర్చున్నావ్?" అంటూ దేవూ రావటంతో నిశ్చిందిపురం జ్ఞాపకాల్లోంచి బయటపడ్డాడు అపూ.

"రాస్ బిహారీ వాళ్ళదగ్గరికి వెళ్దాం పద" అని లేవబోతున్న అపూను వారించాడు దేవూ.

"వాళ్ళతో స్నేహం చెయ్యొద్దు అపూర్వదా! వాళ్ళందరూ నిన్ను ఎగతాళి చేస్తున్నారు. నీ నోట్‌బుక్‌లో పిచ్చిరాతలు రాస్తుంటావట. నువ్వు పిచ్చివాడివనీ, అందుకే వాళ్ళందరికీ మిఠాయిలు కొనిపెడుతుంటావనీ నవ్వుకుంటున్నారు."

కోపంగా, అవమానంగా అన్పించింది అపూకి. తను ఏం రాసుకుంటే వాళ్ళ కెందుకు? ఆ నోట్‌బుక్ అపూకి ప్రాణప్రదమైనది. వాళ్ళ ఊరి నుండి వచ్చేసిన తరవాత అపూ మనసెందుకో అశాంతిగా ఉండేది. అక్కడి విశాలమైన పచ్చిక బయళ్ళూ, సాయం సంధ్యలో అరుణిమను దాల్చిన ఆకాశమూ, నవవధువు ముక్కెరలో రవ్వల్లా మెరిసే తెల్లని చిన్ని పువ్వులూ, అవన్నీ గుర్తొచ్చి కలతపెట్టేవి. దివాన్‌పూర్‌లో అతనికి ఊపిరాడనట్టుగా తోచేది. ఆ ఊహలన్నిటినీ పుస్తకంలో రాసుకోవటం గొప్ప ఊరట. తన హాస్టల్ గదిలోంచి కదలకుండానే నదీతీరంలోకీ, పచ్చిక మైదానాల్లోకీ వెళ్ళిపోతుంటాడు అపూ, ఆ రాతల ద్వారా.

# 4

చలికాలం పక్కకు జరుగుతూ వసంతాన్ని ఆహ్వానిస్తోంది. స్కూలు ఆవరణలోని వృక్షాల ఆకురాల్చిన కొమ్మలు కొత్త చివుళ్ళను తొడుక్కుంటున్నాయ్. క్రికెట్ మైదానం పక్కనున్న బాదంచెట్టు ఎర్రని చిగుళ్ళు ఉదయ సూర్యకాంతిలో మెరిసిపోతున్నాయి.

దివాన్‌పూర్ దగ్గరలోని గ్రామంలో ప్రతి వసంత రుతువులోనూ ఉత్సవం జరుపుతారు. రాస్ బిహారీ వాళ్ళందరూ వార్డెన్ అనుమతి తీసుకుని ఆ గ్రామానికి బయల్దేరారు. వాళ్ళమీద తన కోపాన్ని పక్కనపెట్టి అపూ కూడా వాళ్ళతో చేరాడు. నిశ్చిందిపూర్ నుండి వచ్చేశాక అతనికి ఇలాంటి అవకాశం రానేలేదు.

పొలాల మధ్యనున్న సన్నని బాటల్లోంచి నడుస్తుంటే జైల్లోంచి బయటపడినట్టుగా ఉంది అపూ మనసుకు. దారిలో కనబడే చిన్న చిన్న ఊళ్ళనూ, వాటిలో కుండలు చేస్తున్న కుమ్మరులనూ, చిల్లర దుకాణాల వాళ్ళనూ చూస్తుంటే సంతోషంగా ఉంది – ఇదే తను కోల్పోయిన జీవితం. కొన్నిసార్లు ఆనందంతో, మరికొన్నిసార్లు విషాదంతో నిరంతర ప్రవాహంలా సాగిపోతుంది ఈ జీవితం.

ఒకచోట కొంతమంది కలిసి, పెద్ద బానలో ఉన్న చెరుకురసాన్ని పొయ్యిమీద పెట్టి కలుపుతున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడిపోయాడు అపూ. 'ఏముందక్కడ చూట్టానికి? వచ్చెయ్!' అని అరిచాడు నోనీ. అపూ కాస్త సిగ్గుపడ్డాడు. ఐనా, "కాస్సేపాగుదాం. ఇలాంటి వాళ్ళకు బోలెడన్ని కథలు వచ్చుంటాయి, చెప్పమందాం." అని బతిమాలాడు. కానీ, ఆ పల్లెటూరి మనుషుల మీద ఆ పిల్లలకేమీ ఆసక్తి కలగలేదు. అపూని వదిలేసి ముందుకు సాగిపోయారు.

ఆ గ్రామీణులు అపూను ఆదరంగా ఆహ్వానించారు. మట్టి ముంతలో తాజా చెరుకు రసం ఇచ్చారు. బెల్లం వండటాన్ని ఆసక్తిగా చూస్తూ గంటసేపు అక్కడే ఉండిపోయాడు అపూ.

జాతర జరిగే చోటికి చేరుకునేసరికి పన్నెండయింది. తన మిత్రులెక్కడున్నారో జాడలేదు. తన దగ్గరున్న చిల్లర డబ్బులుపెట్టి, ఏవో కొనుక్కుని తిన్నాడు.

మిఠాయి పాన్, లెమనేడ్ – రకరకాల వస్తువులు అమ్ముతున్నారు. ఒకచోట ఏదో ప్రదర్శన జరుగుతోంది. ఒకదానిలోకి తొంగిచూడబోయిన అపూను గేటుదగ్గరున్న మనిషి అడ్డుకున్నాడు. 'నా దగ్గర రెండు పైసలున్నాయి, లోపలికి వెళ్ళొచ్చా?" అడిగాడు అపూ. కానీ అప్పటికే ప్రదర్శన మొదలయిపోవటంతో వెనుదిరగాల్సొచ్చింది.

అలా తిరుగుతూ ఉండగా ఒక పుస్తకాల దుకాణం కనబడింది. విరిగిన కళ్ళజోడు పెట్టుకున్న ఓ వృద్ధుడు, నేలమీద గోనెపట్టాలు పరిచి వాటిమీద పుస్తకాలు పెట్టి

అమ్ముతున్నాడు. "అరేబియన్‌నైట్స్" పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు అపూ. దాని ఖరీదు ఎనిమిదణాలు. పుస్తకాన్ని వెనక్కి ఇచ్చేశాడు.

తనకు ఎదురైన ఒక కుర్రాణ్ణి చూసి ఆశ్చర్యంతో ఆగిపోయాడు నిశ్చిందిపురంలో తన చిన్నప్పటి మిత్రుడు పోతూ! అతను కూడా అపూను గుర్తుపట్టాడు. "అపూదా! నిజంగా నువ్వేనా! ఏం చేస్తున్నావిక్కడ?" అంటూ ఆశ్చర్యపోయాడు.

నిశ్చిందిపురం నుండి వెళ్ళినప్పటి నుండీ జరిగిందంతా చెప్పాడు అపూ. ఊళ్ళో వాళ్ళందరిని గురించీ ప్రశ్నలు వేశాడు.

కానీ, పోతూ కూడా ఆ గ్రామంనుండి వెళ్ళిపోయి చాలా కాలమయిందట. వేరే ఊళ్ళో, అక్కయ్య దగ్గరుండి చదువుకుంటున్నాడు.

"రాణూదీ నన్నెప్పుడయినా గుర్తుచేసుకునేదా?" అడిగాడు అపూ. ఆమె సరిగ్గా దుర్గ వయసుదే. అపూని ఎంతో ప్రేమగా చూసుకునేది.

అపూ వాళ్ళు కాశీలో ఉంటున్నారని తెలిసి, రాణూ ఎన్నోసార్లు వాళ్ళ అడ్రస్ అడిగిందనీ, అపూని ఎప్పుడూ తలచుకునేదనీ చెప్పాడు పోతూ.

అపూ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బాల్యమిత్రులెవరూ తనను మర్చిపోలేదని తెలియటం ఎంత బావుంది! ఎంత చక్కటి రోజులవి!

తన జీవితమంతా ఓ కలలా తోస్తుంటుంది అపూకి కొన్నిసార్లు. నిశ్చిందిపురంలోని తమ ఇంట్లో ఓ మధ్యాహ్నం పడుకుని నిద్రపోయినట్టూ, సాయంత్రం వేళ పక్షులు గూళ్ళకు చేరే చప్పుళ్ళు వింటూ నిద్రలేచినట్టూ మధ్యలో జరిగిందంతా – కాశీకి వెళ్ళటమూ, నాన్న చనిపోవటమూ, తను హైస్కూల్లో చేరటమూ – ఆ పగటి నిద్రలో వచ్చిన ఓ కల అయినట్టూ అన్పిస్తుంది. ఇదంతా నిజంగా కలే అయితే ఎంత బావుంటుంది!

కథల్లో చదివిన ఎందరో అభాగ్యులు నిశ్చిందిపురంలో తన కలల్లోకి వస్తుండే వాళ్ళు. వంచితుడైన కర్ణుడు, వనవాసంలోని సీత, దురదృష్టవంతుడైన అశ్వత్థామ, పరాజితుడైన దుర్యోధనుడు. వాళ్ళందరి గురించీ తనలో కలిగే ఆలోచనలను వ్యక్తం చెయ్యటం ఎలాగో అతనికి తెలిసేది కాదు. కథల్లో, కవితల్లో పరిచయమైన పాత్రలందరితో ఒక ఊహా ప్రపంచాన్ని సృష్టించుకునేవాడు. అతని సృజనాత్మక హృదయం సృష్టించుకున్న లోకమది.

పోతూతో కలిసి జాతరనంతటినీ కలయదిరిగాడు అపూ. తన హాస్టలు మిత్రుల జాడ మాత్రం దొరకనే లేదు.

"ఎప్పుడన్నా మా స్కూలుకు రావొచ్చుగా పోతూ! చాలా పెద్ద స్కూలు మాది" అన్నాడు అపూ. ఓ క్షణం నిశ్శబ్దం తర్వాత మళ్ళీ, 'ఎన్నో చోట్లు తిరిగాను కానీ, నిశ్చిందిపురం లాంటి చోటు చూడలేదనుకో' అన్నాడు.

చీకటిపడుతూ ఉండగా పోతూ వాళ్ళ అక్కగారి గ్రామానికి వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖ ❖

అపూ హాస్టల్లో చేరి ఐదు నెలలయింది. ప్రతి శనివారమూ కొడుకు కోసం ఎదురు తెన్నులు చూస్తూనే వుంది సర్వజయ. ఆ రోజు పొద్దున లేవగానే అనుకుంటుంది, మధ్యాహ్నానికల్లా అపూ వచ్చేస్తాడని. మధ్యాహ్నం నుండి సాయంత్రం కోసం నిరీక్షణ. రోజులు వారాలై, నెలలుగా మారినా కొడుకు జాడలేదు.

అపూ వదిలివెళ్ళిన వస్తువుల్ని చూస్తూ, వాడి ముఖాన్ని ఊహించుకుంటుంది. వాడి రూపురేఖలు ఒక్కోసారి స్పష్టంగా కనబడవు ఆమె ఊహల్లో. వాడి కళ్ళు గుర్తొస్తే, పెదవుల తీరో, చిరునవ్వో సరిగ్గా గుర్తురాదు. అటువంటి సమయాల్లో ఆమెకు పిచ్చెత్తినట్టుగా ఉంటుంది. ఇదేమిటి, నా కన్నకొడుకునే మర్చిపోతున్నానా? అని ఆందోళన పడుతుంది.

అపూ బాగా చిన్నపిల్లవాడుగా ఉన్నప్పటి జ్ఞాపకాలు తరచుగా ఆమె కళ్ళముందు కదులుతుంటాయి. అప్పట్లో వాడు మహా అల్లరివాడు. జాడీల్లోంచి పచ్చళ్లూ, ఊరగాయలూ తీసుకుని తినేసేవాడు. ఓసారి వాడాపని చేస్తుండగా పట్టుకుంది తను. భయంతో, సిగ్గుతో ఎర్రబడిపోయిన వాడి ముఖం, నిన్ననే చూసినంత స్పష్టంగా ఉంది ఆమె జ్ఞాపకాల్లో.

మూడేళ్ళ వయసుండగా వాడొకసారి ఇంట్లోంచి ఎటో వెళ్ళిపోయాడు. చుట్టుపక్కలంతా గాలించినా వాడి జాడలేదు. హరిహరుడు వెళ్ళి జాలరివాళ్ళను తీసుకొచ్చాడు. వాళ్ళు ఇంటి వెనకున్న చెరువులో దిగి వెతుకుతూ ఉంటే సర్వజయ భయంతో వణికిపోయింది. ఇంతలో దుర్గ, ఎక్కడి నుంచో అపూని పట్టుకొచ్చింది. ఎలా వెళ్ళాడోగానీ నది ఒడ్డుదాకా వెళ్ళిపోయాట్ట వాడు. తిరిగి రావటానికి దారితోచక వెతుక్కుంటూ ఉండగా దుర్గ కంటపడ్డాడు.

"ఈ పిల్లాడు అందరిలాగా కుదురుగా బతికేరకం కాదండీ! మూడేళ్ళ పసిపిల్లలెవరయినా ఇంతపని చేస్తారా? దేశదిమ్మరిలా తయారవుతాడు చూస్తూండండి", అంది ఆ రాత్రి భర్తతో సర్వజయ.

మళ్ళీ నిశ్చిందిపురానికి వెళ్ళిపోవాలని అన్పిస్తూ ఉంటుంది సర్వజయకు. అక్కడికి వెళ్తే తన జీవితంలో మార్పు వస్తుందని గాఢంగా అన్పిస్తూ ఉంటుంది. ఆ ఊరూ, పరిసరాలూ ఏవో కథల్లో చదువుకున్న సన్నివేశాల్లా అస్పష్టంగా గుర్తొస్తాయి. నిశ్చిందిపురం ఆలోచనల్లో పడిందంటే సందె చీకట్లు ముసురుకుంటున్న సంగతి కూడా గమనించలేని స్థితికి చేరుకుంటుందామె.

తనకోసమని ఎవరు ఏ వస్తువు తెచ్చిచ్చినా అపూ వస్తాడని దాచిపెడుతుంది సర్వజయ. కుందూ వాళ్ళింట్లో పెళ్ళి జరిగిందని డబ్బానిండా మిఠాయిలు తెచ్చిచ్చారు. ఒక్కటయినా తినటానికి మనసొప్పలేదు సర్వజయకు. అవి బూజుపట్టిపోయాక డబ్బా

మొత్తం అవతల పారేసింది. పండగరోజుల్లో మిఠాయి చేసేందుకు అన్నీ సిద్ధంచేసి పెట్టుకుంటుంది...అపూ వస్తాడేమోనని. ఎదురుచూపులే తప్ప...అపూ ఎక్కడున్నాడని?

తన కొడుకు మారిపోయాడు. తలుపు చాటున దాగి తనను ఎలా భయపెట్టేవాడు? చాటుగా వచ్చి తననెలా కావలించుకునేవాడు? ఏ మూలనుంచో తొంగిచూసి ఎంత అల్లరిగా నవ్వేవాడు? వాడిప్పుడు చాలా మారిపోయాడు. ప్రతి మాటనూ ఆచితూచి మాట్లాడు తున్నాడు. ఎంతో పెద్దరికంగా నడుచుకుంటున్నాడు. ఆ పరిణతి సర్వజయకు ఏమాత్రమూ నచ్చటంలేదు.

తన చిన్నారి అపూ మళ్ళీ తనక్కావాలి; ప్రతి క్షణం తనమీద ఆధారపడే అమాయకమైన, ముద్దొచ్చే ఆ పసివాడు కావాలి. కానీ తన అపూ ఇంత తొందరగా, తన నింతగా కలవరపెట్టేట్టుగా మారిపోతాడనుకోలేదు.

సర్వజయకు ఒక్కోసారి అపూమీద కోపమొస్తుంది. వాడికోసం తనెంతగా ఎదురు చూస్తుందో, ఆశ-నిరాశల మధ్యన ఊగిసలాడుతూ ఒక్కో క్షణాన్నీ ఎంత దుర్భరంగా గడుపుతుందో వాడు మాత్రం గ్రహించలేడూ? ఇక వాడికోసం ఎదురు చూడనని నిర్ణయించుకుంటుంది. కానీ మరుక్షణంలోనే అర్థమయిపోతుంది అదెంత అసంభవమో! వాడే లేకపోతే తన జీవితానికి అర్థమేముందని?

ఆ రోజు అపూ ఆలోచనల్లో మునిగిపోయి కూచున్న సర్వజయకు వీధిలోంచి నడిచొస్తున్న ఓ యువకుడు కిటికీలోంచి కనబడ్డాడు. అతని జుట్టు నల్లగా, వొత్తుగా, నొక్కులుగా - అచ్చం అపూ జుట్టులాగే ఉంది. ఆమె గుండె వేగంగా కొట్టుకుంది. మరీ అంత ఆశ పనికిరాదని తన హృదయానికి నచ్చజెప్తోందామె.

కొద్ది క్షణాల తర్వాత ఎవరో తలుపుతట్టారు. పరిగెత్తుకెళ్ళి తలుపుతీసిన సర్వజయ, కళ్ళార్పటం మరిచిపోయి అలాగే నిలబడిపోయింది. అదే అల్లరి చిరునవ్వుతో ఎదురుగా నిలబడి ఉన్నాడు అపూ. వంగి పాదాలను తాకేలోగానే రెండు చేతులతోనూ అతన్ని చుట్టేసింది.

జాతరలో పోతూను కలిసి మాట్లాడాక ఇక అమ్మను చూడకుండా ఉండలేక పోయాడు అపూ. ఓ స్నేహితుణ్ణడిగి డబ్బులు తీసుకుని రైలెక్కాడు.

"నీ కోసం దారాలూ, సూదులూ తెచ్చాను చూడమ్మా. కాశీలో ఉన్నప్పుడు వేయించి పెట్టేదానివే, అలాంటి అప్పడాలు కూడా!" అన్నాడు తల్లి చేతికి ఓ పొట్లాన్ని అందిస్తూ.

కొడుకు మీదినుంచి కళ్ళు తిప్పుకోలేక పోతోంది సర్వజయ. అపూ తొడుక్కున్న కొత్త చొక్కా అతనికి మరింత అందాన్నిస్తోంది. "ఈ చొక్కా చాలా బావుంది అపూ, ఎప్పుడు కొనుక్కున్నావ్?" అడిగింది. అమ్మ తన కొత్త చొక్కా అందాన్ని గుర్తించినందుకు సంతోషం వేసింది అపూకి.

రాత్రి వంటకు ఏర్పాట్లలో మునిగిపోయింది సర్వజయ. వంటింట్లో అమ్మ పక్కనే కూర్చుని తన కొత్త స్కూలు కబుర్లు చెప్తున్నాడు అపూ. ఇదంతా కలకాదు గదా, అన్పిస్తోందామెకి.

మరునాడు సాయంత్రమవుతుండగా హాస్టలుకు బయల్దేరాడు అపూ.

## 5

రెండేళ్ళు గడిచాయి. అపూకి వచ్చే స్కాలర్‌షిప్ డబ్బు హాస్టల్ ఖర్చులకు సరిపోవటం లేదు. మెస్‌లో భోజనానికి డబ్బుచాలక, చాలాసార్లు మరమరాలు తిని సరిపుచ్చుకోవాల్సి వస్తోంది. బట్టలు కూడా తనే ఉతుక్కుంటున్నాడు.

ఇంటికి వెళ్ళటం అరుదుగానే అయినా – వెళ్ళినప్పుడల్లా తిరుగు ప్రయాణానికి అమ్మను డబ్బులు అడగాల్సొస్తోంది. సర్వజయక్కూడా అది ఇబ్బందిగానే ఉంటోంది.

ఈ సమస్యకు తోడు, రెండు నెలలకోసారయినా పోతూ వస్తున్నాడు. అతని తల్లి దండ్రులు చనిపోవటంతో అక్కయ్య దగ్గర ఉంటున్నాడు. ఇది బావగారికి ఇష్టంలేదు. అతడు తిట్టినప్పుడల్లా అపూ దగ్గరకి వచ్చేస్తాడు పోతూ. అతనికి సాయం చెయ్యక తప్పటం లేదు.

అపూకి పుస్తకాలమీద ఆసక్తి నానాటికీ పెరుగుతోంది. అదృష్టవశాత్తూ, డబ్బుతో అవసరం లేకుండానే లైబ్రరీలో చదువుకునే వీలుంది.

డిసెంబర్ నెలలో అపూ పరిస్థితులు కాస్త చక్కబడ్డాయి. కొత్తగా వచ్చిన డిప్యూటీ మేజిస్ట్రేటుగారి కొడుకులిద్దరికి ట్యూషన్ మాస్టారు కావాల్సొచ్చింది. భోజనమూ, వసతి వాళ్ళే ఏర్పాటు చేస్తామంటున్నారు. హెడ్మాస్టరుకు ఈ విషయం తెలిసి అపూ గురించి వాళ్ళతో చెప్పాడు.

కొద్ది రోజుల్లోనే అపూ మకాం డిప్యూటీ మేజిస్ట్రేటుగారింటికి మారింది. వాళ్ళ ముందు గదిలో కొంత భాగాన్ని అపూ కోసం కేటాయించారు. అక్కడ తన వస్తువులన్నీ సర్దుకున్నాడు. కాసేపట్లో వంటాయనొచ్చి భోజనం సిద్ధంగా ఉందని చెప్పాడు. భోజనం చేస్తుండగా మేజిస్ట్రేటు గారి భార్య వచ్చి అతని వివరాలన్నీ వాకబు చేసింది. సర్వజయకన్నా చిన్నదే అయియుంటుందామె. చక్కగా, అందగా ఉంది.

మర్నాడు ఉదయం దాదాపు పదమూడేళ్ళ వయస్సున్న ఓ అమ్మాయి, ఆమెకన్నా చిన్నవాడైన కుర్రాణ్ణి వెంటబెట్టుకుని అపూ గదికి వచ్చింది. వాళ్ళమ్మలాగే అందంగా ఉందాపిల్ల. వాళ్ళతో ఏం మాట్లాడాలో తోచని అపూ, స్కూలుకు వెళ్ళడానికి తయారవ సాగాడు. అపూకేసి ఆసక్తిగా చూస్తూ అలాగే నిలబడ్డారు వాళ్ళు. ఆ అమ్మాయిని ఆకట్టుకునే పనేదయినా చెయ్యాలన్న ఆలోచన మెదిలింది అపూ బుర్రలో – ఎందుకో అతనికే తెలీదు.

తన జామెట్రీ బాక్సు మూతతీసి మంచం మీద పెట్టాడు. ఒక్కో వస్తువునూ బయటికి తీసి, మళ్ళీ బాక్సులో సర్దుకున్నాడు. ఈ చిన్న చర్యతోనే, తానొక పురుషుడినన్న భావమేదో కలిగింది అతనిలో. ఆ అమ్మాయి అలాగే కళ్ళప్పగించి చూస్తోంది.

సాయంత్రం అపూ స్కూలు నుండి వచ్చిన కాసేపటికి ఆ అమ్మాయి మళ్ళీ ప్రత్యక్ష మయింది. తలుపు పక్కనుండి తొంగిచూస్తూ, "భోజనానికి పిలవమంటోంది అమ్మ", అంది సిగ్గుగా.

ఓ పళ్ళెంలో వేడి పరాటాలూ, రెండు రకాల కూరలూ, పంచదార వడ్డించారు.

"పంచదారకన్నా పరాటాల్లోకి బెల్లం బావుంటుంది" అన్నాడు అపూ, ఆ అమ్మాయితో. ఆ అమ్మాయితో మాట్లాట్టానికి సిగ్గు అన్పించటం లేదిప్పుడు.

ఇంతలో మేజిస్ట్రేటుగారి భార్య వచ్చింది. 'ఈ అబ్బాయి భోజనం చేసేటప్పుడు కాస్త కనిపెట్టి చూస్తుండు నిర్మలా. ఏంకావాలో నన్ను అడగటానికి సిగ్గుపడుతున్నాడు' అంది ఆ అమ్మాయితో.

కొంచెం సిగ్గుపడ్డాడు అపూ. కానీ ఆమె మాటల్లోని ఆప్యాయత అతని హృదయాన్ని తాకింది. ఈవిణ్ణి తను అమ్మా, అని పిలవొచ్చా? అలా పిలవాలనే అన్పించింది కానీ, ఆవిడేమనుకుంటుందో?

కొన్ని వారాలు గడిచాయి. నిర్మలావాళ్ళ కుటుంబాన్ని చూస్తుంటే అపూకి కొత్త విషయాలు అర్థమవుతున్నాయి. వాళ్ళు ధరించే బట్టలు మరీ ఖరీదయినవేమీ కాదు, కానీ చక్కటి నమూనాల్లో అందంగా శుభ్రంగా ఉంటాయి. వాళ్ళకు మంచి అభిరుచి ఉందని చెప్తున్నట్టుగా ఉంటాయి వాళ్ళ దుస్తులు. కాశీలోని రాయ్ చౌదురి గారింట్లో ఈ అభిరుచి కన్నా ఆడంబరం ఎక్కువగా కనబడేదన్పించింది అపూకి.

కొద్దిరోజుల్లోనే నిర్మలతో చనువు పెరిగింది. ఆ అమ్మాయిని చూస్తుంటే ఓ చెల్లిలా తోచేది అతనికి. అపూని దాదా, అనిపిలుస్తోంది నిర్మల. అతని అవసరాలన్నీ శ్రద్ధగా చూసుకుంటుంది. తను చదివిన కథలన్నీ ఆ పిల్లకు చెప్తుంటాడు అపూ.

ఆరు నెలల తర్వాత నిర్మలవాళ్ళ మామయ్య వచ్చాడు వాళ్ళింటికి. అతను ఇటీవలనే ఇంగ్లాండు నుండి వచ్చాడని తెలిసి ఆశ్చర్యపడ్డాడు అపూ. నల్లగా, సన్నగా, ఇరవైలలో ఉన్న ఆ వ్యక్తిని 'అమర్ మామ' అని పిలుస్తున్నారు పిల్లలు.

ఇంగ్లాండ్ గురించి ఎన్నో విషయాలు ఆయన్నడిగి తెలుసుకున్నాడు అపూ. ఆయన బ్రిటిష్ మ్యూజియం చూశాడా? వెనిస్ ఎలా ఉంటుంది? పారిస్ చాలా గొప్ప నగరమటగా? నెపోలియన్ సమాధిని ఆయన చూశాడా? ఇటలీలో ఆకాశం చాలా ప్రత్యేకంగా ఉంటుందంటారు, అంటే ఏమిటి?

అపూ ప్రశ్నలకు ఆయన నివ్వెరపోయాడు. నిన్న మొన్నటి దాకా చిన్న పల్లెలో ఉన్న ఈ కుర్రాడికి ఇన్ని విషయాలెలా తెలుసు?

అమర్ మామ వెళ్ళిన కొన్నాళ్ళ తర్వాత, స్కూల్లో ఫుట్‌బాల్ ఆడుతుండగా అపూ కాలికి గట్టి దెబ్బతగిలి బెణికింది. నిర్మల చేసిన సేవలు, వాళ్ళింట్లో అందరూ చూసిన శ్రద్ధ, అపూని వాళ్ళకు మరింత సన్నిహితం చేశాయి.

❖ ❖ ❖ ❖

ఒక సాయంత్రం వర్షంలో తడిసి ముద్దయిపోయి ఇంటికొచ్చాడు అపూ.

"అయ్యయ్యో, గొడుగు తీసుకెళ్ళక పోయావా?" అంటూ కంగారుపడింది నిర్మల.

ఆ రోజు చాలా హుషారుగా ఉన్నాడు అపూ. "ఇంకో మూణ్ణెల్లలో పరీక్షలయిపోతాయ్ నిర్మలా! ఆ తరవాత కలకత్తాకు వెళ్ళాల్సుంటుంది కాలేజీలో చదవటానికి"

నిర్మల ముఖం వాడిపోయింది. 'వెళ్ళిపోతావా?' బెంగగా అడిగింది.

"ఆఁ! నీకూ సంతోషమేగా! నేను వెళ్ళిపోయానంటే బోలెడంత పని తగ్గిపోతుంది నీకు. అరెరె...అదేమిటి నిర్మలా! ఇదుగో చూడు...నేనూరికే హాస్యానికి..."

అప్పటికే వెళ్ళిపోయిందామె. హాస్యానికైనా నిర్మలను అలాంటి మాటన్నందుకు సిగ్గుపడ్డాడు అపూ.

కొన్నాళ్ళ తర్వాత పోతూ వచ్చాడు. ఈ మధ్యనే రాణూని కలిశాననీ, వాళ్ళ అత్తవారింట్లోనే వారం రోజులున్నాననీ చెప్పాడు.

"నన్ను గురించి అడగలేదూ?" అన్నాడు అపూ.

"అడిగింది. ఈసారి వచ్చేటప్పుడు నిన్ను తీసుకురమ్మంది. రాణూదీ ఎంత మంచిదిరా అపూ! నిన్ను గుర్తుచేసుకుని కన్నీళ్ళు పెట్టుకుంది తెలుసా?"

అపూ గొంతులో ఏదో అడ్డుపడినట్టయింది. తమ మాటలు ఎవరయినా వింటున్నారేమోనని కిటికీవైపు చూశాడు. కాసేపు కబుర్లుచెప్పి వెళ్ళిపోయాడు పోతూ.

మెట్రిక్యులేషన్ పూర్తయిన మర్నాడు, హెడ్మాస్టర్ దత్తా అపూని తన గదిలోకి పిలిచాడు.

"ఇంటికి ఎప్పుడెళ్తున్నావ్?"

"వచ్చే బుధవారం సర్?"

"తర్వాత ఏం చెయ్యాలనుకుంటున్నావ్? కాలేజీలో చేరుతావా?"

"యస్ సర్, తప్పకుండా చేరాలనుంది."

"స్కాలర్‌షిప్ రాకపోతే ఎలా?"

అపూ దగ్గర జవాబులేదు.

"పర్వాలేదులే. భగవంతుడి మీద విశ్వాసముంచితే అన్నీ సవ్యంగానే జరుగుతాయ్." అంటూ బైబిల్ నుండి కొన్ని వాక్యాలు చెప్పాడాయన.

దత్తాగారు బైబిల్ గురించి చెప్పినప్పుడల్లా కరుణ నిండిన నేత్రాలతో ప్రశాంతమైన జీసస్ వదనం అపూ కళ్ళలో కదలాడేది. తన హిందూ దేవతలతోబాటుగా జీసస్‌నూ,

బుద్ధుణ్ణీ, శ్రీ చైతన్య స్వామినీ కూడా అంగీకరించటానికి అభ్యంతరమేమీ కనబడటం లేదు అతనికి.

'చిన్న ఊళ్ళలో కూడా కాలేజీలుంటాయి. కానీ నీ ప్రపంచజ్ఞానం పెరగాలంటే కలకత్తాలో చదువుకోవాలి అపూర్వా!" అన్నాడు దత్తా.

"ఔను సర్."

"ఈ పుస్తకాన్ని నువ్వు చాలాసార్లు లైబ్రరీ నుండి తీసుకోవటం చూశా. తీసుకో, నేనింకో కాపీ కొనుక్కుంటా" అంటూ "లే మిజరబ్లే" అతనికి అందించాడు హెడ్మాస్టర్.

ఆయన అభిమానానికి చలించిపోయాడు అపూ. చటుక్కున వంగి ఆయన పాదాలను తాకి, గదిలోంచి వెళ్ళిపోయాడు.

ముప్పయ్యేళ్ళుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న దత్తాను అపూ ఎంతగానో అకట్టుకున్నాడు. తెలివి, భావుకత, కాస్త అమాయకమైన ఉత్సాహం, అసాధారణమైన జ్ఞానదాహం కలబోసిన ఆ కుర్రాడిని చూస్తే ఆయనకు ముచ్చటేస్తుంది.

దివాన్‌పూర్ నుంచి వెళ్ళిపోతున్నాననుకుంటే అపూ గుండె బరువెక్కింది. నాలుగేళ్ళు ఎంతలో గడిచిపోయాయి! కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పాడు దేవూ. "నువ్వెళ్ళిపోతే నాకిక ఫ్రెండ్సెవరూ లేరు అపూర్వదా! నేను కూడా ఈ స్కూల్లోంచి వెళ్ళిపోతా" అన్నాడు దిగులుగా.

ఆ సాయంత్రం స్కూలు నుండి వచ్చిన నిర్మల నేరుగా అపూ గదికి వచ్చింది. 'ఇవాళే కదూ నువ్వెళ్ళిపోయేది?' అంటూ.

'ఔను నిర్మలా. రెండు గంటల రైలుకి వెళ్తా."

అపూ తన సామాన్లు సర్దుకుంటుంటే సాయం చేసింది నిర్మల. "ఎందుకీ చెత్తంతా పెట్టెలో పోగుచేస్తావ్? ఇవన్నీ ఎందుకన్నా పనికొస్తాయా, బైటపారేస్తానుండు అవన్నీ!'

'అయ్యయ్యో, వద్దొద్దు!' అన్నాడు అపూ కంగారుగా. ఆ ట్రంకు పెట్టెలోని ప్రతి చిన్న వస్తువూ అమూల్యమైన స్మృతులతో నిండినదే. ఓసారి దుర్గ, విరిగిపోయిన పక్షి గూడొకటి తెచ్చిచ్చింది. అదిప్పుడు అపూ ట్రంకులో చేరింది. తండ్రి చేతిరాతలో ఉన్న కాగితం ముక్కలు కూడా అందులోనే భద్రంగా ఉన్నాయి.

'మిమ్మల్నందరినీ మళ్ళీ ఎప్పుడు చూస్తానో నిర్మలా!'

'ఎప్పుడూ చూడవు. నీ సంగతి నాకు బాగా తెలుసు, దాదా! నీకసలు హృదయం లేదు' అంటూ వెళ్ళిపోయింది నిర్మల.

అపూ బయల్దేరుతుంటే నిర్మలావాళ్ళ అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది. నిర్మల ఏదో పనిలో ఉన్నట్టుగా గదిలోంచి బయటికే రాలేదు. వాళ్ళమ్మ ఎన్నిసార్లు పిలిచినా విన్పించుకోలేదు. అపూకి బాధగానూ, ఆశ్చర్యంగానూ తోచింది ఆమె ప్రవర్తన.

రైల్లో ప్రయాణిస్తున్న అపూ ఊహల్లో కొత్త ప్రపంచం కదలాడుతోంది. సుదూర తీరాల నుండి అవ్యక్తమైన పిలుపులేవో వినబడుతున్నాయ్. భవిష్యత్‌ను అన్వేషిస్తూ నిస్సంకోచంగా ముందుకు నడిచిన హరిహరుడి కలల వారసత్వం అపూది.

## 6

మర్నాడు కలకత్తాకు బయల్దేరుతాడనగా ఆ రాత్రంతా రకరకాల ఆలోచనలతో, సందేహాలతో నిద్రపట్టలేదు అపూకి. అతను చదవబోయే ఈ చదువు గురించి కానీ, కలకత్తా నగరాన్ని గురించి కానీ సర్వజయకు బొత్తిగా తెలీదు.

'నువ్వు చదువుకున్నది చాలదటరా?" అని అడిగిన తల్లికి సర్ది చెప్పాడు అపూ. పేద విద్యార్థులకు సహాయంచేసే ఏర్పాట్లు అక్కడుంటాయనీ, బెంగపడొద్దనీ సముదాయించి బయల్దేరాడు.

దేవూ వాళ్ళ మావయ్య కలకత్తాలో ఉంటాడట. ఆయన అడ్రస్ రాసిచ్చాడు. ఆ కాగితం ముక్క ఆధారంతో కలకత్తాలో కాలుమోపాడు అపూ.

దేవూ వాళ్ళ మామయ్యగారిల్లు కనుక్కోవటం చాలా కష్టమయింది. అపూ వెళ్ళేసరికి అఖిల్‌బాబు ఇంట్లో లేడు. సాయంత్రం ఆయనొచ్చేదాకా ఎదురుచూశాడు. ఆదరంగా పలకరించి, భోజనానికి ఏర్పాట్లు చేశాడాయన. ఆయన ఉంటున్నది నిజానికి ఇల్లు కాదు. మరి కొందరితో కలిసి ఓ మెస్‌లో ఉంటున్నాడు. వాళ్ళందరూ అపూకి ఎన్నో విషయాల్లో సలహాలిచ్చారు. ఎక్కడయినా ట్యూటర్‌గా పనిచేస్తూ కాలేజిలో చదువుకోవాలని అపూ ఆలోచన. లేదంటే ఫీజుల్లేకుండా చదువు చెప్పే కాలేజినయినా చూసుకోవాలి.

ప్రెసిడెన్సీ కాలేజికి గొప్ప పేరుంది. అక్కడ చదువు చాలా ఖరీదు కూడా. మెట్రో పాలిటన్ కాలేజిని, సిటీ కాలేజీనీ చూడగానే తెలియని అయిష్టం కలిగింది. చివరికి, రిప్పన్ కాలేజి, తనకు సరిగ్గా సరిపోతుందన్పించింది. ఎత్తయిన ఆ భవనాన్ని చూడగానే అక్కడే చదవాలని నిర్ణయించుకున్నాడు. దరఖాస్తు ఫారమ్ నింపాక గదులన్నీ తిరిగి చూశాడు.

అఖిల్‌బాబు మెస్‌లోనే ఉంటూ కాలేజీకి వెళ్తున్నాడు అపూ. కానీ ఆ మెస్‌లో చదువుకునేందుకు పనికొచ్చే వాతావరణం లేదు. అఖిల్ గదిలో మరో ముగ్గురు వ్యక్తులుంటున్నారు. వాళ్ళందరూ ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్ళే. గదంతా సామాన్లతో నిండిపోయి చీదరగా ఉంటుంది. పైగా అంతమంది పెద్దవాళ్ళ మధ్యన ఉండడం అపూకి చాలా ఇబ్బందిగా ఉంటోంది. కానీ డబ్బులేకుండా ఎక్కడికని వెళ్ళగలడు? స్కాలర్‌షిప్ వచ్చే ఆశకూడా కన్పించటం లేదు.

నెలరోజుల తర్వాత అపూ కోసం ఓ ఉద్యోగం వెదికిపెట్టాడు అఖిల్‌బాబు. ఓ పిల్లవాడికి ట్యూషన్ చెప్పాలి. నెలకు పదిహేను రూపాయలిస్తారట. ఆ మాత్రం ఆధారం

దొరికినా చాలనుకున్నాడు అపూ. తన కాలేజీలోనే చదివే ముగ్గురు విద్యార్థులతో కలిసి వేరే గదిలోకి మారాడు.

❖ ❖ ❖ ❖

అపూతోబాటు గదిలో ఉండే ముగ్గురూ ముర్షిదాబాద్ నుండి వచ్చినవాళ్ళే. వాళ్ళందరలోనూ పెద్దవాడైన సురేశ్వర్ ఎం.ఏ. చదువుతున్నాడు. నెలకు నలభై రూపాయలు సంపాదన కూడా ఉందతనికి. జానకికి ఇరవై రూపాయలూ, నిర్మల్‌కి ఇంకాస్త తక్కువ ఆదాయం వస్తుంది. వాళ్ళ అవసరాలక్కూడా సురేశ్వరే సర్దుబాటు చేస్తూండేవాడు. కొద్ది రోజుల్లోనే నలుగురి మధ్యనా మంచి స్నేహం ఏర్పడింది.

తమ కాలేజీలోని ప్రొఫెసర్ బసు, అంటే అపూకి చాలా గౌరవం. ఆయన హిస్టరీ బోధిస్తాడు. ఆయన పాఠం చెప్తుంటే ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ప్రపంచ చరిత్రంతా ఆయనకు కరతలామలకం.

హిస్టరీ క్లాసు తర్వాత లాజిక్ క్లాసుండేది. ఆ సబ్జెక్ట్ అపూకి బొత్తిగా నచ్చలేదు. వెనక బెంచిలో కూర్చుని క్లాసు జరిగినంతసేపూ నవలలు చదువుకునేవాడు.

ఇంతలో, ఊహించని ఇబ్బందులు వచ్చిపడ్డాయి. సురేశ్వర్ చేస్తున్న ఉద్యోగం పోవటంతో గది ఖాళీచేసి ఓ మెస్సుకు వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళ తర్వాత అపూ దగ్గర ట్యూషన్ చెప్పించుకునే పిల్లవాడు జబ్బుపడటంతో ఒక నెలజీతం అదనంగా ఇచ్చి ఇక రావద్దని చెప్పేశారు వాళ్ళు. అపూ కూడా గది ఖాళీ చెయ్యక తప్పలేదు. తన సామాన్లు తీసుకెళ్ళి సురేశ్వర్ మెస్ గదిలో పెట్టుకున్నాడు.

అదే రోజున సర్వజయ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. చేతికి దెబ్బతగిలి బాగా నొప్పిగా ఉందనీ, వీలైతే మూడు రూపాయలు పంపమనీ రాసిందామె. అపూని తల్లి డబ్బులడగటం ఇదే మొదటిసారి. వెంటనే పోస్టాఫీసుకు వెళ్ళి పదిరూపాయలు మనియార్డర్ చేశాక, అమ్మకు సాయపడగలిగానని తృప్తి కలిగింది.

ప్రణవ్ ముఖర్జీ అనే విద్యార్థితో కాలేజి లైబ్రరీలో పరిచయమయింది అపూకి. అతను తనలాగే, నిజానికి తనకంటే చాలా ఎక్కువగానే సాహిత్యం చదువుతాడని తెలిశాక స్నేహం మరింత పెరిగింది. నీషే, ఎమర్సన్, తుర్గెనేవ్..అంటూ తానెన్నడూ వినని రచయితల పేర్లు చెప్పే ప్రణవ్‌ను ఆశ్చర్యంగా చూస్తాడు అపూ.

'నువ్వు గొప్ప సాహిత్యాన్ని చదవాలనుకుంటే, అందుకొక ప్రణాళికనూ, పద్ధతినీ తయారు చేసుకోవాలి అపూర్వా' అని ప్రణవ్ ఇచ్చిన సలహా అపూకెంతో ఉపయోగపడింది. ప్రణవ్ సాయం తీసుకుంటూ మంచి సాహిత్యాన్ని ఎన్నుకుని చదవసాగాడు.

డబ్బు సంపాదించే మార్గమేదీ కనబడటం లేదు. భోజనానికి కూడా ఇబ్బందిపడాల్సి వస్తోంది. సురేశ్వర్ దగ్గరో, జానకి గదికో వెళ్ళి భోజనం చెయ్యక తప్పడం లేదు.

ఒకరోజు అపూ సమస్యకు ఓ తాత్కాలిక పరిష్కారం చెప్పాడు జానకి. కలకత్తాలోని ఓ ఆలయంలో ప్రతి సాయంత్రమూ కొంతమందికి ఉచితంగా భోజనం పెడతారట. జానకి సాయంత్రం భోజనం కూడా అక్కడే. తను కొన్నాళ్ళపాటు ఊరికి వెళ్తున్నాడు కాబట్టి, తన బదులుగా అపూ అక్కడ భోజనంచేసే ఏర్పాటు చేశాడు.

ఉదయం కాసిని మరమరాలు తిని, అర్థాకలితోనే కాలేజీకి వెళ్తాడు అపూ. రాత్రి భోజనం ఆలయంలో దొరుకుతోంది.

## 7

అపూ మొదటి నుంచీ పేదరికంలో పెరిగినవాడే అయినా, ఇంత గడ్డు పరిస్థితిని అంతకుముందెన్నడూ ఎదుర్కోలేదు. పసితనంలో తల్లిదండ్రులు ఎంతో ముద్దుగా పెంచు కున్నారు. తండ్రి మరణించాక కూడా అపూని రెక్కల్లో పొదువుకుని కాపాడుకుంది సర్వజయ. దివాన్‌పూర్‌లో డబ్బుకు ఇబ్బందిపడటం నిజమే అయినా, అక్కడ జీవితావసరాలకు డబ్బుతో పెద్దగా పనిలేదు కాబట్టి, తిండి తిప్పలకు కొదువలేకుండా జరిగిపోయింది.

కలకత్తాలో పరిస్థితులు వేరు. దానికితోడు యూరప్‌లో యుద్ధం కూడా మొదలయింది. అపూ దగ్గర కాస్త శుభ్రమైన చొక్కా ఒక్కటే ఉంది. రోజు విడిచి రోజు దాన్నే ఉతుక్కుని వేసుకుంటున్నాడు. అర్థాకలితో క్లాసులో కూర్చుంటే కళ్ళుతిరుగుతున్నట్టుగా అన్పిస్తూ, వింటున్నది బుర్రకెక్కటం లేదు. సురేశ్వర్‌కు పరీక్షలయిపోవటంతో మెస్ ఖాళీ చేసి ఇంటికెళ్ళిపోయాడు. దాంతో అపూకి నిలవనీడలేకుండా పోయింది. తనకు పరిచయస్తుడైన ఒక వ్యక్తి గదిలో అపూ ఉండే ఏర్పాటు సురేశ్వర్ చేశాడుగానీ, ఆ వాతావరణం దుర్భరంగా ఉంది.

అపూ కాలేజిలో వారినికొకసారి ఏదో ఒక అంశంమీద డిబేట్ జరుగుతుంది. ఒక రోజు హిందూ సంప్రదాయాల గురించి చర్చ జరిగింది. ప్రణవ్ ఆ సంప్రదాయాలలోని మంచిని వివరిస్తూ మాట్లాడితే, అతనికి వ్యతిరేకంగా మన్మథ అనే విద్యార్థి వాదించాడు. విద్యార్థులందరూ రెండు పక్షాలుగా విడిపోయి చర్చించుకున్నారు. తను కూడా ఏదో ఒక అంశంమీద మాట్లాడాలన్పించింది అపూకి.

సమాజంలోని అన్ని రంగాలలోనూ నూతన పరివర్తన జరగాల్సిన అవసరాన్ని గురించి ఒక పేపర్ తయారుచేశాడు అపూ. సాహిత్యంలోనూ, సామాజిక విలువల్లోనూ ఎలాంటి విలువలు ఏర్పడాల్సి ఉన్నదో అందులో వివరించారు. తను చదివిన సాహిత్యం ద్వారా నేర్చుకున్న చక్కటి పదాలను ఏర్చికూర్చాడు. పందొమ్మిదేళ్ళ అతని జీవితంలోని కష్టసుఖాలూ, జ్ఞాపకాలూ, ప్రకృతిపై అతని ఆరాధన...ఇవన్నీ ఆ వాక్యాలలో ప్రతిఫలించాయి.

ఆ రోజు సమావేశానికి హిస్టరీ ప్రొఫెసర్ బసు, అధ్యక్షత వహించాడు. హాలంతా విద్యార్థులతో నిండిపోయింది. అంతమంది తననే చూస్తుండగా సభలో మాట్లాడటం అపూకి అదే మొదటిసారి. కొద్ది క్షణాలపాటు అతని కంఠం తడబడింది. చక్కటి పదాలతో, తార్కికమైన చర్చతో తన వాదాన్ని విన్పించాడు అపూ. కాలం చెల్లిన ఆచారాలు ఏవిధంగా ప్రగతికి అవరోధాలవుతున్నాయో తగిన ఉదాహరణలతో వివరించాడు. ఈ పరిస్థితిని మార్చవలసిన అవసరాన్ని స్పష్టంగా ప్రకటించాడు.

సంప్రదాయవాద శిబిరానికి చెందిన విద్యార్థులకు అపూ వాదం నచ్చలేదు. గతంలో మన్మథ మీద వేసిన ముద్రలనే అపూ మీద కూడా వేశారు వాళ్ళు. అతనిది అరాచకవాద మంటూ గొడవచేశారు. ఇదంతా చూసి అపూ ముందు కొంచెం భయపడ్డాడు. తర్వాత తేరుకుని ఆ విమర్శలన్నిటికీ వీలయినంత సహేతుకంగా జవాబులు చెప్పాడు. ఐనా, వాళ్ళు మరింత అల్లరి చెయ్యటంతో విసిగిపోయిన అపూ, వాళ్ళను కుసంస్కారులని నిందించాడు. ఈ ఉద్రిక్త వాతావరణంలో సభ ముగిసింది.

అపూ మాట్లాడిన విషయాలతో ఏకీభవించిన కొద్దిమంది మాత్రం అతన్ని ప్రోత్సహించారు. బక్కపలచగా, అందంగా ఉన్న ఓ కుర్రాడు అపూ దగ్గరికొచ్చి "మీ పేపర్ చదివి రేపు తెచ్చిస్తాను, ఇస్తారా?" అని అడిగి తీసుకున్నాడు.

మర్నాడు ఆ కుర్రవాడు అపూ ఇచ్చిన పేపర్ తిరిగిచ్చేసి కృతజ్ఞతలు చెప్పి వెళ్ళాడు. ఒక కాగితం మీద పెన్సిల్‌తో రాసిన ఓ కవిత దానితో జతచేసి ఉంది. అపూలోని అభ్యుదయ దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన కవిత అది. అపూ సంతోషంతోనూ, గర్వంతోనూ పొంగిపోయాడు.

సాయంత్రం కాలేజీ వదిలాక ఆ అబ్బాయి అపూని కలిశాడు. అతని పేరు అనిల్. అతనిది కూడా అపూలాగే బిడియపడే స్వభావం. తన కవిత గురించి అనిల్ అడగనూ లేదు, అపూ ప్రస్తావించనూ లేదు. కాసేపు ఏవో కబుర్లు చెప్పాక, "సిటీ వెలుపలికి వెళ్ళొద్దాం వస్తారా! నాకెందుకో ఈ రద్దీలో ఉపిరాడనట్టుగా ఉంటుంది. ఎక్కడా ఒక గడ్డి మొక్కయినా కనబడదిక్కడ" అన్నాడు అనిల్.

తన కాలేజి మిత్రుల్లో ఇలా మాట్లాడేవారెవరూ లేరు. అపూ కాస్త ఆశ్చర్యపడ్డాడు అనిల్‌ని చూసి. ఇద్దరూ రైలెక్కి, నాలుగు స్టేషన్ల అవతలున్న ఒక ప్రదేశానికి చేరారు. అక్కడంతా పచ్చిక మైదానాలతో, ఏవో అడవిపూల పొదలతో ఆహ్లాదకరంగా ఉంది. ఓ పెద్ద చెట్టుకింద కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు.

అనిల్‌ది బీహార్‌లోని హజారీబాగ్. వాళ్ళకు ఆ ప్రాంతంలో మైకా గనులున్నాయి. అపూలాగానే అనిల్‌కూడా పచ్చటి గ్రామ సీమల్లో కొండలూ, నదులూ, జలపాతాలతో నిండిన ప్రకృతి మధ్యన పెరిగాడు. అక్కడి నీలివర్ణపు పర్వత శ్రేణుల వెనుక సూర్యాస్తమయ

సౌందర్యాన్నీ, ఏప్రిల్ మాసపు తొలిరోజుల్లో వ్యాపించే శాల పుష్పాల పరిమళాన్నీ, ప్రకృతికి సంధ్యాహారతి పడుతున్నట్టుగా పలాశ వృక్షశాఖలను వెలిగించే అరుణవర్ణ పుష్పాలనూ, వీటన్నిటినీ తన్మయత్వంతో వర్ణించాడు అనిల్.

మైకా వ్యాపారంలో నష్టం రావటంతో అనిల్ కుటుంబం కలకత్తా చేరింది. జనారణ్యం వంటి నగరాన్నీ, ఏమాత్రమూ భావుకత లేని సహవిద్యార్థులనూ చూసి నిరాశపడ్డాడు అనిల్. 'నిన్న నీ మాటలు విన్న తర్వాత ఇక్కడ నువ్వొక్కడివే ప్రత్యేక మన్పించింది అపూర్వా!" అన్నాడు అనిల్.

అపూకి సంతోషం వేసింది. ప్రకృతిమీద తనకున్న ఆరాధనను దివాన్‌పూర్ స్కూల్లోని విద్యార్థులు హేళనచేస్తుండేవాళ్ళు. ఇన్నాళ్ళ తర్వాత అనిల్‌వంటి స్నేహితుడు దొరికినందుకు అపూ హృదయం తేలికపడింది.

## 8

**ఓ** మధ్యాహ్నం అపూ కాలేజి నుండి వచ్చి షర్టు విప్పుతూ ఉండగా, ఎదురింటి కిటికీ మీద రాసిన అక్షరాలు కనబడ్డాయి. 'హేమలత నిన్ను పెళ్ళాడుతుంది' అని రాసుందక్కడ. కాసేపు నివ్వెరపోయిన అపూ, ఫక్కున నవ్వేశాడు.

ఆ కిటికీ దగ్గర దాదాపు పదిహేనేళ్ళ అమ్మాయి నిలబడుతూ ఉంటుంది. వత్తయిన నొక్కుల జుట్టుతో ఆకర్షణీయంగా ఉంటుంది. కిటికీ తెరలోంచి తొంగిచూసి చిరునవ్వు నవ్వటం, కారణం లేకుండానే కిటికీ తలుపులు తెరుస్తూ, మూస్తూ ఉండటం లాంటి పనులు చేస్తుంటుంది. 'ఏమిటీపిల్ల సిగ్గులేకుండా!' అనుకునేవాడు అపూ.

మర్నాడు అపూ కాలేజికి బయల్దేరుతుండగా తలస్నానం చేసిన జుట్టు ఆరబెట్టుకుంటూ ప్రత్యక్షమయింది ఆ అమ్మాయి. రెండురోజులు అలాగే జరిగాక ఆ పిల్లతో మాట్లాడాలని నిశ్చయించుకున్నాడు అపూ. 'ఏమిటి హేమలతా, నన్ను పెళ్ళాడుతావా?' అని అడిగాడు నవ్వుతూ.

"ఔను, ఇంతకీ నీ పేరేమిటి?'

"అపూర్వ కుమార్‌రాయ్. నువ్వలాంటి రాతలు రాయకూడదు. ఎవరన్నా చూస్తే ఎలా? ఇంకెప్పుడూ రాయకు"

'ఎవరు చూస్తారు? మా ఇంట్లోవాళ్ళెవరికీ కన్పించదుగా' అంటూ లోపలికి వెళ్ళిపోయింది హేమలత.

ఆ అమ్మాయి మానసిక స్థితి సరిగా లేదేమోనని సందేహం కలిగింది అపూకి. హేమలత చక్కగానే ఉంటుంది కానీ ఆ పిల్ల కళ్ళలో ఏదో వెర్రితనం కనబడుతుంటుంది. ఆమె మీద జాలిపడ్డాడు అపూ.

❖ ❖ ❖ ❖

కొన్ని వారాలు గడిచాయి. ఒక డాక్టర్‌గారింట్లో ట్యూషన్ మాస్టారు కావాలన్న చిన్న ప్రకటనను పేపర్లో చూశాడు అపూ. ఏదో ఒక ఉద్యోగం సంపాదించకపోతే ఇక రోజులు గడవటం కష్టం.

అపూ వెళ్ళేసరికే ఆ ఉద్యోగం కోసం పదిహేనుమంది అభ్యర్థులున్నారక్కడ. డాక్టరు గారు ఇంటర్వ్యూ మొదలెట్టారు. కాసేపటి తర్వాత బంట్రోతు వచ్చి, ఇవాల్టికిక ఇంటర్వ్యూలు ముగిశాయనీ, మిగతావాళ్ళిద్దరూ చిరునామాలు రాసిచ్చి వెళితే అవసరాన్ని బట్టి పిలుస్తారనీ చెప్పి వెళ్ళాడు.

అపూ నిరాశపడిపోయాడు. కలకత్తాలో ఎందరో భాగ్యవంతులు ఉంటారు కాబట్టి తనవంటి పేద విద్యార్థికి తప్పకుండా సహాయం దొరుకుతుందనుకుని ఈ నగరానికి వచ్చాడు. ఇక్కడ ఎందరో ధనవంతులుండటం వరకూ నిజమే కానీ, తనలాంటి వాళ్ళను పట్టించుకునేదెవరు? ఐనా, తనకు చేతనయిన పనిచేసి బతకాలనే తప్ప ఎవరినీ యాచించాలని అపూ ఎన్నడూ ప్రయత్నించలేదు. తల్లి నుండి వారసత్వంగా వచ్చిన లక్షణమది.

కాపేపటి తర్వాత, ఒక నిశ్చయానికి వచ్చిన అపూ మెట్లెక్కి డాక్టర్ గదిలోకి వెళ్ళి తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఆయన అపూని ఎగాదిగా చూశాడు. 'కూర్చోండి. ఏం చదువుతున్నారు, ఐఏనా? అంటూ అపూకేసి కొద్ది క్షణాలు కళ్ళార్పకుండా చూశాడాయన. "మా అమ్మాయికి ట్యూషన్ చెప్పాలి. కొంచెం జాగ్రత్తగానే ఎంపిక చేసుకోవాలని నా ఉద్దేశ్యం' అంటూ కూతుర్ని పిలిపించాడాయన.

పదిహేనేళ్ళ అమ్మాయి గదిలో కొచ్చింది. సన్నగా, నాజూగ్గా, పెద్ద కళ్ళతో అందంగా ఉంది. వెడల్పాటి అంచున్న చీరకట్టుకుని, సిల్కు జాకెట్ తొడుక్కుంది. మెడలో సన్నటి బంగారు గొలుసు, చేతులకు సాదా బంగారు గాజులూ ఉన్నాయి. వత్తయిన జుట్టును జపాన్ స్త్రీల మాదిరిగా అలంకరించుకుంది.

'మా అమ్మాయి ప్రీతిబాల' అంటూ ఆమెను పరిచయంచేసి, 'నీ కొత్త ట్యూషన్ మాస్టారు, ప్రీతీ! రేపటి నుంచి పాఠాలు చెప్తారు' అన్నాడు డాక్టర్ ఆమెతో. ఆ తర్వాత అపూకేసి చూస్తూ, "నీకెన్నేళ్ళు పందొమ్మిదా? చాలా చిన్న కుర్రాడివే. ఐనా నీలో ఏదో ప్రత్యేకత కన్పిస్తోందయ్యా" అన్నాడాయన.

ఆనందంతో పొంగిపోయాడు అపూ. ఉద్యోగం దొరికినందుకు మాత్రమే కాదు, ప్రీతీవాళ్ళ నాన్న తనను మెచ్చుకున్న తీరు అపూను మరింత సంతోషపరిచింది. నేను ప్రత్యేకంగా కనబడుతున్నానట! నిజమేనా? ఎంత చక్కటి ప్రశంస!

తన కొత్త ఉద్యోగాన్ని గురించి మిత్రులందరికీ చెప్పాడు. తనకు రాబోయే జీతాన్నీ, తన విద్యార్థిని అందాన్నీ కూడా కొన్నిరెట్లు హెచ్చించి చెప్పి వాళ్ళను ఆశ్చర్యపరిచాడు.

మర్నాడు ప్రీతిబాలకు ట్యూషన్ ప్రారంభించిన అపూకి, ఈ అమ్మాయి దివాన్‌పూర్ లోని నిర్మల వంటిది కాదని వెంటనే అర్థమయిపోయింది. అతి ముక్తసరిగా మాట్లాడుతుంది ప్రీతి. ఆ మాటల్లో పొగరు తొణికిసలాడుతుంది. కొన్ని వారాలు గడిచేసరికి అపూమీద పెత్తనం చేస్తున్నట్లుగా మాట్లాడసాగింది. 'ఇది మళ్ళీ చెప్పండి, రేపు నాకు పరీక్ష ఉంది, మీరివాళ ఎక్కువసేపు ఉండాల్సిందే' ఇలా ఉంటుందామె ధోరణి. ఉద్యోగం దొరికిందన్న ఆనందం అడుగంటుతోంది అపూలో. తను ఏ పాఠమైనా సరిగ్గా చెప్పలేకపోతే వాళ్ళ నాన్నగారికి చెప్పి, ఉద్యోగం తీసేయించేస్తుందేమోనన్న ఆందోళన మొదలైంది.

మొదటి జీతం అందుకోగానే పోస్టాఫీసుకెళ్ళి అమ్మకు కొంత డబ్బు మనియార్డర్ చేశాడు. దారిలో ఓ మిత్రుడు కనబడి కళ్ళద్దాలు కొనుక్కోటానికి చోర్‌బజార్‌కు వెళ్తున్నానంటూ అపూని కూడా రమ్మన్నాడు. ఆ బజారులో అమ్ముతున్న వస్తువులను చూసి ఆశ్చర్యపడ్డాడు అపూ. అసలు కలకత్తాలో అలాంటి చోటొకటుందన్న విషయమే అతనికి తెలీదు.

తన దగ్గరున్న డబ్బుతో కొన్ని వస్తువులు కొనుక్కోవాలన్న కోరిక అపూని నిలవ నివ్వలేదు. మర్నాడు మళ్ళీ చోర్‌బజార్‌కు వెళ్ళాడు. రెండు ఫ్లవర్‌వాజ్‌లూ, చక్కటి ఇంక్ పాట్, జపనీస్ కర్టెన్ ఒకటీ, నాలుగు చిత్రపటాలూ, కొన్నిప్లేట్లూ, అద్దం, నకిలీ రాయితో ఉన్న ఉంగరం, కొన్నాడు. ఆ తర్వాత ఓ ఇత్తడి టేబుల్ ల్యాంప్ కనబడింది. లీల గదిలో అచ్చంగా అలాంటిదే ఉండేదని గుర్తురాగానే, దాన్నీ కొనేశాడు. ఈ సామాన్లన్నీ ఓ కూలీతో పట్టించుకుని గదికి వెళ్తుంటే అతని హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. తన సొంతానికి అన్నిరకాల వస్తువులుండడమన్నది జీవితంలో అదే మొదటిసారి.

మర్నాడు గదంతా శుభ్రం చేసుకుని, తెచ్చిన వస్తువుల్ని సర్దాడు. గోడలకు చిత్రపటాలతో, గుమ్మానికి చక్కని కర్టెన్‌తో, చక్కని టేబుల్ ల్యాంప్‌తో తనగది కూడా డబ్బున్నవాళ్ళ గదిలాగే ఉందన్పించింది. మర్నాడు మిత్రులందరినీ పిలిచి, తన కొత్త సామానంతటినీ సగర్వంగా ప్రదర్శించాడు అపూ. సమోసాలూ, కచోరీలు, గులాబ్ జామూన్‌లూ తెచ్చి అతిథులకు విందుచేశాడు.

చోర్‌బజార్‌లో అపూ కొనుక్కొచ్చిన వస్తువులన్నీ పాతవీ, పనికిమాలినవీనని మిత్రులందరూ ఎకసక్కాలాడారు. అపూ వేలికున్న ఉంగరాన్ని చూసి, "అబ్బే, ఉత్తి గాజు ముక్కరా ఇది" అన్నాడు మన్మథ.

కాసేపయ్యాక వాళ్ళందరూ వెళ్ళిపోయారు, అనిల్ తప్ప. అతను ఇంతసేపూ మౌనంగా కూర్చున్నాడు. "ఇవన్నీ ఎందుక్కొన్నావ్ అపూర్వా? ఉన్న డబ్బంతా ఇలా ఖర్చు చెయ్యమని ఎవరు చెప్పారసలు నీకు?" అన్నాడు మెత్తగా మందలిస్తూ అనిల్.

అపూ నవ్వాడు, "ఎవరో చెప్పటమేమిటోయ్? అన్ని వస్తువులూ అమర్చుకోవాలను కోవటం తప్పా?"

"భోజనానికి కూడా డబ్బుల్లేని స్థితిలో ఉండి, ఇవన్నీ కొనటం కచ్చితంగా తప్పే... సరే, పోనీలే. నాకు తెలిసినవాళ్ళు మంచి బైనాక్యులర్స్ అమ్ముతున్నారు, మనిద్దరం కలిసి కొనుక్కుందాం" ఓదార్పుగా అన్నాడు అనిల్. అపూ కొనుక్కొచ్చినవన్నీ చవకరకం సెకెండ్ హాండ్ వస్తువులేనని తెలిసినా మిత్రుణ్ణి మరీ నొప్పించటానికి అనిల్ మనసొప్పలేదు.

'రేపు నీకొక మిత్రుణ్ణి పరిచయం చేస్తాను అపూర్వా! అతను దక్షిణాఫ్రికాలో పుట్టి, పెరిగి ఈ మధ్యనే కలకత్తాకు వచ్చాడు. ఆఫ్రికాలో జీవితాన్ని గురించి ఓహ్...ఎంత చక్కటి కథలు చెప్తాడో తెలుసా?" తను వెళ్ళబోయేముందు చెప్పాడు అనిల్.

వెంటనే వెళ్ళి ఆ కుర్రాణ్ణి కలవాలన్పించింది అపూకి.

❖ ❖ ❖ ❖

ప్రీతికి చదువు చెప్పటం రోజురోజుకూ పెద్ద సమస్యగా తయారవుతోంది. అంత చిన్న వయసులోనే ఇంత పొగరునూ, అహంకారాన్నీ చూసి ఆశ్చర్యపడ్డాడు అపూ. కేవలం వాళ్ళిచ్చే డబ్బుకోసమని ఆ ఉద్యోగాన్ని భరిస్తున్నాడు. ఆదివారమో, మరేదయినా సెలవు దినమో వస్తే అతని ప్రాణానికి హాయిగా ఉంటుంది.

ఒకరోజు ప్రీతికి చదువుచెప్తూ ఆమె పెన్సిల్‌ని వాడిన అపూ, పొరబాటున దాన్ని జేబులో పెట్టుకుని వెళ్ళిపోయాడు. మర్నాడు రాగానే పెన్సిల్ కోసం అడిగింది ప్రీతి. కంగారుగా జేబులు తడుముకున్నాడు అపూ. అది దారిలో ఎక్కడో పడిపోయినట్టుంది. 'అది నా పుట్టినరోజుకు మా తాతయ్య ఇచ్చిన బహుమతి' అంటూ కస్సుమందామె. అపూ చిన్నబుచ్చుకున్నాడు.

కొన్నాళ్ళ తర్వాత ఏదో సెలవురోజు వచ్చిందని అపూ ట్యూషన్ చెప్పేందుకు వెళ్ళలేదు. మర్నాడు అతను వెళ్ళీవెళ్ళగానే కారణమడిగింది ప్రీతి.

'నిన్న సెలవు కదా ప్రీతీ!'

"ఏం సెలవు? మా మేనేజరూ, డ్రైవరూ, మనిమనుషులూ అందరూ వచ్చారుగా! నా హోంవర్కంతా అలాగే ఉండిపోయింది. సాయంత్రం దాకా నన్ను క్లాసులోకి రానివ్వలేదు తెలుసా?' అంటూ విరుచుకుపడింది.

అపూకిక సహనం నశించిపోయింది. కోపాన్ని అణుచుకుంటూ, 'చూడు ప్రీతీ, అన్ని స్కూళ్ళకూ, కాలేజీలకూ నిన్న సెలవే. అందుకే నేను రాలేదు. నేను నీ డ్రైవర్‌నో, బంట్రోతునో కాదు. నువ్వు అవమానించినా పట్టించుకోని టీచర్‌నెవరినయినా చూసుకో. నేనిక రానని మీ నాన్నగారితో చెప్పు" అని చెప్పి, బయటకొచ్చేశాడు. తననొక కుటుంబ సభ్యుడిలా చూసుకున్న నిర్మలావాళ్ళ కుటుంబం అతని మనసులో మెదిలింది.

కొన్నాళ్ళనుండి సజావుగా సాగుతున్న జీవితంలో మళ్ళీ ఇబ్బందులు మొదలయ్యాయి. రోజూ భోజనం చేస్తున్న హోటలుకు బాకీపడటంతో ఇక నుండి రావొద్దని

కచ్చితంగా చెప్పాడు ఆ యజమాని. "ఏదో మంచివాడివనీ, చదువుకుంటున్నవాడివనీ ఇన్నాళ్ళూ ఓపికపట్టాను, నీకిక ఉచిత భోజనం పెట్టే శక్తి నాకు లేదయ్యా బాబూ" అని కఠినంగా ఆయన మాట్లాడిన మాటలకు అపూ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మర్నాడు మరో ఉపద్రవం వచ్చిపడింది. కాలేజి ఫీజు సక్రమంగా చెల్లించని విద్యార్థులను సంవత్సరాంత పరీక్షలకు అనుమతించబోమంటూ కాలేజి నోటీసు బోర్డులో రాసిపెట్టారు. అపూ గుండెల్లో రాయి పడింది. అతను అరవై రూపాయలు చెల్లించాలి. తనిక పరీక్షలు రాయలేడేమోనన్న భయం మొదలయిందతనిలో. ఇంత కష్టపడి చదివిన చదువూ, ఈ నగరంలో చేసిన చాకిరీ, బుగ్గిపాలయినట్టేనా!

హోటల్లో తినటంకన్నా స్వయంగా వండుకుంటే కాస్త తక్కువ ఖర్చులో రోజులు వెళ్ళదీయొచ్చని నిశ్చయించుకున్నాడు అపూ. తన గదికి దగ్గర్లోని వడ్రంగి దుకాణం దగ్గర పడుండే చెక్కముక్కల్ని ఏరుకొని వండుకోవటం మొదలెట్టాడు. కాసిని బియ్యం, బంగాళాదుంపలు, అప్పుడప్పుడూ ఒకటో రెండో కోడిగుడ్లూ...మొత్తంమీద ఐదారుపైసల ఖర్చుతో భోజనం తయారయిపోతోంది. అదే ఆవరణలో ఉండే చౌకీదార్ శంభుదత్ తివారీ భార్య తనకు వీలైన సాయం చేస్తోంది. ఆమెను బహూ, అని పిలుస్తాడు అపూ.

❖ ❖ ❖ ❖

ఆ రోజు అమ్మ దగ్గర నుండి వచ్చిన ఉత్తరం చదివాక అపూ మనసు వికలమయింది. పాదానికి దెబ్బతగిలి నడవలేకపోతోందట, డబ్బుకు కూడా కటకటగా ఉంటోందని రాసింది. ఆ రోజంగా అన్నం నోటికి పోలేదు అపూకి. ఎంత అవస్థ పడుతోంది అమ్మ!

ఈ బెంగకు తోడుగా మరో సమస్య వచ్చిపడింది. అపూ ఉంటున్న గది, ఓ ఫ్యాక్టరీ యజమానిది. ఆ గదిని స్టోర్ రూముగా వాడుకోవాలని అనుకుంటున్నాననీ, అపూని వేరేగది చూసుకోమనీ చెప్పాడాయన. ఈ పరిస్థితుల్లో ఎక్కడికని వెళ్ళాలి?

కనీసావసరాలకక్కూడా డబ్బుల్లేని స్థితి ఏర్పడడంతో తను చోర్‌బజార్‌లో కొనుక్కున్న వస్తువుల్ని అమ్మెయ్యటానికి బయల్దేరాడు అపూ. పాత సామాన్లుకొనే ఓ దుకాణాన్ని వెతికి పట్టుకున్నాడు. ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న ప్లేట్లు ఒక్క రూపాయి వెల కూడా పలకలేదు. ఫ్లవర్ వేజ్‌లకు ఎనిమిదణాలూ, పటాలకు పదణాలూ వచ్చాయి. డోర్ కర్టెన్‌ను అమ్మడానికి మాత్రం మనసొప్పలేదు.

బియ్యం కొనేందుకు డబ్బులు చాలటంలేదని, ఈ మధ్య పేలాలు కొంటున్నాడు అపూ. వాటిని పిండిచేసి, కాస్తంత బెల్లమో, ఉప్పో కలిపి తినెయ్యొచ్చు. తన చిన్నప్పుడు ఏవయినా పర్వదినాల్లో ఈ ఫలహారం చేసిపెట్టేది అమ్మ. ఇప్పుడదే తన రోజువారీ భోజనంగా తయారయింది. ప్రతిరోజూ అదే తిండి గొంతు దిగటంలేదు. కానీ ఇంత చవకలో కడుపునిండే పదార్థం మరొకటి కనబడలేదు.

ఏదయినా ఉద్యోగ ప్రకటన కనబడుతుందేమోనని ప్రతిరోజూ లైబ్రరీకి వెళ్ళి న్యూస్ పేపర్లలో గాలించటం దినచర్యగా మారింది. వీధుల్లో దీపస్తంభాలమీద అంటించే ప్రకటనల కోసం కూడా వెతుకుతున్నాడు. ట్యూషన్ టీచర్లు కావాలన్న ప్రకటన కనబడగానే ఆ చిరునామా వెతుక్కుంటూ వెళ్తున్నాడు. కానీ అప్పటికే ఆ ఉద్యోగాన్నెవరో తన్నుకుపోయి ఉంటారు. ఇలా రోడ్లు పట్టుకు తిరగడంలో బట్టలు దుమ్ముకొట్టుకు పోతున్నాయి. ఉతుక్కునేందుకు సబ్బులేదు.

ఒకరోజు తివారీగారి భార్య బట్టలు నానబెడుతుండగా సంకోచిస్తూనే వెళ్ళాడు అపూ. 'బహూ, కాస్తంత సబ్బుపొడి ఇస్తారా...ఈ చొక్కా, ధోవతీ ఉతుక్కుంటాను' అని అడిగాడు.

ఆమె చిరునవ్వు నవ్వి, 'వాటినిలా ఇవ్వు బాబూజీ, వీటితోబాటు ఉతికేస్తాలే' అంటూ అపూ బట్టల్ని తీసుకుంది. ఆమె అభిమానానికి కదిలిపోయాడు అపూ.

త్వరలోనే తనను కాలేజి నుండి పంపించేస్తారన్న భయం పట్టుకుంది. మన్సాపోతాకు తిరిగి వెళ్ళినా అక్కడ తనకేం పని దొరుకుతుంది? తేలీవాళ్ళ కుటుంబం మరో పురోహితుణ్ణి ఏర్పాటు చేసుకుందనీ, అప్పటి నుంచి తనంతగా పట్టించుకోవటమే మానేశారనీ సర్వజయ రాసింది. తను కూడా వెళ్తే అమ్మకు మరింత భారంగా తయారవుతాడేమో! ఐనా, చదువుమానేసి వెళ్ళిపోవటమెలా?

కలకత్తాలో ఈ ఏడాదిపాటు గడిపిన జీవితంలో అపూ ఎంతగానో మారాడు. ప్రపంచాన్ని కొత్త చూపుతో చూడటం నేర్చుకున్నాడు. మన్సాపోతాలోనూ, దివాన్‌పూర్ లోనూ మరో పదేళ్ళున్నా ఈరకమైన అనుభవం వచ్చేది కాదేమో. ఈ మార్పుకు కారణం, కేవలం కాలేజీలో వింటున్న పాఠాలు కాదు; ఆ గ్రంథాలయం, అక్కడున్న పుస్తకాలూ అతణ్ణి కొత్త మనిషిగా మార్చాయి. అది తానెన్నటికీ తీర్చుకోలేని ఋణం.

లైబ్రరీలో ఉన్నంతసేపూ అన్నిటినీ మరిచిపోతాడు అపూ – చివరికి ఆకలిదప్పుల్ని కూడా. అంతసేపూ అతని హృదయాన్ని ఏదో పారవశ్యం ఆవరించినట్టుగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో విషయం మీద ఆసక్తి రేకెత్తుతుంది. దానికి సంబంధించిన పుస్తకాలలో తలమునకలయిపోతాడు. కొన్నిసార్లు ఆ అన్వేషణ కొద్ది రోజులలో ముగుస్తుంది, మరి కొన్నిసార్లు నెలల తరబడి కొనసాగుతుంది. వివిధ నాగరికతల ఉత్థాన – పతనాలూ, గొప్ప కవిత్వమూ, చిత్రకళా, మహనీయుల జీవిత చరిత్రలూ, ప్రస్తుతం సాగుతున్న యుద్ధం – ఇలా అనేక విషయాలను గురించి చదువుతూ ఉంటాడు అపూ.

గది ఖాళీ చెయ్యమని యజమాని పోరుపెడుతున్నాడు. జేబులో చిల్లిగవ్వ లేకుండా ఎక్కడికి వెళ్ళాలి? చివరికి చక్కటి ప్రకృతి దృశ్యాలతో ఉన్న డోర్ కర్టెన్‌ను కూడా అమ్ముకోక తప్పలేదు. వచ్చిన డబ్బులతో అతికష్టంమీద ఓ వారం గడిచింది. మళ్ళీ పరిస్థితి మామూలే.

మిత్రులెవరితోనూ తన పరిస్థితిని చెప్పుకోవటం అతనికి చేతకాదు. అర్థంచేసుకున్న కొద్ది మందికి అతనిని సాయం చెయ్యగల స్తోమత లేదు.

ఆ రోజు నిద్రలేచినప్పటి నుంచీ ఆకలితో శోష వచ్చినట్టవుతోంది. రాత్రి కూడా ఆకలితోనే పడుకున్నాడు. ముఖం కడుక్కుని కాలేజీకి బయల్దేరాడు. దారిలో గోడలకు అంటించిన ఉద్యోగ ప్రకటనలను చూసుకుంటూ వెళ్ళాడు. 'అలా ఉన్నావేం అపూ? ఒంట్లో బాగాలేదా?' అని అడిగిన అనిల్‌కు సరైన సమాధానం చెప్పకుండా మాట మార్చాడు.

అమ్మ దగ్గరనుండి ఉత్తరం వచ్చి అప్పుడే పన్నెండు రోజులయిపోయింది. ఆమె కూడా తనలాగే ఆకలితో అలమటిస్తోందేమో! ఎంత కష్టకాలంలోనైనా నోరు తెరిచి ఎవరినీ యాచించలేని అమ్మ స్వభావం అపూకి బాగా తెలుసు. అతని మనసంతా అల్లకల్లోల మయింది. తనకిప్పుడు సాయం చెయ్యగలవారెవరు?

బాగా ధనవంతుడయిన ఓ మిత్రుడు అపూ మనసులో మెదిలాడు. ఇద్దరూ ఒకే తరగతిలో చదువుతున్నా, చెప్పుకోదగిన స్నేహమేమీ ఏర్పడలేదు. కానీ ఆ అబ్బాయి చాలా సంపన్నుడు. అతను తలచుకుంటే తనకు ఏ సహాయమయినా చెయ్యగలడు. వెంటనే అతని ఇంటికి బయల్దేరాడు అపూ.

మూడంతస్తుల భవనమది. విశాలమైన ఆవరణలో పావురాలు తిరుగాడుతున్నాయి. అపూని చూసి అతని క్లాస్‌మేట్ ఆశ్చర్యపడ్డాడు. "అరె నువ్వా? రోల్ నంబర్ పన్నెండు కదూ... నీ పేరేమిటో గుర్తురావటంలేదు... లోపలికి రా" అంటూ ఆహ్వానించాడు.

అతను ఏవేవో కబుర్లు చెప్తున్నాడు. తను వచ్చినపని ఎలా ప్రస్తావించాలో అపూకి అర్థమవటంలేదు. అతన్ని డబ్బులడగటం ఎంత అసహ్యంగా ఉంటుంది? చటుక్కున లేచి, వెళ్ళటానికి తయారయ్యాడు. టీ తాగి వెళ్ళమని ఆపాడు మిత్రుడు.

టీతోబాటుగా స్వీట్లూ, పండ్ల ముక్కలూ, ఇంకేవో తినుబండారాలూ కూడా వచ్చాయి. అవి తినేసి, డబ్బు మాటెత్తకుండానే బయటికి నడిచాడు అపూ. దారిలోనే ఎదురైన హోటల్ యజమాని, అప్పుతీర్చమని గొడవ మొదలెట్టాడు. అనాలోచితంగానే, 'సాయంత్రం మీ అప్పంతా తీర్చేస్తా' అనేసి అక్కణ్ణుంచి బయటపడ్డాడు.

ఓ ప్రాథమిక పాఠశాలలో టీచర్ కావాలన్న ప్రకటనొకటి మర్నాడు కనబడగానే, ఆ స్కూలు వెతుక్కుంటూ వెళ్ళాడు అపూ. ఇరుగ్గా ఉన్న ఓ సందులోని ఇంట్లో ఆ స్కూలు నడుపుతున్నారు. సాయంత్రం అపూ వెళ్ళేసరికి ఆ స్కూల్లో కొందరు వృద్ధులు కూర్చుని చదరంగం ఆడుకుంటున్నారు. లెక్కల టీచరు కోసం ప్రకటన ఇచ్చామనీ, జీతం పది రూపాయలు ఇస్తామనీ వాళ్ళలో ఒకాయన చెప్పాడు. ఉద్యోగాలు దొరకటమే గగనమైపోయిన ఈ రోజుల్లో పదిరూపాయలివ్వటమంటే సామాన్యమేమీ కాదని కూడా అన్నాడాయన.

ఆ చీకటి గదినీ, ఆ వృద్ధుల ముఖాల్లోని నిరాసక్తతనూ చూడగానే అపూ హృదయం కుంగిపోయింది. ఆ వాతావరణంలో ఇమడటం తనకు సాధ్యంకాదని నిశ్చయించుకుని బయటికి నడిచాడు. వీధిలో నడుస్తున్న అపూ మనసులో ఎన్నడూ ఎరుగని భయమేదో ప్రవేశించింది. ఇప్పుడీ రాత్రి గడవడమెలా? రేపు మళ్ళీ తెల్లవారాక జీవితాన్ని ఎదుర్కోవటమెలా? అమ్మకు ఏరకంగానూ ఉపయోగపడలేకపోయాననే బాధ అతన్ని తొలిచివేస్తోంది. ఆమె ఎలా ఉందో తెలీదు.

దారిలో ఒక మార్వాడీల భవనం ఎదురయింది. అక్కడ ఏదో వేడుక జరుగుతున్నట్టుంది. రంగురంగుల ఎలక్ట్రిక్ దీపాలతో ఇల్లంతా అలంకరించారు. పూరీలు వేగుతున్న కమ్మని పరిమళం పరిసరాలంతటా వ్యాపిస్తోంది. ఆ గుమ్మం ముందు ఆగిపోయాడు అపూ. 'నేనిప్పుడు వీళ్ళింటికెళ్ళి పేద విద్యార్థినని చెప్పి, భోజనం పెట్టమని అడిగితేనో?' అనే ఆలోచన మెదిలింది అతని మనసులో. ఇంత పెద్ద విందులో తనకొక్కడికి భోజనం పెట్టడానికి వాళ్ళకేమీ అభ్యంతరం ఉండకపోవచ్చు. కానీ ఎవరో అపరిచితుల ఎదుట చేయిజాపటానికి ఆత్మాభిమానం అడ్డుపడింది.

తానిక జీవితంలో ఓడిపోయినట్టేనా? తిరిగి ఊరికి వెళ్ళిపోవాల్సిందేనా? ఈ ఆలోచనకు అతని హృదయం తిరగబడుతోంది. తనదైన జీవితాన్నీ, వెలుగునూ, స్వేచ్ఛనూ ఈ నగరంలోనే వెదుక్కోవాలి. గ్రామానికి వెళ్ళడమంటే చీకట్లోకి తిరిగి ప్రవేశించటమే. ఇక్కడ ఆర్థికమైన దారిద్ర్యాన్ని మాత్రమే అనుభవిస్తున్నాడు. అక్కడ భావదారిద్ర్యానికీ, మేధా దారిద్ర్యానికీ కూడా లోనవ్వాల్సి ఉంటుంది.

ఈ ఆలోచనల్లో పడి గదికి చేరేసరికి రాత్రయిపోయింది.

## 9

అపూని పరీక్షలు రాయటానికయితే అనుమతించారు గానీ, ఫీజు బకాయి కడితేనే సెకెండియర్ క్లాసులకు వెళ్ళటం కుదురుతుందని చెప్పారు కాలేజిలో.

పరీక్షా ఫలితాలు రాకముందే అనిల్ ఓ శుభవార్త చెప్పాడు. ఫిజిక్స్, మాథమాటిక్స్ సబ్జెక్టుల్లో అపూకి మొదటి ర్యాంక్ వచ్చిందని అనిల్‌తో టీచర్లు చెప్పారట. నిష్కల్మషంగా తనను అభినందించిన మిత్రుడిని చూసి ఎంతో సంతోషపడ్డాడు అపూ.

సాహిత్యంమీద అపూకి ఉన్న ఆసక్తినీ, అతను నోట్‌బుక్‌లో రాసుకునే కథలూ, కవితలనూ చూసిన అనిల్‌కు అపూమీద ప్రత్యేకమైన అభిమానం ఏర్పడింది. అపూ రాసే కథల నిండా అతని యవ్వనోత్సాహం తొణికిసలాడుతూ ఉంటుంది. టాగోర్ శైలిని అనుకరిస్తూ కవిత్వం రాయాలని అతను ప్రయత్నిస్తుంటాడు.

ఒకరోజు అపూ, అనిల్ కలిసి బొటానికల్ గార్డెన్‌కు వెళ్ళారు. మాటల మధ్యన ఒక విషయం చెప్పాడు అనిల్. వాళ్ళ నాన్నగారి మిత్రుడొకాయనకు తనంటే చాలా

అభిమానమనీ, వచ్చే ఏడాది ఆయన తనను పై చదువుల కోసం ఇంగ్లాండ్‌కుగానీ, ఫ్రాన్స్‌కుగానీ పంపుతాడనీ చెప్పాడు. యుద్ధం ముగిశాక జర్మనీకి కూడా వెళ్ళాలనుంది అనిల్‌కు. అంతేకాదు, కొన్నాళ్ళ తర్వాత తాను అమెరికాకు వెళ్ళేటప్పుడు అపూని కూడా ఎలాగైనా వెంటపెట్టుకుని వెళ్తానని మాటిచ్చాడు.

తాము చూడవలసిన ప్రదేశాలను గురించి ఇద్దరూ చర్చించుకున్నారు. 'మనిద్దరం ఓ నిర్ణయం తీసుకుందాం అనిల్! ఏ గుమాస్తా ఉద్యోగాల్లోనో కూరుకుపోకూడదనీ, డబ్బుకోసం వెంపర్లాడుతూ పనికిమాలిన జీవితాన్ని గడపకూడదనీ ప్రమాణం చేద్దాం. మనం...మనం నిజంగా గొప్ప లక్ష్యాలకు కట్టుబడి బతకాలి. మన జీవితాలకు ఓ విలువను ఏర్పరచుకోవాలి" అన్నాడు అపూ.

మిత్రులిద్దరూ చేతిలో చేయివేసి ప్రమాణం చేసుకున్నారు. విదేశాల్లో చదువుకుని స్వదేశానికి తిరిగి వచ్చాక, శాస్త్ర పరిశోధనా రంగంలో పనిచెయ్యాలనుకుంటున్నానని తన జీవిత లక్ష్యాన్ని మిత్రుడికి వెల్లడించాడు అనిల్.

అపూ కూడా మనసువిప్పి తన భవిష్యత్ స్వప్నాలను అనిల్‌తో పంచుకున్నాడు. "నా చిన్నప్పుడు మా ఇంట్లో ఓ పాత పుస్తకం ఉండేది. భూమికి ఎంతో ఎత్తున, వాటి కాంతి భూమికి చేరనంత దూరాన ఉండే నక్షత్రాలను గురించి అందులో చదివాన్నేను. సాయంత్రాలు నదికి వెళ్ళి, అక్కడి పడవల్లో ఒంటరిగా పడుకుని, ఆ నక్షత్రాల గురించి ఆలోచించేవాణ్ణి. ఆకాశంలోని తారలను చూస్తూవుంటే ఏదో ఉన్నతమైన లోకానికి చేరుకున్నట్లుగా అన్పించేది... అసలా భావనను మాటల్లో చెప్పలేను. పెద్దవాడినయ్యాక కూడా నా మనసుకేదయినా బాధ కలిగినప్పుడల్లా నింగిలోని ఆ తారలను చూస్తుంటే నాకేదో కొత్త శక్తి వచ్చినట్లుగా తోస్తుంది. అది ఈ లోకానికి సంబంధించిన విషయమే కాదన్పిస్తుంది..." తన హృదయం విప్పి, ఇలా మాట్లాడటం అపూ జీవితంలో అదే మొదటిసారి.

❖ ❖ ❖ ❖

మర్నాడు అపూ కాలేజీకి వెళ్ళగానే అనిల్ ఎదురయ్యాడు. కాసేపు మాట్లాడుకున్న తర్వాత అపూ క్లాసుకు వెళ్ళిపోయాడు. ఓ పుస్తకం కొనటానికి బజారుకు బయల్దేరాడు అనిల్.

కొంతకాలంగా అనిల్‌కు అప్పుడప్పుడూ పొత్తి కడుపులో నొప్పిగా ఉంటోంది. ఇవాళ వీధిలో నడుస్తుండగా నొప్పి మొదలై, అంతకంతకూ పెరగసాగింది. ట్రాములన్నీ రద్దీగా వెళ్తున్నాయి.

కాస్త ఖాళీగా ఉన్న బండి చూసుకుని ఎక్కుదామనుకుంటూ తన దగ్గరున్న ఓ ఉత్తరాన్ని పోస్టు డబ్బాలో వేసేందుకు ముందుకు నడిచాడు. చెయ్యిపైకెత్తి, డబ్బాలో

ఉత్తరాన్ని వెయ్యబోతుండగా పొత్తికడుపులో కత్తితో పొడిచినట్టయింది. ఒక చేత్తో పొట్టను అదిమిపట్టుకుని వెనక్కి తిరగబోయిన అనిల్ ఒక్కసారిగా కూలిపోయాడు. ఆ పక్కనే అరటిపండ్లు అమ్ముతున్న ముస్లిం వర్తకుడు పరిగెత్తుకొచ్చి తనను పట్టుకోవటం లీలగా తెలుస్తోంది.

క్షణాల్లో జనం అనిల్ చుట్టూ చేరారు. ఏమైంది?... ఒంట్లో బాగాలేదేమో! అతనిక్కాస్త గాలి తగలనివ్వండయ్యా... ఇదుగో ఈ రుమాల్లో కాస్త ఐస్ పట్టుకురండి... మంచినీళ్ళివ్వండి...అంటూ ఎవరికి తోచినది వాళ్ళు చెప్తున్నారు.

'రిప్పన్ కాలేజి... అపూర్వ కుమార్ రాయ్...' అనే రెండు మాటల్ని అతి కష్టంమీద పలకగలిగాడు అనిల్. అంతే... అతని కళ్ళముందు గాఢమైన అంధకారం అవరించింది. అలా ఎంతసేపున్నాడో తెలీదు. కొద్దిగా స్పృహ వస్తుండగా తను ఏదో డబ్బాలాంటిదాన్లో ఉన్నట్టూ... అది వేగంగా కదులుతున్నట్టూ అన్పించింది. ఏవో కంఠాలు అస్పష్టంగా వినబడుతున్నాయ్...కారు హారన్ మోగుతోంది.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి తెల్లటి గోడలున్న ఓ గదిలో మంచంపై పడుకుని ఉన్నానని అర్థమయింది అనిల్‌కు. తన తండ్రితోబాటు మరెవరో అపరిచితులు తనకు సమీపంలో కూర్చుని ఉన్నారు. నర్సు దుస్తుల్లోని ఇద్దరు ఇంగ్లీష్ మహిళలు చకచకా తిరుగుతున్నారు. ఇది ఆస్పత్రా? ఇక్కడికి తననెవరు తీసుకొచ్చారు? ఏమీ అర్థంకావటం లేదు.

అనిల్ స్పృహ తప్పుతూ చెప్పిన చిరునామా ఆధారంగా ఎవరో వెళ్ళి అపూకి విషయం చెప్పారు. అపూ, సత్యేన్ పరిగెత్తుకొచ్చి అంబులెన్స్‌ను పిలిపించి, మెడికల్ కాలేజి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనిల్ తల్లిదండ్రులకు కూడా కబురందింది. హెర్నియా కారణంగా అంత తీవ్రమైన కడుపునొప్పి వచ్చిందని చెప్పి, వెంటనే ఆపరేషన్ చేశారు డాక్టర్లు. ఈ విషయాలన్నీ మర్నాటికి తెలిశాయి అనిల్‌కు.

ఆ సాయంత్రం అపూ వచ్చేసరికి పూర్తి స్పృహలో ఉన్నాడు అనిల్. పక్కనే కూర్చుని ఉన్న అతని తల్లి పాదాలకు నమస్కరించాడు అపూ.

'నువ్వు ఎంత సాయం చేశావో చెప్పారు బాబూ! నువ్వు సమయానికి లేకపోతే ఏమయ్యేదో' అంది ఆవిడ.

"నీకో తమాషా చూపించనా అపూర్వా! ఈ బెల్లునొక్కగానే ఓ నర్సు పరిగెత్తుకుంటూ వచ్చేస్తుంది' అంటూ పక్కనున్న బెల్ నొక్కాడు అనిల్. పొడుగ్గా ఉన్న ఓ నర్సు గబగబా వచ్చింది. ఆమె వెళ్ళిపోగానే అనిల్‌ను వాళ్ళమ్మ కోప్పడింది.

అనిల్ పకపకా నవ్వుతుంటే అపూ కూడా శ్రుతి కలిపాడు. కొద్దిసేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత అనిల్ దగ్గర సెలవు తీసుకుని వెలుపలికొచ్చాడు అపూ. వెంటనే

గదికి వెళ్ళటానికి మనస్కరించలేదు. మైదానంలో కాసేపు పచార్లుచేసి గదికి వెళ్ళేసరికి చీకటిపడింది. గదిలో అడుగుపెడుతూ ఉండగానే సత్యేన్, అనిల్‌కు అన్నయ్య వరసయ్యే మరో కుర్రాడూ పరిగెత్తుకొచ్చారు ఆందోళన నిండిన ముఖాలతో.

'అనిల్ చనిపోయాడు, ఇప్పుడే అర్థగంట కిందట'

ఆ మాట వింటూనే దిక్కుతోచనట్టుగా ఆస్పత్రికి పరిగెత్తాడు అపూ. అనిల్ దేహాన్ని నేలపై ఉంచి, తెల్లని దుప్పటి కప్పేశారు. ఆస్పత్రిలోని ఆ గదంతా అనిల్ మిత్రులతో కిక్కిరిసిపోయింది. కాసేపటి తర్వాత అందరూ శ్మశానానికి బయల్దేరారు.

అనిల్ అంత్యక్రియలు పూర్తవగానే అందరూ గంగానదిలో స్నానాలు చేశారు. అపూ మాత్రం దూరంగానే ఉండిపోయాడు. అతనికెందులో కలకత్తాలోని ఈ గంగానదిపై ఎలాంటి పవిత్ర భావమూ కలగలేదు. అనిల్ తండ్రి అంత దుఃఖంలోనూ అపూ స్థితి ఎలా ఉందోనని కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు. ఆయన ఆప్యాయతకు కన్నీళ్ళొచ్చాయి అపూకి.

అనిల్ మరణంతో దిగ్భ్రాంతికి లోనయ్యాడు అపూ. అతని మనసంతా శూన్యమై పోయింది. బాధ కూడా తెలియనంతగా మొద్దుబారిపోయింది. మూడు రోజుల కిందటే తనూ అనిల్ కలిసి భవిష్యత్‌ను గురించి కలలుగన్నారు. తన చిన్ననాటి కబుర్లన్నిటినీ ఆ రోజునే అనిల్‌తో కలబోసుకున్నాడు. ప్రతి సాయంత్రమూ ఆకాశంలోని చుక్కలను తానెంత ఆశ్చర్యంగా చూసేవాడో అనిల్‌తో చెప్పటం గుర్తొచ్చింది. ఇప్పుడూ అదే విభ్రమంలో మునిగిపోయాడు అపూ. ఎక్కడికి వెళ్ళిపోయాడు అనిల్?

❖ ❖ ❖ ❖

రోజులు గడిచేకొద్దీ అపూలో నైరాశ్యం మరింతగా పేరుకుపోతోంది. లైబ్రరీక్కూడా వెళ్ళాలన్పించటం లేదు. అనిల్ లేని లోటు అంతకంతకూ తీవ్రమైన బాధగా మారుతోంది.

ఒకరోజు సాయంత్రం కాలేజి ఆవరణలోని బల్లపై కూర్చుని ఆలోచనల్లో మునిగి పోయిన అపూని ఓ వ్యక్తి పలకరించాడు. ఆయన మధ్య వయస్కుడు. అతని చేతులమీద నరాలు పైకి తేలి, స్పష్టంగా కనబడుతున్నాయి.

'ఈత పోటీలు ఎప్పుడు జరుగుతాయో తెలుసా?' అన్నాడాయన.

ఆ విషయం తనకేమీ తెలీదని జవాబిచ్చాడు అపూ. ఈత గురించీ, ఇంకేవో క్రీడల గురించీ చాలా విషయాలు చెప్పాడాయన. తాను చాలా కాలంపాటు యూరప్‌లోనూ, అమెరికాలోనూ ఉండివచ్చానని చెప్పగానే అపూలో ఆసక్తి తలెత్తింది.

'మీ పేరు?'

'సురేంద్రనాథ్ బసూ – మల్లిక్', జవాబిచ్చాడాయన.

ఆయనెవరో గుర్తొచ్చింది అపూకి. కాసేపు ఆయనకేసి చూసి 'మీ పేరు విన్నానండీ. ఓ పత్రికలో లెటర్స్ ఫ్రమ్ ఇంగ్లాండ్ అనే కాలమ్ రాసింది మీరే కదూ?" అని అడిగాడు.

'ఔను, నేనే. కానీ చాలాకాలమయింది... దాదాపు పదేళ్ళకుపైగానే. నీకెలా తెలుసు? ఎప్పుడయినా చదివావా?'

'చదవటమా? అందులో ప్రతి పదాన్నీ కంఠతా పట్టాననండీ. అప్పుడు నాకు పదేళ్ళుంటాయి. మీ కాలమ్ చదివితే నాకెంత ఉత్తేజంగా ఉండేదో!'

బసూ మల్లిక్ చాలా సంతోషించాడు. 'ఆశ్చర్యంగా ఉందే...ఎంతో దూరదేశాల నుండి నేను రాసిన ఆ కాసిని మాటలు...వేలాది మైళ్ళకు ఆవల, బెంగాల్‌లోని ఓ పల్లెటూరి కుర్రాడిని ఇంతగా ఆకర్షించాయా... గుడ్, గుడ్! బావుందయ్యా. చాలా సంతోషంగా ఉంది'

ఆయనతో మాట్లాడుతూ ఉంటే, ఎవరో కొత్త వ్యక్తితో ఉన్నట్టుగా తోచటంలేదు అపూకి. తన బాల్యంలోని ఎన్నో మధురస్మృతులకు కారకుడు ఈయనే. విదేశాలలోని ఎన్నో ప్రదేశాలను తనకు పరిచయంచేసి, తన పసిహృదయంలో భ్రమణ కాంక్షను రేకెత్తించిన వ్యక్తి ఈయన.

కొత్త ఉత్సాహంతో గదికి వెళ్ళాడు అపూ. తనను ఎంతగానో ఉత్తేజపరచిన ఆ రచయితను ఇలా కలుసుకుంటానని కలలోనైనా ఊహించాడా? నిజంగా జీవితం దానికదే ఓ గొప్ప వరం! జీవితంపై ఓ కొత్త ఆశ అతనిలో చిగురించింది.

❖ ❖ ❖ ❖

సందె పొద్దు వాలుతున్న వేళ. గుమ్మంలో నిలబడి, పక్కింటి తేలీల కోడలితో కబుర్లాడుతోంది సర్వజయ. వీధి మలుపులోంచి వస్తున్న అపూని చూసిన పక్కింటి యువతి, 'మీ ఇంటికి ఎవరొస్తున్నారో చెప్పుకోండమ్మగారూ!' అంది చిరునవ్వుతో.

సర్వజయ గుండె వేగంగా కొట్టుకుంది. ఎవరూ? అపూనా? మరుక్షణంలో పరుగెత్తుకెళ్ళి కొడుకును రెండు చేతుల్లోనూ చుట్టేసింది. అతన్ని గాఢంగా గుండెలకు హత్తుకుంది. అతని భుజమంతా ఆమె కన్నీళ్ళతో తడిసిపోతోంది. అపూ కిందటిసారి చూసినప్పటికన్నా బలహీనంగా, పాలిపోయినట్టుగా కన్పించిందామె. ఐనా, ఆమె ముఖంలో కళ తగ్గలేదు. ఆమెను తన చేతుల్లోకి తీసుకోవాలనీ, ఆమెను చుట్టుముట్టిన కష్టాల్లోంచీ, దిగుళ్ళలోంచీ తల్లిని కాపాడుకోవాలనీ అన్పించింది అపూకి. ఇటువంటి భావన అతనిలో అంతకుముందెన్నడూ కలగలేదు.

ఆ రాత్రి అపూకిష్టమైన కిచురీ వండిపెట్టింది సర్వజయ. చాలాకాలం తర్వాత తృప్తిగా భోజనం చేశాడు అపూ.

'కలకత్తాలో కిచురీ దొరుకుతుందట్రా నీకు?' అడిగింది తల్లి.

అపూ పసివాడుగా ఉన్నప్పుడు, తమ కష్టాలనూ, కన్నీళ్ళనూ వాడికంట పడనివ్వకుండా అందమైన అబద్ధాల మేలి ముసుగులో వాటిని దాచేసేదామె. ఇప్పుడది అపూ వంతయింది.

'దొరుకుతుందమ్మా. ఎప్పుడూ కిచురీ వండుతూనే ఉంటారక్కడ'

'మరి పొద్దునో? ఏం ఫలహారం తింటావక్కడ?'

తన ఊహల్లోని ఫలహారాల జాబితాను ఏకరువుపెట్టాడు అపూ: ఒక్కోసారి పూరీలు తింటాడు, మరికొన్నిసార్లు మిఠాయిలు తిని, టీ తాగుతాడు. అక్కడసలు భోజనం సమస్యనేదే ఉండదని నమ్మబలికాడు.

ప్రీతిబాల అనే అమ్మాయికి అపూ ట్యూషన్ చెబుతున్నాడనే అనుకుంటోంది సర్వజయ. ఆ ఉద్యోగం కొన్ని నెలల కిందటే పోయిందని ఆమెకు తెలీదు. అందుకే, "నువ్వు చదువు చెప్తున్నావే... అదే, ఆ శ్రీమంతుల పిల్ల... ఆ అమ్మాయి చక్కగా ఉంటుందా?" అని అడిగింది.

'ఔనమ్మా, చాలా అందంగా ఉంటుంది.'

'నాకేమన్పిస్తోందంటే...వాళ్ళు గనక ఆ పిల్లను నీకిచ్చి పెళ్ళిచేస్తే బావుంటుంది కదరా?'

'అమ్మా!' పగలబడి నవ్వాడు అపూ.

'ఏం మాటలమ్మా అవి! అదెలా జరుగుతుందనుకుంటున్నావ్? వాళ్ళకి బోలెడంత డబ్బుంది.'

సర్వజయ నమ్మకం మాత్రం సడలలేదు. తన కొడుకును పెళ్ళాడటం ఏ పిల్లలకైనా గొప్పవరమని ఆమె నమ్మకం. తల్లి ఎంతసేపటికీ ఆమె సమస్యను గురించి మాట్లాడ్డం లేదనీ, డబ్బులెందుకు పంపలేదని తనను మాటమాత్రమైనా అడగనే లేదని గమనించాడు అపూ. పైగా ఓ కొత్త గిన్నెనూ, గ్లాసునూ పట్టుకొచ్చి అతని ముందుపెట్టి, 'ఇవి నీ కోసమే కొన్నాన్రా అపూ! పాత బట్టలుంటే ఇచ్చేసి వీటిని తీసుకున్నా, బావున్నాయా?' అంది.

అంత చిన్న విషయానికే సంతోషపడుతున్న అమ్మ ముఖంలో వెలుగును చూస్తూండి పోయాడు అపూ.

కొద్ది రోజులు ప్రశాంతంగా గడిచాయి. కలకత్తాలోని సమస్యల నుండి దూరంగా వచ్చిన ఆనందాన్ని ప్రతి క్షణం అనుభవిస్తున్నాడు అపూ. రాత్రులు అమ్మ పక్కనే పడుకుని, ఆమెను పాటపాడమని అడుగుతాడు, అచ్చంగా తన చిన్నతనంలో చేసినట్టే. 'ఏమిట్రా నువ్వు? నాకేం పాటలు రావు' అంటుంది సర్వజయ నవ్వుతూ.

'నీకొచ్చులేమ్మా, పాడు. పోనీ ఇద్దరం కలిసి పాడుదాం. నిశ్చిందిపూర్‌లో ఉన్నప్పుడు పాడేదానివే, ఆ పాట పాడుదాం.'

చిన్నప్పుడు అపూ చక్కగా పాడేవాడు. కానీ ఎవరిముందైనా పాడాలంటే వాడికి తగని సిగ్గు. కానీ, ఒక్కోసారి తనకు తానుగా పాటపాడాలని వచ్చేవాడు. పైకి మాత్రం, ఆ మాట చెప్పకుండా 'ఇవాళ నన్ను పాటపాటమని అడగకమ్మా' అనేవాడు. వాడి

మనసులో ఉన్నదేమిటో సర్వజయకు అర్థమైపోయేది. 'పోనీ, ఒక్క పాట పాడరాదూ అపూ, నా కోసం!' అనేది. అపూ సంతోషంగా పాట మొదలెట్టేవాడు.

ఇప్పుడు అపూకేసి చూస్తుంటే సర్వజయకు అవన్నీ గుర్తొస్తున్నాయ్. ఆ అల్లరి పిల్లాడు అపూ ఎంత మారిపోయాడు! పొడుగ్గా, దృఢంగా, అందంగా ఉన్న కొడుకును చూస్తే ఆశ్చర్యంగా ఉంది. ఈ అపూ చిన్నప్పటి లాగా ఏ కోరికలూ కోరటంలేదు. ఏ మూలనో దాగి తనను భయపెట్టడం లేదు. కానీ, వాడి చూపులో, చిరునవ్వులో సర్వజయకు అమాయకమైన తన చిన్నారి అపూనే కనబడుతున్నాడు. 'వచ్చే జన్మలో కూడా వీడిని నా కడుపునే పుట్టించు భగవాన్' అని మౌనంగా ప్రార్థించిందామె. పసితనంలో అపూ తనకు అందించిన ఆనందాన్ని హృదయమంతటా నింపుకుంది సర్వజయ. తరువాతి రోజుల్లో ఎదురయిన కష్టాలకూ, కన్నీళ్ళకూ ఎదురీదే ధైర్యాన్ని తనకు ప్రసాదించిన అమృతమది.

'ఓసారి నన్ను కలకత్తాకు తీసుకెళ్తావట్రా అపూ? కాళీ ఘాట్ చూడాలనుంది' అడిగింది సర్వజయ.

'అలాగేనమ్మా. దుర్గా పూజకు తీసుకెళ్తా'.

'నిశ్చిందిపురంలో మన మామిడితోట గుర్తుందా అపూ? తర్వాత భువన ముఖర్జీ గారికి అమ్మేశాంగా! దాన్ని మళ్ళీ నువ్వుకొంటే బావుణ్ణనిపిస్తుంది. ఏదో ఒక రోజున...నువ్వు పెద్దవాడివై, ఉద్యోగస్తుడివై, పెళ్ళిచేసుకుంటావే అప్పుడు! అలా చేస్తే బావుంటుంది కదూ?'

ఆమె వేదన అపూకి అర్థమవుతోంది. కానీ ఆ కోరికలన్నీ తీరే రోజు వరకూ ఆమె జీవించి ఉంటుందా? ఇలాంటి ఊహ వచ్చినందుకే వణికిపోయాడు అపూ. కానీ, అమ్మ ఆరోగ్యం ఏమీ బాగాలేదని తెలిసిపోతూనే ఉంది. మధ్యాహ్నాలు ఆమె పడుకుని ఉన్నంతసేపూ పక్కనే కూర్చుంటున్నాడు. ఆమె నుదుటిపై చెయ్యివేసి, 'నీకేం భయం లేదమ్మా', అంటూ ధైర్యం చెప్తాడు.

అమ్మ పక్కనే కూర్చుని, అస్తమయ భానుడి చివరి వెలుగులను కిటికీలోంచి చూస్తున్న అపూ మనసులో ఎన్నో ప్రశ్నలు. పెరట్లో సర్వజయ పెంచుతున్న ఆకుకూరల మడులపై పడుతున్న పల్చటి వెలుగులను చూస్తుంటే, ఆ కూర వండుకుని తినేదాకా అమ్మ బతుకు తుందా అన్పిస్తోంది. ఆమె కలకత్తాకు నిజంగా వస్తుందా? మళ్ళీ మామిడి తోటను కళ్ళజూస్తుందా?

ఈ సందెవేళలో, మసకబారుతున్న ఈ సూర్యకాంతిలో ఎంతో దిగులు...ఒంటరి తనం. అపూ హృదయం బరువెక్కింది, కళ్ళలో నీళ్ళు నిండాయి. బలవంతపు చిరునవ్వును ముఖాన అతికించుకుని, అమ్మను దగ్గరగా పొదువుకున్నాడు.

❖ ❖ ❖ ❖

కాలేజి తెరిచేరోజు దగ్గర పడటంతో కలకత్తాకు బయల్దేరాడు అపూ. కానీ, పడవలో నది దాటి, రైల్వేస్టేషనుకు చేరటం ఆలస్యమవటంతో, రైలు వెళ్ళిపోయింది.

సర్వజయకు ఆ రోజు చెప్పలేనంత దిగులుగా అన్పించింది. ఏదో ఒక పనిలో మునిగిపోయి, తనను తాను మరచిపోవాలని ప్రయత్నిస్తోంది. మాసిన బట్టలన్నీ మూట కట్టుకుని చెరువు దగ్గర ఉతుకుతూ కూర్చుంది. రైల్వే స్టేషన్ నుండి తిరిగొచ్చిన అపూ, సామాన్లను వరండాలో పడేసి చెరువు దగ్గరికి పరిగెత్తాడు.

తన వెనకనుండి 'అమ్మా' అంటూ అపూ పిలుపు వినబడటంతో ఆశ్చర్యానందాలతో వెనక్కి తిరిగింది సర్వజయ. 'నువ్వా? నువ్వు వెళ్ళలేదా అపూ?' అంది. 'లేదమ్మా, రైలు అందలేదు. ఇంటికి వెళ్దాం పద' అన్నాడు అపూ నవ్వుతూ.

ఆ సాయంత్రం, వెదురు పొద నీడలో నిలుచున్న అమ్మ ముఖంలో కదలాడిన పట్టరాని ఆనందమూ, తృప్తీ అపూ జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి. అంత ఆనందాన్ని ఆమెలో అతడేనాడూ చూచి ఎరుగడు.

ఆ మరునాడు అపూ కలకత్తాకు వెళ్ళిపోయాడు.

కాలేజి ప్రారంభమయిన మొదటిరోజున, నోటీస్ బోర్డులో ఓ జాబితా ప్రకటించారు. పరీక్షలో ఉత్తీర్ణులయి కూడా, ఫీజు బకాయిపడటం వల్ల పై తరగతిలోకి వెళ్ళలేకపోయిన విద్యార్థులందరి పేర్లు అందులో ఉన్నాయి. దానిలో మొట్టమొదటి పేరు తనదే ఉంటుందనుకున్నాడు అపూ. కానీ, ఆశ్చర్యంగా అందులో అతని పేరు కనబడనేలేదు. పది నెలలుగా జీతం కట్టని తనను పై తరగతికి పంపటం ఎలా సాధ్యమో అర్థం కాలేదతనికి.

రెండు రోజుల తర్వాత ఆ జాబితాలోని చాలామంది విద్యార్థులు ఆఫీసు గదికి వెళ్ళి, గుమాస్తాతో గొడవ పెట్టుకున్నారు. అపూ కూడా వాళ్ళతోబాటే వెళ్ళి నిలబడ్డాడు.

'నన్నెందుకు వేధిస్తారయ్యా బాబూ! ఈ రిజిస్టర్లో చూడండి, సెకెండియర్‌లోకి ప్రమోటవని వాళ్ళందరి పేర్ల దగ్గరా ఎర్ర సిరాతో గుర్తులు పెట్టారు' అని విసుక్కున్నాడు గుమాస్తా.

అందులో తన పేరు కచ్చితంగా ఉంటుందనుకుంటూ రిజిస్టర్లో వెతకసాగాడు అపూ. కానీ తన పేరు దగ్గర ఎర్రసిరా గుర్తేదీ కనబట్టంలేదు. ఇదేదో పొరబాటు జరిగుంటుంది. ఏ గుమాస్తానో తన పేరు ముందు గుర్తుపెట్టడం మర్చిపోయుంటాడు. ఆశ్చర్యంలోంచి తేరుకోలేని స్థితిలోనే బయటికి నడిచాడు అపూ. ఈ సంఘటన అతని హృదయంలో గాఢమైన ముద్రవేసింది.

తన చిన్నప్పటి విషయమొకటి అపూ మనసులో మెదిలింది. అక్క చనిపోయిన కొత్తల్లో, సాయంత్రంపూట తరచుగా నది దగ్గరకు వెళ్ళి ఒంటరిగా కూర్చునేవాడు అపూ. అక్క నరకానికి వెళ్ళి ఉంటుందా? మహాభారతంలో నరకలోకం వర్ణనంతా చదివాడు అపూ. అక్కయ్య అక్కడేం చేస్తుంటుంది? భయంకరమైన రాకాసి డేగలు, యమకింకరులు ఆమెను చుట్టుముట్టి ఉంటారా? ఆ ఆలోచనకే అపూ గొంతులో దుఃఖం అడ్డుపడేది,

కళ్ళనిండా నీళ్ళు నిండేవి. ఒద్దు, ఒద్దొద్దు, అంటూ అతని హృదయం ఆక్రోశించేది. ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండే అక్కయ్య అక్కడెంతమాత్రమూ ఉండలేదు. ఆమె ఉండగలిగే చోటు కాదది. లేత ఎరుపురంగు పులుముకుని, మార్మికంగా కనబడే ఆ సాయంత్రపుటాకాశానికి చేతులు జోడించి, "ఒద్దు భగవంతుడా, మా అక్కయ్య కెలాంటి కష్టమూ రానివ్వకు. తను ఇప్పటికే చాలా కష్టాలు పడింది, ఇంకా కష్టపెట్టొద్దు" అంటూ ప్రార్థించేవాడు అపూ.

ఇన్ని సంవత్సరాలు గడిచినా ఆ అమాయకపు విశ్వాసం అపూ మనసులో అలాగే నిలిచిపోయింది. తనేమీ స్వార్థపూరితమైన కోరికలు కోరటం లేదు భగవంతుణ్ణి. కేవలం జ్ఞానం కోసం, చదువు కోసమే ప్రార్థిస్తున్నాడు కాబట్టి అవి ఫలిస్తున్నాయని అపూ నమ్మకం.

❖ ❖ ❖ ❖

అది ఆగస్టు నెల. క్లాసులు మళ్ళీ ప్రారంభమయ్యాయి, దాంతోబాటే వర్షాలు కూడా. నిరంతరంగా కురుస్తున్న వానలతో వీధులన్నీ బురదమయంగా తయారయ్యాయి. అపూ కలకత్తాకు వచ్చి ఏడాదయింది. ఇంకా తిండికీ, వసతికీ వెతుక్కోవాల్సిన స్థితిలోనే ఉండటం అతన్ని ఆందోళన పరుస్తోంది.

గది యజమాని గొడవ భరించలేనిదిగా తయారవటంతో దాన్ని ఖాళీ చెయ్యక తప్పలేదు. ఎప్పుడూ ఎవరో ఒక మిత్రుణ్ణి బతిమాలి, అతని గదిలో కొన్నాళ్ళు చోటు సంపాదించటంతోనే సరిపోతుంది తప్ప, కాస్త స్థిరమైన వసతి దొరకటం లేదు. న్యూస్ పేపర్లు అమ్మితే కొంత సంపాదనయినా ఉంటుందన్పించి అమృతబజార్ పత్రిక ఆఫీసు కెళ్ళాడు. పేపర్లు ఇవ్వాలంటే కొంత డిపాజిట్ కట్టాల్సి ఉంటుందని వాళ్ళు చెప్పటంతో అపూ గుండెల్లో రాయిపడ్డది. తన పాతగది దగ్గరుండే తివారీ భార్య తప్ప, సాయం చెయ్య గలవారెవరూ కనబడక, ఆమె దగ్గరికి బయల్దేరాడు అపూ. ఆమె భర్త ఇంకా అదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు కాబట్టి వాళ్ళు అదే గదిలో ఉన్నారు. అపూ అడిగిన డబ్బులు వెంటనే సర్దుబాటు చేసిందామె. సమయానికి డబ్బిచ్చి ఆదుకున్న తివారీ బహు మీద అపూకి ఎనలేని కృతజ్ఞత కలిగింది.

వీధుల్లోనూ, ట్రాముల్లోనూ న్యూస్‌పేపర్లు అమ్మడం ద్వారా కనీసావసరాలు తీరుతున్నాయి. చదువుకున్న వాడిలా కనబడే ఈ అందమైన కుర్రాడు పేపర్లమ్ముతుంటే కొందరు ఆశ్చర్యంగా చూసేవాళ్ళు.

ఒకరోజు అపూ కాలేజికి వెళ్ళేసరికి ఆవరణలో ఏదో గొడవ జరుగుతోంది. ఆ గుంపు మధ్యలో వేరే కాలేజికి చెందిన ఓ కుర్రవాడున్నాడు. ఈ కాలేజి లైబ్రరీకి వచ్చి ఓ పుస్తకాన్ని దొంగతనంగా పట్టుకెళ్ళబోతున్న ఆ అబ్బాయిని పట్టుకున్నారు. పోలీసులకు పట్టించాలనుకుంటున్న ప్రిన్సిపాల్‌ను ఓ సీనియర్ అధ్యాపకుడు వారించి, ఆ కుర్రాడిని వెళ్ళిపొమ్మన్నాడు.

ఆ కుర్రాడిని గతంలో తనతోబాటుగా దేవాలయంలో భోజనం చేస్తుండిన హరేన్‌గా గుర్తించాడు అపూ. ఏడుస్తూ వెళ్ళిపోతున్న హరేన్ వెంట పరిగెత్తి, అతన్ని ఆపాడు. హరేన్ ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉంది. ఇప్పుడు ఆలయంలో ఉచిత భోజనం దొరకటం లేదు. బోలెడన్ని అప్పులవటంతో ఎక్కడా ఒక్కపైసా పుట్టే మార్గం లేకుండా పోయింది.

హరేన్‌ను ఓదార్చి మిర్జాపూర్ పార్కుకు తీసుకెళ్ళాడు అపూ. 'ఏదో పని దొరక్కపోదు, భయపడకు. నాతోబాటుగా న్యూస్ పేపర్లమ్మితే కొన్ని అవసరాలు తీరుతాయి' అంటూ ధైర్యం చెప్పాడు. మర్నాటి నుండి హరేన్ కూడా అపూతో కలిసి పేపర్లమ్మసాగాడు.

రోజులు గడుస్తున్నాయి. కాలేజీలో ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజు కట్టాల్సిన అవసరం కూడా అనుకోని విధంగా గట్టెక్కింది. అపూ పరిస్థితిని గ్రహించిన మన్మథ, మరికొందరు మిత్రులూ కలిసి సాయంచేశారు. పరీక్షలు పూర్తయేవరకూ ఉండి చదువుకునేందుకు ఓ గదిని సంపాదించటం ఎలాగో అర్థమవటం లేదు. తన పాత గది యజమానినే బతిమాలుదా మని నిశ్చయించుకుని ఫ్యాక్టరీకి వెళ్తే, ఆ మేనేజర్ దొరకలేదు. కానీ అపూని గుర్తుపట్టిన కార్మికులు ఓ సలహా ఇచ్చారు. కంపెనీ డైరెక్టర్లలో ఒకరయిన లాహిరిగారిని కలిసి అడిగితే, ఆయన తప్పకుండా అంగీకరిస్తాడనీ, అప్పుడిక ఈ మేనేజర్ కాదనటానికి వీలుండదనీ వాళ్ళన్నారు.

లాహిరిగారి అడ్రస్ తీసుకుని భవానీపూర్‌లోని ఆయన ఇంటికెళ్ళాడు అపూ. నాలుగురోజులుగా తిరుగుతున్నా ఆయన్ని కలుసుకోవడమే కుదరటంలేదు. ఆ రోజు ఎలాగయినా ఆయన్ని కలుసుకోనిదే వెళ్ళరాదని నిశ్చయించుకుని ఆ ఇంటి ఆవరణ లోని బల్లపై కూర్చున్నాడు అపూ.

కాసేపటి తర్వాత ఆ ఇంట్లో పనిచేసే ఒక యువతి వచ్చింది. 'మా చిన్నమ్మగారు మిమ్మల్ని పిల్చుకు రమ్మన్నారు' అంటూ.

అపూకి ఏమీ అర్థంకాలేదు. అయోమయంగానే ఆమె వెనుక నడిచాడు. పొడవాటి వరండా మీదుగా నడిచి ఓ గది ముందు ఆగిందామె. అక్కడ దాదాపు పందొమ్మిదేళ్ళ వయస్సున్న ఓ అమ్మాయి టేబుల్ ముందు కూర్చుని రాసుకుంటోంది. ఎర్రటి అంచున్న సాదాచీర కట్టుకుని, మెళ్ళో సన్నటి గొలుసు, చేతులకు బంగారు గాజులూ వేసుకుంది. వదులుగా ముడేసుకున్న జుట్టుతో మనోహరంగా ఉన్నదా యువతి.

అపూ ఆ గదిలోకి అడుగుపెట్టగానే ఆమె చిరునవ్వు నవ్వుతూ లేచి నిలబడింది.

ఇది కలకాదు కదా? ఆశ్చర్యంతో నోరు తెరిచాడు అపూ. 'లీలా!' అప్రయత్నంగా చిన్న కేకపెట్టాడు.

'ఐతే, నేను జ్ఞాపకమున్నానన్న మాట! ఎన్నాళ్ళయింది అపూ నిన్ను చూసి? ఎనిమిదేళ్ళయిపోయింది కదూ?' చిరునవ్వుతో అడిగింది లీల.

ఇంత అందమైన ఈ అమ్మాయి తన నేస్తం లీలా? ఏమాత్రం ఆనవాలు పట్టలేనట్టుగా తయారయింది. కానీ ఆ చిరునవ్వు, చేతులు కదిలించే పద్ధతీ చూసి ఆమెను కనిపెట్టగలిగాననుకున్నాడు అపూ.

'ఆఁ... ఔను లీలా, ఎనిమిదేళ్ళయింది... నువ్వు చాలా మారిపోయావ్ సుమా!' అన్నాడు తేరుకుని.

'నిన్న కాలేజికి వెళ్ళబోతూ, నువ్వు పోర్టికోలో కూర్చునుండటం చూశా. ఎక్కడో చూసిన మనిషిలా ఉన్నాడన్పించిందేగానీ, గుర్తుపట్టలేకపోయాను. ఇవ్వాళ కిటికీలోంచి నువ్వు కనబడగానే గుర్తొచ్చింది, నువ్వని. ఎక్కడ చదువుతున్నావ్? ఏ సంవత్సరం?' అంటూ కుశల ప్రశ్నలేసింది లీల.

ఆమె ఆప్యాయత చూస్తుంటే చిన్నప్పటి రోజులు గుర్తొచ్చాయి. ఆమె స్వభావం ఏమీ మారలేదన్పించింది.

'మేమిక్కడ ఉంటున్నట్టు నీకు తెలీదా అపూ? మరి ఇవాళేం పనిమీదొచ్చావ్?' అడిగింది లీల.

అపూ గొంతులో వెలక్కాయ పడింది. తలదాచుకునేందుకు కాస్త నీడ చూపించమని అడగటానికొచ్చినట్టుగా ఈమెకెలా చెప్పాలి? ఇంతలో, అపూ అదృష్టంకొద్దీ లీలావాళ్ళమ్మ గదిలోకొచ్చింది. ఆమెను చూడగానే గుర్తుపట్టాడు అపూ. వేషభాషలను బట్టి ఆమె ఇప్పుడు వితంతువని అర్థమవుతోంది. అపూ వంగి ఆమె పాదాలను స్పృశించాడు. "కూర్చో అపూర్వా, నీ పోలికలున్న అబ్బాయిని చూశానని నిన్న చెప్పింది లీల. ఇవాళ నిన్ను చూడగానే గుర్తుపట్టి, పిలుచుకు రమ్మని పనిమనిషిని పంపించా" అంటూ ఆప్యాయంగా మాట్లాడిందామె. అపూ చదువుగురించీ, వాళ్ళమ్మ యోగక్షేమాల గురించీ అడిగింది. ఫలహారం తెచ్చిపెట్టింది.

తండ్రి మరణించి మూడేళ్ళయిందనీ, తల్లి పుట్టింటివాళ్ళతోబాటు ఇక్కడుంటున్నామనీ చెప్పింది లీల. లాహిరిగారనే వ్యక్తి ఆమె తాతగారే. ఆయన బారిస్టరుగా పనిచేసి రిటైరయ్యారు. ఇప్పుడు ఆ ప్రాక్టీసంతా లీల మేనమామ చూస్తున్నాడు. ఈ విషయాలన్నీ లీల మాటల్లో తెలిశాయి.

కొద్దిసేపయ్యాక వాళ్ళదగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు అపూ. వచ్చే బుధవారం తన మేనమామ కొడుకు పుట్టినరోజు విందుకు రమ్మని మరీ మరీ చెప్పింది లీల.

# 10

పరీక్షలు ఐదు రోజులున్నాయనగా మన్సాపోతా నుండి ఉత్తరం వచ్చింది. సర్వజయకు జబ్బుగా ఉందని పక్కింటి తేలీవాళ్ళ కోడలు రాసింది. వెంటనే బయల్దేరి వెళ్ళాడు అపూ.

అతను వెళ్ళేసరికి దుప్పటి కప్పుకుని నీరసంగా పడుకుని ఉంది సర్వజయ. కొన్నాళ్ళుగా ఆమె ఆరోగ్యం బాగా దిగజారుతోంది. పగలంతా తిరుగుతూ పనిచేసు కుంటూనే ఉంటుంది, సాయంత్రం కాగానే జ్వరమొస్తోంది. రాత్రులు ఎంతకూ నిద్రపట్టక అవస్థగా ఉంటోంది. ఈ పరిస్థితి చూసిన పక్కింటి యువతి అపూకి ఉత్తరం రాసింది.

తల్లి బాగా బలహీనంగా, పాలిపోయినట్టుగా ఉండటం చూసి ఆదుర్దా పడ్డాడు అపూ.

“నాకేం కాలేదు, ఊరికే కంగారు పడకు. ప్రతి ఏడాదీ ఈ రోజుల్లో నాకిలాగే అవుతోంది... ఏప్రిల్‌కల్లా అదే తగ్గిపోతుంది. నువ్విలా కూర్చో...నువ్వు చదువు చెప్తోన్న అమ్మాయెలా వుంది?

తల్లి అడుగుతున్నది ప్రీతిబాలను గురించేనని అపూకి అర్థమయింది. ఆమె శుష్క వదనం మీది చిరునవ్వును చూసి, అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తన సంచిలోంచి నారింజలూ, ఆపిల్సూ, దానిమ్మపళ్ళూ తెచ్చి తల్లి చేతుల్లో పెట్టాడు. ‘ఈ నారింజ పళ్ళు కలకత్తాలో ఎంత చవగ్గా దొరికాయో తెలుసామ్మా? పదిపైసలే!’ అన్నాడు.

ఏ వస్తువయినా చవగ్గా దొరికిందంటే అమ్మ ఎంత సంతోషపడుతుందో అపూకి బాగా తెలుసు. నిజానికి ఆ పళ్ళను ముప్పై పైసలకు కొన్నాడతడు.

ఆత్రంగా ముందుకు వంగింది సర్వజయ, “ఔనా? ఇక్కడయితే యాభై పైసలకు తక్కువుండవు. మన దుకాణాల్లో మరీ దోచుకుతింటున్నార్రా!”

“ఔనమ్మా. ఈ తమలపాకుల కట్ట చూశావా, ఇది రెండు పైసలే.”

అపూ ముఖంలోకి చూస్తూ అనుకుంది సర్వజయ; వీడు పెద్దవాడవుతున్నాడు. డబ్బు జాగ్రత్తగా ఖర్చుపెట్టడం నేర్చుకున్నాడు.

లీల కనబడిన విషయం అమ్మతో చెప్పాలో, వద్దో తెలీలేదు అపూకి. అమ్మ మనసులో తన గురించి అలవిమాలిన ఆశలున్నాయని అపూకి తెలుసు. ‘లీలా, నువ్వూ పెళ్లాడితే బావుంటుందిరా, అన్నా ఆశ్చర్యం లేదు. ఆమెలో లేనిపోని ఆశలు రేకెత్తించటం మంచిది కాదన్పించిందతనికి.

మూడు రోజులపాటు అమ్మను అంటిపెట్టుకునే ఉన్నాడు అపూ. తన చదువు గురించీ, నగరంలో విశేషాల గురించీ కబుర్లు చెప్పాడు. అమ్మను కలవరపరచేవీ, ఆమెకు అర్థంకానివీ అన్పించిన సంగతులను తనలోనే దాచుకున్నాడు.

మధ్యాహ్నం భోజనం చెయ్యగానే వెళ్ళిపడుకుంటుంది సర్వజయ. ఆమె పక్కన కూర్చుని కబుర్లు చెప్తాడు అపూ. సందెపొద్దు వాలిపోయే వేళకు ముందుగా వంటింటి కప్పుమీదా, ఆ తరువాత ఇంటి ఆవరణలోని మద్దిచెట్టు కొమ్మలమీదా వాలే కిరణాలు చివరకు వెదురు పొదలోకి అదృశ్యమవుతాయి. పొడుగ్గా పరుచుకునే నీడలు అపూ హృదయాన్ని అవ్యక్తమైన దిగులుతో నింపుతాయి.

అప్పుడప్పుడూ సర్వజయ, అపూ పెళ్ళి ప్రస్తావన తెస్తుంది. “నీ చదువయిపోగానే పెళ్ళి చేసేస్తాన్రా. ఒకావిడతో మాట్లాడిపెట్టాను కూడా. పెళ్ళికూతురు ఆవిడకు మనవరాలే” అంటుంది నవ్వుతూ.

ఎదుటి గోడకున్న అలమరావైపు చూస్తూ కూర్చుంటాడు అపూ. ఊరగాయ జాడీలు, మామిడి తాండ్ర లాంటి వస్తువుల్ని అందులోనే దాస్తుంది సర్వజయ. అమ్మ కన్నుగప్పి వాటిని నోట్లోవేసుకునే చిన్నప్పటి అలవాటు అపూకి ఇంకా పోలేదు. అమ్మ నిద్రలోకి జారుకోగానే ఆ జాడీల్లో పదార్థాలు రుచి చూడందే అతని మనసు ఊరుకోదు.

అపూ ప్రయాణం కావాల్సిన రోజున ఈ దొంగతనం బయటపడిపోయింది. సర్వజయ నిద్రమేలుకునేసరికి అపూ చేస్తున్న పని ఆమె కంటపడింది.

“ఏమిట్రా ఆపని? ఆ పచ్చళ్ళింకా ఊరనేలేదు. వాటినింకా ఎండబెట్టాలి...ఆ మురికి చేతులతో ముట్టుకోవద్దన్నానా! నువ్వింకా చిన్న పిల్లాడివట్రా అపూ...ఆ పిల్ల చేష్టలేమిటి?” అంటూ కేకలేసింది.

అపూ మనసులో అనుకోని ఆలోచనొకటి మెదిలింది. అమ్మ మళ్ళీ కోలుకుని ఈ పచ్చళ్ళను ఎండలో పెడుతుందా? అది సాధ్యమయ్యే పనేనా? ఒకవేళ ఆమె కోలుకోక పోతే? ఒకవేళ ఆమె...? అపూ గుండె జల్లుమంది.

నాలుగో రోజున కలకత్తాకు బయల్దేరాడు అపూ. మరునాటి నుండి పరీక్షలు మొదలవుతాయి. పరీక్షలయిపోగానే వచ్చేస్తానని అమ్మకు మాటిచ్చాడు. ఆ రోజు పొద్దున తను లేచేసరికే, అమ్మ ఎప్పుడో లేచి వంట పూర్తిచేసెయ్యటం చూసి ఆశ్చర్యపడ్డాడు అపూ. దారిలో తినటానికి వేడి వేడి పరోటాలు పొట్లం కట్టి ఇచ్చింది సర్వజయ.

❖ ❖ ❖ ❖

అపూ వెళ్ళిపోగానే, మునుపెన్నడూ ఎరుగనంత ఒంటరితనంలో మునిగి పోయినట్టుగా తోచింది సర్వజయకు. మరీ సాయంత్రమయ్యేసరికి గుండెల్లో చెప్పరాని బరువు, బాధ ఆవరించింది. తనకంటూ ఎవరూ లేరనీ, తను పూర్తిగా ఒంటరైపోయిందనీ అన్పించింది. ఏదో అశక్తత నిలువెల్లా చుట్టుముట్టింది. ఏనాటివో జ్ఞాపకాలు, ఎప్పుడో మరచిపోయాననుకున్న చిన్న చిన్న సంఘటనలు...కొన్ని సంతోషకరమైనవీ, మరికొన్ని కలతపరిచేవీ, ఆమె హృదయాన్ని ముప్పిరిగొన్నాయి.

దాదాపు నెలరోజుల నుండి, ఒంటరిగా ఉన్నప్పుడల్లా ఇలాంటి నిస్సహాయతే చుట్టుముడుతోంది ఆమెను. ఏదో ఒక పనిలో మునిగిపోతూ, మనోఫలకంపై ప్రత్యక్షమయే దృశ్యాల నుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తోంది సర్వజయ. తమ ఇంట్లో ఓ ఆవు ఉండేది, దాని పేరు బుధి...తన చిన్నప్పటి నేస్తం హిమీ, తనూ కలిసి బంతిపూల మొక్కలు నాటుతున్నారు. ఆ రోజు... నదికి వరదలొచ్చి ఊరంతా జలమయమైపోయింది...తనూ, హిమీ నీళ్ళకని వెళ్ళారు...మునిగిపోయేవాళ్ళే, కాస్తలో ప్రమాదం తప్పింది.

తన పెళ్ళిరోజు... ఆ రోజంతా ముసురుపట్టి వానకురుస్తూనే ఉంది. పెళ్ళి పూర్తయిందాకా తానేమీ తినటానికి వీల్లేదన్నారు. తన చిన్నతమ్ముడు... వాడప్పటికింకా చచ్చిపోలేదు...వాడు ఓ మిఠాయి ఉండ తెచ్చి, రహస్యంగా తన చేతిలో పెట్టాడు.

అపూ... చిన్నారి అపూ, అచ్చంగా ఓ బొమ్మలా ముద్దొస్తున్నాడు. వాడికి అప్పుడప్పుడే మాటలొస్తున్నాయి... వాడి చేతిలో తియ్యటి మిఠాయి పెట్టింది తను...బోసి నోటితో దాన్ని చప్పరిస్తున్నాడు...ఏరా అపూ? మిఠాయి బావుందా? నచ్చిందా నీకు? ఆ దృశ్యాన్ని తలుచుకుంటూ చిరునవ్వు నవ్వింది సర్వజయ.

ఆ రోజు మధ్యాహ్నం ఛాతీలో కత్తిపెట్టి పొడుస్తున్నట్టుగా నొప్పి మొదలయింది. పక్కింటమ్మాయి వచ్చి చూసి, గోరువెచ్చని నూనెతో ఛాతీమీద మర్దనా చేసింది. నొప్పి కొంచెం తగ్గినట్టుగానే అన్పించింది. రాత్రయ్యేసరికి జ్వర తీవ్రత పెరిగిపోయింది. ఆ చిన్న శూన్య గృహంలో అంతులేని ఒంటరితనంలో మునిగిపోయింది సర్వజయ.

రాత్రయింది...ఆకాశంలో నిండు చంద్రుడు వెలిగిపోతున్నాడు... పౌర్ణమి దగ్గర పడుతున్నట్టుంది. జీవితంలో మొదటిసారి ఒంటరితనం ఆమెను భయపెట్టింది. రాత్రి గడుస్తున్నకొద్దీ ఆయాసం పెరిగిపోతోంది. ఏదో చెరువులో మునిగి అట్టడుక్కి వెళ్ళి పోతున్నట్టూ, బయటపడే దారి కన్పించనట్టూ తోచింది. శక్తినంతటినీ కూడగట్టుకుని గట్టిగా ఊపిరి పీల్చింది, లేచి కూర్చోటానికి విశ్వ ప్రయత్నం చేసింది. విపరీతమైన భయంతో వణికిపోయిందామె. ఏమిటిది? ఏం జరగబోతోంది? తనకు చావు సమీపించిందా? మరణం ఇలాగే వస్తుందా?

ఈ అర్ధరాత్రివేళ ఎవరొస్తారు తనకోసం? తన శక్తులన్నిటినీ కూడగట్టుకుని తనకు తాను ధైర్యం చెప్పుకుంది. తనెందుకింత భయపడిపోతోంది? చావు గురించి ఈ ఆలోచన లెందుకు? లేదు...తనకేమీ కాదు...ఇంత పిరికితనం పనికిరాదు.

జీవితంలో తానెన్నో తప్పులూ, పాపాలూ చేసింది...బిడ్డల కడుపు నింపటానికి ఎన్నిసార్లు దొంగతనాలకు పాల్పడింది? పక్కింటివాళ్ళ పెరటితోటలోంచి అరటిపళ్ళు, దోసకాయలూ కోసుకొచ్చి మంచంకింద దాచిపెట్టేది. ఓసారి పొరుగువాళ్ళ దగ్గర పది చెంచాల నూనె అరువుతెచ్చి, బదులు తీర్చేటప్పుడు తను తీసుకున్నది ఐదు చెంచాలేనని

బొంకింది. ఎన్ని అబద్ధాలాడింది? జీవితంలో ఎన్ని అవమానాలు పడింది? ఐనా ఆ సంగతులన్నీ ఇవాళెందుకు గుర్తొస్తున్నాయో! ఈ తలపులను ఆపలేకపోతున్నదేమిటి?

గదినిండా అలుముకున్న గాఢాంధకారం. మంచం కింద ఏమిటా చప్పుడు? ఎలుకేమో! ఎలుకలబోను తెచ్చిపెట్టాలని ఎప్పటినుంచో అనుకుంటోంది. అసలది ఎలుకేనా? విపరీతమైన భయం ఆమె కాలివేళ్ళ నుండి, శిరసు దాకా జరజరా పాకుతూ శరీరాన్ని మొద్దుబారుస్తోంది. ఇంత చిత్రమైన ఆలోచనలు గతంలో ఎన్నడూ రాలేదు తనకు. ఒకవేళ... ఒకవేళ ఇది మృత్యువేమో! భయంతో గజగజలాడిపోయింది... గట్టిగా కేకపెట్టాలని ప్రయత్నించింది... ఊపిరితిత్తుల్లో శక్తినంతా కూడగట్టుకుని పెద్దగా అరిచింది... కానీ, ఎవ్వరూ పలకరేం? ఏ ఒక్కరూ రారేం? అసలు తన అరుపు ఎవరికైనా వినబడిందా? తన శరీరాన్ని అంగుళమైనా కదల్చలేకపోతున్నాననీ, నోరుతెరిచి మాట్లాడలేకపోతున్నాననీ అర్థమై నివ్వెరపోయింది. ఇవన్నీ తన లోలోపలి ఆలోచనలు మాత్రమే. నల్లటి ఓ రాక్షస సాలీడు తన శరీరంపై పాకుతూ, దాని గూట్లో తనను బంధించివేస్తోంది... దాని విషం తన లోపలికి ఇంకుతూ... ఒళ్ళంతా పూర్తిగా మొద్దుబారిపోతోంది.

లోకమంతా వెన్నెల్లో వెలిగిపోతోంది. ఆమె మనసునిండా ఒకే తలపు...అపూ... అపూ...వాణ్ణి ఒంటరిగా వదిలి వెళ్ళగలదా తను? లేదు, అది తనకు సాధ్యంకాదు! తడిసి ముద్దయిపోయిన దిండు చల్లగా తగులుతుంటే ఇంతసేపూ తను కన్నీళ్ళు కారుస్తున్నానని అర్థమయింది.

ఎంత అద్భుతంగా ఉంది వెన్నెల... ఆమె మనసులోని భయమంతా మెల్ల మెల్లగా కరిగిపోతోంది... నిలువెల్లా నిండిపోతున్న ఆనందం, అనంతమైన ప్రేమ! ఆమె హృదయం లోంచి పొంగిపొర్లుతున్న అనురాగంలో, ఆద్యంతాలు లేని ఆ పురాతన గగనం కరిగి వెన్నెలగా మారి...చుక్కచుక్కగా... చివరి బొట్టు దాకా... భూమికి జాలువారుతోంది.

మళ్ళీ ఆమెకళ్ళనిండా నీళ్ళు నిండాయి... ఆ కిటికీ దగ్గర నిలబడిందెవరు? వెన్నెల్లో నీడలాగా కనబడుతున్న ఆ ఆకారం తనను చూసి చిరునవ్వు నవ్వుతోందే! సర్వజయ చూపులు ఆ కిటికీకి అతుక్కుపోయాయి. పాలిపోయి, వడలిపోయిన ఆమె వదనం ఆశ్చర్యానందాలతో ఒక్కసారి దేదీప్యమానంగా వెలిగిపోయింది. అపూ! ఔను, వాడే... అపూ! నిన్న తనను వదలివెళ్ళిపోయిన అపూ కాదు... నిశ్చిందిపురంలో తన చేతుల్లో ఒదిగిపోయిన తన చిన్నారి అపూ. వెదురుపొదలోంచి వెన్నెల వాడి ముఖాన్ని వెలిగిస్తోంది– పూమొగ్గలాంటి మృదువైన, స్వచ్ఛమైన ఆ ముఖం తన అపూదే.

చిన్నారి అపూ... అమాయకమైన కళ్ళూ...ఉంగరాల జుట్టూ...బిడియంగా, నెమ్మదిగా, కలలు కంటున్నట్టుగా...కల్లాకపటం తెలీని తన చిట్టి తండ్రి...ఏడీ వాడు?

అలా పైపైకి...ఆకాశంలోకి...ఆ నీలాల మేఘాలకు ఆవలగా...తారలన్నిటినీ దాటిపోతూ... ఇంకా, ఇంకా పైపైకి... ఆ మేఘాల దొంతరల్లోకి కరిగిపోయి... ఆమె చూపుకు అందకుండా పోయింది అపూ వదనం.

మృత్యుదేవత చేతులు చాపుతూ ఆమెను సమీపించింది...అది ఆమె గుమ్మంలోనే నిలబడింది...తన ప్రియమైన బిడ్డ రూపంలో, ప్రేమతో ఆమెను ఆలింగనం చేసుకొని, అత్యంత మృదువైన స్పర్శతో ఆమెను చేతుల్లోకి తీసుకొని... ఎంత అద్భుతమైన దరహాసమది... ఎంత సుందరమైనదీ మృత్యువు!

❖ ❖ ❖ ❖

మరునాడు ఉదయాన్నే పక్కింటి యువతి వచ్చేసరికి సర్వజయ ఇంటి తలుపు తెరిచే ఉంది.

'బొత్తిగా ఓపిక లేనట్టుంది పాపం, తలుపు గడియైనా పెట్టుకోలేదు' అనుకుంటూ ఇంట్లో అడుగుపెట్టిందామె.

గాఢ నిద్రలో ఉన్నట్టుగా నిశ్చలంగా పడుకుని ఉంది సర్వజయ. లేపాలా, వద్దా అని సంశయించిందామె. సర్వజయ ముఖంలో ఇంతటి ప్రశాంతతను మునుపెన్నడై చూడలేదన్పించింది. కాస్త సందేహిస్తూనే రెండుసార్లు పిలిచినా, సర్వజయ నుండి జవాబు లేదు. ఏ కదలికా లేకుండా నిశ్చలంగా అలాగే పడుకుని ఉంది. పక్కింటిమ్మాయికి ఏదో అనుమానం తోచి మరింత దగ్గరగా వెళ్ళింది.

జరిగిందేమిటో మరుక్షణమే అర్థమయిందామెకు.

❖ ❖ ❖ ❖

అమ్మ చనిపోయిందన్న వార్త తెలియగానే అపూ మనసులో కదలిన భావం మాటలకందనిది...చిత్రమైనది. చూట్టానికి ఎబ్బెట్టుగా ఉన్నా సరే...అందులో స్వల్పమైన సంతోషపు ఛాయ ఒకటి ఇమిడి ఉన్నది. అమ్మ ఇక లేదన్న టెలిగ్రామ్ చదవగానే అతడి మొట్టమొదటి ప్రతిస్పందన...తనను బంధించి ఉంచిన సంకెళ్ళ నుండి విముక్తుడైనట్టు తోచి, మనసు తేలికపడటం. అది కొద్దిక్షణాలే... ఆ వెంటనే తన ఊహకు తానే సిగ్గుతో, భయంతో కుంగిపోయాడు అపూ. ఎంత వికృతమైన మనసు తనది? అమ్మ చావు తనకు సంతోషం కలిగిస్తోందా? తన ఆనందం కోసం ఆమె జీవితాన్నంతా వెచ్చించిందని మరచి పోయాడా? ఆమెను తన దారిలో ఒక అడ్డంకిగా భావించాడా? ఇంత క్రూరంగా, హృదయం లేకుండా తానెలా తయారయ్యాడు?

కానీ...ఈ ఆత్మదూషణ వాస్తవాన్ని మరుగుపరచలేకపోతోంది. ఒక్క క్షణంపాటే కావచ్చుగానీ..ఒక అవ్యక్తమైన సంతోషం తన మనసులో మెదిలిందన్నది నిజం. అమ్మను మనసారా ప్రేమించిన తనలో అటువంటి భావం!

తనకు తానే అర్థంకాని స్థితిలో గ్రామానికి బయల్దేరాడు అపూ. ఊలా స్టేషన్‌లో రైలు దిగి, ఊరివైపుగా నడవసాగాడు. చిరునవ్వుతో తనకు ఎదుర్కోలు పలికే వాళ్ళెవరూ లేని ఇంటికి మొదటిసారిగా వెళ్తున్నాడు తను. సన్నటి నీటిపాయలా పారుతున్న నదిని దాటి వెళ్తుండగా – నిన్న ఈ నది ఒడ్డునే అమ్మను దహనం చేసి ఉంటారన్న ఆలోచన అకస్మాత్తుగా అపూ మనసులో మెదిలింది.

ఇల్లు చేరేసరికి సాయంత్రమయింది. తలుపుకు తాళంవేసి ఉంది. తాళంచెవి పక్కింటివాళ్ళ దగ్గర ఉందేమోననుకుంటూ మెట్లమీద కూలబడ్డాడు అపూ. సగం కాలిన దర్భపోచలు గుమ్మంముందు కనబడి అసంకల్పితంగా ఒళ్ళు జలదరించింది. అవి దహన సంస్కారాలకు సంబంధించిన అవశేషాలని అతనికి తెలుసు.

అమ్మ శాశ్వతంగా వెళ్ళిపోయింది... ఇంకెన్నటికీ కనబడదు. ఈ వాస్తవాన్ని అంగీకరించటానికి అతని మనసులో ఒక పార్శ్వం తిరగబడుతోంది. కానీ, కళ్ళకు ఎదురుగా కనబడుతున్న సగంకాలిన దర్భలు ఆ చేదు నిజాన్ని నిర్దయగా గుర్తుచేస్తున్నాయి.

"ఎప్పుడొచ్చారు దాదా ఠాకూర్?" అంటూ పక్కింటి యువకుడు నాదూ వచ్చి పలకరించేదాకా శూన్య హృదయంతో నిశ్చలంగా అలా కూర్చుండిపోయాడు అపూ. పక్కింటి వాళ్ళిచ్చిన తాళంచెవి తీసుకుని ఇంట్లోకి నడిచాడు.

అమ్మ పడుకునే మంచం ఖాళీగా ఉంది. మంచం కింద ఒక గిన్నెలో ఏవో మూలికలు నీళ్ళలో నానబెట్టి ఉన్నాయి. అమ్మ జబ్బులన్నిటికీ ఆమె చేసుకునే సొంత వైద్యం అదే.

గుమ్మం దగ్గర అడుగుల చప్పుడు విన్పించి, చేతిలో గిన్నెను కిందపెట్టి బయటికి వెళ్ళాడు అపూ. నిరుపమ వాకిట్లో నిలబడి ఉంది. వచ్చీరాని పౌరోహిత్యంతో తను చేసే పొరపాట్లన్నిటినీ కనిపెట్టి కాపాడిన నిరుపమంటే అపూకి ఎంతో అభిమానం.

"నువ్వా?" అంది ఆశ్చర్యంగా నిరుపమ. 'ఎప్పుడొచ్చావ్ అపూ?"

"అరగంటయిందేమో..."

"మా ఇంటికెళ్దాం పద, ఏమీ తిన్నట్టు లేదు నువ్వు'

యంత్రంలా నిరుపమ వెంట నడిచాడు అపూ.

నిరుపమా వాళ్ళింట్లో అందరూ అపూను ఆదరంగా ఆహ్వానించారు. ఓ పళ్ళెంలో పళ్ళు తీసుకొచ్చింది నిరుపమ. తల్లి అంత్యక్రియలు పూర్తయేదాకా అపూ ఎవరింట్లోనూ భోజనం చెయ్యకూడదు.

కాసేపటి తర్వాత అపూ స్వయంగా వంటచేసుకునేందుకు అన్నీ సమకూర్చి, సాయపడింది నిరుపమ.

❖ ❖ ❖ ❖

తల్లి కర్మకాండలు పూర్తయ్యాక కలకత్తాకు బయల్దేరాడు అపూ. సర్వజయ పోకలను కత్తిరించుకునే కత్తెరనూ, ఆమె సంతకాలున్న మనియార్డర్ ఫారాల రసీదులనూ తనతో తీసుకెళ్ళాడు భద్రంగా. గడపదాటబోతుండగా గోడకున్న అలమరామీద పడిందతని దృష్టి. పచ్చళ్ళూ, ఊరగాయలూ పెట్టిన జాడీలు అందులో వరసగా అమర్చి ఉన్నాయి. ఇప్పుడు వాటినెవరు ముట్టుకున్నా అడ్డగించే వాళ్ళెవరూలేరు. అపూ గొంతులో ఏదో అడ్డుపడి నట్టయింది. లేదు...ఇలా జరగాలని తను కోరుకోలేదు. ఇంత స్వేచ్ఛ, స్వతంత్రం తనకేం అక్కర్లేదు...వచ్చెయ్యమ్మా మళ్ళీ వచ్చెయ్యమ్మా మళ్ళీ వచ్చెయ్...వాటిని ముట్టుకోవద్దంటూ నామీద కోప్పడు... ఒక్కసారి నన్ను తిట్టమ్మా... కావాలంటే కొట్టు... ఒక్కసారి నువ్వొస్తే చాలు...అంటూ ఆక్రోశించింది అపూ హృదయం.

కలకత్తాకు వచ్చాడేగానీ దేనిమీదా మనసు నిలవటంలేదు. ఏ పనీ చెయ్యాలన్పించదు. ఎలాగో పరీక్షలు రాశానన్పించాడు. ఎప్పుడూ వెంటాడే ఒంటరితనం...దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపోవాలన్పిస్తోంది. ఏ హిమాలయాలకో, అరణ్యాల్లోకో వెళ్ళిపోగలిగితే బావుండు. కానీ, తనదగ్గర డబ్బులెక్కడివి? అమ్మ అంత్యక్రియల ఖర్చులక్కూడా తేలీవాళ్ళ కుటుంబమూ, నిరుపమా ఇచ్చిన డబ్బులమీదనే ఆధారపడాల్సి వచ్చింది.

గ్రంథాలయానికి వెళ్ళి కూర్చుంటాడేగానీ, వెనకటిలాగా ఏ పుస్తకం మీదా శ్రద్ధ, ఆసక్తి కలగటం లేదు. ఇంత విశాలమైన ప్రపంచంలో తానొక్కడే ఇంత ఒంటరిగా, ఏకాకిగా మిగిలిపోయాడెందుకని? అపూకి లోకమంతా శూన్యంగా తోస్తోంది.

మూడు నెలల కాలం అతి భారంగా గడిచింది. ఓ రోజున డల్హౌసీ స్క్వేర్ దగ్గర రోడ్డుదాటబోతున్న అపూను ఎవరో పేరుపెట్టి పిలిచారు. పసుపురంగు మినర్వా కారులోంచి తొంగిచూస్తూ పిలుస్తోంది లీల. పక్కన ఇంకెవరో ఆడవాళ్ళున్నారు. గబగబా దగ్గరకు వెళ్ళాడు అపూ.

"ఏం మనిషివి అపూర్వా! ఆ రోజు రాత్రి అలా వెళ్ళావంటే మళ్ళీ ముఖమైనా చూపించావా? ఏమయిపోయావ్ ఈ మూడు నెలలూ..." అపూ ముఖంలోకి చూసి హఠాత్తుగా మాటలాపేసింది లీల. "అరె! అంత చిక్కిపోయావేమిటి... ఏమయింది నీకు, జబ్బు చేసిందా?"

"అబ్బే, ఏంలేదు... బాగానే ఉన్నా" అన్నాడు పేలవంగా నవ్వుతూ అపూ.

"అమ్మ ఎలా ఉంది?"

"అమ్మా? అమ్మ లేదింక... చనిపోయింది, ఏప్రిల్‌లో" అంటూ గట్టిగా వెర్రిగా నవ్వాడు అపూ.

అతని వాలకం చూసి భయపడింది లీల. అపూకేసి కళ్ళప్పగించి చూస్తూండి పోయింది. ఒకప్పుడు అపూ మీద ఆమెకుండిన ఆత్మీయత సుదీర్ఘమైన ఎడబాటుతో

మసకబారి ఉండవచ్చు, బాల్యంలోని స్వచ్ఛమైన ఆమె అనుభూతులు సంపద తాలూకు హోదాతో మార్పుచెంది ఉండవచ్చు; కానీ అపూ కళ్ళలోని ఈ పిచ్చిచూపు, మతిలేని నవ్వు చూసి ఆమె హృదయంలో పదునైన కత్తి దిగబడినట్టయింది. అతని పరిస్థితి ఆమెకు వెంటనే అర్థమయింది. అపూ కిప్పుడు తల్లిలేదు, మిత్రులు లేరు, డబ్బులేదు, బికారిలా వీధినబడిన అతన్ని పట్టించుకునే వాళ్ళెవరు?

కొద్ది క్షణాలు ఆమెకు నోటమాటరాలేదు. తనను తాను కూడగట్టుకుంటూ, “అపూ రేపు ఉదయాన్నే మా ఇంటికి రావాలి నువ్వు. తప్పకుండా వస్తావు కదూ! నీ అడ్రస్ ఇవ్వు, నీ కోసం ఎదురు చూస్తుంటా” అంది.

లీల కారు వెళ్ళిపోయింది. గదికి తిరిగి వెళ్ళాడు అపూ. లీల కళ్ళలో కదిలిన సానుభూతిని అతను గమనించాడు. సరిగ్గా అలాంటి సానుభూతికోసం, ఆత్మీయత కోసమే అతని హృదయం అలమటించిపోతోంది. కానీ...దాన్ని భరించలేనట్టుగా కూడా అన్పిస్తోంది.

మూడు రోజుల తర్వాత లీల దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. “ప్రియమైన అపూర్వ బాబూ, సోమవారం రోజు మా ఇంటికొస్తానన్నావు. ఇవాళ శుక్రవారం. మేమింకా నీకోసం ఎదురుచూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా, అమ్మకు నిన్ను చూడాలనుంది. ఇవాళ సాయంత్రం ఐదు గంటలకు తప్పకుండా మా ఇంటికి రావాలి, ఎదురుచూస్తుంటాం” అని రాసింది.

వాళ్ళింటికి వెళ్ళాలో, వద్దో తేల్చుకోలేక పోయాడు అపూ. లీలావాళ్ళమ్మ తన మీద ఎంతో ఆదరం చూపుతుంది. కానీ వాళ్ళు సంపన్నులు. అమ్మ ప్రేమించినట్లుగా ఆమె తనను ప్రేమించటం ఎలా సాధ్యమవుతుంది? వాళ్ళు రమ్మన్నంత మాత్రాన వెళ్ళటం ఏం సబబు? గ్రామంలోని తేలీల కోడలు మిజో బహురాణి కూడా తననెంతో అభిమానిస్తుంది. ఆమె కూడా ధనవంతుల ఇంటి మనిషే. వాళ్ళకూ తనకూ నడుమన ఎంతో అంతరం ఉంది. ఆ స్త్రీలు ఎంత మంచివాళ్ళయినా తనకు అమ్మతో సమానులు కాదు. అతని హృదయంలో సర్వజయ ఆక్రమించుకున్న స్థానం అపురూపమైనది. చివరికి, లీలావాళ్ళింటికి వెళ్ళకూడదనే నిశ్చయించుకున్నాడు అపూ.

ఆ నెలాఖరులో పరీక్షా ఫలితాలొచ్చాయి. మంచి మార్కులతో పాసవడమేగాక గోల్డ్ మెడల్ కూడా సంపాదించాడు అపూ. ఈ ఆనందాన్ని పంచుకోటానికి ఎవరూలేని ఏకాకితనంలో కుమిలిపోయాడు.

## 11

**జూ**లైలో కాలేజీలు తెరిచారు. అపూ సహాధ్యాయులందరూ పై చదువుల్లో చేరిపోయారు. అపూని ఆనర్సులో చేరమని ప్రోత్సహించాడు ప్రొఫెసర్ బసు. కానీ అపూకే మాత్రమూ ఆసక్తిలేదు. పైగా, ఇంకా చదువుకోటానికి అతనికి స్తోమత కూడా లేదు.

బతుకు గడవాలంటే ముందుగా ఏదో ఒక ఉద్యోగం కావాలి. న్యూస్‌పేపర్లలో వచ్చే ప్రకటనలన్నిటికీ దరఖాస్తు చేస్తూ ఉండగా ఒక హార్డ్‌వేర్ దుకాణం నుండి పిలుపు వచ్చింది. ఎంతో ఆశతో వెళ్ళిన అపూకి చేదు అనుభవం ఎదురైంది.

దుకాణం యజమాని పచ్చి తాగుబోతులా ఉన్నాడు. "నీ కాలేజీ చదువులతో మాకేమీ అవసరం లేదు. టైప్‌రైటింగ్ రానివాడివి ఉద్యోగానికి తయారయ్యావ్! ముందు బయటికి నడువ్" అంటూ విరుచుకుపడ్డాడు. అతని మొరటుదనానికి బెదిరిపోయాడు అపూ.

తన క్లాస్‌మేట్ ఇంటికి వెళ్ళినప్పుడు, అతని మేనమామతో జరిగినదంతా చెప్పాడు. ఆయనకు అపూని చూసి జాలేసింది. "ఈ యుద్ధం పుణ్యమా అని ఇనుప దుకాణాల వాళ్ళకు బోలెడంత డబ్బొచ్చిపడుతోంది, అందుకే వాళ్ళకంత అహంకారం. చిన్నపాటి ఏజెంట్లక్కూడా బాగానే గిట్టుబాటవుతోంది మరి" అన్నాడాయన.

"ఔనా? నేను కూడా ఏజెంటుగా పనిచెయ్యొచ్చంటారా?" ఆత్రుతగా అడిగాడు అపూ.

"ఎందుకు చెయ్యకూడదు? మా మామయ్యకు క్లైవ్ స్ట్రీట్‌లో పెద్ద షాపుంది. ఆయన్ని పరిచయం చేస్తాలే. నీలాంటి చదువుకున్న కుర్రాళ్ళకు అదేమంత కష్టమనీ!" అన్నాడేగానీ, ఆ తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయాడాయన.

క్లైవ్ స్ట్రీట్‌లోని దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు మొదలెట్టాడు అపూ. చివరికి ఓ దుకాణం వాళ్ళు "ఐదంగుళాల స్క్రూలూ, నట్లూ తెచ్చి పెడతావా?" అని అడిగారు.

అవేమిటో అర్థంకాకున్నా సరేనన్నాడు అపూ. కానీ మార్కెట్లో ఆ వస్తువులకు కొరత ఉందని తర్వాత తెలుసుకున్నాడు. కొన్నాళ్ళ తర్వాత మరొక దుకాణం వాళ్ళు పైపులకు ఆర్డరిచ్చారు. పైపులు తయారుచేసే ఫ్యాక్టరీలో వాటిని కొనుగోలు చేశాకగానీ, రవాణా ఖర్చుల గురించి ముందుగా దుకాణం వాళ్ళతో మాట్లాడుకోవాలన్న విషయం అర్థంకాలేదు అపూకి. ఐనా సరే, ఎంతో కాలం తర్వాత దొరికిన ఈ ఉద్యోగాన్ని వదులుకోకూడదని నిశ్చయించుకున్నాడు. తనకొచ్చే కమీషన్‌లోంచి బాడుగ చెల్లిస్తానని చెప్పి ఓ ఎడ్లబండిని మాట్లాడుకున్నాడు.

వాటిని తీసుకుని దుకాణానికి చేరుకునేసరికి ఊహించని సమస్య ఎదురయింది. అవి అపూ చెప్తున్నంత ఖరీదు చెయ్యవంటూ గొడవకు దిగాడు దుకాణదారుడు. ఇంకో వైపున బండి తోలుకొచ్చిన మనిషి అద్దె డబ్బులివ్వమని గొంతుమీద కూర్చున్నాడు.

దిక్కుతోచక ఏడుపు ముఖం పెట్టిన అపూని ఓ వృద్ధ ముస్లిం పలకరించాడు. ఆయన చాలాసేపటి నుండి ఈ తతంగాన్నంతా గమనిస్తున్నాడు.

'అనుభవం లేకుండా ఇట్లాంటి పనుల్లో దిగకూడదు బాబూ!' అంటూ సానుభూతి చూపించిన ఆయనతో తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు అపూ.

"నాకు ఇంజన్లూ, బాయిలర్లూ వంటి భారీ సామాన్లమ్మే దుకాణం ఉందయ్యా. బొత్తిగా ఇంగ్లీషు రాకపోవటంతో ఇంత పెద్ద వ్యాపారాన్ని చూసుకోవటం కష్టంగా ఉంది. నీవంటి చదువుకున్న కుర్రాడి కోసమే చూస్తున్నా. నాతోబాటు పనిచెయ్యకూడదూ?" అని అడిగాడాయన.

అపూకి కొండెక్కినంత సంబరం కలిగింది. తన జేబులో ఉన్న కాసిని డబ్బులూ బండి యజమాని చేతిలో పెట్టి పంపేశాడు. అబ్దుల్ అనే ఆ ముస్లిం వ్యక్తితో చాలాసేపు మాట్లాడాక ఆయన మీద నమ్మకం కుదిరింది. మర్నాడు వచ్చి కలుస్తానని చెప్పి, ఆయన చిరునామా తీసుకున్నాడు.

మరునాటి నుండి అబ్దుల్ దుకాణానికి వెళ్తున్నాడే గానీ, అక్కడ చెయ్యటానికి పనేమీ ఉండటంలేదు. యుద్ధంవల్ల డబ్బుకు కరువొచ్చిందనీ, తన వ్యాపారం సాగటం కూడా కష్టంగా ఉంటోందనీ అన్నాడు అబ్దుల్.

నెల రోజులు గడిచినా అబ్దుల్ దుకాణం ద్వారా అపూకి పనిగానీ, ఆదాయంగానీ, దొరికే మార్గం కనబడటం లేదు. పైగా అతడే అప్పుడప్పుడూ అపూని చేబదుళ్ళు అడుగుతున్నాడు.

ఓ రోజు పొద్దున్నే అపూ గదికి వచ్చాడు అబ్దుల్. బారక్‌పూర్‌లో ఓ పెద్ద బాయిలర్ చవగ్గా అమ్మకానికి వచ్చిందనీ, దాన్ని కొనుకొచ్చి కలకత్తా మార్కెట్లో అమ్మితే మూడు వందల రూపాయలకు తగ్గకుండా లాభం వస్తుందనీ చెప్పాడు. అడ్వాన్సుకు కాస్త డబ్బు సర్దుబాటు చేస్తే, బాయిలర్ అమ్ముడుపోగానే ఇచ్చేస్తానని అడిగాడు. అతన్ని కాదనలేక తన దగ్గరున్న ఎనిమిది రూపాయలూ ఇచ్చేశాడు అపూ. సాయంత్రం వచ్చి కలుస్తానని వెళ్ళిన అబ్దుల్, మర్నాడు... ఆ మర్నాడు...వారం రోజులయినా జాడలేదు.

క్లైవ్ స్ట్రీట్‌లోని దుకాణాల వాళ్ళను అబ్దుల్ గురించి వాకబు చేశాడు అపూ. "అయ్యో! అబ్దుల్‌కు డబ్బులిచ్చారా? వాడింకా తిరిగొస్తాడనుకుంటున్నారా? మీకు తెలీదేమో, వాడసలే మహా మాయగాడు" అంటూ సానుభూతి చూపారు వాళ్ళు.

ఎంతో అభిమానంగా ప్రవర్తించే అబ్దుల్, ఇంత మోసగాడని తెలిసి నివ్వెరపోయాడు అపూ. చేతిలో చిల్లిగవ్వ లేదిప్పుడు. తన తిండీ, తిప్పలూ...గది యజమానికి ఇవ్వాల్సిన అద్దె...ఏం చెయ్యాలో తోచక పిచ్చివాడిలా సాయంత్రందాకా వీధుల్లో తిరిగాడు.

❖ ❖ ❖ ❖

కొన్ని నెలల తర్వాత అనుకోకుండా ప్రణవ్ ఎదురయ్యాడు. అతడు కాలేజి మానేసి, జాతీయోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా వెళ్ళిపోయి ఏడాది కావొస్తోంది. బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని అరెస్టుచేసి, కొంతకాలం జైల్లోపెట్టింది. విడుదలై వచ్చినప్పటి నుండి అపూ కోసం వెదుకుతున్నాడు ప్రణవ్. అపూ కాలేజీలో చదవడం లేదనీ, ఎక్కడో ఉద్యోగం చేస్తున్నాడనీ మాత్రం ఎవరో చెప్తే తెలిసింది.

"దాదాపు ఓ ఏడాదిపాటు సర్కారువారి అతిథిగా ఉండొచ్చాను అపూ" అంటూ నవ్వాడు ప్రణవ్.

"నువ్వేం చేస్తున్నావిప్పుడు?" అంటూ అపూని పరామర్శించాడు.

"ఓ న్యూస్ పేపర్లో పనిచేస్తున్నా. డెబ్బయి రూపాయల జీతం" కాస్త గర్వంగా చిరునవ్వు నవ్వాడు అపూ.

అతని ఉద్యోగం మాట నిజమేగానీ, కోతలన్నీ పోను, చేతికొచ్చే జీతం మాత్రం ముప్పయి మూడు రూపాయలే.

జనసమ్మర్దం అంతగా లేనిచోటు చూసుకుని ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

"నువ్వు చదువు మానెయ్యాల్సింది కాదు అపూర్వా!... ఆ కాలేజి పుస్తకాల్లోకన్నా మంచి విషయాలను సొంతంగా చదివి నేర్చుకోగల శక్తి నీకుందని నాకు తెలుసనుకో!" అన్నాడు ప్రణవ్.

అతని మాటలకు చిన్నపిల్లవాడిలా సంబరపడ్డాడు అపూ. "ఏమయినా తిందువు గాని పద, ప్రణవ్! అమ్మపోయినప్పటి నుంచి ఒక్కరోజయినా నేనింత సంతోషంగా గడపలేదు తెలుసా?"

"ఏమిటీ! అమ్మ... చనిపోయిందా?" అన్నాడు ప్రణవ్ ఆశ్చర్యంగా.

"అవును, ఏడాది కావొస్తోంది."

ప్రణవ్ చెయ్యి పట్టుకుని ఓ హోటల్లోకి లాక్కుపోయాడు అపూ. అతని ఆత్మీయతకూ, నిష్కల్మషమైన ప్రేమకూ ప్రణవ్ మనసు ఆర్ద్రమైంది. అతడు ఫలహారం చేస్తున్నంతసేపూ కబుర్లు చెప్తూనే ఉన్నాడు అపూ. ఉద్యోగం వేటలో తానెన్నెన్ని తిప్పలు పడ్డాడో, చివరికి ఈ ఉద్యోగాన్ని ఎలా సంపాదించాడో చెప్పాడు. తన జీతం ముప్పై రూపాయలేనని కూడా చెప్పేశాడు.

ఎంతో కాలంగా ఒంటరితనంలో వేగిపోతున్న అపూ ప్రాణానికి ప్రణవ్ రాక ఎంతో ఉపశమనాన్నిచ్చింది. హోటల్ నుండి పార్కుకూ, అక్కడి నుండి నాటకానికీ తీసుకు వెళ్ళాడు ప్రణవ్‌ను. ఆ రాత్రంతా కలకత్తా వీధుల్లో తిరుగుతూ గడిపారు మిత్రులిద్దరూ. వాళ్ళ మాటలూ, పాటలూ, నవ్వుల మధ్యన తెల్లవారిపోయింది. వారం తర్వాత మళ్ళీ కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు ప్రణవ్.

❖ ❖ ❖ ❖

పదిహేను రోజుల తర్వాత అపూ గదికి వచ్చాడు ప్రణవ్. "వచ్చే సోమవారం మనిద్దరం ఖులానా అనే ఓ పల్లెటూరికి వెళ్తున్నాం అపూ! మా మామయ్య కూతురికి ఆ ఊళ్ళో పెళ్ళి జరుగుతోంది. ఈ నగరం నుండి ఎటయినా వెళ్ళాలనుందన్నావుగా, వెళ్దామా మరి?" అడిగాడు ప్రణవ్.

ఆఫీసులో సెలవు తీసుకుని ప్రణవ్‌తోబాటు బయల్దేరాడు అపూ. కలకత్తా నుండి స్టీమర్‌లో బయల్దేరి ఒక పట్టణానికి చేరారు. అక్కడి నుండి మళ్ళీ పడవెక్కి ప్రణవ్ బంధువులుండే గ్రామానికి బయల్దేరారు. నదికి ఇరువైపులా పోక, కొబ్బరి చెట్లు బారులు తీరి నిలబడినట్లుగా ఉన్నాయి. అక్కడక్కడా దట్టమైన వెదురు పొదలున్నాయి. దారిలో చిన్న చిన్న గ్రామాలు ఎదురయినప్పుడల్లా దూరంగా పెంకుటిళ్ళు కనబడుతున్నాయి. పడవ సాగుతున్నంతసేపూ కళ్ళార్పకుండా పరిసరాలను చూస్తుండిపోయాడు అపూ.

పడవ ప్రయాణిస్తున్న నదీ ప్రవాహం మరొక నదిలో కలుస్తున్నచోట గంగానందన్ కతి అనే గ్రామం ఉంది. ప్రణవ్ వాళ్ళ మామయ్య ఉండేది ఆ ఊళ్ళోనే. ఆ గ్రామంలోకెల్లా సంపన్నులు వాళ్ళేనని, ఆ ఇల్లు చూస్తేనే అర్థమవుతోంది.

విశాలమైన వరండాలతో, ఎన్నో గదులతో, ఇంటి చుట్టూ ఖాళీ ఆవరణతో ఉన్న ఆ భవనం అపూకి ఎంతో నచ్చింది. నగరంలోని కాలుష్యానికీ, గందరగోళానికీ దూరంగా ఇలాంటి ప్రశాంతమైన ఇంట్లో గడిపితే బావుండునని అపూ ఎన్నోసార్లు కలలుగన్నాడు. అక్కడక్కడా పగుళ్ళుబారుతున్న గోడలతో, ఆ కుటుంబీకుల గత వైభవానికి సాక్ష్యంలా నిలబడి ఉంది ఆ భవనం.

"అరే పూలూ, వచ్చేశావా?" అంటూ సంతోషంగా ఎదురొచ్చాడు ప్రణవ్ వాళ్ళ మామయ్య. ఆయనకు అపూని పరిచయం చేశాడు ప్రణవ్.

ఇంట్లోకి వెళ్ళగానే వాళ్ళ అత్తయ్య ఎదురొచ్చింది. ఆమెకు అపూ గురించి చెప్పబోతుండగానే, "నిన్నెప్పుడో చూసినట్టుంది బాబూ, బాగా పరిచయమున్న ముఖమే" అందావిడ అపూకేసి చూస్తూ.

"అయ్యో, లేదు మామీమా! అతనిక్కడికెప్పుడూ రానేలేదు" అన్నాడు ప్రణవ్ నవ్వుతూ.

"నాకాసంగతి తెలుసులేవయ్యా. కానీ ఆ ముఖం ఉందే...అంత చక్కటి ముఖం... అచ్చం కృష్ణ పరమాత్ముడిదే. మరి...రోజూ దేవాలయంలో చూస్తూనే ఉంటానుగా"

అపూ వంగి ఆమె పాదాలకు నమస్కరించాడు. "ఆయురారోగ్యాలతో చిరకాలం వర్ధిల్లు నాయనా" అంటూ ఆప్యాయంగా దీవించిందామె.

మధ్యాహ్నం కాసేపు కునుకు తీశాక, పాత మిత్రులను కలవటానికి ఊళ్ళోకి బయల్దేరాడు ప్రణవ్. తను కాసేపు డాబా మీద కూర్చుంటానని ఇంట్లోనే ఉండిపోయాడు అపూ.

చల్లని సందెగాలి ఆహ్లాదకరంగా వీస్తోంది. దూరంగా ఆలయంలోంచి గంటల మోతా, శంఖారావమూ వినబడుతోంది. ఉరుకుల పరుగుల నగరజీవితంలోంచి బయటపడి ఇలాంటి చోటికి రావటం అపూకొక అద్భుతమైన అనుభవం. ఏదో కొత్త ప్రపంచంలోకి

అడుగుపెట్టినట్టుగా ఉందతనికి. అప్పుడే ఆకాశంలో చంద్రోదయమయింది. కొబ్బరిమట్టల సందుల్లోంచి పల్చని వెన్నెల జాలువారుతోంది. ఒక్కసారిగా ఒళ్ళు పులకరించింది అపూకి. ఎందుకా పులకరింత? ఆలయంలోని ఘంటారావాలకా? వెన్నెల వెలుగులకా? ఏమో! అనిర్వచనీయమైన ఏదో అనుభూతి అతన్నావరించింది. ఏనాటి స్మృతులో మనసులో ముప్పిరిగొంటున్నాయి.

"నీకీవూరు బాగా నచ్చిందా అపూ?" అంటూ వచ్చాడు ప్రణవ్. అతని వెనకాలే ఓ అమ్మాయి కూడా వచ్చింది. ఆమెకు దాదాపు పదమూడేళ్ళుంటాయి.

"మా మామయ్య చిన్నకూతురు మినీ, పెళ్ళికూతురు అపర్ణకు చెల్లెలు" అంటూ ఆ అమ్మాయిని పరిచయం చేశాడు ప్రణవ్.

మినీతోబాటు వచ్చిన ఆడపిల్లల బృందం సంకోచంగా మెట్ల దగ్గరే ఆగిపోయారు.

"ఓహో, నీ నేస్తాలా? అపర్ణ కూడా వచ్చిందా, ఇలా రమ్మను" అన్నాడు ప్రణవ్.

మినీ మెట్లదగ్గరికి పరిగెత్తుకెళ్ళి పదహారు, పదిహేడేళ్ళ వయసున్న ఓ అమ్మాయిని వెంటబెట్టుకొచ్చింది. బిడియంగా తలొంచుకుని నిలబడిన ఆమె అద్భుత సౌందర్యానికి ఆశ్చర్యపడ్డాడు అపూ.

"అపర్ణా, ఇతను నా స్నేహితుడు అపూ. మనకు చాలా దగ్గరివాడు, అలా సిగ్గుపడ నక్కర్లేదు" అన్నాడు ప్రణవ్ నవ్వుతూ.

అపర్ణ కొద్దిగా తలెత్తి చిరునవ్వు నవ్వింది. రెండు క్షణాలు అలాగే నిలబడి గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. నల్లగా, వత్తుగా, పొడుగ్గా ఉన్న ఆమె జుట్టును కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు అపూ.

అతడి జీవితంలో అదొక మరపురాని రాత్రి.

## 12

ప్రణవ్‌తోబాటుగా పెళ్ళిపనుల్లో మునిగిపోయాడు అపూ. వరుడు దిగాల్సిన విడిదిని అలంకరించే బాధ్యత పూర్తిగా అపూదే. విడిదింట్లో అన్ని గదుల్లోనూ తివాచీలు వేయించి, వాటిమీద శుభ్రమైన దుప్పట్లు పరిచాడు. గోడలకు గాజు దీపాలనూ, లాంతర్లనూ తగిలించాడు. గుమ్మాలకు పచ్చని మామిడాకుల తోరణాలు కట్టాడు. ఆ తర్వాత నవ దంపతులకు శుభాకాంక్షలను తెలిపే కవితలను చిన్న కాగితాలపై రాసి, అతిథులకు పంచటానికి సిద్ధంగా పెట్టాడు. ఈ పనులన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం మూడు గంటలయింది.

వరుడిది సంపన్న కుటుంబమట. వాళ్ళ గ్రామం ఇక్కడికి కాస్త దూరమే కాబట్టి, పడవలో రావటానికి కొన్ని గంటలసేపు పడుతుంది. వాళ్ళకు వీలుగా ఉండేట్లుగా రాత్రి పదిగంటలకు ముహూర్తం నిశ్చయమయింది.

పనితో బాగా అలసిపోయిన అపూని కాసేపు విశ్రాంతి తీసుకోమన్నాడు ప్రణవ్. డాబా మీదున్న గదిలో అతనికి పడక ఏర్పాటుచేసి, పెద్దవారు రాగానే లేపుతానని చెప్పి వెళ్ళిపోయాడు.

గాఢనిద్రలో మునిగిపోయిన అపూకి, ప్రణవ్ పిలుపుతో మెలకువొచ్చింది. "అయ్యో, చాలాసేపు నిద్రపోయానే! పెళ్ళివారొచ్చేశారా?" అంటూ హడావిడిగా లేవబోతున్న అపూ, ప్రణవ్ ముఖంచూసి ఆశ్చర్యపోయాడు. అతని ముఖం భయాందోళనలతో పాలిపోయి వుంది. "ఏమైంది ప్రణవ్? ఎందుకలా ఉన్నావ్?" అడిగాడు ఆశ్చర్యంగా అపూ.

ప్రణవ్ మారుపలకకుండా అపూ ముందు కూలబడి అతని రెండు చేతులూ పట్టుకున్నాడు. "అపూ, మమ్మల్ని కాపాడు! అపర్ణను పెళ్ళిచేసుకో అపూ, ఇంకేం ఆలోచించకు. నువ్వు కాదంటే మా కుటుంబం తలెత్తుకుని తిరగలేదు...అపర్ణ జీవితం నాశనమైపోతుంది" అంటూ భోరుమన్నాడు.

అపూ నివ్వెరపోయి చూస్తున్నాడు. ఏమంటున్నాడు ప్రణవ్? అతనికేం పిచ్చి పట్టలేదుగదా?

ఇంతలో ఇద్దరు వృద్ధులు గదిలోకి వచ్చారు. "నువ్వెవరో మాకు తెలీదు బాబూ! పూలూ నీ గురించి అన్ని సంగతులూ చెప్పాడు. వీళ్ళ కుటుంబాన్ని నువ్వే ఆదుకోవాలి. నువ్వు కాదంటే..." వాళ్ళలో ఒకాయన వణుకుతున్న కంఠంతో బతిమాలసాగాడు. అపూ నిశ్చేష్టుడై అలాగే కూర్చుండిపోయాడు. అతనికింకా నిద్రమత్తు సరిగా వదల్లేదు. ఇదంతా ఏదో కలలో జరుగుతున్నట్టుగా తోస్తోంది. అతన్ని చుట్టుముట్టిన వేలాది ప్రశ్నలకు జవాబుగా, జరిగినదంతా వివరించాడు వచ్చినవాళ్ళలో మరొక వ్యక్తి:

ఆ సాయంత్రం వరుని బృందం పడవల్లో గ్రామానికి చేరింది. వాళ్ళకు స్వాగతం చెప్పటానికి పల్లకీతో ఎదురేగారు పెళ్ళికుమార్తె బంధువులు. కొత్త పెళ్ళికొడుకును చూసేందుకు గ్రామస్తులంతా నది ఒడ్డున గుమికూడారు. గ్రామ వీధులగుండా ఊరేగుతూ పల్లకిలో విడిదికి చేరాడు వరుడు. అప్పుడు జరిగిందా సంఘటన – పల్లకిని దించబోతూ ఉండగా...నక్క అరుపువలె ఊళలు పెడుతూ ఒక్కసారిగా బయటికి దూకాడు వరుడు. వెర్రిగా అరుస్తూ గంతులువేస్తున్న అతడిని చూసి అందరూ భయంతో కొయ్యబారి పోయారు. అతడికి మతిస్థిమితం లేదన్న విషయం తేటతెల్లంగా తెలిసిపోతూనే ఉంది.

పెళ్ళికొడుకు తండ్రీ, మరికొందరు బంధువులూ ముందుకొచ్చి, సముదాయించే కొద్దీ అతడి ఆగడం మరింత ముదురుతోంది. ఈ వ్యవహారమంతా చూసిన గ్రామస్తులు వరుడి తరఫువాళ్ళను తిట్టడం మొదలుపెట్టారు. కొందరు ఆడవాళ్ళు గట్టిగా ఏడవసాగారు. కానీ...అపర్ణ కుటుంబమంతా దిగ్భ్రమతో, నిస్సహాయతతో చేష్టలుడిగి నిలబడిపోయారు. గ్రామమంతటికీ గౌరవనీయులైన బెనర్జీగారి అమ్మాయికి ఇటువంటి గతి పడుతుందని ఎవరూహించారు?

కొద్దిసేపటికి పెళ్ళికుమారుడు శాంతించాడు. ఎండనబడి ఇంతదూరం ప్రయాణం చెయ్యటమూ, సరైన భోజనం లేకపోవటమూ, గత రాత్రి ఆలస్యంగా నిద్రపోవటమూ... కేవలం ఈ కారణాలతోనే తమ పిల్లవాడికేదో నలత చేసింది తప్ప, ఇంకేమీ లేదంటూ సర్దిచెప్పటానికి వరుడి కుటుంబం ప్రయత్నాలు మొదలుపెట్టింది.

వాళ్ళ మాటలపై ఎవరికీ నమ్మకం కుదరకపోయినా చెయ్యగలిగిందేమీ లేక నిస్సహాయంగా చూస్తూండిపోయారు. కాస్సేపట్లో పెళ్ళి జరగబోతుండగా ఇప్పుడు ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? ఆఖరికి అపర్ణ తండ్రి కూడా ఆ పెళ్ళికి సిద్ధపడినట్టుగానే నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఆ సమయంలో...అపర్ణ తల్లిగనుక తెగించి ఒక నిర్ణయం తీసుకొని ఉండకపోతే ఆ పెళ్ళి నిరాఘాటంగా జరిగిపోయేదే.

ఆమె, కూతురి చెయ్యిపట్టుకుని బరబరా తన గదిలోకి లాక్కుపోయి తలుపు గడియ పెట్టేసుకుంది. ఎవరెంతగా బతిమాలినా, బెదిరించినా గంటల తరబడి ఆ తలుపులు తెరుచుకోలేదు. చివరికి, గదిలోనుండే అపర్ణ తల్లి తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ పిచ్చివాడికి అంటగట్టి తన బిడ్డ జీవితాన్ని నాశనం చెయ్యటానికి ఎంత మాత్రమూ అంగీకరించనని తేల్చి చెప్పింది. ఈ విషయంలో లోకానికి తాను వెరవబోననీ, వంశగౌరవం ఏ గంగలో కలిసినా ఖాతరు చెయ్యబోననీ కుండబద్దలు కొట్టిందామె. బలవంతంగా ఈ పెళ్ళిచెయ్యటానికి ప్రయత్నించారంటే ఈ గదిలోనే కూతుర్ని చంపి, తాను కూడా పొడుచుకుని చస్తానంది. అవి ఉత్తుత్తి బెదిరింపులు కావనీ, ఆమె ఒక నిశ్చయానికి వచ్చిందంటే మార్చటం ఎవరి తరమూ కాదనీ ఆమె భర్తకూ, గ్రామ ప్రజలకూ బాగా తెలుసు. ఇంత గొడవ జరుగుతున్నా తల్లిని ఎదిరించి అపర్ణ ఒక్కమాటయినా మాట్లాడలేదు. ఆమె నిర్ణయాన్ని తాను కూడా ఆమోదిస్తున్నట్టుగా మౌనం వహించింది. ఇక ఆ తలుపులు తెరిచేందుకు ఎవరికీ సాహసం చాలలేదు.

ఈ విషయమంతా చెప్పిన వ్యక్తి "ఈ పరిస్థితుల్లో నువ్వు గనుక ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే ఈ ఇంట్లో హత్యలు జరుగుతాయి నాయనా! లేదంటే ఆ పిచ్చిపిల్ల బతుకంతా పెళ్ళీ, పెటాకులూ లేకుండా అట్లా పడి ఉండాల్సిందే. ఆ పిల్లను చేసుకుంటే అరిష్టమని ఎవరూ ముందుకురారు. బంగారమంటి పిల్ల...ఇట్లాంటి అపనిందలు పడాలని రాసి పెట్టుందేమో, ఎవరెరుగుదురయ్యా? నీకు పుణ్యముంటుంది...కాదనకు బాబూ!" అంటూ అపూని ప్రాధేయపడ్డాడు.

అపూ మెదడు మొద్దుబారి పోయింది. చెవుల్లో వెయ్యి డప్పులు మోగుతున్నట్టుగా ఉంది... తల బద్దలయిపోతోంది. ఇదేమిటి? ఇలాంటి పరిస్థితిలో వచ్చిపడ్డాడేమిటి తను? ఈ బంధాలంటేనే తనకు భయం. అమ్మ మరణంతో అన్ని బంధనాలనుండి విముక్తుణ్ణయ్యాననుకున్న తనకు ఈ కొత్త చిక్కులేమిటి?

హటాత్తుగా అతనికొక్కసారి అపర్ణ ముఖం గుర్తొచ్చింది. ఇవాళ ఉదయాన్నే ఆమె ఎదురుపడింది. తనతో ఒక్కమాట మాట్లాడకపోయినా ఆమె వదనంలోని అపురూపమైన సౌందర్యమూ, ఆమె నడకలోని హుందాతనమూ అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. ఔను...ఆమె నిజంగా ఓ దేవతలా ఉంది. ఆ దేవకన్య నిరర్థకంగా ప్రాణాలు పోగొట్టుకోవటమా...లేక, తన స్వేచ్ఛా కాంక్షను వదులుకొని ఆమెను పెళ్ళాడటమా?

సావధానంగా ఆలోచించుకునేంత సమయం తనకు లేదు. ప్రణవ్ ఇంకా తన చేతులు పట్టుకునే ఉన్నాడు. పెద్దమనుషులిద్దరూ బతిమాలుతూనే ఉన్నారు. వీళ్ళందరినీ తోసిపుచ్చడం తనకేమంత కష్టం కాకపోవచ్చు. కానీ...అపర్ణ తన ఎదుట నిలబడి ఆమె నల్లని విశాలమైన నేత్రాలతో తన కళ్ళలోకి చూస్తూ, తన నిర్ణయం కొరకు వేచి చూస్తున్నట్లుగా తోచింది. ఆ కళ్ళలోని అభ్యర్థనను తోసిపుచ్చటం తనవల్ల కాదు!

"అలాగే" అన్నాడు అపూ. "నేనేం చెయ్యాలో చెప్పండి."

అపూ, మెట్లుదిగి కిందికి వచ్చేటప్పటికి అక్కడెవరూ లేరు. మంగళ వాయిద్యాలు ఆగిపోయాయి, అతిథులందరూ వెళ్ళిపోయారు. పెళ్ళికొడుకు తరఫువాళ్ళు ఆ రాత్రివేళ తిరిగి వెళ్ళలేరు కాబట్టి, ఎవరో దూరపు బంధువులింట్లో వాళ్ళకు ఆశ్రయమిచ్చారట. ఆవరణలో చేరి గుసగుసగా మాట్లాడుకుంటున్న కొద్దిమంది తప్ప, అపర్ణ కుటుంబ సభ్యులెవరూ కనబడటంలేదు. కానీ...చిత్రంగా, పురోహితుడు మాత్రం తను చెయ్యాల్సిన పని ఇంకా పూర్తికాలేదన్నట్టుగా పీటపై అలాగే కూర్చుని ఉన్నాడు.

ఆయన దగ్గరికి అపూని తీసుకెళ్ళాడు ప్రణవ్.

ఆ తర్వాత జరుగుతున్న తంతునంతటినీ కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు అపూ. అతని మెదడు ఆలోచించే శక్తినెప్పుడో కోల్పోయింది. కానీ అసంకల్పితంగానే ప్రతి చిన్న సంఘటనా అతని మనసులో ఫోటోలా ముద్రించుకుపోతోంది. ఆకుపచ్చని కొబ్బరి బొండాన్ని ఎవరో వలుస్తున్నారు. ఆ కత్తికి వెదురుతో చేసిన పిడి ఉన్నది. గుండ్రంగా, ఎర్రగా ఉన్న కొబ్బరికాయ బయటికి వస్తోంది...ఈ స్వల్పమైన వివరాలన్నీ ఏళ్ళతరబడి తన స్మృతుల్లో ఉండిపోవటానికి కారణమేమిటో అతనికే స్పష్టంగా తెలీదు.

పట్టుచీరతో, ఒంటినిండా నగలతో మెరిసిపోతున్న అపర్ణ పందిట్లోకి వచ్చింది. ఒక్కసారిగా ఇల్లంతా జీవకళతో వెలిగిపోయింది. ఆడవాళ్ళందరూ వధూవరుల చుట్టూ చేరి, ఏవో పరిహాసాలాడుతున్నారు. పట్టుబట్టలతో, కొత్త జంధ్యంతో పీటపై కూర్చున్న అపూ, పురోహితుడు చెప్తున్న మంత్రాలను తన ప్రమేయం లేకుండానే చిలకపలుకుల్లా ఉచ్చరిస్తున్నాడు.

అపర్ణ తల్లి వెక్కి వెక్కి ఏడుస్తోంది, కొంగుతో ముఖం తుడుచుకొంటోంది. 'నీ కూతురు శివభక్తురాలు కదే తల్లీ! దాని పూజలు ఇప్పటికి ఫలించాయిలే. ఎంత చక్కటి మొగుడు దొరికాడమ్మా!" అంటోంది ఆమెతో ఒక వృద్ధురాలు.

వధూవరులిద్దరి తలల మీదుగా ఒక వస్త్రాన్ని కప్పారు. ఒకరినొకరు చూసుకోవలసిందిగా పురోహితుడు చెప్తున్నాడు. అపర్ణ సిగ్గుగా శిరస్సు నేలకు వాల్చి కూర్చుంది. ఎంతో ఆసక్తిగా ఆమె ముఖంలోకి చూశాడు అపూ. సుకుమారమైన చక్కని రూపురేఖలామెవి. చిన్ని చుబుకం. నుదుటిమీద చెమటచుక్కలు ముత్యాల్లా మెరుస్తున్నాయి. జడలోంచి విడివడిన వెంట్రుకలు చెవుల మీదుగా వేలాడుతున్నాయి; చెవులకున్న బంగారు దుద్దులు దీపం వెలుగులో ధగధగలాడుతున్నాయి. నిజంగా దేవకన్యలా ఉందామె.

పెళ్ళి కార్యక్రమం పూర్తవగానే ఆడవాళ్ళందరూ అపూ చుట్టూ గుమిగూడారు. కొద్ది గంటల క్రితం అతన్ని పట్టించుకున్నవాళ్ళెవారూ లేరు. ఇప్పుడందరి కళ్ళూ అతని మీదనే. అంత చిత్రమైన సంఘటనను ఆ గ్రామస్తులెన్నడూ చూసి ఎరుగరు. ఏమైతేనేం, తామెన్నడూ చూడని ఈ అపరిచితుణ్ణి, అపర్ణవంటి అపరంజి బొమ్మకు తగిన వరుడిగా వాళ్ళు అంగీకరించారు.

ఇందాక మాట్లాడిన వృద్ధురాలితో అపర్ణ తల్లి అంటున్న మాటలు అపూ చెవిన బడ్డాయి.

"మా పూలూతోబాటు ఈ కుర్రాడు వచ్చినప్పుడే నా మనసుకెందుకో అతను నా మనిషేనన్పించిందమ్మా. పూలూ స్నేహితులెందరో ఇక్కడికొచ్చారుగానీ, ఎవరిమీదా అంత ప్రేమ కలగలేదనుకో! ఈ పిల్లాడేగనక రాకపోయుంటే...ఇంక నా మొహం లోకులకు చూపించగలిగేదాన్నా!"

"అతనిట్లా రావాలని రాసిపెట్టుంటే రాకేం చేస్తాడు? దైవ సంకల్పం ఇట్లా ఉండగా, అపర్ణను ఇంకెవరికో ఇచ్చి చెయ్యాలని ఎవరన్నా అనుకుంటే మాత్రం జరుగుతుందా?" అంటోంది ఆ పెద్దావిడ.

"నీ ఆశీర్వాదమమ్మా..." అపర్ణతల్లి వెక్కిళ్ళు పెడుతోంది. ఆడవాళ్ళందరూ కళ్ళు తుడుచుకున్నారు. అపూ కళ్ళు కూడా చెమ్మగిల్లాయి. అపర్ణ తల్లిపై అతని హృదయంలో ఎనలేని గౌరవం కలిగింది. సర్వజయ మీదా, లీలా వాళ్ళమ్మమీదా మాత్రమే అతనిలో ఉన్న భావమది.

ప్రణవ్ ఓ తుంటరి పనిచేసి అపూని ఇరుకున పెట్టాడు. అపూ చక్కగా పాటలు పాడుతాడని అతడు చెప్పగానే ఆడవాళ్లంతా అపూని చుట్టుముట్టి పాడాల్సిందేనని వత్తిడి చెయ్యసాగారు. అపూకి ఇక తప్పలేదు. టాగోర్ గీతం ఒకటి, మరొక పాటా పాడాడు. అతను పాడటం ముగియగానే ఒక పెద్దావిడ అపర్ణను మోచేత్తో పొడుస్తూ "ఇంకా చూస్తావేమే పిల్లా, నువ్వు ఓ పాటందుకో! నీ మొగుడే పెద్ద పాటగాణ్ణనుకుంటున్నాడేమో, నువ్వూ పాడితే, అప్పుడు చెప్తాం!" అంది.

అపూ నివ్వెరపోయి చూశాడు. మొగుడా? తనిప్పుడు ఓ భర్తగా మారిపోయాడా? తన పక్కన మౌనంగా కూర్చున్న ఈ అందాలబొమ్మ తన భార్యా? నిజంగా ఆమె తన భార్యేనా?

ఆ రాత్రి తెల్లవారే దాకా ఆటపాటలతో, సంబరాలతో గడిచిపోయింది.

మర్నాడు అపర్ణ తండ్రితో ప్రణవ్, "అపూ ధనవంతుడు కాదు. కానీ, అంత డబ్బున్న ఆ పెళ్ళికొడుకు కుటుంబంకంటే అన్నివిధాలా అధికుడు. ఎవరి సహాయమూ లేకుండా తనకు తాను నిలదొక్కుకోటానికి అతడు పడిన శ్రమను మూడేళ్ళుగా చూస్తున్నాన్నేను... అందుకే నాకతడంటే ఎంతో ప్రేమ. మనిషంటే అలా ఉండాలి" అన్నాడు.

❖ ❖ ❖ ❖

ఆ మరునాడు రాత్రి అపూ గదిలోకి వెళ్ళేసరికి అతని పడకంతా పూలతో అలంకరించి ఉంది. విరిసిన సంపెంగల పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ కూర్చున్నాడు అపూ. అపర్ణకోసం అతని హృదయం వేగిరపడుతోంది. ఇంతవరకూ ఆమె తనతో ఒక్క మాటయినా మాట్లాడనేలేదు. ఇప్పుడేమని పలకరించాలి తను? ఆమె తనతో ఏం మాట్లాడుతుందో!

చాలాసేపటికి గదిలోకి అడుగుపెట్టింది అపర్ణ. జరుగుతున్నది నిజమో, కలో తెలియని స్థితి అపూ హృదయాన్నింకా ఆవరించుకునే ఉంది. ఎవరీమె? తన భార్యా? అంటే అర్థమేమిటి?

బెరుగ్గా తలుపు దగ్గరే ఆగిపోయింది అపర్ణ. "ఎ...ఎందుకలా నిలబడ్డావ్? ఇలా... ఇలా వచ్చి కూర్చో" అన్నాడు తడబాటుతో అపూ. గది వెలుపలి నుండి అపర్ణ స్నేహితురాళ్ళు గొల్లున నవ్వడంతో అపూ బిత్తరపోయాడు. ఎవరో పెద్దావిడ వాళ్ళందరినీ చీవాట్లేసి అక్కణ్ణుండి వెళ్ళగొట్టడం విన్పించింది.

అపర్ణ చిరునవ్వుతో వచ్చి మంచంపై కాస్త దూరంగా కూర్చుంది. ఆమెనెలా మాట్లాడించాలో తెలియక "నీ పేరేమిటి?" అన్నాడు అపూ.

కళ్ళు పైకెత్తకుండానే చిరునవ్వుతో "శ్రీమతి అపర్ణాదేవి" అని జవాబిచ్చింది. అతి మనోహరమైన చిరునవ్వు ఆమెది. ఆమె నునుపైన చెక్కిళ్ళనూ, సొంపైన మెడనూ, చక్కటి చుబుకాన్నీ మంత్రముగ్ధుడిలా చూస్తూండిపోయాడు అపూ. ఏదో చెప్పలేని ఆత్రుతతో, ఆందోళనతో అతని గొంతెండిపోతోంది. లేచి, కూజాలోని నీళ్ళు తాగాడు. ఆమెతో మాటలు ప్రారంభించడమెలాగో తెలియటంలేదు.

"నన్ను పెళ్ళాట్టం నీకిష్టం లేదు కదూ? ఔన్లే, నాకు తెలుసు" అన్నాడు అనాలోచితంగా.

"చాల్లే, ఊరుకోండి".

తనతో ఆమె నేరుగా మాట్లాడిన మొదటి మాట అదే. అతని ఒళ్ళు పులకరించింది. ఆడపిల్లలతో తానెన్నోసార్లు మాట్లాడాడు. కానీ, ఈ అనుభూతి చిత్రంగా ఉంది.

కిటికీగుండా వీస్తున్న చల్లని గాలితో కలిసి, గదిలోని చంపక పుష్పాల సువాసన గదినంతా పరిమళింపజేస్తోంది.

"రెండు కావొస్తోంది టైము, నిద్రరావటంలేదూ..." అడిగాడు అపూ.

అమ్మతోనూ, అక్కతోనూ తప్ప వేరే ఆడవాళ్ళతో కలిసి ఒకే గదిలో ఎప్పుడూ నిద్రపోలేదు. తనకు సరిగా పరిచయమైనా లేని ఈ యువతితో రాత్రంతా ఎలా ఉండాలో అర్థమవటం లేదు. కొత్తగా, ఇబ్బందిగా ఉంది అతనికి ఈ అనుభవం. అపర్ణ ఎందుకో పక్కకు జరగటంతో ఆమె చెయ్యి తగిలి, అపూ ఒళ్ళు జల్లుమంది. అందమైన అతని వదనం అసాధారణమైన కాంతితో వెలిగింది.

సంకోచిస్తూనే అపర్ణ భుజంపై చెయ్యివేసి అడిగాడు అపూ, "ఆ రోజు...నేను మీ ఇంటికొచ్చిన రోజు...నన్ను గురించి ఏమనుకున్నావ్?" ఆమె మళ్ళీ చిరునవ్వు నవ్వి, అతని చేతిని పక్కకు తొలగిస్తూ తన చేతిని దీపం ముందుకు చాపింది. "అరె, చూడు! చూడు! నా ఒళ్ళంతా గగుర్పొడిచినట్టుగా అయిందేమిటి? మీకు తెల్సా ఎందుకలా అవుతుందో!" అంది అల్లరిగా చిరునవ్వు నవ్వుతూ.

అతనితో ఎవరూ, ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు. ప్రేమ, శృంగారం అంటే ఇదేనా? ఇన్ని సంవత్సరాలుగా తను చదివినదీ, విన్నదీ, ఊహించినదీ ఇలా లేదే! అవన్నీ అర్థంలేని ఆలోచనలేనా! వాస్తవ జీవితంతో సన్నిహిత సంబంధం లేని ఊహలు అలాగే ఉంటాయేమో!

అపూ మనసులో అవ్యక్తమైన ఊహలేవో సుళ్ళు తిరుగుతున్నాయి. రెండు రోజుల కిందటిదాకా తనకంటూ ఎవరూలేరు. కేవలం రెండు రోజుల్లో పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు ఈ అమ్మాయి తన పక్కనుంది. నిజానికి ఈమె తనకు అపరిచితురాలే, కానీ... జన్మజన్మల నుండి ఈమె తనతోనే ఉందేమోనన్నంత సన్నిహితంగానూ తోస్తోంది.

హటాత్తుగా తల్లి గుర్తొచ్చిందతనికి. ఇప్పుడు ఎక్కడుందో అమ్మ? తన పెళ్ళి చూడాలని ఆమె ఎన్నో కలలు కన్నది. ఆ పల్లెటూళ్ళో చిన్న ఇంట్లో కూర్చుని ఆ కలలనూ, ఆశలనూ తనకు విన్పించింది. అవన్నీ ఆమె దేహంతోపాటే కాలిపోయాయి... పిడికెడు బూడిదగా మారాయి. అమ్మలేకుండా...అమ్మతో పంచుకోకుండా...తన జీవితంలో సంతోషకరమైన సందర్భాలన్నవేవీ లేవు. కానీ, ఇప్పుడు...అపూ కళ్ళు చెమ్మగిల్లాయి.

# 13

అపూ మర్నాడు బయల్దేరి కలకత్తాకు వెళ్ళిపోయాడు. మళ్ళీ అదే దినచర్యలో, ఉరుకుల పరుగుల జీవితంలో మునిగిపోయాడు. అపర్ణతో తన పెళ్ళి నిజమా? కలా? అన్పిస్తోందతనికి.

ఒకరోజు సాయంత్రం బజారులో సంపెంగలు అమ్ముతుంటే ఆత్రంగా వెళ్ళి కొన్నాడు అపూ. ఆ పరిమళం అతని హృదయానికెంతో హాయిగా సోకింది. కానీ... ఆ హాయిలో మిళితమైన ఏదో బాధను...చేతికందినదేదో జారిపోయిన భావనను కూడా అనుభూతి చెందాడు.

ఆ రాత్రంతా అన్యమనస్కంగానే గడిపాడు. అపర్ణతో గడిపిన తొలిరేయిని గుర్తు తెచ్చుకున్నాడు. ఎందుకో అపర్ణ వదనం అతని మనోనేత్రం ఎదుట మసకబారినట్టుగా కనబడుతోంది. ఆమె రూపురేఖలను స్పష్టంగా గుర్తుచేసుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె నల్లని కళ్ళూ, దట్టమైన కనురెప్పలూ మాత్రమే మరీ మరీ గుర్తొస్తున్నాయి. అంతకన్నా ఎక్కువగా, అమాయకమైన ఆమె చిరునవ్వు అతని కళ్ళముందు కదలాడుతోంది.

ఆరువారాల తర్వాత ప్రణవ్ వచ్చి కలిశాడు. అపూ వంటి అల్లుడు దొరికినందుకు అపర్ణావాళ్ళమ్మ ఎంతగా పొంగిపోతోందో, అతనికి తల్లిదండ్రులు లేరని తెలిసి, ఆవిడెంతగా బాధపడిందో చెప్పాడు. అపూకి అమెపై గౌరవాభిమానాలు ఇనుమడించాయి.

అపర్ణకు తనతో పెళ్ళి ఇష్టమేనా? ధనవంతుడైన భర్త దొరకనందుకు ఆమె విచారించటం లేదు గదా! అనే తన సందేహాలను ప్రణవ్ ముందు వెలిబుచ్చలేకపోయాడు అపూ.

అపర్ణకు తప్పిపోయిన పెళ్ళికొడుకును గురించి కొత్త విషయాలు చెప్పాడు ప్రణవ్. ఆ కుర్రాడికి బొత్తిగా మతిస్థిమితం లేకుండా పోయిందట. గదిలోపెట్టి తాళం వేస్తున్నారట. అప్పుడప్పుడూ అతనికి తన పెళ్ళి సంగతి గుర్తొచ్చి “నాకు పెళ్ళయిందా, లేదా? నా పెళ్ళెందుకు ఆగిపోయింది?” అని కనబడ్డ వాళ్ళందరినీ అడుగుతాడట. ఈ విషయాలు చెప్తూ విరగబడి నవ్వుతున్న ప్రణవ్‌ను వారించాడు అపూ.

“ఊరుకో ప్రణవ్! అలా నవ్వకు! ఆరోగ్యం పాడవటంలో అతని బాధ్యతేముంది పాపం!” అన్నాడు. ఆ పిచ్చి కుర్రాడిపై జాలితో కరిగిపోయింది అతడి హృదయం.

ప్రణవ్ చాలాసేపు కబుర్లు చెప్పాడు కానీ, అపర్ణ తండ్రికి అపూ సంబంధం ఇష్టం లేదన్న విషయాన్ని మాత్రం బయటపడనివ్వలేదు. తన కూతురిని కలవారింటి కోడలుగా చూడాలనుకుంటే, అపూ వంటి దరిద్రుడు దొరికాడని ఆయన మండిపడ్డాడు. తన భార్యా, ప్రణవ్ కలిసి కుట్రచేసి ఈ సంబంధాన్ని అంటగట్టారని ఆయన అనుమానం.

దుర్గా పూజ పండుగకు అత్తవారింటికి వెళ్ళాలని అపూ ప్రయత్నించాడు కానీ, వీలుపడలేదు. కొత్త బట్టలు కొనటానికైనా చేతిలో డబ్బులు సమకూరకపోవటం ఒక కారణమైతే, మామగారు ఏదో మొక్కుబడిగా ఉత్తరం రాయటమే తప్ప, మనస్ఫూర్తిగా ఆహ్వానించకపోవటం మరొక కారణం. గట్టిగా ప్రయత్నించి మంచి ఉద్యోగం చూసుకోక పోతే, భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని మాత్రం ఆయన మరీమరీ రాశాడు ఆ ఉత్తరంలో.

❖ ❖ ❖ ❖

పెళ్ళయిన ఏడాదికి, అత్తవారింటికి బయల్దేరాడు అపూ. ఈ సంవత్సర కాలంలో అపర్ణను గుర్తుచేసుకోకుండా ఒక్కరోజయినా గడపలేదతడు.

ప్రయాణానికి ముందు రోజున రాత్రంతా నిద్రపట్టలేదు. తను వేసుకున్న బట్టలూ, కొత్తరకంగా దువ్వుకున్న జుత్తూ, తనకు అందంగా అమరాయో లేదోనని ఒకటికి పదిసార్లు అద్దంలో చూసుకున్నాడు.

అతడు అపర్ణా వాళ్ళింటికి చేరే సమయానికి వర్షం పట్టుకుంది. అపూ వచ్చాడని తెలిసి, వర్షంలోనే ఎదురొచ్చింది అపర్ణ తల్లి.

రాత్రి భోజనాలయ్యాక గదిలోకొచ్చిన అపర్ణ మీది నుండి కళ్ళు తిప్పుకోలేక పోయాడు అపూ. ఒక్క ఏడాదిలో ఎంతగా మారిందామె! గత సంవత్సరం కూడా ఆమె అందంగానే ఉంది. కానీ అప్పుడామె పసితనం ఇంకా వీడని బాలిక. ఇప్పుడు పూర్తిగా కొత్తరూపం దాల్చిన స్త్రీ! లీల వలె కళ్ళు చెదరగొట్టే అందం కాదామెది. కానీ, అదొక అరుదైన సౌందర్యం. ఆమెను చూస్తుంటే నిజంగా ఏ దేవతనో చూస్తున్నట్టుగా ఉంటుంది. చిగురుటాకుల్లోని మృదుత్వాన్నీ, ఏ దుర్గమారణ్యాలలోనో సెలయేటి గట్టున పూచిన అడవి పువ్వుల్లోని ముగ్ధత్వాన్నీ కలబోసి, ప్రకృతి ఆమెను తీర్చిదిద్దిందేమోనన్పిస్తుంది.

"నీతో మాట్లాడను, పో!" అన్నాడు అపూ, నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, "ఒక్క ఉత్తరమన్నా రాయలేదేం మరి?"

అపర్ణ సిగ్గుగా చిరునవ్వు నవ్వి, కనురెప్పలెత్తి చూసింది, "అదే మాట నేను అడగొచ్చుగా?"

"ఓహో! నేను నీకసలు గుర్తున్నానా? నా కోసం ఎదురు చూశావా చెప్పు? ఉత్తి అబద్ధాలకోరువి!" అన్నాడు అలకగా.

అపర్ణ ముఖం గంభీరంగా మారింది. "ఇక చాలు, మీరలా మాట్లాడకండి. దుర్గా పూజకు తప్పకుండా వస్తారనే అనుకున్నాం. అమ్మ ప్రతిరోజూ ఎదురుచూస్తూనే ఉంది. నేను..." సగంలో మాటలాపేసిందామె.

"చెప్పు, నువ్వేమనుకున్నావ్?"

"ఏమో, నాకు తెలీదు."

"తెలీదూ? సరేలే! నన్ను పెళ్ళాట్టమే నీకిష్టం లేదని నాకు తెలుసులే! ఆ ధనవంతుల సంబంధం..."

"ఛ! ఎందుకా విషయాన్ని పదే పదే గుర్తుచేస్తారు? నాకలాంటి ఆలోచన కూడా రాదు" అంది అపర్ణ చిరాగ్గా.

వానకురిసి వెలిసినందువల్ల వాతావరణం చల్లగా ఉంది. నిర్మలమైన ఆకాశంలో వెలుగుతున్న చంద్రుడి కాంతి తడి నేలను స్పృశిస్తోంది. మంద్రంగా వీస్తున్న గాలి ఏవో పూల పరిమళాలను మోసుకొస్తోంది.

"ఇక్కడెక్కడయినా సంపెంగ పూలు దొరుకుతాయా అపర్ణా! పడకమీద చల్లితే బావుంటుంది"

"ఎక్కడో ఎందుకు, మన తోటలోనే పూస్తాయి. కానీ, తెచ్చిపెట్టమని నేనెవర్నీ అడగను బాబూ, అదేదో మీరే తెప్పించుకోండి"

"సరే, అలాగే. ప్రత్యేకంగా సంపెంగలెందుకు అడిగానో తెలుసా నీకు?"

అతని మనసులోని భావం అర్థమయిందన్నట్టు తియ్యగా నవ్వింది అపర్ణ. ఆమె చాలా తెలివయిందని గ్రహించాడు అపూ.

"నీకింకో విషయం చెప్పాలి అపర్ణా! నిన్ను నాతోబాటు తీసుకెళ్ళాలనుంది. మనం కలకత్తాలో ఉండటం కుదరకపోవచ్చేమో. మా ఊరికెళ్ళి, మా ఇంట్లో ఉండటం నీకిష్టమేనా?"

"మా అమ్మకూ, నాన్నకూ చెప్పండి"

"తప్పకుండా. కానీ ముందు నీ అభిప్రాయం చెప్పు. అక్కడుండటం కష్టంగానే ఉంటుంది మరి. పనిమనుషులు లేకుండా అన్ని పనులూ నువ్వే చేసుకోవాల్సి ఉంటుంది. మా ఇల్లు కూడా చాలా చిన్నది... తాటాకుల కప్పుతో, రెండే గదులుంటాయి."

"ఏం ఫరవాలేదులెండి. మీ గురించి అన్ని సంగతులూ నాకెప్పుడో తెలుసు. పూలూ దాదా నాకన్నీ చెప్పాడు. మీరేం బెంగపడనక్కర్లేదు. మీతోబాటు ఎక్కడికి రావటమయినా నాకిష్టమే."

వాళ్ళ కబుర్లలోనే ఆ రాత్రి తెల్లవారిపోయింది.

❖ ❖ ❖ ❖

భార్యతోబాటు ప్రయాణమయ్యాడు అపూ. మంచి ఉద్యోగం దొరికిందాకా అపర్ణను ఇక్కడే ఉంచితే బావుంటుందని మామగారు అభ్యంతరాలు చెప్పబోతే, అపర్ణ తల్లి అడ్డు పడింది. "నా కూతురి మనసు నాకు తెలుసులెండి. భర్తతోపాటు వెళ్ళాలనుంది దానికి, వెళ్ళనివ్వండి" అని స్పష్టంగా చెప్పింది.

తన అదృష్టాన్ని తానే నమ్మలేకపోయాడు అపూ. ఏ ఆటంకాలూ, ఎవరి అభ్యంతరాలూ లేకుండా... దినమంతా ఏకాంతంగా తన భార్యతో గడపబోతున్నాననే ఊహ గమ్మత్తుగా ఉంది.

రైలు స్టేషనుండే ఊరిదాకా స్టీమర్‌లో ప్రయాణం చేశారు. రైలు రావటానికి ఇంకా చాలా గంటలసేపు పడుతుందని తెలియటంలో అప్పటిదాకా బస చెయ్యటానికి ఒక గది అద్దెకు తీసుకున్నాడు అపూ.

"తినటానికి బయటేమీ కొనుక్కురాకండి. ఇక్కడ వంటగది కూడా ఉంది, అన్నం వండేస్తా"నంది అపర్ణ.

ఈ చిన్నగదిలో తనకొక సంసారమూ, వంటా...అంతా చిత్రంగా ఉంది అపూ మనసుకు. అతడు దుకాణానికెళ్ళి సరుకులు కొనుక్కుచ్చేసరికి, అపర్ణ స్నానంచేసి జరీ అంచున్న చీర కట్టుకుని వంటగదిలో ఏదో హడావిడి పడుతోంది. ఆమె నుదుటి మీద చిన్న కుంకుమ బొట్టు మెరుస్తోంది.

అపర్ణకేసి కళ్ళార్పకుండా చూస్తూండిపోయాడు అపూ. రాత్రివేళల్లో తప్ప, ఆమెనింత సన్నిహితంగా చూసిందేలేదు. ఆమె అందమైనదని తనకిప్పటికే తెలుసు, కానీ...ఆ అందంలోని ఇంత సూక్ష్మమైన వివరాలను దగ్గరగా చూడటం ఇదే మొదటిసారి. ఆమె చేతులెంత పొందిగ్గా ఉన్నాయి! ఆ కదలికల్లో ఎంత మంత్రజాలం ఉంది! ఈమె పూర్తిగా తన మనిషి...ఈ లోకంలో తనదంటూ చెప్పుకోదగిన ఒకేఒక్క మనిషి!

పొయ్యి వెలిగించటానికి వాళ్ళిద్దరూ తంటాలు పడుతుంటే, గది యజమానురాలు వచ్చి సాయం చేసింది. నదిలో స్నానంచేసి రావటానికి బయల్దేరుతున్న అపూను త్వరగా తిరిగిరమ్మని హెచ్చరించింది అపర్ణ. అతను వచ్చేలోగా ఇంటి యజమానురాలితో కలిసి బజారుకు వెళ్ళి మిఠాయిలు కొనుక్కొచ్చింది. షర్బత్ కూడా తయారుచేసి, భర్తకోసం వాటినన్నిటినీ ఓ పళ్ళెంలో అమర్చిపెట్టింది.

"అచ్చమైన గృహిణివన్నమాట!" అని నవ్వాడు అపూ.

అపర్ణ వంటచేస్తుంటే అపూ కూడా పిల్లిలా వంటగదిలోకి వచ్చాడు. వదులుగా ముడేసుకున్న ఆమె జుట్టును వెనకనించి లాగాడు. ఆమె ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. "ఏమిటా పిచ్చిపని? నొప్పెడుతుందని తెలీదూ? ఇంకోసారి ఇలాంటి వేషాలేస్తే ఊరుకోను. వంటా, గింటా అవతలపారేసి వెళ్తాను తెల్సా?" అంది కోపంగా.

అమ్మకూడా అచ్చంగా ఇలాగే బెదిరించేదని హటాత్తుగా గుర్తొచ్చిందతనికి. ఆమె కళ్ళలో కూడా అచ్చంగా ఇలాంటి ఆత్మీయతే తొణికిసలాడేది. దుర్గ, రాణూ, లీల, ఇప్పుడు అపర్ణ... తన మనసుకు సన్నిహితంగా వచ్చిన వీళ్ళందరూ ఒక్కోసారి అచ్చం అమ్మలాగానే మాట్లాడేవాళ్ళని అతనికి గుర్తొచ్చింది. అమ్మ తన ప్రేమను వీళ్ళందరి ద్వారా తనకు పంచిందేమో!

కలకత్తాకు వెళ్ళాక ఒకరోజు, అపర్ణకు నగరమంతా చూపించటానికి బయల్దేరాడు అపూ. ఇంతపెద్ద నగరాన్ని చూడటం ఆమెకదే మొదటిసారి.

ఆ మరునాడు ఒంటెద్దు బండిలో ఇద్దరూ మన్సాపోతాకు బయల్దేరారు. సర్వజయ ఉండిన ఇంటి దగ్గరకు చేరేసరికి చీకటి పడింది. ఇట్లా వస్తున్నట్టుగా గ్రామంలో ఎవరికీ తెలియపరచలేదు అపూ. అమ్మ ఉండుంటే తన భార్యకు స్వాగతం పలికేది. ఇప్పుడక్కడ ఎవరున్నారని?

పాడుబడినట్టుగా ఉన్న ఆ ఇల్లు చీకట్లో నిశ్చలంగా నిలబడుంది. దీపంపెట్టే దిక్కుకూడా లేని శిథిల గృహమది. బండిలోంచి ట్రంకుపెట్టనూ, ఇతర సామాన్లనూ దించటానికి అపూ అవస్థపడుతుండగా, బొప్పాయి చెట్టుకింద మూగదానిలా నిలబడి పోయింది అపర్ణ. అపూ పట్టుకొచ్చిన అగ్గిపెట్టె సాయంతో తాళంతీసి, సామాన్లను లోపలికి చేరవేశారు ఇద్దరూ కలిసి.

నిజంచెప్పాలంటే అపర్ణకు నోటమాట రానట్టుగా ఉంది. తన భర్త ధనవంతుడు కాదని ఆమెకు తెలుసు, కానీ ఇంత దుర్భరమైన దారిద్ర్యాన్ని ఆమె ఊహించలేదు. ఇల్లనబడే ఆ గుడిసెకున్న పూరికప్పు సగం కూలిపోయింది. వరండా చుట్టూ ఉండాల్సిన ప్రహరీగోడ శిథిలమయిపోయింది. ఎక్కడ చూసిన పిచ్చి మొక్కలు పొదలుగా పెరిగి పోయాయి. వాటిలోంచి ఏవో కీటకాలు చిత్రమైన శబ్దాలు చేస్తున్నాయి. పొదల్లో మిణుగురులు ఎగురుతున్నాయి. తను కొత్త కాపురం ప్రారంభించబోయేది ఇక్కడా? ఆమె గొంతుకేదో అడ్డుపడినట్టుగా అయింది. అమ్మ...పిన్నమ్మలు...చిన్ని తమ్ముడు...మళ్ళీ వీళ్ళందరినీ చూడగలుగుతుందా తను? అయ్యో, భగవంతుడా! తన జీవితమంతా ఈ కొంపలోనే గడపడమంటే సాధ్యమయ్యేపనేనా? ఇక్కడ తనసలు ప్రాణాలతో ఉండగలుగుతుందా?

ఇంతలో అపూ, ఓ లాంతరు సంపాదించి దాన్ని వెలిగించాడు. ఎలుకలు చేసిన కన్నాలూ, వాటిలోంచి బయటపడిన మట్టికుప్పలూ అపర్ణకు స్పష్టంగా కనబడుతున్నాయి. ఒక మూలనున్న మంచాన్ని దులిపి, వాల్చి, అపర్ణను కూర్చోమన్నాడు అపూ. ఇంటి ముందున్న సామాన్లు తెచ్చేందుకు లాంతరు తీసుకుని బయటికి వెళ్ళాడు. ఆ కటిక చీకట్లో ఒంటరిగా కూర్చున్న అపర్ణకు శరీరం గడ్డకట్టిపోతున్నట్టుగా ఉంది. చెంపలమీదుగా కన్నీళ్ళు కారుతున్నాయి.

గంటసేపు శ్రమపడి, శుభ్రంచేశాక తాత్కాలికంగా నివాసయోగ్యంగా తయారయింది ఆ గది. వంటగది పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. పైగా వంటసామాన్లు కూడా లేవు. ఆ రాత్రికి భోజనం సంగతేమిటో పాలుపోలేదు అపూకి. ఇంతలో అపర్ణలేచి, సంచిలోంచి ఓ డబ్బా తీసింది. "దీన్లో మిఠాయిలు పెట్టి ఇచ్చింది అమ్మ. మనిద్దరికీ ఈ పూటకు సరిపోతాయి లెండి" అంది.

అపర్ణను ఈ పరిస్థితిలో పడేసినందుకు సిగ్గుపడ్డాడు అపూ. ముందూ వెనకా ఆలోచించకుండా ఇలా బయల్దేరటం ఎంత తప్పో అర్థమయింది. "రాణాఘాట్‌లో ఆగి,

తినటానికేమయినా తెచ్చుకుంటే బావుండేది అపర్ణా! ఇప్పుడయినా నేను వెళ్ళి కాసిని బియ్యమూ, పాలూ తీసుకురావొచ్చు. కానీ... నువ్వొక్కదానివే ఉండగలవా?"

మారు పలకకుండా తల అడ్డంగా ఊపింది అపర్ణ.

❖ ❖ ❖ ❖

పొద్దున లేచి చూస్తే, పక్కింటికి తాళం వేసుంది. వాళ్ళు ఉండుంటే రాత్రి తమకు సాయం చేసేవాళ్ళేకదా, అన్పించింది అపూకి. వీళ్ళొచ్చిన వార్తను నిరుపమ ఎలా తెలుసుకుందోగానీ, కాసేపట్లో పరిగెత్తుకొచ్చింది.

"ఏమిటిది, నీరూదీ! అమ్మ లేదు కదా, నువ్వొచ్చి కొత్త కోడలికి స్వాగతం చెప్తావనుకున్నా! ఇప్పుడా రావటం?" అన్నాడు అపూ నవ్వుతూ.

"నీకింకా చిన్నప్పటి వెర్రితనం వదల్లేదేం అపూ! నీ భార్యను ఇలా ఇబ్బంది పెట్టడం మంచిదేనా?" నిష్ఠూరంగా అంది నిరుపమ. "మీరొస్తున్నట్టు తెలియజెయ్యడానికేమయ్యా? ఈ పాడుబడ్డ కొంపలో ఎలా ఉంచావ్ ఆ పిల్లను?" అంటూ మండిపడింది.

అపర్ణను పలకరించాక, ఆమెకొక బంగారు కాసును కానుకగా ఇచ్చింది. ఆ అమ్మాయిని ఈ ఇంట్లో ఉండనివ్వననీ, తమ ఇంటికే వచ్చి ఉండమనీ అన్నది.

"ఒద్దొద్దు, నీరూదీ! ఎంతయినా ఇది మా అమ్మ ఇల్లు కదా! దీన్ని కాస్త బాగుచేసుకునేందుకు ఆమెకు సాయం చెయ్యరాదూ! కావాలంటే రాత్రుళ్ళు పడుకోటానికి మీ ఇంటికే తీసుకెళ్ళు" అన్నాడు అపూ.

మరుసటి వారం అపూ కలకత్తాకు వెళ్ళిపోయాడు. ప్రతి శనివారమూ గ్రామానికి వచ్చి, మళ్ళీ సోమవారానికి తిరిగి వెళ్తున్నాడు. కానీ, వారానికోసారి ప్రయాణం చెయ్యటం ఖర్చుతో కూడిన పని. అందువల్ల, కొన్ని వారాల తర్వాత ఈ పద్ధతిని మార్చుకోక తప్పలేదు. మరో రెండు నెలల్లో జన్మాష్టమి పండుగ వస్తోంది. అప్పుడు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

ఆ రెండు నెలలూ అపర్ణ రాసే ఉత్తరాల కోసం ఎదురుచూడటమే లోకంగా గడిపాడు అపూ. అమ్మ బతికున్నప్పుడు తనకు ఉత్తరాలు రాసేది. ఆమె పోయాక మళ్ళీ ఇన్నాళ్ళకు, తనకు ఉత్తరాలు రాసేందుకు ఓ ఆత్మీయురాలు దొరికినందుకు మహదానందంగా ఉంది అపూకి.

❖ ❖ ❖ ❖

జన్మాష్టమికి ముందు రోజున మధ్యాహ్నం మూడు గంటలకు ఆఫీసు నుంచి బయటపడ్డాడు అపూ. ఇవాళ తనొస్తున్నట్టుగా అపర్ణకు రాయలేదు. హటాత్తుగా తను ప్రత్యక్షమైతే ఆమె ఎంత ఆశ్చర్యపోతుందో చూడాలని అతనికి సరదాగా ఉంది.

చీకటిపడకముందే ఇల్లు చేరాడు అపూ. అపర్ణ ఇంట్లో లేదు. నది దగ్గరకో, నిరుపమా, వాళ్ళింటికో వెళ్ళుండవచ్చు. సబ్బుతో ముఖం కడుక్కుని, శ్రద్ధగా తలదువ్వుకున్నాడు.

తను వచ్చాడన్న విషయం తెలీకుండా సంచినీ, ఇతర వస్తువులనూ దాచిపెట్టేసి, ఇంట్లోంచి బయటికి వెళ్ళాడు. అరగంట తర్వాత అతనొచ్చేసరికి ఇంట్లో దీపం వెలుగుతోంది. దాని ఎదుట కూర్చుని ఏదో చదువుకుంటోంది అపర్ణ. పిల్లిలాగా ఆమె వెనక్కి చేరి నిలబడ్డాడు అపూ. అమ్మను కూడా ఇలాగే భయపెడుతుండేవాడు. ఏదో అలికిడయినట్టుగా అన్పించి తలెత్తిన అపర్ణకు, ఎదుటి గోడమీద మనిషి నీడ కనబడి, ఒళ్ళు జల్లుమంది. అపూ గట్టిగా నవ్వుతూ ఆమె ముందుకొచ్చాడు.

"మీరా!" ఆశ్చర్యంతో చిన్న కేకపెట్టింది అపర్ణ. "ఎప్పుడొచ్చారు? ఇదేంపని...?" అంది సిగ్గుపడుతూ.

"భయపడిపోయావా?" ఇంకా నవ్వుతూనే ఉన్నాడు అపూ. "భయపడడమా... చచ్చిపోయుండేదాన్ని! ఎందుకలా భయపెట్టటం?"

అపూ తన సంచులు వెలుపలికి తీశాడు.

"ఎలా ఉన్నావ్ అపర్ణా? మీ అమ్మగారి దగ్గర్నుండి ఉత్తరాలు వస్తున్నాయా?"

దానికి జవాబివ్వకుండా "మీరు కొంచెం చిక్కిపోయారేం? ఆరోగ్యం బాగాలేదా?" అడిగిందామె.

"ఉత్తరాలు రాయటానికి పేపర్లూ, కొన్ని పుస్తకాలూ తెచ్చాను నీ కోసం. ఔనూ... భోజనంలోకి ఏంచేస్తున్నావ్?" అడిగాడు అపూ.

"మీకేం కావాలో చెప్పండి. బంగాళాదుంప కూర చేద్దామనుకుంటున్నా. నెయ్యీ, పాలూ ఉన్నాయ్"

ఈ కొద్దిరోజుల్లోనే ఆ శిథిల గృహంలో అద్భుతాలను సృష్టించింది అపర్ణ. ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కల్ని పీకేసి, నేలంతా చదును చేసింది. గోడలకు సున్నం వేయించింది. పడకగదిలో కొత్త అలమరాలు పెట్టించింది. పక్కింట్లో పనిచేసే ఓ ముసలావిడ సాయంతో ఇన్ని పనులూ చక్కబెట్టిందామె. అపర్ణ పడిన శ్రమ ఆ ఇంట్లో అడుగడుగునా ప్రతిఫలిస్తోంది.

❖ ❖ ❖ ❖

పొద్దున్నే లేచి పెరట్లోకి వెళ్ళిన అపూ, అక్కడున్న కూరగాయల తోటను చూసి ఆశ్చర్యపడ్డాడు. ఆకుకూరల మడులు పచ్చగా నవనవలాడుతున్నాయి. వంటగది పైకప్పును బాగుచేయించి, దాని మీదికి సొర, గుమ్మడి తీగలను పాకించింది అపర్ణ. వసారా పొడవునా బంతిమొక్కలు నాటింది. కళ్ళప్పగించి చూస్తున్న అపూ పక్కకొచ్చి నిలబడింది అపర్ణ. "ఇవేం చూస్తారు...ఇంకో గమ్మత్తు చూపిస్తా రండి" అంటూ వాకిట్లోకి తీసుకెళ్ళింది.

ఇంటి ఆవరరణలో ఓ పక్కగా నాటిన మొక్కను చూడగానే అతని ఒళ్ళు పులకరించింది. అది సంపెంగ మొక్క. నోరువిడిచి చెప్పనక్కర్లేకుండానే, తన కోరికలన్నిటినీ గ్రహించగలదు తన భార్య!

"ప్రత్యేకంగా సంపెంగ మొక్కనే నాటాలని ఎందుకన్పించింది అపర్ణా?" సిగ్గుగా నవ్వి, చూపులు తిప్పుకుంది అపర్ణ. "ఏమో! ఐనా మీకెందుకు చెప్పాలి?"

ఈ పువ్వులు తనకెందుకంత ప్రియమైనవో అపూ, ఆమెకెన్నడూ మాటల్లో చెప్పలేదు. అలా చెప్పాల్సిన అవసరం కూడా లేదని ఈ చర్యతో చెప్పకనే చెప్పిందామె. అపూ హృదయం ఆమె ముందు కృతజ్ఞతతో వినమ్రమైంది.

ఆ రోజంతా వర్షం పడుతూనే ఉంది. వంటగదిలో అపర్ణ రొట్టెలు చేస్తుంటే, అపూ ఆమె పక్కనే కూర్చుని కబుర్లు చెప్పాడు. ఇద్దరం కలిసి ఒకే పళ్ళెంలో భోజనం చేద్దామని పట్టుపట్టి ఆమెను ఒప్పించాడు అపూ. అతన్ని మాటల్లో పెట్టి, ఎక్కువ రొట్టెలు తిన్పించింది అపర్ణ.

భోజనమయ్యాక, "నా కోసం పుస్తకాలు తెచ్చానన్నారుగా, ఏవీ?" అని అడిగింది.

చాలా విషయాల్లో వాళ్ళిద్దరి అభిరుచులూ ఒకేరకమైనవి. పుస్తకాలు చదవడమంటే ఎంతో ఆసక్తి చూపుతుంది అపర్ణ. తన సంచిలో నుండి పుస్తకాలు తెచ్చి, ఆమెకిచ్చాడు అపూ. ఓ కవితా సంపుటిని తెరుస్తూ, "ఏదీ, ఇందులోంచి ఓ కవిత చదువు అపర్ణా" అన్నాడు.

తన నాజూకయిన పొడవాటి వేళ్ళతో ఆ పుస్తకం పుటలు తిప్పుతూనే, దీపాన్ని మంచానికి దగ్గరగా జరిపింది అపర్ణ. కాస్సేపు బిడియపడినా సర్దుకుని ఓ కవితను చదవసాగింది. ఆమె అంత చక్కగా కవిత్వాన్ని చదవగలదని అపూ ఊహించలేదు.

"ఇప్పుడు మీ వంతు. ఓ మంచి పాటపాడండి" అడిగిందామె.

మూడు పాటలు పాడాడు అపూ. తర్వాత మళ్ళీ కబుర్లలోపడ్డారు. భవిష్యత్తును గురించి రంగురంగుల ఊహలల్లుకున్నారు.

"ఇప్పుడు అమ్మ ఉండుంటే ఎంత బావుండేది అపర్ణా! నా పెళ్ళిచూడాలని ఆమె ఎన్నికలలు ఎన్నదో" అపూ కంఠం బరువుగా పలికింది.

"ఔను. కానీ...ఆమె ఎక్కడున్నా మనల్ని చూస్తూనే ఉంటారని నాకు తెలుసు" మృదువుగా పలికింది అపర్ణ. కాస్సేపు మౌనం తర్వాత మళ్ళీ తనే, "నేనామెను చూశాను" అంది.

"ఏమిటీ?" విభ్రమంగా చూశాడు అపూ.

"ఔను. ఓ రోజు – తారీకు సరిగ్గా గుర్తులేదు గానీ...ఆ రోజే మీ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. పొద్దుట్నించీ మొక్కలు నాటి, ఆలస్యంగా భోజనం చేశాన్నేను. ఉత్తరం చదువుతూ పెరటి వసారాలో పడుకుని నిద్రపోయా. అప్పుడు...ఓ కలొచ్చింది. ఒకావిడ... చాలా అందంగా, కొంచెం మీ పోలికలతో ఉంది. పాపిట్లో సిందూరం పెట్టుకుని, ఎర్రంచు చీర కట్టుకుంది. ఆమె నా దగ్గరకొచ్చి, ఆప్యాయంగా జుట్టు నిమిరుతూ.

"ఈ సమయంలో నిద్రపోకూడదమ్మా, సందె చీకటి పడేవేళ ఇట్లా వెలుపల పడుకుంటే జబ్బుచెయ్యదూ, పిచ్చిపిల్లా!" అంది. ఆ తర్వాత తన చేతిలో ఉన్న కుంకుమ బరిణ తెరిచి నా పాపిట్లో సిందూరం పెట్టింది. నిజంగా నన్నెవరో ముట్టుకున్నట్టే తల నిమిరినట్టే అన్పించింది. మెలకువొచ్చి చూస్తే, ఎవరూలేరు. నా పాపిట్లో సిందూరం కనబడలేదు. ఒక్కసారిగా లేచి కూర్చున్నాన్నేను. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది... ఆమె...అత్తమ్మేనని నాకు బాగా తెలుసు. నన్ను తన కుటుంబంలోకి ఆహ్వానించటానికి స్వయంగా వచ్చారామె. నేనీసంగతి ఎవరికీ చెప్పలేదు, ఇప్పుడు మీకు తప్ప."

అపూ నిరుత్తరుడై ఆమెకేసి చూస్తూండిపోయాడు. ఇంటికప్పుమీద వర్షం పడుతున్న చప్పుడు...లోపలికి చొరబడుతున్న ఈదురుగాలికి దీపం రెపరెపలాడుతోంది. అపర్ణ శిరోజాల్లోంచి కమ్మని పరిమళం అతని నాసికను తాకుతోంది. అతని కళ్ళలో నీళ్ళు నిండాయి. ఇదొక చిత్రమైన అనుభూతి...తన జీవితంలోని మరపురాని రాత్రుల్లో ఇదొకటి.

"ఇంకోపాట పాడండి" అనే అపర్ణ మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు. మళ్ళీ మాటల్లో పడ్డారు. తెల్లవారబోతుండగా అపర్ణ అడిగింది.

"రేపటికి సెలవుపెట్టెయ్యొచ్చుగా?"

"లేదు, లేదు. చాలా పనుంది" అన్నాడు అపూ.

పనిమనిషి కేకతో ఉలిక్కిపడి లేవబోయింది అపర్ణ. తన చీరకొంగును అపూ కుర్తాకు ముడివేసి ఉండటం చూసి నవ్వుతూ కూలబడింది. "ఇలాంటి ఆలోచనలు ఎందుకొస్తాయసలు? మీకేమయినా పిచ్చా?" అని నవ్వుతూనే ఆ ముడి విడిపించుకుని లేచింది.

ఆ రోజుకిక ఆఫీసు మానెయ్యాలన్పించి, ఉండిపోయాడు అపూ.

## 14

రెండు నెలలు గడిచాయి. దుర్గాపూజ ప్రారంభమయే రోజున అపూ ఇంటికి వెళ్ళాడు. అతణ్ణి చూసి అపర్ణ సంతోషపడింది. కాళ్ళూ, చేతులూ కడుక్కుని రమ్మని, తను చేసిన పిండివంటలు వడ్డించింది. ఇల్లంతా చక్కగా అలంకరించి ఉంది. గోడలపై చక్కటి ముగ్గుల్ని చూసి ఆశ్చర్యపడ్డాడు అపూ.

"అరె! నువ్వే వేశావా ఇవన్నీ?" అన్నాడు సంతోషంగా.

"మరేమనుకున్నారు? లక్ష్మీపూజ చేశానివాళ. బ్రాహ్మలను పిలిచి భోజనాలు కూడా పెట్టాను".

"ఔనా! అమ్మ కూడా అలాగే చేస్తుండేది అపర్ణా!"

ఆ రాత్రి ఉన్నట్టుండి ఓ విషయం చెప్పింది అపర్ణ." అమ్మ ఉత్తరం రాసింది. నన్ను పండక్కి తీసుకెళ్ళేందుకు మా చిన్నాన్నగారి అబ్బాయిని పంపుతోందట. మీరు వస్తారా?"

అపూ మనసు చిన్నబోయింది. పండగ సెలవులను భార్యతో హాయిగా గడపాలని వచ్చాడు తను. ఆమెకు మాత్రం తనంటే లెక్కేలేదు. తననొక్కణ్ణీ వదిలేసి పుట్టింటికి పోతుందట...పోతే పోనీ!

"నీ ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళు నాకు సెలవులేదు" అన్నాడు నిర్లిప్తంగా. ఆ మాట చెప్పేసి పక్కకు తిరిగి పడుకున్నాడు. అతనికి నిద్రొస్తోందేమోననుకుని మాటలు పొడిగించ లేదు అపర్ణ.

మర్నాడు అపర్ణావాళ్ళ అన్నయ్య మురారి వచ్చాడు. అపూని కూడా వెంటబెట్టుకు రమ్మని అపర్ణ తల్లి చెప్పిందట. వచ్చితీరాల్సిందేనంటూ పట్టుబట్టాడు మురారి.

"నీకేమయినా పిచ్చా?" అని విసుక్కున్నాడు అపూ. "నాకు ఆఫీసులో బోలెడంత పనుంది, ఆఫీసు ఎగ్గొడితే నా ఉద్యోగం ఊడిపోతుంది. నేను మీలాగా జమీందారును కాదు మురారీ" అన్నారు కఠినంగా.

భర్తకు కోపం వచ్చిందని అపర్ణ ఆగ్రహించింది. కానీ, ఇప్పుడు తను వెళ్ళకపోయినా బావుండదు. అందుకే రాత్రికి వంటచేసిపెట్టి బయల్దేరింది. "కాళీపూజకయినా తప్పకుండా రండి" అని చెప్పింది అపూతో.

అపర్ణ వెళ్ళటంతో ఇల్లంతా శూన్యమయినట్టుగా తోచింది అపూకి. చెప్పరాని దిగులు కమ్ముకుంది. ఆకాశంలో చంద్రుడు ఉజ్జ్వలంగా వెలుగుతున్నాడు. వాకిట్లో చెట్టు మీది నుండి ఏదో పక్షి కూస్తోంది. అతని కళ్ళు నీళ్ళతో నిండాయి. "ఈ శూన్య గృహంలో నన్ను ఒంటరిని చేసి ఎలా వెళ్ళగలిగింది అపర్ణ?" అనుకున్నాడు. తన రాకకోసం ఎదురు చూస్తూ నెలల తరబడి ఇదే ఇంట్లో అపర్ణ కూడా ఒంటరి జీవితమే గడుపుతోందన్న విషయం అతనికి ఆ క్షణంలో జ్ఞాపకమే రాలేదు.

అపర్ణ పుట్టింటికి వెళ్ళి నెలరోజులయింది. ఆమెకు అపూ ఒక్క ఉత్తరమయినా రాయలేదు. ఆమె లేఖలకు జవాబివ్వనూ లేదు. "నేనేం తప్పు చేశాను? మిమ్మల్ని వదిలి వెళ్ళటం నాకూ ఇష్టంలేదన్న సంగతి మీకు మాత్రం తెలీదూ? ఎందుకిలా శిక్షిస్తున్నారు? దయచేసి, ఒక్క ఉత్తరం రాయండి" అని ప్రాధేయపడుతూ రాసింది అపర్ణ.

ఆమె లేఖలోని దైన్యం అతడి హృదయాన్ని కరిగించలేకపోయింది. ఆమెకు పుట్టింటి వాళ్ళే ముఖ్యమయినప్పుడు తనతో పనేమిటి? అనుకున్నాడు కఠినంగా. అంతలోనే అతడి మనసులో ఒక ఆలోచన మెదిలింది : అంత అందమైన యువతి హృదయంలో నిజంగా తనకంత ముఖ్యమైన స్థానం ఉందా? ట్రాములో వెళ్తున్నా, ఆఫీసులో పనిచేస్తున్నా ఇదే ఆలోచన అతన్ని తొలుస్తోంది. తను ఉత్తరం రాయకపోతే ఆమె తల్లడిల్లిపోతోందన్న వాస్తవం అతనిలో ఏదో సంతోషాన్ని రేపుతోంది. ఔను...ఆమెను మరింతగా హింసించాలి... తనను లెక్కచెయ్యకుండా వెళ్ళినందుకు తగిన శిక్ష విధించాల్సిందే.

❖ ❖ ❖ ❖

అపూ పనిచేస్తున్న పత్రిక నష్టాలతో మూతపడే స్థితికి చేరింది. ఈ ఉద్యోగంపోతే తన భవిష్యత్తేమిటో అతడికి అర్థంకావటంలేదు. ఈ బెంగ రాత్రింబవళ్ళూ అతడిని కుంగదీస్తోంది. ఈ స్థితిలోనే ఓరోజు లీలావాళ్ళింటికి వెళ్ళాడు. ఆమెను చూసి అప్పటికి రెండేళ్ళయింది.

అపూని చూడగానే ఆనందంతో స్వాగతం పలికింది లీల. "ఏం అపూ! మా ఇల్లొకటుందని మరిచిపోయినట్టున్నావే? దారితప్పి వచ్చావా, ఏం?" అంది నవ్వుతూ.

ఇంతకాలంపాటు ఆమెను కలవనందుకు సిగ్గుపడ్డాడు అపూ. "ఐనా, నువ్విప్పుడు ఫైనలియర్ కదా! చదువులోపడి మమ్మల్ని మర్చిపోయుంటావ్, అవునా?" అంది లీల మళ్ళీ తనే.

"ఫైనలియరా? లేదు లీలా, నేను కాలేజి మానేసి రెండేళ్ళయింది. ఉద్యోగం చేస్తున్నా" అన్నారు అపూ.

అతని మాటల్ని మొదట నమ్మలేనట్టుగా చూసింది లీల. "అదేమిటి అపూ? చదువెందుకు మానేశావ్?" బాధపడుతూ అడిగింది.

ఆమె కళ్ళలో దిగులు చూసిన అపూకి, తనపై ఆమెకెంతటి అభిమానం ఉందో అర్థమయింది. "కారణమేమీ లేదు లీలా! ఊరికే, చదవాలన్పించకమానేశా" అన్నాడు అదంత ముఖ్యమైన విషయం కాదన్నట్టుగా.

లీలకు ఆశ్చర్యంగా ఉంది. ఇతడు తానెరిగిన అపూ కాదన్పిస్తోంది.

"నువ్వేం చదువుతున్నావ్, లీలా?"

"ఐ.ఎ. పూర్తయింది. ఇప్పుడు థర్డ్ ఇయర్" జవాబిచ్చిందామె.

లీలావాళ్ళమ్మ అపూని చూసి సంతోషించింది. లీల, తను ఇటీవల వేసిన కొన్ని చిత్రాలను చూపించింది. కొంతసేపయ్యాక ఇక వెళ్తానని లేచాడు అపూ. అతణ్ణి సాగనంపటానికి గుమ్మందాకా వచ్చింది లీల.

గుమ్మం దాటబోతున్న అపూ, హటాత్తుగా ఆగిపోయి లీలకేసి చూస్తూ, "మన చిన్నతనంలో, బర్ద్వాన్‌లో ఉన్నప్పుడు ఓ పెళ్ళిలో నువ్వో పద్యం చదివావు గుర్తుందా?" అడిగాడు.

"అయ్యో! ఎప్పటి సంగతి! నేనెప్పుడో మరిచేపోయాను దాన్ని" నవ్వింది లీల. "ఇంకోసారి...నువ్వు పాలు తాగుతూ, ఆ గ్లాసులో సగం పాలు నాచేత తాగించావ్, వద్దని నేనంత చెప్పినా విన్పించుకోలేరు...నీకాసంగతి గుర్తుందా లీలా!"

ఈ ప్రశ్న అడుగుతూ చిరునవ్వుతో లీల కళ్ళలోకి చూశాడు అపూ. ఆమె జవాబివ్వలేదు.

గుమ్మందాటి ముందుకు నడిచాడతడు. కొద్ది అడుగులు నడిచి, వెనక్కి తిరిగి చూసేసరికి, లీల ముఖం పక్కకు తిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది.

లీలనూ, అపర్ణనూ పోల్చి చూసుకుంది అతని హృదయం. అపర్ణది అద్భుత సౌందర్యమనటంలో సందేహమేమీ లేదు; కానీ, లీల సౌందర్యంలోని సౌజన్యాన్ని మరే స్త్రీలోనూ చూడలేం. ఆమె దృక్కుల్లో, పలుకుల్లో, కదలికల్లో అలౌకికమైన సౌందర్యమేదో తొణికిసలాడుతుంది. ఆమె ఈ లోకానికి సంబంధించిన మనిషి కాదేమోనన్పిస్తుంది, అనుకున్నాడు.

తను లీలను అతి గాఢంగా ప్రేమిస్తున్నానని అతనికి అర్థమయింది. కానీ, ఆ ప్రేమ సాధారణ స్థాయికి సంబంధించినది కాదు...నిర్మలమూ, ప్రశాంతమూనైనది. అది తన హృదయానికి గొప్ప తృప్తినిస్తుందే తప్ప, ఉద్రేకంతో ఉరకలెత్తించదు. లీల తన బాల్య కాల సఖి; ఆమెతో తనకొక దృఢమైన స్నేహబంధమూ, సుకుమారమైన ఆత్మీయతా ఉన్నాయి. అది, తన తోబుట్టువుతో ఉండే అనుబంధం వంటిది.

❖ ❖ ❖ ❖

కొన్నాళ్ళ తర్వాత లీలావాళ్ళ నౌకరు, ఆమె పంపిన ఉత్తరం తీసుకుని అపూ గదికొచ్చాడు. ఇవాళో, రేపో తప్పకుండా తమ ఇంటికి రమ్మనీ, ఒక మంచి వార్త చెప్తానని రాసిందామె.

మర్నాడు ఉదయం వెళ్ళాడు అపూ. ఎప్పటివలెనే నిరాడంబరంగా, హుందాగా ఉందామె. ఆమె కళ్ళలో నిద్రమత్తు పూర్తిగా వదల్లేదు. జుట్టు కొంచెం చెదిరి, ముంగురులు ముఖంపై పడుతున్నాయి. ప్రభాత వేళలో అరవిరిసిన కమలంలా ఉంది ఆమె వదనం.

"ఇంకా తెల్లారలేదా నీకు? ఇప్పుడు ఎనిమిది గుంటటయింది తెలుసా? థర్డ్ ఇయర్ చదువుతున్నావ్... ఇప్పుడా నిద్రలేవటం?" అంటూ పరిహాసమాడాడు అపూ.

లీల హాయిగా నవ్వింది. అపూ ఇలా చనువుగా, సరదాగా మాట్లాడటం ఆమెకెంతో ఇష్టం.

"రాత్రి బాగా ఆలస్యంగా పడుకున్నా. అత్తయ్యతోబాటు సినిమాకెళ్ళి వచ్చేసరికి ఒంటిగంట దాటింది. కూర్చో, టీ తీసుకొస్తా" అంటూ లోపలికెళ్ళి ట్రేతో తిరిగొచ్చింది. అందులో టీ కప్పులతోబాటు ఉడికించిన కోడిగుడ్లూ, వేయించిన బంగాళాదుంపలూ ఇంకేవో పచ్చని అకులూ ఉన్నాయి.

"ఈ పాశ్చాత్య ఫలహారాల అభిరుచి మీ తాతగారిదేనా? ఆ ఆకులేమిటి?" నవ్వుతూ అడిగాడు అపూ.

"ఓ, అవా! లెట్యూస్ అంటార్లే" జవాబిచ్చింది లీల.

టీ తాగుతూ ఉండగా తను భవిష్యత్తులో ఏం చెయ్యాలనుకుంటోందో చెప్పటం మొదలెట్టింది లీల. ఎమ్.ఎ. చదవటంగానీ లేదంటే గ్రాడ్యుయేషన్ కాగానే యూరప్‌కు వెళ్ళటమో చెయ్యాలని ఆమె లక్ష్యం. యూరప్‌లోని ఆర్ట్ గ్యాలరీలన్నీ చూడాలని, అజంతా

గుహల చిత్రకళను కూడా అధ్యయనం చెయ్యాలనీ ఆమె ఎంతో ఆసక్తితో ఉంది. తను కొత్తగా వేసిన చిత్రాలను తెచ్చి చూపింది.

"నీకో ఉద్యోగం చూస్తాను, చేస్తావా అపూర్వా!" హటాత్తుగా అడిగింది లీల.

"ఎందుకు చెయ్యను? ఏమిటది?"

"పెద్ద కష్టమైన పనేమీ కాదులే. మా తాతగారు ఓ పెద్ద ఎస్టేట్‌కు అటార్నీగా ఉన్నారు. వాళ్ళకో సెక్రటరీ కావాలి. నూటయాభై రూపాయలు ఇస్తారట. తాతయ్యతో ఒక్కమాట చెప్పిస్తే, ఆ ఉద్యోగం తప్పకుండా వస్తుంది."

ఉన్న ఉద్యోగం పోతుందని తానెంతగా ఆందోళన పడుతున్నాడో లీల గ్రహించిందన్న సంగతి అర్థమై, ఆమెమీద కృతజ్ఞత పొందింది. ఆపూట వాళ్ళింట్లోనే భోజనం చేసి వెళ్ళాడు అపూ.

లీల ప్రయత్నం ఫలించలేదు. తాతగారితో అపూ గురించి చెప్పేనాటికే ఆ ఉద్యోగంలో ఇంకెవరో చేరిపోయారని తెలిసింది. అపూకి ఈ విషయం చెప్పటానికి ఎంతో బాధపడింది లీల. ఆమె బెంగను చూసి అపూకి కూడా బాధకలిగింది.

ప్రైవేటుగా బి.ఎ. చదవమని లీల చెప్పిన సలహాను అంగీకరించాడు అపూ. అమె ముఖం ఆనందంతో వెలిగిపోయింది. లీల తనపై చూపుతున్న శ్రద్ధకూ, ఆదరానికి అతని కళ్ళు చెమర్చాయి.

లీలావాళ్ళ ఇంటి నుండి బయటికొచ్చి కొంతదూరం నడిచాక, అపూకి హటాత్తుగా ఓ విషయం గుర్తొచ్చింది. తనకు వివాహమయిందన్న సంగతి లీలకు చెప్పనేలేదు. ఆమె దగ్గర ఈ విషయం దాచాలని ప్రత్యేకంగా తానేమీ అనుకోలేదు...కానీ, ఎందుకో చెప్పలేకపోయాడు. ఎందుకన్నది అతనికే స్పష్టంగా తెలియలేదు. తనకు తోచిన జవాబులు తనకే నచ్చటం లేదు.

## 15

ఏడాది గడిచింది. మళ్ళీ దుర్గాపూజ పండగ రోజులు. పత్రికాఫీసు మూతపడ్డాక, మరో పెద్ద కంపెనీలో చిన్న ఉద్యోగం సంపాదించాడు అపూ. అపర్ణను కూడా కలకత్తాకు తీసుకొచ్చి, ఓ చిన్న ఇంట్లో కాపురం పెట్టాడు. చాలీచాలని జీతంతో దాదాపు ఏడాదిగా సంసార రథాన్ని లాగుతున్నారు వాళ్ళిద్దరూ.

ఆ సాయంత్రం అపూ ఇంటికొచ్చేసరికి అపర్ణ కూరగాయలు తరుగుతోంది. అతన్ని చూడగానే వాటిని పక్కకు జరిపి, "ఇవాళ త్వరగా వచ్చేశారే" అంటూ చిరునవ్వుతో ఎదురొచ్చింది.

"త్వరగా ఏముంది...ఏడు కావొస్తోందిగా! ఐనా, రోజూ కంటే కాస్త ముందుగానే వచ్చినట్లున్నాన్లే" అంటూ వరండా మూలకు వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కున్నాడు. ఆ

ఇంటికి బాత్‌రూమ్ విడిగా లేదు. మరికొన్ని కుటుంబాలతో ఒకే బాత్‌రూమ్‌ను వాడుకోవాలి. ఈ సమయంలో అది రద్దీగా ఉంటుందని వరండాలో బకెట్‌తో నీళ్లు పెడుతుంది అపర్ణ.

అపూ టీ తాగుతూ ఉండగా బాత్‌రూమ్ దగ్గర పెద్ద కొట్లాట ప్రారంభమైంది. '...అంత కష్టంగా ఉండే ఈ కొంపలో ఉండడమెందుకమ్మా! వంద రూపాయలు పడేసి ఓ బంగళాకు పోరాదూ?" అంటూ అరుస్తోంది ఒకావిడ.

"గంగూలీ గారి భార్యతో మళ్ళీ ఎవరో గొడవ పడుతున్నట్టున్నారే?" అడిగాడు అపూ.

"ఆవిడ నోటికి అడ్డూ, అదుపూ ఉంటేగా! పాపం హల్దార్‌గారి భార్య పచ్చి బాలింత. సాయం చేసేందుకు ఎవరూ లేక ఇబ్బందులుపడుతోంటే ఆమెను అస్తమానూ ఆడిపోసు కుంటుంది" అంది అపర్ణ సానుభూతిగా.

ఈ ఇంట్లోకి వచ్చినప్పటి నుండీ ఇరుగు పొరుగుల తగాదాలు చూస్తూనే ఉన్నాడు అపూ. మేడమెట్లనూ, వరండానూ కడగాల్సిన వంతు ఎవరిదనే విషయంలో ఎప్పుడూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. అంత చిన్న విషయాల్లో ఎంతెంత పరుషమైన మాటలు విసురుకుంటారోనని అతడి మనసుకు బాధగా ఉంటుంది.

అపూ వాళ్ళుండే పోర్షన్‌లోకి గాలీ, వెలుతురూ బొత్తిగా రావు. కాసేపు వరండాలో కూర్చుందామంటే, ఆ పక్కనే ఉన్న చెత్తకుప్పలోంచి విపరీతమైన దుర్గంధం నిలవనివ్వదు. కూరగాయల తొక్కలూ, చేప పొలుసులూ, పాచిపోయిన అన్నం...అన్నీ అందులోనే పడేస్తారు. ఇక వర్షాకాలంలోనైతే వరండా నిండా ఆరేసిన తడిబట్టలు వేలాడుతూనే ఉంటాయి. అంత చీదరగా ఉండే వాతావరణంలో కూడా కుండీలలో పూలమొక్కలు పెంచాలని అపూ తాపత్రయం. కానీ ఆ పరిసరాల్లోకి కాస్త సౌందర్యాన్నీ, మృదుత్వాన్నీ తీసుకురావటం శక్తికి మించిన పనిగానే మారుతోంది.

ఎంత అయిష్టంగా ఉన్నా ఈ వాతారణాన్ని తప్పించుకునేందుకు మార్గం కనబడటం లేదు. మన్సాపోతాలో అపర్ణను ఉంచి సంసారం సాగించాలంటే అతని సంపాదన చాలటం లేదు. ఈ నగరంలో పదమూడు రూపాయల అద్దెకు ఇంతకన్నా మంచి ఇల్లు దొరకదు. అప్పటికీ ఈ ఇరుకు కొంపను కాస్త శుభ్రంగా తీర్చిదిద్దటానికి అపర్ణ వీలయిన ప్రయత్నాలన్నీ చేస్తూనే ఉంది. ట్రంకు పెట్టెలూ, సూట్‌కేసులూ బయటికి కనబడకుండా లేసులతో ఆమె వాటికి కవర్లు కుట్టింది. చక్కటి డిజైనున్న బట్టను కిటికీకి కర్టెన్‌గా కట్టింది. దుప్పట్లూ, తలగడ కవర్లూ, దోమతెరా...అన్నీ శుభ్రంగా ఉండేలా చూస్తుంది. వారానికి రెండు మూడుసార్లు నేలంతా శుభ్రంగా కడుతుతుంది. అపర్ణ అన్ని విధాలా సమర్థురాలయిన గృహిణే. కానీ, భర్తకొచ్చే చాలీచాలని జీతపురాళ్ళతో అంతకన్నా సుఖంగా కాపురాన్ని నడపటం ఆమెకు సాధ్యమవటం లేదు.

వీటన్నిటికీ తోడు ఆఫీసులోని బండచాకిరి కూడా అపూ జీవితాన్ని దుర్భరం చేస్తోంది. పొద్దున పదకొండు గంటల నుంచి, సాయంత్రం ఏడువరకూ ఊపిరి సలపని పని. ఒకసారి ఏదో పనిమీద ఆఫీసు యజమాని స్వగ్రామంలో ఉండే ఇంటికి అపూ వెళ్ళాల్సొచ్చింది. ఆ చక్కటి భవనాన్నీ, అందమైన తోటనూ చూసి అతడికి ముచ్చటేసింది. ఎప్పటికయినా అలాంటి ఇల్లు కట్టుకోవాలన్న కోరిక అతనిలో స్థిరపడిపోయింది. నిజానికి అతడంతగా ముగ్ధుడయింది ఆ భవనాన్ని చూసి కాదు – దాని ఆవరణలోని రకరకాల చెట్లను చూసి, తను కట్టుకోబోయే ఇంటి వాకిట్లో చైనీస్ వెదురు పొదలనూ, బాట పొడవునా ఎర్రని పూలుపూసే మొక్కలనూ, లావెండర్ పూల చెట్లనూ నాటాలని నిశ్చయించు కున్నాడు. ఇవన్నీకాక, చల్లని నీడనిచ్చే అందమైన తురాయి పూల చెట్టు కూడా ఉండి తీరాలి.

ఒక్కోసారి తీరిగ్గా టీ తాగుతూ తన ఆలోచనల్ని గురించి భార్యతో చర్చిస్తాడు అపూ. "సంపెంగ మొక్క తప్పకుండా నాటాల్సిందే, ఏమంటావ్?" అని అడుగుతాడు.

ఒకటిన్నరేళ్ళ దాంపత్య జీవితంలో భర్త స్వభావాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకుంది అపర్ణ. అతడి స్వప్నాలనూ, ఆశలనూ పంచుకుంటూ అపూను ఉత్సాహపరుస్తుందామె. "ఉత్తి సంపెంగ మొక్కేనా? కిటికీ మీదుగా పూల తీగను పాకిస్తే ఎంతో బావుంటుంది" అంటూ అతని ఊహాచిత్రానికి మరిన్ని వన్నెలద్దుతుంది.

కానీ, పొద్దున లేచి, వాకిట్లో పేరుకున్న మురికి కుప్పల మధ్యనుండి ఆఫీసుకు బయల్దేరేటప్పుడు అపూ స్వప్నలోకం ఛిన్నాభిన్నమైపోతుంది. అసలీ లోకంలో ఇంత దౌర్భాగ్యమైన చోటు మరొకటి ఉంటుందా? అని తరగని ఆశ్చర్యం అతడికి.

సాయంత్రాల్లో ఎప్పుడయినా సమయం దొరికినప్పుడు గది కిటికీలోంచి ఆత్రంగా ఆకాశాన్ని వెదుక్కుంటూ, తన బాల్యాన్ని గుర్తుతెచ్చుకుంటాడు అపూ. ఆ నీలాకాశం, విశాల మైనాదాలు, మామిడి పూల పరిమళంతో మత్తెక్కిపోయే వెన్నెల రాత్రులూ, ఏమై పోయాయి? ఈ బతుకు పోరాటంలో తలమునకలైపోతూ జీవితంలో సౌందర్యాన్నే కోల్పోయాడా తను?

దుర్భరమైన ఈ ఇరుకు బతుకులో అతనికి దక్కిన ఒకే ఒక ఆనందం, అపర్ణ. అలిసిపోయి ఇంటికి రాగానే ఆమె చిరునవ్వుతో ఎదురొచ్చినప్పుడల్లా, ఈమె లభించక పోయుంటే తన జీవితం ఏమైపోయేదా, అని ఆలోచనలో పడతాడు అపూ. ఆమె ప్రేమా, ఆప్యాయతా, చిరునవ్వూ...ఇవే ఈ మురికి కలుగులాంటి కొంపను ఓ ఇల్లుగా మార్చే మాయాజాలాలు!

వీలుదొరికినప్పుడల్లా యాత్రా సాహిత్యాన్ని చదవటం అపూకి ఇష్టమైన పని. రైళ్ళూ, స్టీమర్లూ నడిపే కంపెనీలు ప్రచురించిన కరపత్రాలను కూడా అతడు భద్రంగా

దాచుకున్నాడు. వాటిలో ఎన్నో అపురూపమైన యాత్రాస్థలాలను గురించిన వివరాలుంటాయి. అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని దాచుకున్న ఆ ప్రాంతాలకు రమ్మని ఆ కరపత్రాలు ఆహ్వానిస్తాయి. ఆఫీసులో తన డెస్కుముందు కూర్చునే కలల్లో మునిగిపోతుంటాడు అపూ. దట్టమైన హరితారణ్యాలలో, ఆహ్లాదరకమైన సాగర తీరాలలో, మార్మిక సౌందర్యంతో వెలిగిపోయే వెన్నెల మైదానాల్లో – తనూ, అపర్ణా విహరిస్తున్నట్టుగా స్వప్నాల్లో తేలిపోతాడు.

కానీ డబ్బు లేనిదే అవన్నీ ఎలా సాధ్యం? అతడెందరో ధనవంతుల జీవితాలను పరిశీలించాడు. భవనాల నిండా రకరకాల వస్తు సామాగ్రిని పేర్చుకుని, తలుపులు మూసుకుని తమకు తామే బందీలుగా ఉండిపోతారే తప్ప, ప్రపంచాన్ని చూడాలన్న ఆకాంక్ష వాళ్ళలో ఏ కొద్దిమందికోతప్ప లేకపోవటం అతనికి ఆశ్చర్యంగా ఉంటుంది. అంత డబ్బు తనకే గనుక ఉంటేనా! జీవితపు ప్రతి గవాక్షాన్నీ తెరిచి విశ్వసౌందర్యాన్ని అవలోకించేవాడు.

దుర్గాపూజ సందర్భంగా ఆఫీసుకు సెలవులు ప్రకటించారు. సాయంత్రం ఐదు గంటలకు ఆ వార్త తెలియగానే అపూకి ప్రాణం లేచొచ్చింది. ఎప్పుడెప్పుడు అపర్ణ సన్నిధిలో వాలుదామా అని వేగిరపడుతోంది అతడి హృదయం. ఆరుగంటలయితే తప్ప ఆఫీసులోంచి బయటపడటానికి వీలవదు. అనంత సాగరాన్ని ఈదుతూ ఒడ్డును చేరటానికి ప్రయాస పడుతున్న చేపలా ఆ గంట సమయాన్ని గడపటానికి అంతులేని వేదనను అనుభవించాడు అపూ. తన ఇల్లు ఓ మురికి కూపమే కావొచ్చు, కానీ అపర్ణ దానిని స్వర్గంలా మార్చగలదు.

అతను ఇంటికి వెళ్ళగానే, రోజూలాగానే టీ ఇచ్చి పక్కన కూర్చుంది అపర్ణ. ఆఫీసు నుండి వచ్చిన కొద్దిసేపటికి మళ్ళీ ట్యూషన్ చెప్పేందుకు వెళ్తాడు అపూ. అందుకే అతడు ఇంట్లో ఉన్నంతసేపూ అపర్ణ అతనితోనే గడుపుతుంది. ఆ క్షణాలు వాళ్ళకు అపురూపమైనవి. శుభ్రమైన దుస్తులతో, చెరగని జట్టుతో, నుదుట సిందూరంతో అచ్చమైన గృహలక్ష్మిలా తలుపు తెరిచే అపర్ణను చూడగానే అతని అలసట మాయమైపోతుంది. ఆ కాస్సేపటిలోనూ అతని ఆఫీసు విషయాలు అడుగుతుంది. పొద్దుటి నుండి తను ఏమేం చేసిందో చెప్తుంది, ఇద్దరూ కలిసి చదివిన నవలలను గురించి చర్చిస్తుంది.

కలకత్తాకు వచ్చాక ఆమెను రెండుసార్లు సినిమాకు తీసుకువెళ్లాడు అపూ. తెరమీద బొమ్మలు ఎలా కదులుతున్నాయో, జరుగుతున్న కథేమిటో ఆమెకు అర్థంకాలేదు. కానీ ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూసింది. ఇంటికి వెళ్ళే దారిలో ఆ సినిమాల గురించి వివరించి చెప్పేవాడు అపూ.

"నిన్ను తీసుకుని రమ్మని మీ నాన్నగారు ఉత్తరం రాశారు" అన్నాడు అపూ ఆ సాయంత్రం టీ తాగుతూ. "నాకేమో ఆఫీసులో సెలవు దొరికేట్టులేదు. పోనీ...రామ్ వస్తే, అతనితోబాటు వెళ్తావా? వచ్చేనెలలో ఏదో విధంగా సెలవు దొరికితే, నేనూ వచ్చేస్తా.

ఐనా...ఇలాంటి సమయంలో ఏ ఆడపిల్లకయినా తల్లిదండ్రుల దగ్గర ఉండాలన్పిస్తుంది కదూ!"

అపర్ణ బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కాయి. "వద్దు, రామ్ మరీ చిన్న పిల్లాడు. వాడేం తీసుకెళ్తాడు నన్ను? అమ్మక్కూడా మిమ్మల్ని చూడలనుందట...రాకూడదూ?"

"సరే అలాగే, రేపు వెళ్దాం. ఇంకొక్క సిగరెట్ ఇవ్వు అపర్ణా!" అంటూ ప్రాధేయ పడ్డాడు.

"ఇంకొకటా? ఇప్పటికే ఎనిమిది కాల్చారివాళ"

"ఒక్కటంటే ఒక్కటి... ఇవాల్టికిక అడగను" మళ్ళీ బతిమలాడు అపూ.

"అన్నీ అబద్ధాలు" నవ్వింది అపర్ణ.

బాగా సిగరెట్లు కాల్చడం అలవాటయింది అతనికి. ఎంత ప్రయత్నించినా మానలేక, ఒక నిర్ణయం తీసుకున్నాడు. సిగరెట్ డబ్బా అపర్ణకు అప్పగించేస్తే, తనను నియంత్రించే పని ఆమె చేతిలో ఉంటుందని అతని నమ్మకం. ఆమె ఎంత కచ్చితంగా ఉన్నా, ఒక్కోసారి అదనపు సిగరెట్లు ఇవ్వక తప్పటంలేదు.

❖ ❖ ❖ ❖

చాలా రోజుల తర్వాత అపర్ణతోకలిసి రైలులోనూ స్టీమర్‌లోనూ ప్రయాణం చెయ్యటం అపూ మనసుకు ఉల్లాసాన్నిచ్చింది. అపర్ణక్కూడా తన స్వగ్రామానికొస్తే ప్రాణం లేచొచ్చినట్టుగా ఉంది. ఏటి గట్టునున్న విశాలమైన భవనంలో పుట్టి పెరిగిన ఆమెకు, నగర కాలుష్యంలో ఇరుకు గదిలో నివసించాల్సి రావటం విసుగ్గానే ఉంటోంది. ఐనా భర్తమీద ఆమెలో నానాటికీ పెరుగుతున్న అనురాగం, ఆ అసౌకర్యాలనన్నిటినీ భరించే శక్తినిచ్చింది. అపూ మీద ఆమెకున్న ప్రేమ ప్రత్యేకమైనది...తల్లికి తన బిడ్డమీదుండే ప్రేమతో దానిని పోల్చవచ్చునేమో! అపూలోని ఉత్సాహం, అల్లరి, జీవన సంక్లిష్టతను గ్రహించలేని పసితనం...ఈ లక్షణాలన్నీ ఆమెలోని మాతృహృదయాన్ని మేల్కొలిపాయి. అపూ అనుభవించిన పేదరికాన్నీ, అతని జీవితంలోని విషాదాన్నీ గురించి ప్రణవ్ ఆమెకు ముందుగానే చెప్పాడు.

చిత్రమేమిటంటే, అపూ ఏనాడూ ఆమెకీవిషయాలను చెప్పలేదు. పైగా నిశ్చింది పురంలో తమకు రెండంతస్తుల భవనం ఉండేదనీ, కాలేజీలో చదువుకునే రోజుల్లో తాను హాస్టల్‌లో ఉండేవాడిననీ కూడా చెప్పాడు. ఇవన్నీ ఉత్తి అతిశయోక్తులేనని గ్రహించటం అపర్ణ వంటి తెలివైన యువతికి కష్టమేమీ కాదు. కానీ, అతని రహస్యాన్ని తాను గ్రహించినట్లుగా ఆమె ఏనాడూ బయటపడదు. వాటిని నమ్ముతున్నట్టుగా నటిస్తూ అతన్ని మరింత ఉత్సాహపరిచేది. "ఔనట, పూలూ దాదా కూడా నాకివన్నీ చెప్పాడు. ఓసారి మీ ఊరెళ్ళి మీ ఇల్లు చూసొస్తే బావుంటుంది కదూ!" అనేది.

"ఔనౌను... కానీ, ఆ ప్రాంతంలో మలేరియా విపరీతం తెలుసా? అక్కడికెందుకులే..." అనేవాడు అపూ తడబడుతూ.

ఒక్కోసారి పరధ్యానంగా ఉన్నప్పుడు అపూ తను చెప్పిన ప్రగల్భాలన్నిటినీ మరిచిపోయి, వాస్తవాలు చెప్పేస్తుంటాడు. అపర్ణ వాటిని విననట్టే ప్రవర్తిస్తుంది. పేదరికం, ఆకలి అనేవి ఆమెకు బొత్తిగా పరిచయంలేని విషయాలు. కానీ, అపూ అనుభవించిన దారిద్ర్యం ఆమె హృదయానికి బాగా అర్థమవుతుంది. అతని జీవితాన్ని సుందరంగా, సుఖంగా తీర్చిదిద్దాలని నిరంతరం తపన పడుతుందామె. భర్తను సుఖపెట్టాలనే కోరికతో ఇష్టమైన తినుబండారాలను నేర్చుకుని వండిపెట్టాలని ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది.

ఒక్కోసారి అపూ ఆఫీసునుండి వచ్చేసరికి అపర్ణ వంటింట్లో హడావిడి పడుతూ ఉంటుంది. "ఇదుగో, మీకిష్టమైన మిఠాయి చేస్తున్నాను. ఇలా వంటింట్లోకి వచ్చి కూర్చోండి, వేడివేడిగా తిందురు గాని" అంటూ ఆహ్వానిస్తుంది. ఆ మాటలు వినగానే అపూ గుండె లయ తప్పినట్టవుతుంది. అమ్మ కూడా అచ్చంగా అలాగే పిలిచేది. తను నోరు విడిచి చెప్పకుండానే తన అవసరాలనూ, ఇష్టాలనూ గ్రహించే అపర్ణలో అమ్మే కనబడు తుందతనికి. అమ్మ స్వయంగా ఆమె బాధ్యతలన్నిటినీ అపర్ణ చేతులకు అప్పగించిందేమో నన్పిస్తుంది. స్త్రీని అర్థం చేసుకునేందుకు అతనికొక కొత్త చూపును ప్రసాదించింది అపర్ణ. అమ్మ, అక్క, భార్య అనే మూడు రూపాలలో స్త్రీ అందించగల అపురూపమైన ఆత్మీయతను తన ఇరవయ్యారేళ్ళ జీవితంలో సంపూర్ణంగా అనుభవించగలిగిన అదృష్టం అతనిది.

అపూ, అపర్ణా స్టీమర్ దిగి గ్రామానికి వెళ్ళే పడవెక్కారు. అపర్ణ చీర కొంగును తలమీదుగా కప్పుకుని కూర్చుంది. మధ్యాహ్నపుటెండ తన పొడవాటి నీడలతో నదీ జలాలపై నాట్యమాడుతోంది. తీరం పొడవునా చిన్న చిన్న గ్రామాలు కదిలిపోతున్నాయి.

ఆఫీసనే చెరసాలలోంచి విముక్తి పొందిన ఉల్లాసంతో అపూ హృదయం గంతులేస్తోంది. ఈ పచ్చని పల్లెలతో, నదుల ప్రాకృతిక పరిమళాలతో తనకు రక్తసంబంధం ఉన్నదన్పించింది.

"ఇదుగో, అమ్మాయ్! ఆ ముసుగు కాస్త తొలగించి, ఇవన్నీ చూడు! మీ పుట్టిల్లేగా, అంత సిగ్గెందుకు?" అన్నాడు అపర్ణతో చిలిపిగా.

అపర్ణ సిగ్గుపడింది. "ఏమిటా మాటలు? ఎవరయినా వింటే ఏమనుకుంటారు? ఇలా అల్లరిచేస్తే మీతో కలకత్తాకు తిరిగి రానేరాను, మీరొక్కరే ఉండాలి మరి" అంది చిరుకోపంతో.

"నాకేం భయంలేదులే! నేనేమో నిన్ను రమ్మని ప్రాధేయపడతా ననుకోకు...హాయిగా నేనొక్కణ్ణే కమ్మగా వంటచేసుకుని తింటా!"

"అబ్బో! కమ్మని వంట! మీ వంట ఎంత కమ్మగా ఉంటుందో నాకు తెలీనట్టు!"

"ఏయ్, మాటలు జాగ్రత్తగా రానివ్వు! ఆ రోజు... మనం కలకత్తాకు వెళ్లేటప్పుడు స్టీమర్ ఘాట్‌లో నువ్వు చేశావుగా గొప్ప వంట! రుచీ పచీ లేని చెత్త!"

"రుచీపచీ లేదా? అయ్యో దేవుడా, ఎంత అబద్ధాలకోరమ్మా ఈ మనిషి!"

"అబ్బే, లేదండీ మహారాణిగారూ! మీ వంట అద్భుతమే".

అపర్ణ కోపంగా చూడబోయింది కానీ, వస్తున్న నవ్వును ఆపుకోవటం ఆమెవల్ల కాలేదు. "భంగో చేపలెప్పుడయినా తిన్నారా? అవి ఉప్పునీళ్ళల్లో మాత్రమే బతుకుతాయి, కానీ మహా కమ్మగా ఉంటాయ్. మీకు వండిపెట్టమని అమ్మతో చెప్తా" అంటూ మాట మార్చింది.

"ఔనా? ఏమని చెప్తావ్ మీ అమ్మగారితో? అమ్మా, అమ్మా, కాస్త మా ఆయనకు..."

"ష్" అంటూ తన చేత్తో అతని నోరు మూసింది అపర్ణ నవ్వుతూ.

చీకటి పడుతూ ఉండగా అపర్ణావాళ్ళ గ్రామంలోని రేవు దగ్గర పడవ ఆగింది. ఇద్దరి హృదయాలూ ఏదో చిత్రమైన ఉద్వేగంతో ఉప్పొంగాయి.

❖ ❖ ❖ ❖

పడక గదిలో కూర్చుని అపర్ణ రాకకోసం నిరీక్షిస్తున్నాడు అపూ. పెళ్ళయ్యాక ఆమెతో మొదటి రాత్రి గడిపిన అదే గదిని వాళ్ళకు కేటాయించారు. ఆమెతో తను గడిపే చివరి రాత్రి అది...రేపు పొద్దున్నే కలకత్తాకు బయల్దేరాలి.

కిటికీ వెలుపలున్న కొబ్బరిచెట్టుపై కొంగల దండు వాలినట్టుగా ధవళ కాంతులతో వెలుగుతోంది వెన్నెల. అటు చూస్తున్న అపూ మనసులో ఎప్పటెప్పటివో వెన్నెల రాత్రుల స్మృతులు ముసురుతున్నాయి. అరేబియన్ నైట్స్ కథల్లో వలె సాగుతోంది తన జీవితం. ఎక్కడో కుగ్రామంలో, చిన్న పూరింట్లో...ఏపూటకాపూట తిండికి వెతుక్కునే స్థితిలో పుట్టి పెరిగిన తను, ఇప్పుడొక జమీందారు గారి అల్లుడు.

ఎంతోసేపటికి గదిలో అడుగుపెట్టింది అపర్ణ. "ఏమిటింత ఆలస్యం? ఎన్ని గంటల నుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా?" అన్నాడు అపూ.

అపర్ణ నవ్వింది. "మా పెదనాన్న గారి గది మెట్లపక్కనే ఉంది. ఆయన మేలుకుని ఉండగా గదిలోకి రావాలంటే సిగ్గేస్తుంది".

ఆమె మాటలు వినగానే అపూ లేచి కిటికీ తలుపులు దడాలున శబ్దమయ్యేట్టుగా మూశాడు. "మళ్ళీ అల్లరి మొదలెట్టారా...వద్దండీ, పెదనాన్న ఇంకా నిద్రపోలేదు" ఇబ్బందిగా అందామె.

మళ్ళీ గట్టి చప్పుడుతో కిటికీ తలుపులు తెరిచాడు అపూ. "మంచినీళ్ళు పట్టుకురా అపర్ణా! అపర్ణా...ఓ అపర్ణా!" గొంతు హెచ్చిస్తూ అరుస్తున్న అతణ్ణి ఆపలేక, సిగ్గుగా తలగడలో ముఖం దాచుకుంది అపర్ణ.

రాత్రి తెల్లారుతున్నా వాళ్ళ కబుర్లు తరగటంలేదు.

"మీరొక్క క్షణమైనా నిద్రపోలేదు, కాస్సేపు పడుకోండి. నేనిక వెళ్తాను, అందరూ లేస్తే బావుండదు. అన్నట్టు...కిటికీ కర్టెన్లు ధోబీకి వెయ్యటం మర్చిపోకండి. నేనొచ్చేదాకా

వాటినెవరు ఉతుకుతారు? వెళ్ళగానే ఉత్తరం రాయండి" అంటూ వెళ్ళటానికి లేచిన అపర్ణ, మళ్ళీ అతని పక్కనే కూర్చుని ప్రేమగా అతని చెయ్యి నిమురుతూ "ఎంత చిక్కిపోయారో చూడండి. కొన్నాళ్ళు మీరు కూడా ఇక్కడే ఉంటే మీ ఆరోగ్యం బాగుపడుతుంది. ఎంత దరిద్రపు ఊరండీ ఆ కలకత్తా, కనీసం చిక్కటి పాలయినా దొరకవు. రోజూ మీక్కాస్త మోహన్‌భోగ్ చేసి పెడుతుండమని పింటూ వాళ్ళమ్మతో చెప్పాను. కొన్నాళ్ళు నేనిక్కడే ఉంటాను కాబట్టి, మనకొచ్చే జీతం సరిపోతుంది. ఆ ట్యూషన్లు మానేసి విశ్రాంతి తీసుకోండి...నేనిక వెళ్ళనా?" భర్తను వదల్లేక, వదల్లేక లేచింది అపర్ణ.

"ఇంకో విషయం మర్చిపోయా... మన్సాపోతాలో మన ఇంటికప్పు పూర్తిగా పాడయి పోయింది, కప్పించండి. వర్షాకాలం వచ్చేదాకా ఊరుకుంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. కొన్నాళ్ళయ్యాక మనం మళ్ళీ అక్కడికే వెళ్ళిపోదాం... ఎంతయినా మన సొంతిల్లంటే అదే కదా! ఇక వెళ్ళనివ్వండి" అపర్ణ మెట్లుదిగి వెళ్ళిపోయింది.

ఆమెను ఇంకాసేపు వెళ్ళనివ్వకుండా ఆపేస్తే బావుండేదన్పించింది అతనికి.

గంట తర్వాత అపర్ణ మళ్ళీ గదిలోకొచ్చింది. అతడికి ఇంకో కప్పు టీ కావాలేమో అడుగుదామనుకుంది. కానీ, అపూ గాఢంగా నిద్రపోతున్నాడు. నిద్రలో ఉన్న భర్త ముఖంలోకి చూస్తుంటే ఆమె హృదయంలో ఆప్యాయత వెల్లువెత్తింది. "అమ్మ చెప్పింది నిజమే, నిజంగా ఓ దేవుడిలా ఉన్నాడితడు...మనం పూజించే దైవప్రతిమల్లో ఉండేంత అందం..." అనుకుంది మెట్లు దిగి వెళ్తూ.

అపూ బయల్దేరేలోగా మళ్ళీ ఆమెను కలవటం కుదరనే లేదు. అపర్ణను ఒక్కసారి చూసివెళ్ళాలని అతనికెంతగానో అన్పించింది. కానీ ఆమె పెదనాన్నలూ, చిన్నాన్నల కుటుంబాలతో ఇల్లంతా హడావిడిగా తయారయింది. వాళ్ళందరి ఎదుట వెళ్ళి భార్యను కలుసుకోవటానికి సిగ్గుపడ్డాడు అపూ. అతడు పడవలో ఎక్కుతుండగా, వెంటవచ్చిన అపర్ణ చిన్నాన్న కొడుకు విషూ, "దీదీకి చెప్పకుండానే వచ్చేశారేమిటి జమాయ్ బాబూ! మీరు వెళ్తున్నప్పుడు తను గదిలో ఏడుస్తూ కూర్చుంది" అన్నాడు.

అప్పటికే పడవ బయల్దేరింది.

❖ ❖ ❖ ❖

అపూ కలకత్తాకు వెళ్ళాక ఒకరోజు అతడి చిన్ననాటి మిత్రుడు దేవూ కలిశాడు. అతడిప్పుడు బి.ఎస్.సి. పూర్తిచేసి పై చదువుకు ఆమెరికాకు వెళ్తున్నాడట. పెద్ద చదువులు చదవబోతున్న స్నేహితుణ్ణి చూసి అపూ సంతోషించాడు. దాంతోబాటుగా అతని మనసులో ఏమూలనో కొద్దిపాటి అసూయ కూడా తలెత్తకపోలేదు. దేవూలాగా దూరదేశాలు చూసే అవకాశం తనకెప్పటికి దొరుకుతుందో!

మూడు నెలలపాటు కాలం అతి భారంగా గడిచింది. అపర్ణతో కాపురం పెట్టిన ఏడాది నుండీ, సాయంత్రం ఇంటికి రాగానే ఆమె చిరునవ్వు మోమును చూసి సేదదీరటం అలవాటయింది. ఇప్పుడు ఆమెలేని శూన్య గృహానికి రావటానికి మనస్కరించటం లేదు.

ఒక ఆదివారం రోజున బేలూరు మఠం చూసొచ్చాడు అపూ. అక్కడి విశేషాలన్నీ వర్ణిస్తూ అపర్ణకు పెద్ద ఉత్తరం రాశాడు. సాధారణంగా అపర్ణ జవాబు రాయటంలో ఎప్పుడూ అశ్రద్ధ చేయదు. కానీ ఈసారి వారం దాటినా సమాధానం లేదు. అపూ మనసులో ఆందోళన నానాటికీ తీవ్రమవుతోంది. ఏం జరిగింది? అపర్ణ మరణించలేదు కదా! ఎందుకో అతని మనసులోకి హటాత్తుగా వచ్చిందా ఆలోచన. ఆ రాత్రి నిద్రలో పీడకల – అపర్ణ కన్నీళ్ళతో తనకేసి చూస్తోంది. "నేనెంతో కాలం బతకనని ఆ రోజు మీతో అన్నాను, గుర్తుందా? నేనిక వెళ్ళిపోతున్నా. మళ్ళీ జన్మంటూ ఉంటే మిమ్మల్ని తప్పకుండా కలుస్తాను" అంటోందామె.

ఉలికిపాటుతో లేచి కూర్చున్నాడు అపూ. వెంటనే వెళ్ళి ఆమెను చూడాలి. ఆఫీసుకు సెలవు పెట్టాలన్న విషయం కూడా పట్టించుకోకుండా ప్రయాణానికి బట్టలు సర్దుకున్నాడు. కాసేపట్లో బయల్దేరబోతుండగా అపర్ణావాళ్ళ ఇంటినుండి ఉత్తరం వచ్చింది. అందరం కులాసాగా ఉన్నామంటూ ఆమె బంధువులెవరో రాశారు. అపూ హృదయం తేలికపడింది. కానీ అపర్ణ మౌనం అతన్ని బాధపెట్టింది. ఆమె ఉత్తరం రాయకపోవటానికి కారణమేమిటో అర్థంకాలేదు.

❖ ❖ ❖ ❖

ఆ రోజు శనివారం. ఆఫీసు నుండి తిరిగొచ్చేసరికి అపర్ణ పెదనాన్న కొడుకు మురారి వరండాలో కూర్చొని ఉండటం చూసి సంతోషపడ్డాడు అపూ. "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు! ఇవాళెంత సుదినం!" అంటూ ఉత్సాహంగా పలకరించాడు.

కానీ మురారి నుండి జవాబులేదు. అతడు మౌనంగా ఒక కవరును అపూ చేతికి అందించాడు. ఆశ్చర్యపోతూ అతనికేసి చూశాడు అపూ. మురారి కళ్ళ నుండి కన్నీళ్ళు జలజలారాలుతున్నాయి.

అపూ ఒళ్ళంతా చల్లబడిపోయినట్లన్పించింది. "అపర్ణ చచ్చిపోయిందా...? అతని నోటి నుండి అసంకల్పితంగా వచ్చాయా మాటలు.

మురారి పెద్ద పెట్టున రోదించాడు.

"ఏం జరిగింది? చెప్పు!" గట్టిగా అరుస్తున్నాడు అపూ.

"నిన్న పొద్దున... అపర్ణ పిల్లవాడిని ప్రసవించింది... ఎనిమిదిన్నర కావొస్తోందప్పుడు. తర్వాత... ఓ గంట తర్వాత..." మురారి గొంతు పూడిపోయింది.

"ప్రసవించేటప్పుడు స్పృహలోనే ఉందా?"

"ఉంది. మీకు టెలిగ్రామ్ ఇప్పించమని కూడా వాళ్ళమ్మతో చెప్పింది. ఆరోగ్యంగానే ఉంది...హటాత్తుగా, తొమ్మిది గంటలప్పుడు..."

కొన్నాళ్ళ తర్వాత ఈ సంఘటనను గుర్తుచేసుకున్నప్పుడల్లా విపరీతమయిన ఆశ్చర్యంలో మునిగిపోతుండేవాడు అపూ. ఆ రోజు మురారిని అన్ని ప్రశ్నలు తానెలా అడగగలిగాడో అతనికేమాత్రమూ అంతుబట్టదు.

"అపూర్వతో ఈ వార్త ఎలా చెప్పాలా, అని దారి పొడవునా భయపడుతూ వెళ్ళాను. కానీ, నేను చెప్పాల్సిన అవసరమే లేకపోయింది...అతడే అంతా గ్రహించాడు" అని తిరిగి వెళ్ళాక తమ ఇంట్లో వాళ్ళతో చెప్పాడు మురారి.

తన కొడుకు సంగతేమిటి? వాడసలు బతికే ఉన్నాడా? ఈ విషయం అడగటం మర్చేపోయానని మురారి వెళ్ళాకగానీ అపూ గ్రహించలేదు. పిల్లవాడి గురించి మురారి ఏమీ చెప్పలేదంటే...వాడు కూడా చనిపోయే ఉంటాడన్పించింది.

అపర్ణ మరణం గురించి, అపూ అద్దెకుంటున్న భవనంలో అన్ని వాటాల వాళ్ళకూ ఎలాగో తెలిసిపోయింది. మొదటి అంతస్తులోని సేన్‌గారూ, గంగూలీగారి భార్యా... ఒక్కొక్కరూ వచ్చి పరామర్శించటం మొదలుపెట్టారు. అపర్ణ మంచితనాన్నీ, చక్కదనాన్నీ తలచుకుని బాధపడేవాళ్ళు. జీవితాన్ని నాశనం చేసుకోకుండా, త్వరలోనే మళ్ళీ పెళ్ళి చేసుకోమని సలహాలు కూడా మొదలయ్యాయి.

ఈ సానుభూతి అతనికి భరించరానిదిగా తయారవుతోంది. వీళ్ళు తనను ఒంటరిగా వదిలేస్తే బావుండునన్పిస్తోంది.

ఆ రోజు సాయంత్రం వరండాలో కూర్చున్న అపూ, చీకటి పడటాన్ని కూడా గమనించలేదు. చెవిలో దోమల రొద మొదలవడంతో ఉలిక్కిపడి లేచాడు. ఏదయినా కాస్త వండుకుని తినక తప్పదిక. లోపలికి వెళ్ళబోతున్న అపూ, తన గదిలోంచి అగ్గిపుల్ల గీసిన చప్పుడుకు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది. అపర్ణ తిరిగొచ్చేసిందా...?

"కాకా బాబూ! కిరసనాయిలు సీసా ఎక్కడుందో అడగమంటోంది అమ్మ" అంటూ అతని గదిలోంచి పరిగెత్తుకొచ్చింది పింటూ.

పై అంతస్తులో ఉండే గంగూలీగారి బంధువులమ్మాయి ఆ పాప. తల్లిదండ్రులతో బాటు కొన్నాళ్ళుగా ఇక్కడే ఉంటోంది. తండ్రికి జబ్బుగా ఉండటంతో బంధువుల సహాయంతో వైద్యం చేయించుకోటానికి గ్రామం నుండి వచ్చిందా కుటుంబం. చేతిలో చిల్లిగవ్వ లేక తమను ఆశ్రయించిన ఆ కుటుంబాన్ని గంగూలీగారి భార్య అష్ట కష్టాలూ పెడుతోంది. వాళ్ళ పరిస్థితిని చూసిన అపూ, అపర్ణా చేతినయినంత సాయం చెయ్యసాగారు.

పింటూ పిలుపుతో స్పృహలోకొచ్చిన అపూ, "అమ్మ...గదిలో ఉందా?" అడిగాడు ఆశ్చర్యంగా.

పింటూ తల్లి అతడి గదిలో కిరోసిన్ సీసా కోసం వెతుకుతోంది. "అయ్యో... మీరెందుకు వదినగారూ! నేను వండుకుంటాన్లెండి" అంటూ మొహమాటపడుతున్న అతణ్ణి వారించి, కిరసనాయిలు తీసుకుని వెళ్ళిపోయిందామె. ముందుగా ఫలహారమూ, టీ, తయారుచేసి పంపింది. రాత్రి తొమ్మిది గంటలకు భోజనం తెచ్చిపెట్టింది.

పింటూ తండ్రి ఆరోగ్యం కాస్త కుదుటపడుతోంది. ఇటీవలనే కింది అంతస్తులో ఓ వాటా ఖాళీ అవటంతో, వాళ్ళు అందులోకి మారారు.

మర్నాటి నుంచీ అపూకి ఫలహారమూ, భోజనమూ పింటూ వాళ్ళమ్మే వండి పెడుతోంది. అపూ వద్దని చెప్పినా ఆమె విన్పించుకోవటం లేదు. "ఇందులో పెద్ద శ్రమేముంది బాబూ, మీరేమీ ఇబ్బందిపడకండి" అంది చనువుగా.

ఆమె మాటల్లోని ఆత్మీయత అపూ మొహమాటాన్ని కాస్త తగ్గించింది.

"మీరు నామీద చాలా దయ చూపుతున్నారు వదినగారూ..." కృతజ్ఞతతో అన్నాడు అపూ.

"అలాంటి మాటలనకండి. మీరు మాకెంత సాయం చేశారో మర్చిపోగలనా? దగ్గర బంధువులైన వాళ్ళు కూడా పట్టించుకోనప్పుడు మమ్మల్ని ఆదుకున్నారు కదా బాబూ! ఎంత మంచి మనసామెది! ప్రతి పూటా పింటూని మీ ఇంటికి పిల్చుకొచ్చి అన్నం తిన్పించేది. ఇంత అన్యాయం జరుగుతుందని..." ఒక్కసారిగా భోరుమందామె.

అపూ మనసుకెంతో ఓదార్పు దొరికినట్టయింది. అపర్ణ జ్ఞాపకాలను ఆమెతో పంచుకోటానికి సందేహించనక్కర్లేదన్పించింది.

రోజంతా ఆఫీసు చాకిరిలో మునిగిపోయి, అపర్ణ స్మృతుల నుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు అపూ. కానీ, ఒంటరిగా కూర్చోగానే అతని హృదయమంతా ఆమె తలపులతో నిండిపోతుంది. పున్నమి రాత్రుల్లో ఆమె మరింతగా గుర్తొస్తుంది. గత ఏడాది, ఇటువంటి ఓ పౌర్ణమి రాత్రే ఆమె లక్ష్మీపూజ చేసింది. ఆ రోజు ఆమె...అచ్చంగా ఓ దేవతామూర్తిలా వెలిగిపోయింది. ఎంత అద్భుతంగా భావాలను పలికించేవి ఆ కళ్ళు ! ఎంత సుందరమైన రూపురేఖలామెవి! అలా...మెడపక్కకు తిప్పిచూడటంలో ఎంత ఠీవీ ఒలికిపోయేది!

ఆమె మాటలు ఒక్కొక్కటీ గుర్తొచ్చినప్పుడల్లా భరించరాని వేదన కలుగుతుంది. అతని హృదయాన్నంతటినీ మహాశూన్యం ఆవరించుకుంది... అది ఏనాటికీ తీరనిలోటు. అపర్ణ మరణం సృష్టించిన శూన్యాన్ని ఏ విధంగానూ పూరించుకోలేడు తను! కనుచూపు మేర దాకా పరచుకున్న అంతులేని ఎడారిలా గోచరిస్తోంది తన భవిష్యత్తు!

మరో నెల తర్వాత పింటూ తండ్రి ఆరోగ్యం కుదుటపడింది. వాళ్ళు స్వగ్రామానికి వెళ్ళేరోజున పింటూ తల్లి అపూ దగ్గరకొచ్చింది. "నాకు అన్నదమ్ములెవరూ లేరుబాబూ. మిమ్మల్ని చూస్తే సొంత తోబుట్టువులా అన్పిస్తారు. మీకు ఏ విధంగానూ సాయంచెయ్యలేని అశక్తురాలిని. కానీ, మీ అక్కయ్యను మరిచిపోకుండా అప్పుడప్పుడూ మా ఇంటికొచ్చారంటే నాకంతకు మించిన సంతోషం ఉండదు" అంది.

తమ ఇంట్లోని చాలా వస్తువులను ఆమెకు బహుమతిగా ఇచ్చేశాడు అపూ. ఆమె వద్దన్నా విన్పించుకోకుండా "నేను మాత్రం ఏం చేసుకుంటానమ్మా! మీరు వాడుకుంటే నాకు సంతోషం" అన్నాడు.

❖ ❖ ❖ ❖

పింటూ వాళ్ళు వెళ్ళిపోయాక అపూ మరింత ఒంటరివాడయిపోయాడు. ఇప్పుడీ ప్రపంచంలో తనకంటూ ఎవరూ లేరనే భావన అతణ్ణి అస్తమానూ వెంటాడుతోంది. ప్రణవ్ ఏమయిపోయాడో కొన్నాళ్ళుగా తెలియటంలేదు. లీల కుటుంబానికి ఏవో ఆస్తి గొడవలు ఎదురవటంతో వాళ్ళు మళ్ళీ బర్ద్వాన్‌కు వెళ్ళిపోయారని తెలిసింది.

ఈ మధ్య ఇంటికి వెళ్ళాలంటే ఇంకో కొత్త భయం పట్టుకుందతనికి. గంగూలీ గారి భార్య మాటిమాటికీ వచ్చి కూర్చోవటమేగాక, అర్థంలేని వాగుడు మొదలుపెట్టింది. అతడికింకా ఎంత గొప్ప భవిష్యత్తున్నదో, దాన్నెలా సద్వినియోగం చేసుకోవాలో సలహా లిస్తుంది. ఆ తర్వాత కొన్నాళ్ళుగా, తన మేనకోడలిని పెళ్ళాడమని పీడించుకు తింటోంది.

ఒకరోజున ఏమీతోచక వీధుల్లో తిరుగుతున్న అపూకి లీల ఎక్కడుందో తెలుసు కుంటే బావుండునన్పించింది. నేరుగా భవానీపూర్‌లోని వాళ్ళ తాతయ్యగారింటికి వెళ్ళాడు.

లీలావాళ్ళ నౌకరు రామ్‌లఖన్ అపూని గుర్తుపట్టి ఇంట్లోకి ఆహ్వానించాడు. లీల మళ్ళీ కలకత్తాకు వస్తుందా, అని అడిగిన అపూని ఆశ్చర్యంగా చూశాడతడు. కిందటి ఏప్రిల్‌లో లీలకు ఓ పెద్ద ఇంజినీర్‌తో పెళ్ళయిపోందనీ, ఇప్పుడామె ఇంగ్లాండులో ఉంటోందనీ చెప్పాడు. లీల అత్తవారిది గొప్ప జమీందారి కుటుంబమనీ, ఆమె భర్త చాలా అందంగా నవాబుమల్లే ఉంటాడని వర్ణించి చెప్పాడు. లీలాదీదీ పెళ్ళికి అపూర్వబాబును పిలవనే లేదంటే నమ్మలేకపోయాడు రామ్‌లఖన్.

అపూ మనసు చిన్నబోయింది. మళ్ళీ వస్తానని చెప్పి, అక్కడి నుండి లేచి వెళ్ళిపోయాడు.

లీలావాళ్ళ ఇంటి నుండి బయటకు అడుగుపెడుతుంటే అతడికి ఈలోకం మరింత శూన్యంగా తోచింది. అంతులేని ఒంటరితనం అతణ్ణి ఆవరించింది. ఇదేమిటి? లీలకు పెళ్ళయిందంటే అది తనకు సంతోషకరమైన వార్తేకదా! తన హృదయంలో ఈ వెలితికి అర్థమేమిటి? సంపన్నుడూ, రూపవంతుడూ అయిన యువకుడు ఆమెకు భర్తగా లభించటంలో ఆశ్చర్యమేముందని! అన్ని విధాలా అది సహజమే కదా!

లీల ఇప్పుడొక వివాహిత స్త్రీ, తను మనస్ఫూర్తిగా సంతోషించాలి. ఔను...నిజంగా సంతోషించాల్సిందే!

## 16

కలకత్తాలో జీవితం అపూ ప్రాణానికి నానాటికీ దుర్భరంగా మారుతోంది. ప్రతి రోజూ ఆఫీసులో అదే బండచాకిరీ, ఏ ఆశాలేని అదే జీవితం, అతడికి విరక్తి పుట్టిస్తున్నాయి. ఈ నగర జీవితం నుండి బయటపడితే తప్ప తన మనసుకు శాంతి దొరకదని బలంగా అన్పిస్తోంది.

చివరికి, తన ఉద్యోగాన్ని వదిలేసి చప్దానీ అనే గ్రామంలో బడిపంతులుగా చేరాడు. ఆ ఊరు ఇటు పల్లెటూరు, అటు పట్టణమూ కాకుండా మధ్యరకంగా ఉంటుంది. అక్కడి జనపనార మిల్లులూ, వాటిలో పనిచేసే కార్మికుల మురికివాడలు, బొగ్గు ధూళితో ఆవరించిన వీధులూ చూస్తుంటే పట్టణంలాగానే ఉంటుంది. కానీ పట్టణాల్లోని కొన్ని సౌకర్యాలు కానీ, పల్లెపట్టుల్లోని పచ్చదనంకానీ ఆ ఊళ్ళో కనబడవు.

ఢాకాలో ఉంటున్న ప్రణవ్, క్రిస్మస్ సెలవుల్లో అపూని వెదుక్కుంటూ వచ్చాడు. అతడుంటున్న గది చాలా చిన్నది. నిజానికి ఆ గదిలో సగ భాగమే అపూ వాడుకుంటున్నాడు. మిగతా సగంలో ఓ వైద్యుడు ఆస్పత్రి నడుపుతున్నాడు. అపూ ఉంటున్న పరిసరాలు చూసి బాధపడ్డాడు ప్రణవ్.

“ఇందులో బాధపడటానికేముంది? ఆ కలకత్తాలో బతకటంకన్నా ఇదే మెరుగన్పిస్తోంది నాకు” అన్నాడు అపూ.

అపూ గది పక్కనే ఓ బ్రాహ్మణుడు నడుపుతున్న ఫలహారశాల ఉంది. అపూ అక్కడే భోజనం చేస్తున్నాడు. చిలుంపట్టిన ఇత్తడి పళ్ళెంలో భోజనం పట్టుకొచ్చాడు దుకాణదారుడు. ఇంత మురిగ్గా ఉన్న వాతావరణంలో ఆ తిండి తింటున్న మిత్రుణ్ణి చూసి ఆశ్చర్యపడ్డాడు ప్రణవ్. అపూ ఎంత పేదరికంలో బతికినా శుభ్రతకు ఎంత ప్రాధాన్యమిచ్చే వాడో అతడికి తెలుసు.

ప్రణవ్‌ను మరింతగా బాధపెట్టిన విషయం మరొకటుంది. బిషూ అనే ఓ నగల వర్తకుడి దుకాణంలో పేకాట ఆడుతున్న అల్లరి చిల్లరి మూకలతోబాటు అపూ కూడా పేకాడుతూ కూర్చోవటాన్ని అతడు జీర్ణించుకోలేక పోయాడు.

“నువ్వీ ఊళ్ళో ఇక ఉండొద్దు అపూ, రేపు నాతోబాటు వచ్చెయ్” అన్నాడు.

“ఈ ఊరికేం? ఇక్కడందరూ చాలా మంచివాళ్ళు తెలుసా? ఆ నగలవర్తకుడున్నాడే... ఆయకు బోలెడన్ని ఆస్తులున్నాయ్-పెద్ద బంగళా, తోటలూ, పొలాలూ. ఐనా, నేనంటే వాళ్ళింట్లో వాళ్ళందరికీ మహాగౌరవం. ఈ ఊరికి దగ్గర్లోనే బేగంపూర్ అనే

గ్రామముంది. అక్కడ ఆయనకు పొలాలున్నాయి. ఆ ఊళ్ళో నాకు ఓ ఇల్లూ, పొలమూ ఏర్పాటు చేస్తాననీ, ఎప్పటికీ ఇక్కడే ఉండిపొమ్మనీ అంటున్నాడు"

ఈ వాతావరణం అపూ వంటి మనిషికి తగినది కాదని ప్రణవ్ ఎంతగానో చెప్పి చూసినా లాభంలేకపోవటంలో చేసేదేమీలేక వెళ్ళిపోయాడు. 'అపూ చాలా మారిపోయాడు. ఇతనికీ, నేనెరిగిన అపూకీ పోలికే లేదు' అనుకున్నాడు ప్రణవ్, మనసులో.

❖ ❖ ❖ ❖

బడిలో పాఠాలు చెప్తున్నంతసేపూ ఏదో ఒక విధంగా కాలం గడుస్తుంది. కానీ, సాయంత్రమయేసరికి విపరీతమైన ఒంటరితనం వేధిస్తుంది అపూని. దాని నుండి తప్పించుకోటానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే పేకాట అలవాటయింది. అంతకన్నా మెరుగైన సాంగత్యాన్ని ఆ ఊళ్ళో వెదుక్కునే అవకాశమే లేదు.

రాత్రి భోజనం చేశాక పొద్దుపోయేదాకా వరండాలో కూర్చుని ఎదురుగా ఉన్న రైలుపట్టాలనూ, సిగ్నల్ లైట్లనూ, అప్పుడప్పుడూ వెళ్ళే రైళ్లనూ చూస్తూ గడుపుతాడు అపూ.

ఇటీవల మరో కొత్త కాలక్షేపాన్ని కూడా వెదుక్కున్నాడతడు. ప్రతి సాయంత్రమూ స్కూలు నుండి రాగానే, గ్రామ పోస్టాఫీసుకు వెళ్తాడు. అదే సమయానికి టపా వస్తుంది. పోస్ట్‌మేన్ చరణ్‌బాబును అడిగి ఆ టపా సంచి మీదున్న సీల్‌ను కత్తిరించి ఉత్తరాలన్నీ పరశీలించటం అపూకొక సరదాగా తయారయింది.

ఆ సంచిలో రకరకాల ఉత్తరాలుంటాయి – కార్డులూ, కవర్లూ, మనియార్డరు ఫారాలూ. మొదటి నుండీ అపూకి, ఎక్కడినుండయినా తనకు ఉత్తరం వచ్చిందంటే మహా ఆనందం. అమ్మ చనిపోయాక, అపర్ణ రాసే ఉత్తరాలు అతని మనసుకు గొప్ప తృప్తినీ, ఆహ్లాదాన్నీ ఇచ్చాయి. ఇప్పుడు ఈ పోస్ట్‌బ్యాగ్‌లోని కొన్ని కవర్లను చూస్తుంటే అతనిలో ఆ గతస్మృతులు కదలాడుతాయి. అపర్ణ తనకు రాస్తుండిన గులాబి రంగు కవర్లనూ, ఆమె చేతిరాతను పోలిన అక్షరాలనూ వెదుక్కుని చూస్తుంటే చెప్పలేని ఉద్వేగం కలుగుతుంది.

ఒక సాయంత్రం బిషూ దుకాణంలో పేకాట నుండి ఆలస్యంగా తిరగివస్తున్న అపూకి, తన స్కూల్లోనే పనిచేసే ఆశుబాబు అనే టీచర్ ఎదురయ్యాడు.

ఇద్దరూ మాట్లాడుకుంటూ నడుస్తుండగా ఆశుబాబు హటాత్తుగా ఆగిపోయాడు. "మీకో సంగతి చెప్పాలి అపూర్వ బాబూ, ఆ పూర్ణా దీక్షితో మీకు స్నేహమేమిటి చెప్పండి? అతడి వలలో మీరెలా ఇరుక్కున్నారో నాకర్థం కావటంలేదు" అన్నాడు గొంతు తగ్గించి, రహస్యం చెప్తున్నట్టుగా.

"వలలో ఇరుక్కోవటమా? అలా అంటారేమిటి?" ఆశ్చర్యపడ్డాడు అపూ.

"అయ్యో, మీకీవూరి గొడవలు తెలీవండీ బాబూ! వాళ్ళ చేతికి చిక్కిన వాళ్ళందరూ సర్వనాశనమే. ఆ పిల్ల ఉంది చూశారూ...అతడి కూతురు" అంటూ అదోరకంగా నవ్వాడు.

"ఎవరూ? పతీశ్వరి గురించా మీరంటున్నది?"

"ఆఁ! ఆ పిల్ల కారణంగా మిమ్మల్ని గురించి నలుగురూ నానారకాలుగా అనుకుంటున్నారు. మీకెందుకు ఆ పీడంతా? మీరు మంచి వంశానికి చెందినవారనే అభిమానంతో చెప్తున్నా, మరోలా భావించకండి" అనేసి వెళ్ళిపోయాడు ఆశుబాబు.

నివ్వెరపోయి నిలబడ్డాడు అపూ. ఆశుబాబుపై పట్టరాని ఆగ్రహం వచ్చింది. కానీ, కాసేపట్లోనే అతని వివేకం మేల్కొంది. ఆ అమ్మాయి తనపై చూపుతున్నా శ్రద్ధ స్పష్టంగానే కనబడుతోంది. తనకోసం ప్రత్యేకమైన ఫలహారాలు చేసి పంపటమూ, తన గదిలోని మాసిన బట్టలను తమ్ముడితో తెప్పించుకుని ఉతికి పంపటమూ వంటి చర్యలన్నీ గుర్తొచ్చాయి.

తన కారణంగా ఓ ఆడపిల్ల నిందలపాలవటం మంచిదికాదు. వాళ్ళతో స్నేహాన్ని తగ్గించాలన్న నిర్ణయానికొచ్చాడు అపూ.

ఆ మరునాటి నుండి పేకాటకు వెళ్ళటం మానేశాడు. దానికి బదులుగా కాలినడకన చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ పొలాలూ, చెట్లూ కనబడిన చోట సేదదీరుతూ గడప సాగాడు.

ఒంటరిగా కూర్చున్నప్పుడల్లా ఎన్నోరకాల ఆలోచనలు ముసురుకుంటాయి. పుస్తకం పేజీల్లో కనబడే ఏ చిన్న కీటకాన్నో, తడిసిన వస్తువులపై మొలిచిన నాచునో చూసినా ఎన్నో సందేహాలు ముప్పిరిగొంటాయి అతడి మనసును. చావు పుట్టుకల మర్మమేమిటి? ఈ పురుగువలెనో, నాచువలెనో పుట్టడమూ, గిట్టడమూ వంటిదేనా మనిషి జీవితం కూడా?

మరణించిన వాళ్ళందరూ ఏమయిపోతున్నారు? మరణానికి ఆవలి తీరంలో ఉన్నదేమిటి? ఉత్తి శూన్యమేనా?

ఆలోచనలతో అతడి తల బరువెక్కిపోతుంటుంది.

❖ ❖ ❖ ❖

మళ్ళీ దుర్గాపూజ రోజులొచ్చాయి. సెలవుల్లో విజయదశమి రోజున కలకత్తాకు వెళ్ళాడు అపూ. ఈ పర్వదినాన ఎంతో ఆనందంగా, వేడుకగా గడిపిన గతం గుర్తుకొచ్చింది. ఆ రోజులను తలచుకుంటుంటే, చిరకాలం తరువాత కలిసిన బాల్యమిత్రులు మనసారా నవ్వుతూ, గాఢంగా ఆలింగనం చేసుకుంటున్నంత మధురంగా తోచింది.

కలకత్తా వీధుల్లో నడుస్తున్న అపూకి హటాత్తుగా తన కొడుకు జ్ఞాపకానికొచ్చాడు. వాడు ఎవరి పోలికో! అపర్ణలాగా ఉంటాడా? అపూ మనసులో ఆ పసివాడిపై తెలియని వైముఖ్యమేదో ఏర్పడిపోయింది. అపర్ణ మరణానికి కారకుడు వాడేనన్న భావం అతడి మనసు లోపలి పొరల్లో ఎక్కడో పేరుకుపోయిందేమో! ఈ సెలవుల్లో వాణ్ణి చూసిరావాలని మొదట్లో అనుకున్నాడు. కానీ, తీరా సెలవులు వచ్చాక వెళ్ళాలన్పించలేదు. కొడుకుపట్ల

తన పితృధర్మాన్ని నెరవేర్చటానికి అతడు చేసిందల్లా, వాడికి పండగ బహుమతిగా ఐదురూపాయలు మనియార్డర్ చెయ్యటం!

ఏ లక్ష్యమూ లేకుండా వీధుల వెంట నడుస్తున్న అతడి కళ్ళముందు ఎన్నో దృశ్యాలు కదిలిపోతున్నాయి. ఓ చిన్న ఇంట్లోంచి ఇరవయ్యేళ్ళ యువతి పూరీలు వేగిస్తున్న దృశ్యం కనబడుతోంది. ఓ వరండాలో చాలామంది మగవాళ్ళు పరస్పర ఆలింగనాలతో పండుగ అభినందనలు తెలుపుకుంటున్నారు; గులాబిరంగు గౌను తొడుక్కున్న ఓ పాప, ఉంగరాల జుట్టులోంచి తొంగిచూస్తూ అతనికేసి చూసింది.

అలా వెళ్తుండగా ఓ చిన్న మందుల దుకాణంలో పాత మిత్రుడు కనబడి పలకరించాడు. అతడు దుర్భరమైన దరిద్రంలో ఉన్నారని చూడగానే అర్థమవుతోంది. "మూలికలతో తయారయిన మందులు అమ్ముతున్నానిక్కడ. నా భార్య పచ్చళ్ళు తయారు చేసి అమ్ముతుంది. ఇద్దరం కలిసి చిన్న తేయాకు పొట్లాలు కూడా అమ్ముతుంటాం. ఐనా ఇల్లుగడవటం కష్టంగానే ఉంది. ఈ సంసారాన్ని ఇట్లా ఎంతకాలం లాగగలనో అర్థం కావటంలేదు అపూర్వా..." అంటూ తన వేదననంతా వెళ్ళగక్కాడు అతడు.

అతడి పరిస్థితి చూసి బాధపడ్డాడు అపూ. ఎనిమిదణాలు పెట్టి మిఠాయి కొని, దుకాణం పక్కనే ఉన్న ఆ మిత్రుడి ఇంట్లో పిల్లలకు ఇచ్చి, సెలవు తీసుకున్నాడు.

కలకత్తాకు వచ్చినప్పటి నుండి లీల పదే పదే గుర్తొస్తోంది. ఒకవేళ పండక్కి వచ్చిందేమో, వెళ్ళి చూద్దామన్పించింది. ట్రామ్‌లో భవానీపూర్ చేరుకున్నాడు.

లీలావాళ్ళ తాతగారింటి ముందు రెండు కార్లు ఆగివున్నాయి. హాల్లో ఎవరో కొత్త వ్యక్తులు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

లీల...బహుశా, ఆమె ఇంట్లోనే ఉందేమో... అతడి గుండె వేగంగా కొట్టుకో సాగింది.

గుమ్మం దగ్గర అపూని చూసి, లీల తమ్ముడు విమలేందు పరిగెత్తుకొచ్చాడు. "అపూర్వ బాబూ, ఎన్నాళ్ళయింది మీరొచ్చి?" అంటూ ఆప్యాయంగా చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

"అమ్మ ఇంట్లో లేదా? అక్క వచ్చిందా పండక్కి?"

"అమ్మలేదు, బజారుకెళ్ళింది. అక్కయ్య రాలేదుగా" జవాబిచ్చాడు విమలేందు.

కుంగిపోయాడు అపూ. తన కలకత్తా ప్రయాణమూ, ఈ రోజంతా ఈ నగరంలో తిరిగిన తిరుగుళ్ళూ...అంతా వృథా అయినట్టన్పించింది. లీలను చూసి రెండేళ్ళయి పోయింది. ఈ విజయదశమి రోజున ఆమెను తప్పకుండా చూస్తానని పొద్దుటి నుండీ ఏదో ఆశ. అది నిరాశగా మారింది.

ఎంతో కాలం తర్వాత కనబడిన అపూని వదలటానికి విమలేందుకు మనసొప్పటం లేదు. అతడికి మిఠాయిలూ, టీ పట్టుకొచ్చి తీసుకోమని బలవంతపెట్టాడు.

"లీల నాగపూర్‌లోనే ఉంటోందా? ఇక్కడికెప్పుడొస్తుంది?" మళ్ళీ అడిగాడు అపూ.

ఆ ప్రశ్నకు జవాబుగా విమలేందు ఎన్నో విషయాలు చెప్పాడు. అపూ ఊహకు ఏమాత్రమూ అందని విషయాలవి – లీల భర్త పరమకోపిష్టి, దురహంకారి. లీల ఎంతో సహనంతో అతడిని భరిస్తోంది. "ఆయన బాగా తాగుతాడని కూడా తెలిసింది" అన్నాడు విమలేందు గొంతు తగ్గించి.

అపూ నివ్వెరపోయాడు.

"ఈ సంగతులేవీ అక్క చెప్పనేలేదు. సుజాతక్క కొడుకు వేసవి సెలవుల్లో వెళ్ళినప్పుడు చూసి, ఇంట్లో చెప్పాడు" మళ్ళీ తనే అన్నాడు విమలేందు.

ఇంతలో సుజాత హాల్లోకి వచ్చింది. ఆమె లీలకన్నా చాలా పెద్దది. విమలేందు పరిచయం చేస్తే తప్ప, అపూని గుర్తుపట్టలేకపోయిందామె.

"ఏం చేస్తున్నావిప్పుడు? మీ అమ్మ ఎలా ఉంది?" అంటూ పలకరించింది.

"అమ్మ చనిపోయిందండీ" అన్నాడు అపూ.

"అయ్యో, అలాగా! నీకు పెళ్ళయిందా?"

తన కథంతా చెప్పుకొచ్చాడు అపూ.

"మళ్ళీ పెళ్ళిచేసుకోకపోయావూ? నీ భార్యపోవటం బాధగానే ఉంటుందనుకో, ఐనా మన చేతుల్లో ఏముంది? జీవితమంతా ఇట్లా ఉండలేవుగా! మీ అత్తవారింట్లో ఇంకా ఆడపిల్లలుంటే చేసుకో!" అంది సూజాత.

ఆమె మాటల ధోరణికి అపూ నొచ్చుకున్నాడు. అదే లీలయితే ఇలా మాట్లాడేదా? సర్వజయను గురించి "మీ అమ్మ" అని లీల ఎన్నడూ ప్రస్తావించలేదు. ఎంతో ఆత్మీయంగా "అమ్మ" అనేది. అపూకి ఆ విషయం గుర్తొచ్చింది. తన పేదరికాన్నీ, బలహీనతలనూ పట్టించుకోకుండా గొప్ప ప్రేమతో, ఆత్మీయతతో, నమ్మకంతో ఆమె తన స్నేహ హస్తాన్ని అందించిందనే కృతజ్ఞతతో అతడి మనసు నిండిపోయింది.

అపూ వెళ్ళిపోయేటప్పుడు విమలేందు కూడా వీధిలో దాకా వచ్చాడు. "కిందటేడాది మార్చిలో వచ్చింది లీలాదీదీ. మిమ్మల్ని కలవాలని మీ ఆఫీసు దగ్గరికి పంపింది నన్ను. మీరక్కడ లేరని తెలిసింది. మీ అడ్రసివ్వండి, దీదీకి పంపుతాను" అని అపూ చిరునామా తీసుకున్నాడు.

❖ ❖ ❖ ❖

మూడు నెలలలు గడిచాయి. ఆ రోజు మాఘ పౌర్ణమి. అర్ధరాత్రి గాఢనిద్రలో ఉన్న అపూ, కిటికీపై తడుతున్న చప్పుడుతో మేల్కొన్నాడు. కిటికీ తలుపు తీసిన అపూ నివ్వెరపోయాడు, అక్కడ పతీశ్వరి నిల్చుని ఉంది. "నువ్వా? ఇదేమిటి, ఇంత రాత్రిపూట! మీ అత్తవారింటికి వెళ్ళలేదూ..." అప్రయత్నంగానే తలుపుతీసి బయటికి వెళ్ళాడు అపూ.

చలిలో గజగజలాడుతూ నిలబడిన ఆ పిల్ల వెక్కి వెక్కి ఏడవసాగింది. “మాస్టరు గారూ, మీకు పుణ్యముంటుంది నాకో సాయం చెయ్యండి. నన్నింక అక్కడికి పంపించొద్దని బాబాకు చెప్పండి. మీరు చెప్తే వింటాడు. అక్కడుంటే నన్ను చంపేస్తారు...”

ఇక గత్యంతరం లేక ఆ అమ్మాయిని తీసుకుని దీఘ్రీగారింటికి వెళ్ళాడు అపూ. ఆమె తల్లిదండ్రులు బయటికొచ్చాక జరిగినదంతా చెప్పారు. ఇంతలో ఆమె ఇంట్లోకి వెళ్ళిపోయింది.

కాసేపయ్యాక అపూని ఇంట్లోకి పిలిచి, ఆ పిల్ల వంటిమీది గాయాలను చూపించారు వాళ్ళు. ఆమె చేతులూ, మెడా, వీపూ...ఎక్కడ పడితే అక్కడ విచక్షణా రహితంగా కొట్టిన గాయాలున్నాయి. అక్కడంతా రక్తం చారికలు కట్టింది. ఇక తన కూతురిని ఆ దుర్మార్గుడి దగ్గరికి పంపేదిలేదనీ, లాయర్ని కలిసి విడాకులకు దరఖాస్తు చేస్తాననీ కేకలేశాడు తండ్రి. కొద్దిసేపు వాళ్ళతో మాట్లాడి, ఇంటికి వెళ్ళిపోయాడు అపూ.

ఐదారు రోజుల తర్వాత ఆ అమ్మాయి మళ్ళీ అత్తవారింటికి వెళ్ళిపోయిందనీ, భర్త స్వయంగా వచ్చి తీసుకెళ్ళాడనీ విని ఆశ్చర్యపోయాడు. ఒకరోజు సాయంత్రం స్కూలు బంట్రోతు ఓ ఉత్తరం తెచ్చిచ్చాడు. అపూని ఉద్యోగం నుండి తొలగిస్తున్నామనీ, మరో ఉద్యోగం చూసుకునేందుకు నెలరోజులు మాత్రం గడువిస్తున్నామనీ స్కూలు సెక్రటరీ రాసిన లేఖ అందులో ఉంది.

వెంటనే హెడ్‌మాస్టర్‌ను కలుసుకుని కారణం అడిగాడు అపూ. ఆయన తనకేమీ తెలియదనీ, సెక్రటరీ గారినే అడగమన్నాడు. అపూ ఈ పాఠశాలకు వచ్చినప్పటి నుండి, విద్యార్థులతో ప్రేమగా మెలగటమూ, వాళ్ళను కూడగట్టి సాంఘిక సేవా కార్యక్రమాలు నిర్వహించటమూ హెడ్మాస్టర్‌కు నచ్చటంలేదు. ఆ సంగతి అపూ కూడా గ్రహించాడు.

సెక్రెటరీని కలిశాక విషయం స్పష్టపడింది. ఊళ్ళో అపూ గురించి చెడుగా చెప్పుకుంటున్నారనీ, దీఘ్రీల అమ్మాయితో అతడికి సంబంధం ఉందని తనకు తెలిసిందనీ ఆయన సూటిగానే చెప్పాడు. ఉపాధ్యాయుల నడత మంచిది కాకపోతే ఏ తల్లిదండ్రులూ వారి పిల్లలను బడికి పంపిటానికి ముందుకురారు కనుక అపూని తొలగిస్తున్నామన్నాడు.

అపూ ముఖం అవమానంతో ఎరుపెక్కింది.

“ఎవరో చెప్పిన చాడీలు విని, నామీద నిందలెయ్యటం న్యాయమేనా? నేను చెప్పేదేమిటో వినకుండా మీరెలా నిర్ణయాలు తీసుకుంటారు?” ఆవేశంగా అడిగాడు. కానీ ఈ వాదాన్ని పొడిగించటానికి సెక్రటరీ సుముఖంగా లేడు. ఆయన అప్పటికే ఒక నిశ్చయానికి వచ్చాడు.

“హత్యచేసిన వాడికైనా, అతడి వాదాన్ని న్యాయస్థానంలో వినిపించే అవకాశ ముంటుంది. వీళ్ళు నాకు ఆపాటి అవకాశమైనా ఇవ్వలేదు” అని బాధపడ్డాడు అపూ. నిస్సహాయతతో, అవమానంతో కుంగిపోయాడు.

అతడు వెళ్ళిపోవాల్సిన రోజు దగ్గరపడుతుండగా ఓ రోజున పోస్ట్‌మేన్ ఓ బరువైన కవరు తెచ్చిచ్చారు. దానిపైనున్న రాత తనకు పరిచితమైనది కాదు. ఇంత పెద్ద ఉత్తరం తనకు రాసేవాళ్ళెవరా, అని ఆశ్చర్యపడుతూ దాన్ని తెరిచాడు అపూ.

నాలుగైదు వాక్యాలు చదవగానే అర్థమయింది – లీల రాసిందని. అతని ఒంట్లో రక్తమంతా ఒక్కసారిగా తలలోకి చిమ్మినట్టయింది. తన కళ్ళను తాను నమ్మలేనట్టన్పించింది. తెల్లని కాగితంపై గుండ్రని చిన్న అక్షరాల వరుసలతో తొమ్మిది పేజీల ఉత్తరమది.

"ప్రియమైన అపూర్వా,

కొన్ని సంవత్సరాలుగా నీ గురించి ఏ కబురూ లేదు. నువెక్కడున్నావో తెలుసుకోవాలని ఎంతగానో ప్రయత్నించినా లాభంలేకపోయింది. నేను కలకత్తాకు వచ్చినప్పుడు తమ్ముణ్ణి మీ ఇంటికి పంపాను. నువ్వు అక్కణ్ణించి వెళ్ళిపోయావని తెలిసింది.

ఇక్కడ నా పరిస్థితేమీ బాగాలేదు. నా జీవితం చివరికి ఇలా అవుతుందని ఎన్నడూ ఊహించనైనా లేదు. మనసు బాధపడినప్పుడల్లా నువ్వు గుర్తొస్తావ్. ఇలాంటి అశాంతితోనే నువ్వు కూడా బతుకుతున్నావని తోచి, మరింత వేదన కలుగుతుంది. ఇటీవల వినూ ఉత్తరం రాస్తూ నీ చిరునామా ఇచ్చాడు.

బర్ద్వాన్‌లో మా ఇల్లు గుర్తుందిగా? నాకెన్నో తీపి జ్ఞాపకాలను అందించిన ఇల్లది. కానీ, ఇప్పుడు అక్కడ ఉండటానికే వీల్లేని పరిస్థితి. మా చిన్నాన్న చనిపోయాడు. వాళ్ళబ్బాయి రమణ్‌దా, అన్ని విధాలా దిగజారిపోయాడు. అతడి ప్రవర్తన మరీ అమానుషంగా తయారయింది. తన వాటాకు రావలసిన ఆస్తంతా ఇప్పటికే తాకట్టుపెట్టేశాడు. ఇప్పుడు వినూ వాటాలో ఆస్తిని కూడా కాజెయ్యటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇటువంటి పరిస్థితులొస్తాయని కలలోనైనా ఊహించామా?"

ఇలా సాగింది లీల ఉత్తరం. ఆ అక్షరాల నిండుగా తొణికిసలాడుతున్న ఆత్మీయత అపూ హృదయాన్ని సేదతీర్చింది. రెండేళ్ళుగా బాధిస్తున్న ఒంటరితనం ఒక్కసారిగా చెదిరిపోయినట్టన్పించింది. ఆ రాత్రంతా ఆలోచనలతో నిద్రపట్టలేదు.

తనను గురించి ఆలోచించి, వేదనపడే లీల ఉండగా తనకిక లోటేముంది? ఆమె మళ్ళీ కనబడుతుందో, లేదో తెలీదు. కానీ, ఆమె అందించిన స్నేహ మాధుర్యం తన హృదయంలో శాశ్వతంగా నిలిచిపోతుంది.

లీల ఉత్తరం వచ్చిన పన్నెండు రోజుల తర్వాత, అపూ ఆ ఊరి నుండి వెళ్ళిపోయాడు. విద్యార్థులందరూ కలిసి అతడికి ఘనంగా వీడ్కోలు చెప్పాలని ప్రయత్నాలు మొదలెట్టారు. హెడ్మాస్టరుకు ఈ విషయం తెలియగానే వాళ్ళను పిలిపించి కోప్పడ్డాడు. చెడు నడత కారణంగా ఉద్యోగం నుండి తొలగించబడిన మనిషికి వీడ్కోలు పార్టీలివ్వటం వంటి మర్యాదలేమీ పాటించాల్సిన అవసరంలేదనీ, తన మాట వినకపోతే పరీక్షల్లో ఫెయిల్ చేస్తాననీ బెదిరించాడు.

పిల్లలు ఆయనతో వాదించకుండా నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు. ఆ సాయంత్రం జోరున కురుస్తున్న వానను లెక్కచెయ్యకుండా ముప్ఫైమంది విద్యార్థులు ఓ పాకలో సమావేశమయ్యారు. వాళ్ళే రాసుకొచ్చిన వీడ్కోలు సందేశాన్ని చదివి, చక్కని బంతిపూల మాలను అపూ మెడలో వేశారు. అతడితోబాటు గదికి వెళ్ళి సామాన్లు సర్దుకోవటంలో సాయంచేసి, ఎంతో ఆత్మీయంగా సాగనంపారు.

❖ ❖ ❖ ❖

అపూ మళ్ళీ కలకత్తాకు చేరాడు. ఇప్పుడిక తనను నియంత్రించే బంధాలేవీ లేవు. తన మనసుకు తోచినట్టు... స్వేచ్ఛగా లోకసంచారాన్ని సాగించవచ్చు.

ఇలా అనుకోగానే అతడికెందుకో కొడుకు గుర్తొచ్చాడు. ముందుగా వాడినొక్కసారి చూశాకనే, మిగతా విషయాలు ఆలోచించుకోవచ్చునన్పించింది.

ఇంతకాలం కొడుకు గురించి పట్టించుకోనందుకు అపూని అత్తగారు పల్లెత్తు మాటయినా అనలేదు. అతడిపై ఆమె ప్రేమాభిమానాల్లో ఏ మార్పూ రాలేదు.

అపర్ణ పినతల్లి ముద్దొచ్చే ఓ పసివాడినెత్తుకుని అపూ దగ్గరకొచ్చి, "మీ నాన్నొచ్చాడు వెళ్ళరా ఖోకా!" అంటూ వాడిని అతడికి అందించబోయింది. పిల్లవాడికి మూడేళ్ళొచ్చాయి. పచ్చని పసిమిరంగులో మిసమిసలాడుతున్న వాడి నోరూ, చుబుకమూ అచ్చుగుద్దినట్టు అపర్ణవే. కళ్ళు మాత్రం తండ్రివి. మొత్తంమీద తల్లిపోలికలే ఎక్కువ.

అపూ వాడికేసి చేతులు చాపగానే, సిగ్గుగా అమ్మమ్మ భుజంపై ముఖం దాచుకున్నాడు. అపూ మనసు కాస్త చిన్నబోయింది. ఐతే, ఆ సాయంత్రానికల్లా తండ్రీ కొడుకులకు స్నేహం కలిసింది. "బాబా" అని తండ్రిని పిలవటం కూడా మొదలెట్టాడు.

వాడి వచ్చీరాని మాటలు వింటుంటే అపూ హృదయంలో చిత్రమైన పులకింత. ఆ మాటల్ని తన కొడుకు తప్ప, లోకంలో మరే శిశువూ పలకలేదేమోనన్నంత అపూరూపంగా వాడికేసి చూస్తూండిపోయాడు.

కొడుకు నెత్తుకుని ఊరి బయటికి షికారుకు బయల్దేరాడు అపూ. పిల్లవాడు విరామమన్నది లేకుండా కబుర్లు చెప్తూనే ఉన్నాడు. వాటిలో చాలావరకూ అపూకి అర్థం కాకున్నా, "ఔనా? అప్పుడేమయిందీ?" అంటూ వాడితో మాటలు కలుపూతూ నడుస్తున్నాడు.

ఓ చిన్న వంతెన దగ్గరికి రాగానే , "అటు, అలా కిందికెల్దాం బాబా, అక్కణ్ణించి కుహూ, అనాలి" అన్నాడు ఖోకా. అపూ వాడినెత్తుకుని వంతెన దిగువగా ఉన్న తోట దగ్గరికి నడిచాడు.

"కుహూ... అంటానన్నావుగా" గుర్తుచేశాడు అపూ.

"కుహూ..." అంటూ గొంతెత్తి పలికాడు ఖోకా. వాడి నాజూకైన లేత గొంతు పిల్లనగ్రోవిలా పలికింది.

"నువ్వూ అలాగే అను బాబా!" అంటూ గారాలు పోయాడు పిల్లవాడు. "కుహూ!" అన్నాడు అపూ నవ్వుతూ.

తిరిగి ఇంటికి వెళ్తున్నంతసేపూ ఎన్నో కబుర్లు చెప్పాడు ఖోకా. ఈ ఊరి ఆకాశంలో పెద్ద చందమామ వస్తుందట. పిన్నీవాళ్ళ ఊరికెళ్ళినప్పుడు చూస్తేనేమో చందమామ చిన్నదైపోయిందట. "వాళ్ళకు బుల్లి చందమామ ఉందేం బాబా?" అని అడిగాడు తండ్రిని.

అపూ కలకత్తాకు బయల్దేరే రోజున అపర్ణ తల్లి అతణ్ణి దగ్గరకు పిలిచి, "నా బిడ్డను పోగొట్టుకున్న బాధ నా మనసులోంచి ఎన్నటికీ పోదు. కానీ... నిన్ను చూస్తుంటే నా గుండె మరింతగా తరుక్కుపోతోంది నాయనా! నువ్వు అందరివంటి వాడివి కాదని నాకు మొదటినుండీ తెలుసు. మీ అమ్మే గనుక బతికి ఉందుంటే నిన్నిట్లా ఒంటరి బతుకు బతకనిచ్చేదా చెప్పు? మళ్ళీ పెళ్ళిచేసుకోమని చెప్పదూ? నీ బిడ్డ సంగతి కూడా ఆలోచించు బాబూ! వాడికి తల్లి ప్రేమ కావాలి. ఆలోచించు!" అంది.

పడవలో ప్రయాణిస్తున్న అపూ హృదయంలో కలవరం. గతంలో ఇదే దారిన అపర్ణతో కలిసి చేసిన ప్రయాణం గుర్తొస్తోంది. ఖుల్నా రేవులో దిగి, స్టీమరు కోసం ఎదురుచూస్తోంటే తనూ, అపర్ణా బసచేసిన గది కనబడింది. తమ సంసారయాత్రలో మొదటి మజిలీ అదే. ఆ మధుర క్షణాలు ఇంత త్వరగా అంతరించిపోతాయనీ, కేవలం ఒక స్మృతిగా మిగులుతాయనీ అనుకున్నాడా?

ఆరోజు అపర్ణ వంటచేసిన ఆ కుంపటి అక్కడింకా అలాగే ఉందా? భార్య చేతి వంటను తొలిసారిగా ఆరగిస్తూ తను కూర్చున్న ఆ చోటు ఇప్పుడెలా ఉందో? ఆమె ట్రంకు పెట్టెను తెరిచి అద్దమూ, దువ్వెనా తీసిచ్చింది కూడా అక్కడే కదూ! ఒక్కసారి ఆ గదిలోకి వెళ్ళిచూడాలని గాఢమైన కోరిక కలిగిందతనికి.

కలకత్తా రైల్లో కిటికీ పక్కన కూర్చుని బయటికి చూస్తున్న అపూ మనసు నిండా అపర్ణ రూపం నిండిపోయింది. ఆ రోజు తన అల్లరికి కోపం తెచ్చుకుని "నేనిక మీతో ఎక్కడికీ రాను. గుర్తుంచుకోండి...ఎప్పటికీ రాను!" అన్న అపర్ణ మాటలు ఇప్పుడు వింటున్నట్టుగా ఉంది.

కలకత్తా చేరి ఓ బోర్డింగ్ హౌస్‌లో దిగాడు అపూ. గదిలో మంచంపై పడుకుంటే రకరకాల ఆలోచనలు చుట్టుముట్టాయి. ఇప్పుడిక పొద్దున్నే లేచి ఆఫీసుకో, స్కూలుకో పరిగెత్తాలన్న తొందరలేదు. అన్న బంధాల నుండీ విముక్తమైన మనిషి తాను. పూర్తిగా స్వతంత్రుడు... స్వేచ్ఛాజీవి! ఒంటరి బాటసారి!

ఈ ఆలోచనకు అతడి శరీరం సన్నగా కంపించింది.

ఆ రోజంతా నగరంలో తిరుగుతూ గడిపాడు. ఆయుర్వేద ఔషధాలమ్మే మిత్రుడు గుర్తొచ్చి, మరునాడు అతడి దగ్గరికి బయల్దేరాడు.

ఈసారి పళ్ళపొడులు తయారుచేసి అమ్ముతున్నాడు ఆ మిత్రుడు. ఏవో ఆకులనూ, మూలికలనూ రోళ్ళలో దంచుతున్న భార్యాభర్తలిద్దరూ అపూని చూసి సంతోషంగా స్వాగతం పలికారు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిపోయిందని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అయినా, తనకు ఆతిథ్యం ఇవ్వాలని వాళ్ళు తపన పడటం చూసి చలించిపోయాడు అపూ. తిండికి మొహంవాచినట్లున్న ఆ కుటుంబానికి ఏదయినా సాయం చెయ్యాలి. తాను కొన్నాళ్ళపాటు యాత్రలు చెయ్యాలనుకుంటున్నాననీ, ఆ సందర్భంగా అందరం విందు చేసుకుందామనీ చెప్పి ఒప్పించాడు.

మిత్రుడిని వెంటబెట్టుకుని బజారుకు వెళ్ళి అవసరమైన సరుకులన్నీ కొని తెచ్చాడు. ఆ కుటుంబం...ముఖ్యంగా ఆ ఇంటి ఇల్లాలు చూపిన ఆత్మీయత అపూ హృదయానికి ఓదార్పునిచ్చింది. అతడు భోజనం చేస్తున్నంతసేపూ పక్కనే కూర్చుని కొసరి కొసరి వడ్డించిందామె. "మళ్ళీ ఎప్పుడొస్తావ్ అపూ?" అని అడిగింది.

"ఏమో, వదినా! నాకూ తెలీదు. కొంతకాలం దూరంగా వెళ్ళాలనుంది".

"ఎందుకీ ఒంటరి జీవితం? మళ్ళీ పెళ్ళిచేసుకోకుండా ఇట్లా సన్యాసిలా దేశాటన చెయ్యాల్సిన అవసరమేమిటి? మీ అమ్మే బతికుంటే నిన్నిలా వెళ్ళనిచ్చేదా?" అందామె ఎంతో బాధపడుతూ.

"ఏమో, అది సాధ్యపడుతుందని నా మనసుకు తోచటం లేదు వదినగారూ! ఎంతోకాలం తర్వాత ఇవాళ మీ అందరితో సంతోషంగా గడిపాను, కృతజ్ఞతలు. నేను తిరిగి రావటమంటూ జరిగితే తప్పకుండా మీ ఇంటికొస్తాను, నమస్కారం!"

అపూ నడిచిపోతున్న వైపే విచారంగా చూస్తూ నిలబడిపోయింది ఆమె.

ఆ మరునాడు సాయంత్రం కలకత్తా నుండి గయకు వెళ్ళే రైలెక్కాడు అపూ.

## 17

గయకు చేరుకున్న అపూ, విష్ణుపద ఆలయానికి వెళ్ళి తన పితృదేవతల ఆత్మశాంతికై పూజలు నిర్వహించాడు. గయలో ఈ క్రతువు జరపటం వలన మరణించిన వారికి పుణ్యలోకాలు సిద్ధిస్తాయని హిందువులు విశ్వసిస్తారని అతడికి తెలుసు. కానీ, దాన్ని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాడో లేదో అతనికే స్పష్టతలేదు. ఐనాసరే, దానిలో ఏమాత్రం సత్యమున్నా మంచిదేనన్పించింది. తల్లిదండ్రులకూ, అక్కకూ, తన బాల్య స్మృతుల్లో అస్పష్టంగా కదలాడే మేనత్తకూ కూడా పిండ ప్రదానం చేశాడు.

ఆ సాయంత్రం బుద్ధగయను సందర్శించాడు. వేలాది సంవత్సరాల కిందట బుద్ధుడు తన రాజప్రాసాదాన్నీ, తన నవజాత శిశువు ముద్దుమురిపాలనూ పరిత్యజించి జ్ఞానాన్వేషణకై బయల్దేరిన ఆ రాత్రిని తలచుకుంటే అపూ ఒళ్ళు గగుర్పొడిచింది. తన కొడుక్కి అమితాబ్ అని పేరుపెట్టాలని నిర్ణయించుకున్నాడు.

మరునాడు గయ నుండి ఢిల్లీకి బయల్దేరాడు. అతనికి ఎదురుగా ఉన్న సీట్లలో ఓ బెంగాలీజంట ప్రయాణిస్తోంది. అపూ కూడా బెంగాలీయేనని తెలిసి ఎంతో సంతోషించి, మాటలు కలిపారు వాళ్ళు. రైలు కిటికీలోంచి కనబడుతున్న ప్రకృతి దృశ్యాలకు మైమరచిపోతున్న అతడికి వాళ్ళతో సంభాషణ కొనసాగించాలన్న ఆసక్తి కలగడంలేదు.

ఆ రాత్రి వాళ్ళు భోజనం చెయ్యబోతూ, అపూని కూడా ఆహ్వానించారు. అతడు మొహమాటపడ్డాడు. కానీ, "ఈ రైల్లో దొరికే భోజనం బావుండదు. మా దగ్గర చాలా ఫలహారాలున్నాయి, రండి" అంటూ బలవంతపెట్టడంతో అతడికి తప్పలేదు.

అపూకిది కొత్త అనుభవం. నగరంలో ఏళ్ళతరబడి ఒకే వీధిలో నివసించిన వ్యక్తులైనా అపరిచితులుగానే మిగిలిపోతుంటారు. ఇంత కొద్దిపాటి పరిచయానికే తనతో సన్నిహితంగా మెలగటం వీళ్ళకెలా సాధ్యమవుతోందో!

ఆ బెంగాలీ ఆయన అటవీ శాఖలో పనిచేస్తున్నాడట. నాగపూర్ దగ్గరున్న ప్రభుత్వ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉద్యోగం. అపూకి తన చిరునామా ఇచ్చి, వీలయినప్పుడు రమ్మని ఆహ్వానించాడు. మొగల్‌సరాయ్ స్టేషన్‌లో వాళ్ళు దిగేటప్పుడు సామాన్లు దించటంలో సాయపడ్డాడు అపూ. "మీ ఆహ్వానాన్ని నేను నిజంగా ఉపయోగించుకుంటానండోయ్, తప్పకుండా మీ అడవికొస్తాను" అన్నాడు. వాళ్ళు నవ్వుతూ సెలవు తీసుకున్నారు.

రైలు ఢిల్లీలో ప్రవేశించేసరికి రాత్రి పదకొండున్నరయింది. ఆ నగరాన్ని గురించి అపూ మనసులో ఏనాటినుండో ఒక ఊహా చిత్రం ఏర్పడిపోయింది. అతడి దృష్టిలో ఢిల్లీ అంటే ఎస్. కపూర్‌కో, చట్టసభకో, ఏషియాటిక్ పెట్రోలియం కంపెనీకో సంబంధించిన నగరం ఎంతమాత్రమూ కాదు. అతడి ఢిల్లీ మహాభారత కాలంనాటి ప్రాచీన మానవులకు సంబంధించినది. ఈ నగర నిర్మాణానికి ఉపయోగించిన ప్రతి ఇటుకా, అతడు కథల్లో, నవలల్లో, కవిత్వంలో, చరిత్ర గ్రంథాలలో చదివిన సమాజానికి చెందినది; ఇక్కడి ప్రతి ఇసుక రేణువూ భీష్ముడి నుండి సదాశివరావు దాకా, గాంధారి నుండి జహనారా దాకా గల అతడి అభిమాన నాయికా, నాయకుల పాదస్పర్శతో పునీతమైనది.

ఐతే, అది అర్ధరాత్రి కావటంతో ఢిల్లీ నగర స్వరూపమేమిటో అతడికి అంతుబట్ట లేదు. కొద్దిసేపయ్యాక "ఢిల్లీ జంక్షన్ ఈస్ట్" అనే బోర్డూ, గ్యాసోలిన్ టాంక్ ఒకటి కనబడ్డాయి. అక్కడున్న బోర్డుల మీద పియర్స్ సబ్బు, కీటింగ్స్ పౌడరూ, హాల్స్ డిస్టెంపర్, లిప్టన్‌టీ వంటి వస్తువుల తాలూకు వ్యాపార ప్రకటనలున్నాయి.

తన బట్టలు సంచీ, పక్కచుట్టా పట్టుకుని రైలు దిగాడు అపూ. ఆ నగరంలో తనకు తెలిసిన వాళ్ళెవరూలేరు. ఆ నడిరేయి సమయాన బయటికి వెళ్ళటంకన్నా స్టేషన్లో ఉండడమే మంచిదన్పించి రైల్వే వెయిటింగ్ రూమ్‌లో పడుకున్నాడు. తెల్లవారగానే సామాన్లను లగేజి రూమ్‌లో ఉంచి నగరంలోకి బయల్దేరాడు.

అతడూహించిన ప్రాచీన సంస్కృతి ఛాయలేవీ ఈ ఆధునిక ఢిల్లీ నగరంలో కనబడ లేదు. అది దాదాపుగా కలకత్తా నగరం వలెనే ఉంది. అక్కడి వ్యాపార ప్రకటనలూ, ప్రసిద్ధమైన దుకాణాలే ఇక్కడా ఎదురవుతున్నాయి.

దారిలో పరిచయమైన ఇద్దరు పర్యాటకులతో కలిసి కుతుబ్‌మినార్‌కు చేరాడు అపూ. ప్రధాన నగరానికీ, ఈ ప్రాంతంలోని దృశ్యాలకూ పోలికే లేదు. రోడ్డుకిరువైపులా విస్తరించిన ఎడారి వంటి మైదానంలో బ్రహ్మజెముడు పొదలు మొలిచాయి. శిథిలావస్థలో నున్న ఇళ్ళూ, మసీదులూ, మినార్‌లూ, సమాధులూ, పాడుబడిన గోడలూ, దర్వాజాలూ చెల్లాచెదురుగా ఉన్నాయి. పృథ్వీరాజు సామ్రాజ్యమూ, బానిస వంశాలూ, తుగ్లక్‌లూ, సిరి, జహాపనా, మొగల్ వంశాల రాజ్యాలూ – మొత్తం ఐదు మహాసామ్రాజ్యాల సుప్తాస్థికలు ఈ ఎగుడు దిగుడు నేల అడుగున, ఈ ముళ్ళపొదల కింద శాశ్వతమైన నిశ్శబ్దంలో లీనమయ్యాయి. ఆ ప్రాంతాన్ని చూస్తున్న అపూ మనసులో అక్కడి ప్రాచీన చరిత్రంతా సినిమాలో దృశ్యాలవలె ప్రత్యక్షమయింది. కంటికి కనబడే ప్రతి అంశానికీ కాల్పనికతను జోడించి దర్శించే ప్రవృత్తి వల్లనే అపూ ఇంతటి పరవశానికి లోనయ్యాడేమో!

కుతుబ్‌మినార్ నుండి తుగ్లకాబాద్‌కు చేరాడు అపూ. ఘియాజ్–ఉద్–దిన్ తుగ్లక్ నిర్మించతలపెట్టిన అసంపూర్ణనగరమది. ఐనా దానిలో ఒక చిత్రమైన సౌందర్యం ఉందన్పించిందతనికి.

పృథ్వీరాజు కోటపై నిలబడిన అపూ మనసుకు అసంకల్పితంగానే నిశ్చిందిపురం గుర్తుకొచ్చింది. తన చిన్నతనంలో పృథ్వీరాజు కథను చదివిన అపూ, కోటకు ఎదురుగా ఉండే సరస్సు గట్టున కూర్చుని ఉన్నట్టుగా ఆ రాజును గురించి ఊహించుకుంటుండేవాడు. ఇక్కడ కూడా ఓ సరస్సు ఉంది. దానినిండా పాకుతున్న నత్తలను చూసి అపూకి నవ్వొచ్చింది.

కొద్దిసేపటి తర్వాత ఆ ఎడారి భూమిపై చీకట్లు పరుచుకోసాగాయి. అనేక సామ్రాజ్యాల ఉత్థాన పతనాల గాథను తన అగ్ని కిరణాల అక్షరాలతో ఆకాశంపై లిఖించటం పూర్తిచేసిన సూర్యుడు, పడమటి దిక్కున విశ్రమించటానికి వెళ్తున్నాడు. ఆ క్షణాల ప్రకృతి సౌందర్యంలో అలౌకికమైన అనుభూతిని పొందాడు అపూ. ఏ అదృశ్య దేవతలో తన చెవుల్లో గుసగుసలాడుతున్నట్టుగా తోచింది. భయసంభ్రమాలతో అతడి ఒళ్ళు గగుర్పొడిచింది.

మరో రెండు రోజులపాటు ఢిల్లీలోని మిగతా చారిత్రక స్థలాలన్నింటినీ సందర్శించాడు అపూ. నిజాముద్దీన్ ఆలియా మసీదుకు ఒక పక్కగా నిరాడంబరంగా నిలిచిన జహనారా సమాధిని చూసి అతడికి కన్నీళ్ళొచ్చాయి. సంపదలో, అధికారంలో పుట్టిపెరిగిన రాజకుమారి అయివుండి కూడా నిరాడంబరమైన సామాన్య జీవితాన్ని ప్రేమించిన ఆమెపై అపూ హృదయంలో ఏనాటినుండో గొప్ప ఆరాధన ఏర్పడింది. మసీదు

వెలుపల అమ్ముతున్న గులాబీలను కొనుక్కొచ్చి, జహనారా సమాధిపై ఉంచాడు. సమాధిపైనున్న శిలాఫలకం మీద చెక్కిన పర్షియన్ కవితలను ఆ మసీదులోని ఒక వృద్ధ ముస్లిమ్‌నడిగి చదివించుకొని వాటిని తన నోట్ పుస్తకంలో రాసుకున్నాడు. ఆ తరువాత ప్రసిద్ధ కవి అమీర్ ఖుస్రో సమాధిని కూడా దర్శించి, గులాబీలు సమర్పించాడు.

మరుసటి రోజు సాయంత్రం షాజహాన్ నిర్మించిన ఎర్రకోటను చూశాడు. దివాన్–ఎ–ఖాస్ పక్కనున్న ఆవరణలో ఒక సిమెంట్ బెంచిపై కూర్చున్న అపూ మనసులో ఎన్నో ఆలోచనలు. ఒకనాడు ఇక్కడ విలసిల్లిన ప్రజాజీవనాన్ని గురించి కాల్పనిక గాథలు ప్రచారమైనంతగా వాస్తవాలు నమోదు కాలేదన్పించింది. జేబున్నిసా, ఉదిపురి బేగం, ముంతాజ్, జహనారా వంటి వ్యక్తుల గురించి పుస్తకాల్లో రాసిన విషయాల్లో ఈ కాల్పనికతే ఎక్కువ. నిజ జీవితంలో వాళ్ళెలా జీవించారో? ఈ ప్రదేశానికి సంబంధించిన మార్మిక గాథలను ఎవరెరుగుదురు? మౌనంగా ప్రవహించే ఈ యమున, ఈ భవనాల పునాదుల్లోని ప్రతి ఇటుకా తప్ప ఆ వాస్తవ చరిత్రకు సాక్షులెవరున్నారని?

❖ ❖ ❖ ❖

మూడు రోజుల తర్వాత, రైల్లో ప్రయాణిస్తున్న అపూ ఒక చిన్న స్టేషన్‌లో దిగాడు. కొన్నాళ్ళుగా అతడికి సరైన స్నానమూ, భోజనమూ లేవు. జుట్టంతా చిందర వందరగా ఉంది. గాలికి పెదవులు ఎండిపోయాయి. దగ్గరున్న డబ్బు కూడా దాదాపుగా అడుగంటి పోయింది.

ఆ స్టేషన్ చాలా చిన్నది. పరిసరాల్లో ఒక్క దుకాణమైనా కనబడటం లేదు. స్టేషన్ వెలుపల బాట పక్కనే తన పక్కచుట్ట విప్పి పరుచుకొని కూర్చున్నాడు. ఎటు వెళ్ళాలో, తన తిండీ తిప్పల మాటేమిటోనన్న బెంగ లేదతడికి. చిత్రమైన ఉద్విగ్నత అతడి మనసు నావరించింది.

కొద్దిసేపటి తర్వాత గోండు జాతికి చెందినవాడిలా ఉన్న ఓ యువకుడు అటువైపుగా వెళ్తూ, అపూని చూసి ఆగిపోయాడు. అతడి నోట్లో అడవి ఆకులతో చుట్టిన ఓ చుట్ట వెలుగుతోంది.

"ఉమేరియా ఇక్కడికెంత దూరం?" తనకేసి కుతూహలంగా చూస్తూ నిలబడిన ఆ యువకుడిని హిందీలో ఆడిగారు అపూ. ఆ వ్యక్తికేమీ అర్థమయినట్టు లేదు. అదే ప్రశ్నను మళ్ళీ నిదానంగా, అక్షరాలు విడదీస్తూ అడిగాడు అపూ.

"తీస్ మీల్" జవాబిచ్చాడు యువకుడు. ఉమేరియా వెళ్ళాలంటే దట్టమైన అడవులూ, పర్వత మార్గాల గుండా వెళ్ళాలని కూడా అతడి మాటల ద్వారా అపూకి అర్థమయింది. వెంటనే బయల్దేరాలని ఉత్సాహం కూడా కలిగింది. కానీ, ఎలా వెళ్ళటం?

ఆ యువకుడే దీనికి పరిష్కారం చూపాడు. మూడు రూపాయలిస్తే తన గుర్రాన్ని అద్దెకిస్తానన్నాడు. కానీ రాత్రివేళ అరణ్యమార్గాన ప్రయాణించడం క్షేమం కాదనీ, మరునాడు ఉదయాన్నే వెళ్దామనీ సలహా ఇచ్చాడు.

వెంటనే బయల్దేరుదామని పట్టుపట్టాడు అపూ. పండు వెన్నెల్లో అడవి సౌందర్యాన్ని ఆస్వాదించే అవకాశాన్ని వదులుకునేందుకు అతడి మనసెంత మాత్రమూ అంగీకరించ లేదు.

ఆ చలిరేయి గాఢ నిశ్శబ్దంలో దట్టమైన మద్దిచెట్ల వనంగుండా ప్రయాణం మొదలైంది. మిణుగురులు గుంపులుగా ఎగురుతున్నాయి. ఆకుల సందుల నుండి తొంగి చూస్తున్న వెన్నెల తెలుపూ, నలుపూ దారాలతో అల్లిన వలలా భూమిని కప్పివేసింది.

అడవి చాలా దట్టంగా ఉంది. దారి పొడవునా సన్నని పిల్లకాలువలు ఎదురవుతూనే ఉన్నాయి. మరికొంత దూరం వెళ్ళాక ఓ నది సన్నగా ప్రవహిస్తోంది. దాని గట్టుపైనున్న రాళ్ళ మధ్యన ఏవో మొక్కలు పెరిగాయి. అడవిపూల పరిమళంతో గాలి మత్తెక్కింది. అప్పుడప్పుడూ వినబడే నిశాచర పక్షుల కూజితాలు తప్ప అంతటా గాఢమైన నిశ్శబ్దం.

మరునాడు ఉదయం ఏడున్నరకు ఉమేరియాకు చేరారు అపూ, అతని వెంట వచ్చిన ఆదివాసీ యువకుడు. అది చాలా చిన్న పల్లెటూరు. పోస్టాఫీసూ, చిన్న దుకాణాలూ కనబడుతున్నాయి. అపూతోబాటు ఢిల్లీ రైల్లో వచ్చిన అటవీశాఖ ఉద్యోగి అవనీ మోహన్ బసు ఉండేది ఇక్కడే. అపూ రాకకు ఆశ్చర్యపడుతూ స్వాగతం పలికాడాయన. "మీరొస్తున్నట్టు ఉత్తరమైనా రాయలేదే! రాత్రంగా అడవిలో ప్రయాణం చేసొచ్చారంటే... మహా ఘటికులండీ మీరు!" అన్నాడు నవ్వుతూ.

తన పర్సులో నాలుగు రూపాయలు మాత్రం ఉంచుకుని, మిలిగిన డబ్బులు ఆదివాసీ యువకుడికి ఇచ్చి పంపాడు అపూ.

అవనీ మోహన్ భార్య అపూని చూసి సంతోషించింది. త్వరగా వంటచేసి, భోజనం వడ్డించింది.

"మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికొచ్చాను వదినగారూ" అన్నాడు అపూ.

"నాకే ఇబ్బందీ లేదు. మీరు రాకపోతేనే బాధపడేవాళ్ళం" అందామె చిరునవ్వుతో.

రాయ్ చౌదురి అనే మరో బెంగాలీ ఆయన కూడా అప్పుడప్పుడూ ఇక్కడి కొస్తుంటాడనీ, ఆయన భూగర్భశాస్త్రవేత్తగా అమెరికాలో పనిచేసి వచ్చాడనీ, ఈ ప్రాంతాల్లో రాగి గనుల కొరకు తవ్వకాలు జరిపే పనిలో ఉన్నాడనీ చెప్పాడు అవనీ మోహన్.

ఫారెస్ట్ కార్యాలయం దగ్గర ఖాళీగా ఉన్న ఒక బంగళాలో అపూకి బస ఏర్పాటయింది. బసు దంపతులతో కొద్దిరోజుల్లోనే ఎంతో సాన్నిహిత్యం ఏర్పడింది. నగరంలో ఉండే వత్తిడులూ, కృత్రిమ మర్యాదలూ లేని ప్రకృతి ఒడిలో మనుషుల నడుమ సహజమైన స్నేహం ఏర్పడుతుందేమోనన్పించింది అపూ మనసుకు.

వివిధ సందర్భాల్లో తనలో కదిలే ఊహలన్నిటినీ నోట్‌బుక్‌లో రాసుకునే అలవాటు అపూ చిన్ననాటి నుండి కొనసాగుతూనే ఉంది. అలాగే ఒకరోజు తను యథాలాపంగా రాసుకున్న వాక్యాలను తిరిగి చదువుకున్న అపూ ఆశ్చర్యపడ్డాడు. అదొక కథాగేయంగా రూపొందింది. కాశీలో ఉన్నప్పుడు తన తండ్రి రాసి, గానంచేస్తుండిన గేయాలవంటిదే ఇది. బసు భార్య తనకు టీ పట్టుకొచ్చినప్పుడు "దీదీ, ఇవాళ నీకో కొత్తపాట విన్పిస్తాను" అన్నాడు అపూ. ఈ మధ్య అతడామెను దీదీ అని పిలుస్తున్నాడు.

"పాటా?" అందామె ఉత్సాహంగా. "నువ్వు పాటల పాడతావని నాకెందుకో అన్పిస్తూనే ఉండేది. మా వారితో కూడా ఆ మాట చెప్పాన్నేను. చాలా కమ్మని కంఠం నీది" అంది.

ఆ రాత్రి బసు దంపతులతోబాటు వెన్నెల్లో కూర్చుని, తను రాసిన కథాగేయాన్ని ఆలపించాడు అపూ. తండ్రి పాడుతుండిన రీతిలోనే తన గానం సాగుతోందన్న విషయాన్ని అతడు గమనించనే లేదు. రామాయణంలోని భరతుడి త్యాగశీలాన్ని వర్ణించే గేయమది. ఆ పాటలోని విషాదానికి తమ పత్రాలను కదిలిస్తూ సానుభూతి పలికాయి శాలవృక్షాలు. పక్షులు తమ కూజితాలతో అతడి దుఃఖాన్ని పంచుకున్నాయి. శ్రోతలిద్దరూ మంత్రగ్ధుల్లా కూర్చుండిపోయారు. పాట పూర్తిచేసిన అపూనే ముందుగా తేరుకుని, "ఎలా ఉంది నా పాట?" అన్నాడు నవ్వుతూ.

బసు గతంలో ఎన్నోసార్లు ఇటువంటి కథాగానాన్ని విన్నాడు. కానీ అపూ గొంతులోని తాదాత్మ్యత ఎవరిలోనూ వినలేదన్పించింది. అతడి భార్య పాటలో పూర్తిగా లీనమైపోయింది. ఆమె కళ్ళు నిండి, చెంపల మీదుగా రాలుతున్న కన్నీటి ముత్యాలు వెన్నెల్లో మిలమిలా మెరిశాయి. ఆమె నోట మాటరాలేదు. సంతానంలేని ఈ దంపతులు ఎంతోకాలంగా అటవీ ప్రాంతాల్లో ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. ఇంత అద్భుతమైన అనుభవాన్ని పొందిన సందర్భాలు వాళ్ళ జీవితంలో అరుదయ్యాయి.

రెండు రోజుల తరువాత రాయ్ చౌదురి ప్రత్యక్షమయ్యాడు. దాదాపు నలబయ్యేళ్ళుంటాయి. ఎత్తుగా, దృఢంగా, అందంగా ఉన్నాడు. జుట్టు అక్కడక్కడా తెల్లబడుతోంది. తాగుడు అలవాటుందని ఆయన్ని చూడగానే గ్రహించవచ్చు. ఆయనతో బాటు అవనీ బసు కూడా తాగటమే అపూని ఆశ్చర్యపరిచింది.

"మీ గురించి అన్ని సంగతులూ విన్నాను అపూర్వ బాబూ! మీరెంత చక్కటి కళాకారులో నా మిత్రుడు చెప్పాడు. ఐనా మీ కళ్ళు చూస్తేనే మీలోని సృజనశక్తి తెలిసి పోతుందనుకోండి." అన్నాడు రాయ్ చౌదురి. అపూ రాసిన గేయాన్ని అడిగి పాడించుకుని విన్నాడు.

రాయ్ చౌదురి వెళ్ళిపోయిన మూడు రోజుల తరువాత ఆయన ఆఫీసు నుండి ఒక బంట్రోతు, అపూకొక ఉత్తరం తెచ్చిచ్చాడు. గనుల తవ్వకం జరుగుతున్న ప్రాంతంలో

పర్యవేక్షణ కొరకు ఒక ఉద్యోగిని నియమించుకోవాలని అనుకుంటున్నాననీ, అపూ అంగీకరిస్తే అతడికే ఆ ఉద్యోగం ఇస్తాననీ అందులో రాశారు రాయ్‌చౌదురి. భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటుచేస్తూ నెలకు యాభై రూపాయల జీతం ఇస్తారట.

ఊహించని ఈ ప్రతిపాదనకు ఆశ్చర్యపడ్డాడు అపూ. అతడి దగ్గర చిల్లర డబ్బులు తప్ప, ఏమీ మిగల్లేదు. బసు దంపతులు ఎంత ఆత్మీయంగా చూసుకుంటున్నప్పటికీ, శాశ్వతంగా వారిపై ఆధారపడటం సరైనది కాదు. ఈ విషయాలన్నీ ఆలోచించిన తరువాత తన అంగీకారాన్ని తెలిపాడు అపూ.

మూడు రోజుల తరువాత, రాయ్ చౌదురి పంపిన గుర్రంపై ప్రయాణమయి వెళ్తున్న అపూకి విచార వదనాలతో వీడ్కోలు పలికారు బసు దంపతులు.

రాయ్ చౌదురి బంగళాకు చేరటానికి ఇరవైమైళ్ళ దూరం దట్టమైన అడవి దారిన ప్రయాణం చెయ్యాలి. అది ఏప్రిల్ మాసమైనా చలి వణికిస్తోంది.

రాగి గనుల తవ్వకం జరుగుతున్న ప్రాంతంలో నాలుగైదు విశాలమైన పాకలు కనబడ్డాయి. కూలీలు ఉండటానికి పెద్ద గుడారాలను ఏర్పాటు చేశారు. చుట్టూ దట్టమైన అడవీ, పర్వత పంక్తులూ అవరించి ఉన్నాయి.

## 18

**అ**పూ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. ఏనాటి నుండో తాను కలలుగన్న జీవితమిది. తన స్వప్నాలు వాస్తవ రూపందాల్చే రోజు వస్తుందని అతడెన్నడూ ఊహించలేదు.

గనుల తవ్వకం జరుగుతున్న ప్రాంతానికీ, ఉద్యోగులు బసచేస్తున్న ప్రాంతానికి నడుమ పద్దెనిమిది మైళ్ళ దూరం ఉంది. అపూ కొరకు ఒక గుర్రాన్ని ఏర్పాటు చేశాడు రాయ్ చౌదురి.

ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించే స్వభావమున్న అపూ, ఈ అడవి అందాలకు ముగ్ధుడయ్యాడు. ఉద్యోగులూ, కూలీలు నివసించే కుటీరాలకు ఎదురుగా కనుచూపుమేర దాకా దట్టంగా విస్తరించిన వృక్షాలూ, దక్షిణ దిశగా కనబడే పర్వత శ్రేణులూ ఎంతో సుందరమైన వాతావరణాన్ని కల్పించాయి. ఎత్తుగా, వరుసగా నిలబడిన గ్రానైట్ కొండలపై సంధ్యాకిరణాలు ప్రసరించి, కొద్దిగా రాగిరంగుతో మిళితమైన ఎరుపు, బూడిద, నలుపు వర్ణాలుగా వాటిని మార్చే దృశ్యం కనువిందుగా ఉంటుంది.

అపూ ఉద్యోగం శ్రమతో కూడుకున్నది. ఉదయమూ, సాయంత్రమూ నాలుగేసి మైళ్ళు గుర్రంపై ప్రయాణించాల్సి ఉంటోంది. పదహారు మైళ్ళ దూరానున్న రాయ్‌చౌదురి కార్యాలయానికి వారానికి రెండుసార్లు వెళ్ళిరావాలి. ఐనా అతడికి అలసటగా తోచడం

లేదు. దారిపొడవునా కనబడే వృక్షాలూ, సెలయేళ్ళూ, వెదురుపొదలూ అతడి మనసుకు ఆహ్లాదాన్నిచ్చేవి. పేరు తెలియని అడవిపూల పొదలు ఎదురుపడి అతణ్ణి నిలేస్తాయి; మరో ఉదయాన అడవి చేమంతుల గుబుర్లు చిత్రమైన పరిమళంతో స్వాగతం పలుకుతాయి.

ఈ అడవిలో తానూ, తన గుర్రమూ తప్ప మరెవరూ లేని ఏకాంతాన్ని అతడు అనుభూతి చెందుతాడు – కలకత్తాలోని తన ఇరుకు గదిలో ఎదురయిన ఒంటరితనం వంటిది కాదీ అనుభవం. ఈ అడవితో అతి గాఢమైన ప్రేమలో మునిగిపోయాడు అపూ.

జీవితం సాఫీగా సాగిపోతోంది. ఉదయాన్నే ఫలహారం చేసి వెళ్ళిపోయే అపూ, సాయంత్రం తిరిగి రాగానే బావిలోంచి నీళ్ళు తోడుకుని స్నానం చేస్తాడు. అడవిలో కాసే నారింజకాయల రసంతాగి కాస్త విశ్రాంతి తీసుకునేసరికి వంటమనిషి రామ్‌చరిత్ మిశ్రా భోజనం సిద్ధం చేస్తాడు. చపాతీలూ, పప్పూ, కాయగూరలు వండుతాడు. చేపలు మాత్రం ఈ ప్రాంతాల్లో ఎక్కడ దొరకవు. అప్పుడప్పుడూ అడవిలో పక్షుల్ని వేటాడేవాడు అపూ.

ఒకరోజు అతడికొక జింక ఎదురయింది. గుర్రంపైనున్న అపూ రైఫిల్ ఎక్కుపెట్టి దగ్గరగా వచ్చేసినా కదలకుండా అతడికేసి వింతగా చూస్తోందది. తుపాకి పేల్చబోతున్న అపూ చటుక్కున ఆగిపోయాడు. దాని కళ్ళు చూడగానే అతని గుండె జారిపోయింది. అతి నల్లగా, విశాలంగా, స్వచ్ఛంగా...అచ్చం తన కొడుకు కాజల్ కళ్ళలాగే ఉన్నాయి. ఆరోజు నుండి మరెప్పుడూ జంతువులను వేటాడలేదు అపూ.

రాత్రుళ్ళు భోజమయ్యాక అరుబైట కూర్చుని, ఆకాశంలోకి చూస్తుంటే ఎన్ని గంటలయినా గడిచిపోతాయతడికి. నిశ్శబ్దంలో మునిగిపోయిన రాత్రి, నల్లని ఆకాశంలో మెరిసే చుక్కలూ అతడికెప్పుడూ కొత్తగానే తోస్తాయి. విశ్వరహస్యాలను తనలో దాచుకున్నట్టుగా మార్మికంగా తోచే ఆకాశంలో తళుక్కుమనే తారలు చెట్ల కొమ్మల సందుల నుండి తొంగిచూస్తుంటాయి. దూరంగా పర్వత శ్రేణుల మీదుగా పాలపుంత ప్రత్యక్షమవుతుంది. ఉల్కలు తమ నిప్పుల గోళ్ళతో ఆకాశాన్ని చీల్చుకుంటూ భూమిపైకి దూసుకొస్తాయి.

రాత్రి గడుస్తున్నకొద్దీ, తారామండలం దిశల్ని మార్చుకుంటుంది. పాలపుంత ఆకాశం అంచుకు చేరిపోతుంది, శుక్రుడు పడమటి దిక్కుకు మరలి అదృశ్యమయిపోతాడు. వేగుచుక్క ప్రత్యక్షమవటంతోబాటే, తూర్పున వెలుగురేకలు విచ్చుకుంటాయి. తన కళ్ళముందే జరుగుతున్న ఈ అద్భుతాలకు ముగ్ధుడై కూర్చుండిపోతాడు అపూ. “రాత్రిళ్ళు ఎలుగులూ, తోడేళ్ళూ తిరుగుతుంటాయి బాబూజీ! ఒంటరిగా బయట కూర్చోమాకండి!” అని రామ్‌చరిత్ చేసే హెచ్చరికలు అతని చెవికేనాడూ సోకవు.

కొన్ని సాయంత్రాలు గుర్రంపై అడవిలో వాహ్యాళికి బయల్దేరుతాడు అపూ. గడ్డి దట్టంగా పెరిగిన మైదానం గుండా చిన్న చిన్న గుట్టలను దాటుతుండగా కొద్ది దూరం వెళ్ళాక చిన్న కొండవాగు ఎదురొస్తుంది. వయ్యారంగా వంపులు తిరుగులూ ప్రవహించే

ఆ వాగుకు వక్రతోయమని పేరు పెట్టుకున్నాడు అపూ. దాని గట్టునున్న చెట్టుకింద కూర్చుని చూస్తుంటే అక్కడి దృశ్యమంతా అద్భుతమైన చిత్రపటంలా ఉంటుంది.

వర్షాకాలం రాగానే అడవంతటా తెల్లని శేఫాలికా పుష్పాలు విరగబూస్తాయి. వాటి పరిమళం గాలితోబాటుగా అడవినంతటినీ చుట్టుముడుతుంది. వెన్నెల రాత్రుల్లో అడవి సౌందర్యాన్ని దర్శించటం మాటలకందని అనుభూతి. ఈ అడవీ, నిశ్శబ్దపు వెన్నెల రాత్రీ, చల్లగా వీచే గాలీ, అపూకి ఏవేవో పురాగాథలను విన్పిస్తాయి. అ అనుభవం అతడి హృదయ ద్వారాలను తెరిచి, కొత్త లోకాల్లోకి ప్రవేశపెట్టింది.

ఈ ఏడాది మార్చి నెలలో అపూకొక కొత్త మిత్రుడు దొరికాడు. మద్రాసు నుండి వచ్చిన ఆ ఫారెస్ట్ సర్వేయర్‌కు అపూ ఉండే ప్రాంతానికి దగ్గర్లోనే బస ఏర్పాటయింది. సాయంత్రం వేళల్లో తరచుగా అతడిని కలవటానికి వెళ్ళేవాడు అపూ. ఇద్దరూ టీ తాగుతూ ఎన్నో విషయాలను చర్చించుకునే వాళ్ళు.

అపూ జీవితం ప్రశాంతంగా సాగిపోతోంది.

❖ ❖ ❖ ❖

జాతీయోద్యమంలో పాల్గొంటూ జైలుపాలయిన ప్రణవ్, మూడేళ్ళ తరువాత విడుదలయ్యాడు.

ముందుగా తన స్వగ్రామానికి వెళ్ళి నాలుగు రోజులుండి, కలకత్తా చేరాడు. అపూ చిరునామా కొరకు ఎంతగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. మిత్రులనూ, పరిచయస్తులనూ అడిగి చూశాడు, లైబ్రరీలలో వెదికాడు. కానీ అపూ జాడ దొరకలేదు.

కలకత్తా నుండి అపర్ణా వాళ్ళింటికి వెళ్ళాడు ప్రణవ్. అపర్ణ తల్లి గత ఏడాది మరణించిందని జైల్లో ఉండగానే తెలిసింది. తనను తల్లివలె ఆదరించిన ఆమె మరణం ప్రణవ్‌ను బాధించింది. అపర్ణా వాళ్ళ గ్రామంలో పడవ దిగుతుంటే కన్నీళ్ళు పొంగివచ్చాయి.

ఇంటికి వెళ్ళాక స్నానం, భోజనం ముగించి కాస్సేపు విశ్రాంతి తీసుకుందామని మేడ మీదికి వెళ్ళాడు. ఒక గదిలోకి అడుగుపెట్టబోతున్న ప్రణవ్, అక్కడ ఓ మంచంపై పడుకున్న పిల్లవాణ్ణి చూసి ఆగిపోయాడు. వాడు పడుకున్న తీరుచూస్తే అనారోగ్యంతో ఒళ్ళెరగకపడివున్నాడని అర్థమవుతోంది. దగ్గరగా వెళ్ళిచూసేసరికి ఆ పసివాడి శరీరం జ్వరంతో కాలిపోతోంది. ముఖం ఎర్రబడి, ఉబ్బింది. వణుకుతున్న పెదవులతో నిస్సహాయంగా ముడుచుకుని పడుకున్న ఆ పిల్లవాడికి ఐదారేళ్ళ వయసుంటుంది. వాడి తలగడ పక్కన ఓ పళ్ళెంలో సగం కొరికిన రొట్టెముక్కా, కాస్త పంచదారా ఉన్నాయి.

ప్రణవ్ దగ్గరగా రావటంతో ఉలికిపాటుతో కళ్ళు తెరిచాడు. బెదురుగా, ఆశ్చర్యంగా తనకేసి చూస్తున్న ఆ కుర్రాణ్ణి "నువ్వు కాజల్‌వే కదూ!" అని పలకరించాడు ప్రణవ్.

ఆ పసివాడి స్థితి చూసి అతడి గుండె బద్దలయింది. ఇంత జ్వరంతో ఉన్న పిల్లాడిని ఎవరూ పట్టించుకోకుండా వదిలేశారేమిటి? ఆ రొట్టెలూ, చక్కెరా పడేస్తే వాడెలా తినగలడనుకున్నారు?

"జావ తాగితే బావుంటుంది కదా, కాజల్!" అన్నాడు ప్రణవ్.

"లేదట. మామిమా చెప్పింది."

విపరీతమైన జ్వరంతో ఆయాసపడుతున్నాడు కాజల్. ప్రణవ్ వెళ్ళి చల్లటి నీళ్ళు తెచ్చి, వాడి నుదురు తుడవసాగాడు. మరోచేత్తో విసనకర్ర పుచ్చుకుని విసురుతూ ఉంటే, కాసేపటికి కాస్త తేరుకున్నాడు కాజల్.

"నేనెవరో తెలుసా?" అడిగాడు ప్రణవ్.

"ఊఁహూఁ..."

"మీ మామయ్యను. నాన్న రాలేదా? ఎక్కడున్నాడు?"

"ఏమో! బాబా వచ్చి చాలా రోజులయిపోయిందిగా!"

కాజల్ నెలల పిల్లవాడుగా ఉన్నప్పుడు చూశాడు ప్రణవ్. ఇప్పుడు వాడిని చూస్తుంటే అపర్ణను చూస్తున్నట్టే అన్పిస్తోంది. పచ్చని వంటి ఛాయా, వంపు తిరిగిన పెదవీ మాత్రం అపూవి.

"మా నాన్న ఇంకెప్పుడూ రాడా?" కొద్ది క్షణాలాగి అడిగాడు కాజల్.

"వస్తాడు...ఎందుకు రాడు?"

"నిజంగా! ఎప్పుడొస్తాడు?"

"తొందర్లోనే వస్తాడు. నాన్ననుచూడాలనుందా కాజల్?"

కాజల్ మాట్లాడలేదు. అపూ మీద పట్టరాని ఆగ్రహం కలిగింది ప్రణవ్‌కు. ఎంత హృదయంలేని మనిషతడు! తల్లిలేని ఈ పసివాడిని అనాథగా వదిలేసి, జాడలేకుండా వెళ్ళాడంటే ఎంత కర్కశ హృదయం!

అపర్ణ తండ్రి ప్రణవ్‌ను చూడగానే నానా మాటలూ అన్నాడు:

"నీ మిత్రుణ్ణి తెచ్చి నా బిడ్డకు కట్టబెట్టింది నువ్వేగా? ఈ ఐదేళ్ళలో ఒక్కసారయినా అతడొచ్చి కన్నకొడుకును చూసుకోలేదన్న సంగతి తెలుసా నీకు? ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో దేవుడికెరుక. ఈ పిల్లవాడిక్కూడా తండ్రి బుద్ధులే వస్తున్నాయ్! ఎంత మొండి ఘటమో చెప్పలేం!"

కాజల్‌ది కూడా అపూలాగానే సిగ్గుగా, నెమ్మదిగా ఉండే స్వభావమని ప్రణవ్ గ్రహించాడు. వాడి ప్రతి కదలికలోనూ ఏదో సౌకుమార్యం ఉన్నది. కానీ, వాడి చిరునవ్వులో తొంగిచూసే విషాదానికి ప్రణవ్ మనసు కరిగినీరయింది. అపర్ణ తల్లి చనిపోయాక, ఈ ఇంట్లో ఎవరూ పిల్లవాడిని పట్టించుకోవటం లేదని అతడికి అర్థమయింది. శ్రద్ధ తీసుకునే వాళ్ళు లేకపోవటంతో వాడు ఊళ్ళో ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. ఇక అపర్ణ తండ్రి దృష్టిలో వాడివన్నీ అపూ బుద్ధులే. క్రమశిక్షణలో పెట్టకపోతే, వాడు కూడా దేశదిమ్మరిలా తయారవుతాడని ఆయన భయం. దాంతో తాతగారి కాఠిన్యానికి జడిసిపోయిన కాజల్, ఆయనను మరింత తప్పించుకు తిరుగుతున్నాడు.

పరిస్థితి ఎలా తయారయిందో ప్రణవ్‌కు అర్థమయింది. కానీ, దీనినంతటినీ వెంటనే చక్కదిద్దేంత బాధ్యతలను స్వీకరించగల స్థితిలో అతడు కూడా లేదు.

❖ ❖ ❖ ❖

పగలంతా బాగానే ఉంటాడు కాజల్. చీకటి పడుతోందంటే వాడిలో ఏదో బెరుకు మొదలవుతుంది. రాత్రి భోజనం కాగానే "ఇక మేడమీదికెళ్ళి పడుకో" అంటుంది మామీమా. ఆ మాటలు వినగానే కాజల్ వణికిపోతూ వరండా చివర నిల్చుండిపోతాడు. మేడమీద ఎవరూ ఉండదు. తానొక్కడే చీకట్లో మేడమెట్లెక్కి వెళ్ళాలి. పైగా ఆ గదిలో వాడి మంచం పక్కనే బోలెడన్ని దుప్పట్లూ, గొంగళ్ళూ కుప్పగా పేర్చి ఉంటాయి. చీకట్లో ఆ గుట్ట మహా వికృతమైన ఆకారంలో కనబడి వాడిని భయపెడుతుంది. దీదీమా ఉన్న రోజుల్లో ఆమె కూడా వాడితోబాటుగా ఆ గదికొచ్చి, కథలు చెబుతూ నిద్రపుచ్చేది. ఇప్పుడామె లేదు. అత్తయ్యలకు వాడిని పట్టించుకునేంత తీరికా, శ్రద్ధాలేవు. ఇంత తిండి పెట్టడంతో తమ బాధ్యత తీరిపోతుందని వాళ్ళ అభిప్రాయం. అప్పటికీ కాజల్ ఒకటి రెండుసార్లు వాళ్ళను తన గదిలోకి వచ్చి కాస్సేపుండమని నోరుతెరిచి అడిగాడు. వాళ్ళు కసురుకోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

ఎలాగో ధైర్యం కూడగట్టుకుంటూ గది గుమ్మందాకా వెళ్తాడు కాజల్. దుప్పట్ల గుట్టకేసి చూడకుండా గట్టిగా కళ్ళుమూసుకుని తడుముకుంటూ తన మంచంపై చేరి, దుప్పటి ముసుగుపెట్టేసుకుంటాడు. గదికి ఓ మూలన వెలిగే చిన్న నూనె దీపం తప్ప, ఆ అంతస్తు మొత్తం కటిక చీకటి. ఆ గాఢాంధకారంలో, భీతిగొలిపే ఆలోచనలతో రాత్రంతా గడపాలి. ఏ అర్థరాత్రికో పనిమనిషి ఒకావిడ ఆ గదిలోకొచ్చి పడుకుంటుంది. కానీ ఆవిడొచ్చేదాకా కాచుకుని ఉండగలగటం వాడి వయసుకు సాధ్యపడేది కాదు. తాను విన్న కథల్లోని దయ్యాలన్నీ ఒక్కసారిగా వాడి ఆలోచనల్లోకి వచ్చేస్తాయి. కలత నిద్రతో, పీడకలలతో తెల్లారిపోతుంది.

దాదీమా బతికున్న రోజుల్లో ఈ దుప్పట్ల గుట్ట వాడిని భయపెట్టేది కాదు. ఆమెతో బాటు గదిలోకి రాగానే వాడు పరిగెత్తుకెళ్ళి ఆ గుట్టమీదికి ఎక్కేసేవాడు. "ఇదుగో, దాదీమా... చెరువులోకి దూకేస్తున్నా... ఎలా ఈతకొట్టేస్తున్నానో చూడు..." అంటూ ఆ గుట్టమీంచి మంచం మీదికి దూకి బోర్లా పడుకుని పకపకా నవ్వేసేవాడు.

ఆమె వాడిని పట్టుకుని పడుకోబెట్టగానే కథ చెప్పమంటూ మారాం చేసేవాడు కాజల్. "కథ చెప్పగానే బుద్ధిగా నిద్రపోతావా మరి! మీ తాతగారొస్తే నేవెళ్ళి భోజనం వడ్డించాలి మరి!" అనేది దాదీమా. "దాదూ వస్తే మామీమా పెడుతుందిలే అన్నం... నువ్వెళ్ళకు" అని గారాలు పోతూ ఎప్పటికో నిద్రపోయేవాడు కాజల్.

తననొదిలిపెట్టి దాదీమా ఎక్కడికెళ్ళిపోయింది? ఏడాదిన్నర క్రితం ఒకరోజు... రాత్రికి రాత్రి ఏదో జరిగిపోయింది. వాడికప్పుడు నాలుగున్నరేళ్ళు. ఉదయాన్నే వాడు

నిద్రలేచేసరికి, మామయ్య కొడుకు అరూ వచ్చి, "రాత్రి నాన్నమ్మ చచ్చిపోయిందిరా కాజల్! నీకు తెల్సా?" అని అడిగాడు.

"అంటే...అంటే ఏమయింది?" అమాయకంగా అడిగాడు కాజల్.

"రాత్రి నువ్వు నిద్రపోతున్నప్పుడు ఆమె వెళ్ళిపోయింది. అంటే... మోసుకెళ్ళి పోయారు."

"మళ్ళీ ఎప్పుడొస్తుంది?"

"ఇంక రాదు. నాన్నమ్మను తగలబెట్టేశారుగా! ఎప్పటికీ రాదు!"

వాడి మాటలపై కాజల్‌కు నమ్మకం కుదరలేదు. అరూ ఎప్పుడూ అబద్ధాలు చెప్తాడని వాడికి తెలుసు. ఇది కూడా అలాంటిదే ననుకున్నాడు.

కానీ... అరూ చెప్పింది ఈసారి నిజమయింది. దాదీమా తిరిగి రానేలేదు. తాను నిద్రపోయి లేచేసరికి మాయమైపోయింది. అదెలా సాధ్యమో వాడికర్థం కాలేదు. అడిగినా చెప్పేవాళ్ళు లేరు. ఎన్నోసార్లు ఒంటరిగా కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తాడు కాజల్.

## 19

మరొక ఏడాది గడిచిపోయింది. ఉద్యోగంలో చేరిన ఐదేళ్ళ తర్వాత, బెంగాల్‌కు తిరిగొచ్చాడు అపూ.

రైల్లో కిటికీ దగ్గర కూర్చొని బయటికి చూస్తున్న అతడి కళ్ళలో ఎప్పుడెప్పుడు తన సొంత రాష్ట్రంలో ప్రవేశిస్తామా అనే ఆత్రుత. అతడి దృష్టిలో తన బెంగాల్ అంటే, చిన్న వాడు జానపద కథల్లో చదువుకున్న అద్భుత ద్వీపం వంటిది. చిన్ననాటి నుండి తనకు సుపరిచితమైన బెంగాల్ ప్రకృతి దృశ్యాలు అపూ కళ్ళముందు కదలాడుతున్నాయి.

రాణిగంజ్ స్టేషన్ దాటాక, రైలు వేగం పుంజుకుంది. అది ఏప్రిల్ నెల కావటంతో ఎండిపోయిన నదులు కనబడుతున్నాయి. గ్రామీణ స్త్రీలు, ఆ నదీ తీరాల్లోని ఇసుకలో గుంటలు చేస్తూ, వాటిలో ఊరుతున్న నీళ్ళను కడవల్లో నింపుకుంటున్నారు.

బర్ద్వాన్ సమీపించే వేళకు సూర్యాస్తమయం అవుతోంది. తామరపూలతో, ఆకులతో పూర్తిగా నిండిపోయిన ఒక చెరువు ఎదురయింది. దానికి కాస్త దూరంలో ఓ పూరి గుడిసె, దానిమీదికి తన కొమ్మలను వాల్చుతూ సగం ఎండిపోయిన ఓ మునగచెట్టూ; పొద్దుటి నుండి బీహార్ ప్రాంతపు బీడు భూములనూ, ఎర్రమట్టి మైదానాలనూ చూస్తున్న కళ్ళను ఈ తామరకొలను సేదదీర్చింది.

హౌరా స్టేషన్‌లో రైలాగింది. అక్కడి వాతావరణాన్ని చూసి నివ్వెరపోయాడు. అపూ. స్టేషన్ నిండా కిక్కిరిసిపోయిన జనమూ, పట్టపగల్లా వెలుగులు చిమ్ముతున్న లైట్లూ చూస్తుంటే అతడికి మతిపోయింది. ఐదేళ్ళ కిందట ఈ ప్రాంతం ఇలా లేదు. ఇంత పెద్ద భవనాలనూ,

రంగురంగుల లైట్లతో మెరిసిపోతున్న వ్యాపార ప్రకటనల బోర్డులనూ గతంలో అతడు చూడలేదు.

మరునాడు ఉదయం కలకత్తా నగరమంతా తిరిగాడు అపూ. తనకు తెలిసిన మిత్రులెవరూ కనబడలేదు. మందుల దుకాణం మిత్రుడు కూడా ఆ వీధిలోంచి వెళ్ళిపోయినట్టున్నాడు. గతంలో ఉండిన చిన్న చిన్న హోటళ్ళూ, టీకొట్లు అదృశ్యమై పోయాయి.

ఆ సాయంత్రం నాటకం చూడటానికి వెళ్ళాడు అపూ. తను కాలేజిలో చేరిన కొత్తల్లో ఎంతో సాయంచేసిన సురేశ్వర్ అక్కడ ఎదురవటంతో ప్రాణం లేచొచ్చినట్టయింది. సురేశ్వర్‌తోబాటు అతడి భార్య కూడా ఉంది. ఆమెను అపూకి పరిచయం చేశాడతడు. తను చిట్టగాంగ్‌లోని ఓ కాలేజిలో ఉద్యోగం చేస్తున్నాననీ, కలకత్తాలో తన అత్తమామలుంటే చూట్టానికొచ్చామనీ చెప్పాడు.

నాటకం పూర్తయ్యాక సురేశ్వర్ భార్యను ఆమె తల్లిగారింట్లో దించి, మిత్రులిద్దరూ హోటలుకు వెళ్ళారు. భోజనంచేస్తూ తన వివరాలన్నీ చెప్పాడు అపూ. ఐదేళ్ళపాటు ఎక్కడో అడవుల్లో జీవించిన అతడిని చూసి ఆశ్చర్యపడ్డాడు సురేశ్వర్. “ఐదేళ్ళు ఎలా ఉండగలిగావ్ అపూర్వా! ఇంటిమీద బెంగ కలగలేదూ?” అని అడిగాడు.

“అప్పుడప్పుడూ బెంగగానే అన్పించేది. ఐదేళ్ళ అరణ్యవాసం తర్వాత ఈ నగరాన్ని చూస్తుంటే ప్రతిదీ కొత్తగానే తోస్తోంది సురేశ్వర్‌దా! ఈ మనుషులు, సైకిళ్ళు, రిక్షాలు, మోటార్లు...ఈ శబ్దాలు, అన్నీ వింతగానే అన్పిస్తున్నాయి. ఇప్పుడు పావుతక్కువ పది అయింది కదూ! ఈ సమయానికి నేనక్కడ ఒంటరిగా కూర్చుని చెట్లనూ ఆకాశాన్నీ చూస్తూ గడిపేవాణ్ణి. తోడేళ్ళ అరుపులూ, అప్పుడప్పుడూ పులుల గాండ్రింపులూ తప్ప మరే శబ్దమూ విన్పించేది కాదు” అంటూ తన అనుభవాలు వివరించాడు అపూ.

మౌనంగా వింటూ కూర్చున్న సురేశ్వర్ మాట్లాడసాగాడు. “నాక్కూడా అలా వెళ్ళి పోవాలనుంది అపూర్వా! నువ్వు చెప్పిన జీవితానుభవాలను రుచి చూడాలనుంది. కానీ, నేను వివాహితుణ్ణి. కాలేజీ రోజుల్లో నువ్వు చూసిన సురేశ్వర్‌ను కాదు నేనిప్పుడు. ఈ పెళ్ళీ, సంసారమూ నా శక్తినంతటినీ హరించివేశాయి. ఎమ్.ఎ. పట్టా పుచ్చుకున్న రోజున ఎన్నో కలలుగన్నాను. ఎంతో సాధించాలనుకున్నాను. నా యవ్వన స్వప్నాలన్నీ ధ్వంసమై పోయాయి. ప్రతి ఏడాదీ అవే పాఠాలను మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటూ, ఆ ప్రిన్సిపాల్‌కు బానిసగిరీ చేస్తూ... భార్యతో పోట్లాటలూ, పిల్లలను ఆస్పత్రులకు తిప్పటాలూ, తప్ప మరేమీ మిగల్లేదు. నీకీ బాదరబందీ లేదు. నువ్వు మాత్రం ఎప్పటికీ పెళ్ళిచేసుకోకు, నా మాట విను!” అంటూ చెప్పుకుపోతున్నాడు సురేశ్వర్.

అపూకి నవ్వొచ్చింది. “నీ మాటలు మీ ఆవిడ వింటే ఏమనుకుంటుంది చెప్పు?” అన్నాడు.

"నవ్వకు అపూర్వా! ఇది నవ్వులాట కాదు. నా జీవితాన్ని పైనుంచి చూసిన వాళ్ళందరూ నేనెంతో సంతోషంగా ఉన్నాననుకుంటారు. కానీ నేను మరణిస్తున్నాను – నా ఆత్మ చచ్చిపోతోంది అపూర్వా!"

ఇద్దరూ హోటల్లోంచి వెలుపలికొచ్చారు.

"జీవితం అద్భుతమైనది సురేశ్వర్‌దా! దాన్నితిరస్కరించటం సరైనది కాదు... నేనిక వెళ్తాను. నిన్ను కలుసుకున్నందుకు సంతోషంగా ఉంది." అంటూ మిత్రుడి దగ్గర సెలవు తీసుకుని, హోటల్ గదికి వెళ్ళాడు అపూ.

❖ ❖ ❖ ❖

మరునాడు మధ్యాహ్నం భవానీపూర్‌లోని లీలావాళ్ళింటికి బయల్దేరాడు అపూ. చాలా కాలంగా ఆమె గురించి ఏ కబురూ లేదు. అల్లంతదూరాన ఆ ఇంటిని చూడగానే అపూ గుండె వేగంగా కొట్టుకోసాగింది. లీల కనబడుతుందో, లేదో! ఎనిమిదేళ్ళయింది ఆమెను చూసి.

ఇంటి ఆవరణలో అడుగుపెట్టగానే లీల తమ్ముడు విమలేందు ఎదురయ్యాడు. అతనిప్పుడు బాగా పొడవు పెరిగి, కొత్తగా కనబడుతున్నాడు. కుశల ప్రశ్నలయ్యాక లీల గురించి అడిగాడు అపూ. "మీ అక్కయ్య సంగతులేమిటి? అత్తవారింట్లోనే ఉందా?" అన్నాడు తన లోపలి ఉద్వేగాన్ని అణచుకుంటూ.

విమలేందు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. "దీదీ సంగతా...మనం బయటికెళ్ళి మాట్లాడుకుందామా?" అంటూ లేచాడు.

అపూ మనసు కీడు శంకించింది. ఏం జరిగింది? లీలకేమయింది? ఇంట్లోంచి వెలుపలికొచ్చి రోడ్డుపక్కన నిలబడ్డాక, "దీదీ గురించి మీరేమీ వినలేదా?" గొంతు తగ్గించి అడిగాడు విమలేందు.

"లేదు. ఆమెకు...ఆమెకేమయింది? బతికేవుందా అసలు...?" అపూ గొంతులో ఆందోళన స్పష్టంగా తెలుస్తోంది.

"ఉందనాలో, లేదనాలో అర్థమవటం లేదు అపూర్వబాబూ! అదో పెద్ద కథ. మీరు మా కుటుంబానికి ఆప్తులు కాబట్టి, మీతో అన్ని విషయాలూ చెప్తాను. దీదీ భర్తను వదిలేసింది. అతడు తాగుబోతు, అన్ని విధాలా దిగజారిన మనిషి. ఓ యూదు యువతితో సంబంధం పెట్టుకుని, ఆమెను నేరుగా ఇంటికే తీసుకొచ్చాడు. దీదీ స్వభావం మీకు తెలుసుగా. అంత ఆత్మాభిమానమున్న ఏ ఆడపిల్లా దాన్ని సహించలేదు. రాత్రికిరాత్రే ఓ టాక్సీ పిలిపించుకుని పాపను తీసుకుని వెళ్ళిపోయింది.

రెణ్ణెల్లయ్యాక అతడు అక్క దగ్గరికెళ్ళి, పాపను కాసేపు సినిమాకు తీసుకెళ్తానని చెప్పి, వెంటబెట్టుకెళ్ళాడు. కానీ, ఆ అమ్మాయిని నేరుగా జబల్‌పూర్‌కు తీసుకెళ్ళిపోయాడు.

ఇక తిరిగి పంపించనని దీదీకి కబురు పంపాడు. దాంతో...అసలు...దీదీ అలాంటి పనిచేస్తుందని కూడా ఊహించలేం...! బారిస్టర్ హీరక్‌సేన్ గుర్తున్నాడా మీకు! అతడితో బాటు వెళ్ళిపోయింది దీదీ. ఏ ఊళ్ళో ఉండేవారో నాకు తెలీదు, కానీ...ఏడాది తర్వాత ఒంటరిగా తిరిగొచ్చింది. హీరక్‌సేన్ నుండి కూడా విడిపోయి, అలీపూర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. మా ఇంట్లో ఎవరికీ, ఆమె పేరెత్తటం కూడా ఇష్టంలేదిప్పుడు. అమ్మ కాశీకి వెళ్ళిపోయింది. తిరిగొస్తుందో లేదో తెలీదు."

ఇదంతా చెప్పి, కాసేపు మౌనంగా ఉండిపోయాడు విమలేందు. ఆ తర్వాత మెల్లిగా, "సేన్‌తో దీదీకి ఏ సంబంధమూ లేదసలు. కేవలం భర్తమీద కోపంతోనే ఈ పని చేసింది" అన్నాడు.

కొంతసేపు ఇద్దరూ మౌనంగా నిలబడిపోయారు.

"నేనిక ఇంట్లోకి వెళ్తా, మీరు కలకత్తాలో కొన్నాళ్ళుంటారుగా..." అంటూ వెళ్ళిపోబోతున్న విమలేందు చెయ్యిపట్టుకుని ఆపి, "లీల అలీపూర్‌లోనే ఉందా?" అని అడిగాడు అపూ.

"ఉంది. ఇంట్లో వాళ్ళెవరికీ తెలీకుండా అప్పుడప్పుడూ కలుస్తుంటాను. ఇప్పుడు దీదీ బెంగంతా పాపను గురించే. ఆమె దగ్గరున్న డబ్బు చాలా వరకూ సేన్ కాజేశాడు. దీదీనీ, పాపనూ ఇంగ్లాండ్‌కు పంపుతానని చెప్పాడట. నమ్మి మోసపోయింది" "నువ్వు మళ్ళీ ఎప్పుడు కలుస్తున్నావ్ లీలను?" ఆత్రుతగా అడిగాడు అపూ.

"అప్పుడప్పుడూ సాయంత్రంపూట కారులో విక్టోరియా మెమోరియల్ దగ్గరకొస్తుంది దీదీ."

విమలేందు వెళ్ళిపోయాడు. అన్యమనస్కంగా వీధిలో నడుస్తున్న అపూ, ఓ పార్కులోకి వెళ్ళి బల్లపై కూలబడ్డాడు. అతనికి లీలపై కోపం రావటంలేదు. ఆమె చేసిన పనిని తప్పుపట్టాలని కూడా అన్పించటంలేదు. ఆమెపై ఎన్నడూ కలగనంత గాఢమైన ప్రేమ అతడి హృదయంలోంచి పెల్లుబికింది. ఆ అనుభూతి అతడికీ కొత్తగా ఉంది.

❖ ❖ ❖ ❖

అపూ దగ్గరున్న డబ్బు అయిపోవస్తోంది. గది అద్దె భరించటం కూడా కష్టమన్పించి, మరో ముగ్గురు కుర్రాళ్ళతో బాటుగా ఒకే గదిలో ఉంటున్నాడు. వాళ్ళందరూ ఏవో చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వాళ్ళ కబుర్లూ, గొడవా అపూ భరించలేక పోతున్నాడు. కానీ, చెయ్యగలిగిందేమీ లేదు.

ఏదయినా ఉద్యోగం వెదుక్కుంటే, ఆర్థిక సమస్య తీరుతుందేమోననుకుని కూడా, అందుకు మానసికంగా సిద్ధపడలేక పోతున్నాడు. ఐదేళ్ళపాటు అడవిలో, ప్రకృతిలో భాగమై గడిపిన తరువాత మళ్ళీ బల్లముందు కూర్చుని గుమాస్తా పనిచెయ్యలేనన్పించింది.

చాలా కాలం తర్వాత మళ్ళీ సాహిత్య సృజన చెయ్యాలన్న కోరిక తలెత్తింది అపూ మనసులో. ఐదు సంవత్సరాలు తాను పొందిన అత్యద్భుతమైన సౌందర్యానుభవాన్ని ఈ కలకత్తా నగరంలో మళ్ళీ పొందగలగడం అసాధ్యం. కానీ, తన స్మృతుల్లోని ఆ జీవితానుభవాలను భావితరాల కొరకు భద్రపరచగలడు.

అపూ రచనా వ్యాసంగం ప్రారంభమై కొద్దిరోజుల్లోనే పుస్తకరూపం దాల్చింది. కానీ, దాన్ని ప్రచురించటం అనుకున్నంత సులభం కాదని అర్థమవటానికి ఎంతోకాలం పట్టలేదు.

సాహిత్య లోకంలో గుర్తింపులేని కొత్త రచయితలతో ప్రచురణకర్తలు అంత మొరటుగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని అతడికి తెలీదు.

తన దగ్గరున్న రాతప్రతిని చదవటానిక్కూడా వాళ్ళు ఆసక్తి చూపకపోవటం అపూని నిరాశపరిచింది. ఊరూ పేరూ లేని రచయితల పుస్తకాల ముద్రణ కోసం డబ్బు వెచ్చించటం వాళ్ళెవరికీ ఇష్టంలేదని తెలిసి దిగాలుపడిపోయాడు.

ఓ రోజు ఉదయాన్నే విమలేందు వచ్చి, సాయంత్రం లీలను కలవటానికి విక్టోరియా మెమోరియల్ దగ్గరకు రమ్మని చెప్పి వెళ్ళాడు.

ఆ సాయంత్రం విమలేందుతో కలిసి అక్కడకు వెళ్ళాడు అపూ. పార్కులో కూర్చుని గంటసేపు నిరీక్షించిన తర్వాత కారులో వచ్చింది లీల.

ఆమెను చూడగానే అపూ గుండె వేగంగా కొట్టుకోసాగింది. "ఏం లీలా! బావున్నావా?" అని పలకరించాడు తన ఉద్వేగాన్ని అణచుకుంటూ.

లీల చిరునవ్వు నవ్వి, "ఎలా ఉన్నావ్ అపూర్వా! ఇద్దరూ కారెక్కండి, లేక్ దగ్గరకెళ్ళి కూర్చుందాం" అని, వాళ్ళెక్కగానే కారుపోనిమ్మని డ్రైవర్‌తో చెప్పింది.

కారు వెనక సీటులో విమలేందుకూ, అపూకీ మధ్యన కూర్చుంది లీల. ఎప్పుడో చిన్నతనంలో తప్ప ఆమెకు అంత సన్నిహితంగా అపూ ఎన్నడూ కూర్చోలేదు.

లీల ఇప్పటికీ అందంగానే ఉంది. కానీ, కొంచెం లావయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఆమె కళ్ళలో మునుపటి పసితనం లేదు. ఆమె ముఖకవళికల్లో తెలియని విషాదం!

సరస్సు దగ్గరున్న పార్కులో కూర్చున్నారు లీలా, అపూ. కాస్సేపు అలా వెళ్ళి వస్తానంటూ కారులో వెళ్ళాడు విమలేందు.

"ఏం చేస్తున్నావు అపూ? లోకాన్ని చుట్టిరావటానికి వెళ్ళావని విన్నాన్లే!" అంది లీల నవ్వుతూ.

"జబల్‌పూర్ దగ్గర్లో ఓ అడవి ప్రాంతంలో ఉన్నాను. మీ అత్తవారింటికి దగ్గరే" అనాలోచితంగా అనేసి కంగారుపడ్డాడు అపూ.

లీల అదేమీ పట్టించుకోనట్టుగా మాట్లాడుతూనే ఉంది.

"నిన్ను కలుసుకోవటం సంతోషంగా ఉంది అపూ! బాగా నల్లబడ్డావ్. ఓసారి మా ఇంటికి రావొచ్చుగా! అసలు నన్నెప్పుడయినా తలుచుకున్నావా నువ్వు?" అంది నవ్వుతూ.

ఏం మాట్లాడాలో తెలీక ఆమెకేసి చూస్తూ కూర్చున్నాడు అపూ. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ అనంతరం, ఇవాళ లీలను కలుసుకోగలిగాడు. ఆమెకు సన్నిహితంగా, ఏకాంతంగా కూర్చున్నాడు. కానీ ఏం మాట్లాడాలో తోచనట్టుగా ఉందతడికి.

మళ్ళీ తనే మాట్లాడింది లీల, "అన్నట్టు...నువ్వేదో పుస్తకం రాశావటగా అపూ! నాకు చూపించకూడదూ? ఏదో ఒకనాడు నువ్వు మంచి రచయితవవుతావని నాకు తెలుసు. చిన్నప్పుడు కూడా కథలు రాసేవాడివి గుర్తుందా?"

పుస్తకాన్ని ప్రచురించుకోటానికి అపూ పడుతున్న ఇబ్బందుల గురించి విమలేందు ద్వారా విన్నది లీల. ఆ పుస్తకాన్ని తనే ప్రచురిస్తాననీ ఇంకే ప్రయత్నాలు చెయ్యనక్కర్లేదనీ అన్నది అపూతో.

ఆమె హటాత్తుగా ఇటువంటి ప్రతిపాదన చెయ్యటం అపూని ఆశ్చర్యానందాలకు లోను చేసింది. కానీ, అసలే సమస్యల్లో ఉన్న ఆమెపై ఈ భారాన్ని కూడా మోపటం సరైంది కాదని కూడా అన్పించింది. లీలను చూస్తుంటే అతడి మనసు బరువెక్కుతోంది. గొప్ప చిత్రకారిణి కావాలని ఆమె ఎన్నో కలలు కనేదని అపూకి తెలుసు. ఇప్పుడా అభిరుచులకు ఆమె జీవితంలో చోటెక్కడుందని! కొత్త రకాల కార్లు కొనుగోలు చెయ్యటమూ, ఇంగ్లీషువాళ్ళ దుకాణాల్లో రకరకాల వస్తువులపై డబ్బు గుమ్మరించటమూ... ఇదే ఇప్పుడామె కాలక్షేపం. ఒకప్పుడు ఆమెలో వెలుగుతుండిన జ్వాల ఇప్పుడు చప్పగా చల్లారిపోయింది.

కానీ, ఆమె హృదయంలో తనమీది అభిమానం చెక్కుచెదరలేదని అపూ గ్రహించాడు. అతడి అవసరాలన్నిటికీ ఆదుకోవాలని చిన్నప్పటి వలెనే ఇప్పుడు కూడా తపన పడుతోంది లీల.

❖ ❖ ❖ ❖

అపూ ఉద్యోగ ప్రయత్నాలేవీ ఫలించటంలేదు. రాయ్ ఛౌదురిని కలిసినా ప్రయోజనం లేకపోయింది. గతంలో అపూ పనిచేసిన ప్రాంతంలోనే మాంగనీస్ ఖనిజం కొరకు గనుల తవ్వకం జరుగుతోంది. అక్కడికి వెళ్ళదలచుకుంటే పంపుతాననీ, ఐతే గతంలో ఇచ్చినంత జీతం ఇవ్వటం మాత్రం వీలుకాదనీ ఆయన చెప్పటం అపూకి బాధ కలిగించింది. తన అవసరాన్ని వాళ్ళు వాడుకోజూస్తున్నారని అర్థమయింది.

కానీ...

ఈ శిశిర రుతువు ఆ అడవికి ఎన్ని అందాలను అద్దుతుందో గుర్తొచ్చి పులకరించి పోయాడు అపూ. ఆ దట్టమైన అరణ్యం, చుక్కలతో వెలిగిపోయే ఆ చీకటి రాత్రులూ,

పట్టపగల్లా తోచే వెన్నెల వేళలూ, హద్దులెరగని ఆ స్వేచ్ఛాజీవనమూ...అవన్నీ అతణ్ణి రమ్మని పిలుస్తున్నాయి! దానితోబాటే మరొక ఆలోచన కూడా అపూ మనసును ఏనాటి నుండో కలవరపెడుతోంది.

భారతదేశంలోనే కాదు – కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఆఫ్రికా...ఎన్నో ప్రాంతాలలో, సహజ వనరుల దోపిడి కొరకు భూమిని ధ్వంసం చేస్తున్నారని అతడు చదువుతూనే ఉన్నాడు. మానవులు పాల్పడుతున్న ఈ నేరాలన్నిటికీ ప్రకృతి ఏదో ఒకనాడు ప్రతీకారం తీర్చుకుంటుంది. సామ్రాజ్యాల నిర్మాణం; పర్వతాలనూ, సరస్సులనూ రాజుల పేరిట ప్రకటించుకోవటం; పక్షులను, జంతువులనూ వ్యాపార సరుకులుగా వినియోగించుకోవటం; మహారణ్యాలను ధ్వంసించి ఫ్యాక్టరీలు కట్టడం; ఎన్నో విధాలైన స్వార్థప్రయోజనాల కొరకు మానవులు చేస్తున్న ఈ విధ్వంసానికి ఫలితం అనుభవించక తప్పదన్న ఆలోచన అపూ మనసులో పదే పదే మెదులుతూనే ఉంటుంది.

తక్కువ జీతానికే పనిచెయ్యటానికి అపూ సిద్ధపడినప్పటికీ ఆ ఉద్యోగం దొరకనే లేదు. ఈ మాంగనీస్ గనుల తవ్వకంలో రాయ్‌చౌదరితోబాటుగా మరికొందరు భాగస్వాములు కూడా ఉన్నారు. వాళ్ళ తాలూకు మనుష్యులకు ఈ ఉద్యోగాలు కేటాయించాలన్న ఉద్దేశ్యంతో అపూని తీసుకునేందుకు నిరాకరించారు.

ఉద్యోగ ప్రయత్నాలతో బాగా విసిగిపోయిన అపూ, తాత్కాలికంగా వాటిని విరమించుకుని మళ్ళీ రచనా వ్యాసంగంలో పడ్డాడు. ఈసారి చిన్న కథలు రాయడం మొదలెట్టాడు. వాటిలో కొన్ని ప్రచురితమయ్యాయి. ఒక కథకైతే బోలెడన్ని ప్రశంసలు కూడా లభించాయి. కానీ, ఏ పత్రికా అతడికి ఒక్కపైసయినా ముట్టజెప్పిన పాపాన పోలేదు.

అపర్ణ నగలు, ఆమె పుట్టింట్లో అలాగే ఉన్నాయని అతడికి గుర్తొచ్చింది. వాటిని అమ్మివేసి తన పుస్తకాన్ని ప్రచురిస్తే, దాని ద్వారా తనకొక జీవనోపాధి మార్గం దొరుకుతుందేమోనన్న ఆశ తలెత్తింది.

ఈ మధ్య కాలంలో లీలను చాలాసార్లు కలిశాడు అపూ. ఆమె కోరిన మీదట తన నవలను చదివి విన్పించాడు కూడా. లీలకు ఆ నవల ఎంతగానో నచ్చింది. ఎంత డబ్బు ఖర్చయినా పరవాలేదని, దాన్ని వెంటనే ప్రచురించమంటూ ప్రోత్సహించింది. కానీ, లీల డబ్బును తన అవసరానికి వాడుకునేందుకు అపూకి ఎంతమాత్రమూ మనస్కరించలేదు.

ఒకరోజు వార్తాపత్రిక తిరగేస్తున్న అపూ కళ్ళు ఓ మందుల దుకాణాన్ని గురించిన ప్రకటన దగ్గర ఆగిపోయాయి. అది తన పాత మిత్రుడి దుకాణమే. వెంటనే ఆ చిరునామా వెదుక్కుని వెళ్ళాడు. అపూని చూసి అతడు సంతోషంగా స్వాగతం పలికాడు.

"నీ కోసం కలకత్తా అంతటా వెదికానోయ్! ఇంతకూ ఎలా ఉన్నావ్? పరిస్థితి మెరుగ్గానే ఉందని నీ దుకాణం చూస్తుంటేనే తెలుస్తోందిలే, ఔనా?" అన్నాడు అపూ నవ్వుతూ.

అతడేమీ జవాబివ్వకుండా ఇంకేవేవో విషయాలు మాట్లాడసాగాడు. కొద్దిసేపయ్యాక అపూని తన ఇంటికి తీసుకువెళ్ళాడు.

రెండంతస్తులున్న చిన్న బంగళా అది. ఆవరణలోని రేకుల షెడ్డులో పదిమంది వ్యక్తులు, రకరకాల సీసాలపై చీటీలు అంటిస్తున్నారు. మరొక చివరగా వేసిన చిన్న రేకుల గదిని గిడ్డంగిగా వాడుతున్నారు.

మిత్రుడితో కలిసి మేడమీదికి వెళ్ళాడు అపూ. హాల్లో కూర్చున్న తర్వాత, "బిందూ! అమ్మనడిగి రెండు కప్పుల చాయ్ పట్టుకురా!" అంటూ కూతుర్ని కేకేశాడు దుకాణం యజమాని.

"తర్వాత తాగుదాంగానీ...ముందు వదినగారిని పిలువ్, చూడాలనుంది! నువ్విప్పుడు ధనవంతుడివయ్యావు కాబట్టి, ఆవిణ్ణి నా ఎదుటికి తీసురావా ఏమిటి?" అన్నాడు అపూ.

అతడి మిత్రుడు కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు. "నిజమే. ఆమె నీకిక కన్పించదు. రమోలానూ, వాళ్ళమ్మనూ కూడా పోగొట్టుకున్నాన్నేను" అన్నాడు దిగాలుగా.

అపూ నివ్వెరపోయాడు. అతడి నోటమాట రావటంలేదు. మళ్ళీ అతడి మిత్రుడే మాట్లాడాడు, "ఆ రోజుల్లో మేమెన్ని బాధలుపడ్డామో చెప్పనలవి కాదు. నిన్ను ఎప్పుడూ తలుచుకుంటూనే ఉండేది. ఆమె పోయిన తర్వాత మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని అనుకోలేదు. కానీ, మూడేళ్ళ కిందట..." మాట పూర్తికాకముందే అతడి భార్య బిస్కెట్లూ, టీ తీసుకుని గదిలోకొచ్చింది. నల్లగా, దృఢంగా ఉంది. ముఖంలో చురుకుదనం కనబడుతోంది. మిత్రుడు చెప్తున్న మాటలేవీ అపూ చెవికి సోకటంలేదు. ఆ ఫలహారాలు గొంతుకు అడ్డం పడుతున్నట్టుగా ఉండి, తినలేకపోతున్నాడు.

కొంతసేపయ్యాక అపూ తేరుకుని, "సరే, వెళ్ళొస్తా! ఈమె నీకు అనుకూలంగానే ఉంటోందిగా!" అని అడిగాడు.

"ఆఁ! బాగానే ఉంటుంది. కానీ బాగా నోటి దురుసు. రమోలా వాళ్ళమ్మ ఎంత మంచి మనిషో నువ్వెరుగుదువుగా! అంతా నా కర్మ! నేనసలు రెండో పెళ్ళిచేసుకోవాలని అనుకోనేలేదు..."

అతడు మాట్లాడుతూ ఉండగానే వెలుపలికి నడిచాడు అపూ. కిందటిసారి ఆ మిత్రుడి ఇంటికి వచ్చినప్పటి దృశ్యం అతడికి గుర్తుకొస్తోంది. గాలికి రెపరెపలాడే దీపాన్ని చేతబట్టుకుని, పెదవులపై చిరునవ్వుతో చీకట్లో గుమ్మం ముందు నిలుచున్న ఆ నిరుపేద స్త్రీ రూపం అతడి కళ్ళముందు స్పష్టంగా కనబడుతోంది.

ఆరేళ్ళనాటి సంఘటన అది – కానీ, నిన్ననే జరిగినంత సజీవంగా ఉంది అతడి స్మృతుల్లో.

# 20

కాజల్ పెద్దవాడవుతున్నాడు. వీధి బడిలో ఉపాధ్యాయుడిగా పనిచేసే సీతానాథ్ పండిట్, ప్రతి ఉదయమూ చదువు చెప్తున్నాడు. సాయంత్రం కాజల్ సొంతంగా చదువుకోవాలి.

ఆ సాయంత్రపు చదువు వాడి ప్రాణానికి ఓ గండంగా తయారయింది. పుస్తకాలు ముందుపెట్టుకుని దీపం ముందు కూర్చోగానే నిద్రముంచుకొచ్చేస్తుంది. అలాగే ముందుకు వాలిపోయి నిద్రలోకి జారుకుంటాడు. ఎవరయినా లేపి అన్నం పెడితే సరే, లేదంటే భోజనంతోబాటు తాతగారి తిట్లను కూడా తినాల్సిందే.

కింద పోసుకోకుండా శుభ్రంగా అన్నం తినడం వాడికింకా చేతనవటం లేదు. తాతయ్య వాడికి ఎదురుగానే కూర్చుంటాడు. వాడు అన్నంలో బంగాళాదుంపల కూర కలుపుకోగానే “పప్పు తినవేమిట్రా? వేసుకో! ఇంకాస్త వేసుకుని కలుపు!” అంటూ ఆజ్ఞలు జారీచేస్తాడాయన.

ఆ అరుపులకు జడిసి పప్పు వడ్డించుకోబోతాడు కాజల్. వాడి చిట్టి చేతులు భయంతో వణికిపోతూ పప్పు నేలమీద వొలుకుతుంది. “అయ్యో, భగవంతుడా! ఈ వెధవకు తిండి తినటం కూడా రాదే! అంటూ ఆయన రంకె పెడతాడు. ఆ కథ అంతటితో ముగిసేది కాదు. కాకరకాయ కూర పారెయ్యొద్దనీ, పచ్చడి కలుపుకోమనీ...అడుగడుగునా ఆదేశాలే!

కాజల్‌కు కాకరకాయ కూరంటే అసహ్యం. కానీ, తాతగారితో వాదించగలిగే శక్తి వాడికి లేదు. ఆయన డేగ చూపుల అజమాయిషీ కింద భోజనం ముగిసేసరికి వాడు ఏడవటానికి సిద్ధంగా ఉంటాడు.

కాజల్‌కు కథల పుస్తకాలపై మక్కువ ఎలా మొదలైందోగానీ, వాటికోసం వాడు తపించిపోతుంటాడు. తాతగారి గుమాస్తా విశ్వేశ్వర్ ముహురీ దగ్గర కొన్ని కథల పుస్తకాలున్నాయన్న సంగతి వాడు కనిపెట్టేశాడు. వాటినిండా హత్యలూ, హంతకులను పట్టుకోటానికి జరిగే అపరాధ పరిశోధనలూ వంటి గమ్మత్తయిన విషయాలుంటాయి. అవేగాక ఓ రోజు తాతగారి మంచం మీద అరేబియన్ నైట్స్ పుస్తకం కూడా దొరికింది. ఆ కథలూ, వాటికోసం చిత్రించిన బొమ్మలూ ఎంత బావున్నాయని!

కాజల్ ఈ పుస్తకాలు చదవటం ఒకనాడు విశ్వేశ్వర్ కంటబడింది. “నిండా ఎనిమిదేళ్ళు లేవు, నవలలు కావల్సొచ్చాయట్రా నీకు? మీ తాతగారు చూస్తే పడతార్లే నీ పని!” అని కేకలేసి, పుస్తకాలన్నీ మేడమీది గదిలో ఓ భోషాణం పెట్టెలో పడేశాడు. ఆ తరువాత నుండి కాజల్ దృష్టంతా ఆ పెట్టె తాళంచెవి మీదనే ఉండేది. ఎవరూ చూడకుండా దాన్ని సంపాదించి, రాత్రంతా మేలుకుని పుస్తకాలు చదవటం మొదలెట్టాడు.

ఇటీవల సాయంత్రాలు కూడా సీతానాథ్ పండిట్ వస్తున్నాడు. ఆయన పాఠాలు చెప్తున్నంతసేపూ తాతగారు కూడా హుక్కా పీలుస్తూ అక్కడే కూర్చుని పర్యవేక్షణ చేస్తారు. టీచరుగారికి ఎదురుగా కూర్చున్న కాజల్‌కు వరండాలో ఖాళీస్థలం మీదుగా ఆకాశం కనబడుతూ ఉంటుంది. కాస్సేపట్లో వాడి కళ్ళముందే అదో రంగస్థలంగా మారిపోయి, అమ్మమ్మ చెప్పిన కథల్లోని పాత్రలందరూ అక్కడ ప్రత్యక్షమవుతారు. ఎవరో రాజకుమారులు సపరివారంగా బయల్దేరి, అదేదో పేరు తెలీని నది అడ్డొస్తే ఆగిపోతారు. గాలిలో ఎగిరే బంగారు రథాలు ఎక్కడినుండో వచ్చేస్తాయి. వాళ్ళందరూ వాటిని అధిరోహించి అకాశంలోకి ఎగరగానే ఆ శబ్దానికి భూమిమీది భవనాలు దద్దరిల్లిపోతాయి...కాజల్ పరవశించిపోయి ముందుకు వంగి మబ్బుల్లోకి దీక్షగా చూస్తున్న అపురూపమైన క్షణంలో, "చూడండి బెనర్జీ మొషాయ్, ఆ పదాలు రాయమని నేనోపక్క మొత్తుకుంటుంటే, మీ మనవడేమో శూన్యం లోకి చూస్తున్నాడు. ఇంత శ్రద్ధలేని పిల్లాణ్ణి నేనెక్కడా చూళ్ళేదండీ..." అంటూ గొంతు చించుకుంటాడు సీతానాథ పండితుడు.

"చాచిపెట్టి కొట్టకపోయారూ! వీడి తండ్రికేమో కొడుకు అతీగతీ పట్టదు. ఈ ముసలితనంలో వీడు నాకో పీడలాగా దాపురించాడండీ!" అంటూ మండిపడతాడు తాత.

కాజల్ అల్లరి పిల్లవాడు కాదని అనటానికి వీల్లేదు. కానీ తాతగారి భయంతో కంగారుపడి తనకు వచ్చిన జవాబులు కూడా చెప్పలేక పోతుంటాడు చాలాసార్లు. పదాలను తప్పుగా పలికిన వెంటనే చెంపపగిలేలా దెబ్బపడుతుంది. వాడి లేత చర్మం కందిపోయి ఎర్రగా దానిమ్మరంగులోకి మారుతుంది. దెబ్బల భయం వాడిలో ఎంతోకాలం నిలవలేదు. కానీ మనసులో లోతైన గాయమయింది.

ఇలా సాగుతున్న రోజుల్లోనే ఓ చిత్రమైన సంఘటన జరిగింది.

సీతానాథ పండితుడికి జ్యోతిశ్శాస్త్రంలో ప్రవేశమున్నది. ఆయనొకరోజు జాతక చక్రాలు, రాశిఫలాలూ, మనుషుల ఆయుర్దాయాన్ని నిర్ణయించే పద్ధతులూ వంటి విషయాలను గురించి తాతగారితో చర్చించటం విన్నాడు కాజల్. పాఠాలు చదువుకుంటూ ఈ చర్చలన్నీ వింటున్న వాడి మనసులో ఎన్నో ప్రశ్నలు తలెత్తేవి. కానీ, నోరుతెరిచి అడిగే సాహసం చెయ్యలేక ఊరుకున్నాడు.

ఓ రోజు మధ్యాహ్నం కాజల్ మామయ్య కొడుకు అరూ పరిగెత్తుకుంటూ వచ్చి, "బ్రహ్మో మామ్మగారు చచ్చిపోతున్నార్రా కాజల్! అందరూ వెళ్తున్నారు, నువ్వూ వస్తావా?" అని అడిగారు.

బ్రహ్మో మామ్మగారనే ఆ వృద్ధురాలు చాలాకాలంగా జబ్బుతో తీసుకుంటోంది. ఆమెకంటూ ఎవరూ లేరు. ఒంటరిగా ఉంటూ మరమరాలు అమ్ముకుంటూ బతుకు తుండేది. చిన్న పిల్లలెవరయినా ఆమె ఇంటి ఛాయలకు వెళ్తే, తరిమికొట్టేది. అపూ కూడా ఎన్నోసార్లు ఆవిడతో తిట్లుతిన్నవాడే.

అరూ, కాజల్ పరిగెత్తుకుంటూ వెళ్ళేసరికి, ఆవిడ ఇంటినిండా జనం మూగి ఉన్నారు. బ్రహ్మో మామ్మను నేలమీద పడుకోబెట్టారు. ఆవిడ ముఖం ఉబ్బిపోయి, కళ్ళు పూడుకుపోయి, గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉంది. కాజల్ వాళ్ళ మామయ్య ఆమె పక్కనే కూర్చున్నాడు. గ్రామ వైద్యుడు వరండాలో నిలబడి ఏదో చెప్తున్నాడు.

ఇదంతా చూసి ఆశ్చర్యపోయాడు కాజల్. ఆవిడ నోటి దురుసు ఎలాంటిదో అందరికీ తెలుసు. కానీ ఇవాళ తన తాతగారితో సహా, అందరూ ఆమె మీద ఎంతో గౌరవం చూపుతున్నారు. ఆమెకేమయింది? ఎందుకలా నేలమీద పడుకునుంది? వాడికేమీ అర్థం కాలేదు.

సాయంత్రానికల్లా ఆవిడ చనిపోయింది. ఒక్కసారిగా అంతటా నిశ్శబ్దం అలుముకున్నది. తెలియని భీతి ఏదో వాతావరణమంతటా వ్యాపిస్తోంది. అందరి ముఖాల్లోనూ భయం స్పష్టంగా కనబడుతోంది కాజల్ కళ్ళకు.

గ్రామస్తులందరూ అంత్యక్రియల ఏర్పాట్లలో మునిగిపోయారు. ఆమె శవాన్ని నది ఒడ్డుకు మోసుకుపోతున్న వాళ్ళను తడబడే అడుగులతో అనుసరించాడు కాజల్. ఓ వెదురుపొద వెనకాల నక్కి, అక్కడ జరుగుతున్న కార్యక్రమాన్నంతటినీ చూస్తుంటే వాడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. మనసంతా చిత్రమైన ఉద్వేగం ఆవరించింది. దాన్ని కేవలం భయమనటానికి వీల్లేదు.

మరణాన్ని ప్రత్యక్షంగా చూడటం వాడికిదే మొదటిసారి. అమ్మమ్మ చనిపోయే నాటికి వాడికి ఐదేళ్ళే; పైగా ఆవిడ అర్థరాత్రివేళ మరణించటంతో వాడు నిద్రలేవక ముందే అంతా ముగిసిపోయింది. ఇప్పుడు వాడి బుర్రనిండా మరణాన్ని గురించి భయమూ, ఆశ్చర్యమూ నిండిపోయాయి. తన ఆలోచనలను పంచుకోగలిగే మిత్రులెవరూ లేకపోవటంతో అవి వాడి మనసులోనే తిష్టవేసుకుపోయాయి. 'ఐతే... నేనూ ఒకరోజు చచ్చిపోతానన్న మాట... నన్ను కూడా మామ్మగారిగానే నది దగ్గరకు తీసుకెళ్ళి కాల్చేస్తారా...!" కాజల్ శరీరం భయంతో చల్లబడిపోయింది.

ఆ భయం రోజురోజుకూ పెరిగి పెద్దదవుతోంది. ఒంటరిగా పక్కమీద పడుకున్నప్పుడూ, నది ఒడ్డున కూర్చున్నప్పుడూ వాడిలో ఒకటే ఆలోచన: ఏదో ఒకనాడు తన శరీరాన్ని కూడా ఈ నది ఒడ్డునే తీసుకొస్తారు...మామ్మగారిని కాల్చేసినట్టే కాల్చేస్తారు...

ఈ భయంలోంచే వాడిలో ఒక ఆలోచన మొలకెత్తింది. సీతానాథ్ పండితుడికి తన జాతకం చూపించాలి...ఎంత కాలం బతుకుతాడో కనుక్కోవాలి. తాతగారు తన జాతకం రాయించి పెట్టారని కూడా వారికి తెలుసు.

ఓ మధ్యాహ్నం రహస్యంగా తాతగారి ఆఫీసుగదిలోకి దూరి జాతకాల ఫైళ్ళున్న అలమరాల్లో వెదకటం మొదలెట్టాడు. 1923వ సంవత్సరంనాటి ఓ ఫైలు తీశాడు. అదే

ఏడాది ఫిబ్రవరిలో తను పుట్టాడన్న సంగతి తెలుసు. కానీ తారీకు కచ్చితంగా తెలీదు. అది తెలుసుకుంటే రహస్యం తెలిసిపోతుంది.

"నేను పుట్టిన తారీకు తెలుసా మామిమా?" అని మేనమామ భార్య నడిగాడు. వాడి సందేహాలను పట్టించుకుని జవాబులు చెప్పేంత ఓపిక లేదావిడకు. ఇంట్లో వాళ్ళందరినీ అడిగి చూసినా లాభంలేకపోయింది. ఇక ఆగలేక, ఓరోజు సీతానాథ్ పండితుణ్ణే అడిగేశాడు. ఆయన ఆశ్చర్యపడి "నీకెందుకోయ్ అవన్నీ? ఏం చేస్తావ్ తెలుసుకుని?" అన్నాడు. "నే...నేనెన్ని సంవత్సరాలు బతుకుతాను పండిట్‌గారూ!" అడిగాడు కాజల్ భయపడుతూ.

సీతానాథ్ పండిట్ నోరుతెరుచుకుని చూడసాగాడు వాడివైపు. అంత చిన్న కుర్రవాడి నుండి అంత పెద్ద ప్రశ్నను ఆయన ఊహించలేదు. వెంటనే బెనర్జీగారిని పిలిచి, కాజల్ అడిగిన విషయాన్ని చెప్పాడు.

"అతి తెలివి వెధవ! ఎక్కాలు నేర్చుకోవటం చాతగాదు గానీ జనన, మరణాల వివరాలు కావల్సొచ్చాయి. వీడికి" అంటూ కేకలేశాడాయన.

కాజల్ భయాలు ఎవరికీ అర్థంకావు. తాతగారి ఆగ్రహానికి వెరచి వాడి ఆసక్తి చచ్చిపోలేదు. ఈ ఇంట్లోవాళ్ళెవరికీ తన గురించి పట్టింపులేదని అర్థమైపోయింది. వాళ్ళకెవరికీ తనతో మాట్లాడే తీరికలేదు. ఒకవేళ...ఒకవేళ నాన్నతో మాట్లాడితే, తనను అర్థం చేసుకుంటాడేమో?

ప్రతి ఏడాదీ వర్షాకాలంలో కాజల్‌కు చలిజ్వరం వస్తోంది. జ్వర తీవ్రత పెరిగేకొద్దీ వాడి బుర్రంతా గందరగోళంగా తయారవుతుంది. తలతిరిగిపోతూ ఉంటుంది. వళ్ళంతా నొప్పులతో అల్లాడిపోతాడు. అలాంటి సమయాల్లో ఎవరయినా తన పక్కన కూర్చుంటే బావుండునన్పిస్తుంది. కానీ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయి ఉంటారు. వాడిని పట్టించుకునేంత ఓపికా, తీరికా వాళ్ళెవరికీ ఉండవు.

ఆ వీధిలో రోడ్డుపక్కన ఓ వృద్ధురాలు తినుబండారాలు అమ్ముతూ ఉంటుంది. కాజల్ రహస్యంగా ఆవిడ దగ్గర కొనుక్కుని తినేవాడు. ఒకసారి జ్వరపడి లేచిన కాజల్‌కు ఆవిడ అమ్ముతున్న బజ్జీలు చూసి నోరూరింది. వాటిలో ఏవో ఆకుకూరలు, కాయగూరల ముక్కలూ కనబడుతున్నాయి. "ఆ పచ్చటి బజ్జీలివ్వు మామ్మా!" అంటూ డబ్బులు తీసి ఆమె చేతిలో పెట్టాడు కాజల్. "వద్దు బాబూ! నీకసలే ఒంట్లో బాగాలేదు" అని ఆవిడ ఎంతగా చెప్పినా వాడు వదల్లేదు.

ఆ బజ్జీల పొట్లం విప్పి తింటున్న కాజల్‌ను గుమాస్తా విశ్వేశ్వర్ చూశారు. "ఎంత పనికిమాలిన పిల్లాడివి? ఈ చెత్తంతా తినడానికి బుద్ధిలేదూ?" అంటూ పరిగెత్తుకొచ్చాడు.

"నీకెందుకు?" అన్నాడు కాజల్ నిర్లక్ష్యంగా.

విశ్వేశ్వర్ ముందుకొచ్చి, వాడి చెవి పట్టుకున్నాడు. "నాకెందుకా? చెప్పమంటావా? అంటూ చెవి మెలిపెట్టాడు.

కోపంతో, అవమానంతో కాజల్ ముఖం కందిపోయింది. తమ ఇంట్లో పనిచేసే ఓ ఉద్యోగి తనమీద చెయ్యిజేసుకోవటం ఎప్పుడూ జరగలేదు. "వెధవా! నువ్వెవరు నన్ను కొట్టటానికి?" వాడి పసిగొంతు కీచుగా అరిచింది.

విశ్వేశ్వర్ మరింత రెచ్చిపోయి, కాజల్ చెంపమీద కొట్టాడు.

"నేనెవర్నా? చెప్తా...అయ్యగారి దగ్గరికి పద!" అంటూ లాక్కుపోసాగాడు.

కాజల్‌కు వెఱ్రెత్తిపోయింది. గట్టిగా కేకలు పెడుతూ, విశ్వేశ్వర్‌ను నోటికొచ్చిన తిట్లు తిట్టాడు. వాడి చెంప కందిపోయి, మంటపుడుతోంది. ఈ ఇంట్లో తనను రక్షించే వాళ్ళెవరూ లేరని వాడికి తెలుసు. "మా నాన్నను రానీ...నీ సంగతి చూస్తాడు!" అన్నాడు వెక్కుతూ.

విశ్వేశ్వర్ పగలబడి నవ్వాడు. "మీ నాయనొస్తాడా? ఈ ఐదేళ్ళ నుంచి వచ్చాడట్రా ఎప్పుడయినా?" తన యజమానికి ఆ అల్లుడిమీద ఎంత చిన్న చూపో అతడికి బాగా తెలుసు కాబట్లే అంత తేలిగ్గా మాట్లాడగలిగాడు.

"చూస్తుండు మా బాబా వస్తాడో, రాడో!" అని అరుస్తూ అతణ్ణి తప్పించుకుని పరిగెత్తాడు కాజల్.

ఆ సాయంత్రం వాడు ఒంటరిగా చాలాసేపు నది ఒడ్డున కూర్చుని అమ్మమ్మను తలచుకున్నాడు. ఆమె ఉండుంటే విశ్వేశ్వర్‌కు తనమీద చెయ్యిచేసుకునేంత ధైర్యం ఉండేదా?

❖ ❖ ❖ ❖

కొన్ని నెలలు గడిచాయి. ఓ సాయంత్రం కాజల్‌వాళ్ళ అత్తయ్య ఓ గాజు గ్లాసును కడిగి మేడమీది గదిలో టేబుల్ మీద పెట్టమని వాడి చేతికిచ్చింది. అది తాతగారు షర్బత్ తాగే గ్లాసు.

కాజల్ దాన్ని పట్టుకెళ్ళి బల్లమీద ఉంచబోతుండగా చెయ్యిజారి కిందపడింది. తన కాళ్ళచుట్టూ పడిన గాజుముక్కల్ని చూగానే వాడి ముఖం పాలిపోయింది. ఒక్క క్షణం గుండె ఆగిపోయినట్టయింది. ఎంత పని జరిగింది! వాడు గబగబా ఆ ముక్కలన్నీ ఏరి పెద్ద చెక్కపెట్టె వెనకాల దాచాడు. బయట పారబోస్తే ఎవరి కంటనైనా పడుతుందని భయం. ఇప్పుడేం చెయ్యాలి? ఆ గ్లాసేదని ఎవరయినా అడిగితే ఏం చెప్పాలి? వాడికేమీ పాలుపోలేదు.

ఆ రోజంతా భయంతోనే గడిపాడు. అదేరకం గ్లాసు మరొకటి దొరికితే బావుణ్ణు! సాయంత్రం ఆడుకోటానికి వెళ్ళినప్పుడు ఓ స్నేహితుణ్ణి రహస్యంగా అడిగాడు, వాళ్ళింట్లో

అలాంటిది ఉందేమోనని. ఆ పిల్లవాడు లేదన్నాడు. కాజల్ దిగాలుపడిపోయాడు. ఇంట్లోంచి పారిపోయి, కలకత్తాకు వెళ్దామా, అని కూడా ఆలోచించాడు, కానీ, ఎలా వెళ్ళాలో వాడికి తెలీదు. ఆ రాత్రంతా భయంతో నిద్రపట్టనేలేదు.

మరునాడు లేచినప్పటి నుంచి ఇంట్లో వాళ్ళకు ఎదురుపడకుండా ఉండేందుకు వీధుల్లో తిరుగుతూ గడిపాడు. మధ్యాహ్నం కాసేపు గుడిదగ్గర కూర్చున్నాడు. నదివైపుగా చూస్తున్న వాడి దృష్టిని ఓ దృశ్యం ఆకర్షించింది. ఓ పడవ వచ్చి రేవులో ఆగగానే అందమైన ఓ వ్యక్తి, చేతిలో సంచిపెట్టుకుని పడవ దిగాడు. ఆయన రేవు మెట్లెక్కుతూ పడవ నడిపే మనిషితో ఏదో మాట్లాడేందుకు ఆగాడు. కాజల్ చూస్తుండగానే అతడు తల ఇటువైపుకు తిప్పాడు. క్షణంసేపు కాజల్ కళ్ళు బైర్లుకమ్మాయి. మరుక్షణమే వాడు ఆయన వైపుకు పరుగందుకున్నాడు. వాడు ఆయన్ని చూసి కొన్ని సంవత్సరాలయింది. ఐనా సరే, గుర్తు పట్టేందుకు క్షణంసేపు పట్టలేదు. అతడే కాజల్ తండ్రి!

అపూ పడవదిగి, తలతిప్పి చూసేసరికి ముద్దొచ్చే ఓ కుర్రాడు తన వైపుకు పరిగెత్తు కుంటూ రావటం కనబడింది. మరుక్షణమే వాణ్ణి గుర్తుపట్టాడు. ప్రయాణంలో ఉన్నంత సేపూ కొడుకును గురించే ఆలోచిస్తున్నాడు అపూ. తనకు ఎదురొచ్చిన కొడుకు ముద్దు ముఖాన్ని చూడగానే ఆశ్చర్యానందాలతో అతడి నోటమాట రాలేదు. క్రితంసారి తాను చూసిన మూడేళ్ళ పసిపిల్లాడు ఎంత ఎదిగాడు? "నన్ను గుర్తుపట్టావా ఖోకా?" అడిగాడు కొడుకుని.

తండ్రి నడుము చుట్టూ చేతులు బిగించాడు కాజల్. వాడికిప్పుడు ఎంతో నిశ్చింతగా ఉంది.

"ఇన్ని రోజులు ఎందుకు రాలేదు బాబా?" తలెత్తి తండ్రి ముఖంలోకి చూస్తూ అడిగాడు.

అపూ మనసులో చిత్రమైన భావమేదో కదలాడింది. సంవత్సరాల తరబడి కొడుకును గురించి ఆలోచించకుండా గడపగలిగిన అతడికి, వాడు కళ్ళెదుట కనబడగానే పట్టరాని అనురాగం ఉప్పొంగింది. వీడు తన సొంతమనే భావన ఎంత గమ్మత్తుగా ఉంది! తను తప్ప ఎవరూ లేని నిస్సహాయుడైన ఈ పసివాడిని...ఒంటరిని...ఇన్నాళ్ళూ ఎలా మరిచిపోగలిగాడసలు?

"నీ సంచిలో ఏముంది బాబా?" అడిగాడు కాజల్.

"సంచిలోనా? నీ కోసం ఓ పిస్తోలు బొమ్మా, కథల పుస్తకాలూ, ఇంకా...రబ్బరు బెలూన్ కూడా!"

"మరేమో...నీ దగ్గర గాజు గ్లాసుందా బాబా?"

"గాజుగ్లాసా? ఎందుకది?" ఆశ్చర్యపడుతూ అడిగాడు అపూ.

తన సమస్యనంతటినీ గబగబా చెప్పేశాడు కాజల్. నాన్న తనను అర్థం చేసుకోగలడనీ, ఆయన దగ్గర ఏ విషయాన్నయినా భయం లేకుండా మాట్లాడొచ్చనీ వాడికి గట్టి నమ్మకం కలిగింది.

అపూ నవ్వి, కొడుకు వీపును మృదువుగా నిమిరాడు. "మరేం పరవాలేదు, నేనున్నానుగా! నిన్నెవరూ తిట్టర్లే!" అన్నాడు.

కాజల్ మనసులో భయాలన్నీ పటాపంచలైపోయాయి. మహాశక్తిమంతుడైన దేవుడు ప్రత్యక్షమై, ఆయన బలమైన చేతుల్లోకి తనను తీసుకుని, "నీకేం భయంలేదం"టూ అభయమిచ్చినంత భరోసా కలిగింది.

ఆ రాత్రి కాజల్, తండ్రితో "నేను నీతో వచ్చేస్తాను బాబా" అన్నాడు.

అపూ కూడా వాడిని తీసుకువెళ్ళాలనే నిర్ణయానికొచ్చాడు. కానీ కలకత్తాలో తనకే స్థిరమైన ఆశ్రయం లేదు. కొడుకుని వెంటపెట్టుకుని ఎక్కడుండాలో అర్థంకాలేదు. "అలాగే, చూద్దాంలే!" అన్నాడు.

తండ్రిని కథ చెప్పమన్నాడు కాజల్. చెప్తున్నంతసేపూ బుద్ధిగా విని, మళ్ళీ అదే విషయం అడిగాడు, "నన్ను తీసుకెళ్ళవూ బాబా? వీళ్ళందరూ నన్ను తిడుతున్నారు, కొడుతున్నారు. నన్ను తీసుకెళ్ళావంటే నీ పనులన్నీ చేసిపెడతాను బాబా!"

అపూకి నవ్వొచ్చింది. "నా పనులు చేసిపెడతావా? ఏం పనులు చేస్తావ్ ఖోకా?"

కాసేపట్లో నిద్రపోయాడు కాజల్. వాడిని చూస్తున్న అపూ మనసులో కలవరం. నిస్సహాయంగా, పరాధీనంగా, అమాయకంగా ఉన్న ఈ పసివాడిని తనూ, అపర్ణా కలిసి సృష్టించారు. వాడి కర్మానికి వాణ్ణి వదిలేసి తనదారి తాను చూసుకున్నాడు. తను చేసిన ఈ నేరాన్ని అపర్ణ క్షమిస్తుందా? ఇప్పటికిప్పుడు వీణ్ణి ఎక్కడికని తీసుకెళ్ళాలి?

ఫ్రెడరిక్ హారిసన్ రాసిన పుస్తకంలోని కొన్ని వాక్యాలు చప్పున గుర్తొచ్చాయి అపూకి. ప్రాచీన గ్రీసు దేశంలో ఓ సమాధిపైనున్న శిలాఫలకంపై చెక్కిన వాక్యాలవి:

"పది వసంతాల తన చిన్నారి బిడ్డను
తన జీవన సర్వస్వం నికొటెల్స్‌ను,
వాడి తండ్రి ఫిలిప్, నిక్షిప్తం చేసింది ఇక్కడే."

ఎంతో కాలం కిందట, కేరింతలు కొడుతూ ఆటలాడుకున్న ఆ నికొటెల్స్ – వాడి వదనం, వాడి అందమైన శరీరం ఈ రాత్రి అపూ కళ్ళముందు కదలాడాయి. వాడి కేశాలు బంగారు వన్నెలో ఉన్నాయి, వాడి కళ్ళు మిలమిలా మెరిసిపోతున్నాయి. గ్రీసులోని ఆ పురాతనమైన శ్మశాన వాటికలో వాడి మధుర స్మృతులు నిక్షిప్తమయ్యాయి. వందలాది సంవత్సరాల కిందట కొడుకును ఖననం చేసిన ఆ తండ్రి క్షోభ, అపూ హృదయానికి ఈనాడు అనుభవంలోకొచ్చింది. మానవ భావోద్వేగాలు అన్ని స్థలాల్లోనూ, అన్ని కాలాల్లోనూ ఒకటిగానే ఉన్నాయి. వాటికి కాలదోషం పట్టదు.

అపూ అత్తవారింటికి వచ్చినప్పుడల్లా అతడి కోసం ఇదే గదిని కేటాయిస్తారు. అపర్ణతో తొలిరేయి గడిపిన పాన్పు కూడా ఇదే. ఈ రోజు అతడికి ఎంత ప్రయత్నించినా నిద్రపట్టటంలేదు. కిటికీలోంచి బయటికి  చూస్తూ గత స్మృతుల్లో మునిగిపోయాడు. ఇటీవలి జీవితంలో ఎదురయిన అనుభవాలు గతాన్ని మసకబార్చాయన్నది నిజమే. మరీ ముఖ్యంగా ఈ పల్లెనూ, ఈ ఇంటినీ తలుచుకున్న సందర్భాలు అరుదయ్యాయి. దాదాపు తొమ్మిదేళ్ళుగా ఇక్కడి మనుషులతో సంబంధాలే కరువయ్యాయి. ఇన్నాళ్ళ తరువాత ఈ గదీ, మంచమూ, కిటికీగుండా కనబడుతున్న పోకచెట్ల వరుసలూ...ఇవన్నీ ఏదో స్వప్నం లోని దృశ్యాల్లా తోస్తున్నాయి. ఈ గదిలో గడిపిన ఆ మొట్టమొదటి రాత్రిలాగానే ఇవాళ కూడా కిటికీలోంచి చందమామ వెలుగుతోంది; సరిగ్గా ఆ రాత్రి వలెనే ఆలయం నుండి భక్తిగీతం వినబడుతోంది. కానీ ఈ అపూ ఇక ఆనాటి మనిషి కాదు. అతడు పరివర్తన చెందాడు – సంపూర్ణంగానూ, శాశ్వతంగానూ.

❖ ❖ ❖ ❖

అపూ ఒంటరిగానే కలకత్తాకు తిరిగి వెళ్ళాడు. అపర్ణ నగల్లో చాలా భాగం అమ్మేసి, తన నవలను అచ్చువేయించాడు. అపర్ణ ఎప్పుడూ ధరించే నెక్లేస్‌ను మాత్రం అమ్మటానికి మనసొప్పలేదు. దాన్ని చేతితో స్పృశించగానే ఆమె వదనం అతడి కళ్ళముందు కదలాడు తుంది. మరుక్షణమే ఆ స్మృతి కరిగిపోతుంది. ఆమె చిరునవ్వుతో అలవోకగా తనకేసి తలతిప్పి చూసే చిరపరిచితమైన దృశ్యం, క్షణంలో సగంసేపు స్పష్టంగా కనబడుతుంది.

తన పుస్తకం మొదటి ప్రతి చేతికందగానే పడిన కష్టాలన్నిటినీ మరిచిపోయాడు అపూ. ఈ పుస్తకం తనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెడుతుందనీ, ఇక తన సమస్యలన్నీ గట్టెక్కుతాయని అతడి నమ్మకం. అతడి ఆలోచనల్లో నిశ్చిందిపురమూ, ఇరవయ్యేళ్ళ క్రితం ఆ గ్రామంలో తాను గడిపిన జీవితమూ ప్రత్యక్షమయ్యాయి. తమ శిథిల గృహాన్ని తలచుకుని 'నేనెక్కడున్నా నిన్ను మర్చిపోనులే' అని దానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తన నవలలోని పాత్రలకు ప్రేరణనిచ్చిన వ్యక్తులందరూ గుర్తొచ్చారు. వాళ్ళందరి గాథలకు తాను అక్షర రూపాన్నిచ్చాడు. వాళ్ళు అనుభవించిన సుఖదుఃఖాలనే తాను వర్ణించాడు. వాళ్ళందరూ అతడికి వివిధ సందర్భాల్లో వివిధ ప్రాంతాల్లో పరిచయమైన వాళ్ళు. వాళ్ళల్లో కొందరు ఈనాడు సజీవంగా లేకపోవచ్చు. కానీ వాళ్ళందరికీ తాను కృతజ్ఞుడై ఉండాల్సిందే.

కొన్నాళ్ళ తర్వాత ఓ చిన్న ఆఫీసులో తాత్కాలికంగా ఓ ఉద్యోగాన్ని సంపాదించాడు అపూ. కనీసం కొన్ని నెలలపాటయినా జీవితం గడుస్తుందన్న భరోసా వచ్చింది. కొన్ని ట్యూషన్లు కూడా కుదుర్చుకున్నాడు. ఇప్పుడు తన పుస్తకాన్ని గురించి ప్రకటనలివ్వటం అవసరం. దానికి డబ్బు కావాలి. ఉదయాన్నే ఆఫీసుకు పరిగెత్తటమూ, సాయంత్రం రాగానే ఇద్దరు విద్యార్థులకు ట్యూషన్ చెప్పటమూ... జీవితం మళ్ళీ పాతగాడిలోనే తిరుగుతోంది.

అపూ ట్యూషన్ చెబుతున్న పిల్లల తండ్రి ఏదో చిన్న వ్యాపారం చేస్తుంటాడు. రకరకాల సామాన్ల డబ్బాలతో కిక్కిరిసిన ఇరుకు గదిలో ఓ బల్లమీద కూర్చుని మాస్టారి కోసం ఎదురు చూస్తుంటారు ఆ చిన్న కుర్రాళ్ళిద్దరూ.

కొన్ని నెలలు గడిచాయి. అపూ ఆశించినట్టుగా అతడి పుస్తకం అమ్ముడవటం లేదు. కనీసావరాలను కూడా ఆపుకుని, ప్రకటనల కొరకు డబ్బు వెచ్చించినా ఫలితం లేకపోయింది. సాహిత్య విమర్శకులనూ, పత్రికా సంపాదకులనూ కలుసుకుని సమీక్షలు రాయించుకుంటే తప్ప ప్రయోజనం ఉండదని పుస్తకాలు దుకాణాల వాళ్ళు సలహా ఇచ్చారు. “మీరెవరో పాఠకులకు తెలీదు. మీ పుస్తకాన్ని వాళ్ళెందుకు కొంటారు చెప్పండి?” అన్నాడు ఒక దుకాణదారుడు. కానీ అలా చెయ్యటానికి అపూ సిద్ధపడలేక పోయాడు. తన పుస్తకాన్ని చంకనపెట్టుకుని ఇల్లిల్లూ తిరిగి, సమీక్షలు రాయమని దేబిరించటానికి అతడికి మనస్కరించలేదు. అమ్ముడవకపోతే పోనివ్వమని ఊరుకున్నాడు.

ఈ అమ్మకాల గురించిన చింతను పక్కనపెట్టి, మరో పుస్తక రచన ప్రారంభించాడు అపూ. సాహిత్య సృజన అతడికొక వ్యసనంగా మారింది. ఆ పుస్తకాలకు పాఠకులు దొరుకుతారా, లేదా? అవి అమ్ముడవుతాయా, కావా? అనే సందేహాలకు అతడి మనసులో తావులేదు.

మెస్‌లో వాతావరణం మరీ దుర్భరంగా తయారవటంతో దాన్ని ఖాళీచేసి, ఎనిమిది రూపాయల అద్దెతో చిన్న గది తీసుకున్నాడు. ఇందులో గాలీ, వెలుతురూ బాగానే ఉన్నాయి. దక్షిణం వైపున్న చిన్న కిటికీని తెరిస్తే, పక్కింటివాళ్ళ గోడ కనబడుతుంటుంది. ఈ మాత్రం ప్రశాంతమైన వాతావరణం దొరికినందుకు సంతోషించాడు అపూ.

ఓ రోజు కాజల్ దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. తనకు వచ్చిన అక్షరాలను కూడబలుక్కుంటూ వంకరటింకర రాతతో వాడు రాసిన మొట్టమొదటి ఉత్తరమిది. వాడికి బాబాను చూడాలనుందట. త్వరగా రమ్మనీ, వచ్చేటప్పుడు అరేబియన్ నైట్స్ కథల పుస్తకాన్నీ, ఓ లాంతరునూ పట్టుకురమ్మనీ రాశాడు. ఆ లేఖను పదే పదే చదువుకున్నాడు అపూ. ఉత్తి పిచ్చిపిల్లాడు! లాంతరునేం చేసుకుంటాడు వాడు? అపూకి నవ్వొచ్చింది. వచ్చే శనివారం వస్తున్నానని జవాబు రాశాడు.

ఈసారి సోమ, మంగళవారాలు ఏవో సెలవుదినాలు కావటంతో శనివారం రోజున రైళ్ళూ, స్టీమర్లూ కిటకిటలాడుతున్నాయి. సాయంత్రం అవుతుండగా కాజల్ ఉండే ఊరికి చేరాడు అపూ. సంతోషంతో ముఖం వెలిగిపోతుండగా తనకోసం పడవల రేవు దగ్గరే ఎదురుచూస్తున్నాడు కాజల్. తండ్రిని చూడగానే పరిగెత్తుకొచ్చి చేతులతో చుట్టేశాడు. “బాబా అరేబియన్ నైట్స్ తెచ్చావా? లాంతరేదీ?” అని అడిగాడు ముఖంపైకెత్తి అపూకేసి చూస్తూ. ప్రయాణం హడావిడిలో వాటి సంగతి మరిచేపోయాడు అపూ. ఆ సంగతి

చెప్పగానే, "అయ్యో మర్చిపోయావా? తప్పకుండా తీసుకురమ్మని రాశాను కదా!" అన్నాడు నిరాశగా.

"నీకు పిచ్చా ఏమిట్రా? లాంతరునేం చేసుకుంటావు నాన్నా?" అంటూ అనునయించి ఇంటికి తీసుకెళ్ళాడు అపూ.

❖ ❖ ❖ ❖

అపూ, కాజల్‌లు ఇంటికెళ్ళేసరికి అపర్ణావాళ్ళ పెద్దక్క మనోరమ ఎదురొచ్చింది. ఆమె ముఖంలో చెల్లెలి పోలికలు కొట్టొచ్చినట్టుగా కనబడతాయి. అపూని చూసినందుకు ఎంతో సంతోషపడిందామె. తల్లినీ, అపర్ణనూ గుర్తుచేసుకుని కన్నీళ్ళు పెట్టుకుంది. ఎంతో కాలం తర్వాత ఆ ఇంట్లో తనను ఆప్యాయంగా పలకరించే ఓ మనిషి కనబడినందుకు సంతోషం కలిగింది అపూకి.

మనోరమతో మాట్లాడుతూ మేడమీద కూర్చున్నప్పుడు, "నా పెళ్ళి జరగిన రాత్రి గుర్తుందా దీదీ?" అని అడిగాడు అపూ. మనోరమ చిరునవ్వు నవ్వింది. "గుర్తుంది. నిజంగా అదంతా కలలాగా జరిగిపోయింది. ఆ తర్వాత నిన్ను మళ్ళీ ఇదే చూడటం. అనుకోకుండా నేనీవూరు రావటం మంచిదయింది."

ఆమె చిరునవ్వు చూస్తుంటే అపర్ణే గుర్తొస్తోంది.

"అసలు నేనంటూ ఓ మనిషిని ఉన్నానని నీకు గుర్తుందా అపూ? ఈ ఏడాది దుర్గాపూజకు ఈ దీదీ ఇంటికి రావాలి సుమా!" అంటూ తన చిరునామా ఇచ్చింది మనోరమ.

మరునాడు కాజల్ తండ్రిని మళ్ళీ అడిగాడు, "నేనూ నీతో వచ్చేస్తాను బాబా! ఇక్కడుండటం నాకస్సలు బాగాలేదు".

వాణ్ణి తీసుకువెళ్ళాలనే అపూ కూడా నిర్ణయించుకున్నాడు. ఈ ఇంట్లో వాడినెవ్వరూ పట్టించుకోవటం లేదనీ, ఇలాగే ఉంటే వారికి చదువూ సంధ్యా అబ్బటం కూడా కష్టమేననీ అతడికి బాగా అర్థమయింది.

కాజల్‌ను తీసుకుని అపూ బయలుదేరుతుంటే మనోరమ కూడా నది దాకా వచ్చింది. అపర్ణ సామానులున్న ట్రంకుపెట్టెను కూడా తెచ్చి అపూ చేతికిచ్చింది. పడవ బయల్దేరుతుండగా కన్నీళ్ళు పెట్టుకుంది మనోరమ. తమ ఊరికి రావటం మర్చిపోవద్దని మరోసారి గుర్తుచేసి వీడ్కోలు చెప్పింది.

ఉదయభానుడి కిరణాలు నదీజలాలపై మిలమిలలాడుతున్నాయి. గట్టున సన్నటి మంట వెలుగుతోంది, బొగ్గులు తయారు చెయ్యటానికి కట్టెలను పేర్చి కాలుస్తున్నట్టున్నారు. పొగ వలయాలుగా పైకి లేస్తోంది. చల్లటిగాలికి నరాలు జివ్వుమంటున్నాయి. ఒకనాడు ప్రణవ్‌తో కలిసి చుట్టపుచూపుగా ఈ ఇంటికొచ్చాడు తను. ఈ ఊరు, ఇల్లూ తన జీవితంలో

ఇంత ప్రధానమైన భాగంగా మారతాయని ఆనాడు ఊహించనైనా లేదు...అపూ ఆలోచనలు సాగుతున్నాయి.

## 21

కొడుకును వెంటబెట్టుకుని ముందుగా మన్‌సాపోతాకు వెళ్ళాడు అపూ. అతడా యింటిని చూసి ఏడేళ్ళు కావొస్తోంది. ఈసారి సెలవులు కూడా కలిసిరావటంతో గ్రామానికి ప్రయాణమయ్యాడు.

ఇల్లు పాడుబడి దయనీయమైన స్థితికి చేరింది. కాజల్ తల్లిని మొదటిసారి తీసుకొచ్చినప్పుడు కూడా ఈ ఇల్లు ఇదే పరిస్థితిలో ఉన్న విషయం అపూకి గుర్తొచ్చింది. పక్కింటివాళ్ళ దగ్గరున్న తాళంచెవి తెచ్చి, తలుపు తెరిచాడు. గదంతా ఎలుకలు చేసిన కలుగులతో, చెత్తతో చీదరగా ఉంది. ఆవరణ చుట్టూ నాటిన కంచెను పశువులు ధ్వంసం చేసి, వరండాలో చాలా భాగాన్ని కూడా నాశనం చెయ్యటంతో ఆ ప్రదేశమంతా ఆడవిలా తయారయింది.

కళ్ళు పెద్దవి చేసుకుని ఇదంతా చూస్తున్న కాజల్. "మీ ఇల్లు ఇదేనా బాబా?" అన్నాడు.

అపూ నవ్వాడు. "ఔను, నీది కూడా...!"

మరునాడు సర్కార్‌గారి ఇంటికని వెళ్ళిన అపూకి దిగ్భ్రాంతి కలిగించే వార్త ఎదురైంది. యాత్రలకని వెళ్ళిన నిరుపమ, కలరా సోకి మరణించిందని చెప్పాడు ఆమె పెదనాన్న. "మీరు నగరంలోనే ఉండిపోయారు. కదా, దాదా ఠాకూర్! అందుకే మీకీ సంగతి తెలిసినట్టులేదు. నీరూ చనిపోయిందంటే నాకీనాటికీ నమ్మశక్యం కావడంలేదు. ఆమె చేసిన నేరమల్లా ఓ పుణ్యస్థలాన్ని దర్శించుకోవాలనుకోవటమే. ఆమెకెంత దైవభక్తో మీకు తెలుసుగా? పక్కింటివాళ్ళతోబాటు వెళ్తానంటే పంపించా. శాంతిపూర్ దగ్గర ఓ చిన్న దుకాణం దగ్గర చావుబతుకుల్లో ఉందన్న వార్త మూడు రోజుల తర్వాత అందింది మాకు. మేమందరం వెంటనే పరిగెత్తుకెళ్ళాం. అప్పటికే కొన వూపిరితో ఉంది, కానీ నోట మాట రావడంలేదు. మమ్మల్ని గుర్తుపట్టింది. కన్నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి. ఆమెదెంత పరోపకార గుణమో మీకు తెలీనిది కాదుగదా! చివరికి తనకు సాయం చెయ్యటానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఆమెకు కలరా సోకిందని తెలిసి ఎవరూ దగ్గరికైనా రాలేదు. ఆ దుకాణదారుడొక్కడే ఆమెకు ఆసరాగా నిలబడ్డాడు. ఆ గుడిసెలో ఒంటరిగా పడుంది నీరూ...వైద్యం చేసేందుకు డాక్టరైనా దిక్కులేకుండా..." ఆయన గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

చాలాసేపటివరకూ తేరుకోలేకపోయాడు అపూ. అతడు ఇంటికి చేరేసరికి కాజల్, వాకిట్లో ఉన్న సంపెంగ చెట్టు దగ్గరున్నాడు. ఓ కొంకి కర్రతో సంపెంగపూలు కోయటానికి ప్రయత్నిస్తున్న వాణ్ణి చూస్తూ అలాగే నిలబడిపోయాడు అపూ.

ఏడేళ్ళ కిందట అపర్ణ నాటిన ఆ మొక్క పెరిగి పెద్దదయి పూలు పూస్తోంది.

"నాక్కాస్త సాయంచెయ్యి బాబా! ఈ కొమ్మను కిందికి లాగవూ?" నవ్వుతున్నాడు కాజల్.

"నీకు తెలీదు కదూ? మీ అమ్మే నాటింది దాన్ని".

కాజల్‌కేమీ అర్థంకాలేదు. వాడికి తెలిసిన ఒకే ఒక స్త్రీ, అమ్మమ్మే. అమ్మ గురించిన విషయాలూ వాడికేమంత ఆసక్తి కలిగించలేదు. వాడికి సంబంధించినంత వరకూ ఆమె ఒక ఊహా చిత్రమే.

ఇంతకాలం తర్వాత అపూని చూసిన ఇరుగుపొరుగు వాళ్ళు సంతోషించారు. కొందరు వాళ్ళ ఇళ్ళకు రమ్మని ఆహ్వానించారు. ఒకరు పాలు పంపించారు. ఇంటికప్పు బాగుచేయించుకోమని బండెడు గడ్డి పంపాడు మరొక గ్రామస్తుడు.

ఆ సాయంత్రం అపూ మళ్ళీ నిరుపమావాళ్ళ ఇంటివైపుగా వెళ్ళాల్సొచ్చింది. కానీ, ఆ ఇంటికేసి చూట్టానికి అతడికి ధైర్యం చాలలేదు. ఆమెలేని ఈ గ్రామం శూన్యంగా తోచింది. "నా బిడ్డను తీసుకుని వచ్చాను నీరూదీ! వాణ్ణి నువ్వొచ్చి పలకరించవా? వాడికి అన్నం పెట్టవా?" మనసులోనే అనుకున్నాడు అపూ. ఆ రాత్రంతా అతడికి కంటిమీద కునుకు లేదు. నిరుపమ చిరునవ్వు మోము కళ్ళముదు కదలాడుతోంది; ఆమె మృదువైన కంఠం చెవుల్లో మారుమోగుతోంది. ఒక్కసారి ఆమెనెలాగైనా చూడగలిగితే ఎంత బావుండు!

మరునాడు కాజల్‌ను తీసుకుని కలకత్తాకు బయల్దేరాడు అపూ. సాయంత్రం బయల్దేరిన రైలు, తెల్లవారుతుండగా సియల్దా స్టేషన్లో ఆగింది. తండ్రి చెయ్యిపట్టుకుని రైలు దిగిన కాజల్ అక్కడి లైట్లనూ, ఎత్తైన భవనాలనూ, జనసమ్మర్దాన్నీ కళ్ళు విప్పార్చి సంభ్రమంగా చూస్తూండిపోయాడు.

ఇల్లు చేరగానే స్నానంచేసి దుస్తులు మార్చుకున్నప్పటి నుండి వీధిగుమ్మంలోనే నిలబడ్డాడు కాజల్. రోడ్డుమీద తినుబండారాలు అమ్ముతున్న ఓ కుర్రాడు 'అబాక్–జల్‌పన్' అంటూ అరుస్తున్నాడు. కాజల్ అంతవరకూ దాని పేరే వినలేదు. తండ్రి ఇచ్చిన చిల్లర తీసుకునివెళ్ళి దాన్ని కొనుక్కున్నాడు. దాని రుచి వాడికి బాగా నచ్చింది.

"ఒంటరిగా వీధిలోకి వెళ్ళొద్దు ఖోకా! దారి తప్పిపోతే కష్టం" అంటూ హెచ్చరించాడు అపూ.

ఆ మాటలు వాడి చెవికెక్కలేదు. ఏదో పీడకలలోంచి బయటపడినట్టుగా ఉంది వాడి ప్రాణానికి. తాతయ్య గదమాయింపులూ, చీకటి గదిలో ఒంటరిగా పడుకోవాల్సి రావటమూ, అన్నం తిన్నంతసేపూ అత్తయ్యల కసుర్లూ...ఇవన్నీ ఇక భరించనక్కర్లేదు. ఒక్క మెతుకు అన్నం కంచంలోంచి కిందపడినా "ఇష్టమొచ్చినట్టు పారబోస్తావ్, నీదేం పోయిందీ...మీ అయ్య సొమ్మేం లేదిక్కడ" అనే మాటలు వాడినెంతగానో బాధించేవి.

ఎక్కడో దూరానున్న నాన్నను వీళ్ళందరూ ఆడిపోసుకోవటం చూసి వాడి మనసు నొచ్చుకునేది.

ఉత్తరాల బాక్సులో తనపేరిట ఉన్న ఓ ఉత్తరాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు అపూ. కవరు మీదున్న రాత తనకు పరిచయమున్నది కాదు. ఉత్తరం చింపి చదువుతుంటే అతనికి చెప్పలేనంత సంతోషం కలిగింది. అపూ నవలను చదివిన ఓ పాఠకుడు రాశాడది. తమ ఇంట్లో వాళ్ళందరూ కూడా ఆ పుస్తకాన్ని చదివి ఎంతో ఆనందించారని రాశాడు ఆ వ్యక్తి. ప్రచురణకర్తను అడిగి అపూ చిరునామా సంపాదించాడట.

ఆ లేఖను రెండుమూడుసార్లు చదువుకున్నాడు అపూ. తన రచన ఒక్క వ్యక్తికయినా నచ్చిందని చెప్పటానికొక ఆధారం దొరికింది. తనను ఎవరయినా మెచ్చుకుంటే పొంగిపోయే స్వభావం అపూకి చిన్నప్పటి నుండీ ఉంది. చాలాకాలం తర్వాత అతనికి లభించిన ఈ ప్రశంస అతణ్ణి ఆనందంలో ముంచెత్తింది.

కాజల్‌కు మ్యూజియం, జూ చూపించాడు అపూ. ఎప్పుడో అంతరించిపోయిన ఒక జాతి తాబేళ్ళు రెండిటి అవశేషాలను ఆ మ్యూజియంలో భద్రపరిచారు. కాజల్ దృష్టిని అవి బాగా ఆకర్షించాయి. తండ్రికి వాటిని చూపిస్తూ, "అవి రెండూ పోట్లాడుకుంటే ఏది గెలుస్తుందంటావ్ బాబా!" అని అడిగాడు. ఆ ప్రశ్న తనకు చాలా ముఖ్య మయిందన్నట్టుగా చూశాడు అపూ, వాడికేసి. కాస్సేపు ఆలోచించి, "ఆ ఎడమవైపున్నదే, అదే గెలుస్తుందనుకుంటా!" అని జవాబిచ్చాడు. కాజల్ మనసులో సందేహాలన్నీ తీరిపోయాయి తండ్రి జవాబుతో.

❖ ❖ ❖ ❖

అపూ పనిచేస్తున్న కంపెనీ మూతబడటంతో మళ్ళీ నిరుద్యోగ సమస్య ఎదురయింది. కొంతకాలంగా సాఫీగా సాగుతున్న జీవితంలో మళ్ళీ ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. కాజల్‌ను మంచి స్కూల్లో చదివించే స్తోమత లేక కలకత్తా కార్పొరేషన్ నడిపే బళ్ళో చేర్చాడు. వాడికి రోజూ పాలు కొని తాగించటం కూడా వీలుపడటం లేదు. నవల అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

అపూ జీవితలో ఒక్కగానొక్క ఆనందహేతువు కాజల్. అతణ్ణి వాడొక కొత్త లోకంలోకి తీసుకువెళ్ళాడు. కేవలం రెండు రేకు డబ్బాలూ, రెండు గోలీకాయలూ, ఓ బొమ్మా, కాసిని పుస్తకాలూ...వీటిలోంచి అంత ఆనందాన్ని వాడెలా రాబట్టగలుగుతున్నాడో అపూకి అంతుబట్టడంలేదు. తాను బయటికి వెళ్ళాల్సినప్పుడు వాడిని ఇంట్లో ఉంచి తాళం వేసుకుని వెళ్తాడు అపూ. అలా చెయ్యకపోతే వారు వీధిలోకి వెళ్ళిపోతాడని అతడి భయం.

తండ్రి ఇంట్లో లేకున్నా, కాజల్ హాయిగా ఆడుకుంటూ గడుపుతాడు. లేదంటే కిటికీ దగ్గర కూర్చుని వీధిలో వచ్చిపోయే వాహనాలనూ, జనాన్నీ చూస్తూ ఉంటాడు. అపూ దగ్గరున్న పుస్తకాల్లో బొమ్మలు చూడటం కూడా వాడికిష్టమైన కాలక్షేపమే.

వాడి పసి హృదయానికి ఏ కొత్త దృశ్యాన్ని చూసినా అబ్బురమే. తను చూసిన ప్రతి విషయాన్నీ వెంటనే తండ్రికి చూపించాలని వాడి తపన. "చూడు బాబా! ఆ బుజ్జి పిట్ట నోటితో పుల్లల్ని పట్టుకుపోతోందా... ఒకటేమో జారి రోడ్డుమీద పడిపోయింది... ఇంకా ఆ పుల్ల అక్కడే పడుంది చూడు!" అంటూ పరిగెత్తుకొస్తాడు. మరొకసారి వీధిపక్కన సాగుతున్న మురుక్కాలవలో మునకేస్తున్న కాకిని చూడటానికని, వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు మీదికి వెళ్ళిపోతాడు. తనకు తినటానికి ఏది దొరికినా, తండ్రిక్కూడా కాస్త తిన్పించేదాకా ఊరుకోడు. వాడు సగం కొరికి అందించే ఆ మిఠాయి అపూకి మహాప్రీతి. కొడుకును ఏ విషయంలోనూ నిరుత్సాహపరచడం అతడికి ఇష్టంలేదు. అందువల్ల తండ్రీ కొడుకుల స్నేహం త్వరలోనే గట్టిపడింది. ఇంత ఓర్పుగా, అనుకూలంగా ఉండే సహచరుడు దొరకటం కాజల్‌కు ఇదే మొదటిసారి – తనను సంపూర్ణంగా విశ్వసించి, సన్నిహితమైన ఒక చిన్నారి నేస్తం లభించటం అపూ జీవితంలోనూ తొలిసారే!

కాజల్‌లోని అమాయకత్వానికి ముగ్ధుడైపోతాడు అపూ. ఒకరోజు కాజల్ తండ్రి దగ్గరకొచ్చి, "బాబా, నీకో సంగతి చెప్పనా... రహస్యం మరి" అంటూ, దగ్గర్లో ఎవరయినా ఉన్నరేమోనని చూసి చిన్న గొంతుతో చెప్పాడు, "హోటల్లో ఆ వంటాయన నాకు కాస్తంత అన్నమే పెడుతున్నాడు. నాకది చాలటంలేదు...ఆకలేస్తోంది రోజూ! నువ్వు మాట్లాడ్తావా ఆయనతో?"

కొన్నాళ్ళుగా తండ్రి కొడుకులిద్దరూ ఓ చిన్న హోటల్లో భోజనం చేస్తున్నారు. అక్కడి వంటమనిషి కాజల్‌ను ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేసిందేమీ లేదుగానీ, చిన్న కుర్రాడు వృధాగా పారేస్తాడేమోనని కొంచెం కొంచమే వడ్డిస్తున్నాడు. నగరాల్లో ఉండే పిల్లలయితే అంతకన్నా ఎక్కువ తినలేరు కూడాను! కానీ పల్లెటూళ్ళో పుట్టిపెరిగిన కాజల్ కడుపునిండా తిని అరిగించుకోగలడు. రహస్యంగా ఇదంతా చెప్తున్న వాడి మాటలకు నవ్వొచ్చింది అపూకి.

కొద్ది రోజుల తర్వాత మరో తమాషా జరిగింది.

"బాబా, నిన్నో సంగతి అడగనా?" అన్నాడు కాజల్ కాస్త ఇబ్బందిగా మొహంపెట్టి.

"ఏమిటి?"

"మరేమో...అహఁ! ఏం లేదులే!"

"అరె...చెప్పమంటున్నానుగా!"

తండ్రి దగ్గరగా వచ్చి లోగొంతుకతో రహస్యంగా అడిగాడు కాజల్, "బాబా, నువ్వు తాగుతావా?"

అపూ నివ్వెరపోయాడు. "తాగటమా?" అంటే సారానా? ఎవరు చెప్పార్రా, నీకు?"

"నేనే చూశా! ఆ సందు చివరున్న దుకాణంలో సీసా కొనుక్కుని తాగలేదేంటి?"

వాడు చెప్తున్నదేమిటో అర్థమవటానికి కొన్ని క్షణాలు పట్టింది. పగలబడి నవ్వసాగాడు అపూ. “అదా? అది లెమనేడ్ సీసారా వెధవా! నీకు జలుబుగా ఉందని నేనొక్కణ్ణే తాగానారోజు. నీకూ తెచ్చిస్తాలే, కమ్మగా షర్బత్‌లా ఉంటుంది”.

పెద్ద భారం దిగిపోయినట్లుగా నిట్టూర్చాడు కాజల్. లెమనేడ్ అంటే ఏమిటో వాడికి తెలీదు. సారాయిని అట్లా సీసాల్లో పోసి అమ్ముతారని ఎరిగిన కాజల్‌కు, తన తండ్రి దాన్ని తాగటం చూసి బాధకలిగింది. సూటిగా ఆ విషయాన్ని అడగలేక కొన్నాళ్ళు అవస్థపడ్డాడు. అపూ వెంటనే వెళ్ళి కొడుక్కి లెమనేడ్ కొనుక్కొచ్చాడు. దాన్ని తాగాక కాజల్ సందేహాలన్నీ తీరిపోయాయి.

❖ ❖ ❖ ❖

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, కొడుకుతో కలిసి జీవించటం అపూ మనసుకు శాంతి నిచ్చింది. అలా సాగిపోతున్న జీవితంలో కల్లోలం రేపుతూ విమలేందు నుండి ఉత్తరం వచ్చిందారోజు.

లీల కష్టాల్లో ఉందనీ వెంటనే అలీపూర్ వెళ్ళి, ఆమెను కలవమనీ రాశాడు విమలేందు. లీల దగ్గరున్న డబ్బంతా హరించుకుపోయింది. ఆమె భర్త ఏదో సాయం చేస్తాడని ఆశించటం అర్థరహితమేగానీ, పుట్టింటి వాళ్ళక్కూడా ఆమె శత్రువయిపోయింది. తల్లికీ, తమ్ముడికీ తప్ప ఇంకెవరికి ఆమె పొడగిట్టదు. కూతురి పరిస్థితి తెలుసుకున్న లీల తల్లి, విమలేందు ద్వారా కొంత డబ్బు పంపింది. ధారాళంగా ఖర్చుపెట్టడానికి అలవాటు పడిన లీల చేతిలో అది ఆవిరయిపోవటానికి ఎంతో సమయం పట్టలేదు.

లీల ఆరోగ్యం శారీరకంగానూ, మానసికంగానూ కూడా దిగజారిపోయిందని రాశాడు విమలేందు. రోజురోజుకూ చిక్కి శల్యమైపోతున్న లీలను బలవంతంగా డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడతడు. క్రమం తప్పకుండా మందులు వాడటంతోబాటు ఆమెను శ్రద్ధగా కనిపెట్టి ఉండాలని చెప్పాడు డాక్టర్. రెండు రోజులుగా ఆమెకు జ్వరం తీవ్రమై మగతలోకి జారిపోయిందనీ, పనిమనిషి సాయంతో తానొక్కడినే ఆమెను చూసుకుంటున్నాననీ విమలేందు రాసిన జాబు చూసుకుని వెంటనే బయల్దేరాడు అపూ.

అతడు వెళ్ళేసరికి జ్వరంతో ఒళ్ళెరగకుండా పడివుంది లీల. ముఖమంతా ఎరుపెక్కింది. “ఇప్పుడేం చేద్దాం?” భయంగా అడిగాడు విమలేందు. అతని ముఖం పాలిపోయి ఉంది. “మా ఇంట్లో వాళ్ళెవరూ రారు, వాళ్ళను అడిగినా ప్రయోజనం లేదు. కాశీ నుండి వచ్చెయ్యమని అమ్మకు టెలిగ్రాం ఇవ్వనా?”

“ఆమె రానంటేనో?”

“లేదు…అమ్మ తప్పకుండా వచ్చేస్తుంది. దీదీ మీద ఆమెకు నిజంగా చాలా ప్రేమ! కానీ, దీదీ ఈ పని చేశాక, ఇక ఆ ఇంట్లో ఉండలేక వెళ్ళిపోయింది. పరిస్థితి ఇలా

ఉందని తెలిస్తే వెంటనే వచ్చేస్తుంది. అసలు సమస్య ఇంకోటుంది...కూతుర్ని చూడాలని కలవరిస్తోంది దీదీ. ఆ పిల్లను తీసుకురావటం ఎలా వీలవుతుందన్నదే నాకర్థం కావటం లేదు."

"చూద్దాం. ముందుగా ఓ నర్సును మాట్లాడటం అవసరం. లీలను జాగ్రత్తగా చూసుకోవాలంటే ఆడవాళ్ళుంటే తప్ప సాధ్యంకాదు" అన్నాడు అపూ. విమలేందును అక్కడే ఉండమని తను వెళ్ళి ఓ నర్సును కుదుర్చుకుని వెంటపెట్టుకొచ్చాడు.

అందరూ కలిసి రెండు రోజులు శ్రమపడిన తరువాత, కొద్దిగా కోలుకుంది లీల. అపూని గుర్తుపట్టి, "నువ్వెప్పుడొచ్చావ్, అపూర్వా?" అని పలకరించింది.

క్రమంగా ఆమె శారీరక స్థితి మెరుగుపడుతోంది. కానీ, మానసికంగా కోలుకోవటం లేదు. మౌనంగా కూర్చునో, పడుకునో ఉండిపోతుంటుంది. ఎవరెంతగా చెప్పినా ఉన్న చోటి నుండి కదలనంటుంది. ఎవరితోనూ మాట్లాడదు, పలకరించినా చిరునవ్వయినా నవ్వదు. మనిషి బాగా చిక్కిపోయింది, జుట్టంతా రాలిపోతోంది.

లీల తల్లి కాశీ నుండి వచ్చేసింది. కానీ ఆ ఇంట్లో ఉండటానికి ఆమె ఇష్టపడలేదు. తమ ఇంట్లోనే ఉంటూ రోజూ కారులో వచ్చి, కొంతసేపు కూతురి దగ్గర కూర్చుంటోంది. లీల ఆరోగ్యం మెరుగుపడాలంటే గాలి మార్పు అవసరమని సలహా ఇచ్చాడు డాక్టర్.

ఓ మధ్యాహ్నం అపూ వెళ్ళేసరికి ఒంటరిగా కిటికీ దగ్గర కూర్చొని ఉంది లీల. ఆకాశం మబ్బులు పట్టి ఉందారోజు. కాజల్‌ను ఒక్కణ్ణే ఇంట్లో వదిలిపెట్టలేక లీల దగ్గరికి ప్రతిరోజూ రాలేకపోతున్నాడు అపూ.

"రా, అపూర్వా!" అంటూ ఆహ్వానించింది లీల. ఆమె నవ్వులో జీవంలేదు.

"ఎవరూ లేరా? అమ్మ ఇంకా రాలేదా?" అని పలకరిస్తూ గదిలోకి అడుగుపెట్టాడు అపూ.

"విమల్ ఇప్పుడే ఎక్కడికో వెళ్ళాడు. నర్సు కింద హాల్లోకి వెళ్ళినట్టుంది. ఇలా కూర్చో!"

"ఇంతకూ ఏం నిర్ణయించుకున్నావ్ లీలా! ధరమ్‌పూర్ వెళ్లాలనే అనుకుంటున్నావా? నీతోబాటు ఎవరొస్తున్నారు మరి?"

"అమ్మా, విమల్ వస్తామంటున్నారు".

కొంతసేపు ఇద్దరిమధ్యన మౌనం నెలకొంది. "బర్ద్వాన్‌లో మా ఇల్లు గుర్తుందా అపూర్వా?" ఉన్నట్టుండి అడిగింది లీల.

"లేకేం! బాగా గుర్తుంది" అన్నాడు అపూ ఆమె ధోరణికి ఆశ్చర్యపడుతూ

"ఓ చివరగా ఉండే గదిలో ఉండేవాడివి కదూ! నేను అప్పుడప్పుడూ వస్తుండేదాన్ని" ఏదో లోకంలో ఉన్నదానిలా మాట్లాడుతోందామె.

"నా కోసం ఓ ఫౌంటెన్ పెన్ తెచ్చిచ్చావ్, గుర్తుందా లీలా! ఆ రోజుల్లో ఆ పెన్నులు చాలా ఖరీదు."

లీల చిరునవ్వు నవ్వింది.

"అది...దాదాపు ఇరవై రెండేళ్ళ కిందట విషయం..." గుర్తుకు తెచ్చుకున్నాడు అపూ.

మళ్ళీ కొంతసేపు నిశ్శబ్దం తర్వాత అడిగింది లీల, "నీకు తెలిసిన వాళ్ళెవరయినా నా కారు కొంటారేమో అడుగుతావా అపూర్వా?"

అపూ గుండెల్లో కలుక్కుమన్నట్లయింది. లీలకు ఆ కారంటే ఎంత ఇష్టమో అతనికి తెలుసు. మరీ అంత ఇబ్బందుల్లో ఉందా లీల!

"నన్ను గురించి ఎవరెలా అనుకున్నా పరవాలేదు, నేను పట్టించుకోను...ఆఖరికి అమ్మయినా సరే, నాకేం భయంలేదు. నన్నెక్కడికయినా తీసుకెళ్తావా అపూర్వా?" హటాత్తుగా అంది లీల.

"ఎక్కడికి?"

"ఎక్కడికయినా సరే. నీకు గుర్తుందా...చిన్నప్పుడు ఓ కథ చెప్పేవాడివి! సముద్ర మధ్యంలో మునిగిపోయిన ఒక ఓడ...నువ్వు ధైర్యంగా దానిలోకి వెళ్ళి అందులోని బంగారం తీసుకురావటం! అక్కడికి తీసుకెళ్ళు".

"ఔనౌను. ఆ కథ నీకింకా గుర్తుందా లీలా?" ఆశ్చర్యపోయాడు అపూ.

"సముద్రం మధ్యలోకి ఎలా వెళ్తావోనని అడిగాన్నేను. ఓ నావను కొనుక్కుని దాన్లో వెళ్ళిపోతాననే వాడివి కదూ!"

అపూ చిరునవ్వు నవ్వాడు. బాల్యంలోని ఆశలూ, కలలూ ఎంత అసంబద్ధమైనవో, అమాయకమైనవోనని అనబోయి, చప్పున ఆగిపోయాడు. లీలక్కూడా ఉండేవి ఎన్నో స్వప్నాలు...గొప్ప చిత్రకారిణిగా పేరు తెచ్చుకోవాలనీ, విదేశాలకు వెళ్ళాలనీ, ఆ బాల్య స్వప్నాలను గురించి తానిప్పుడు తేలికగా మాట్లాడితే ఆమె మనసు నొచ్చుకుంటుందేమో!

కానీ, లీల మాత్రం ఆ విషయాన్ని వదలటంలేదు. కొద్ది క్షణాల తరవాత మళ్ళీ అదే ప్రసక్తి తీసుకొస్తూ, "ఇప్పుడు వెళ్ళిపోరాదూ అక్కడికి? ఏమిటదీ...పోర్టో ప్లాటా కదూ...?" పకపకా నవ్వింది. "వెళ్ళు...వెళ్ళిపో! బోల్డెంత బంగారం...ఎవరు పట్టుకొస్తారు నువ్వు తప్ప! హీ...హీ...నాకంతా గుర్తుందిలే అపూర్వా! హహ్హహ్హా..టీ తాగుతావా?"

లీల నవ్వు మామూలుగా లేదు. ఆమె మాటల నడుమ బొత్తిగా పొంతనలేదు. ఆమెను చూస్తుంటే అపూ గుండెల్లో కత్తితో పొడిచినట్టయింది. ఆమెపై ప్రేమ, వాత్సల్యం పొంగిపొరలాయి.

"ఇప్పుడేమీ వద్దు లీలా. ఈ మధ్యాహ్నం వేళ టీ తాగటమేమిటి? నువ్వేమీ శ్రమ తీసుకోకు" అన్నాడు.

"అపూర్వా ఒక్క పాట పాడవూ! "శాంతి లేని హృదయం నాది...అందరాని ఆశలు నావి" అనే పాట పాడేవాడిని కదూ? ఎన్నాళ్ళయింది ఆ పాట విని! ఒక్కసారి పాడవూ?"

మేఘావృతమైన ఆకాశంతో దిగులుగా ఉందా మధ్యాహ్నం. పక్కింటి ఆవరణలోని చెట్టుపై పిట్టల కువకువలు తప్ప అంతటా గాఢమైన నిశ్శబ్దం. పాడటం ప్రారంభించాడు అపూ. లీల ముఖం అవతలకు తిప్పుకుని కిటికీలోంచి ఎక్కడో శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. పాట పూర్తయింది. ఆమె కోరిన పాట పాడినందుకు లీల సంతోషిస్తుందనుకున్నాడు అపూ. ఆమె పాడమంటే మరొకసారి ఆ పాట పాడుదామని ఎదురుచూస్తున్నాడు. కానీ లీల ఎంతసేపటికీ వెనక్కి తిరిగి చూడటమే లేదు. అలాగని, ఆ కిటికీలోంచి ఆమె చూస్తున్నది కూడా ఏమీలేదు. ఆమె చూపుకొక లక్ష్యం లేదు. మతికోల్పోయిన దానిలా కూర్చున్నదంతే.

"నాకో విషయం చెప్తావా?" హటాత్తుగా ప్రశ్నించింది లీల.

అసాధారణంగా ధ్వనించిన ఆమె గొంతు విని, ఉలిక్కిపడ్డాడు అపూ. "ఏమిటి?" అన్నాడు.

"మనుషులు ఎందుకు బతుకుతారంటావ్? బతుక్కి అర్థమేమిటసలు?" ఆమె నుండి అటువంటి ప్రశ్నను ఊహించలేదు అపూ. "ఏం మాటలవి లీలా? నువ్వసలు..." ఏదో చెప్పబోయాడు.

"జవాబు చెప్పు!" అతడి మాటలను అడ్డుకుంటూ అన్నదామె.

"నాకు తెలీదు. నువ్విలాంటి మాటలు మాట్లాడకూడదు."

"ఐతే సరే. ఇంకోటడుగుతా చెప్పు! నిజం చెప్పాలి సుమా!"

"అలాగే".

"ఈ జనమంతా ఏమనుకుంటున్నారు నన్ను గురించి?"

ఈ మాటలంటున్నది లీలేనా? అతి దీనంగా, నిస్సహాయంగా ఇటువంటి ప్రశ్న అడగాల్సిన రోజొకటి ఆమె జీవితంలో వస్తుందని ఎవరనుకున్నారు! హుందాగా, సగర్వంగా నిలబడి, ఏ సమస్యనయినా ఇట్టే ఎదుర్కొనేంత ధీమాగా ఉండేది లీల. మనుషుల్లోని క్రౌర్యాన్ని చూసి భరించలేని స్వభావం ఆమెది. కానీ, కొన్ని సంవత్సరాలుగా ఆమె హృదయం తన జీవితమే నిరర్థకమనే నిస్పృహలోకి జారిపోతోంది.

అపూ గొంతుకి ఏదో అడ్డుపట్టయింది. వీలయినంత మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నిస్తూ "ఇతరుల సంగతి నాకు తెలీదు లీలా! నేనేమనుకుంటున్నానో చెప్పనా? నువ్వు నాకన్నా, నా వంటి చాలామంది మనుషులకన్నా ఉన్నతురాలివి. నువ్వేమిటో వీళ్ళకెవరికీ అర్థంకాదు, అర్థం చేసుకునే ప్రయత్నం కూడా వీళ్ళు చెయ్యరు. మన పరిచయం నిన్న మొన్నటిది కాదు, చిన్నప్పటి నుండి నిన్ను చూస్తున్న వాణ్ణి కదా, నేను? ఎంతమంది నిన్ను అపార్థం చేసుకున్నా సరే, నాకు తెలుసు నువ్వేమిటో..."

లీలతో ఇలా మాట్లాడటం అతడికదే మొదటిసారి. ఆమె కొంచెం స్థిమితపడింది. "నిజంగానా?" అని అడగాలనుకుంది. కానీ ఆమె పెదవులు విడివడలేదు. అతడి ముఖంలోకి చూస్తుంటే ఆ ప్రశ్న అడగాల్సిన అవసరం కనబడలేదు.

లీల అలా చూస్తుండగానే చప్పున పైకి లేచాడు అపూ. తెలియని భావోద్వేగమేదో అతణ్ణి ముందుకు నడిపించింది. లీల కుడిచేతిని తన రెండు చేతుల మధ్యకు తీసుకుని, ఆమెను తనకేసి తిప్పుకున్నాడు. ఉబ్బిపోయిన ఆమె ముఖాన్ని అంతులేని ప్రేమతో మృదువుగా స్పృశిస్తూ, చెదిరిపోయిన ఆమె జుట్టును సరిదిద్దాడు. "మనం బాల్యమిత్రులం లీలా! ఏ పరిస్థితుల్లోనూ మనం దూరమవబోము. ఇన్నేళ్ళపాటు...నేనెక్కడున్నా ఏం చేసినా నిన్ను మరిచిపోయిన క్షణం లేదు".

లీల తనువంతా పులకరించింది. అపూ అందించిన ఈ అనుభూతిని మరెవరూ ఆమెకు కలిగించలేదు. అతని దృఢమైన పలుకులే కాదు, నిజాయితీ తొణికిసలాడే అతని చూపు సైతం ఆమెకు చేసిన ఈ వాగ్దానాన్ని, మరే వ్యక్తీ చెయ్యలేదు. తన జీవితమంతా అతడిపై ప్రేమను పెంచుకుంటూనే ఉన్నాననీ, తల్లిని పోగొట్టుకుని బికారిలా వీధుల్లో తిరుగుతూ ఒకనాడు తనకు ఎదురయిన అపూ మీద ప్రేమతో తన హృదయం నిండిపోయిందనీ ఆమెకా క్షణంలో స్పష్టంగా అర్థమయింది.

ఏవో ఆలోచనల్లో పడి, అచేతనంగా ఉండిపోయిన అపూ, కన్నీటితో తడిసి ముద్దయిన లీల వదనం తన వక్షంపై ఆనగానే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

లీల గది నుండి బయటికొచ్చి, ఇంటికి నడుస్తున్న అపూ మనసునిండా రకరకాల ఆలోచనలు. అతడిలోని ప్రతి అణువూ అమెపై ప్రేమతో పొంగిపొరలుతోంది. లీలను ఆనందంగా ఉంచగలిగే మార్గాన్ని వెదకాలి. ఆమె జీవితంలో ఇకపై విషాదపు ఛాయలు దరిజేరటానికి వీల్లేదు; ఆమెను ఎవరు అవమానించినా తను సహించబోడు. ఈ నగరంలో ఉండటం ఆమె ఆరోగ్యానికి ఏమాత్రమూ సరిపడదు. వెంటనే లీలను ఇక్కణ్ణించి దూరంగా తీసుకుపోవాలి. లోకమంతటినీ ఎదిరించయినా సరే, లీల కోరిన కోరిక తీర్చాల్సిందే.

❖ ❖ ❖ ❖

మూడు రోజులు గడిచిచాయి.

ఉదయం ఎనిమిది కావొస్తోంది. అప్పుడే స్నానం చేసొచ్చి, కాజల్‌ను కాస్సేపు షికారుకు తీసుకువెళ్దామని బయల్దేరబోతున్నాడు అపూ. లీలకు తమ్ముడి వరసయ్యే కుర్రాడు, అరుణ్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"వెంటనే బయల్దేరండి, దీదీ విషం మింగింది."

"ఏమిటీ! విషమా? లీల విషం తీసుకుందా? అపూ నమ్మలేకపోతున్నాడు.

కాజల్‌ను ఎక్కడ వదిలి వెళ్ళాలో అర్థమవటం లేదు. చివరికి ఒక నిశ్చయానికొచ్చి, "నాకొక్క పనుంది నాన్నా, తొందరగా వెళ్ళాలి. వచ్చేసరికి ఆలస్యమవుతుందేమో, నువ్వు ఇంట్లోనే ఉంటావుగా?" అని అడిగాడు వాడిని.

కాజల్ ఒప్పుకున్నాడు. కానీ, ఏమిటా పని? ఎక్కడికి వెళ్ళాలి? ఎంతసేపు పడుతుంది? అంటూ ఎన్నో ప్రశ్నలు వేశాడు. తోచిన జవాబులేవో చెప్పి, అరుణ్‌తోబాటు టాక్సీలో బయల్దేరాడు అపూ. లీలావాళ్ళ ఇంటి ఆవరణలో ఎవరివో రెండు కార్లు ఆగి ఉన్నాయి. డాక్టర్ కేదార్‌బాబు హాల్లోనే ఎదురయ్యాడు.

"ఎలా ఉందండీ?" అడిగాడు అరుణ్ కంగారుగా.

"అలాగే ఉంది. ఇంకో ఇంజెక్షన్ కూడా ఇచ్చాను. కల్నల్ హిల్‌కాక్ కోసం చూస్తున్నా".

లీల పరిస్థితిని గురించి అపూ అడిగిన ప్రశ్నలక్కూడా జవాబిచ్చాడు ఆయన. "చాలా అన్యాయం జరిగిపోయింది. మార్ఫిన్ తీసుకుందామె. రాత్రి ఏ సమయంలోనో చేసిందీ పని. తెల్లవారాకగానీ జరిగిన దారుణం తెలియలేదు...కల్నల్ హిల్‌కాక్ గారిని పిలుచురావటానికి ఎవరినైనా పంపించొస్తా..." అంటూ వెళ్ళిపోయాడు డాక్టర్.

అపూని లీల గదిలోకి తీసుకువెళ్ళాడు అరుణ్. మూడురోజుల కిందట లీలతో మాట్లాడి, ఆమె కోరిన పాటలు పాడిన సంగతి గుర్తొచ్చి అపూ శరీరం జలదరించింది. ఆ గదిలోకి వెళ్ళటానికి మనస్కరించలేదు. గదిలో ఎక్కువమంది లేరుగానీ, గది ముందున్న వరండాలో చాలామంది గుమిగూడి ఏదో గుసగుసలాడుకుంటున్నారు. ఆ ఇంట్లో ఒక దారుణం జరిగిందన్న ఆందోళన వాళ్ళ ముఖాల్లో లేదన్పించింది అపూ మనసుకు. వాళ్ళకు కేవలం కొద్ది అడుగుల దూరంలో ఒక మనిషి చావు బతుకుల్లో కొట్టుమిట్టాడు తోందనీ, ఒకనాడు జీవితాన్ని ఎంతగానో ప్రేమించి, జీవన మాధుర్యాన్నంతటినీ అందుకోవాలని తపించిన ఆమె, ఇప్పుడు శాశ్వతంగా ఈ లోకం నుండి నిష్క్రమించ బోతోందని తెలిసికూడా నిర్లిప్తంగా నిలబడ్డారు వాళ్ళు.

కిటికీ పక్కగా ఉన్న మంచంపై నిశ్చలంగా పడివుంది లీల. తేలికయిన సిల్కు శాలువా కప్పుకుని ఉంది. పాలిపోయిన ముఖంతో, స్పృహలేని స్థితిలో ఉన్న లీల పెదవులు లేత నీలంరంగుకు తిరిగాయి. మంచంపై నుండి కిందికి వేలాడుతున్న ఆమె చేతిని పైకి సర్దాడు అపూ. చావుబతుకుల సరిహద్దుల్లో నిలిచిన ఆ స్థితిలో కూడా లీల వదనం అద్భుతమైన సౌందర్యంతో ప్రకాశిస్తోంది. అది ఈ లోకానికి చెందిన అందం కాదు. ఎన్నడూ లేనంత సుందరంగా, ఓ దేవతలా ఉందామె.

లీల శరీరమంతా చెమట పట్టింది. ఇది దేనికి సూచిక? ప్రమాదం నుండి బయట పడుతోందా? అపూకేమీ అర్థంకాలేదు. డాక్టర్ దగ్గరికి వెళ్ళి అడిగాడు.

"మార్ఫిన్ లక్షణాల్లో అదొకటి" అన్నాడాయన.

పది నిమిషాలు గడిచాయి. లీల గదిలోంచి బయటికొచ్చి వరండాలో నిలబడ్డాడు అపూ. ఎవరెవరో వచ్చి లీలను చూసి వెళ్తున్నారు. లీల తల్లీ, తాతగారూ ఆరోజు ఇంట్లో లేరు. తాతగారు ఏదో పనిమీద డార్జిలింగ్ వెళ్ళారట. లీలావాళ్ళమ్మ కిందటి రోజునే బర్ద్వాన్‌కు వెళ్ళింది. లీల అన్ని విధాలా దురదృష్టవంతురాలు!

ఇంటిముందు కారు ఆగిన చప్పుడయింది. ఇంగ్లీషు డాక్టరును వెంటబెట్టుకుని వచ్చిన కేదార్‌బాబుతోబాటు విమలేందు కూడా లీల గదిలోకి వెళ్ళాడు. పది నిమిషాల తర్వాత బయటికొచ్చిన డాక్టర్ హిల్‌కాక్, "లాభంలేదు, చాలా ఆలస్యమయిపోయింది" అంటూ వెళ్ళిపోయాడు.

పది గంటలకు అంతిమశ్వాస వదిలింది లీల. చివరి క్షణాల్లో ఆమె పక్కనే నిలబడ్డాడు అపూ. కళ్ళు మూసుకుని పడుకున్న లీల, హటాత్తుగా కళ్ళు తెరిచింది. ఆమె కనుపాపలు అస్థిరంగా కదులుతూ వెళ్ళి, అపూ ముఖంపై దృష్టినిలిపాయి. అపూ శరీరమంతా విద్యుదాఘాతం తగిలినట్టుగా వణికిపోయింది. ఆమె తనను గుర్తించిందా? లేదేమో. ఆమె చూపు నిస్తేజంగా, నిర్లిప్తంగా, అసహజంగా ఉంది. ఆ మరుక్షణమే ఆమె కళ్ళు గది పైకప్పుకేసి తిరిగి అక్కడి నుండి ఏదో వెదుకుతున్నట్లుగా కిటికీ వైపు చూశాయి. అంత వేగంగా కనుపాపలను కదల్చగలగటం మామూలు స్థితిలోని మనిషికి సాధ్యపడదు.

కాస్సేపట్లో బంధువులందరూ గదిలోంచి వెళ్ళిపోయారు. పసివాడిలా వెక్కిళ్ళు పెడుతున్న విమలేందు రోదన తప్ప, మరే అలికిడీ లేదక్కడ.

అపూకి ఏం చెయ్యాలో తోచలేదు. ఆ ఇంట్లోంచి బయటకొచ్చి నడుస్తున్న అతడి మెదడులో వేలాది ప్రశ్నలు ముసురుకున్నాయి.

ఏది పాపం? ఏది పుణ్యం? వాటికి అర్థాలేమిటి? నిర్వచించగలవాళ్ళెవరు? మూర్ఖులు... ఈ జనమంతా ఉత్తి మూర్ఖులు, అవివేకులు! లీల మంచి చెడులనూ, ఆమె వ్యక్తిత్వాన్నీ నిర్ణయించేది వీళ్ళా? ఈ మూర్ఖులా?

అంత దుఃఖంలోనూ పగలబడి నవ్వాలన్పించిందతడికి.

## 22

**కా**జల్ చదువు బాగానే సాగుతోంది. ఇటీవలి కొన్ని నెలలుగా వాడికి చదవటమూ, రాయటమూ బాగా అలవాటయింది. తరగతి పుస్తకాలు చదవటం అయిపోయాక రోజూ కొంతసేపు తండ్రి పుస్తకాలను తిరగేస్తాడు కాజల్. అపూ ఈ మధ్య చాలా హడావిడిగా ఉంటున్నారు. అతడు ఇంటిపట్టునుండే సమయం కూడా తగ్గిపోయింది. కాజల్ నెమ్మదిగా తన పనులు తాను చేసుకోవటం నేర్చుకుంటున్నాడు.

కాజల్‌కు నేస్తాలుగా నాలుగు పిల్లి కూనలు దొరికాయి. వాడు భోజనానికి పళ్ళెం ముందు కూర్చోగానే అవన్నీ బిలబిల్లాడుతూ వచ్చి చేరుతాయి. అన్నంమీద వాటికేమంత ఆసక్తి లేదు. వాటి దృష్టంతా చేపముక్కల మీదనే. వాటి ఆకలి చూపులకు కాజల్ గుండె కరిగిపోతుంది. అన్నిటికన్నా పసికూనకు ఓ చేపముక్క వేస్తాడు. ఆ ముక్క కోసం నాలుగు పిల్లలూ భీకర సంగ్రామం మొదలుపెడతాయి. కాజల్‌కు మరింతగా జాలేసి తన పళ్ళెంలోని చేపల కూరంతా వాటి ముందు పెడతాడు. రాత్రుళ్ళు అవి నిద్రపోయేందుకని ఓ చెక్క పెట్టెను కూడా ఏర్పాటుచేశాడు.

ఆవిరి యంత్రంతో నడిచే మోటారుకార్లను చూస్తే కాజల్‌కు మహా ఇష్టం. దాన్ని నడిపే డ్రైవర్లను కళ్ళు విప్పార్చుకుని ఆశ్చర్యంగా, అసూయగా చూస్తుంటాడు. అలాంటి ఉద్యోగం చేస్తే ఎంత బావుంటుందోనని కలలుకంటాడు. ప్రతి రాత్రీ నిద్రపోయే ముందు ఇంజన్ డ్రైవర్ల గురించి తండ్రిని బోలెడన్ని ప్రశ్నలు వేస్తాడు.

హాయిగా సాగిపోతున్న ఆ పసివాడి జీవితంలో ఇబ్బందులు వచ్చిపడ్డాయి, అపూ జబ్బుపడటంతో. ఒకరోజు కాజల్ నిద్రలేచి చూసేసరికి అపూ జ్వరంతో పడుకునే ఉన్నాడు. ఎప్పుడూ తనకన్నా ముందే లేచే నాన్న, ఇలా పడుకోవటం వాడికి ఆశ్చర్యమనిపించింది. టైము చూస్తే పది కావొస్తోంది. కాజల్‌కు ఏమీ పాలుపోక తండ్రిని చూస్తూ కూర్చున్నాడు.

అపూ జ్వరం అంతకంతకూ తీవ్రమవుతోంది. సాయంత్రం అవుతున్నా అతడు స్పృహలేనట్టుగా పడుకునే ఉన్నాడు. కాజల్‌కు లోకమంతా తలకిందులయినట్టుగా అన్పిస్తోంది. చీకటిపడుతుండగా వాడు లాంతరు పట్టుకుని కిరాణా దుకాణానికి వెళ్ళి, రొట్టె కొనుక్కొచ్చాడు. ఆ దుకాణం యజమాని పరమానంద్ కాజల్‌కు పరిచితుడే.

ఎంతసేపటికీ తండ్రి లేచే ఛాయలు కనబడడంలేదు. కాజల్‌కు భయంతో మతిపోతోంది. తనేం చెయ్యాలిప్పుడు? అపూ మగతలోనే ఏదో పలవరిస్తున్నాడు. మళ్ళీ పరమానంద్ దగ్గరకు వెళ్ళి పరిస్థితి వివరించాడు కాజల్. ఇద్దరూ కలిసి ఆ వీధి చివరనున్న హోమియోపతి డాక్టరు దగ్గరకు వెళ్ళారు. ఆయన వచ్చి అపూని పరీక్షించి కాజల్‌ను తన ఆస్పత్రికొచ్చి మందులు తీసుకువెళ్ళమన్నాడు.

అపూ ఉలిక్కిపడి కళ్ళు విప్పాడు. "ఒద్దొద్దు...వాడు చిన్న పిల్లాడు, చీకట్లో రాలేడు" అన్నాడు ఆందోళనగా.

తాను పెద్దవాడినయ్యాననీ, తనకన్నీ తెలుసుననీ అనుకుంటున్న కాజల్‌కు, పరాయి వాళ్ళముందు బాబా తననిలా చిన్నబుచ్చటం నచ్చలేదు. డాక్టరు వెంట పరమానంద్ వెళ్ళాడు. తండ్రికి తినటానికేమయినా వండుదామన్పించింది కాజల్‌కు. స్టవ్ తీసుకెళ్ళి, వరండాలో పెట్టుకుని వెలిగించే ప్రయత్నంలో పడ్డాడు. అది అపూ కంటపడింది. "ఏం చేస్తున్నావ్ ఖోకా! దాన్నక్కడ పెట్టెయ్" అంటూ అరుపులు మొదలెట్టాడు.

తను వంటచెయ్యగలనన్న నమ్మకం కూడా బాబాకు లేకపోవటం కాజల్‌కు కోపం తెప్పించింది. "మరేం తింటావ్ బాబా? పోనీ, బిస్కెట్లు పట్టుకురానా?" అడిగాడు.

"ఒద్దొద్దు, నువ్వెక్కడికీ వెళ్ళొద్దు. చీకట్లో దారి తప్పిపోతావ్ ఖోకా, నాకసలు ఆకలి లేదు".

మరునాడు ఉదయం ఆస్పత్రికి వెళ్ళి మందులు తెచ్చాడు కాజల్. వాటితోబాటుగా నారింజలూ, దానిమ్మపళ్ళూ, పాలూ కూడా కొనుక్కొచ్చాడు. అవన్నీ చూసి కంగారుపడ్డాడు అపూ. "నాకేమీ వద్దని చెప్పానుగదా! రోడ్డు దాటుకుని పాల దుకాణానికెందుకు వెళ్ళావ్? కార్లూ, బస్సులూ ఎంత వేగంగా వస్తుంటాయ్..." అన్నాడు భయంగా.

కాసేపయ్యాక కాజల్‌ను పిలిచి, "ఆ బ్రెడ్ తినేసి, పాలు తాగేయ్ నాన్నా! నేనొచ్చి అన్నం వండేస్తా" అన్నాడు అపూ.

కానీ, మధ్యాహ్నానికల్లా జ్వరం తీవ్రమయింది. సాయంత్రం వేళకు అతను దాదాపుగా అపస్మారక స్థితికి చేరాడు. కాజల్ మళ్ళీ డాక్టర్ దగ్గరికి పరిగెత్తుకెళ్ళాడు. డాక్టరు వేరే మందులిచ్చి, రోగి నుదుటిని చల్లటి నీళ్ళతో తుడుస్తూ ఉండమని చెప్పాడు.

తండ్రి కోసం ఆందోళన పడుతున్న ఆ కుర్రాణ్ణి చూసి జాలిపడ్డాడు డాక్టర్. "మీరిద్దరే ఉంటున్నారా బాబూ! ఆయనకు జ్వరం మరీ ఎక్కువయితే ప్రమాదం. మీ వాళ్ళెవకయినా టెలిగ్రాం ఇద్దామా?" అని అడిగాడు.

"మాకెవరూ లేరండీ. మా అమ్మ చచ్చిపోయింది. బాబా తప్ప నాకెవరూ లేరు."

"అయ్యో, అలాగా! నువ్వొక్కడివీ ఆయన్ని చూసుకోలేవు. ఈ రాత్రికి చూసి, ఆస్పత్రిలో చేరుద్దాం."

భయంతో కాజల్ ఒళ్ళు చల్లబడిపోయింది. బాబాను ఆస్పత్రిలో చేర్చటమా! అక్కడికి తీసుకెళ్ళేంత జబ్బు చేసిన వాళ్ళెవరూ బతకరని వాడికెవరో చెప్పగా విన్నాడు.

డాక్టర్ వెళ్ళిపోయాడు. అపూ మూసిన కన్ను తెరవకుండా పడుకున్నాడు. కాజల్ తెచ్చిన పళ్ళు అలాగే ఉన్నాయి. బాబా ఇక లేవడేమో! ఒకవేళ ఈ జ్వరం తగ్గకపోతే ఎలా? వాడి గుండెల్లో రాయిపడినట్టయింది. వరండాలోకి పరుగెత్తుకెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చాడు. "మా బాబాకు జ్వరం తగ్గించు దేవుడా! తొందరగా లేచి తిరిగేట్టు చెయ్! లేదంటే నేను కూడా చచ్చిపోతా!" అంటూ ప్రార్థించాడు.

తండ్రి పడక పక్కనే చాప వేసుకుని పడుకున్నాడు కాజల్. గది మూలన లాంతరు వెలుగుతోంది. గోడమీద కదులుతున్న నీడలను చూస్తుంటే భయం వేస్తోంది. త్వరగా తెల్లవారితే బావుణ్ణు! భయంతో కళ్ళు గట్టిగా మూసుకున్నాడు కాజల్.

❖ ❖ ❖ ❖

అపూ జబ్బుపడి లేచి నెల దాటింది. ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరం లేకుండానే కోలుకున్నాడతడు. ఆ వీధి చివరన ఉండే బెనర్జీగారి కుటుంబం పుణ్యాన అపూ మళ్ళీ మనిషయ్యాడు. బెనర్జీగారి అబ్బాయి పెద్ద డాక్టర్. అపూ అద్దెకుంటున్న గది యజమాని ద్వారా విషయం తెలిసి, అతడు స్వయంగా వచ్చి చూశాడు. రోగిని పరీక్షించి, ఇంజెక్షన్లిచ్చాడు. కాజల్‌ను తీసుకెళ్ళి భోజనం పెట్టించడమేగాక, వాళ్ళకు సాయంగా ఒక మనిషిని ఏర్పాటుచేశాడు. కొద్ది రోజుల్లో అపూ ఆరోగ్యం మెరుగుపడింది. బెనర్జీగారి కుటుంబానికి అపూ, కాజల్ ఎంతో సన్నిహితులయ్యారు.

మార్చి నెల వచ్చింది. అపూకి ఇంకా ఉద్యోగం దొరకలేదు. అతడి రచనలకు ఆడపా దడపా వచ్చే పారితోషికాలు తప్ప, మరొక ఆధారం లేదు. ఒకరోజు పొద్దున కాజల్‌కు చదువు చెప్తూ ఉన్నాడు అపూ. ఇంతలో ఓ యువకుడు గుమ్మంలోకొచ్చి “లోపలికి రావచ్చాండీ!” అన్నాడు. అతడికి దాదాపు ఇరవయ్యేళ్ళుంటాయి. కళ్ళజోడు పెట్టుకున్నాడు.

అపూ జవాబుచెప్పబోయే లోపలే ఆ యువకుడు “నమస్కారం! అపూర్వబాబు మీరే కదూ?” అంటూ చేతులు జోడించాడు.

“నమస్కారం, రండి లోపలికి” అంటూ ఆహ్వానించాడు అపూ.

“నేను యూనివర్సిటీలో చదువుతున్నాను. మీ నవల చదివాను. చాలా నచ్చింది. నా స్నేహితులందరికీ కూడా ఎంతో నచ్చింది మీ పుస్తకం. మిమ్మల్ని కలవాలన్పించి, చిరునామా సంపాదించి ఇలా వచ్చాను” అంటూ పరిచయం చేసుకున్నాడు ఆ వ్యక్తి.

అపూ ఆనందంతో పొంగిపోయాడు. ఉన్నత విద్యావంతుడైన ఆ యువకుడు తన రచనను అభిమానించి, తన ఇల్లు వెదుక్కుంటూ రావటం...ఇది అపూ జీవితంలో సరికొత్త అనుభవం.

ఆ విద్యార్థి గదిలోకొచ్చి చాపమీద కూర్చున్నాడు... “ఇక్కడ... ఇక్కడే ఉంటున్నారా మీరు?” అన్నాడు గదిని కలియజూస్తూ.

అపూకి ఇబ్బందిగా అన్పించింది. పాత సామాన్లతో చిందరవందరగా పడున్న వస్తువులతో అస్తవ్యస్తంగా ఉందాగది. కాసేపటి కింద తనూ, కాజల్ మరమరాలు తిన్న పళ్ళేలు అక్కడే పడున్నాయి. ఏం మాట్లాడాలో తోచక, కొడుకుని మందలించాడు, “చెప్పిన మాట వినవేంరా! ఫలహారం చేసిన పళ్ళేలు ఇలా పడెయ్యొద్దని రోజూ చెప్తూనే ఉన్నాను గదరా!”

ఊహించని ఈ అభాండానికి ఒళ్ళు మండిన కాజల్, “అది నేను తిన్నది కాదు! దాన్లో తిన్నది నువ్వేకదా బాబా...” అన్నాడు వెంటనే.

“సరే, సరే! ఈ పాఠం రాయటం పూర్తయిందా?”

వాళ్ళిద్దరి సంభాషణ కొనసాగుతుండగానే మధ్యలో కల్పించుకుని మాట్లాడాడు కొత్త వ్యక్తి, “మీ పుస్తకం గురించి సాహిత్య రంగంలో చాలా చర్చ జరుగుతోంది అపూర్వ

బాబూ! ఇవాళ మధ్యాహ్నం మీరు ఇంట్లోనే ఉంటారా? విభావరి పత్రిక ఎడిటర్ శ్యామ్ చరణ్ బాబు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు. మరో ఇద్దరు ముగ్గురు కూడా వస్తారట, రమ్మంటారా?"

అపూ అంగీకరించాడు. కాస్సేపు మాట్లాడి ఆ విద్యార్థి వెళ్ళిపోయాడు.

"ఖోకా!" అంటూ పిలిచాడు కాడుకుని.

"నేన్నీతో మాట్లాడను పో!"

"అలా అనకు నాన్నా! ఇప్పుడు నువ్వు కోప్పడితే ఎలా? నా మంచి బాబువి కదూ! మనిద్దరం ఇప్పుడేం చెయ్యబోతున్నామో తెల్సా?"

"ఏంటది?"

"ఈ పూటకిక పాఠాలు ఆపేద్దాం. ఈ గదంతా శుభ్రం చేద్దాం మనిద్దరం కలిసి. ఆ చిరిగిపోయిన చొక్కాను పరుపు కిందికి నెట్టెయ్. విభావరి ఎడిటర్ మనింటికొస్తున్నారిప్పుడు.

"విభావరి ఏమిటి?"

"అదో పత్రికలే! చాలా పేరున్న పత్రిక. పక్కింటి వాళ్ళనడిగి ఓ బకెట్ పట్రా"

మధ్యాహ్నం మూడయ్యేసరికి గది కాస్త పరవాలేదన్పించేలా తయారయింది. కాసేపట్లో శ్యామ్‌చరణ్ బాబూ, మరో ముగ్గురూ వచ్చారు. "వచ్చే సంచికలో మీ పుస్తకం మీద సమీక్షను వేస్తున్నామండీ" అన్నాడు సంపాదకుడు.

"వ్యాసాలో, కథలో ఇంకేవయినా మీ దగ్గరుంటే మా పత్రిక్కి ఇవ్వకూడదూ?" అని కూడా అడిగాడాయన.

మరుసటి నెల 'విభావరి'లో అపూ ఇచ్చిన ఓ కథానిక ప్రచురితమయింది. దాంతోబాటే రచయితను గురించిన పరిచయ వ్యాసం కూడా అచ్చయింది. ఆ కథకు పాతిక రూపాయల పారితోషికం పంపుతూ, తమ పత్రికకు మరిన్ని రచనలు పంపమని ఉత్తరం రాశాడు సంపాదకుడు.

కథ ప్రచురితమైన పత్రికను తెచ్చి కాజల్ చేతికిచ్చాడు అపూ. తనను గురించి రాసిన వ్యాసాన్ని చూపి, "దీన్ని బిగ్గరగా చదువు ఖోకా!" అన్నాడు మంచంపై వాలుతూ.

కాజల్ దాన్ని చదవటం మొదలెట్టి, మధ్యలో ఆగిపోయాడు. "ఇదేంటి బాబా! నీ పేరుందేమిటిక్కడ? నిన్ను గురించే రాశారేమిటి? ఆశ్చర్యంగా అడిగాడు.

అపూ నవ్వాడు. "నన్ను మెచ్చుకుంటూ రాశారు, కదూ? నువ్వు చక్కగా చదువుకుంటే ఏదో ఒకరోజున నిన్ను కూడా అందరూ మెచ్చుకుంటారు" అన్నాడు.

విభావరిలో సమీక్ష వచ్చాక అపూ నవల అమ్మకాలు బాగా పెరిగాయి. పాఠకుల దగ్గర నుండి ప్రశంసలు కురిపిస్తూ లేఖలు వస్తున్నాయి.

ఒక సాయంత్రం అపూ ఇంటికి రాగానే కాజల్‌ను పిలిచాడు. “నా చేతుల్లో ఏముందో చెప్పుకో” అన్నాడు తన రెండు చేతులూ వెనక్కి పెట్టుకుని.

కాజల్ పరిగెత్తుకొచ్చి, “ఏంటది? చూపించు, చూపించు!” అంటూ తండ్రి చేతుల్లోకి పాకెట్‌ను లాక్కుని తెరిచాడు. వాడి కళ్ళు సంభ్రమాశ్చర్యాలతో విప్పారాయి. చక్కని చిత్రాలతో ఉన్న అరేబియన్ నైట్స్ పుస్తకమది!

ఆ మరునాడు అపూకి తన కెనెడియన్ మిత్రుడు యాష్‌బర్టన్ నుండి పిలుపు వచ్చింది. అతడికి నలభయ్యేళ్ళుంటాయి. హిమాలయాల్లో పెరిగే వృక్షజాతులపై పరిశోధించి ఆయన రాసిన వ్యాసాన్ని చదివిన అపూ, రెండు నెలల కిందట ఆయన కలకత్తాకు వచ్చినప్పుడు పరిచయం చేసుకున్నాడు. యాష్‌బర్టన్ చక్కటి చిత్రకారుడు కూడా.

గ్రేట్ ఈస్టర్న్ హోటల్లో బసచేసిన ఆయన, అపూ రాగానే సాదరంగా ఆహ్వానించాడు. భారతదేశంలోని ప్రకృతి సౌందర్యాన్నీ, కళారీతులనూ ఆయన ఎంతో అభిమానిస్తాడు. తను కాశీకి వెళ్ళాలనుకుంటున్నాననీ, అపూ కూడా తనతోబాటు వస్తే బావుంటుందను కుంటున్నాననీ అన్నాడు.

కాశీ అనగానే అపూ మనసులో ఎన్నో స్మృతులు ముసురుకున్నాయి. తన జీవితం లోని ఎన్నో మరపురాని అనుభవాలు ఆ నగరంతో ముడిపడి వున్నాయి. మళ్ళీ ఒకసారి కాశీకి వెళ్ళే అవకాశం వచ్చింది. దాన్ని వదులుకోకూడదని నిశ్చయించుకున్నాడు. బెనర్జీ గారింట్లో కాజల్‌ను వదిలిపెట్టి, మిత్రుడితోబాటు బయల్దేరాడు.

కాశీకి చేరగానే కంటోన్మెంట్ ప్రాంతంలో ఒక యూరోపియన్ హోటల్లో యాష్‌బర్టన్‌కు బస ఏర్పాటుచేయించి, తను గోధూలియా ప్రాంతంలోని పార్వతీ ఆశ్రమంలో గది తీసుకున్నాడు.

తన చిన్నతనంలో చదువుకున్న బడిని చూడాలన్పించి, ఆ వీధికి వెళ్ళాడు అపూ. అక్కడెక్కడా దాని జాడలు కనబడకపోవటంతో ఆ వీధిలోని కొందరిని వాకబు చేశాడు. ఇరయ్యేళ్ళ కిందటే ఆ పాఠశాల మూతబడిందని చెప్పారు వాళ్ళు. అప్పట్లో తన క్లాసులోనే ఉండిన ప్రసన్న అనే విద్యార్థి ఇంటిని వెదుక్కుంటూ వెళ్ళిన అపూకి అక్కడా నిరాశే ఎదురయింది. ప్రసన్న కుటుంబం ఇప్పటికీ ఆ ఇంట్లోనే ఉంటోందని తెలిసింది. కానీ ఆ రోజు వాళ్ళేదో ఊరికి వెళ్ళారు.

❖ ❖ ❖ ❖

కాశీలో తాము ఒకప్పుడు కాపురముండిన ఇంటిని అపూ సులభంగానే గుర్తు పట్టాడు. పక్కింట్లో అప్పుడున్న కుటుంబమే ఉంది. ఆ గృహిణి అపూని గుర్తుపట్టి సంతోషించింది. సర్వజయ మరణించిందని విని ఎంతో బాధపడిందామె.

అక్కడి నుండి మణికర్ణికా ఘట్టానికి వెళ్లాడు అపూ. తన తండ్రి భౌతిక కాయం మట్టిలో కలిసిపోయిందక్కడే. అందుకే ఆ ప్రదేశం అతడి మనసుకు సన్నిహితమైనదిగా తోచింది.

మరునాడు ఉదయాన్నే దశాశ్వమేధ ఘాట్‌లో స్నానం చేద్దామని వెళ్ళిన అపూ తనకెదురుగా మెట్లెక్కి వస్తున్న వృద్ధురాలిని చూసి ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. ఆమె తన బాల్య స్నేహితులు సురేష్, సునీల్ తల్లి జెతీమా! వాళ్ళు నిశ్చిందిపురంలో అపూవాళ్ళ ఇంటిపక్కనే ఉండేవాళ్ళు. తర్వాత కలకత్తాకు వెళ్ళి స్థిరపడ్డారు. అపూ కాలేజీలో చదువుతుండగా రెండుసార్లు వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. జెతీమా ప్రవర్తించిన తీరు అతణ్ణి నొప్పించింది. ఆమెకు మొదటినుండి పేదవాళ్ళంటే చులకనేనని తెలిసినా బాల్య స్నేహితులను కలవాలన్న ఆశతో వెళ్ళిన అపూకి అవమానం ఎదురైంది. మళ్ళీ ఇంత కాలానికి ఆమెను కాశీలో చూసి ఆశ్చర్యపడ్డాడు.

ఇత్తడి బిందెలో నీళ్ళు తీసుకుని అతి కష్టంమీద మెట్లెక్కి వస్తోంది జెతీమా. అపూ గబగబా దగ్గరకు వెళ్ళి ఆమె పాదాలకు నమస్కరించాడు. "అపూర్వవి కదూ? బాగున్నావా నాయనా? ఎన్నాళ్ళయింది నిన్ను చూసి!" అంటూ సంతోషపడిందామె.

"మీరిక్కడున్నారేమిటమ్మా?" సురేష్, సునీల్ కూడా కాశీలోనే ఉంటున్నారా?" అడిగాడు అపూ.

"లేదు నాయనా, నేనొక్కదాన్నే ఉన్నానిక్కడ. పక్కింటివాళ్ళమ్మాయి రోజూ మంచినీళ్ళు తెచ్చిపెడుతోంది. ఆ పిల్లకు మూడురోజుల్నించి జ్వరం" అంది జెతీమా చంకలోని బిందెను కిందపెడుతూ.

"సునీల్ వాళ్ళందరూ కలకత్తాలోనే ఉన్నారు. నన్ను తెచ్చి ఇక్కడ పడేశారు. వాడి పెళ్ళాన్ని నేనే ఏరికోరి తెచ్చిచేశానయ్యా... చివరికి ఆవిడే నా కొడుకును నాకు కాకుండా చేసింది. మా ఇంటికి వెళ్దాం రా బాబూ, మంచి చెడూ చెప్పుకునేందుకు మనిషంటూ లేరిక్కడ" అంటూ తన గోడు వెళ్ళబోసుకుందావిడ.

"ఒక్క నిమిషం ఆగండి, జెతీమా! స్నానం చేసొచ్చి, మీ బిందె పట్టుకొస్తాను."

"అయ్యయ్యో, వద్దు నాయనా! అంత మాటన్నావు అదే పదివేలు".

ఆమె మాటల్ని పట్టించుకోకుండా నది వైపుకు పరిగెత్తాడు అపూ. వీలయినంత త్వరగా స్నానం ముగించుకుని వచ్చి, ఆమె బిందెను భుజానికెత్తుకున్నాడు.

బ్రజేశ్వర్ గల్లీలోని ఓ భవనంలో కింది అంతస్తులోని చిన్నగదిలో ఉంటోంది జెతీమా. పక్కనున్న గదిలో ఢాకా నుండి వచ్చిన మరో వృద్ధురాలు అద్దెకుంటోంది. ఇంకో వాటాలో ఓ బెంగాలీ కుటుంబం ఉంది. వాళ్ళ చిన్నమ్మాయే జెతీమాకు రోజూ మంచినీళ్ళు తెచ్చిస్తుందట.

"సునీల్‌కు నేనంటే ప్రేమే కానీ, ఆ మహాతల్లే వాడి మనసులో విషం పోసింది బాబూ!" అంటూ మళ్ళీ మొదలుపెట్టిందామె. కోడలు తనను చీటికి మాటికీ తిడుతుందట. మనవలను కూడా దగ్గరికి రానివ్వదట." నేనింక మీ ఇంట్లో ఉండలేను నాయనా! కాశీకి తీసుకెళ్ళి వదిలిపెట్టెయ్ అన్నానొక రోజున. ఆ రాత్రికి పెళ్ళాం ఏం నూరిపోసిందో గానీ, మర్నాడు నా కొడుకు సంతోషంగా నన్ను కాశీకి ప్రయాణం కట్టించాడు. నా జీవితమంతా బిడ్డల కోసం ఎంత చాకిరీ చేశానో నువ్వెరగవు నాయనా..." ఆమె గొంతు రుద్ధమయి, కన్నీళ్ళు జలజలా రాలాయి.

"అదేమిటమ్మా. సురేష్ అయినా వద్దని చెప్పలేదా?"

"సురేషా? వాడి సంగతి చెప్పటం మరిచేపోయానయ్యా! వాడికి మామగారి ఆస్తి సంక్రమించింది – రాజ్‌షాహీలోనో, దినాజ్‌పూర్‌లోనో, వాడి కుటుంబమంతా అక్కడే ఉంటోంది. తల్లంటూ ఓ మనిషి బతికుందన్న ధ్యాస కూడా లేదు వాడికి. ఉత్తరం ముక్క రాయటమే కష్టం."

అపూకి ఫలహారం చేసిపెట్టింది జెతీమా. అతడు తింటున్నంతసేపూ తన కష్టాల గాథను విన్పిస్తూనే ఉంది. "అన్నట్టు...నీకో విషయం చెప్పటం మరిచేపోయా. నిశ్చింది పురంలో భువన ముఖర్జీగారమ్మాయి లీల గుర్తుందా? ఆ పిల్ల కాశీలోనే ఉంటోంది తెలుసా?" అంది మాటల మధ్యలో.

"లీలాదీ కాశీలో ఉందా?"

"ఔను పాపం, ఆ అమ్మాయి భర్తకు ఏడేళ్ళ నుండి పక్షవాతం. ఆయన్నీ పిల్లల్నీ పోషించుకునే మార్గంలేక, ఈ ఊళ్ళోనే మరిదిగారింట్లో చాకిరీ చేస్తోంది. తప్పకుండా వెళ్ళి కలువు బాబూ!" అని లీలాదీ ఇంటి చిరునామా ఇచ్చిందావిడ.

రాణూ వాళ్ళ పెద్దక్కయ్య లీలాదీ. నిశ్చిందిపురంలో ఉన్నంతకాలమూ అపూకూ, దుర్గకూ ప్రాణస్నేహితురాలు రాణూ. జెతీమా చెప్పిన గుర్తుల ప్రకారం లీలాదీ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు అపూ. అక్కడికి చేరేసరికి మధ్యాహ్నం రెండయింది. చీకటిగా ఉన్న మెట్లదారి గుండా పైకి వెళ్ళి ఆ ఇంటి తలుపు తట్టాడు. పదేళ్ళ కుర్రాడొచ్చి తలుపు తీశాడు. "లీలాదీ ఉండేదిక్కడేనా...వాళ్ళది నిశ్చిందిపురం" అని అడుగుతుండగానే పక్క గదిలోంచి సన్నగా, తెల్లగా ఉన్న ఒక యువతి బయటకొచ్చింది. ఆమె కట్టుకున్న చీర మాసి ఉంది; చేతులకు వెండి గాజులు మినహా నగలేమీ లేవు. ఆమె జుట్టు మాత్రం నల్లగా, ఒత్తుగా అందంగా ఉంది.

ఆమెను సులభంగానే గుర్తుపట్టాడు అపూ. వంగి ఆమె పాదాలను తాకి, "నేనెవరో చెప్పుకోండి చూద్దాం!" అన్నాడు చిరునవ్వుతో.

లీలాది ఆశ్చర్యపడుతూ చూస్తుండగానే, "నేను అపూని. నిశ్చిందిపురంలో ఉండేవాణ్ణి" అన్నాడు.

"ఓయ్! అపూ, నువ్వా? హరి కాకా వాళ్ళబ్బాయివి కదూ?" అందామె సంతోషంగా. ప్రేమగా అతడి బుగ్గలు పుణికింది, పట్టలేని ఉద్వేగంతో చప్పున ఏడ్చేసింది.

అపూ మనసులో చిత్రమైన అలజడి. ఒక చల్లని ఓదార్పు తనను నిలువెల్లా స్పృశించిన అనుభూతి. ఎప్పుడో చిన్నతనంలో తనకు పరిచయమున్న ఈమె ఎంత నిష్కల్మషంగా ఆత్మీయతను కురిపిస్తోంది! లీలాదీ తండ్రి నిశ్చిందిపురంలో గొప్ప సంపన్నుడు. అపూ చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడే ఆమెకు పెళ్ళయిపోయింది. అందువల్ల ఆమెతో పెద్ద పరిచయం కూడా ఏర్పడలేదు. ఐనా సరే, ఏవో బాల్య స్మృతులు వాళ్ళిద్దరి నడుమ బలమైన అనుబంధాన్ని ఏర్పరిచాయి.

ఆమె ఒక చాప తెచ్చి వరండాలో పరిచింది. కొడుకును దుకాణానికి పంపి మిఠాయి తెప్పించింది. టీచేసి ఇచ్చింది. అపూ పక్కనే కూర్చుని తన కథంతా చెప్పుకొచ్చింది లీలాదీ. భర్త ఏడేళ్ళుగా మంచానపడ్డాడు. పద్నాలుగేళ్ళ కొడుకు అకస్మాత్తుగా చనిపోయాడు. విధిలేని పరిస్థితుల్లో మరిది పంచనచేరి కాలం గడుపుతోందామె. మరిది మంచివాడే... కానీ తోడికోడలు పరమగయ్యాళి.

నిశ్చిందిపురానికి వెళ్ళిపోతే బావుండునని ఎన్నోసార్లు అన్పిస్తుందామెకు. కానీ, తల్లిదండ్రులు చనిపోయారు, తమ్ముడు శోతూ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. వాడికి చదువు సంధ్యలు అబ్బలేదు. తండ్రి సంపాదించిన సంపదంతా కరిగిపోయింది. వాళ్ళ బంగళాలో చాలా భాగం శిథిలమైపోయింది. ఇప్పుడు శోతూ ఓ చిన్న కిరాణా దుకాణం పెట్టుకుని కాలం గడుపుతున్నాడు. వీటన్నిటికీ తోడు అతడికి ఇద్దరు భార్యలూ, ఐదారుగురు పిల్లలూను.

"ఇద్దరు భార్యలా? ఎందుకు చేసుకున్నాడు?" అడిగాడు అపూ ఆశ్చర్యంగా.

"బుద్ధిలేక. మొదటి భార్య తండ్రితో వాడికేదో గొడవొచ్చింది. ఆయన మీద కోపంతో రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడేమో రెండు కుటుంబాలను పోషించలేక చస్తున్నాడు. దానికితోడు రాణూ కూడా వాడిదగ్గరే ఉంటోందిగా!"

"ఏమిటీ? రాణూదీ నిశ్చిందిపురంలో ఉంటోందా? ఎందుకని?"

"దాని కర్మ. దాని భర్తపోయి ఏడెనిమిదేళ్ళవుతోంది. అత్తవారింట్లో పట్టించుకునే వాళ్ళెవరూ లేక తమ్ముడి దగ్గరికొచ్చింది. అప్పుడప్పుడూ వాళ్ళ మరిది వచ్చిపోతూంటాడు. రాణూ కూడా ఎప్పుడయినా వెళ్ళొస్తూ ఉంటుంది."

రాణూ పరిస్థితి గురించి విని, అపూ మనసు భారమయింది. లీలాది మాటలు వింటుంటే తన ఊరు కళ్ళముందు కనబడుతున్నట్టే ఉంది అతడికి. ఇద్దరూ కలిసి ఆ రోజులను నెమరేసుకున్నారు. మళ్ళీ అక్కడికి వెళ్ళిపోగలిగితే బావుండునన్న భావన ఇద్దరి మనసుల్లో మెదిలింది. "తామరాకులో భోజనం చేసి ఎన్నాళ్ళయిందో కదూ అపూ?"

అంది లీలాదీ. "ఇక్కడందరూ మద్ది ఆకుల విస్తళ్ళే వాడుతారు. కొన్ని దుకాణాలవాళ్ళయితే ఫలహారాలను కాగితాల్లో చుట్టి ఇస్తున్నారు తెలుసా? ఒకరోజు మా అబ్బాయి అలాగే కాగితాల్లో చుట్టిన మిఠాయిలు పట్టుకొస్తే, అవతల పారేశాను. కాగితాల్లో పెట్టుకుని తినటమనే వ్యవహారాన్ని మన ఊళ్ళోనయితే ఊహించనైనా లేం కదా!"

ఒకప్పుడు తాను కూడా తామరాకులో భోజనం చేసేవాడినన్న సంగతి లీలాదీ గుర్తుచేసేదాకా జ్ఞాపకమే రాలేదతడికి. "నువ్వు నిశ్చిందిపురానికి వెళ్ళిపోవచ్చుగా అపూ? నేనంటే ఆడదాన్ని, నీకు నాలాగా బాదరబందీలేమున్నాయ్ చెప్పు" అందామె.

"నాకు ఉద్యోగం రాగానే అమ్మను తీసుకుని ఊరెళ్ళిపోవాలని చిన్నప్పుడు అనుకుంటుండే వాణ్ణి. అమ్మకృూడా అలా వెళ్ళాలనే కోరిక. ఆమె చనిపోయాక కూడా వెళ్ళిపోదామనే అనుకున్నాను. కానీ..." ఆగిపోయాడు అపూ. తన పెళ్ళిగాథనంతటినీ చెప్పటానికి కొంచెం ఇబ్బంది అన్పించింది. కానీ కాసేపయ్యాక అపర్ణను గురించి లీలాదీతో చెప్పకుండా ఉండలేకపోయాడు.

"మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు అపూ? నువ్వింకా చిన్నవాడివే. నా కళ్ళముందు పెరిగిన కుర్రాడివి. తప్పకుండా పెళ్ళిచేసుకో. నీ కొడుకును కూడా తీసుకొస్తే బావుండేది. వాణ్ణి చూడాలనుంది".

అపూని తన భర్తకూ, పిల్లలకూ పరిచయం చేసిందామె. మరునాడు మధ్యాహ్నం భోజనానికి రమ్మని మరీ మరీ చెప్పింది. అతడు వెళ్ళేసరికి వంటగదిలో పనిలో ఉంది లీలాదీ. ఆ ఇంట్లో ఆమె పరిస్థితి ఒక బానిసకన్నా అధ్వాన్నంగా ఉందన్పించింది అపూకి. ఒకప్పుడు ఆమె ఎంత అందంగా ఉండేదో గుర్తొచ్చి బాధ కలిగింది. ఇప్పుడు ఆ సౌందర్యమంతా కరిగిపోయింది. అప్పుడే జుట్టు నెరుస్తోంది, చాకిరితో బండబారిన చేతులపై నరాలు ఉబ్బి పైకి తేలాయి. తను రావటంవల్ల ఆమెకు ఆదనపు శ్రమ కలిగించినట్టయిందేమోనన్న సంకోచం కలిగింది అతడికి.

"ఏం చెయ్యాలో తోచడంలేదు. అపూ! పెద్దపిల్ల పెళ్ళికెదుగుతోంది. రేపు దాని పెళ్ళికి మరిదిగారు తప్ప సాయంచేసే వాళ్ళెవరున్నారని? అందుకే నేనిక్కడ పడి ఉంటున్నా" అంది లీలాదీ. అపూ బయల్దేరి వెళ్తుంటే భోరున ఏడ్చిందామె "మళ్ళీ వస్తావు కదూ!" అంటూ. అపూ కళ్ళలోనూ నీళ్ళు నిండాయి.

కాశీలో అపూ కలుసుకోవాల్సిన వ్యక్తి మరొకరు మిగిలిపోయారు. ఆవిడ లీల తల్లి – మిజో బహురాణి. నారద్ ఘాట్‌లో ఆమెకు సొంత ఇల్లుంది. అపూని చూసి ఎంతో సంతోషపడిందామె. ఇద్దరూ మాట్లాడుకుంటుండగా ఏడేళ్ళ పాప ఆ గదిలోకొచ్చింది. చక్కటి ఫ్రాకు తొడుక్కుంది. నల్లటి, ఒత్తయిన నొక్కుల జుట్టు. ఆ అమ్మాయి ఎవరయిందీ అపూకి ఎవరూ చెప్పాల్సి అవసరం లేకపోయింది. లీల కూతురయితే తప్ప అంత అందంగా

ఉండటం ఎలా సాధ్యం? ఆప్యాయత, బాధ, గత స్మృతుల భారం, అతడి హృదయాన్ని ఉక్కిరి బిక్కిరి చేసి కన్నీళ్ళు తెప్పించాయి. "ఖోకీ! ఇలా రా తల్లీ!" అన్నాడు.

ఆ అమ్మాయి సిగ్గుగా చిరునవ్వు నవ్వి, గదిలోంచి వెళ్ళబోతుంటే వాళ్ళమ్మమ్మ పట్టుకుని ఆపింది. లీలకన్నా ముందే ఆమె భర్త కూడా చనిపోయాట్ట. ఆ విషయాన్ని లీల కెవరూ చెప్పలేదు. ఇప్పుడిక పాపను అమ్మమ్మే పెంచుతోంది. ఆ అమ్మాయిని చూస్తోంటే లీలను మొదటిసారిగా అదే వయసులో ఉండగా చూశానని అపూకి గుర్తొచ్చింది. లీల కూతురు అచ్చంగా తల్లి నోట్లోంచి ఊడిపడినట్టే ఉంది.

"బంగారం లాంటి పిల్ల! దీని బతుకేంగానుందో బాబూ! తల్లిచేసిన పని అందరి లోనూ బట్టబయలయింది గదా…రేపు దీన్నెవరు పెళ్ళాడుతారు? ఆ బాధ్యత నావల్లనవుతుందా? అంటూ బాధపడింది లీల తల్లి.

"ఈ పాప పెళ్ళి గురించి మీరేమీ బెంగపెట్టుకోకండి" అనే మాటలు నాలుక చివరిదాకా వచ్చినా, అతి కష్టంమీద ఆపుకున్నాడు అపూ. "ముందు అమ్మాయిని బాగా చదివించటం ముఖ్యం కదండీ" అన్నాడు పైకి. "నేనిప్పుడే నోరుజారటం మంచిది కాదు. నా బిడ్డ ఆయుష్మంతుడు కావాలి…ఈ అమ్మాయికి యోగ్యుడిగా ఎదగాలి…అప్పుడుగానీ నేనీ ప్రసక్తి తీసుకురాకూడదు" అని తన మనసుకు నచ్చజెప్పుకున్నాడు.

❖ ❖ ❖ ❖

మిత్రుడితోబాటు సారనాథ్‌కు వెళ్ళొచ్చాక, కలకత్తాకు బయల్దేరాడు అపూ. రైల్లో వెళ్తున్నంతసేపూ లీలాదీ ప్రేమ, ఆమె నిస్సహాయత మరీ మరీ గుర్తొచ్చాయి. కాశీ నుండి బయల్దేరే రోజున మళ్ళీ ఆమె దగ్గరికి వెళ్ళాడు. ఓ చిన్న తమ్ముణ్ణి చూసుకున్నంత ప్రేమగా అతని చుబుకం పుణికిందామె. మెట్లుదిగి వీధిదాకా వచ్చి వీడ్కోలు పలికింది. కొయ్య బొమ్మలున్న ఓ చిన్న సంచిని అపూ చేతుల్లో పెట్టింది, "నీ కొడుకు కోసం" అంటూ. ఆమె పాదాలకు నమస్కరించి భారమైన హృదయంతో వచ్చేశాడు అపూ.

"లీలాదీ! నువ్వు మళ్ళీ నీ గ్రామానికి, నీ వాళ్ళ దగ్గరికి వెళ్ళేట్టుగా నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. ఈ ఏడాదిలోనే నేనాపని చేస్తాను" అని తన మనసులోనే అనుకున్నాడు అపూ.

రైలు కలకత్తా సమీపిస్తున్నకొద్దీ అపూ మనసులో కొడుకును చూడాలన్న ఆత్రుత అంతకంతకూ అధికమవుతోంది. వాణ్ణి చూసి ఎన్నేళ్ళో అయినంత దిగులుగా ఉంది.

బెనర్జీగారి భార్య కాజల్‌ను ప్రేమగానే చూసుకుంటుంది. కానీ వాడీ మధ్యన బాగా అల్లరివాడయ్యాడు. ఆమె మాట వినకుండా రోడ్డుమీదికి వెళ్తున్నాడేమో! వాణ్ణెవరన్నా ఎత్తుకుపోతే…ఏ కారులోనో పడేసుకుని ఎక్కడికో తీసుకెళ్ళిపోయి ఉంటే? అపూ మనసులో లక్ష సందేహాలు తోచాయి.

అలాంటిదేమీ జరిగి ఉండదు. కాజల్‌కేమన్నా అయితే బెనర్జీగారు తనకు టెలిగ్రాం ఇవ్వకుండా ఉంటారా... అని తనకు తనే సర్ది చెప్పుకోజూశాడు. ఐనా, ఇంకేదో కొత్త అనుమానం తలెత్తుకుంది. బెనర్జీగారి డాబాకు పిట్టగోడ లేదు. కాజల్ గాలిపటాలు ఎగరెయ్యటానికి మేడమీదికెళ్ళి పడితే ఎలా?

ఈ భయాలు అతణ్ణి నిలవనివ్వటం లేదు. తనకు ఎన్నో ప్రదేశాలు చూడాలనుందని కాస్సేపటి కిందటే యాష్‌బర్టన్‌తో చెప్పాడు అపూ. జావా, బాలీ, సుమత్రా, పసిఫిక్ ద్వీపాలు, ఆఫ్రికా వంటి ప్రదేశాలను గురించి పుస్తకాల్లో చదవాననీ, వాటిని స్వయంగా చూసి ఆ అనుభవాలను నవలగా రాయాలని అనుకుంటున్నాననీ అన్నాడు. కానీ ఇప్పుడు కాజల్ మీది ప్రేమ అతణ్ణి పట్టి బంధించి వెనక్కి లాగుతోంది. వాణ్ణొదిలిపెట్టి ఎక్కడికీ వెళ్ళలేనన్పిస్తోంది. ఆ పసివాడు వాడికి తెలియకుండానే తన లేత హస్తాల్లో తండ్రి హృదయాన్ని బందీని చేశాడు. సుతిమెత్తని ఆ చిట్టి చేతుల్ని నిర్దయగా తోసివెయ్యటం అపూకి సాధ్యమవుతుందా? లేదు. ప్రపంచమంతా తిరిగి చూడాలన్న తన కోరిక తీరక పోయినా పరవాలేదన్పించింది అతడికా క్షణంలో.

రైలు కిటికీలోంచి చూస్తున్న అపూ కళ్ళముందు మామిడి తోటలు, చెరువుల్లో ఈదులాడుతున్న బాతులు, చెరకుతోటలు, గోధుమ పొలాల్లో పంటనూర్పిళ్ళూ, పచ్చిక బీళ్ళ నుండి సందెవేళ ఇళ్ళకు తిరుగు ముఖం పట్టిన పశువుల మందలు...ఇలా ఎన్నో దృశ్యాలు కదిలిపోతున్నాయి. పడమటి దిక్కున పొద్దుగుంకుతోంది, మైదానాలపై పొదవాటి నీడలు పరుచుకుంటున్నాయి. దూరంగా వ్యాపించిన పర్వత శ్రేణులు ముదురు నీలంలోకి, నలుపు రంగులోకీ మారుతున్నాయ్.

లీలాదీని కలిసినప్పటి నుండి అపూ మనసంతా నిశ్చిందిపురం చుట్టూ తిరుగుతోంది. మామిడి, వెదురు పొదల్లో దాగిన పక్షుల కూజితాల గుండా, పేరు తెలియని అడవి పూల పరిమళాలగుండా ప్రవహించిన జీవితాన్ని గురించిన సుదూర జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. ఒకనాడు తన జీవితంలో విడదీయరాని భాగమైన ఆ జీవితం ఇప్పుడొక సుదూర స్వప్నంలా గోచరిస్తోంది. తన పల్లె, అక్కయ్య, అమ్మ, రాణూ, ఆ పచ్చిక బయళ్ళు, తోటలు, ఇచ్ఛామతీ ప్రవాహం...అదంతా ఒక మసకబారిన చిత్రంలా మారిపోయింది.

ఇది వసంత రుతువు...వెదురు పొదలు దాల్చిన ఆకులు వాటికింది నేలనంతటినీ కప్పివేసి ఉంటాయి. విరిగిపోయిన తమ కిటికీ దగ్గర కూర్చుని అమాయకమైన ఊహా చిత్రాలను అల్లుకునేవాడు తను...ఆ రోజులు ఆనందంతో పొంగి పొరలుతుండేవి... చలికాలపు రాత్రుళ్ళు కప్పుకున్న దుప్పటి వెచ్చని హాయి... అవన్నీ కాల ప్రవాహంలో ఎటో కొట్టుకుపోయాయి.

"రాయ్ మొ షా...య్!" అంటూ గ్రామ చౌకీదారు పెట్టే కేక ఇప్పటికీ అపూని కలల్లో వెంటాడుతూనే ఉంటుంది. మరుక్షణమే నిశ్చిందిపురం అతని మనోనేత్రం ముందు

సాక్షాత్కారిస్తుంది. తమ ఇంటి పక్కనుండే మైదానాన్ని ఆత్మీయంగా పలకరించేది వసంతం. వృక్షాలన్నీ పూలతో పులకరించిపోయేవి, తమ కిటికీ పక్కనుండే కొబ్బరిచెట్టు మొదలును ముక్కుతో పొడిచే వడ్రంగి పిట్ట రహస్య సందేశాన్ని పంపేది. తన జీవితంలోని మొదటి పదేళ్ళ బాల్య జీవనాన్ని పునర్జీవింపజేసే ఈ స్వప్నాలు నిద్రలో కూడా అపూ హృదయాన్ని స్పృశించి సేదదీర్చుతాయి.

ఇప్పుడు తమ ఇల్లు కూలిపోయి ఉండవచ్చు. ఆ విరిగిపోయిన కిటికీ ఆనవాళ్ళయినా దొరకకపోవచ్చు. భానుడి చిట్టచివరి కిరణాలు వృక్షాల చివురుటాకులను వెలిగించేవేళ...గూళ్ళకు చేరే పక్షులు కువకువలాడే వేళ...కిటికీ పక్కన కూర్చున్న పసివాడు తన కలల్లోంచి మేల్కొంటూ "మళ్ళీ రాత్రిక్కూడా ఇల్లంతా వాన కురిసిందంటే రేపణ్ణించి రాణూదీ వాళ్ళింటికెళ్ళి పడుకుంటానంతే! రోజూ నిద్రమేలుకోలేనమ్మా!" అంటూ మారాం చెయ్యటం వినబడకపోవచ్చు...

అపూ జ్ఞాపకాల్లో మెదిలిన ఓ దృశ్యం అతడి పెదవులపై నవ్వుల్ని పూయించింది.

నిశ్చిందిపురం నుండి మరో ఏడాదికి వెళ్ళిపోతామనగా అపూకి ఇంట్లో ఓచోట బోలెడన్ని గవ్వలు కనబడ్డాయి. వాళ్ళ నాన్నకు ఓ విద్యార్థి తెచ్చిచ్చాడు వాటిని. అన్ని గవ్వలను ఒక్కసారిగా ఎన్నడూ చూడని అపూ, తనకేదో పెద్ద నిధి దొరికినట్టుగా పొంగి పోయాడు. వాటన్నిటినీ గుండ్రటి బిస్కెట్ల డబ్బాలో పెట్టి గోడకున్న ఓ గూట్లో దాచాడు.

చాలా ఏళ్ళపాటు ఆ గవ్వల సంగతి గుర్తులేదు. అపర్ణ చనిపోయాక ఓ సాయంత్రం గంగానది మీదుగా అస్తమిస్తున్న సూర్యబింబాన్ని చూస్తూ ఈడెన్ గార్డెన్‌లో కూర్చుని ఉండగా ఎందుకో అకారణంగా గుర్తొచ్చాయి ఆ గవ్వలు. మళ్ళీ ఇవాళ అదే జ్ఞాపకం మనసులో మెదిలింది.

తమ ఇంట్లో ఉత్తరంవైపునున్న గది గోడకున్న ఆ గూట్లో దాచిన తన గవ్వలు... ఈపాటికి శిథిలమైపోయే ఉంటాయి. ఆ డబ్బా ఇంకా కళ్ళల్లో మెదులుతోంది...సాలీడు గుడ్లలాంటి చిన్న చిన్న బిస్కెట్లు ఉండేవి దాన్లో. పైసాకు పదహారు బిస్కెట్లిచ్చేవాళ్ళు. ఆ డబ్బాను దాచిన గది వెనకాల వెదురు పొదా, బూరుగు చెట్ల వనమూ, ఆ వెనుక విశాలమైన మైదానమూ, పావురాల కువకువలూ...ఏప్రిల్ మాసపు ఆ మధ్యాహ్నం వేళ ఎండతో మెరుస్తున్న ఆకాశమూ...అవన్నీ ఇరవై మూడేళ్ళ కిందట తను కోల్పోయిన జీవితం తాలూకు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

## 23

**కా**శీ నుండి తిరిగొచ్చిన కొన్నాళ్ళకు ఓ సంపన్న కుటుంబం ఇస్తున్న విందుకు అపూకి ఆహ్వానం వచ్చింది. అది చాలా పెద్ద భవనం. ఇంటి ఆవరణలోని లాన్‌లో చిన్న

టేబుళ్ళూ, కుర్చీలూ ఏర్పాటు చేశారు. లాన్‌లో ఒక పక్కన షామియానా వేశారు. చలువ రాళ్ళు పరిచిన ఓ కొలనులో తెల్లకలువలు విరబూసి ఉన్నాయి. కొలను మధ్యన ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఆ ఇంటి గృహిణి అపూని ప్రత్యేకంగా తీసుకెళ్ళి తమ 'లిల్లీ–పాండ్'ను చూపించింది. అందులోని ఫౌంటెన్‌ను జైపూర్‌లో తయారు చేయించారట. దాని ఖరీదెంతో చెప్పటం కూడా మర్చిపోలేదు ఆవిడ.

అతిథుల కోసం ఎన్నో రకాల కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఒక గాయని మధురమైన గాత్రంతో పాటలు పాడుతుంటే శ్రద్ధగా విన్నాడు అపూ. కొందరు అతిథులు బ్రిడ్జి ఆడుతుంటే కాసేపు చూశాడు. శాండ్‌విచ్‌లూ, కేకులూ, మిఠాయిలూ, ఎన్నో రకాలు వడ్డించారు. అపూ రహస్యంగా రెండు కేకులను కాగితంలో చుట్టి జేబులో పెట్టుకున్నాడు.

పార్టీ నుండి ఇంటికి వెళ్తుంటే అపూ మనసంతా ఆనందంతో తేలిపోతున్నట్టుగా ఉంది. 'నేను నవల రాసి, ఇంత పేరు తెచ్చుకుని ఉండకపోతే ఇలాంటి పార్టీకి నన్నెవరయినా ఆహ్వానించేవాళ్ళా?" అనుకున్నాడు.

అతడు ఇంటికి వెళ్ళేసరికి కాజల్ నిద్రలో ఉన్నాడు. వాడి తలపై మృదువుగా నిమురుతూ "ఖోకా! లే!" అని పిలిచాడు. కాజల్‌కు మెలకువ వచ్చింది. ఓసారి కళ్ళు తెరిచి చూసి, మళ్ళీ నిద్ర నటించసాగాడు. వాడి పెదవులపై అల్లరి చిరునవ్వు మెరుస్తోంది. తండ్రి తననలా మృదువుగా నిమురుతుంటే ఆ స్పర్శను అనుభవించటం వాడికెంతో ఇష్టం.

"మళ్ళీ పడుకోకు నాన్నా! కబుర్లు చెప్పుకుందాం లే!"

నాన్నతో కబుర్లాట్టమంటే వాడికెప్పుడూ సరదానే. "అలాగే బాబా! నేనో పొడుపు కథ వేస్తాను, విప్పుతావా మరి!" అంటూ లేచి కూర్చున్నారు.

"ఒద్దొద్దు, నీ పొడుపు కథల్ని నేను విప్పలేను బాబూ! నువ్వు నాకన్నా చాలా తెలివయినవాడిని మరి! నీ కోసం కేక్ పట్టుకొచ్చా చూడు!"

"అయ్యో! మరిచేపోయాను బాబా! నీకు ఉత్తరం వచ్చింది. ఆ పుస్తకం కిందపెట్టా." అది యాష్‌బర్టన్ రాసిన లేఖ. కొందరు మిషనరీలు కలిసి ఫిజీలో ఓ స్కూలు పెడుతున్నారట. అక్కడ పనిచేసేందుకు టీచర్ కోసం వెదుకుతున్నారనీ, అపూ వస్తే బావుంటుందనీ రాశాడాయన.

అపూ ఆలోచనలో పడ్డాడు. "చూడు ఖోకా! నేను కొన్నాళ్ళు వేరే ఊరికి వెళ్ళాల్సుంటుందేమో, నిన్ను తాతగారింట్లో వదిలేసి వెళ్తే ఉండగలవు కదూ?" అడిగాడు కొడుకుని.

మరుక్షణమే కాజల్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఒద్దొద్దు బాబా! నేనెక్కడికీ వెళ్ళను. నువ్వు కాశీకి వెళ్ళినప్పుడే నాకు దిగులేసింది" అన్నాడు భయంగా.

అపూ ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. తన ఆసక్తులను గురించి కాజల్ అర్థంచేసుకోలేక పోవడం సహజం. తన దారిని తాను వెళ్ళిపోతే వాడిని చూసుకునే వాళ్ళెవరు? ఇప్పట్లో తను వెళ్ళటం కుదిరేపని కాదు.

కాజల్ నిద్రపోయాక అపూ ఒంటరిగా డాబా మీదికి వెళ్ళి కూర్చున్నాడు. ఎత్తయిన ఓ భవనం వెనుకగా చంద్రరేఖ ఉదయిస్తోంది. రోడ్డుమీద ఓ లారీ పెద్ద శబ్దం చేస్తూ వెళ్తోంది. దట్టమైన అడవిలో పర్వతాల మీదుగా ఉదయిస్తోన్న ఇలాంటి చంద్రుణ్ణే తాను గతంలో చూశాడు. ఈ భవనాలూ, రోడ్లూ, లారీల చప్పుళ్ళూ విలాసవంతమైన విందులూ లేని ఆ ప్రపంచాన్ని ఊహించుకున్నాడు అపూ. అక్కడ మైళ్ళకొద్దీ విస్తరించిన పచ్చిక బయళ్ళూ, మహావృక్షాలూ, రంగురంగుల అడవి పూలూ ఉండేవి. తనకోసం ఏర్పాటయిన పూరిగుడిసెలో ఈ సమయానికి రామ్‌చరిత్ నిద్రపోతూ ఉండేవాడు. తాను ఒంటరిగా అడవిలోకీ, ఆకాశంవైపుకూ గంటలకొద్దీ చూస్తూ గడిపేవాడు. అక్కడ తాను అనుభవించిన స్వేచ్ఛనూ, లోయలగుండా నడుస్తున్నప్పుడు కలిగిన మార్మికమైన అనుభూతినీ, ఉదయాస్తమయ వేళలలోని ఆకాశంతోనూ, తారలతోనూ తనకేర్పడిన ఒక అలౌకిక సంబంధాన్నీ మననం చేసుకున్నాడు అపూ.

ఈ నగరంలో తానెంత యాంత్రికమైన జీవితాన్ని గడుపుతున్నాడు? ఇవాళ్టికీ, రేపటికీ ఏ భేదమూ లేకుండా గడిచిపోతూనే ఉంది. అవసరాలకు సరిపడా డబ్బు సంపాదించుకోవటమూ, నిరర్థకమైన బ్రిడ్జి పార్టీల్లో కాలం గడపటమూ, చెత్తవాగుడుతో కాలక్షేపం చెయ్యటమూ తప్ప జీవితానికి ఏ ప్రయోజనమూ కనబడదు.

అపూ గదిలోకి వెళ్ళాడు. గాఢ నిద్రలోని కాజల్ ముఖం నిర్మలంగా, ముద్దొచ్చేలా ఉంది. వాణ్ణి కొంచెం పక్కకు జరిపి, పక్కనే పడుకున్నాడు.

ప్రముఖ బెంగాలీ పత్రికలు విభావరి, వంగ–సుహృత్, రెండిటి నుండి అపూని నవలలు రాసివ్వమని కోరుతూ లేఖలు వచ్చాయి. విభావరి పత్రికైతే అడ్వాన్స్‌గా కొంత డబ్బు కూడా పంపింది. వంగ–సుహృత్ యాజమాన్యానికి ప్రింటింగ్ ప్రెస్ కూడా ఉంది. అపూ గనుక నవల రాస్తే తమ ఖర్చులతో ముద్రించుతామని వాళ్ళు హామీ ఇచ్చారు. మొదటి నవల కూడా బాగా అమ్ముడవుతోంది. మరిన్ని కాపీలు కావాలని పుస్తకాల దుకాణాల వాళ్ళు అడుగుతున్నారు.

ప్రసిద్ధ ప్రచురణ సంస్థ ఒకటి అపూని ఆహ్వానించి, అతడి నవల రెండవ ముద్రణకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పింది. అతడు అంగీకరించి, ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాడు. వాళ్ళు ఆరువందల రూపాయలు పారితోషికం ఇస్తామని, ముందుగా కొంత అడ్వాన్స్ కూడా ఇచ్చారు.

ఆ క్షణంలో లీల గుర్తొచ్చింది అపూకి. తన పరిస్థితులు చక్కబడినందుకు ఆమె బతికుంటే ఎంత సంతోషించేదో!

❖ ❖ ❖ ❖

ఆ రోజు ఆకాశం స్వచ్ఛమైన నీలివర్ణంలో ప్రకాశిస్తోంది. వాతావరణం కూడా చల్లగా ఉంది. ఇలాంటి మధ్యాహ్నాన్ని చూసినప్పుడల్లా అపూ మనసు బాల్య స్మృతుల్లోకి పరిగెత్తుతుంది.

చిన్నతనంలో అపూకొక అలవాటుండేది. ఏదయినా కథనో, చారిత్రక సంఘటననో చదినప్పుడల్లా నిశ్చిందిపురంలోని మామిడి తోటలూ, వెదురు పొదలూ, పచ్చికబయళ్ళూ, నదీతీరమూ నేపథ్యంగా వాటిని దృశ్యరూపంలో ఊహించుకుంటుండేవాడు. ఇంటి వెనుక వైపునున్న మామిడితోటలో అడుగడుగునా భారత, రామాయణ ఘట్టాలే! ఫణిముఖర్జీగారి రెండంతస్తుల శిథిల భవనం దశరథుని రాజసౌధం. చివరికి జోన్ ఆఫ్ ఆర్క్ వంటి విదేశీ సాహిత్య పాత్రలు కూడా అతడి గ్రామంలో ప్రత్యక్షమయ్యేవారు. పెరిగి పెద్దవాయ్యాక చదివిన పుస్తకాలు ఇలా నిశ్చిందిపురం జ్ఞాపకాలను రేపేవికాదు. కానీ రామాయణ, మహాభారతాల గురించి ఎక్కడ చదివినా, విన్నా, వెంటనే ఆ తోటలూ, పాడుపడిన చెరువులూ ఈనాటికీ అతడి మనసులో మెదులుతాయి.

కలకత్తాలో స్థిరపడిన తన మిత్రులు చాలామందిని అపూ ఇటీవల కలుసుకున్నాడు. వాళ్ళలో కొందరు లాయర్లయ్యారు, మరికొందరు డాక్టర్లుగా పనిచేస్తున్నారు. జానకి ఓ ప్రభుత్వ పాఠశాలలో హెడ్‌మాస్టర్. మన్మథ మంచి పేరున్న అటార్నీ. దివాన్‌పూర్‌లోని మిత్రులు దేవూ, సమీర్ కూడా కనబడ్డారు. దేవూ ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. దాన్ని వదిలేసి, సొంతంగా బిల్డింగ్స్ కట్టించే వ్యాపారం మొదలెట్టాలనుకుంటున్నాడట. సమీర్ ఓ పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలో ఏజెంట్‌గా బాగా సంపాదించాడు. వాళ్ళందరితోనూ మాట్లాడాక అపూకి ఎవరిమీదా అసూయ కలగలేదు. ప్రతివాళ్ళకూ ఏవో సమస్యలున్నాయి. యాంత్రికమైన జీవితంతో అలిసిపోతూ, అసంతృప్తితోనే ఉన్నారు.

ఓ రోజు మన్మథ మాట్లాడుతూ, "రోజంతా కోర్టులోనూ, ఆస్తి వ్యవహారాలు చూసుకోవటంలోనూ గడిచిపోతోంది. న్యూస్‌పేపర్ చూట్టానికైనా తీరిక దొరకటం లేదంటే నమ్ము!" అన్నాడు. జానకిది కూడా ఇటువంటి పరిస్థితే, శారీరక శ్రమకు చోటేలేని జీవిత విధానంతో విపరీతంగా బరువుపెరిగి, జబ్బుల పాలయ్యాడతడు.

వీళ్ళందరినీ చూసిన అపూకి అటువంటి సంక్షోభంలో చిక్కుకోకూడదని బలంగా అన్పించింది. లౌకిక దృష్టికి అందని మార్మిక లోకమొకటి అపూని ఎల్లప్పుడూ ఆకర్షిస్తూ ఉంటుంది. దుర్గ మరణం నాటి నుండి ఆ అలౌకిక ప్రపంచంతో అతడి హృదయానికొక అనుబంధం ఏర్పడింది. ఆ తరువాత అనిల్, సర్వజయ, అపర్ణ, లీల...ఒక్కొక్కరి మరణం అతడిని కన్నీటి సముద్రంలోకి తోసి, ఆవలి తీరం కొరకు అన్వేషించేలా ప్రేరేపించింది.

తనూ, ప్రణవ్ తప్ప మిగతా మిత్రులందరూ స్థిరమైన జీవితం గడుపుతున్నట్టే లెక్క. తను జీవితంలో విఫలమయ్యాడని భావించవచ్చా? ఏది సత్యం? తన హృదయం

ఏమంటోంది? తనకు జీవితంలో అసంతృప్తి చెందాల్సిన అవసరమేదో ఉన్నదని అతడికి అన్పించటంలేదు. ఇప్పుడిక తన జీవిత లక్ష్యం ఏమిటి? ఆ ప్రశ్నకు స్పష్టమైన జవాబు దొరకటం లేదు. ప్రపంచమంతా తిరిగి, జీవిత సత్యాన్ని అన్వేషించాలనే అతడి ఆకాంక్షకూ, కాజల్ మీది ప్రేమకూ పొంతన కుదరటం లేదు. తనకు ఏది ప్రధానమో తేల్చుకోవటం అతడికి సాధ్యం కావటం లేదు.

ఆ రోజు అపూ ఇంటికొచ్చేసరికి కాజల్ ఓ కథల పుస్తకంలో లీనమైపోయి ఉన్నాడు. తండ్రిని చూస్తూనే మెరిసే కళ్ళతో "ఈ కథ ఎంత బావుంది బాబా! కూర్చో, కొంచెం చదువుతా విను.." అంటూ చదవసాగాడు. అపూ పరధ్యానంలో పడి, ఆ కథను వినటంలేదు. అది గమనించి కాజల్‌కు కోపమొచ్చింది. "నువ్వసలు వినడం లేదు బాబా!" అన్నాడు అలకగా.

"వింటున్నాను... తరువాతేమయిందో చదువ్!"

"అబద్ధం. వింటే దీనికి జవాబు చెప్పు...తెల్ల దేవత మొట్టమొదట ఏ తోటలో కెళ్ళింది?"

"ఆఁ... ఏం తోటంటే... తెల్ల దేవత కదూ? అయ్యో, మర్చిపోయానే" "ఐతే మళ్ళీ విను జాగ్రత్తగా" అంటూ మళ్ళీ కథ చదవసాగాడు.

అపూ బుర్రలోకి ఒక్కముక్కయినా ఎక్కటంలేదు. కొడుకు మీది నుండి కళ్ళు తిప్పుకోలేక పోతున్నాడు. ఎంత చక్కని చిరునవ్వు వీడిది...ఆ కళ్ళో...వీడసలు ఈ భూమి మీద పుట్టి పెరిగినవాడు కాదేమో? వాడి జుట్టు నుండి ఏదో సుగంధం వస్తోంది... అమాయకత్వపు పరిమళమేమో అది! వాడు చంచలంగా, మొండిగా, అల్లరిగా ప్రవర్తిస్తాడు నిజమే – కానీ వాడెంత అమాయకుడు, ఎంత నిస్సహాయుడు! ఈ పసివాడికి ద్రోహంచేసి, దూరంగా వెళ్ళిపోగలడా తను?

"ఖోకా! దుకాణానికెళ్ళి కాస్త పంచదార తీసుకురా, హల్వాచేసి పెడతా" అన్నాడు అపూ, ఆలోచనల నుండి బయటపడుతూ.

కాజల్ వెళ్ళిన పది నిమిషాలకు ఆ సందు చివరి నుండి పెద్ద కేకలు వినబడటంతో వాకిట్లోకి వెళ్ళాడు అపూ. జనమంతా రోడ్డువైపుకు పరిగెత్తుతున్నారు. ఏం జరిగిందన్న అపూ ప్రశ్నకు "ఎవరో లారీ కిందపడిపోయారట" అని జవాబిచ్చాడొకాయన.

అపూ కూడా వాళ్ళతోబాటు పరిగెత్తాడు. రోడ్డుమీద జనమంతా గుంపుగా పోగు పడి ఉన్నారు. అతి కష్టంపై వాళ్ళలోకి చొరబడ్డాడు అపూ. గుంపు మధ్యలో ఏముందో కనబడటంలేదు. అతడి కళ్ళు భయంతో వణుకుతున్నాయి. నోరు పిడచకట్టుకు పోతోంది.

"అయ్యో, పసిపిల్లాడు పాపం... చూస్తుండగానే...క్షణంలో తల పూర్తిగా... ఎంత దారుణం!" అంటున్నారెవరో.

"ఎన్నేళ్ళ పిల్లాడండీ" గట్టిగా అరిచాడు అపూ.

"తొమ్మిదేళ్ళుంటాయేమో. ఎంత ముద్దుగా ఉన్నాడనీ... అన్యాయమండీ!"

ఆ కుర్రాడి వంటిమీదున్న బట్టలు ఏ రంగువో చూడమని చెప్పాలని నోరు తెరిచాడే గానీ, అపూ నోట మాటరావడంలేదు.

రోడ్డుకు అవతలివైపున ఒక టాక్సీ వచ్చి ఆగింది. పోలీసులు కూడా వచ్చేశారు. గాయపడిన బాలుణ్ణి టాక్సీలోకి చేరుస్తున్నారు. గుంపును బలంగా నెట్టుకుంటూ ముందుకు పరిగెత్తిన అపూ కళ్ళు పెద్దవయ్యాయి...స్పృహతప్పినంత పనైంది. పక్కనున్న వ్యక్తిని ఆనుకుని నిలదొక్కుకున్నాడు. టాక్సీ దగ్గర నిలబడ్డ ఓ చిన్న కుర్రాడు మునివేళ్ళపై పైకి లేచి, లోపలికి చూట్టానికి ప్రయత్నిస్తున్నాడు. వాడు...వాడే కాజల్! అపూ పరిగెత్తుకెళ్ళి వాడి చెయ్యిపట్టుకున్నాడు. కాజల్ తిరిగిచూశాడు. వాడి కళ్ళలో భయమూ, ఉత్సుకతా కలగలిసిపోయాయి.

"ఇక్కడేం చేస్తున్నావ్? ఇంటికి పద!" అంటూ కాజల్ చెయ్యిపట్టుకుని లాక్కుపోతున్నాడు అపూ. అతనికింకా కళ్ళు తిరుగుతున్నాయి. విద్యుద్ఘాతం తిన్నవాడిలా శరీరమంతా వణుకుతోంది.

"బాబా! ఈ గొడవలో నువ్విచ్చిన డబ్బులు ఎక్కడో పడిపోయాయ్" అన్నాడు కాజల్ సంకోచిస్తూ.

"పోతే పోయాయిలే, నువ్వసలు ఇక్కడికెందుకొచ్చావ్? మరీ అల్లరివాడవుతున్నావ్ ఖోకా!"

❖ ❖ ❖ ❖

ఆ రాత్రి అపూకి ఎంతకూ నిద్రపట్టలేదు. కొడుక్కి తను న్యాయం చెయ్యటం లేదనీ, వాడి పెంపకంపై శ్రద్ధ తీసుకోవటం లేదనీ అన్పిస్తోంది. కాజల్ ఇంకా పసివాడు. జీవితంలో అతి విలువైన దశ, బాల్యమే. కానీ వాడి తండ్రిగా తను చేస్తున్న పనేమిటి? నాలుగ్గోడల పంజరంలో వాణ్ణొక బందీని చేసి వాడి ఉత్సాహాన్నీ, సృజనాత్మకతనూ చంపేస్తున్నాడు. యాంత్రికమైన ఈ జీవిత విధానం వాడి ఆసక్తులను రోజు రోజుకూ తప్పకుండా నాశనం చేస్తుంది. వాడి జీవితంలో తోటలూ, మైదానాలూ లేవు; పక్షుల కలకూజితాలూ, సెలయేటి గలగలలూ వినబడవు. పచ్చికబయళ్ళూ, వెన్నెట్లో విహారాలూ, మిత్రులతో పంచుకునే సుఖదుఃఖాలూ ఉండవు. ఐనా, కాజల్‌లో సౌందర్యమూ, సౌకుమార్యమూ వసివాడిపోలేదని తనకు తెలుసు.

జీవితంలోని విషాదాన్ని గురించి కూడా తన కొడుకు తెలుసుకోవాలని అపూ అభిప్రాయం. తన జీవితంలో ఎదురయిన వేదన తనకెన్నో పాఠాలను నేర్పింది.

ఈ విషయాలన్నిటినీ లోతుగా ఆలోచించిన మీదట అపూ మనసులో నెమ్మదిగా ఒక నిర్ణయం రూపుదిద్దుకున్నది. తాను తిరిగి నిశ్చిందిపురానికి వెళ్ళిపోతేనో? ఇప్పుడక్కడ

తనవాళ్ళెవరూ లేకపోవచ్చు. కానీ రాణూదీ ఉంది. పైగా తను దూరదేశాలకు వెళ్ళిపోబోయే ముందుగా కాజల్‌కు వాడి పూర్వీకుల ఊరిని చూపించటం తన ధర్మం కూడాను!

మరునాడు అపూ కాశీలోని లీలాదీ పేరిట పాతిక రూపాయలు పంపుతూ, కాజల్‌ను వాడి తాతగారి గ్రామానికి తీసుకెళ్తున్నాననీ ఆమెను కూడా వెంటనే నిశ్చిందిపురానికి వచ్చెయ్యమనీ ఉత్తరం రాశాడు.

## 24

నిజంగానే తను నిశ్చిందిపురానికి వెళ్ళిపోతున్నాననే విషయాన్ని రైలెక్కి కూర్చున్న తర్వాత కూడా నమ్మలేకపోతున్నాడు అపూ. మధ్యాహ్నం ఒంటిగంట కావస్తుండగా మఝేర్‌పరా అనే స్టేషన్‌కు చేరింది రైలు. కాజల్ ఒక్క గంతులో ప్లాట్‌ఫాం మీదికి దూకాడు. నేరుగా నిశ్చిందిపురానికి రైలు మార్గంలేదు. ఈ స్టేషన్‌లో దిగి వెళ్ళాలి.

స్టేషన్ చాలా మారిపోయింది. స్టేషన్ వెలుపల పెద్ద నేరేడు చెట్టొకటి కనబడింది. అది తన చిన్నతనంలో లేదు. తమ కుటుంబమంతా నిశ్చిందిపురం నుండి రైల్లో వెళ్ళే రోజున ఆ పక్కనే ఉన్న మద్ది చెట్టు కిందనే అమ్మవంట చేసింది. ఇప్పుడు ఆ చెట్టుకింద రెండు బస్సులు ప్రయాణీకుల కోసం ఎదురుచూస్తూ ఆగి ఉన్నాయి. చూస్తుండగానే రెండు పాత ఫోర్డు టాక్సీలు కూడా వచ్చాయి. అవన్నీ నేరుగా నవాబ్‌గంజ్ దాకా వెళ్తాయట. "మోటారు కారులో వెళ్దామా బాబా?" అడిగాడు కాజల్. అపూకి మాత్రం నడిచి వెళ్ళాలనుంది. తనకు చిరపరిచితమైన ఆ దారిలో మోటారు బళ్ళు రేపుతున్న దుమ్మూ, వాటి పెట్రోలు వాసనా అతడికి చిరాగ్గా ఉంది. కాజల్‌ను కాదనలేక టాక్సీలో బయల్దేరారు.

ఏప్రిల్ మాసం సగం గడిచిపోయింది. వసంత రుతువు తన విశ్వరూపాన్ని చూపుతోంది. రోడ్డు పొడవునా విరబూసిన పూల చెట్లను చూసి ముగ్ధుడైపోయాడు అపూ. ఇటువంటి మధ్యాహ్నాలతోనూ, ఈ అడవిపూలతోనూ కలిసి సాగిన బాల్యం తనది.

దారిలో భద్రావతీ నది ఎదురయింది. ఎంత చక్కని పేరు! నదికి ఆవలివైపున బజారు కనబడుతోంది. నదిగట్టునే పెట్రోలు బంకూ, డన్‌లప్ టైర్ల వ్యాపార ప్రకటనతో పెద్ద బోర్డూ ఉన్నాయి. ఆ బజార్లో కొత్తగా వెలసిన సిమెంటు భవనాలు కనబడు తున్నాయి.

ఇంకో రెండు మైళ్ళు వెళ్తే నిశ్చిందిపురం వస్తుంది. అక్కణ్ణించి నడిచి వెళ్దామని కాజల్‌ను ఒప్పించాడు అపూ. సామాన్లు తీసుకురావటానికి ఓ కూలీని మాట్లాడుకున్నాడు.

సాయంత్రం కావస్తుండగా సోనాదంగా చేరారు. కొద్ది దూరం నడిచాక అల్లంత దూరాన పురాతనమైన మర్రిచెట్టు కనబడింది. ఒకప్పుడు బందిపోటు దొంగలు ఆ చెట్టు మీదనే దాక్కుని, ప్రయాణీకులను దోచుకునేవాళ్ళని గుర్తొచ్చింది. ఆ చెట్టు దాటితే నిశ్చిందిపురం వచ్చేస్తుంది. మర్రిచెట్టును సమీపిస్తుంటే...దాన్ని దాటి ముందుకు నడుస్తుంటే

అపూ గుండె వేగంగా కొట్టుకుంది. చిత్రమైన ఉద్వేగంతో కాళ్ళూ చేతులూ కదల్చలేనట్టుగా తోచింది.

మరికొంచెం ముందుకు నడవగానే, నదీదీరం పొడవునా వ్యాపించిన మామిడి తోటలు ఎదురయ్యాయి. అపూ తన జేబురుమాలును నేలపై పరిచి, దానిలోకి కొంచెం మట్టి తీసుకుని నుదుటికి ఆనించుకున్నాడు. "మీ తాతయ్య పుట్టిన ఊరు ఇదే ఖోకా! ఆయన పేరు గుర్తుందా?" అడిగాడు కొడుకుని.

"ఉంది. శ్రీ హరిహరరాయ్."

"శ్రీ అనక్కర్లేదులే! ఈశ్వర హరిహరరాయ్ అంటే చాలు. ఆయన మరణించారు కాబట్టి పేరుముందు 'ఈశ్వర' అనే మాట చేర్చాలి".

❖ ❖ ❖ ❖

మరునాటి సాయంత్రం రాణూదీని కలుసుకున్నాడు అపూ. దానికన్నా ముందే ఓ తమాషా జరిగింది. రాణూ చెప్పిందాకా అపూకి ఈ విషయం తెలీదు:

అపూ గ్రామానికొచ్చిన సంగతి రాణూకి అప్పటికింకా తెలీదు. ఆమె నది నుండి మంచినీళ్ళు తీసుకుని వెళ్తుండగా వెదురుపొదల పక్కగా ఒంటరిగా నడిచివెళ్తున్న కాజల్ కనబడ్డాడు. వాణ్ణి చూసి విస్మయంతో నిలబడిపోయింది రాణూ. ఆమె చిన్నతనంలో ఆ వెదురు పొదల దగ్గరే హరిహరరాయ్‌గారి ఇల్లుండేది. వాళ్ళు ఊరొదిలి వెళ్ళి చాలా కాలమయింది. కానీ ఈ కుర్రాడు అచ్చంగా ఆమె చిన్నతనంలో చూసిన అపూ వలెనే ఉన్నాడు. అదెలా సాధ్యం? ఆమె మరింత దగ్గరగా వెళ్ళి వాడిని పరిశీలనగా చూసింది. ఈ పిల్లవాడు అపూ కాదు. కానీ అచ్చంగా అతనివలెనే ఉన్నాడు. తాను ఆడిపాడిన బాల్యమిత్రుడు అపూ ముమ్మూర్తులా ఇలాగే ఉండేవాడు.

"ఎవరింటికొచ్చావ్ బాబూ?" అడిగిందామె.

"గంగూలీ గారింటికి."

గంగూలీగారిది సంపన్న కుటుంబం. వాళ్ళకు కలకత్తాలో చాలామంది బంధువులు వున్నారు. వాళ్ళెవరి కుర్రాడో అయివుండొచ్చు. కానీ, వీడు అచ్చుగుద్దినట్టుగా అపూ పోలికలతో ఉండడమే విచిత్రం!

"కాదూ అత్తయ్యగారి మనవడివా?" మళ్ళీ అడిగింది రాణూ.

"కాదూ అత్తయ్యా? వారెవరో నాకు తెలీదు. మా తాతగారు ఈ ఊళ్ళోనే ఉండేవారు. ఆయన పేరు ఈశ్వర హరిహరరాయ్. నా పేరు అమితాబ్ రాయ్."

ఓ సంతోష తరంగం రాణూని నిలువెల్లా ముంచెత్తింది. కొన్ని క్షణాలు ఆమె నోట మాట రాలేదు. ఆపైన, ఓ మృదువైన హస్తం ఆమె హృదయాన్ని స్పృశించిన అనుభూతికి లోనవుతూ "మీ నాన్న...?" అంది ఉద్విగ్నంగా.

"మేమిద్దరం నిన్ననే వచ్చాం. రాత్రి గంగూలీ గారింట్లో ఉన్నాం. బాబా ఇంకా వాళ్ళింట్లోనే ఎవరితోనో మాట్లాడుతున్నాడు".

వాడి ముచ్చటైన ముఖాన్ని తన రెండు అరిచేతుల్లోకి తీసుకుంది రాణూ. "నువ్వు అచ్చంగా మీ నాన్నలాగే ఉన్నావ్ ఖోకా! ఆ కళ్ళు...సరిగ్గా అతనివే!" అంది ప్రేమగా. "వెళ్ళి మీ నాన్నను పిల్చుకురా! రాణూ అత్తయ్య రమ్మంటోందని చెప్పు!" అని చెప్పింది వాడితో.

సాయంత్రమవుతుండగా కాజల్‌తోబాటు రాణూ ఇంటికి వెళ్ళాడు అపూ. "ఎక్కడున్నావ్ రాణూదీ! నేనెవరో చెప్పుకో చూద్దాం!" అంటూ ముందు గదిలోకి అడుగు పెట్టగానే పరిగెత్తుకొచ్చింది రాణూ. అపూకేసి కళ్ళప్పగించి చూస్తూ నిలబడిపోయిన ఆమె, కాసేపటికి తేరుకుని, "ఊరికి రావాలని నీకెలా తట్టిందో చెప్పు ముందు! ఐనా వచ్చిన వాడివి గంగూలీ గారింట్లో దిగటమేమిటి? వాళ్ళేనా నీకంత ఆత్మీయులు?" అంటుంటే ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

కొంతసేపటి వరకూ రాణూనే చూస్తూ నిలబడిపోయాడు అపూ. కిందటిసారి తను చూసినప్పుడు ఆమెకు పద్నాలుగేళ్ళు. తొలి యవ్వనంలోని ఆ అమాయక బాలిక కాదీమె. ఇప్పటికీ ఆమె అందంగానే ఉంది. కానీ, వితంతువుగా తన ముందు నిలబడిన ఈ స్త్రీ, అపూకి అపరిచితురాలే.

రాణూవాళ్ళ ఇల్లు కూడా ఎంతో మారిపోయింది. ఆమె తండ్రి భువన ముఖర్జీ గొప్ప సంపన్నుడు. వాళ్ళింట్లో ఎప్పుడూ ఎనిమిదో, పదో ధాన్యపు గాదెలుండటం అపూకి స్వయంగా తెలుసు. ఇప్పుడు ఆ ఇల్లంతా పాడుబడిపోయింది. పడమటి భాగానున్న గదులన్నీ కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఏం చూస్తున్నావ్ అపూ?" అంది రాణూ. ఆమె కళ్ళనుండి కన్నీళ్ళు జాలు వారుతూనే ఉన్నాయి. "అమ్మా, నాన్నా చనిపోయారు. శోతూకి చదువబ్బలేదు. దాంతో ఆస్తుల్ని అమ్ముకుని తినటం మొదలెట్టాడు."

"విన్నాను. కాశీలో లీలాదీ చెప్పింది".

"లీలాదీ చెప్పిందా? నువ్వు కాశీకి వెళ్ళావా అపూ! ఎప్పుడు?"

అపూ చెప్పిన విషయాలన్నీ విని, రాణూ ఆనందానికి అంతులేదు. అక్క కూడా త్వరలోనే రాబోతోంది! వాళ్ళిద్దరూ కలుసుకుని ఎన్నో సంవత్సరాలయిపోయింది.

"అన్నట్టు...నీ భార్యను తీసుకురాలేదేం? ఎక్కడుందామె?"

"స్వర్గంలో..." అన్నాడు అపూ నిర్లిప్తంగా.

"అయ్యయ్యో! ఎంతకాలమయింది? మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు నువ్వు?" బాధగా అడిగింది రాణూ.

అదేరోజు రాత్రికి గ్రామంలో జాతర ప్రారంభమయింది. దాన్ని చరకమేళా అంటారు. అపూ చిన్నతనంలో కూడా జరిగేదది. కానీ, ఈనాటి తన కళ్ళకు ఆ జాతర గతంలోవలె ఆకర్షణీయంగా కనబడకపోవటాన్ని గ్రహించాడు అపూ. దానికి కారణం, తన దృష్టిలో, మానసిక స్థితిలో వచ్చిన మార్పేనని తోచి విస్తుపోయాడు. ఇరవైనాలుగేళ్ళ కిందట తనలో ఉండిన ఉత్సాహం, ఉద్వేగం, కుతూహలం ఇవాళ కొరవడ్డాయి. ఇప్పుడు తను కేవలం ఒక ప్రేక్షకుడిలా దాన్ని చూస్తున్నాడు. ఇప్పుడు తన అనుభూతులను పంచుకోటానికి బాల్యమిత్రులెవరూ లేరు.

ఇరవై నాలుగేళ్ళ కిందట...సరిగ్గా ఈ జాతర రోజునే అపూ కుటుంబం నిశ్చింది పురం నుండి వెళ్ళిపోయింది. ఆరోజు జరిగిన ప్రతి విషయమూ ఇవాళ అతడికి స్పష్టంగా గుర్తొస్తోంది. తన కొత్త జీవితంలోని అనేకానేక సంఘటనల మరుగున, ఇప్పటికీ భద్రంగా దాగివున్న బాల్య స్మృతులు అతడిని ఆశ్చర్యపరిచాయి.

చీకటి పడింది. నవ్వులతో, కబుర్లతో జాతర నుండి ఇళ్ళకు వెళ్తున్నారు పిల్లలు. పక్క గ్రామాల నుండి వచ్చిన వాళ్ళు జాతరలో కొనుక్కున్న పిల్లనగ్రోవినో, బొమ్మనో చేత బట్టుకుని పడవలరేవు వైపుకు వడివడిగా నడుస్తున్నారు. ఇరవై నాలుగేళ్ళ కిందట ఈ జాతరలో ఇదే ఆనందంతో పాలుపంచుకున్న పిల్లలు.. వేణువులను ఊదుకుంటూ, మిఠాయిలు తింటూ ఇళ్ళకు బయల్దేరిన పసివాళ్ళు...ఇప్పుడు ఊపిరిసలపని జీవితంలో సతమతమవుతున్నారు. వాళ్ళలో కొందరు అసలు జీవించి లేరేమో కూడా! కానీ, వాళ్ళ బిడ్డలు మళ్ళీ అదే ఆనందాన్నీ, అమాయకత్వాన్నీ, స్వేచ్ఛనూ అనుభవిస్తున్నారు.

ఈ జీవిత సత్యాన్ని, ఏ అలౌకిక శక్తో తన ఎరుకలోనికి తెచ్చిందేమోనన్పించింది అపూ మనసుకు.

❖ ❖ ❖ ❖

ఏప్రిల్ నెల చివరిలో లీలాదీ కాశీ నుండి వచ్చేసింది. రాణూ ఆమెను కౌగలించుకుని ఏడ్చేసింది. "అపూ పూనుకుని సాయం చెయ్యకపోతే, ఎన్నటికీ రాగలిగేదాన్ని కాదు" అంది లీలాదీ. కాజల్ కోసమని ఎన్నో బొమ్మలూ, మిఠాయిలూ కొనుక్కొచ్చిందామె. గ్రామమంతా తిరిగి, తన బాల్యమిత్రులనందరినీ పలకరించింది.

ఆ సాయంత్రం అపూ, కొడుకును ఇచ్ఛామతీ నదిలో పడవపై చాలసేపు విహారానికి తీసుకువెళ్ళాడు. రకరకాల పడవలు ఎదురవుతున్నాయి. కొన్నిటిని గవ్వలతో అలంకరించారు. తారుపూసిన చిన్న పడవలు కదులుతుంటే, చిత్రమైన వాసన గాలిలో వ్యాపిస్తోంది. కొన్నిచోట్ల నీరు నల్లగా, నిశ్చలంగా ఉంది. అక్కడ చాలా లోతుగా ఉంటుందని గుర్తుచేసుకున్నాడు అపూ. నదీ తీరానున్న లంకల్లోని కూరగాయల తోటలకు కూలీలు నీళ్ళు పెడుతున్నారు. గట్టువెంట బారులు తీరిన ఖర్జూర వృక్షాలకు

పళ్ళగుత్తులు వేలాడుతున్నాయి. కాజల్ ఓ చెట్టుకేసి చూపుతూ, "అదేం చెట్టు బాబా?" అని అడిగాడు.

అపూ జవాబివ్వలేదు. అతడింకా ఈ గ్రామీణ సౌందర్యపు ఇంద్రజాలంలోంచి బయటపడనేలేదు. అదొక శక్తిమంతమైన మత్తుమందులా అతడి నరనరాల్లోనూ నిండి పోయింది. ఆ సౌందర్యం అతడి చెవిలో ఏవో రహస్యాలను విన్పిస్తోంది.

"ఈ ఊరు చాలా బావుంది కదూ, బాబా?" మళ్ళీ అడిగాడు కాజల్.

"మరి...నువ్విక్కడే ఉండిపోవచ్చుగా ఖోకా? రాణూ అత్తయ్య దగ్గర ఉండొచ్చు. నేను లేకపోయినా ఉంటావుగా?"

"వీల్లేదు. నన్నొదిలేసి వెళ్తానంటావేం బాబా? నేనూ నీతోనే వచ్చేస్తా."

అపూ ఇంకేమీ మాట్లాడలేదు. మౌనంగా నదీజలాల్లోకి చూస్తుండిపోయాడు. ఈ ఇచ్ఛామతిని చూస్తుంటే అమ్మను చూసినట్టుగానే అన్పిస్తుంది అతడికెప్పుడూ. అతడి బాల్యమంతా ఆమె ఒడిలోనే గడిచింది. ఆమె అలల సంగీతంతో అతడికి లాలిపాడి నిద్ర పుచ్చింది. సుదీర్ఘమైన ప్రయాణాలు చెయ్యాలనీ, సుదూర ప్రాంతాలను దర్శించాలనీ, సముద్రాలను దాటాలనీ...అతడు కలలుగనటం నేర్చినది ఈ నదీతరంగాల మీదనే.

అతడిప్పుడు ఆనాటి బాలుడు కాదు. ఇచ్ఛామతికన్నా పెద్దవైన గంగ, నర్మద వంటి నదులెన్నిటినో చూశాడు. వాటితో పోల్చితే ఇచ్ఛామతి చాలా చిన్నది. ఆడంబరంగా అలంకరించుకున్న సంపన్న స్త్రీల ఎదుట చేనేత చీరలో, మట్టి గాజులతో ఒదిగి నిలబడిన తన నిరుపేద తల్లివంటిదే ఈ ఇచ్ఛామతి అతడి దృష్టిలో! కన్నతల్లికి ఎవరు మాత్రం సాటి రాగలరు?

❖ ❖ ❖ ❖

ఎండిన వెదురు పొదలు, అరవిరసిన పుష్పాలు, ఎండకు కాగిన నేల, వేపపూత... తనకు చిరపరిచితమైన ఇన్ని పరిమళాలను మోసుకొస్తున్న మార్చి మాసపు ఆ మధ్యాహ్నపు గాలి అపూని కుదురుగా కూర్చోనివ్వటంలేదు. అతడి చిన్నతనంలో ఇటువంటి మధ్యాహ్నం వేళలలో అక్కతో కలిసి తోటల్లోకో, ఏటి ఒడ్డుకో పరిగెత్తేవాడు. ఈ రోజు కూడా అదే కోరిక అతడిని నిలవనివ్వలేదు. గ్రామమంతా వేసవి తాపానికి సేదదీరుతున్న ఆ ఎండవేళ అపూ ఒంటరిగా ఉన్మత్తునివలె బయల్దేరి, గ్రామ శివార్లలో పూల తీగలతో నిండిన గుట్టల మీదికి చేరాడు.

ఈ ప్రకృతి సౌందర్యం ఈనాడు తనకు కలిగిస్తున్న అనుభూతికీ, బాల్యంలో తాను పొందిన ఆనందానికీ ఏదో భేదమున్నదని తోచింది అపూకి. ఒకప్పుడు ఇలాంటి మధ్యాహ్నాల్లో ఈ వెదురుపొదల నీడల్లోకి స్వర్గం నుండి దేవతలు దిగివస్తారేమోనని అన్పించేది తనకు. ఇప్పుడు ఏదో మార్పు గోచరిస్తోంది.

అక్కడి నుండి ఏటిగట్టుకు చేరి పచ్చికలో మేను వాల్చాడు అపూ. చేతి వంపులో తలవాల్చి, ఆకాశంలోకి చూస్తూ, ఏవో అవ్యక్తమైన ఊహలలో గంటల తరబడి అలా ఉండిపోయాడు. ఆ పచ్చికలో తన ముఖాన్ని దాచుకుని, తనకు జన్మనిచ్చిన పల్లెతల్లిని ప్రేమగా స్మరించుకున్నాడు, "నా పసితనంలో నువ్వు నా నోట్లో చిలకరించిన అమృత బిందువులే ఇన్నేళ్ళ వేదనలో, విషాదంలో నాకు జీవశక్తినిచ్చాయమ్మా!" అంటూ కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

రాణూ తనపై చూపుతున్న అవ్యాజమైన ప్రేమ అపూ హృదయాన్ని సేదదీర్చింది. తమ్ముడి పిల్లల ఆలనాపాలనా చూసుకోవటంతో సహా, ఆ ఇంటి బాధ్యతలన్నీ ఆమెవే. రాణూ మరీ మరీ చెప్పటంతో అపూ, కాజల్ కూడా గంగూలీ గారి ఇంటి నుండి వచ్చేసి ఆమె దగ్గరే ఉంటున్నారు. కాజల్‌కు రాణూ దగ్గర బాగా చనువు ఏర్పడింది.

ఒకరోజు సాయంత్రం వరండాలో కూర్చుని ఆకాశంకేసి చూసిన అపూ, ఏవో జ్ఞాపకాల్లోకి జారిపోయాడు. ఆకాశం నిర్మలంగా, స్వచ్ఛమైన నీలిమతో ప్రకాశిస్తోంది. ఈ ఊరు వదిలి, పరాయి చోటికి వెళ్ళిన కొత్తల్లో అతడి పసి హృదయం ఇటువంటి సాయంత్రాలపై బెంగతో తపించిపోయేది. అర్థంకాని వేదనతో ఉన్నట్టుండి ఏడ్చేసేవాడు. తల్లి వాణ్ణి దగ్గరకు తీసుకుని, "ఎందుకలా ఉన్నావ్ ఖోకా? ఎందుకేడుస్తున్నావ్? ఏమన్నా పారేసుకున్నావా?" అని ఓదార్చేది. క్రమంగా కొత్త జీవితానికి అలవాటయ్యాక ఈ సంధ్యా సమయాల స్మృతులు మరుగునబడిపోయాయి.

బిందె తీసుకుని బావికి వెళ్ళబోతున్న రాణూని పిలిచి, "ఇలాంటి సాయంత్రాల్లో చిన్నప్పుడు ఎన్నిరకాల ఆటలాడుకునేవాళ్ళం! నీకు గుర్తుందా రాణూదీ?" అన్నాడు అపూ.

ఆమె ఫక్కున నవ్వింది. "అంత గంభీరంగా ఆలోచిస్తున్నది దీని గురించేనా? గుర్తులేకేం అపూ! అన్నీ గుర్తున్నాయి. వకుళ పుష్పాలను ఏరుకొచ్చి చక్కటి మాలలు కూడా కట్టేవాళ్ళం కదూ! ఈ రోజుల్లో పిల్లలకు పూలు గుచ్చటమే రాదు. ఐనా, అన్ని రకాల పువ్వులు కూడా ఇప్పుడు దొరకటంలేదులే! అంతా మారిపోయింది!"

ఆమె బావి నుండి తిరిగొచ్చేదాకా అపూ అలాగే కూర్చుని ఉన్నాడు. "నాకో ఆలోచనొచ్చింది అపూ! మీ మామిడితోటను మాకు తాకట్టుపెట్టాడు మీ నాన్న. దాన్ని శోతూ దగ్గర్నుండి తీసేసుకోరాదూ? వాడు ఏదో ఒకరోజున దాన్ని కూడా తెగనమ్ముతాడు." అంది రాణూ అతడి దగ్గరగా వచ్చి.

"అమ్మ కోరిక కూడా అదే. చనిపోయేముందు ఎన్నోసార్లు ఈ మాట అంటూనే ఉండేది. మంచి మాట చెప్పావ్ రాణూదీ! తొందర్లోనే డబ్బులు సమకూర్చుకుని కొనేసుకుంటా."

ప్రతిరోజూ సాయంత్రం కాగానే వరండాలో చాప పరుచుకుని అపూతో కబుర్లు మొదలెడుతుంది రాణూ. వాళ్ళ మాటలన్నీ బాల్య స్మృతులతోనే నిండిపోతాయి. "ఓ

రోజు పెద్ద మిడతల దండును చూశాం గుర్తుందా?" అని గుర్తుచేశాడు అపూ ఓ రోజు. ఆ సాయంత్రం వీళ్ళిద్దరితోబాటు పక్కింటి వితంతువు కూడా రాణూ వాళ్ళింటికొచ్చి కూర్చుంది. "మీ పెళ్ళయి ఈ ఊరొచ్చిన రోజున మీ ఇంట్లోకి అడుగుపెట్టబోతూ ఎక్కడ నిలబడ్డారో గుర్తుందా?" ఆమెను అడిగాడు అపూ.

"లేదు నాయనా, అదంతా ఏ జన్మలోనో జరిగిపోయిన కథ. ఇప్పుడేం గుర్తుంటుంది?" అందావిడ.

"నాకు మాత్రం బాగా గుర్తుంది. మీ వాకిట్లో పశువుల కొట్టం ముందు నిలబడ్డారు. అక్కడ నేలమీద పాలూ, పసుపూ చల్లారు ఆ రోజున" అన్నాడు. ఆ పెళ్ళికొచ్చిన బంధువుల్లో ఓ యువతి చాలా అందంగా ఉంది. అందరూ ఆమెను కళ్ళప్పగించి చూశారు. ఆ సంగతి గుర్తుచేసి, "ఆ అమ్మాయి పేరు సుభాషిణి" అని చెప్పాడు అపూ.

"ఔనౌను. ఆ అమ్మాయి నాకూ గుర్తొచ్చింది, సుభాషిణే! ఎప్పటిటెప్పటి సంగతులో నీకెలా గుర్తుంటాయ్ అపూ?" లీలాదీ ఆశ్చర్యపడింది.

"అంతేకాదు, లీలాదీ! నిలువుచారలున్న ఎర్రచీర కట్టుకుందన్న సంగతి కూడా నాకు గుర్తుంది" నవ్వుతూ చెప్పాడు అపూ.

అతడు చెప్పిన వివరాలకు పక్కింటి వితంతువు కూడా ఆశ్చర్యపడింది. ఆనాటికి అపూ వయసు ఎనిమిదేళ్ళుంటుంది. అంత అందమైన మనిషిని చూడటం అతడికదే తొలిసారి. అందుకే ఆ పెళ్ళివారందరిలోనూ ఆ యువతి రూపం మాత్రమే అతడి మనసులో ముద్రించుకుపోయింది.

నిశ్చిందిపురంలోని ప్రతి సాయంకాలమూ ఒక ఇంద్రజాలం వలె కట్టిపడేస్తోంది అపూ హృదయాన్ని. తను చూసిన ఏ ప్రదేశంలోనూ ఇంత అద్భుతమైన సంధ్యాసమయాలు ఉండవన్పించిందతడికి. ఆకాశం నిర్మలంగా ఉన్న రోజుల్లో సూర్యాస్తమయవేళ ఎరుపు, పసిడి వన్నెల భానుకిరణాలు చెట్ల చిటారుకొమ్మలపై గుప్పిళ్ళకొద్దీ సిందూరాన్ని చల్లుతాయి. కొండరేగు పూత వెదజల్లే తియ్యని పరిమళంతో పరిసరాలు మత్తెక్కిపోతాయి.

కొన్ని వారాల తరువాత, మే నెలలో ఒక సాయంత్రం ఈశాన్య దిశ నుండి నల్లని మేఘాలు బయల్దేరి, చూస్తుండగానే ఆకాశమంతటా దట్టంగా ఆవరించాయి. నలుదిక్కులా చీకట్లుకమ్మి, సుడిగాలి వీచసాగింది. ఈ ఏడాదికి మొట్టమొదటి కాలవైశాఖి ఇది. ఈ దృశ్యం అపూకి చిరపరిచితమైనదే. గాలి విసురుకు ఊగిపోయే వెదురు వనాలపై ఆవరించిన నల్లని మేఘాల దండును చూడగానే చిన్ననాటి అపూ హృదయం తెలియని ఉద్వేగానికి లోనయ్యేది. ఆ పసివాడికి స్పష్టంగా అర్థంకాని ఏవో సందేశాలను అవి మోసుకొచ్చేవి. అతడు విభ్రమంతో కళ్ళు విప్పార్చి వాటిని చూస్తూండిపోయాడు. ఊగుతున్న ఆ వెదురు పొదలూ, మబ్బులు కమ్మిన సాయంత్రమూ ఈనాటికీ అలాగే ఉన్నాయి...కానీ ఇప్పుడు

ఆనాటి పసివాడూ లేడు, వాడి కలల ప్రపంచమూ లేదు. ఇవాళ ఆ సుడిగాలి దృశ్యాన్ని చూస్తుంటే అతడికి కలుగుతున్న ఆనందం, నిజానికి పాత జ్ఞాపకాల తలపోత తెచ్చిన ఆనందమే.

నిశ్చిందిపురానికి తిరిగి వచ్చినప్పటి నుండి ఈ విషయాన్ని గురించి ఎన్నోసార్లు ఆలోచించాడు అపూ. ఈ వనసీమల సౌందర్యాన్నీ, పసిడికాంతుల మధ్యాహ్నాలనూ, అర్థరాత్రివేళ చౌకీదార్ కేకనూ, గుడ్లగూబల అరుపులనూ, దిగంతాలకు ఆవలి నుండి ఒక మార్మికమైన స్వప్నలోకం పిలిచే పిలుపునూ ఎప్పుడు తలచుకున్నా అవి అతడి అనుభూతుల్లో సజీవంగా దర్శనమిస్తాయి. కానీ అదంతా గడిచిపోయిన కాలం. ఆ పక్షులన్నీ మరణించాయి. ఒక పూరింటిలో కూర్చుని కలలుగనే పల్లెటూరి కుర్రాడి పసిహృదయాన్ని ఉరకలెత్తిస్తూ చిరుగాలికి కదిలే కొబ్బరాకుల సందుల నుండి నాట్యంచేసిన చందమామ వెలుగు మసకేసిపోయింది. ఆ కుర్రవాడు మాత్రం ఎక్కడున్నాడని? దాదాపు పాతికేళ్ళ కిందట ఓ మధ్యాహ్నం తన కుటుంబంతోబాటుగా తిరిగిరాని తీరాలకు తరలిపోయాడు. ఆ వెదురుపొదల నడుమ కాలిబాటలలో ముద్రపడిన వాడి చిన్నపాదాల అడుగుజాడలు ఏనాడో తుడిచిపెట్టుకుపోయాయి.

ఆ పసివాడికీ, వాడి సోదరికీ ఎన్నో ఆశలూ, స్వప్నాలూ ఉండేవి. అవి ఎన్నడైనా నెరవేరాయా?

పాపం అమాయక బాలలు!

ఇటీవల కొన్నాళ్ళ నుండి దాదాపు ప్రతి సాయంత్రమూ ఆకాశంలో మబ్బులు ముసిరి, తీవ్రమైన గాలి వీస్తోంది. అపూ ఒకరోజు రాణూని పిలిచి, "రాణూదీ! మామిడి కాయలు రాలాయేమో తెచ్చుకుందామా?" అని అడిగాడు. రాణూ నవ్వింది. అపూ, కాజల్‌ను వెంటబెట్టుకుని తాను తిరిగి కొనుక్కున్న మామిడితోటకు వెళ్లాడు. గ్రామస్తులెవరయినా సరే, వచ్చి మామిడికాయలు ఏరుకోవచ్చని ఆహ్వానించాడు. చిన్న చిన్న పిల్లలు పరుగులతో, కేరింతలతో, హడావిడిపడుతూ గాలికి రాలిన మామిడికాయలను ఏరుకుంటున్న దృశ్యం అతడికి ఎనలేని ఆనందాన్నిచ్చింది. చాలా ఏళ్ళకిందట ఇతరుల చెట్టుకు కాసిన మామిడి కాయలను దొంగిలించిన నేరానికి దుర్గ పడరాని మాటలు పడింది. ఆ అమ్మాయి తన అవమానాన్ని చిరునవ్వు వెనుక అదిమిపట్టుకుని ముళ్ళకంచెను దాటుకుని పరిగెత్తింది. అప్పటికి దుర్గ వయసు కాజల్‌కన్నా కాస్తంత ఎక్కువుండొచ్చంతే. అపూకి ఆ సంఘటన బాగా గుర్తుంది.

ఐనా, తను మాత్రం ఏంచేసుకుంటాడా తోటను? పేద పిల్లలందరూ స్వేచ్ఛగా ఆ తోటలోకి వచ్చి కావలసినన్ని మామిడికాయలు తీసుకువెళ్ళాలి. వాళ్ళను అడ్డగించే వాళ్ళూ అవమానించేవాళ్ళూ ఇక్కడెవరూ ఉండరు. ముళ్ళకంచె ఆవలినుండి తొంగిచూసే ఆ పసిపాప సంతోషంగా నవ్వగలగాలి.

అపూ, నిశ్చిందిపురానికి వచ్చినప్పటి నుండి ప్రతిరోజూ తమ ఇంటిమీదుగానే నది దగ్గరకు వెళ్తున్నాడు. కానీ, ఆ ఇంట్లో కాలుపెట్టటానికి అతడికెందుకో మనస్కరించ లేదు. ఒక సాయంత్రం అతడు ఒంటరిగా బయల్దేరి, అడవిలా తయారయిన తమ ఇంటి ఆవరణలోకి అడుగుపెట్టాడు. ఆ ప్రదేశంలో ఒకప్పుడు ఇల్లుండేదన్న ఆనవాళ్ళు కూడా మిగల్లేదు. దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కల నడుమ ఓ ఇటుకల గుట్ట మాత్రం ఉంది. ఇంటి వెనుకవైపున వెదురుపొదలు చిక్కగా పెరిగిపోయాయి.

ఇంటి ప్రహరీగోడ మాత్రం ఇప్పటికీ కొంత మిగిలే ఉంది. గోలీకాయలూ, గవ్వలూ వంటి తన చిన్ననాటి సంపదలను భద్రంగా దాచుకున్న గూడు పడమటి గోడపై ఇంకా కనబడుతూనే ఉంది. అది ఇప్పుడింత కిందికి ఉందిగానీ, ఆ రోజుల్లో గోడపై ఎంతో ఎత్తున ఉన్నట్టుగా తోచేది. మునివేళ్లపై నిలబడి దాన్ని అందుకోవాల్సి వచ్చేది. ఆ గోడ కింది భాగాన చాకుతో తను గీసిన 'రాక్షసి' బొమ్మ ఇంకా అలాగే ఉంది.

ఈ ఇంటికి పక్కనున్న ఇల్లు కూడా పాడుబడిపోయింది. దాని యజమానులెవరూ ఇప్పుడు లేకపోవటంతో ఆ ఇంటిని పట్టించుకునేందుక్కూడా ఎవరూ లేకుండా పోయారు. దుర్గా, తనూ కలిసి ఆ ముళ్ళ పొదల మధ్యనే తిరుగుతుండేవాళ్ళు. అప్పటి కొండరేగు చెట్టు ఇంకా అలాగే ఉంది. తను దానికింద కూర్చుని, అంపశయ్యపై మేనువాల్చిన భీష్ముడి గురించ ఊహించుకుంటుండేవాడు. నిండుగా పూతపూసిన ఆ చెట్టు గాలికి గమ్మత్తయిన పరిమళాన్ని అద్దుతోంది.

ఓ మర్రిచెట్టుకు మిగలపండిన పళ్ళవాసన అపూని ఒకరోజు అతడి బాల్యంలోని ఓ సంఘటన చెంతకు తీసుకువెళ్ళింది. ఒకరోజు అపూ తండ్రి ఏదో కొనటానికి దుకాణానికి వెళ్తూ కొడుకుని భుజాన ఎక్కించుకుని బయల్దేరాడు. ఆయన చేతిలో ఓ పాతకాలపు లాంతరుంది. దారిలో ఒక చెరువు ఎదువరగానే ఆగి, ఓ కలువపువ్వును కోసుకొచ్చి అపూ చేతికిచ్చాడు. ఈ మర్రిపళ్ళ వాసనతో, చిన్ననాటి ఆ దృశ్యమంతా కళ్ళముందు మెదిలింది. తండ్రి చేతిలోని లాంతరు గుడ్డి వెలుతురూ, ఆ మునిమాపు వేళలో అస్పష్టంగా కనబడిన పొడవాటి వెదురు కాండాలూ ఇప్పటికీ స్పష్టంగా గుర్తొస్తూనే ఉన్నాయి.

గోడకు ఆనుకుని ఉన్న పొడవాటి ఖర్జూర చెట్టు కొమ్మలకు పండ్ల గుత్తులు వేలాడుతున్నాయి. అప్పట్లో ఇదొక చిన్న పొదలా ఉండేది. ఒకరోజు దుర్గ ఆ చెట్టుకొక తాడుకట్టి, ఆవును కట్టేశానంటూ ఆటలాడటం అపూకి గుర్తొచ్చింది.

ఇక్కడ...ఇక్కడే పెరటి తలుపు ఉండేది. ఇప్పుడు దాని ఆనవాళ్ళేమీ లేవు. ఒకనాడు తను సరిగ్గా ఇక్కడే నిలబడి దుర్గ దొంగతనంగా తెచ్చిన బంగారు బరిణెను దూరంగా విసిరేశాడు. ఇంతలో, అపూ బాగా ఎరిగిన ఓ వస్తువు కనబడింది. అది, వాళ్ళ ఆవుకు మేత పెడుతుండిన ఇనుపతట్ట, పూర్తిగా తుప్పుపట్టి పనస చెట్టుకింద పడివుందది. ఒకసారి

అపూ తండ్రి, ప్రహారీగోడను ఇంకాస్త ఎత్తుగా కట్టిద్దామనుకుని కాసిని ఇటుకలు తెచ్చాడు. కానీ, డబ్బు సమకూరకపోవటంతో గోడ కట్టించలేక పోయాడు. ఆ ఇటుకల గుట్ట ఇప్పటికీ అలాగే పడుంది.

నిశ్చిందిపురం నుండి ఇంకో ఏడాదికి వెళ్ళిపోతారనగా ఒకరోజు సర్వజయ, పెరట్లో ఓ మునగ మొక్కను నాటింది. ఆ చెట్టు ఏపుగా పెరిగి, ఇప్పుడు అవసాన దశకు చేరింది. ఇన్ని సంవత్సరాలుగా దాని కాయలను ఎవరూ కోసుకున్నట్టే లేదు. అస్తమయ సూర్యుడి చివరి కిరణాల వెలుగులో ఆ చెట్టు దీనంగా, విషాదంగా నిలబడినట్టుగా తోచింది అపూకి.

చీకటి చిక్కబడుతోంది. పేరు తెలియని ఏదో చెట్టు తాలూకు వాసన గాలిలో తేలి వచ్చింది. అపూ ఒళ్ళు జలదరించింది. ఆ వాసనలతోనూ, ఆ మసక వెలుతురుతోనూ కలిసి ప్రేమతో నిండిన అమ్మ గొంతూ, అక్కయ్య చెప్పిన కథలూ, నాన్న పాడిన పాటలూ, తమను చుట్టుముట్టిన పేదరికమూ...అన్నీ ఒక్కసారిగా గుర్తుకొచ్చాయి.

ఏదో పొదలో దాగిన పావురం కువకువలాడింది. మరొక్కసారి కళ్ళు విప్పార్చి మునగచెట్టునూ, పల్చబడుతున్న సందె వెలుగునూ పరికించాడు అపూ. తను చూస్తున్నదంతా ఉత్తి కలేమో! తానిలా చూస్తుండగానే ఏ క్షణాన్నో అమ్మ నదిలో స్నానంచేసి, బట్టలుతుక్కుని వచ్చేస్తుందేమో! పిండిన చీరను వెదురుపొదపై ఆరేసి, తులసి మొక్క దగ్గర దీపం వెలిగించి, తనకేసి చూస్తూ చిరుకోపంగా "అపూ, ఇప్పుడా ఇంటికి రావటం? ఇంతసేపూ ఎక్కడ తిరుగుతున్నావ్?" అంటుందేమో!

ఒకప్పుడు తాము నివసించిన గదులున్న చోట ఇప్పుడొక మట్టికుప్ప మిగిలింది. ఆ దృశ్యానికి అపూ గుండె ముక్కలయింది. తన కుటుంబ సభ్యులందరి జీవితాలతో తమ సుఖదుఃఖాలతో ఈ మట్టికున్న సంబంధం విడదీయరానిది. చిన్న వయసు ఆడపిల్లలు వేసుకునే ఆకుపచ్చని గాజుముక్క అపూ కంటబడింది. ఇది దుర్గదే అయ్యుంటుంది. దాన్ని జాగ్రత్తగా చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పక్కనే పగిలిపోయిన ఓ సీసా పడుంది. ఆ సీసాలోనే కొబ్బరినూనె పోస్తూండేది అమ్మ! కొద్ది దూరంలో...వంటగది ఉండాల్సిన చోట తుప్పుపట్టి, చెవులు ఊడిపోయిన ఇనప బాణలి నేలలో సగం కూరుకుపోయి ఉంది.

ఇరవై నాలుగేళ్ళ కిందట, తామందరూ రాత్రి భోజనాలు చేశాక, అమ్మ దానిని ఆ మూలాన పెట్టింది. ఆ రోజు భోజనం చేసిన వాళ్ళలో తను తప్ప, మిగిలివాళ్ళందరూ గతించిపోయారు. కానీ, ఆ ఇనపపాత్ర అలాగే నిలిచివుంది.

అపూ హృదయం ఉద్వేగంతో ఉక్కిరిబిక్కిరయింది. ఒక వ్యక్తి జీవితంలోని అతి ముఖ్యమైన సూక్ష్మాంశాలు మరొకరికి అర్థమవుతాయా? బయటివాళ్ళ దృష్టిలో ఈ స్థలం కేవలం పాడుబడి, దోమలు ముసిరే పనికిమాలిన స్థలం. కానీ, ఇక్కడి ప్రతి చిన్న

వస్తువుతోనూ, ఒక అమాయిక బాలుడి జీవితంలోని అతి మధురమైన క్షణాలు ముడివడి ఉన్నాయని ఎందరికి అర్థమవుతుంది.

ముప్ఫై, యాభై, వంద...వెయ్యేళ్ళు కూడా గడిచిపోవచ్చు. ఈ గ్రామం శిథిలమై పోవచ్చు. బహుశా ఇచ్ఛామతి కూడా ఇంకిపోనూ వచ్చు. ఎవరి ఊహకూ అందని ఒక కొత్త యుగం, పూర్తిగా కొత్తదైన నాగరికత ఉద్భవించవచ్చు. బ్రిటిష్ వారి ఆధిపత్యం కేవలం చరిత్ర గ్రంథాల పేజీల్లోనే మిగిలిపోయి, ఇప్పుడు ప్రాచుర్యంలోనున్న భాష స్థానాన్ని మరొక భాష ఆక్రమించవచ్చు. ఐనప్పటికీ, మూడువేల సంవత్సరాల అనంతరం కూడా మేనెల చివరి రోజుల్లో ఇప్పటివలెనే సుడిగాలులు వీస్తాయి, పక్షుల కూజితాలు వినబడుతాయి, చంద్రుడు అచ్చంగా ఈవేళ ఉదయించినట్టే ఉదయిస్తాడు. కానీ, మూడు వేల ఏళ్ళకిందట ఒక గ్రామంలో జీవించిన ఓ పసివాడి చిన్నారి కలల ప్రపంచాన్ని గురించీ, వానచినుకుల పరిమళం వాడిలో రేపిన ఆనందాన్ని గురించీ ఎవరు తలచు కుంటారు? చల్లని సందెగాలి వాడిలో రేకెత్తించిన ఆశలనూ, ఆకాంక్షలనూ ఎవరు గుర్తిస్తారు? శిశిర ఋతువులో ఆకురాల్చిన అడవిలో ఎంతోసేపు ఆటలాడి, ఇంటికి రాగానే అమ్మచేతి మంచినీళ్ళు తాగినప్పటి వాడి అనుభూతినీ, ఒక మధ్యాహ్నం వేళ గాఢంగా నిద్రించి, కోయిల పాటతో మేల్కొన్నప్పుడు వాడనుభవించిన హాయినీ ఎవరయినా నమోదు చేస్తారా? వర్షపు రాత్రులలో వాడి ఆలోచనలను గురించి ఎవరయినా రాస్తారా?

ఒకనాటి కాలవైశాఖి తెచ్చిన ఆనందపు సందేశాన్ని గురించి సుదూర భవిష్యత్ లోని కొత్త తరాల బాలబాలికలు చదువుకుంటారేమో! ఆ నూతన బాలలు ఎక్కడి నుండి వస్తారో; ఏ స్వర్గలోకపు దారులు వాళ్ళను ఈ లోకంలోకి తీసుకొస్తాయో?

తన శిథిల గృహం నుండి వెలుపలికొచ్చాడు అపూ. మరొక్కసారి వెనక్కి తిరిగి దాన్ని చూశాడు. రాత్రి చిక్కబడుతూ, జాలిగొలిపే చీకటి తెరను ఆ ఇంటిపై కప్పుతోంది. కూలిపోయిన ఆ ఇల్లు ఎవరి రాక కొరకో చిరకాలంగా ఎదురుతెన్నులు చూసి, చివరికిప్పుడు వృద్ధయై, అలిసిపోయి, నిర్లిప్తంగా చూస్తున్నట్టుగా తోచింది అపూకి. దాని జీవమంతా ఆవిరైపోయి, ఎవరికీ పట్టనిదై మిగిలిపోయింది.

ఆ ఇంటి గోడలోని చిన్న దీగూడు మళ్ళీ గుర్తొచ్చింతడికి. ఇల్లంతా శిథిలమైనా, ఆ ఇంటి మనుషులందరూ మరణించినా ఆ గూడు మాత్రం చెక్కుచెదరకపోవటం ఆశ్చర్యపరిచింది.

అపూ బాల్యమిత్రులు చాలామంది ఇప్పటికీ నిశ్చిందిపురంలోనే ఉన్నారు. కానీ, ఈ ఊళ్ళో శాశ్వతంగా ఉండిపోవటం తనకు సాధ్యంకాదనిపించింది అతడికి. ప్రతి విషయాన్నీ ప్రశ్నించడమూ, పోల్చిచూడటమూ, విలువకట్టటమూ తనకిప్పుడు తెలుసు. ఈ గ్రామంలో స్థిరపడిపోయిన వాళ్ళకన్నా భిన్నమైన దృక్పథమూ, స్వభావమూ తనకు అలవడ్డాయి. తన బాల్యమిత్రులలో కొందరు పాతికేళ్ళుగా ఈ ఊరినే అంటిపెట్టుకుని,

బయటి ప్రపంచం తెలియకుండా జీవిస్తున్నారు. వాళ్ళలో చాలామందికి ఇక్కడ భూములూ, ఇతర ఆస్తులూ ఉండటంతో కాలు బయట పెట్టాల్సిన అవసరం వాళ్ళకు లేకుండా పోయింది. వాళ్ళ ఆలోచనలు కూడా గతంలో ఉన్నచోటనే ఆగిపోయాయి. ఇప్పుడిక తననూ, వాళ్ళనూ కలపగలిగే ఉమ్మడి అంశమేదీ కనబడటంలేదు.

అంతేగాక తన ఆప్తమిత్రులనదగిన వాళ్ళెవరూ ఇప్పుడిక్కడ లేరు – రాణూ తప్ప. రాణూదీ, లీలాదీ, వాళ్ళ పక్కింటి వృద్ధ వితంతవూ మాత్రం తన రాకకు ఎంతగానో సంతోషించారు. వాళ్ళ ప్రేమలోని నిజాయితీని తానేమీ శంకించటంలేదు. వాళ్ళతో కలిసి పాత రోజులను నెమరు వేసుకోవటం తన మనసుకు హాయినిస్తోంది. కానీ వాళ్ళ జీవితాలు అ చిన్న ప్రపంచానికి మాత్రమే పరిమితమైనవి కావటంతో ఆ విషయాలను మాత్రమే వాళ్ళు తనతో పంచుకోగలుగుతారు.

అపూకి ఒక విషయం చాలా స్పష్టంగా అర్థమయింది – తనకు కొంత భూవసతో, మరేదయినా ఆస్తులో ఉండి బయటిలోకం తెలియకుండా ఇక్కడే స్థిరపడి ఉండినట్లయితే ఇన్నేళ్ళ జీవన పోరాటంలో నేర్చుకున్న విషయాలేవీ ఈనాడు తనకు తెలిసేవే కావు. ఇప్పుడు గనుక తను విదేశీ పర్యటనకు వెళ్ళినట్టయితే, అక్కడి విషయాలను ఒక స్పష్టమైన దృక్పథంతో అంచనా వెయ్యగల శక్తి ఈ పాతికేళ్ళ పోరాటం వలన తనకు అలవడింది. తన సుఖదుఃఖాలన్నీ కేవలం నిశ్చిందిపురంతోనే ముడివడిన కాలమొకటి తన జీవితంలో గతంలో ఉండేది. ఆ తరువాతి కాలంలో అనుభవించిన ఆనంద, విషాదాల వలన ఈ ప్రపంచమంతటిలోనూ తానొక భాగంగా మారే అవకాశం ఏర్పడింది.

ఓ సాయంత్రం నదిలో స్నానంచేస్తూ, ఈ విషయాలన్నిటినీ ఆలోచించాడు అపూ. ఆ రోజు వాతావరణం వేడిగా, ఉక్కగా ఉంది. కిందటిరోజే పౌర్ణమి వెళ్ళిపోయింది – ఇప్పుడే చంద్రోదయమవుతోంది. తన చిన్నతనంలో ఈ నదికి మంచినీళ్ళకు వచ్చే యువతులలో కొందరిప్పుడు మధ్యవయస్కులయ్యారు, మరికొందరు మరణించారు. ఆనాటి వసంత రుతువుల్లో పాడిన కోయిలల స్థానంలో ఇప్పుడు వాటి కూనలు పాడుతుంటాయి. ఇక్కడ నిశ్చలంగా ఉండిపోయింది అక్కయ్య ఒక్కతే. గ్రామ శ్మశానంలోని ఆ వృక్షం కింద మౌనంగా విశ్రమించిందామె. ఆమెకు వృద్ధాప్యంలేదు, ఆ పసితనంలో ఏ మార్పూ రాదు. ఆమెది శాశ్వతమైన బాల్యం. చీకటి ముసిరిన ఒంటరి రాత్రుల్లో ఆమె అపూ హృదయంలోకి ప్రవేశిస్తుంది. జ్ఞానభారం కింద, పెద్దరికపు అనుభవాలూ, కోరికల కింద అణిగిపోయిన ఒక చిన్నారి బాలుడి పసి హృదయం కొరకు వెదుకులాడుతుంది. ఒకనాటి గతంలో తనను క్షణమైనా వదలని చిన్ని నేస్తం కొరకు కన్నీళ్ళతో అన్వేషిస్తుంది.

ఇరవై నాలుగేళ్ళుగా ఆమె శయనించిన చోటుపై సూర్యుడు తన ఉదయాస్తమయ కిరణాలను చల్లుతూనే ఉన్నాడు; మేఘాలు వర్షధారలతో ఆమెను జలకాలాడిస్తూనే

ఉన్నాయి; వివిధ వర్ణాల పుష్పాలతో మొక్కలు ఆమెను అలంకరిస్తూనే ఉన్నాయి. ఆమె వీటన్నిటినీ మనసారా ప్రేమించింది. బహుశా అందువల్లనే ఈ చోటును వదలలేక ఇక్కడే శాశ్వతంగా ఉండిపోయింది.

## 25

**జూ**న్ నెలాఖరులో అపూ కలకత్తాకు వెళ్ళాడు. అనుకున్న పనులన్నీ చక్కబెట్టుకునేందుకు దాదాపు నెలరోజులు పట్టింది. నిశ్చిందిపురానికి తిరిగి వచ్చేనాటికి వర్షాలు ఉధృతంగా కురుస్తున్నాయి. చెట్లన్నీ పచ్చగా, కళకళలాడుతున్నాయి. ఆ ఋతువులో పూచే మొక్కలన్నీ పూలగుత్తులతో నిండిపోయాయి. ఈ వాతావరణం అపూని మరొకసారి బాల్య స్మృతుల్లోకి తీసుకుపోయింది. ఈ వర్షాకాలంలో పూసే ఒకవిధమైన పువ్వులు గుర్తొచ్చాయి. గ్రామస్తులు వాటిని ఘెత్కోల్ పువ్వులనేవారు. అవి విచ్చుకున్నప్పుడు ఘాటయిన వాసన పరిసరాలంతటా వ్యాపిస్తుంది. ఆ పొదల పక్కనుండి వెళ్ళే ఆడవాళ్ళు కొంగులతో ముక్కులు మూసుకోవటం అతడికి జ్ఞాపకం వచ్చింది.

ఒకరోజు మధ్యాహ్నం గ్రామ శివార్లలోని తోటల్లో నుండి తిరిగి వస్తున్నాడు అపూ. దారికిరువైపులా పచ్చని పొదలు బారులు తీరాయి. పసుప్పచ్చని ఓ చిన్నిపిట్ట, వెదురు పొదలపై గంతులు వేస్తోంది. ఏదో పొదనుండి తియ్యని పరిమళం తేలివస్తోంది. అలా నడుస్తున్న అపూ, హటాత్తుగా ఆగిపోయాడు. ఆ సన్నని కాలిబాటపై అతడి చూపులు నిలిచిపోయాయి.

ఇక్కడే...సరిగ్గా ఇదే, తన చిన్ననాటి ప్రపంచంలో అతి ప్రియమైన స్థలం. ఏ దేవుడైనా అనుగ్రహించి, తన జీవితంలోకి పాతికేళ్ళ కాలాన్ని రద్దుచేసినట్టయితే, సరిగ్గా ఈ సమయంలో దుర్గా, తనూ కలిసి ఈ తోటలవెంట తిరుగుతూ తియ్యరేగుపళ్ళ కోసమూ, పక్షిగూళ్ళ కోసమూ గాలిస్తూ ఉంటారు. ఎన్నిమైళ్ళ దూరం వెళ్ళేవారో లెక్కలేదు, వెనక్కి తిరిగి వెళ్ళేందుకు ఏ వాహనాలూ దొరకవనే భయమూ లేదు. బహుశా ఇతరులెవరికీ కనబడని ఓ అదృశ్య మార్గం తమకోసం భూమిపైకి వచ్చి, తమను ఈ దట్టమైన పొదల లోకి, అడవులలోకి తీసుకువెళ్ళేదేమో.

ఒక్క క్షణంలో పాతికేళ్ళ కిందటి జీవితంలోకి ప్రయాణించాడు అపూ. ఈ నీలాకాశం, ఈ దట్టమైన పొదలూ, బంగారు వన్నెలు చిందే ఈ జూలై మాసపు మధ్యాహ్నమూ ఒకప్పుడు తన లోకంగా ఉండేవి. దీనికి వెలుపల ఏమున్నదో తనకానాడు తెలియదు, తెలుసుకోవలసిన అవసరమూ రాలేదు. తనక్కావలసినంత ఆనందమూ, ఉద్వేగమూ ఇక్కడే లభించాయి.

ఈ పరిసరాల నడుమ తన బాల్యాన్ని తిరిగి పొందినట్టుగా అనుభూతి చెందాడు అపూ. చుట్టూ పరుచుకున్న పచ్చదనమూ, సూర్యకాంతీ, పాడుతున్న పక్షులూ.. ఇవన్నీ

కలిసిన మధ్యాహ్నవేళ, దూరం నుండి తనను గొంతెత్తి పిలుస్తున్న అక్క కంఠాన్ని వింటున్న అనుభూతికి లోనయ్యాడు.

ఒక దిగ్భ్రాంతికి లోనయినవాడిలా కళ్ళార్పకుండా చూస్తూ, ఉన్నచోటనే నిలబడి పోయాడు అపూ. తన భావాలను వర్ణించటానికి మాటలు చాలనట్టుగా ఉందతడికి. కళ్ళు బైర్లు కమ్ముతున్నట్టుగా అన్పిస్తోంది. ఏ దేవుడు తన మొరను ఆలకించాడో? నిశ్చిందిపురానికి తిరిగి వచ్చినందుకు తగిన ఫలితం ఈనాటికి తనకు లభించింది.

తన బాల్యం అవిచ్ఛిన్నమైనదన్న భావం అపూ మనసులో మెదిలింది. కోల్పోయా ననుకున్న ఆ లోకం తన హృదయంలో ఈనాటికీ సుస్థిరంగానే నిలిచివుంది. ప్రత్యేకమైన ఒక పక్షికూజితంతోనో, ఒకానొక పుష్పం వెదజల్లే సువాసనతోనో కలిసి ఆ లోకం మళ్ళీ తనముందు ప్రత్యక్షమవుతుంది. అదొక అలౌకికమైన అనుభవం. అది కలిగినప్పుడల్లా ఒక సౌందర్యానుభూతితో, స్వేచ్ఛా కాంక్షతో తన హృదయం ఉరకలెత్తు తుంది. మౌనంలో, ధ్యానంలో లీనమయిన క్షణాల్లో మాత్రమే ఆ మార్మిక లోకాన్ని అనుభూతి చెందగలుగుతాడు.

తన కొడుకు కాజల్ ప్రస్తుతం నివసిస్తున్న లోకం అదే. అందుకే తన ఊహాశక్తిని సజీవంగా నిలుపుకోవాలని అపూకి అంత ఆరాటం. యాంత్రికమైన జీవితం నుండి వాడిని వెలుపలకు తీసుకొచ్చిన కారణం కూడా అదే. భౌతిక ప్రపంచపు భారంతో వాడి లేలేత స్వప్నాలు అణగారిపోవటానికి వీల్లేదు. ఈ నిశ్చిందిపురంలోని వెదురు వనాల్లో, మైదానాల్లో, పూలపొదల్లో వాడిదైన లోకాన్ని వాడు స్వయంగా సృష్టించుకోవాలి.

❖ ❖ ❖ ❖

నిశ్చిందిపురం

ప్రియమైన ప్రణవ్ ఆగస్టు 10

నువ్వెక్కడున్నావో, ఏం చేస్తున్నావో, చాలాకాలంగా ఏ కబురూ లేదు. ఒక కోర్టులో నువ్వు కమ్యూనిజాన్ని గురించి ఉపన్యసించిన వార్తను ఇటీవలే న్యూస్ పేపర్లో చూశాను. దాని ద్వారా నీ చిరునామా సంపాదించి ఈ ఉత్తరం రాస్తున్నాను.

చాలాకాలం తర్వాత, నేను మళ్ళీ మా గ్రామానికి వెళ్ళి ఉంటున్నానన్న సంగతి నీకు తెలిసి ఉండకపోవచ్చు. కాజల్‌ను కూడా నాతోబాటు తీసుకొచ్చాను. వాడు నిన్ను మరీ మరీ తలుచుకుంటున్నాడు. తను జ్వరంతో మంచంపట్టినప్పుడు, నువ్వు చన్నీళ్ళతో వాడి నుదురు తడుపుతూ ఎంత జాగ్రత్తగా చూసుకున్నావో వాడికిప్పటికీ బాగా గుర్తే.

నా మనసులో మెదులుతున్న కొన్ని ఆలోచనలను నీతో పంచుకోవాలని ఉంది. జీవితానికి అర్థమేమిటని ఎంతగానో ఆలోచించాను. ఒక వ్యక్తి అనుభూతులూ, ఆశలూ, ఊహలూ, స్వప్నాలూ తప్ప జీవితమంటే మరేమీకాదని నాకిప్పుడు అర్థమయింది. ఇక్కడికి

వచ్చిన తరువాతే జీవితాన్ని నూతన దృక్పథంతో చూడటం అలవడింది నాకు. నాగపూర్ సమీపంలోని ఆడవుల్లో జీవించిన రోజుల్లో తప్ప, ఆ తరువాత నాకసలు ఈ విషయాలను ఆలోచించేందుకు వ్యవధి కూడా దొరకలేదు.

ఎంతో సంతోషప్రదమైన సమయాలను జీవితం నాకు అనుగ్రహించింది. పాత కాలంనాటి నీలిమందు ఫ్యాక్టరీని చూసేందుకు మా నాన్నతో కలిసి వెళ్ళిన దినాన్నీ, రైలు పట్టాలను చూడాలన్న ఆశతో అక్కా, నేనూ పరుగెత్తుకెళ్ళిన రోజునూ, నా పెళ్ళికి ముందు రోజున మనిద్దరం డాబామీద కూర్చుని మాట్లాడుకున్న ఆ సాయంత్రాన్నీ నేనెలా మరిచి పోగలను? మన్సాపోతాలో ఒక వర్షపు రాత్రి మా పూరింట్లో, చిక్కని చీకటిలో నేనూ, అపర్ణా గడిపిన నిద్రలేని రాత్రి నాకెలా మరపుకు వస్తుంది? నా స్మృతిపథంలో నిలిచి పోయిన ఈ రాత్రులూ, పగళ్ళూ నాకు అందించేది కేవలం ఆనందాన్ని మాత్రమే కాదు, జీవితంలోని సమస్యలన్నిటినీ ఎదుర్కొనే శక్తిని కూడా! సిరిసందపలతోనో, కీర్తి ప్రతిష్టల తోనో లభించే ఆనందం కాదది. అది సూర్యకాంతిలో వెచ్చదనం వలె దయాపూరితమూ, నిష్పాక్షికమూనైనది; ధనిక, పేద తారతమ్యాలు లేనిది. నేను పౌరోహిత్య భోజనం నుండి తిరిగొస్తూ కాసిని తినుబండారాలు పట్టుకొచ్చినప్పుడు మా అమ్మ ముఖంలో కనబడిన ఆనందం, ఒక సంపన్న మహిళకు కొత్త కారు కొన్నప్పుడు కలిగే ఆనందంకన్నా గొప్పగా ఉండేది. ఓ అడవి తీగకు కాసిన పండ్లను చూసినప్పుడు మా అక్కయ్య కూడా ఆనందంతో పొంగిపోతుండేది. నాకు తొమ్మిదేళ్ళ వయసుండగా ఒకరోజు, నేనొక్కణ్ణే పక్క గ్రామంలోని మా అత్తయ్య దగ్గరకు వెళ్ళాను. నేను మరొక వెయ్యేళ్ళు జీవించినా సరే, ఆనాటి ప్రయాణాన్ని మర్చిపోలేను. పుస్తకాల్లో చదువుకున్న ఎన్నో అద్భుతమైన సాహసయాత్రలకన్నా, నా మొట్టమొదటి ఒంటరి ప్రయాణం కలిగించిన అనుభూతి నాకు గొప్పది.

మానవ జీవితంలో సుఖానికీ, దుఃఖానికీ సమ ప్రాధాన్యమున్నదని నేను గ్రహించ గలిగాను ప్రణవ్! జీవితం దానికదే ఒక అద్భుతం! జీవించటమన్నదీ అద్భుతమే! ఎంత నిస్సారమూ, నిష్ప్రయోజకమూ అన్పించే జీవితమైనా, నిజానికి ఒక అద్భుతమే. ఆ సత్యం ఇన్నాళ్ళకుగానీ బోధపడలేదు. అవిశ్రాంతంగా తిరుగుతూ ఉండటమే జీవితమని ఒకప్పుడు భావించేవాణ్ణి. ఆ భావన సరైనది కాదని ఇప్పుడర్థమయింది.

జీవితం తెచ్చే ఆనంద, విషాదాలనూ; ఆశ, నిరాశలనూ మానవ హృదయం అనుభవిస్తుంది. ఐతే, వాటిని సంపూర్ణంగా అర్థం చేసుకోవటానికి మాత్రం మనిషికొక ప్రత్యేకమైన దృక్పథం ఉండాల్సిందే. అంతు తెలియని జీవనయానంలోని అలౌకిక సౌందర్యాన్ని అవగాహన చేసుకోవటం ద్వారా మాత్రమే ఆ లోచూపు సిద్ధిస్తుంది.

మా ఊరికి తిరిగి వచ్చినప్పటి నుండి జీవితానికి నిజమైన అర్థాన్ని తెలుసుకో గలిగాన్నేను. అంతకు పూర్వం నా జీవితాన్ని నేనెన్నడూ ఇంత సన్నిహితంగా పరిశీలించనే

లేదు. అద్భుతమైన, ప్రశాంతమైన ఈ మధ్యాహ్న వేళలలో ఒంటరిగా పడుకుని నా బాల్యాన్ని తిరిగి మరొకసారి అవలోకించగలిగాను. దిగంతాలదాకా విస్తరించిన మైదానాలలోని మర్రిచెట్టు నీడ కిందికి మళ్ళీ వెళ్ళిపోగలిగాను; పసులకాపరి కుర్రవాడి వేణుగానం నా చెవుల్లో మళ్ళీ ధ్వనించింది. ఇవన్నీ కలిసి అలౌకికమూ, శాశ్వతమూనైన మరొక ప్రపంచాన్ని నాకు చూపించాయి.

ఐతే, నాకిప్పటికీ అర్థంకాని విషయమొకటి ఉన్నది. ఎంతోమంది వ్యక్తులు నిరాసక్తంగానూ, దేనికీ ఆశ్చర్యం చెందకుండానూ ఉంటారెందుచేత? విభ్రాంతి చెంద గలగటమనేది అపురూపమైన ఒక వరం. దేనికీ చలించకుండా, ఆశ్చర్యపడకుండా ఉండగల మానవులు నిర్జీవులతో సమానం. అర్థరహితమైన విషయాలకై జీవితాలను వెచ్చించే ఎందరో వ్యక్తులను – గొప్ప పేరు ప్రతిష్ఠలున్న వాళ్ళను నగర జీవితంలో చూశాన్నేను. జీవించటమన్నది ఒక కళ. జీవన వ్యాపారంలో విజయం సాధించాలంటే ఈ కళను ఎరిగి ఉండటం అత్యవసరం.

ప్రతిరోజూ కొన్ని నిమిషాలైనా మౌనంలో, ధ్యానంలో లీనమయితేనేగానీ ఈ కళను సాధించలేమన్న సత్యాన్ని అడవిలో నివసించిన రోజులు నాకు తెలియజెప్పాయి. ఆ సాయం సంధ్యలలో శాలవృక్షపు నీడలో కూర్చుని నేనుపొందిన అవ్యాజమైన ఆనందాన్ని వివరించేందుకు నాకు మాటలు చాలవు.

ఆ అరణ్యం నాకు నేర్పిన ఆలోచనలన్నీ ఇప్పుడు మరింత గట్టిపడ్డాయి. అతి సామాన్యమైన విషయాలు ఎంత అద్భుతమైన ఆనందాన్ని అందించగలవో నేనిక్కడ చూస్తున్నాను. సంపద, కీర్తి, ప్రతిష్ఠ వంటివన్నీ అల్పమైన విషయాలు. ఈ వృక్షాలు, నల్లగా వ్యాపించే నీడలు, పండిన ఖర్జూరాల పరిమళం, కొండరేగు పూత సువాసన, బాల్య స్మృతుల తలపోత కలిగించే ఆనందం – ఇవి చాలు జీవితానికి. ఏమాత్రమూ విసుగుచెందకుండా ఇక్కడ వెయ్యేళ్ళయినా గడపగలను.

లీల గుర్తుందా నీకు? ఆమె గురించి అప్పుడప్పుడూ చెబుతుండేవాణ్ణి కదూ! ఆమె మరణించింది. అదంతా పెద్ద గాథ...లీలను తలచుకున్నప్పుడల్లా అపర్ణ గుర్తుకొస్తుంది నాకు. వాళ్ళిద్దరికీ నేనెంతగానో రుణపడి ఉన్నాను. "నేనొక నూతన స్వర్గాన్నీ, నూతనమైన భూలోకాన్నీ కూడా చూశాను" అనే బైబిల్ వాక్యం గుర్తుందా? ఆ మాటల అర్థాన్ని ఈ స్త్రీలిరువురూ నాకు బోధపరిచారు.

ఇంకో విషయం చెప్పాలి నీకు...నేను విదేశాలకు వెళ్తున్నాను. బహుశా ఫిజీకో, సమోవాకో వెళ్తాననుకుంటా. నా మిత్రుడొకరు అన్ని ఏర్పాట్లూ చేశారు. కాజల్‌ను ఎవరి దగ్గర వదిలి వెళ్ళాలనే విషయాన్ని నిన్న మొన్నటిదాకా తేల్చుకోలేకపోయాను. తాతగారింట్లో వదిలి వెళ్ళొచ్చు...కాజల్ అత్తయ్య ఒకావిడ ఇటీవలే నాకు ఉత్తరం రాసింది. వాడు

లేకపోతే ఇల్లంతా బోసిపోయినట్టుందనీ, మళ్ళీ ఇక్కడికే పంపెయ్యమనీ ఆమె రాసింది. కానీ నాకది ఇష్టంలేదు. నిశ్చిందిపురంలో నా బాల్యమిత్రురాలి దగ్గర వాణ్ణి ఉంచి వెళ్తున్నాను. ఆమె నాకు మళ్ళీ కనిపించి ఉండకపోతే, నా విదేశీ పర్యటన అసాధ్యమే అయ్యేది.

ఈ రోజు త్రయోదశి. రెండురోజుల్లో పున్నమి వస్తుంది. ఇవాళ ఆకాశం నిర్మలంగా ఉంది. ఇంకాసేపట్లో లోకమంతా వెన్నెల్లో జలకమాడుతుంది. దాన్ని చూడటానికి నువ్వు కూడా ఇక్కడుంటే ఎంతో బావుండేది. నీతో ఎన్నో విషయాలు చెప్పాలనుంది. నేనెన్నటికీ నీ రుణం తీర్చుకోలేను మిత్రమా! నువ్వే లేకపోతే అపర్ణ నా జీవితంలోకి వచ్చి ఉండేది కాదు. ఆమె మరణంతో నేను జీవితంలో ఎంతగా నష్టపోయానో నీకు అర్థంకాకపోవచ్చునేమో!

ఎప్పటికీ నీ మిత్రుడు

అపూర్వ

## 26

"అపూ! నువ్వు నాకో వాగ్దానం చేశావ్!" అంది రాణూ, ఓ మధ్యాహ్నం అపూ దగ్గరికొచ్చి.

"ఔనా? ఏమిటా వాగ్దానం?"

"నువ్వు కాశీకి వెళ్ళబోయే ముందు నా నోటు పుస్తకంలో ఓ కథ రాయటం మొదలెట్టావ్. దాన్నిప్పుడు పూర్తిచెయ్యాలి."

అపూ విస్తుపోయాడు. "ఇన్నేళ్ళపాటు ఆ నోట్ పుస్తకాన్ని దాచిపెట్టావా?" రాణూ చిరునవ్వు నవ్వింది.

"సరే, అలాగే రాస్తా. నా కథల్ని పత్రికలవాళ్ళు కూడా వేస్తూనే ఉన్నారుగా! ఐనా, ఇంతకాలం ఆ పుస్తకాన్ని దాచిపెట్టాలని నీకెందుకన్పించిదసలు?"

"ఏదో ఒకనాడు నువ్వు మళ్ళీ కనబడతావనీ, ఆ కథ పూర్తిచేస్తావనీ నా మనసు చెప్పింది కాబట్టి" నవ్వుతూ అంది రాణూ.

"నీలాంటి స్నేహితురాలుండటం నా అదృష్టం రాణూదీ! మళ్ళీ జన్మంటూ ఉంటే ఇలాంటి మిత్రురాలిని మళ్ళీ అనుగ్రహించు భగవంతుడా!" అనుకున్నాడు అపూ తన మనసులో. పైకి మాత్రం, "అలాగా! ఆ కథ నాకోసారి చూపించవూ!" అన్నారు.

చిన్ననాటి తన రాతను చూసి అతడికే నవ్వొచ్చింది. "ఒక్క పేజీలో ఏడు చోట్ల అక్షర దోషాలు, చూడు రాణూదీ!"

రాణూ నవ్వింది. ఆత్మీయతతో ఆమెకేసి చూస్తూండిపోయాడు అపూ. తన జీవితంలో ఎదురయిన స్త్రీలందరిలోనూ ఇటువంటి ఆప్యాయతా, దయా కనబడ్డాయతడికి. కానీ

వారిలో ప్రతి ఒక్కరూ స్వల్పకాలంలో దూరమైనవారే. అపర్ణతో కలిసి బతికింది కొద్ది సంవత్సరాలే. లీలతో అతడి సంబంధంలో ఎటువంటి స్వార్థానికీ, వైషమ్యానికీ తావులేదు. పతీశ్వరి, రాణూ, నిర్మల, నిరుపమ, తివారీగారి కోడలు...ఈ స్త్రీలందరితోటి అనుబంధమూ దాదాపుగా అటువంటిదే. కానీ, తనకు అవసరమైన సమయంలో వాళ్ళందరూ చూపించిన కరుణ గొప్పదని అతడికి తెలుసు. వారితో అంతకుమించిన సాన్నిహిత్యం లేనందుకు అతడికెలాంటి చింతాలేదు. దగ్గరితనం పెరిగేకొద్దీ అవతలివాళ్ళ బలహీనతలు కూడా తెలిసిపోతాయేమో. అటువంటి పరిస్థితి ఏర్పడటం అతడికిష్టంలేదు, వీళ్ళు చూపిన ప్రేమాభిమానాల కారణంగా స్త్రీజాతి అంతటిమీదా కృతజ్ఞత పొంగింది అపూ హృదయంలో.

❖ ❖ ❖ ❖

సెప్టెంబర్‌లో మళ్ళీ కొన్నాళ్ళపాటు కలకత్తాకు వెళ్ళొచ్చాడు అపూ. ఫిజీ నుండి ఇటీవలే తిరిగొచ్చిన కొందరు భారతీయులు, ఆర్యసమాజం నడిపే ఓ అతిథి గృహంలో ఉంటున్నారని తెలిసి అక్కడికి వెళ్ళాడొకరోజు.

అక్కడ ముప్పయ్యేళ్ళ వయసున్న ఓ యువకుడు కనబడి, హిందీలో పలకరించాడు. "మీరు ఫిజీ నుండి వచ్చారని తెలిసింది. నేను కూడా త్వరలో అక్కడికి వెళ్దామనుకుంటున్నా. ఫిజీలో జీవితాన్ని గురించి తెలుసుకుందామని వచ్చాను" అన్నాడు అపూ.

ఆ యువకుడు ఆర్యసమాజం తరఫున తూర్పు ఆఫ్రికా, ట్రినిడాడ్, మారిషస్, మరికొన్ని దేశాలూ వెళ్ళివచ్చాడు. ఫిజీలోని తన ఇంటి చిరునామా ఇచ్చి, "నేను ఫిజీకి తిరిగి రాగానే, అన్ని ప్రాంతాలకూ మిమ్మల్ని తీసుకువెళ్తా"నని అపూకి మాటిచ్చాడు.

కలకత్తాలోని ఇంట్లో అడుగడుగునా కాజల్ జ్ఞాపకాలే అపూని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. వాడు ఆ మూలనున్న కిటికీ దగ్గర నిలబడి వీధిలో తిరిగే జనాన్ని గంటల తరబడి చూస్తుండేవాడు. ఆ గోడమీద మేకు కొట్టింది వాడే. కాజల్ లేని ఆ ఇంట్లో ఉండటం దుర్భరంగా ఉంది.

ఆ సాయంత్రం బయటికెళ్ళి కొందరు ప్రచురణకర్తల నుండి తనకు రావలసిన బకాయిలను వసూలు చేసుకున్నాడు అపూ. తను మళ్ళీ ఒకసారి కలకత్తా నుండి వెళ్ళిపోతున్నాడు. ఈసారి వెళ్ళేది విదేశాలకు కాబట్టి, ఎప్పుడు తిరిగొస్తాడో తనకే తెలియదు. కొత్త నేలపై, అపరిచితమైన ఆకాశం కింద...తన జీవితం కొత్తగా ప్రారంభం కాబోతోంది.

అమ్మ మరణించటానికి పూర్వం తాను ఉంటుండిన పాత ఇంటిని చూడాలన్పించి, ఆ సాయంత్రం వెళ్లాడు. ఆ వీధిలోకి వచ్చి ఎంతో కాలమయింది. వీధి దీపం కింద నిలబడిన అపూ, కొద్ది క్షణాల్లో తనను తాను మరచి గత స్మృతుల్లోకి జారిపోయాడు:

ఇరవయ్యేళ్ళు కూడా దాటని బక్కపలచని ఓ యువకుడు అయోమయంగా దిక్కులు చూస్తూ పేవ్‌మెంట్‌పై నిలబడి ఉన్నాడు. అతడు ఇటీవలే పల్లెటూరి నుండి ఈ నగరంలో

అడుగుపెట్టాడు. ఇక్కడి పోకడలేవీ ఆ కుర్రాడికింకా అర్థంకాలేదు. బెరుగ్గా, కాస్త అమాయకంగా కనబడుతున్న ఆ కుర్రాడు తిండీతిప్పలూ లేనట్లుగా నీరసించి ఉన్నాడు. అతడెవరో అపూకి బాగా తెలుసు. అతడి పేరు అపూర్వరాయ్. పదమూడేళ్ళ కిందట ఈ వీధిలోని ఓ చిన్న గదిలో నివసించిన ఆ యువకుడు, పిడికెడు మెతుకుల కొరకు హోటల్ యజమానితో నానామాటలూ పడ్డాడు. అమ్మకోసం బెంగటిల్లే ఆ పసివాడు, ఆమె దగ్గరకు వెళ్ళటానికి ఇంకెన్ని రోజులు పడుతుందో లెక్కబెట్టుకుంటూ ఇదే గోడమీద అంకెలు రాసుకునేవాడు.

చీకటి చిక్కబడటంతో, వీధి దీపాలు వెలిగాయి. అపూ కళ్ళముందున్న యువకుడి రూపం కరిగిపోయింది. అతడు తన గదికివెళ్ళి డాబామీద కూర్చున్నాడు. అప్పటికే చంద్రోదయమయింది. మన్సాపోతాలోని తన పూరింటిపై వెలిగిన చంద్రుడు అపూకి గుర్తొచ్చాడు. అడవిలో తన పాకకు ఎదురుగా ఉండిన మైదానంలోనూ, నిశ్చిందిపురంలోని తన శిథిలగృహం మీదుగానూ, తన అత్తగారింట్లో అపర్ణా, తనూ గడిపిన పడకగది కిటికీ లోనూ, చప్దానీలో పతీశ్వరీవాళ్ళ ఇంటి ఆవరణలోనూ, దివాన్‌పూర్ బోర్డింగ్ స్కూలు మైదానంలోనూ ఇదే చందమామ వెలుగులు కురిపించింది. ఆ ప్రదేశాలన్నీ ఒక్కసారిగా గుర్తుకురావటంతో అపూ హృదయం బరువెక్కింది. నిజంగా జీవితమెంత చిత్రమైనది, ఎంత మార్మికమైనది, ఎంత వైవిధ్యభరితమైనది!

కొడుకును చూడాలని తపించిపోతున్న హృదయంతో నిశ్చిందిపురం చేరాడు అపూ. ఆ క్షణంలో తన తండ్రి గుర్తొచ్చాడతడికి. ఆయన కూడా పసివాళ్ళుగా ఉన్న పిల్లలను విడిచి వేరే ఊళ్ళకు వెళ్తుండేవాడు. తిరిగి ఇంటికి చేరేటప్పుడు ఆయన కూడా తనలాగే బెంగటిల్లిపోతూ వచ్చేవాడు. తండ్రి హృదయం ఎలా ఉంటుందో తనకు ఆనాడు అర్థం కాలేదు. ఒక విధంగా ఆయనకన్నా తాను చాలా అదృష్టవంతుణ్ణనిపించింది అపూకి. ఆ రోజుల్లో నిశ్చిందిపురానికి వెళ్ళాలంటే కాలినడక తప్ప మరొక మార్గంలేదు. ఇప్పుడు తను బస్సెక్కి, మరో గంటలో కొడుకు దగ్గరకు వెళ్ళిపోగలడు.

❖ ❖ ❖ ❖

మధ్యాహ్నం మూడు గంటలకు నిశ్చిందిపురానికి చేరాడు అపూ. ఆ సాయంత్రం కాజల్‌తోపాటు వరండాలో కూర్చున్నాడు. రాణూ, లీలా, మరికొందరు పొరుగిళ్ళ వాళ్ళూ వచ్చి చేరారు. అక్టోబర్ మాసం చివరి రోజులవి. కాస్సేపట్లో సూర్యాస్తమయం కాబోతోంది. రాణూ ఇంటిచుట్టూ ఉన్న వృక్షాలూ, పూతీగల నుండి తియ్యని పరిమళం వ్యాపిస్తోంది.

రాణూ వాళ్ళింటి వెనుకనున్న వెదురుపొదపై సూర్యుని అస్తమయ కిరణాలు పసిడి కాంతులను చల్లుతున్నాయి. వెదురాకుల మొనలు కత్తుల్లా మెరుస్తున్నాయి. కొన్ని ఆకులపై చిన్న చిన్న పిట్టలు తచ్చాడుతున్నాయి.

కాస్సేపట్లో బాగా చీకటిపడింది. ప్రతి ఇంటి నుండి శంఖారావం విన్పించసాగింది. ఒకప్పుడు తమ ఇంట్లోంచి కూడా విన్పించేది. నెలల తరబడి ఇంటికి దూరంగా వెళ్తుండే వాడు నాన్న. దుర్గాపూజక్కూడా డబ్బు పంపలేని పరిస్థితి ఆయనది. అమ్మ ఎన్ని కష్టాలు పడింది... సరైన వైద్యం లేకనే అక్కయ్య చచ్చిపోయింది. ఇవాళెందుకో అవన్నీ మరీమరీ గుర్తొస్తున్నాయే!

పొరుగిళ్ళ వాళ్ళందరూ ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. కాజల్ చదువుకుంటున్నాడు. రాణూ లేచివెళ్ళి వంటమొదలెట్టింది. "ఇలా వంటగదిలోకొచ్చి కూర్చో అపూ" అంటూ ఆహ్వానించింది.

"నీతో మాట్లాడుతూ ఉంటే మనసుకు హాయిగా ఉంటుంది రాణూదీ!" అంటూ వెళ్ళాడు అపూ.

"అలాగా! కాసిని మరమరాలు పెట్టనా? నువ్వు తినేలోగా పాలు కాచి, టీ పెట్టేస్తా"

"రాణూదీ, మీ ఇంట్లో ఆ ఇత్తడిగిన్నె మన చిన్నప్పటి నుంచీ ఉంది కదూ?"

"ఔను. మా నాయనమ్మ చిన్నతనంలో పూరీకి వెళ్ళొస్తూ కొనుక్కొచ్చిందట. సరే గానీ, దుర్గ ముఖం నీకు స్పష్టంగా గుర్తుందా అపూ?"

అపూ చిరునవ్వు నవ్వాడు. "లేదు రాణూదీ! ఒక్కోసారి గుర్తొచ్చినట్టే ఉంటుంది. కానీ, అంతా మసక మసగ్గా, అలుక్కుపోయినట్టుగా కనబడుతుంది. నా ఊహ ఎంతవరకు సరైనదో చెప్పలేను."

రాణూ నిట్టూర్చింది. "అంతా ఓ కలలాగా జరిగిపోయింది. ఆ పిల్ల జీవితమంతా..."

"నేను గనుక అకస్మాత్తుగా చచ్చిపోతే కాజల్ కూడా నా ముఖాన్ని మరిచిపోతాడు" అనుకున్నాడు అపూ.

"మామా!" అంటూ పరిగెత్తుకొచ్చింది శోతూ కూతురు. "ఇవాళ ఏరోప్లేన్‌ని చూశాం. మన ఇంటిమీది నుంచే ఎగురుతూ పోయింది."

"ఔను బాబా! నేను కూడా చూశా. ఆ చింతచెట్టుపై నుంచే ఎగిరిపోయింది" అన్నాడు కాజల్.

"ఔనా రాణూదీ? ఏరోప్లేన్ కనబడిందా?"

"నిజమే. ఇంగ్లీషులో దాన్నేమంటారో నాకు తెలీదు గానీ, ఏవో మిషన్లలాంటివి చప్పుడు చేస్తూ ఎగిరిపోవటమయితే కనబడింది."

అయితే, నిశ్చిందిపురంలోని ఓ ఏడేళ్ళ పాప ఏరోప్లేన్‌ను చూడగలిగిందన్నమాట! రైలు ఎలా ఉంటుందో చూడాలన్నది అక్క చివరి కోరిక, ఆ సంగతి అపూకెన్నటికీ మరపురాదు.

❖ ❖ ❖ ❖

మరునాడు రాత్రి చంద్రోదయం తర్వాత నది ఒడ్డుకు వెళ్ళాడు అపూ.

చాలా ఏళ్ళకిందట ఓ సాయంత్రం, తానిక్కడే ఓ ముళ్ళపొద నీడలో కూర్చుని చేపలు పట్టటానికి ప్రయత్నించాడు. ఇప్పుడు ఆ ప్రాంతమంతా అవేరకం పొదలతో నిండిపోయింది. తను కూర్చున్న పొదను గుర్తుపట్టటం అసాధ్యం.

ఈ ప్రదేశంలో ఎన్నో మార్పులొచ్చాయి. అపూ దృష్టిలో ఇచ్ఛామతి నదంటే నిరంతరమైన జీవన వాహినికొక ప్రతీక. దాని గట్టుమీద ఎన్నో వృక్షాలు పెరిగాయి, ఎన్నో రకాల పక్షులు దానిపై విహరించాయి. నది పొడవునా ఎన్నో రేవులు వెలిశాయి. ఎన్నో శతాబ్దాలుగా ఇక్కడెన్నో పుష్పాలు వికసిస్తూనే ఉన్నాయి. ఆనందంతో కేరింతలు కొట్టే చిన్నారి పిల్లలెందరో వాళ్ళ తల్లులతోబాటుగా ఈ నదిలో స్నానాలు చేశారు. ఎందరో మత్స్యకారులు వలలు పట్టుకుని చేపలు పడుతూ, సుఖదుఃఖాల జీవనసాగరాన్ని ఈదుతూ కడతేరిపోయారు. తల్లులూ, బిడ్డలూ, స్త్రీలూ, పురుషులూ...ఎందరెందరో ఈ బతుకు రహదారి వెంట కలిసి ప్రయాణిస్తూ, ఎవరికివారై విడిపోయారు. ఐనా, ఈ నది మాత్రం అలాగే – హుందాగా, శాంతంగా, స్నేహంగా, సాగిపోతూనే ఉంది.

ఇటీవలి కాలంలో ఒంటరిగా ఉన్నప్పుడల్లా అపూ ఆలోచనలు విభిన్నంగా సాగుతున్నాయి. తన చుట్టూ ఉన్న పరిసరాల్లోని అన్ని విషయాలకూ, అధిభౌతికమైన ప్రాముఖ్యమున్నదేమోనని అన్వేషిస్తున్నాడతడు. తనకు కనబడే, వినబడే వాటన్నిటి వెనుకా; వృక్షాలూ, పుష్పాలూ, చీకటి వెలుగులూ...అన్నిటి వెనుకా మరొక ప్రపంచం దాగి ఉన్నదని అతడి భావన. ప్రతిరోజూ మనం చూస్తున్న దృశ్యాలను వాటి అంతరార్థాలతో సహా గ్రహించగలగటం అందరికీ సాధ్యంకాదని అపూ ఇప్పుడు అర్థం చేసుకున్నాడు.

ప్రకృతికి తనదైన సొంత భాష ఒకటున్నది. అటవీ ప్రాంతంలో ఉద్యోగం చేసిన రోజుల్లో వక్రతోయ నది ఒడ్డుపైనున్న రాళ్ళపై కూర్చుని, దూరంగా నీలాకాశాన్ని అంటుతున్నట్టుగా కనబడే ఆకురాలిన వృక్షాలను చూసిన మధ్యాహ్నాలలో అపూ మనసులో మెదిలిన ప్రత్యేకమైన భావాలు ఇతర సమయాల్లో అతడికి కలిగేవి కాదు. పేరు తెలియని అడవి చెట్లకు వేలాడే ఫలాలు కూడా ఏదో సందేశాన్ని విన్పించేవి. ఇప్పుడు కూడా కొండగుట్టలమీదా, వెదురుపొదలలోనా కనపడే ఎండిన గడ్డిమొక్కలు అతడిలో అదే భావాన్ని కలిగిస్తున్నాయి. ఆ భాష అపూ హృదయానికి చక్కగా అర్థమవుతోంది కూడా.

ఆ సందెవేళ ఇచ్ఛామతీ తీరాన కూర్చున్న అపూ, మరణాన్ని కూడా కొత్త దృష్టితో చూడగలుగుతున్నాడు. యుగాలుగా సాగుతున్న జనన మరణాల చక్రాన్ని మానవాతీతుడైన ఏ కళాకారుడో నియంత్రిస్తున్నాడన్పిస్తోంది అతడికి. ఆ చక్ర భ్రమణాన్ని ఏ వరుసలో నడపాలో ఆ కళాకారుడికి క్షుణ్ణంగా తెలుసు.

కొన్ని వేల సంవత్సరాల కిందట ఏ ప్రాచీన ఈజిప్టు దేశంలోనో తాను పుట్టి ఉండొచ్చునేమో... నైలునదీ తీరాన రెల్లుగడ్డి పొదల్లో అటలాడుకున్నాడేమో! అక్కడ ప్రజలతో కలిసి, మెలిసి తాను పంచుకున్న కష్టసుఖాలెటువంటివో!

ఈ దేశంలో ఎన్ని వేల ఏళ్ళుగా, ఎన్ని రూపాలలో జనన మరణాలగుండా తన జీవనయాత్ర సాగుతున్నదో ఎవరికెరుక! ఆ మార్గాన్నంతటినీ తాను తెలుసుకోగలిగితే, వేరే నిశ్చిందిపురాలూ, ఇతర అపర్ణలూ, దుర్గలూ కనబడతారేమో. ఈ అద్భుతమైన యాత్రలో అలిసిపోతూ ఉత్సాహాన్ని పుంజుకుంటూ సాగుతూనే ఉంటుంది తన జీవచైతన్యం.

మాటలకందని ఆనందం, ఉద్వేగం అపూ హృదయంలో వెల్లువెత్తాయి. నదీతీరం వెంబడి మెల్లిగా నడవసాగాడు. అనేకానేక సంవత్సరాల కిందట ఇటువంటిదే ఒక రాత్రి వేళ స్వరూప్ చక్రవర్తనే వ్యక్తికి ఆ గ్రామదేవత విశాలక్షీదేవి ప్రత్యక్షమయిందనే గాథను విన్నాడు అపూ.

ఈ క్షణంలో ఆమె తనకు ప్రత్యక్షమయితే ఎలా ఉంటుందోననే ఊహ మెదిలింది అతనిలో.

"ఎవరు నువ్వు?"

"నేను అపూని."

"నీ మంచితనానికి మెచ్చాను. ఏం కావాలో కోరుకో!"

"ఈ తోటలలో, ఈ నది ఒడ్డున, వెదురు పొదల నీడలలో గడిచిన నా బాల్యం తప్ప, నాకింకేమీ అక్కర్లేదు దేవీ! పది సంవత్సరాలపాటు నాలో ఉండిన ఆనాటి అమాయకత్వాన్నీ, కుతూహలాన్నీ, అంతులేని స్వప్నాలనూ మళ్ళీ నాకు తెచ్చివ్వగలవా?"

❖ ❖ ❖ ❖

మధ్యాహ్న సమయం. కాజల్ ఎటువెళ్ళాడోనని ఎదురుచూస్తోంది రాణూ. ఒక్క క్షణమైనా కుదురుగా ఉండడు వాడు. వాణ్ణి పట్టుకోవటం ఆమె తరం కావటంలేదు. ఈ క్షణంలో ఇంట్లో ఉన్నట్టే ఉంటాడు, మరుక్షణంలో మాయమవుతాడు. ఎక్కడికి వెళ్తాడో ఎవరికీ చెప్పడు.

"పిషీమా, బాబా ఎప్పుడొస్తాడు? ఇంకా ఎన్నాళ్ళు పడుతుంది?" అంటూ ప్రతి రోజూ రాణూని ప్రశ్నలు వేస్తాడు కాజల్.

అపూ విదేశాలకు వెళ్ళబోయేముందు "రాణూదీ, బాబును నీ దగ్గర వదిలి వెళ్తున్నా, వాణ్ణిక్కడే ఉండనివ్వు. నేనెక్కడికి వెళ్ళిందీ వాడికి చెప్పొద్దు. నా కోసం ఏడిస్తే ఏదో ఒకటి చెప్పి మరిపించు, సరేనా!" అన్నాడు రాణూతో.

"ఎందుకు చేస్తున్నావీపని? వాణ్ణిలా మోసం చేసేందుకు నీ మనసెలా ఒప్పుతోంది? వాడు మాయామర్మం తెలీని పసివాడు. నువ్వేం చెప్పినా నమ్మటం తప్ప వాడేం అర్థం చేసుకోగలడు?" అంటూ ఏడ్చేసింది రాణూ.

అపూ కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. ఆ తరువాత, “రాణూదీ, నేను వెళ్ళేముందు నీకో సంగతి చెప్పాలి. మా పాత ఇంటి పెరటిగుమ్మం దగ్గర నేలలో పూడ్చిపెట్టిన ఓ బంగారు బరిణె ఉంటుంది. ఎన్నో ఏళ్ళుగా అక్కడే ఉంది. పైపైన తిప్పితే చాలు, కనబడుతుంది. ఒకవేళ నేను తిరిగి రాకపోతే... ఖోకా ఆయుస్సు గట్టిగా ఉండి...పెరిగి పెద్దవాడైతే, వాడి పెళ్ళయ్యాక, ఆ బరిణెను వాడి భార్యకిచ్చి...దానిలో సిందూరం పెట్టుకోమని చెప్పు. వాడు కష్టమన్నది ఎరగకుండా బతకాలని నేను కోరుకోవటంలేదు; వాణ్ణిప్పుడే బళ్ళో వెయ్యాల్సిన అవసరమేమీ లేదు. వాడు బయటికెళ్ళి తిరగాలనుకుంటే అడ్డుచెప్పకు. నదిలో స్నానానికి వెళ్ళినప్పుడు మాత్రం కాస్త కనిపెట్టి ఉంటే చాలు. ఎందుకంటే... వాడికింకా ఈతరాదు, మునిగిపోతాడేమోనని నా భయం. కొన్ని విషయాల్లో వాడికొన్ని అనుమానాలూ, భయాలూ ఉన్నాయి. వాటిలో నిజానిజాలేమిటో చెప్పి, వాడి భయాలను పోగొట్టాలని చూడొద్దు. దేనిగురించయినా నిర్ణయాలు ప్రకటించలేం కదా! మన స్థిర నిర్ణయాలను వాడిపై రుద్దబోవటం సరైనది కాదు. వాడు సర్వ స్వతంత్రమైన భావాలతో పెరిగి, పెద్దవాడై తనకు తానుగా నిర్ణయాలు తీసుకోగలగాలి” అని చెప్పాడు.

కాజల్ భయాలన్నీ కేవలం వాడి సృజనాత్మక ఊహాలవల్ల ఏర్పడినవేనని అపూకి తెలుసు. జీవితంలోని ఆనందానికీ, కాల్పనిక శక్తికీ ఈ ఊహాత్మక భయాలు తోడ్పడతాయి. తన బిడ్డ ప్రకృతికి సన్నిహితుడిగా ఎదగాలని అపూ కోరిక. ఈ సాయంత్రాలూ, రాత్రి వేళలూ తనకు ప్రసాదించిన ఆశ్చర్యానందాలనే వాడికి కూడా అనుగ్రహించాలని వాటి నతడు వేడుకున్నాడు.

అపూకి మొదటి నుండి ఉన్న యాత్రాకాంక్ష అతడిని ఇంటి నుండి మరొకసారి దూరంగా తీసుకెళ్తున్నది. తిరిగి రావటానికి ఆర్నెల్లపైనే పడుతుంది. పోర్టో ప్లాటాలో మునిగిపోయిన ఓడలో బంగారం పట్టుకొచ్చి, లీల చివరికోరిక తీర్చేస్తాడేమో...ఎవరు చెప్పగలరు?

రాణూ తమ్ముడు శోతూక్కూడా కాజల్‌మీద ఎనలేని ప్రేమ. గతంలో మొండిగా, కఠినంగా, ఆకతాయిగా ప్రవర్తిస్తుండిన శోతూ ఇప్పుడు పూర్తిగా మారాడు. జీవితం నేర్పిన పాఠాలతో అతడికి భగవంతుడిపైన భక్తి కుదిరింది. విష్ణు భక్తుడిలా జుట్టుపెంచి, మెడలో పూలహారం ధరిస్తున్నాడు. సాయంత్రాలు దుకాణం మూశాక డోలక్ వాయిస్తూ భక్తిగీతాలు గానం చేస్తాడు. మామిడితోటలను తిరిగి కొనుక్కున్న అపూ ద్వారా డెబ్బయి రూపాయలొచ్చాయి. అతడి దగ్గరే మరో యాభై రూపాయలు కూడా అడిగి తీసుకుని దుకాణంలోకి సరుకులన్నీ సమకూర్చుకున్నాడు. ఈ యాభై రూపాయల సంగతి రాణూకి తెలిస్తే ఎంతమాత్రమూ ఒప్పుకునేదే కాదు.

కాజల్‌కు పక్షులంటే మహా ఆసక్తి. ఇన్ని రకాల పక్షుల్ని చూడటం వాడికిదే మొదటిసారి. వాళ్ళ తాతగారిది కూడా పల్లెటూరే అయినా, అక్కడ ఇన్ని తోటలూ, పచ్చిక

బయళ్ళూ లేవు. ఇప్పుడు పగలంతా వాడు పొలాల్లో, తోటల్లో తిరిగి ఆటలాడుతాడు. రాత్రవగానే వాటినిండా దయ్యాలూ, భూతాలూ, నక్కలూ, తోడేళ్ళూ తిరుగుతున్నట్టుగా ఊహలొచ్చి రాణూని హత్తుకుంటాడు. మళ్ళీ తెల్లారగానే ఆ భయాలన్నీ అదృశ్యమైపోతాయి. పక్షుల గూళ్ళనూ, వాటిలో గుడ్లనూ చూడటం సరదా వాడికి. నదిపక్కనున్న చెట్లమీదికి ఎక్కినప్పుడు జారిపడితేనో, ఆ గూళ్ళలో పాములుంటేనో ప్రమాదమని రాణూ హెచ్చరిస్తూనే ఉంటోంది.

ఆ రోజు మధ్యాహ్నం రాణూవాళ్ళింటి వెనకున్న వెదురు పొదల్లో చేరి ఆటలాడుతున్నాడు. చలికాలం ముగిసిపోయింది. మధ్యాహ్నపు సూర్యుడు వెచ్చని కిరణాలతో స్పృశిస్తున్నాడు. గమ్మత్తయిన పరిమళమేదో గాలిలో తేలివస్తోంది. రకరకాల చెట్లనూ, పిట్టలనూ వాటిపేర్లతో సహా పరిచయం చేశాడు వాడికి అపూ. అందుకే ఆ పరిమళం అడవి మిరియాల తీగ నుండి వస్తోందని కాజల్ గుర్తుపట్టాడు.

తమ శిథిల గృహాన్ని కాజల్‌కు చూపించాడు అపూ. కానీ, అదంతా కీకారణ్యంలా తయారయింది కనుక, అక్కడికి వెళ్ళొద్దని వాణ్ణి హెచ్చరించాడు. దాన్ని దగ్గరగా చూడాలన్న ఆత్రుత వాణ్ణి నిలవనివ్వటంలేదు.

ఆ మధ్యాహ్నం వేళ, చుట్టుపక్కల ఎవరూ లేనిది చూసుకుని, ఎత్తయిన ఓ గుట్టమీది కెక్కాడు కాజల్. దట్టంగా పెరిగిన పొదల మధ్యనుండి దారిచేసుకుంటూ ఆ ఇంటి ఆవరణలో కాలుమోపాడు. విరిగిపోయిన ఇటుకలూ, వెదురు గడలూ చెల్లా చెదురుగా పడున్నాయి. ఇక్కడ పక్షిగూళ్ళుంటాయో, లేదో!

తుక్లీ, తుక్లీ...అంటూ ఏ మూలనుండో పిలిచిందొక పిట్ట. దాన్ని బసంత్ బావ్‌రీ అంటారని బాబా చెప్పిన సంగతి కాజల్‌కు గుర్తొచ్చింది. దాని గూడు ఇక్కడెక్కడో ఉంటుందేమో చూడాలి...లేదంటే, ఎక్కణ్ణించో ఊరికే వచ్చి ఈ కొమ్మమీద కూర్చుందేమో తెలీదు!

కాజల్ తలపైకెత్తి దట్టంగా ఆవరించిన చెట్ల కొమ్మల్లో వెదకసాగాడు. ఉన్నట్టుండి మైదానం మీదుగా వీచిన ఈదురుగాలి వాడిని స్పృశించి, స్వాగతం పలికింది. వాడి ముత్తాత వీరూరాయ్; తాతయ్య హరిహరరాయ్; నాయనమ్మ సర్వజయ; మేనత్త దుర్గ, ఇంకెందరో పేర్లు తెలియని పూర్వీకులందరూ ఒక్కసారిగా లేచొచ్చి, “వచ్చేశావా, చివరికి మళ్ళీ మా దగ్గరికి తిరిగొచ్చావన్నమాట! నీలో మమ్మల్ని మేము చూసుకుంటున్నాం. ఈనాటి మా ప్రతిరూపానివి నువ్వు. మా దీవెనలూ, ప్రేమాభిమానాలూ నీకెప్పటికీ ఉంటాయ్...మా వంశానికి తగిన వారసుడివి కావాలి నువ్వు”, అంటూ చిరునవ్వుతో సాదరంగా స్వాగతం పలికారేమో మరి!

వాళ్ళు మాత్రమే కాదు – ఆ చెట్ల నీడల్లోంచి సహదేవుడు లేచొచ్చాడు, ఓ పాత్రలో నీళ్ళు పట్టుకుని; కొండరేగుచెట్టు కింద అంపశయ్యపై పడుకున్న భీష్ముడూ లేచి

కూర్చున్నాడు; ఆ వెంటనే మహా పరాక్రమశాలి కర్ణుడు; గాండీవధారి అర్జునుడు; అతడి రథసారథి కృష్ణుడు; పరాజయంపాలైన మహారాజు దుర్యోధనుడు; దీనవదనంతో భానుమతి; తమసా నదీతీరాన కూర్చుని కన్నీరు పెట్టుకుంటున్న జానకి; చేత పూమాలను ధరించి, కనురెప్పలు వాల్చి మందగమనంతో స్వయంవర సభలోకి ప్రవేశిస్తున్న యువరాణి సుభద్ర; రెండు మహాకావ్యాలలోని ఇంకెందరో పాత్రలు కూడా "ఇక్కడున్నావా?" అంటూ చిరునవ్వులతో వాడిని పలకరించారు. "మేమెవరో నీకు తెలీదూ? మళ్ళీ మా దగ్గరికొచ్చెయ్. విరిగిపోయిన మీ కిటికీ దగ్గర కూర్చుని గడిపిన ఆ మధ్యాహ్నాలూ, ఆనాటి మన స్నేహ సంభాషణలూ గుర్తుచేసుకో...నువ్వు మాకు బాగా తెలుసు. మా దగ్గరికొచ్చెయ్...వచ్చెయ్... వచ్చెయ్...వచ్చేసెయ్...!" అన్నారు చిరునవ్వుతో చేతులు చాపుతూ.

ఇంతలో హటాత్తుగా రాణూ గొంతు వినబడింది, "ఖోకా, ఈ అడవిలో ఏం చేస్తున్నావురా, అల్లరి వెధవా? బయటికి రా, నీ పనిచెప్తా."

నవ్వుతూ బయటికొచ్చాడు కాజల్. రాణూని చూస్తే కాసింతయినా భయంలేదు వాడికి. ఆమెకు తనంటే పంచప్రాణాలని ఆ పిల్లవాడికి బాగా తెలుసు. అమ్మమ్మ చనిపోయాక ఇంకెవరూ వాడినింత ప్రేమగా చూసుకోలేదు, తండ్రి తప్ప.

వాడి ముఖంలోకి చూస్తున్న రాణూకి చప్పున గుర్తొచ్చిందొక విషయం, "ఏదయినా అల్లరి పనిచేసినప్పుడు అపూ కూడా అచ్చంగా ఇలాగే చూసేవాడు!"

ఒక్కొక్క తరం గుండా ప్రవహిస్తూ వచ్చిన అజరామరమైన జీవన మార్మికత – ఎంత అద్భుతంగా తనను తాను మరొకసారి వ్యక్తీకరించుకున్నది!

తన బాల్యాన్ని శాశ్వతంగా పోగొట్టుకున్నానని భావించి, కాజల్ తండ్రి కొంచెం పొరబడ్డాడు. ఇరవైనాలుగేళ్ళ విరామం తరువాత ఆ అమాయక బాలుడు అపూ, నిశ్చిందిపురానికి మళ్ళీ తిరిగొచ్చాడు.

## బిభూతిభూషన్ బందోపాధ్యాయ

1894లో కోల్‌కతాకు ఉత్తరంగా వందమైళ్ళ దూరంలో ఉన్న మురాటిపూర్ గ్రామంలో పుట్టిన ఆయన బాల్యమంతా బీదరికంలోనే గడిచిపోయింది. చదువు స్థానిక పాఠశాలలో సాగింది. 1918లో కలకత్తాలోని రిప్పన్ కాలేజీ నుండి డిగ్రీ పొందారు. మధ్యమధ్యలో రకరకాల వృత్తులు చేసినా ఎక్కువ భాగం మాత్రం ఉపాధ్యాయుడిగానే కొనసాగిన ఆయన తొలి కథ 1922లో కలకత్తా జర్నల్‌లో ప్రచురితమైంది. అప్పటి నుంచీ రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ 17 నవలలు, 20 కథా సంకలనాలతో సహా 50 వరకూ పుస్తకాలు ప్రచురించారు. మొత్తమ్మీద ఆయన విఖ్యాత రచన, ఆయనకు గొప్ప కీర్తిని ఆర్జించిపెట్టిన రచన మాత్రం పథేర్ పాంచాలీనే! దీనికి కొనసాగింపుగా రాసింది అపరాజిత. దట్టమైన ప్రకృతితో మమేకమై, అంతరించిపోతున్న అరణ్యాల గురించి మనసులను సునిశితంగా హత్తుకునేలా రాసిన అరణ్యక (తెలుగులో వనవాసి) బిభూతిభూషనుడి మరో విశిష్ట రచన. ఆయన 1950లో మరణించారు.

## కాత్యాయని :

రచయిత్రిగా అనువాదకురాలిగా తెలుగు పాఠకులకు సుపరిచితురాలు. పలు నవలలు, సాహిత్య పుస్తకాలను తెలుగులోకి అనువదించారు. “చూపు” పత్రికను నిర్వహించారు.

# అపరాజితుడు



బిభూతిభూషన్ బందోపాధ్యాయ

బిభూతిభూషన్ 'పథేర్ పాంచాలి'కి రెండవ భాగంగా వచ్చిన నవల అపరాజితో ఈ రెంటిని కలిపి పథేర్ పాంచాలి, అపూర్ సంసార్, అపరాజితో అనే మూడు కళాఖండాలుగా మలిచాడు సత్యజిత్‌రే.

❖ ❖ ❖

ప్రకృతిలోని నిరంతరత్వాన్నీ, జీవన కాంక్షనూ, సౌందర్యాన్నీ మనిషి జీవితంలోనికి అనువదించుకునే అద్భుతమైన కళను మనకు నేర్పిస్తాడు అపరాజితుడు. అపూ.

❖ ❖ ❖

ఎనభైయ్యేళ్ళ కిందటే, పర్యావరణ విధ్వంసం పట్ల ఆందోళననూ, విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలనూ ఈ నవల అపురూపంగా రికార్డ్ చేసింది.

❖ ❖ ❖

అన్ని మానవీయ స్పందనలూ అడుగంటిన వేళ - అపరాజితుడితో సంభాషించడం గొప్ప రిలీఫ్!